రవీంద్ర స్మృతి

స్వర్గీయ ఆలపాటి రవీంద్రనాథ్, కళావతి రవీంద్రనాథ్

సమర్పణ :

రవీంద్ర మిత్రులు

A Tribute in letters from Friends and family in
memory of their Beloved Alapati Ravindranath

రవీంద్ర స్మృతి

సంపాదకుడు: సహవాసి

★

నవంబరు, 2001

★

ప్రతులు : **1000**

★

ముఖపత్రం : చంద్ర

★

అమూల్యం

★

కళాజ్యోతి ప్రాసెస్ లిమిటెడ్
1-1-60/5, ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
ముషీరాబాద్, హైదరాబాద్ - 500 020

★

ఈ సంపుటిలో ...

రవి కృషి

మా నాన్నగారు

మిసిమికి అభినందన మాల

A Tribute to Dr. Alapati the founder Editor
MISIMI - Rediscovering oeself - *The Hindu*

నిలువెత్తు సంతకం - *మిసిమి, నవంబరు 1997*

MISIMI Marching Ahead - *Dr. D. Anjaneyulu*

రవీంద్ర స్వీయ రచనలు

ప్రేమాయణం రసాయనికమా?

విలువల పరివర్తనంలో మహాభారతం

కర్ణుని స్వగతం

పికాసో

సైగల్

సర్ స్టీఫెన్ స్పెండర్

తూర్పు పడమరల కలగలుపు

తొలి కెరటాలు (జ్యోతి నుండి పునర్ముద్రితాలు)

1948 నాటి జ్యోతి

గాంధీ నిర్యాణ సంచిక సంపాదకీయంలో ముఖ్య భాగం.

పెరల్‌బక్

రేపటి జనసంఖ్య

గొప్పవాడి భార్య

నీ కొడుకూ - నీ కూతురు

సాహిత్య సమాలోచన

లేఖాయణం (రవీంద్ర లేఖలు, రవీంద్రకు లేఖలు)

అక్షరాంజలి (రవీంద్రనాథ్‌కు పత్రికల, ప్రముఖుల నివాళి)

☆

ఆలపాటి రవీంద్రనాథ్ జీవిత రేఖలు

జననం:

4 నవంబరు **1922.** గోవాడ, తెనాలి తాలూక, గుంటూరు జిల్లా

తల్లిదండ్రులు:

ఆలపాటి వెంకట్రామయ్య, అమ్మెమ్మ

అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు:

1. గోపాల కృష్ణయ్య (తమ్ముడు)
2. వెలగా సుగుణావతి (అక్కగారు)
3. అలపర్తి సునందాదేవి (చెల్లెలు)
4. కొసరాజు సుశీల (చెల్లెలు)

విద్య:

తురుమెళ్ళ కింగ్ జార్జి కారొనేషన్ హైస్కూలులో స్కూలు ఫైనలు పూర్తి కాకుండానే చదువు ఆపేశారు. ఆ తర్వాత ప్రైవేటుగా చదివారు.

వివాహం:

1943 లో చెరుకూరి బాపనయ్య, భ్రమరాంబల పుత్రిక కళావతితో విజయవాడలో తాపీ ధర్మారావు, త్రిపురనేని రామస్వామి చౌదరిగార్ల ఆధ్వర్యంలో అభ్యుదయ వివాహం.

కుటుంబం:

కొడుకులు – కోడళ్లు – మనుమలు – మనుమరాళ్లు

1. స్వర్గీయ రాంగోపాల్
2. స్వర్గీయ వెంకటరామన్ – అన్నపూర్ణ
   కళాజ్యోతి, రాంనాథ్
3. దేవేంద్రనాథ్ – రత్నకుమారి
   కార్తీక్, జయదేవ్
4. బాపన్న – గిరిజ
   సిద్ధార్థ్, మిసిమి
5. సత్యదేవ్ – ఛాయ
   నందిని

కుమార్తె – అల్లుడు

6. దుర్గాదేవి – నన్నపనేని చౌదరి
   రాజీవ్, నీలిమ

తెనాలిలో....

1946లో జ్యోతి ప్రెస్ ప్రారంభం. అదే సంవత్సరం 'జ్యోతి', 'రేరాణి' పత్రికల ఆవిర్భావం. ప్రచురణ, సంపాదకత్వం – రెండూ చేపట్టారు. 'జ్యోతి'లో ఎం. ఎన్. రాయ్ సతీమణి కుటుంబ నియంత్రణ ఆవశ్యకతను తెలుపుతూ రాసిన వ్యాసం ప్రచురించినందుకు ప్రభుత్వం ప్రాసిక్యూట్ చేసింది. 'సినీమా' పత్రిక ప్రారంభం.

1957 లో హైదరాబాద్ ఆగమనం:

పత్రికలు ఆర్థికంగా దెబ్బతినటంతో వాటిని మూసి ముద్రణ యంత్రాంగాన్ని హైదరాబాదుకి తరలించారు.

అమెరికా పర్యటన:

1973లో అమెరికాలో ఉన్న కుమార్తె దుర్గాదేవి అల్లుడు చౌదరి గార్లతో కొంత కాలం గడిపి, అమెరికా పర్యటించి వచ్చారు.

"మిసిమి" ప్రారంభం:

1990లో 'మిసిమి'ని పక్ష పత్రికగా ప్రారంభించి, మరోసారి జర్నలిజంలో ప్రవేశించారు. **1990**లోనే 'మిసిమి'ని మాస పత్రికగా మార్చారు. **1996** ఫిబ్రవరి నాటికి **79** సంచికలు వెలువడ్డాయి.

1993లో 'హిందూ' దినపత్రిక 'మిసిమి'ని విశిష్ట పత్రికగా ప్రసంశించింది. **1992**లో ఆంధ్రభూమి దినపత్రిక, **1995**లో 'మహానగర్' దినపత్రిక 'మిసిమి'ని కొనియాడుతూ సంపాదకీయాలు రాశాయి.

భార్యా వియోగం:

1993 ఫిబ్రవరి **9**వ తేదీన భార్య కళావతి హైదరాబాదులో కన్నుమూశారు.

డాక్టరేట్ ప్రదానం:

1995లో కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది.

అంతిమ యాత్ర:

1996 ఫిబ్రవరి **11**న హైదరాబాదులో శ్వాసకోశ వ్యాధికి చికిత్స పొందుతూ మరణించారు.

... నివేదన ...

రవీంద్రనాథ్‌గారితో పరిచయం ఓ పరిమళం ...
ఆలంకారికంగా చెప్పటంలేదు. అనుభూతి పూర్వకంగా చెబుతున్న మాట.

అది చిరపరిచయమే కానక్కరలేదు చిరు పరిచయమైనాసరే, చెరగని ముద్రగా మిగిలిపోతుంది. ఆయన ఆర్ద్ర మనస్కత, సౌహార్దం, సంస్కారం, సౌజన్యం తలపునకొస్తాయి. అంటే అది మామూలు పరిమళం కాదు; సౌహృద సౌరభం.

ధమ్మపదంలో బుద్ధుడు ఒక కమ్మని మాట చెప్పాడు:

''సత్పురుషుల మంచితనం
ఝంఝానిల ధాటి కాగి
దిగంతాల పర్యంతం
సుగంధాలు పంచుతుంది''

అంటే సత్పురుషుడు సర్వదిశలా వ్యాపిస్తాడు. (''సబ్బాదిసా సప్పురిసో పవాతి'' – పాళీ) కాబట్టే రవీంద్రనాథ్‌గారు ఎందరికో ప్రియతములయ్యారు. ప్రియబాంధవుడయ్యారు. ప్రభుత్వంలో ఉన్నత స్థానాలు అధిరోహించిన బెజవాడ గోపాలరెడ్డిగారు, రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి గారు, ప్రధాన న్యాయమూర్తులు శ్రీ ఆవుల సాంబశివరావు, శ్రీ జయ చంద్రారెడ్డి, శ్రీ కోకా రామచంద్ర రావు, కవి, సాహితీ మేరువు ఆచార్య సి. నారాయణరెడ్డి, డాక్టర్ జి.వి. కృష్ణరావు, గోపీచంద్, సంజీవదేవ్, ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. అధికారులు, ప్రసిద్ధ రచయితలు, మేధావులు రవీంద్రనాథ్‌గారితో తమ పరిచయాన్ని అమూల్యంగా భావించారు. జీవితాంతం గుర్తుంచుకున్నారు. అనేక విషయాల పై చర్చించారు. అభిప్రాయాలు కలబోసుకున్నారు. సమాజంలో పెద్ద హోదాలో వున్నవారే కాదు, సామాన్యులూ ఆయనకు స్నేహితులు, సన్నిహితులు అయ్యారు. వయస్సులో, అనుభవంలో సమవుజ్జీలు కాని వారితోనూ ఆయన చెలిమి చేశారు. మైత్రి నెరపారు. చనువుగా మెలిగారు. తరాల అంతరాలనే కాదు, హోదా, పేరు, పలుకుబడి, సామాజిక స్థాయి ఇత్యాది తేడాలను కూడా అధిగమించిన సౌహృదానికి రవీంద్రనాథ్ ప్రతీక. డాక్టర్ సి. నారాయణరెడ్డి గారంతటివారే ''పరిమళిస్తున్న ఆ స్మృతులను అక్షరాల ద్వారా

అందించలేను'' అన్నారు వినమ్రంగా. ఆయన స్నేహం అమృతాయమానం అని రవీంద్రనాథ్‌గారితో గాఢమైత్రి గల డాక్టర్ బూదరాజు రాధాకృష్ణ వర్ణించారు.

ఆయన ప్రోత్సాహం ఇచ్చిన చాలామంది అప్పట్లో పేరు ప్రతిష్ఠలు లేనివారైనా దరిమిలా కళా, సాహిత్య రంగాలలో లబ్ధ ప్రతిష్ఠులయ్యారు. విశ్వవిద్యాలయాల గుర్తింపు పొందారు. సత్కారాలు, సన్మానాలు అందుకున్నారు. ''**1948**లో చిన్న పాదుచేసి, నీరు పోసి నేను పెరగడానికీ బతకడానికీ దోహదం చేసిన దయామూర్తి'' రవీంద్రనాథ్ గారేనని డాక్టర్ రావూరి భరద్వాజ ఇప్పటికీ ఆరాధనా భావంతో తలచుకొంటారు. **1948**లో ఆయన 'జ్యోతి' పక్ష పత్రికలో పని చేయడానికి తనకిచ్చిన అవకాశం జీవితంలో మేలు మలుపని చెబుతూ ''అది నా జీవితాన్ని అనూహ్యంగా మార్చివేసింది'' అంటారు భరద్వాజగారు. 'జ్యోతి' ద్వారా రవీంద్రనాథ్ ''చాలా దీపాలను వెలిగించారు – చౌడేశ్వరీదేవి, శివం, వెంచాశా, శారద, భుజంగరావు, శార్వరి, పోలవరపు శ్రీహరిరావు, అమరశ్రీ, తాళ్లూరి నాగేశ్వరరావు, హితశ్రీ, భరద్వాజ సరేనను కోండి......'' ఇంకా చాలామంది... పేరున్నవారికే సాధారణంగా పత్రికలు పెద్ద పీట వేసే ఆరోజుల్లో, స్పార్క్ వుందని తనకి తోస్తే అలాంటి వారికి అడ్రసు లేకపోయినా గొడుగై నిలిచారు రవీంద్రనాథ్.

ఆయన థామస్ గ్రే పద్యం గుర్తు పెట్టుకున్నారు: ''కాంతులు వెలిగక్కే విలువగల మణులెన్నో చీకటులు చిమ్మే సముద్ర గర్భంలో దాగివున్నాయి; సౌందర్యానికి సౌరభానికి ఆలవాలమైన పూలెన్నో నట్టడవిలో నిరర్థకంగా రాలిపోతున్నాయి.'' అజ్ఞాత ప్రతిభామూర్తులు చాలా మంది వున్నారు. వారిని పసిగట్టి, మిసిమిని లోకానికి పంచాలని ఆయన తపన పడ్డారు. ''సాహితీ సాంస్కృతిక రంగాలలో ఎక్కడ ఏమూల చిన్న 'మెరుపు' కనిపించినా ఆ మెరుపును భూవమార్గం పట్టించి తెలుగు వారికి అందుబాటులోకి తీసుకురావడమే వారి ఏకైక తపన'' అని ఏటుకూరి బలరామ మూర్తిగారు రాసింది ప్రత్యక్షర సత్యం.

మరి – ఇంతమంది కవులు, పండితులు, రచయితలు, మేధావులు, న్యాయమూర్తులు, అడ్మినిస్ట్రేటర్లు ఇంకా ఇతర జీవనరంగాలలోని మాన్యులు, సామాన్యులతో రవీంద్రనాథ్‌గారికి పరిచయాలు, స్నేహ సంబంధాలున్నా ఆయనకే యూనివర్సిటీల డిగ్రీలు, డాక్టరేట్‌లు లేవు. హైస్కూలులో విద్యాభ్యాసం కూడా పూర్తి చేయలేదు. అర్ధంతరంగా చదువు మానేశారు. అంటే ఫార్మల్ ఎడ్యుకేషన్‌కి స్వస్తి చెప్పారేగాని ''విజ్ఞాన

సముపార్జనని విడనాడలేదు''. డిగ్రీలు లేని పాండిత్యం ఆయనది. జస్టిస్ పి.ఎ. చౌదరిగారు వర్ణించినట్లు ''ఆయన పాదు కట్టి పెంచిన మొలక వంటివాడు కాదు. ఉద్గమన శక్తి ప్రౌఢమై, భూమి పెకల్చుకొని వచ్చినవాడు.''

పుస్తకాలు ఆయన ప్రియ నేస్తాలు. జ్ఞానార్జన తీరని దాహం. సాహిత్యం, తత్వ శాస్త్రం. ఆధునిక దర్శనాలు, **Time, Encounter** లాంటి పత్రికలు, లైంగిక శాస్త్ర గ్రంథాలు – ఒకటేమిటి ఆలోచనా పరుల మేధకు పదును పెట్టేవేవీ ఆయన వదలలేదు. ఏకాగ్రతతో అధ్యయనం చేశారు. ఆకళింపుకున్నారు. తాను పొందిన అనుభూతిని, ఆర్జించిన విజ్ఞానాన్ని స్నేహితులతో పంచుకోవాలని తపన పడేవారు. అందుకని స్నేహితుల్ని సాదరంగా తన నెస్ట్‌కి ఆహ్వానించి, అతిథి మర్యాదలు జరిపి, తాజాగా తాను చదివిన గ్రంథాల సారాంశాన్ని వారికి చెప్పి చర్చిస్తేనే గాని ఆయనకు సంతృప్తి కలిగేది కాదు. అలా చాలాసార్లు వారి నెస్ట్‌కి వెళ్లిన వాళ్లలో నేనూ ఒకణ్ని. ఆయన విశేషంగా ఆకర్షితుడైన పుస్తకం ఏదైనా తన మిత్రులు చదవకపోతే, వారికి ఆ పుస్తకం పంపి, వారిచేత చదివించి ఆనక గంటల తరబడి చర్చించేవారు. పాల్ కెన్నెడి రాసిన **Preparing for the 21st Centuary** గ్రంథాన్ని నాకు పంపి నేను చదివిందాకా వొదిలిపెట్టలేదు. 'మిసిమి'లో ఆ పుస్తకాన్ని పరిచయం చేద్దాం. మీరు వెంటనే మన దేశపరిస్థితులకు అన్వయించే మేరకు అందులోని సందర్భశుద్ధిగల అధ్యాయాల సారాంశాన్ని తెలుగులో రాయండి'' అన్నారు. ఈనాడులో ఉద్యోగ కార్యభారం, ఇతర పని ఒత్తిళ్ళు కారణంగా ఆయన కోరికను సకాలంలో నెరవేర్చలేక పోయాను. 1996 ఫిబ్రవరిలో సెలవంటూ ఆయన వెళ్లిపోయారు.

ఆయన పుస్తకాలు చదివి చదివి, ఆకళించుకొన్న సారాన్ని స్నేహితులకు, తనలాంటి పాఠకులకు పంచివ్వడం గమనించి నప్పుడల్లా నండూరి సుబ్బారావుగారి పద చిత్రం ''యెన్నెలంతామేసి నెమరేసిన యేరు'' కళ్ళుముందాడేది. అంతేకాదు డాక్టర్ సి. నారాయణరెడ్డిగారు వ్యాఖ్యానించి నట్లుగా'' భావప్రేరకంగా వున్న ఏ చిన్న అంశం దొరికినా, హేతువుకు ఏతామేత్తే ఓ వాక్యం కంట పడినా రవీంద్రునికి నిలువెల్లా పారవశ్యం. ఆ ఆనందానుభూతి ఆర్థికపరమైన కొలమానాలకు అతీతం''. **Culture is in his blood.**

* * *

రవీంద్రనాథ్ కౌటుంబిక నేపథ్యం మొదలు అస్తమయం దాకా ఆయనతో దశాబ్దాల స్నేహ సాన్నిహిత్యాలున్నవారు, తక్కువ కాలమైనా నిక్కమైన పరిచయం వున్నవారు, బంధువులు, ఆంతరంగికులు తమ ''జీవితాల జ్ఞాపకాల వాకిళ్లు తెరచి, తరచి'' ఆయనతో పెనవడిన తమ అనుభవాలు, సంఘటనలు, విశేషాలతో ఈ సంపుటి నింపారు. సుసంపన్నం చేశారు. ఆయన జీవితాన్ని, చింతనని, కృషిని పునరావిష్కరించారు. కాబట్టి నేను కొత్తగా రాయగలిగింది కనిపించలేదు. ఏం రాసినా చర్విత చర్వణమే అవుతుంది. అయినప్పటికి ఎవరి అనుభవాలును, అనుభూతులు వారివే అనుకొని నాపరంగా చెప్పగలిగింది క్లుప్తంగా చెప్పి ముగిస్తాను.

★ ★ ★

1947–48లో తెనాలిలో ఆయన 'జ్యోతి' పక్షపత్రికను ప్రారంభించే నాటికి నేను ఫిఫ్త్ ఫామ్‌లో కొచ్చాను. అప్పట్లో ఎక్కువగా తెలుగు మేగజైన్లు మద్రాసునుంచే వచ్చేవి. అవిభక్త మద్రాసు రాష్ట్రానికి అది రాజధాని కావటం వల్ల కావచ్చు, లేదా మేలైన ముద్రణా సౌకర్యాలు వుండటం వల్ల కావచ్చు యువ, ఆనందవాణి, తెలుగు స్వతంత్ర, ఆంధ్ర మహిళ వగైరా పత్రికలన్నీ మద్రాసు నుంచే వెలువడేవి. రవీంద్రనాథ్‌గారు సాహసించి తెనాలిలో 'జ్యోతి' వెలిగించారు. తెనాలి పట్టణానికి ఉపోద్ఘాతం అవసరం లేదు. సాంస్కృతిక సంప్రదాయం, వారసత్వం పుణికిపుచ్చుకొన్న పట్టణం తెనాలి. త్రిపురనేని రామస్వామి, శివశంకర శాస్త్రి, మాధవపెద్ది బుచ్చి సుందర రామశాస్త్రి, గోపీచంద్, గోఖలే, చక్రపాణి ప్రభృతులందరూ తెనాలిలో విరిసి వికసించి సువాసించినవారే. అలాంటి చోట జ్యోతిని వెలిగించడంలో ఎంతైనా ఔచిత్యం వుంది. 'జ్యోతి', ప్రతిభ తైలంగాగల చాలా వత్తుల్ని వెలిగించింది. అలాంటి దీపకళికల్లో తాళ్లూరి నాగేశ్వరరావు ఒకరు – నాకు బాల్యమిత్రుడు, సహాధ్యాయి ఒకరినొకరు ఒరే అని సంబోధించే చనువు వుండేది. అతని ద్వారానే నాకు భరద్వాజగారు, తెనాలికి చెందిన మరికొందరు రచయితలు పరిచయమయ్యారు. అతని కథలు వస్తుండేవి కాబట్టి 'జ్యోతి' నాకు అభిమాన పాత్రమైంది. అప్పుడే నేనూ రచనా వ్యాసంగం ప్రారంభించాను. యువ, ఆనందవాణి, ఆంధ్రమహిళ పత్రికలలో అడపదడప నా రచనలు వస్తుండేవి. రచయితకు పారితోషికం పంపించలేక పోవచ్చు గాని, కనీసం కాపీ పంపించే అలవాటు కూడా లేని పత్రికలు కొన్ని వుండేవి. వాటిల్లో ఆనందవాణి ఒకటి. ఆ పత్రిక ఎడిటర్ ఉప్పులూరి కాళిదాసుగారు సజ్జనుడే. ఎవరి వల్ల జరిగిన పొరపాటైనా

కానీండి, రచనలు ప్రచురించి రచయితకు కాపీ పంపనందుకు నేను నొచ్చుకునేవాణ్ణి. తెనాలి వచ్చి కాపీ కొనుక్కుని వెళ్లేవాణ్ణి. అలా తెనాలి వచ్చిన సందర్భాల్లో రవీంద్రనాథ్‌గారిని చూశాను. కలుసుకోవాలన్న కుతూహలం ఉండేది. సమయం సందర్భం కలిసి రాలేదు. తెనాలి **V.S.R.** కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నప్పుడు (మొదటి సంవత్సరం విజయవాడ **S.R.R. & C.V.R.** కాలేజీలో చదివాను) డాక్టర్ జి. వి. కృష్ణరావుగారు నాకు గురుతుల్యులే కాకుండా స్నేహితులు కూడా. మా ఇద్దరికీ వయస్సులో చాలా తేడావున్నా మా మధ్య స్నేహానికి అది అవరోధం కాలేదు. వారూ నేనూ దాదాపు ప్రతిరోజూ సాయంత్రం కలుస్తుండేవాళ్ళం. టాగోరు బుక్ స్టోర్సులో కొద్దిసేపు కూర్చునేవాళ్లం. వారితో మాట్లాడ్డం ఓ ఎడ్యుకేషన్. రవీంద్రనాథ్‌గారు, జి. వి. కృష్ణరావుగారు మంచి స్నేహితులు. అయినప్పటికీ రవీంద్రనాథ్‌గారితో నాకు పరిచయ భాగ్యం కలగలేదు. దరిమిలా నేను పై చదువులకు వాల్తేరు వెళ్లిపోయాను. ఆ తరువాత ఉద్యోగం కోసం హైదరాబాదు వచ్చి స్థిరపడి పోయాను.

నేను 'ఈనాడు' దినపత్రికలో పనిచేస్తుండగా రవీంద్రనాథ్ గారితో ప్రత్యక్షపరిచయం కలిగింది. **1949** లగాయతు ఆయనను దూరం నుంచి గాని, దగ్గరగా గాని ఎన్నిసార్లు చూశానో! తొంభైల్లో గాని ఆయనను ముఖాముఖి కలుసుకుని మాట్లాడే యోగం కలగలేదు. మిత్రులు వెనిగళ్ల వెంకటరత్నం గారి ద్వారా నా చిరకాల కోరిక నెరవేరింది. ఈనాడు దినపత్రిక చీఫ్ ఎడిటర్‌గారు నాచేత రాయించిన కొన్ని సంపాదకీయాల్ని, ఎడిట్ పేజి వ్యాసాల్ని ఆయన చదివి నా గురించి తెలుసుకొని తమ **Nest** కి సాదరంగా ఆహ్వానించారు. మేము కలుసుకోవడం అదే మొట్ట మొదటిసారి అయినా, నన్ను చాలా కాలంగా ఎరిగున్నట్లు ఆప్యాయంగా మాట్లాడారు. తాము తాజాగా చదివిన పుస్తకం గురించి మాట్లాడారు. యూరప్, అమెరికాలలో వెలువడ్డ లేటెస్ట్ పుస్తకాలు తెప్పించి చదివేవారు. వారిలాగా అంత సమయం, తీరిక, ఓపికా లేక అంత 'బరువైన' పుస్తకాల్ని చదవలేక పోతున్న నా అశక్తతను వెల్లడించాను.

''మీరు చెబుతుండగా వింటుంటే చాలా ఆసక్తికరంగా వుంది. తప్పకుండా చదవాలనే కోరిక కలుగుతోంది'' అన్నాను.

చాలాసేపు మాట్లాడుకున్నాం. వారి నెస్ట్‌కి తరువాత ఆరేడు సార్లు వెళ్లి వుంటాను. ఆయన కూడా నన్ను కలుసుకోవడానికి ఈనాడు కార్యాలయానికి రెండు మూడు సార్లు వచ్చారు. ఒకసారి మా

యింటికొచ్చి కొద్దిసేపు ముచ్చటించి వెళ్లారు. ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే ఆయన సౌహార్దం అంత గొప్పది. పిన్నా – పెద్దా, రాజా – పేదా ఇత్యాది తేడాలు ఆయనకు తెలీదు. స్నేహితుడిని గాని, పరిచితుడిని గాని తనతో సమానుడుగా చూసేవారు ఆయన. మా ఇరువురి మధ్య చెలిమి కొద్ది కాలంపాటిదే కావచ్చు, కాలం కొలమానం కాదు మా మధ్య అనుబంధానికి. నా స్మృతి ఫలకం మీద ఆయన మూర్తి జీవితాంతం ఉంటుంది. రవీంద్రనాథ్ నా భావన లో చిరంజీవి...

ఆయన కథనం ఎంతో ఉత్తేజకరంగా వుంటుంది. పరిశీలన లోతుగా వుంటుంది. పుస్తకం చదివాక తనకు కలిగిన ఆనందానుభూతిని ఇతరులకు పంచివ్వాలన్న ఆయన తపన ఉదాత్తమైంది.

'మిసిమి' వెనక ఆయన తపన వుంది. మొట్టమొదట్లో ఆయన ఏ ఉద్దేశంతో ప్రారంభించి నప్పటికీ ఆలోచనా పరులైన పాఠకులకు, జిజ్ఞాసువులకు, పరిశోధకులకు, మేధావులకు మహోపకారమే జరిగింది. ఆయన బాధ్యత పెరిగింది. మిసిమి అన్న పేరు సూచించినవారు డాక్టర్ బూదరాజు రాధాకృష్ణ. ఇదివరలో ఏ పత్రికకూ లేనటువంటిది, కుడి ఎడమల ఎటువేపు నుంచి చదివినా తేడా రానిది ఆయన సూచించారు. మిసిమి అంటే నూతన కాంతి, నవనీతం (వెన్న) అని రెండర్థాలు. ఆ పదం, దాని అర్థం సప్రమాణంగా చూపనిదే ఆయనకు సంతృప్తి కలిగేది కాదు.

> ''మిసిమి పరసీమ వలరాజు మేనమామ
> వే వెలుంగుల దొర జోడు రే వెలుంగు''

అని బూదరాజుగారు అల్లసాని పెద్దన రాసిన మను చరిత్రలో నుంచి పై చరణాలు ఉటంకించారు. అలాగే నవనీతం అన్న అర్థంలో ఎవరు, ఎక్కడ వాడారో ఉదహరించారు.

> ''మిణుకు టూర్పులవాని
> మిసిమి మేతల వాని
> మెరుగు ఛామన చాయ మేనివాని...''

అని తెనాలి రామకృష్ణ కవి ప్రణీత పాండురంగ మహాత్మ్యం నుంచి కోట్ చేశారు. మిత్రులు బూదరాజుగారిని అడగ్గా, ఆయన స్వయంగా నాకు చెప్పారు.

మిసిమి అన్న పేరు రవీంద్రనాథ్‌గారి సంపాదకత్వంలో సార్థకమైంది. ఆయన సంపాదకత్వ ప్రతిభ గురించి ఈ సంపుటిలో రాసిన పెద్దలున్నారు. ఆయన రాయని భాస్కరుడని కొందరనుకుంటారు. రచనా ప్రజ్ఞ కలిగినవారే అయినప్పటికీ తనకు సమయం, ఓపికా లేక, ఇతర పనుల ఒత్తిళ్ల వల్ల ఆయన ఇతరులకు చెప్పి రాయించేవారు. భాషలో పొదిగింది ఎవరైనా భావాలు, ఎత్తుగడ, ముక్తాయింపు, వాద ప్రౌఢీ ఆయనవే. ఆసాంతం ఆయనవే.

ఆయన తననుకొన్న విధంగా జీవించారు. ''నీవు నీవుగా బ్రతుకు. నీవు నీవుగా ప్రేమించు, అనుభవించు. ఇలా జీవించడంలోనే నీ 'అసలుతనం' ఉంది. అదే 'నీవు'. అదే 'నేను'.'' అని తన ఫిలాసఫీని సూటిగా తేటగా చెప్పారు. అందుకు ఆచరణలోనూ తానే నిర్వచనంగా నిరూపించారు.

రవీంద్రను మనందరిలోను బతికించే, మన తరువాతి తరాలకు స్ఫూర్తినిచ్చే ఈ సంపుటికి సంపాదకత్వ బాధ్యతను రవీంద్ర మిత్రులు నాపైన ఉంచారు. నాకేవో ప్రత్యేక అర్హతలున్నాయని కాదు – వారితో పోలిస్తే నాకు సమయం వెచ్చించే వెసులుబాటు వుందని మాత్రమే. నేను ఎంతో అభిమానించే, ప్రేమించే రవీంద్రనాథ్ రుచిరస్మృతుల సంపుటిని తీర్చిదిద్దే కార్యభారాన్ని పంచుకోవడం నా అదృష్టం. పేజీల రూపకల్పనలో చలసాని ప్రసాదరావు సహకారం చేయూత ఉండబట్టే ఈ సంపుటిని ఇంత అందంగా, ఆకర్షణీయంగా, నభూతో అనిపించే ట్లుగా మిత్రులందరికీ అందించగలుగుతున్నాం. ''రవీంద్ర స్మృతి'' ని తమ రచనలతో పరిపుష్టం సుసంపన్నం చేసిన వ్యాసకర్తలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. రవీంద్రనాథ్‌గారు కలకాలం మనమధ్య నిలచిపోయేట్లుగా ఈ సంపుటిని విశిష్టంగా రూపొందించిన వారి కుమారులు కళాజ్యోతి ప్రాసెస్ దేవేంద్రనాథ్, బాపన్నలకు నిండు మనస్సుతో కృతజ్ఞతాభివందనాలు.

సహవాసి

సంపాదకుడు

1-11-2001

రవి కృషి...

1942...

1995...

అంచనాలు ...
అభిప్రాయాలు !

నేను నేనే...!

"నేను ఎవరిని అని చాలమంది ప్రశ్నించుకొంటూ ఉంటారు. ఈ ప్రశ్నను గురించి మీరేమైనా ఆలోచించారా?" అని డాక్టర్ రవీంద్రనాథ్ గారిని ఒకసారి ప్రశ్నించినప్పుడు, "వేదాంతులు మాటాడుకునే ఆత్మ ఏమిటో నాకు తెలియదు కాని, నా మాత్రానికి నేను దానికి ఈ విధంగా సమాధానం చెప్పుకొంటాను" అన్నారు ఆయన.

"నేను నేనే. నేనుకు అర్థం చెప్పుకోవడానికి నేను నానుంచి బయటికి పోవలసిన పనిలేదు. జీవితంలో అనేక సన్నివేశాలు ఎదురవుతూ ఉంటాయి. వాటిల్లో నా పాత్రను నేను నిర్వహిస్తూ ఉంటాను. మామూలుగా ఈ పాత్రల పరంగా నేను 'ఇది', 'ఫలాన' అని చెప్పుకొంటాం. కేవలం నేను తండ్రి, భర్త, స్నేహితుడు మొదలైన పాత్రల సంయోగం మాత్రమే కాదు. అంతకంటె ఎక్కువ. నాకు కొన్ని

ఆశంసలు, ఆకాంక్షలు, లక్ష్యాలు ఉంటాయి. నన్ను నేను వాటి పరంగా నిర్వచించుకొంటాను. జీవనం కోసం ఏదో ఒకటి చేస్తూ ఉంటాను. అదే జీవితం కాదు. అదే నేను కాదు.

''నేను పట్టుదలతో పనిచేస్తే నేను ''ఏద్దైనా'' కాగలను. కాని ''అన్నీ'' నేనే కాలేను. ఈ ''కాగలిగే శక్తే'' నాలోని సహజమైన ''నేను''. మామూలు అలవాట్లలో పడి, గాడి జీవితంలో పడి, 'ఏది బడితే అది కాగల శక్తిని', విస్మరిస్తాము. 'నీవు నీవు కా'. నీవు నీవుగా బ్రతుకు'. నీవు నీవుగా ప్రేమించు, అనుభవించు. ఇలా జీవించడంలోనే నీ 'అసలు తనం' ఉంది. అదే 'నీవు'. అదే 'నేను' ''.

''ఇదే జీవితాన్ని, ఇదే పరిస్థితులతో జీవించే అవకాశం లభిస్తే, అవునంటారా? కాదంటారా?''

''నిరభ్యంతరంగా. అయితే అంత మాత్రం చేత నా జీవితంలో ఏమీ ఒడుదుడుకులు జరగలేదని కాదు. అయినా దాని అసంపూర్ణతలతోనే నా జీవితాన్ని తిరిగి నేను జీవిస్తాను. నేను కావాలనుకొన్నది అయ్యాను. ఇవాన్ ఇల్యిచ్ (టాల్‌స్టాయ్ పాత్ర) మరణశయ్య మీద చెందిన నిర్వేదం నాకేమీలేదు.''

ఇల్యిచ్ ఇలా వాపోతాడు: 'నా జీవితం అంతా ఒక ఆభాస అయితే?' అనే ఒక ఆలోచన అతని మదిలో మెదిలింది. తను అనుకొన్న విధంగా తాను జీవించలేక పోయాడు. తాను వద్దనుకొన్న కొన్ని పనులను తా చేయకతప్ప లేదు. చేయాలనుకొన్నవి చేయలేకపోయాడు. తన వృత్తి పరమైన విధులు, తన కుటుంబం, తన జీవిత క్రమం, తన సామాజిక, ఆర్థిక అభిరుచులన్నీ ఆభాసలై ఉండవచ్చు. జీవితంలో తాను చేసిందంతా ఒక్కమాటుగా అబద్ధంగా కనిపించింది. ఇంతకుముందు తాను తన జీవితాన్ని ఎప్పుడూ ఎలా సమర్థించుకొన్నాడో, ఇప్పుడూ అలాగే సమర్థించుకొన్నాడు. కాని అకస్మాత్తుగా తాను సమర్థించే విషయాలలోని బలహీనత అనుభవంలోకి వచ్చింది. సమర్థించుకోవలసింది ఏమీలేదు.

''నేను చెప్పాలనుకొంది చెప్పాననుకొంటాను. 'నేను'ను గురించి నేను ఏమి అనుకొంటున్నది వ్యక్తం చేశాననుకొంటాను''.

(అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డిగారితో రవీంద్రనాథ్)

★

జీవితాంతం మానవీయ ప్రవృత్తిని,
అవ్యాజమైత్రిని తన మనుగడలోని
అవిభాజ్య పార్శ్వాలుగా మలచు కొన్న
ఆలపాటి రవీంద్రనాథ్ రుచిరస్మృతి

రుచిర స్మృతి

☆

డాక్టర్ సి. నారాయణరెడ్డి

ఆలపాటి రవీంద్రనాథ్‌తో నా పరిచయం ఇప్పటిదికాదు. సుమారు నాలుగు దశాబ్దాలనాటిది. ఇప్పుడు రాస్తున్న ఈ నాలుగు మాటలతో రవీంద్ర వ్యక్తిత్వాన్ని కొలిచి చూపలేను. పరిమళిస్తున్న ఆ స్మృతులను అక్షరాలద్వారా అందించలేను. ఐనా నా ఆత్మ తృప్తికోసం ఎత్తుతున్నాను ఈ స్మృతి దీపికను.

పత్రికా సంపాదకుడిగా, ముద్రణాలయ సంస్థాపక నిర్వాహకుడిగా రవీంద్రనాథ్ ధరించిన పాత్రలు ఒక ఎత్తు. మౌలిక జిజ్ఞాసువుగా, నిరంతర పాఠకోత్తముడుగా అతడు సాగించిన జీవిక ఒక ఎత్తు.

రవీంద్ర దృష్టిలో వ్యాపారం వ్యాపారమే. వినోదం వినోదమే. విజ్ఞానం విజ్ఞానమే. వ్యాపార దృష్టిని వైజ్ఞానిక దృష్టినుంచి విభిన్నంగా ఉంచిన వివేకి అతడు. సాయంత్రం వరకు ముద్రణాలయం, ప్రచురణల సంరంభం. ఆ తర్వాత స్విచ్ ఆఫ్. స్నానం, గ్రంథాస్వాదనం లేక సన్మిత్ర సంభాషణం. ఆయన పుస్తకాలను పొద్దుపుచ్చడానికి చదివేవాడు కాడు. బరువైన అంశాలుంటేనే తన లోతైన చూపు ప్రసరించేవాడు. ఒకోసారి గంటల తరబడి సాగిపోయేది ఆ అధ్యయన యాగం. నచ్చిన అంశాలను పుటలకెక్కించు కోవడం, మరీ నచ్చిన వైతే ఫోన్ ద్వారా నాలాంటి మిత్రుల శ్రవణపుటాల కెక్కించడం ఆయనకు అలవడిన సంస్కృతి. భావప్రేరకంగా ఉన్న ఏ చిన్న అంశం దొరికినా, హేతువుకు ఏతామెత్తే ఓ వాక్యం కంటబడినా రవీంద్రకు నిలువెల్లా పారవశ్యం. ఆ అనుభూతి ఆర్థిక పరమైన కొలమానాలకు అతీతం.

తొలినాళ్లలో ఆలపాటి రవీంద్రనాథ్ ''జ్యోతి'' మాసపత్రికను ఎంత సమర్థంగా నిర్వహించాడో గత దశాబ్ది నుంచి ''మిసిమి'' పత్రికను అంత అర్థవంతంగా నిర్వహించాడు. లోగడ ఏ మాసపత్రిక పాటించని వినూతన ప్రమాణాలతో నడిపించాడు ఈ పత్రికను. అసలు ఆ ముఖచిత్రం, దాన్ని గురించి అందించే వివరణ చాలు ''మిసిమి'' విశిష్టతను చాటడానికి.

జీవితాంతం మానవీయ ప్రవృత్తిని, అవ్యాజమైత్రిని తన మను గడలోని అవిభాజ్య పార్శ్వాలుగా మలచుకున్న డా॥ ఆలపాటి రవీంద్రనాథ్ రుచిరస్మృతికి అంకితం ఈ అక్షర సంపుటి.

పద్మభూషణ్ **డాక్టర్ సి. నారాయణ రెడ్డి** , జ్ఞానపీఠ అవార్డు స్వీకర్త - రాజ్య సభ సభ్యులు - కవిత్వం ఆయన ఊపిరి.

ఆయన పాదుకట్టి పెంచిన మొలక వంటి వాడు కాదు. ఉద్గమన శక్తి ప్రౌఢమై భూమి పెకల్చుకొని వచ్చినవాడు. అందువలననే డిగ్రీలు లేకుండానే పాండిత్యం గడించి, ఆ పాండిత్యానికి వన్నె, వాసియే కాక సాంఘిక ప్రయోజనాన్ని చేకూర్చారు. ఆయన నిత్యం చదివేది ***'Statesman'*** పత్రిక. కృష్ణరావుగారి 'కావ్యజగత్తు' ఆయనకంకితం. ఆయిరువురూ కలసి యీ విస్సన్నగాంద్రు యేమనినా వేదముగాదులే అని తిరుగుబాటు జండా యెగురవేశారు.

తిరుగుబాటు జండా !

జస్టిస్ పి.ఏ. చౌదరి

ఆలపాటి రవీంద్రనాథ్ గారు ఆర్జించిన విజ్ఞానం యూనివర్శిటీల ద్వారా గడించింది కాదు. మన యూనివర్శిటీలు సంవత్సరానికొకసారి తప్పకుండా డిగ్రీలను పంచి పెట్టే వ్యాపారంలో నిమగ్నమై వున్నవి. పి.హెచ్.డి.లను యాంత్రికంగా తయారుచేసి, కొన్ని మార్లు కోర్టు ద్వారా కూడా పి.హెచ్.డి. పట్టాలను యిస్తూ విజ్ఞానానికి చెరపరాని మచ్చ తెస్తున్నాయి. అందువలన అలాంటి విద్య ఆయనకు అమరకపోవటం ఆయన అదృష్టంగానే నేను భావిస్తున్నాను. Hobbes అన్నాడట అందరూ చదివిన పుస్తకాలనే తాను చదివి వుంటే వారందరి విజ్ఞానంతో సమానంగా మాత్రమే వుండేది తన విజ్ఞానం అని. ఆ ప్రమాదం నుండి రవీంద్రనాథ్‌గారు బయట పడ్డారు. ఆయన బడిలో నేర్చిన దంతా తురిమెళ్ళ హైస్కూలు పరిధికే పరిమితం. హైస్కూలు చదువును మధ్యంతరంగా మానేసిన రవీంద్రనాథ్ గారు (That is one of his 1000 mutines) విజ్ఞాన సముపార్జనను యేనాడూ విడనాడలేదు. జరామరణాలులేని వానివలె ఆయన విద్యను గడించారు. విజ్ఞాన సాగరాన్ని మథించే ప్రయత్నంలో నిమగ్నులయ్యారు.

తాపీ ధర్మారావుగారి 'దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు', 'దేవునితో ముఖాముఖి'; కవిరాజుగారి 'సూత పురాణం', 'ఖూనీ' లతోబాటు ఆనాడు విజ్ఞానాన్ని వెదజల్లటానికి కంకణం కట్టుకున్న అనేక పత్రికా రచనలు చదివి ప్రతిభావంతులయ్యారు. ఆయన formative రోజుల్లో ఆంధ్రలో ఒక మహాభావ విప్లవం వస్తూవుండేది. చెక్కిన నెలరాల చెరసాలనడుమ వధ్య శిలా వైభవంయిచ్చుగించి దేవులాడుతూ వున్న దేవుని కొరకు కాగడా పెట్టి వెతుకుతూ వున్న రోజులవి. హెచ్చుతగ్గుల చచ్చు హిందూ సమాజాన్ని పునర్నిర్మాణింప గట్టి ప్రయత్నాలు చేస్తున్న రోజులు. ప్రతి మానవునికి స్వేచ్ఛా, సుఖశాంతి పొందే హక్కు జన్మతః యేర్పడిందన్న Jafferson మాటల వూపు రెండు శతాబ్దాలు ఆలస్యంగానైనా ఆంధ్రదేశంలో ప్రచారానికి వచ్చిన రోజులవి. ఆ మహావిప్లవానికి గుంటూరు జిల్లా కేంద్రంకాగా, తెనాలి నడి బొడ్డుగా వుండి ఆ ఉద్యమ స్ఫూర్తితో, ప్రభావంతో, అసమానతల ఊబిలో కూరుకుపోయివున్న హిందూ సమాజాన్ని, హిందూ మతాన్ని ధిక్కరించిన వారు తెనాలిలో బయలు దేరి సాంఘిక నిర్మాణానికి ఉద్యమించారు. French enlightenment యొక్క స్వేచ్ఛా గాలులు ఆలోచనల ధోరణలు, తెలుగునాట మహా ఉధృతంగా వీస్తున్న రోజులవి. స్వసంఘ పౌరోహిత్యాలు, శంభుక వధ నాటకాలు, బహుళ ప్రచారంలో ఉన్న రోజులవి. 'గవర్నమెంట్ అండ్ పాలిటిక్స్' అన్న గ్రంథంలో Morris Jones రాస్తూ ఆంధ్రలో కమ్యూనిస్టుల్లో చాలామంది కమ్మవారని రాశాడు. దీనికి కారణం వారిలో చాలా మంది ఆనాడు గుంటూరు జిల్లాలో నడచిన సాంఘిక విప్లవం ద్వారా ప్రభావితులు కావడమే. వారికి తిరుగుబాటును బోధించింది మొదట ఆ ఉద్యమమే. ఆనాటి గోపీ చంద్‌ని, ఆలపాటి రవీంద్రనాథ్‌ని ప్రభావితం చేసింది ఈ ఉద్యమమే. ఆ ఉద్యమ ప్రభావం వలన చీకటిలో నుండి వెలుగులో పడ్డట్లనిపించింది వారికి. ఆస్వేచ్ఛా వాయువులను పీల్చుకున్న రవీంద్రనాథ్ గారు స్వతంత్రించి ఆలోచించే స్వభావం కలవాడు కాబట్టి సమానత కేవలం రాజకీయాలకే పరిమితం కాకూడదని, అది సంఘ జీవితానికి కూడా విస్తరించ వలెనని భావించారు. అందుకనే ఆయన భావ విప్లవం కొరకు శ్రమించారు. ఆ ప్రయత్నంలో భాగంగానే ఆరోజులలోనే ఆయన విజ్ఞానాన్ని వెదజల్లే 'జ్యోతి', 'రేరాణి' వంటి మాసపత్రికలను తెనాలి నుండి నడిపారు.

ఆయన పాదుకట్టి పెంచిన మొలక వంటి వాడు కాదు. ఉద్గమన శక్తి ప్రౌఢమై భూమి పెకల్చుకొని వచ్చినవాడు. అందువలననే డిగ్రీలు లేకుండానే పాండిత్యం గడించి, ఆ పాండిత్యానికి వన్నె, వాసియే కాక సాంఘిక ప్రయోజనాన్ని చేకూర్చారు. ఆయన నిత్యం చదివేది 'Statesman' పత్రిక. కృష్ణరావుగారి 'కావ్యజగత్తు' ఆయనకంకితం. ఆ యిరువురూ కలసి యీ విప్రున్నగాంధ్రు యేమనినా వేదముగాదులే అని తిరుగుబాటు జండా యెగురవేశారు. ఆ దెబ్బకు సాంప్రదాయిక ఆర్య వాఙ్మయ పతాకాలు, కవితా విమర్శలు అల్లల్లాడాయి. ఆవిధంగా ఆనాడు మొదలైన విజ్ఞాన స్పృహతోనే శతాబ్దాలుగా విద్య తిరస్కరింప బడ్డ వ్యవసాయదారులు, వారి బిడ్డలు, అనేకులు విద్యావంతులై ఈనాడు ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, లాయర్లుగా, వ్యాపారులుగా తమతమ దక్షత చాటుతున్నారు. భర్తృహరి చెప్పినట్లు విద్యకు సాటి ధనంబు లేదుగదా. అందువలననే Bill Clinton విద్యను fault lineగా వర్ణించాడు. విద్యామార్గం మినహా మానవుని యొక్క ఉన్నతికి మరో మార్గంలేదు. ఆ కారణంచేతనే గుంటూరు జిల్లాలో ఊరికో హైస్కూలు పెట్టించిన పి.వి. కృష్ణయ్య చౌదరిగారి మీద రవీంద్రనాథ్ గారికి అంత గౌరవం, అభిమానం. గుంటూరు సీమకు నతులొనర్పని ఆంధ్రమానసము లేదని బల్లగుద్దిన జాషువా మాటలను ఆనాడు, ఈనాడు నిజం కావిస్తున్నది గుంటూరు వారి విద్యే.

ఆయన జీవితంలో చివరి భాగం హైదరాబాదులో గడిపారు. ఆ కాలంలో 'మిసిమి' మాస పత్రిక ప్రచురించి సంపాదకునిగా పనిచేసి ఆయన సంపాదించుకొన్న కీర్తి ప్రతిష్ఠలు కాలం చెరపలేనివి. నష్టాలను లెక్కించక 'మిసిమి' ని నడపటం ఒకఎంతు కాగా ఆ మాస పత్రికను అంత సర్వాంగ సుందరంగా తేవటం యింకోయెత్తు. సంపాదకునిగా యెందరినో రచనకు వుపక్రమింపచేశారు. అంతేగాదు ఆరచనలు యెంతో విశిష్టంగా సాగాయి. రాచకీయ వాదుల నాశ్రయించి రచయితలుగా చెలామణి అవుతూ పురస్కారాలు, సన్మానాలు పొందే విదూషకులను యెత్తి పొడిచారు. మానవుల బలహీనతలకు దర్పణం పట్టే మధుర వాణి సంభాషణలు అపురూప శిల్పాలు. ఈనాటికీ ఆ పాత 'మిసిమి' వ్యాసాలను తిరిగి తిరిగి చదివి ఆనందిస్తున్నామంటే రవీంద్రనాథ్ గారి ప్రతిభకు జోహార్లు అర్పించటమే. "A good book will be read over & over again" అన్నది Ruskin అని నా గుర్తు. ఆ ఘనత ఒక మాస పత్రికకు దక్కిందంటే అది సామాన్య విషయమా? ఆనాటి 'మిసిమి' లో రెండు మూడు వ్యాసాలు రాశాను. అందులో ఒకటి 'మిసిమి' లో పడిన వ్యాసంలో దొర్లిన ప్రాధమిక తప్పులను యెంచుతుంది. కాని స్వేచ్ఛాభిలాషియైన రవీంద్రనాథ్ గారు నావిమర్శలను ప్రచురించారు. ప్రచురణ ఆర్థిక నష్టాన్ని తెచ్చి పెడుతున్నా ఖరీదైన Paintings ని యెన్నింటినో 'మిసిమి' లో అచ్చొత్తించారు. ధనార్జులైన తెలుగులు యెవ్వరూ చెయ్యని ఉపచారం మేధావులకు చేసి మనకు చిరస్మరణీయులయ్యారు. ఈ కృషిలో ఆయనతో సహకరించిన వారి కుమారులు బాపన్న గారికి, దేవేంద్రనాథ్ గారికి నా ధన్య వాదాలర్పిస్తాను.

చివరిమాట :- ఆలపాటి రవీంద్రనాథ్ గారి పేర ఒక ప్రచురణ సంస్థనో, శాఖనో నెలకొల్పి యేడాదికోమారో, రెండేండ్లకొకమారో, తెలుగులో వచ్చే అత్యుత్తమమైన రచనలను మాత్రమే ప్రచురించి రవీంద్రనాథ్ గారి స్మృతికి శాశ్వత నివాళి పట్టటం ఆయనకు తగిన గౌరవం చేసినట్లవుతుంది.

జస్టిస్ పి. ఎ. చౌదరి, హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, మాజీ న్యాయమూర్తి

రవీంద్ర స్మృతి

కాలిఫోర్నియాలోని ఒక విశ్వవిద్యాలయం గౌరవ సూచకంగా ఇచ్చిన డాక్టరేట్ కన్నా రవీంద్రనాథ్‌గారి వ్యక్తిత్వం, కృషి, సౌహార్దం చాలా దొడ్డవి. ఆయన స్నేహం అమృతాయమానం. సన్మానాదుల ప్రసంగం వస్తే ఒకసారి నేనాయనకు భర్తృహరి వైరాగ్య శతకం లోని శ్లోకం చదివి వివరించాను. తాను సాధించిం దేమీ లేదని చెప్తూ ''మాతుః కేవల మేవ యౌవనవ నచ్ఛేదే కుఠారా వయమ్'' అన్న ప్రసంగాన్ని అనువదించి చెప్తే ఆయన కన్నీళ్ళు పెట్టుకొని నిజానికి మనం అంతకన్నా సాధించిందేమని విలవిల్లాడాడు. ఎంతో సేపటికి గాని మామూలు స్థితికి రాలేదు. పత్రికా రంగానికి ఆయన చేసిన సేవ అపారం. నిరంతర విద్యార్థిగా జీవించారు.

కార్యశూరతకు అంజలి

☆

డాక్టర్ బూదరాజు రాధాకృష్ణ

నేటికి అర్ధశతాబ్దం కిందట - స్పష్టంగా చెప్పాలంటే యాభైమూడు సంవత్సరాల క్రితం మొదటిసారి ఆలపాటి రవీంద్రనాథ్‌గారిని గురించి విన్నా - వెంచాశాగారు చెప్పగా. 1948లో గుంటూరు హిందూ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థిగా చేరిన కొత్తల్లో - ఆశుకవిత్వధోరణి తలకెక్కి తబ్బిబ్బు పడుతున్న కాలంలో - అరండల్‌పేట వైపున్న రైల్వే యార్డులో ప్రతి సాయంత్రం సాహితీ గోష్ఠి జరుగుతుంటుందని తెలిసింది. లెక్కకు సైన్సు విద్యార్థినయినా - వేటపాలెం నుంచి తెచ్చుకున్న సాహితీ వ్యామోహం వల్ల వెతుక్కుంటూ అక్కడికి చేరా. పానుగంటి వారి సాక్షి సభలాంటిది కొంచెం పెద్దయెత్తున జరుగుతుంటే ఆ సభలో నాకూ ఓ మూల స్థానమిమ్మని అడిగా. ఆ సభాధ్యక్షులవారు వెంచాశా (చావలి వెంకటశేషశాస్త్రి)గారు ఒక్కరే వెల్లకిలా పడుకొని సభా కార్యక్రమాలు నిర్వహిస్తుంటే మిగతా సభ్యులు నానా భంగిమల్లో కూర్చొని ఏవేవో చర్చిస్తున్నారు. 'భారతి' పత్రికను క్రమం తప్పకుండా చదవటం, ఆశుకవిత్వం చెప్పటం అనే రెండు దుర్లక్షణాల కారణంగా, పళ్ళె పూర్ణ ప్రజ్ఞాచార్యులవారి దగ్గర సంస్కృతం నేర్చుకోవాలనుకుంటున్నానన్న శుభలక్షణం కారణంగా మరో విద్యార్థి మిత్రుడు జూలూరు హనుమంతరావుతో బాటు నాకూ సభ్యత్వమిచ్చారు. అక్కడ ఏ సాహిత్య చర్చలోనయినా ఏ సమయంలో నయినా కల్పించుకొని మాట్లాడవచ్చనేదే సభ్యత్వ రుసుము.

సదరు సభ్యత్వం పొందిన దరిమిలా ఒకనాడు వెంచాశా కథలను గురించే చర్చ మొదలయింది. ఆయన రెండు రకాలుగా రాస్తాడనీ మంచి వాటికి 'వెంచాశా' అనే పేరూ, శృంగార కథలకు రకరకాల కలం పేర్లూ వాడుతుంటాడనే ఆరోపణ వచ్చింది. ఈ రెండో రకం కథలెందులో ప్రచురిస్తారని అడిగితే తెనాలి నుంచి ఆలపాటి రవీంద్రనాథ్ గారు ప్రచురించే 'జ్యోతి'లో మొదటి రకం, ఆయనే స్థాపించిన 'రేరాణి'లో రెండో రకం ప్రచురితమవుతాయని బయటపడింది. రచయితే గాక ప్రచురణకర్త కూడా సవ్యసాచేనన్న సంగతి తెలిసిన తరవాత సహజంగా వివరాలు తెలుసుకోవాలనిపించింది. రవీంద్రనాథ్‌గారి సాహిత్యాభిమానం, ఆధునిక భావాలను గురించి వెంచాశాగారు చెప్పారు. తరవాత కొంత కాలానికి సుడిగాలిలా వచ్చి గడబిడ చేసిపోతుండే చదలవాడ పిచ్చయ్యగారి పరిచయం గుంటూరులోనే కలిగింది. ఆయనప్పటికింకా కమ్యూనిస్టు పార్టీని అభ్యుదయ రచయితల సంఘాన్ని వదిలిపెట్టలేదు. రాయిస్టుల మీద ఉండే సహజ వైరంతో తన సహజధోరణిలో పిచ్చయ్యగారు అబ్బూరి రామకృష్ణరావనే కవి మొదట ఆంధ్రరత్న శిష్యుడుగా కాంగ్రెసువాదిగా ఉండి, తరవాత తొలితరం కమ్యూనిస్టులతో కలిసి పనిచేసి, దరిమిలా ఎం.ఎన్.రాయ్ శిష్యుడై, భక్తుడై తాను భ్రష్టుపట్టడమే గాక తెనాలిలో ఆ చుట్టుపక్కల గ్రామాల్లో చాలామంది కమ్మవారిని చెడగొట్టాడనీ వారిలో రవీంద్రనాథ్‌గారొకడనీ వివరించాడు! ఆ తరవాత కొద్దికాలానికే అల్లూరి సత్యనారాయణరాజు, పరకాల శేషావతారం లాంటివారిలాగానే తానూ కాంగ్రెసు తీర్థం పుచ్చుకొన్నాడు పిచ్చయ్యగారు. ఆ దశాంతరంలో మా పిన తాతగారింటిదగ్గర తటస్థపడ్డ పిచ్చయ్యగారిని మరోసారి అడిగాను రవీంద్రనాథ్‌గారిని గురించి. అప్పుడాయన రాయిస్టుల సంగతి వదిలివేసి పత్రికాధిపతులనూ, సంపాదకులనూ మనసారా దూషించి నీ చదువులు మాని ఇతర విషయాలు పట్టించుకోవద్దని హెచ్చరించాడు.

అప్పుడు నాకర్థమైందేమంటే రవీంద్రనాథ్‌గారు తమ రాజకీయాభిప్రాయాలు మార్చుకోకపోయినా క్రియాశీల రాజకీయవాదిగా కాక సాహితీ పరుడుగా తన విశ్వాసాభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారని మాత్రం. 1950 నాటికి నాకున్న పరిచయం ముఖపరిచయం మాత్రమే. ధనికొండ హనుమంతరావు, రాంషాలతో ఉన్నపాటి పరిచయం కూడా లేదు.

1968 దాకా పేరు విన్నానేగాని ప్రత్యక్షమైత్రి మామధ్య లేనేలేదు. '68లో తెలుగు అకాడమిలో చేరినా 1969లో గాని సహోద్యోగిని కాలేదు తాళ్ళూరి నాగేశ్వరరావు గారికి నేను. తాళ్ళూరి అకాడమిలో అడుగుపెట్టిన నాటి నుంచీ కన్నుమూసే దాకా (సెలవరోజుల్లో కూడా) మేం కలుస్తూనే ఉండేవాళ్ళం ప్రతినిత్యం. రోజువారీ సంభాషణల్లో పాఠ్యగ్రంథ ప్రచురణ, ముద్రాపకులు, సమస్యలు మాకు చర్చనీయం కాక తప్పని పరిస్థితి. తాళ్ళూరి వారివల్ల నాకు ఆలపాటివారితో ప్రత్యక్ష పరిచయం మొదలై స్నేహంగా గాఢమైత్రిగా పర్యవసించింది. 1971లో అకాడమి తెలుగు మాండలిక భేదాలను ప్రచురించదలచినప్పుడు, మాండలికోచ్చారణలోని వైవిధ్యాన్ని ప్రదర్శించటానికి ప్రత్యేక చిహ్నాలు వాడక తప్పదని మేం భావిస్తే ముద్రాపకులెవరూ ముందుకు రాని సమయంలో అదో సవాలుగా తీసుకొని, ప్రత్యేక చిహ్నాలను పోతపోయించి లెటర్ ప్రెస్సు చేయలేని ముద్రణ లేదని నిరూపిస్తానన్నాడాయన. 1971లో కరీంనగర్ మాండలికం, 1972లో కడప, గుంటూరు, విశాఖ మాండలికాలను అకాడమికి ఆవిధంగా ముద్రించిపెట్టినవారు రవీంద్రనాథ్‌గారే. తరవాత ఆయన మార్గంలో ఇతర ముద్రాపకులు ప్రత్యేక చిహ్నాలను వాడినా, మార్గదర్శకుడు మాత్రం ఆయనే. ఆ గ్రంథాలకు సంపాదకత్వమే గాక ప్రూఫురీడింగు కూడా నాదే బాధ్యత అయినందువల్లా, రవీంద్రనాథ్‌గారు ఆ పుస్తకాల్లోని సమాచారం కోసం ముద్రాపకత్వంతో బాటు పాఠకత్వం కూడా స్వీకరించినందువల్లా మా స్నేహం పెరిగింది. ఏ విషయాన్ని ఎందుకిలా రాశామో అడిగి తెలుసుకొనే దాకా ఆయనకు తృప్తి కలిగేది కాదు.

నేను హైదరాబాద్ చేరిన తరవాతనే అబ్బూరి రామకృష్ణరావు గారితో నా పరిచయం పెరిగింది. అబ్బూరి అభిమానిగా, కుటుంబమిత్రుడుగా ఆలపాటి ఆయన యోగ క్షేమాలను నాద్వారా తెలుసుకుంటుండేవారు. రవీంద్రనాథ్‌గారి పెద్ద కుమారుణ్ణి నేనే వెంటబెట్టుకొని పోయి అబ్బూరి వారికి పరిచయం చేసినందువల్ల ఆలపాటివారి కుటుంబంతో నాకు పరిచయం ఎక్కువయింది. ఇన్నయ్యగారి వల్ల మా యిద్దరి స్నేహమూ దృఢపడింది. అనేకానేకంగా ఇంగ్లీషు పత్రికలు కొని చదివే రవీంద్రనాథ్‌గారికి వాటి సారాంశాన్ని నాకు చెప్పి, చర్చించే దాకా తృప్తి కలిగేది కాదు. ఎన్నో నూతన ప్రచురణలను ఆయన చదివి ఆకర్షితుడైన తరవాత నేనూ చదివానంటే గంటల తరబడి చర్చించుకొనేవాళ్ళం. చదవలేదంటే నిర్దిష్ట గ్రంథం మీద తన అభిప్రాయాలను చెప్పి, ఆ పుస్తకాన్ని నాకు పంపి, నేను చదివిన తరవాత చర్చకు పెట్టేవారు. ఆయన కంఠస్వరం కాళిదాసు దిలీపుడి విషయంలో చెప్పినట్లు 'సజల జలధరధ్వాన గంభీరఘోషం''. ఆయన గొంతు వినగానే - కాదు వినీవినకుండానే - మా యింట్లోవాళ్లు ఫలానావారి ఫోను వచ్చిందని

ఇక ఇవ్వాళ ఒకటి రెండు గంటలపాటు నేను మరేమీ విననని, వినిపించుకోనని, చేయనని గట్టి విశ్వాసం పెంచుకున్నారు.

1988లో నేను తెలుగు అకాడమి దాస్యం నుంచి విముక్తుణ్ణయ్యాను - రాజీనామా పంపి. అప్పుడు రవీంద్రనాథ్‌గారితో ఇంచుమించు నిత్య సంబంధమే కలిగింది. ఉద్యోగాదులను బట్టి మామధ్య మైత్రి పెరగలేదు. ఆయనకు నా పాండిత్యం మీదా, స్నేహంమీదా మంచి గురికుదిరింది. జ్యోతి ప్రెస్సును కళాజ్యోతిగా మార్చి అభివృద్ధి పరచిన మీదట, ఆ ముద్రణాలయ నిర్వహణ బాధ్యతలు పిల్లలకప్పగించి ఆయన వానప్రస్థంలో ప్రవేశించారు. మళ్ళీ ఏదో పత్రిక పెట్టకపోతే తోచదనీ, గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోలేననీ నిర్ణయించుకొని దీర్ఘాలోచన మీద విశిష్ట మార్గంలో మేధావుల కోసమేనన్నట్లు 'మిసిమి'ని ప్రారంభించారు 1990లో. ఎన్నోపేర్లు పంపితే సంస్కృత పదాలు దేశవ్యాప్తంగా ఎక్కడో అక్కడ పత్రికలకు పేర్లుగా ఉంటున్నాయి. నన్ను ఆలోచించి చెప్పమంటే 'మిసిమి' అనే పేరు సూచించాను. ఆ మాటకు అర్థం, వ్యుత్పత్తి, కవి ప్రయోగాల వంటి వివరాలన్నీ తెలుసుకున్న తరవాతనే ఆ పేరు ఖాయపరిచాడు. ధన సంపాదన దృష్టి కన్నా విజ్ఞాన వ్యాప్తి ప్రధానమనే భావంతో వెలువరించిన పత్రిక అది. తనకు మంచి పేరు సంపాదించుకొని ప్రచురణకర్తకు ప్రతిష్ఠ తెచ్చిపెట్టిందా పత్రిక. ఆ పత్రికలోని ఉదాహరణల ద్వారానే Left handed dictonary అనే చమత్కారవంతమైన నిఘంటువొకటి ఇంగ్లీషులో ఉందని నాకు తెలిసింది.

కాలిఫోర్నియాలోని ఒక విశ్వవిద్యాలయం గౌరవసూచకంగా ఇచ్చిన డాక్టరేట్ కన్నా రవీంద్రనాథ్‌గారి వ్యక్తిత్వం, కృషి, సౌహార్దం చాలా దొడ్డవి. ఆయన స్నేహం అమృతాయమానం. సన్మానాదుల ప్రసంగం వస్తే ఒకసారి నేనాయనకు భర్తృహరి వైరాగ్య శతకంలోని శ్లోకం చదివి వివరించాను. తాను సాధించిందేమీ లేదని చెప్తూ ''మాతుః కేవల మేవ యౌవనవనచ్ఛేదే కుఠారా వయమ్'' అన్న ప్రసంగాన్ని అనువదించి చెప్తే ఆయన కన్నీళ్ళుపెట్టుకొని నిజానికి మనం అంతకన్నా సాధించిందేమని విలవిల్లాడాడు. ఎంతో సేపటికి గాని మామూలు స్థితికి రాలేదు. ఆ ఆర్ద్ర మనస్కత అంతటిది. పత్రికా రంగానికి ఆయన చేసిన సేవ అపారం. నిరంతర విద్యార్థిగా జీవించారు. అంతకన్నా ఉత్తమ సంస్కారం మరేముంటుంది? ఆలపాటి రవీంద్రనాథ్‌గారిని మరిచిపోవటం అసాధ్యం. ఆయన కార్యశూరతకు అంజలిస్తాను.

డాక్టర్ బూదరాజు రాధాకృష్ణ, హైదరాబాదు, ప్రముఖ భాషాశాస్త్రవేత్త, రచయిత, ఈనాడు స్కూల్ ఆఫ్ జర్నలిజం ప్రిన్సిపాల్‌గా రిటైర్ అయ్యారు. ప్రస్తుతం గ్రంథ రచనలో నిమగ్నులు, మిసిమి నామకరణం వీరిదే.

కొవ్వొత్తిలా కొందరు మనుషులు కరిగిపోతే దూరం నుంచి ఆనందించి చప్పట్లు కొట్టే జాతి మనది. అంతేగాని సమాజానికి పనికివచ్చే మంచి పనులకి చేయూతనివ్వటం మనకలవాటు లేదు. ఓ కార్య సాధనలో ఎంతగా త్యాగం చేస్తే అంత గొప్ప అనుకుంటామే కాని, వాళ్ళ సత్కార్యంలో పాలుపంచుకుని భారాన్ని తగ్గిద్దామన్న తలంపు మనకి అలవాటు లేనిది. పాడి ఆవు ఎలాగూ పాలిస్తోంది కదా అని దానికి దాణా వేయటం మానేస్తే ఆ ఆవు వట్టిపోతుంది. నష్టపోయేది మనమే. మంచి పనికి ప్రశంస, ప్రోత్సాహం, సహాయం - మూడూ ఉన్నప్పుడే దాన్ని కొనసాగించటం సాధ్యం.

తరాల అంతరాలని విస్మరించిన మైత్రి

☆

డాక్టర్ జయప్రకాష్ నారాయణ

మాస పత్రిక

సాధారణంగా స్నేహం వయస్సులో, అనుభవంలో సమ ఉజ్జీల మధ్య ఉంటుంది. అందులోనూ సంప్రదాయ శృంఖలాలని తెంచుకోలేని మన సమాజంలో ఈ అంతరాలని తొలగించుకుని హాయిగా, నవ్వుతూ, తుళ్ళుతూ మైత్రిని నెరపటం చాలా అరుదు.

ఆలపాటి రవీంద్రనాథ్‌గారికి, నాకు మధ్య సంబంధం అలాంటిదే. నేను పుట్టేనాటికే రవీంద్రనాథ్‌గారు తెలుగు పత్రికా ప్రపంచంలో ప్రసిద్ధులు. నిజానికి 1992వ సంవత్సరం వరకు మాకు పరిచయం లేదు. నేను రాష్ట్ర సహకార బ్యాంకు మేనేజింగ్ డైరెక్టరుగా పనిచేస్తుండగా ప్రతి మాసం నాకు మిసిమి మాసపత్రిక ప్రతి అందేది. తీరిక దొరికినప్పుడు దాని పేజీలు తిరగేసేవాణ్ణి. కొన్ని సందర్భాలలో అందులోని వ్యాసాలు ఆసాంతం చదివేవాణ్ణి. ఆ పత్రికలో పదునైన భావాలకి, లోతైన ఆలోచనలకి ఇచ్చే ప్రాధాన్యత నన్నాకట్టుకుంది. అదలా ఉండగా పత్రిక ముఖ చిత్రం దగ్గర నుండి ప్రతి అంశంలోను సౌందర్య పిపాస, కళారాధన కొట్టొచ్చినట్లు కనిపించేవి. తెలుగు సాహిత్యాన్ని, నిశితమైన పరిజ్ఞానాన్ని ప్రేమించే నాకు మిసిమి పత్రిక ఎడారిలో ఒయాసిస్సులాగా అనిపించింది.

మళ్ళీ మళ్ళీ ఆ పత్రికని, రవీంద్రనాథ్‌గారి పేరుని చూస్తుండేవాణ్ణి. ఒక రోజు ఆ పత్రిక నా ఎదురుగా ఉండటంతో ఆయన ఫోను నంబరుని గమనించాను. వెంటనే ఆయనతో మాట్లాడదామనిపించింది. ఆలస్యం చేయకుండా చప్పున ఆ నంబరుకి ఫోను చేస్తే ఆయన లేరు. నా పేరు, ఫోను నంబరు ఇచ్చి ఫోను పెట్టేశాను. ఆ తరువాత ఆయన్నుంచి నాకు ఫోను వచ్చింది. వెంటనే ఆయన వచ్చి నన్ను కలిశారు. అలా ప్రారంభమయింది మా పరిచయం. మొదటిసారి కలవటంతోనే రవీంద్రనాథ్‌గారు ఎంతో ఆత్మీయులయ్యారు. మూసపోసిన పద్ధతిలో ఆలోచనలు, మాటలు, చేతలు ఉండటం మన సమాజంలో సర్వసాధారణం. కాని రవీంద్రనాథ్‌గారి ఆలోచనలలో క్రొత్తదనం, మాటలలో సూటిదనం, చేతలలో నిండుతనం నాకు కనిపించాయి. పిల్లాపాపలతో హాయిగా జీవితాన్ని గడపటమే లక్ష్యంగా చాలా మంది భావించే వయస్సులో కళారాధన కోసం, సాహిత్య పోషణ కోసం రవీంద్రనాథ్‌గారు తపించిపోయారు. ఆ తపన నన్ను ముగ్ధుణ్ణి చేసింది.

మాటలు చెప్పటం సులువు. ఏ రంగంలోనైనా ఓ మంచి కార్యాన్ని తలపెట్టాలంటే అందుకు వనరులు కావాలి. కొవ్వొత్తిలా కొందరు మనుషులు కరిగిపోతే దూరం నుంచి ఆనందించి చప్పట్లు కొట్టే జాతి మనది. అంతేగాని సమాజానికి పనికివచ్చే మంచి పనులకి చేయూతనివ్వటం మనకలవాటు లేదు. ఓ కార్యసాధనలో ఎంతగా త్యాగం చేస్తే అంత గొప్ప అనుకుంటామే కాని, వాళ్ళ సత్కార్యంలో పాలుపంచుకుని భారాన్ని తగ్గిద్దామన్న తలంపు మనకి అలవాటు లేనిది. పాడి ఆవు ఎలాగూ పాలిస్తోంది కదా అని దానికి దాణా వేయటం మానేస్తే ఆ ఆవు వట్టిపోతుంది. నష్టపోయేది మనమే. మంచి పనికి ప్రశంస, ప్రోత్సాహం, సహాయం - మూడూ ఉన్నప్పుడే దాన్ని కొనసాగించటం సాధ్యం. ఆ ఉద్దేశ్యంతోనే నేను మిసిమి పత్రికలో కొన్ని వ్యాపార ప్రకటనలు ముద్రించి కొంతైనా ఖర్చుని తగ్గించాలని రవీంద్రనాథ్‌గారికి సూచించాను. కొంచెం

అయిష్టంగానే ఆయన ఒప్పుకున్నారు. అప్పటి నుంచి రాష్ట్ర సహకార బ్యాంకు నుంచి అడ్వర్టయిజ్‌మెంట్లు మిసిమి పత్రికలో ప్రచురితమయ్యేవి. అవే ఆ పత్రికలో మొదటి వ్యాపార ప్రకటనలు. కొందరు సహృదయులకి ఈ ప్రకటనలు వెగటుగా అనిపించాయని, మిసిమిలాంటి పసందైన పత్రికలో వాణిజ్య ప్రకటనలు వేయటం సబబు కాదని వారి భావమని, అందులో పూజ్యులు కొంగర జగ్గయ్యగారు ఒకరని రవీంద్రనాథ్‌గారు నాకు చెప్పారు. అసాధ్యమయిన అద్భుతం - సుసాధ్యమయిన మంచికి శత్రువని జగ్గయ్యగారికి చెప్పమని నేను సమాధానమిచ్చాను. ఓ ఆదర్శాన్ని కొనసాగించాలంటే దాన్ని ఆచరణ సాధ్యంగా మలచాలని, అప్పుడే అది నాలుగుకాలాల పాటు నిలబడుతుందని నాటికీ నేటికీ నా విశ్వాసం. ఆదర్శం, అనుభూతి, ఆలోచన, ఆచరణ - నాలుగూ కలిస్తేనే సంస్థలు నిలుస్తాయి.

ఆనాటి నుంచి ప్రతి నెలా క్రమం తప్పకుండా మేమిద్దరం కలుసుకునే వాళ్ళం. అడపాదడపా ఫోనులో మాట్లాడుకునేవాళ్ళం. అప్పుడప్పుడూ ఉదయం పూట వ్యాయామం కోసం నడిచే రవీంద్రనాథ్‌గారిని దూరం నుంచి కారులో వెళుతూ చూసే వాడిని. అలా రోడ్డు మీద పలకరించి కబుర్లలో పడేవాళ్ళం. ఆ తరువాత రాజభవన్‌లో, ముఖ్యమంత్రి కార్యాలయంలో నేను ఉద్యోగం చేశాను. ప్రతి నెలా మిసిమి పత్రిక ముద్రణ పూర్తికాగానే మొదటి ప్రతిని తీసుకొచ్చి నాకు స్వయంగా అందించేవారు రవీంద్రనాథ్‌గారు. సమయం కుదిరినప్పుడు చాలాసేపు ముచ్చటించుకునేవాళ్ళం. నాకు పనిభారం వల్ల ఎక్కువ మాట్లాడే సమయం దొరకనప్పుడు తనతో ఎక్కువసేపు కూర్చోవద్దని రవీంద్రనాథ్‌గారే వారించేవారు. ''మీరు పనిలో ఉన్నారని తెలుసు. ఈ పత్రిక మీకిచ్చిపోదామని వచ్చా. మళ్ళీ మరోసారి కలుద్దాం'' అని చెప్పి వెళ్ళిపోయేవారు. ఆయన సంస్కారానికి సహృదయానికి ప్రతిసారి నాకు ఆశ్చర్యం కలిగేది.

ఎందరో మేధావులని గూర్చి, రచయితలని గూర్చి, మన జీవితాలని ప్రభావితం చేసిన ఆలోచనాపరులని గూర్చి, ఆయన చెప్పేవారు. ఆయనతో సంభాషణల తరువాతే నేను బౌద్ధాన్ని గూర్చి అంబేద్కర్ రచనలని, లక్ష్మీనరసుగారి రచనని చదివాను. అలాగే ప్రఖ్యాత చరిత్రకారులు బి.యస్.ఎల్. హనుమంతరావుగారి రచనలని నాకు పరిచయం చేసింది రవీంద్రనాథ్ గారే. ఓ రోజు ప్రింటవుట్‌ని తెచ్చి నాకిచ్చి, ''ఇది హనుమంతరావు గారి పుస్తకం. ఆయనో అసాధారణమైన చరిత్రకారుడు. బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన మరణానంతరం దీన్ని నేను ముద్రిస్తున్నాను. ముందు మాట మీరే రాయాలి,'' అని కోరారు. ఆ పుస్తకాన్ని ఆసాంతం చదివాక హనుమంతరావుగారి ప్రతిభ, హేతువాద దృక్పథం, శాస్త్రీయ అవగాహన, నిజం పట్ల నిరతి నన్ను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ''ముందుమాట''ని కొంచెం ఆలస్యంగానయినా రాసి పంపాను. హనుమంతరావుగారి పరిశోధనలతో ఆ అనుబంధం అలా కొనసాగి, ఇటీవలే తెనాలిలో వారి స్మారకోపన్యాసం చేశాను.

1996 జనవరిలో రవీంద్రనాథ్‌గారికి అస్వస్థతగా ఉందని తెలియగానే వారిని సెక్రటేరియట్‌కి ఎదురుగా ఉన్న మెడిసిటీ హాస్పటల్‌లో పరామర్శించాను. ఊపిరి తిత్తులకి ఇన్ఫెక్షన్ రావటంతో

న్యూమోనియాతో, బ్రాంకైటిస్‌తో బాధపడు తున్నారు. తప్పక తగ్గుతుందని నేను నమ్మాను. ఆయనకి భరోసా ఇచ్చాను. అయితే ఉన్నకొద్దికీ పరిస్థితి విషమించి, చివరికి ఆయన మనల్ని విడిచి వెళ్ళిపోయారు. వేరే పెద్ద జబ్బేమీలేని మనిషి అలా కన్నుమూస్తారని ఊహించలేదు. కనీసం మరో పదేళ్ళపాటు సాహిత్య సేవ, కళాసేవ చేసే శక్తి, ఆసక్తి ఆయనకున్నాయి. అదలా ఉంచి నాకు జీవితంలో ఎంతో స్నేహాన్ని, ఆప్యాయతని అందించిన వ్యక్తి పోవటం వ్యక్తిగతంగా తీరని లోటయింది. ఓ నెల రోజుల కాలంలో నాకెంతో అనుభూతిని, ఎన్నో జ్ఞాపకాలని పంచి పెట్టిన ఇద్దరు ఆత్మీయులు దూరమయ్యారు. అంతకు కొద్ది రోజుల క్రితమే యన్.టి.ఆర్. అకస్మాత్తుగా మరణించగా, నెలలోగా రవీంద్రనాథ్‌గారు కనుమరు గయ్యారు. ఆయన మరణం తెలుగు సాహిత్యానికి, కళారంగానికి తీరని లోటు. అంతకు మించి ఆయన మిత్రులకి పూడ్చలేని వెలితిని మిగిల్చి రవీంద్రనాథ్‌గారు వెళ్ళిపోయారు.

రవీంద్రనాథ్ గారు కీర్తిశేషులయ్యాక ఆయన కుమారులు బాపన్నగారితో, ఇతర కుటుంబ సభ్యులతో పరిచయం పెరిగి స్నేహంగా మారింది. మరి కొందరు అంతకు ముందే మిత్రులుగా ఉన్నవారు రవీంద్రనాథ్‌గారి సమీప బంధువులని ఆ తరువాత తెలిసింది. వారు మరణించినా వారి ప్రియ పత్రిక 'మిసిమి'ని అలాగే కొనసాగిస్తున్న బాపన్నగారికి, వెంకటేశ్వరరెడ్డిగారికి మనమంతా ఋణపడి ఉన్నాం. ఇటీవలే తెలిసింది - వారి మనుమరాలి పేరు కూడా 'మిసిమి' అని! కొందరు మనుషులు మరణించినా జ్ఞాపకాల రూపంలో, వారు సృష్టించిన సంస్థల రూపంలో మన మధ్యే నిలిచి ఉంటారు. కళాజ్యోతి ప్రాసెస్, మిసిమి పత్రిక, ఆయన వెలిగించిన మరెన్నో ఆలోచనా దీపాలు మనకెప్పుడూ ఆనందాన్ని పంచి పెడుతూనే ఉంటాయి. మిత్రులు ఆలపాటి రవీంద్రనాథ్‌గారు ధన్యజీవి; నిరంతరం మనమధ్య నిలిచి ఉండే అవిస్మృతుడు.

డాక్టర్ జయప్రకాష్ నారాయణ, హైదరాబాద్, ఐ.ఏ.యస్. అధికారిగా పని చేశారు, మంచి వక్త, రచయిత, లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఆంధ్రా యూని వర్సిటీని విశాఖపట్నం నుంచి తాత్కాలికంగా గుంటూరుకి తరలించినప్పుడు, రాడికల్ డెమోక్రాటిక్ పార్టీ (ఎం. ఎన్. రాయ్ స్థాపించినది) విధానాలను ప్రచారం చేయడంలో అబ్బూరితోనూ, గోపీచంద్ వంటి ఇతర మేధావుల తోనూ కలిసి రవీంద్రనాథ్‌గారు పని చేశారు. రవీంద్రనాథ్‌గారూ, ఎం.వి. రామమూర్తి గారూ, వరద రాజేశ్వరరావు గారూ దాదాపు సమ వయస్కులు. వాళ్ళు కార్య కర్తలుగా పని చేసేవారు. అబ్బూరి వారి స్వస్థలం కూడా తెనాలి కావడం వారి అనుబంధానికి మరింత దోహదం చేసింది.

నిలువెత్తు కళాజ్యోతి

☆

అబ్బూరి ఛాయాదేవి

మిసిమి

మాస పత్రిక

జూన్ 1993
వెల రూ.5/

వరద రాజేశ్వరరావు గారి ద్వారానే నాకు ఆలపాటి రవీంద్రనాథ్‌గారు పరిచయం అయ్యారు. వరద రాజేశ్వరరావు గారిని కలుసుకోవడానికి రవీంద్రనాథ్‌గారు 1990-91 ప్రాంతంలో మా ఇంటికి వచ్చినప్పుడు కేవలం ముఖ పరిచయం మాత్రమే కలిగింది. రవీంద్రనాథ్‌గారి ముఖ వర్చస్సూ, మూర్తిమత్వం నన్ను ఆకర్షించాయి. 'మిసిమి' పత్రికకి నేను అభిమానిని అయ్యాను. కళాత్మకమైన ముఖచిత్రంతో, మేధావులను ఆకర్షించే వ్యాసాలతో, ముచ్చటైన సైజులో వచ్చే 'మిసిమి' నన్ను బాగా ఆకట్టుకుంది. సంజీవదేవ్ గారు జిడ్డు కృష్ణమూర్తి గారి గురించి రాసిన వ్యాసాలను చూశాక, నేను కూడా రాస్తే బావుండుననిపించింది. కానీ అప్పట్లో నా అభిలాషని నాలోనే అణుచుకున్నాను.

'వరద స్మృతి' ప్రచురణ సందర్భంగా నేను ధైర్యం చేసి, రవీంద్రనాథ్ గారికి ఫోన్ చేసి నన్ను నేను పునఃపరిచయం చేసుకున్నాను. నాతో ఆప్యాయంగా మాట్లాడారు. మా మామగారు అబ్బూరి రామకృష్ణరావు గారితో తమ స్నేహాన్ని తలుచుకున్నారు. ఇద్దరికీ చాలా వయో భేదం ఉన్నప్పటికీ, సాయంకాలాలు కలిసి ఎలా స్నేహపూర్వకంగా గడిపేవారో చమత్కారంగా చెప్పారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఆంధ్రాయూనివర్సిటీని విశాఖపట్నం నుంచి తాత్కాలికంగా గుంటూరుకి తరలించినప్పుడు, రాడికల్ డెమోక్రాటిక్ పార్టీ (ఎం. ఎన్. రాయ్ స్థాపించినది) విధానాలను ప్రచారం చేయడంలో అబ్బూరితోనూ, గోపీచంద్ వంటి ఇతర మేధావులతోనూ కలిసి రవీంద్రనాథ్ గారు పని చేశారు. రవీంద్రనాథ్‌గారూ, ఎం.వి. రామమూర్తిగారూ, వరద రాజేశ్వరరావుగారూ దాదాపు సమవయస్కులు. వాళ్ళు కార్యకర్తలుగా పని చేసేవారు. అబ్బూరి వారి స్వస్థలం కూడా తెనాలి కావడం వారి అనుబంధానికి మరింత దోహదం చేసింది.

'వరదస్మృతి' పుస్తకం అట్టని రంగుల్లో అందంగా కళాజ్యోతి ప్రెస్‌లో ముద్రించే ఏర్పాటు చేశారు రవీంద్రనాథ్‌గారు. మేము సప్లై చేసిన మెటీరియల్ తీసుకుని, ముద్రణకయ్యే వ్యయం తీసుకోకుండా ముద్రింపజేశారు. ఆవిధంగా ఆలపాటి తమ స్నేహనిబద్ధతనీ, ఔదార్యాన్నీ ప్రదర్శించారు. ఈ లక్షణాలతోపాటు, రవీంద్రనాథ్‌గారి కళాభిరుచినీ, వ్యవహార దక్షతనీ ఆయన పుత్రులు సంతరించుకోవడం అభినందనీయం.

బెర్‌ట్రాండ్ రసెల్ బి.బి.సి.లో ఇచ్చిన ఇంటర్వ్యూ (గ్రంథరూపంలో వచ్చినది) - మా నాన్న గారు కీ. శే. 'నచికేత' అనువదించినది నా దగ్గర ఉందని చెప్పి దాన్ని 'మిసిమి'లో ప్రచురించడానికి వీలవుతుందా అని అడిగాను ఆలపాటి గారిని. ఆయన దాన్ని తమ పరిశీలనకి పంపించమన్నారు. అయితే, మా నాన్నగారి అనువాదం గ్రాంథికంలో ఉండటం వల్లా, ఇంటర్వ్యూ చాలా విస్తృతంగా ఉండటం వల్లా దాన్ని యథాతథంగా ప్రచురించడం కుదరదని చెప్పి, దాని ఆధారంగా క్లుప్తంగా ఒక వ్యాసం రాసి ఇమ్మన్నారు నన్ను, అలాగే రాశాను. 'బెర్ట్రాండ్ రసెల్ భవిష్యద్దర్శనం' అనే నా వ్యాసాన్ని ప్రచురించారు 'మిసిమి'లో. తరవాత అప్పుడప్పుడు ఫోన్ చేసి, 'మిసిమి'లో వచ్చే రచనల్ని చదువుతున్నారా అని కనుక్కుంటూ ఉండేవారు.

'మిసిమి'లో పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు రాసిన మధురవాణితో ఊహా సంభాషణల పరంపరలో వరదరాజేశ్వర రావు గారితో సంభాషణని కూడా ప్రచురించారు.

1996 మే 20 న అబ్బూరి శతజయంతి సభలో పాల్గొనకుండానే, అబ్బూరి శతజయంతి సంపుటికి ఏమీ రాయకుండానే ఫిబ్రవరిలో ఆలపాటి రవీంద్రనాథ్‌గారు కీర్తిశేషులవడం నాకు చాలా బాధ కలిగించింది.

డా॥ ఆలపాటి రవీంద్రనాథ్‌గారి ఉత్తమ కళాభిరుచీ, స్నేహశీలతా, సహృదయతా చిరస్మరణీయాలు. ఆలపాటి స్మృతి చిహ్నంగా 'కళాజ్యోతి' సాహితీప్రియులకు సహకరిస్తూ, నిలువెత్తుగా ఎప్పటికీ ప్రకాశిస్తూ వారి హృదయాల్లో 'మిసిమి'ని నింపుతూనే ఉంటుంది.

అబ్బూరి ఛాయాదేవి, హైదరాబాదు, విదుషీమణి, రచయిత్రి.

నయాగరా జలపాతం వద్ద...

1962 ...

జీవితం చాలా గమ్మత్తయిన మలుపులు తిరుగుతుంది. రవీంద్రనాథ్‌గారిని చూసినప్పుడు ఉత్సాహం మూర్తీభవించిన ఆయనలో సీరియస్ సాహిత్యోపాసకుడున్నాడని అనుకోవడం కష్టం. కాని మిసిమి లాంటి పత్రిక స్థాపించే సాహసం చేసేవారు కాదే! రవీంద్రనాథ్ వంటి సాహిత్య సాహసులు అరుదు.

సాహిత్య సాహసి

☆

రామలక్ష్మి ఆరుద్ర

మిసిమి

మాస పత్రిక

జూలై 1993
వెల రూ.5/-

రవీంద్రనాథ్‌గారితో నా పరిచయం - రెండున్నర దశాబ్దాలకు పై మాటే. చాలాసార్లు మా ఇంటికి వచ్చి బాతాకానీ వేస్తుండేవారు. వారికి కళలన్నా కళాత్మక వస్తువులన్నా కుతూహలం చాలా వుండేది. నాకు కాస్త ఆ పిచ్చి ఎక్కువే. అందుకే మాట్లాడుకు నేందుకు - విషయం వుండేది.

అలా ఒకసారి నా - నాణేల సేకరణ, సాంప్రదాయ నగల సేకరణ (విశాఖ, ఉభయ గోదావరులవే), తంజావూరు పటాలు, ఐదారు ప్రాచీన శిల్పాలు చూశారు. వాటిని చూసి ఆయన ఓ సారి అడిగారు కూడా 'నువ్వు నగలు పెట్టుకోవు. ఇవన్నీ ఎందుకు?' అని. ''అవసరానికి, కనీసం నా కలెక్షన్ డబ్బు చేయవచ్చు. ఆరుద్ర కలక్షన్ దులిపేశామే గాని - ఏముంటుంది?'' అన్నాను నవ్వేశారు. ఆరుద్ర తను రాద్దామనుకున్నవి రాశాక - లైబ్రరీని విరాళంగా ఇచ్చేశారు.

కాని నేను? ఆరుద్ర అనారోగ్యం పాలైనప్పుడు ముందు నగలు, తంజావూరు పటాలు అన్నీ అమ్మేయవలసి వచ్చింది. కొన్ని శిల్పాలని కూడా ఇచ్చివేయవలసి వచ్చింది. నేను దీనికి బాధపడలేదు. కారణం - అలాంటివి అవసరాలు తీర్చడానికే అని నమ్మిన దాన్ని కావడమే.

ఇదంతా ఎందుకు చెప్పానని అనుకోకండి. ఆరుద్ర నిమ్స్‌లో ఉన్నప్పుడు - పక్క రూములో రవీంద్రనాథ్‌గారి చుట్టాలున్నారు. చూడడానికి తరుచూ వస్తూండేవారు. అప్పుడే కాస్త కబుర్లు చెప్పుకునేవాళ్ళం. ''నీ నగల కలక్షన్ చూశాక నాకు అనిపించింది, ఆనాటి స్వర్ణకారుల పనితనం- ఇప్పుడు లేదు.'' అన్నారు - నేను అప్పుడు చెప్పాను. ''విలువైనవన్నీ డబ్బుగా మార్చేశాను'' అని. అయ్యో ఎంత గర్వంగా చూపెట్టారు? ఎలా అమ్మగల్గారు! అని అడిగారు. ''వీటి కంటే, వేటి కంటే కూడా నాకు ఎప్పుడూ ఆరుద్ర ముఖ్యం. అతని కోసం నేనేం చేయడానికైనా సిద్ధం. మా మధ్య ఒక్క భార్యాభర్తల బంధమే కాదు స్నేహ బంధం ఎక్కువ'' అన్నాను. నేను కంట తడి పెట్టుకున్న సమయాల్లో అదొకటి.

జీవితం చాలా గమ్మత్తయిన మలుపులు తిరుగుతుంది. రవీంద్రనాథ్‌గారిని చూసినప్పుడు ఉత్సాహం మూర్తీభవించిన యీయనలో సీరియస్ సాహిత్యోపాసకుడున్నాడని అనుకోవడం కష్టం. కాని 'మిసిమి' లాంటి పత్రిక స్థాపించే సాహసం చేసేవారు కాదే! రవీంద్రనాథ్ వంటి సాహిత్య సాహసులు అరుదు. వారి పరిచయం స్థిరంగా మనసులో దాచుకోతగ్గది.

కె. రామలక్ష్మి ఆరుద్ర, మద్రాసు, ప్రముఖ నవలా రచయిత్రి

నాకు ప్రతిభ వలన, కృషి వలన ఏవో ''క్వాలిఫికేషన్లు'' లభించి ఉండవచ్చు. కాని, రవీంద్రనాథ్‌గారితో బాటుగా ఈ లోకంలో కొంత కాలం పాటు జీవించి ఉండడం, వారితో పరిచయం గలిగి ఉండడం.

– ఈ రెండు ''యోగ్యతలు'' ఎంతో భిన్న. రవీంద్రనాథ్‌గారు మేధావులలో కూడా నవీనుడు, ఆధునికానంతరుడు. దీపం (జ్యోతి) ఆయనే, కాంతి (మిసిమి) ఆయనే.

దీపం (జ్యోతి) దర్శయామి, కాంతి 'మిసిమి' ఆస్వాదయామి!

☆

నరాగో

స్వాతంత్ర్యకాంక్ష కారణంగా దేశంలో నెలకొన్న కల్లోల దందహ్యమాన పరిస్థితులు, భారతదేశంలో; మొట్టమొదట బెంగాల్‌లోనూ క్రమంగా దేశం అంతటానూ, ''మేధావులు'' (Thinkers) అనిపించుకోదగిన ఒక వర్గాన్ని సృజించి, పెంచాయి. ఈ ''మేధావులు'' పేద, గొప్ప - రెండు తరగతుల్లోనూ బయలుదేరి, దేశప్రజల కార్యకలాప - ఆలోచనా రంగాలలో మార్పులకు గాను ఎలాంటి చర్యలకు తల పడాలి- అని; యోచించి, చెప్పి, చేసి చూపించేరు. పేదలు శిక్షలకు గురై; చెరసాలల పాలై మృత్యువు వాతపడిన - పోయిన వారు పోగా, మిగిలిన వాళ్లు రాజీపడి పోయారు. ''కలిగిన వారు'' జైళ్ళకి వెళ్లనవసరంలేని వారు కూడా ''ఊరికే తిని కూర్చోలేదు.'' మన విద్యా వ్యవస్థ కొన్ని అవాంఛనీయ పరిణామాలకు లోనయి దాని ప్రభావం ప్రదర్శక - అప్రదర్శక కళల (Non-performing Art) మీద కూడా పడుతున్నది కనుక, ఆ పరిస్థితిని చక్కబరచాలని సిద్ధపడి, తమ కృషితో, త్యాగశీలతతో (కొండొకచో కీర్తి కాంక్షతో) తమ ఆలోచనలకు కార్యరూపాన్ని ఇవ్వగలిగారు.

అందులో ఆలపాటి రవీంద్రనాథ్‌గారు ఒకరు.

దేశానికి స్వాతంత్ర్యం ఒనగూడిన తొలి వత్సరాలలోనే కాక, అంతకు షుమారు ఒక దశాబ్దం నుండి కూడా, తెనాలి నగరం అట్టి మేధావులు కొందరికి స్థానమై ఉంది. తెనాలికి 'ఆంధ్రా పారిస్' - అని ఒక నామాంతరం ఉండేది. ఫ్రాన్స్ దేశంలోని పారిస్ నగరం కళలకు, వ్యసనాలకు కాణాచి, తెనాలిని ఆంధ్రాపారిస్‌గా ఎవరో కొంటెగా పేర్కొని ఉంటారు. కాని, అది ఆ నగరానికి ఒకానొక గర్వకారణమయిన బిరుదుగా భాసించినమాటే నిజం.

ప్రదర్శక కళల (Performing Arts) సంగతి అలా వదిలేస్తే, అప్రదర్శక కళ అనిపించుకున్న రచనా వ్యాసంగానికి తెనాలి నగరం ఒక పట్టుగొమ్మగా వెలిగింది. అక్కడ పుట్టినా పుట్టకపోయినా అక్కడ తమ ప్రతిభకు మెరుగులు దిద్దుకున్న రచయితలు ఎందరో ఉన్నారు. 20వ శతాబ్దపు 'పైలాపచ్చీస్'లో జన్మించిన వారు ఎక్కువ. కొన్ని పేర్లు చెప్పుకోక తప్పదు. కొడవటిగంటి కుటుంబరావు, గవిని వెంకట కృష్ణరావు, ధనికొండ హనుమంతరావు, ఆలూరి బైరాగి చౌదరి, రావూరి భరద్వాజ, మతుకుమల్లి వేంకటనృసింహప్రసాదరావు (హితశ్రీ), 'చౌడేశ్వరీ దేవి!' 'అమరశ్రీ', నటరాజన్ (శారద), తాళ్లూరి నాగేశ్వరరావు - వీరు కాక తెనాలి నగరం చేత ప్రభావం చెంది తెనాలి నగరాన్ని ప్రభావితం చేసిన, ఆలూరి వెంకట సుబ్బారావు (చక్రపాణి), తరువాతి తరంలో వచ్చిన అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జంపాల ఉమామహేశ్వరరావు (సహవాసి), కొత్త రవీంద్రబాబు, చివుకుల పురుషోత్తం, లల్లాదేవి, ఎం.డి. సౌజన్య, 'స్పార్టకస్' అనే జి. మోహనరావు, - తదితరులు. వీరిలో కొందరు తమకు తోచినదేదో నిశ్శంకగా, నిరవధికంగా రచిస్తూవచ్చారు. కొందరు తమ రచనలు ఇటు విత్తసాధనకి, అటు వికాస సాధనకి తోడ్పడగలవని ఆ దిశగా వెళ్లారు. తెలుగు వారిలో, (ఆ మాటకొస్తే భారతీయులందరిలో) కేవలం రచనా వ్యాసంగంతోనే జీవికను సాధించుకో గలిగినవారు చాలా తక్కువ. కుటుంబరావుగారు ఆ తక్కువ మందిలో ఒకరు.

''తెలుగు పత్రికారంగం మద్రాసు కేంద్రస్థానంగానే ఎందుకు ఉండిపోవాలి; మనం తెనాలి నుంచి (డెయిలీ పేపర్లు కాకపోయినా) మాసపత్రికలు, పక్షపత్రికలు నిర్వహించలేకపోతామా?'' అని కేవలం సంకల్ప బలంచేత ప్రేరణపొంది, పత్రికలను వ్యవస్థాపించి నడిపించినవారు ఆలపాటి రవీంద్రనాథ్ గారు, ధనికొండ హనుమంత రావుగారు, కొలను బ్రహ్మానందరావుగారు, మరికొందరు. మరి 'ఆంధ్రా పారిస్' కనుక, ఆ పత్రికలకు కొంత 'ప్యారీ'-సు-వాసన అబ్బింది. పాఠకులు మెచ్చే విధంగా రచనలు సాగించటం రచయితల ప్రథమ కర్తవ్యం అనుకుంటే సంపాదకులు (యజమానులు) ఆమోదించే విధంగా కూడా ఉండేటట్లు రాసుకోవడం రచయితల (అ) ద్వితీయ కర్తవ్యం. ఈ ధోరణిని ఒక సిద్ధాంతంగా స్వీకరించక పోయినా ఒక మార్గంగా చేపట్టి, కొందరు రచయితలు తెనాలి పత్రికల ప్రాపకం పొందేరు.

★ ★ ★

ఆలపాటి రవీంద్రనాథ్‌గారితో నా పరిచయం అప్పటిది. అప్పుడు నాకు 18 నిండని వయసు. ఇప్పుడు చెప్పుకుంటే వినే వారికి హేళనో, అనుతాపమో కలగొచ్చు; కాని, బి.ఏ విద్యార్థిగా ఉండిన ఆ రోజులలో నాకు - ఏదయినా పత్రికలో సంపాదక వర్గంలో చేరిపోవాలని కోరిక ఉండేది. రవీంద్రనాథ్‌గారు నడుపుతున్న ''జ్యోతి'' (పక్షపత్రిక)లో అప్పటికి నావి అయిదారు కథలు అచ్చుయ్యాయి. వాటిలో 'రూపాయి' - అనేకథ ఆయనకు నాకూ మధ్య ఉత్తరాలు నడిపించింది. అది ఆ పత్రికకు నేను రాసిన మొదటి కథ. ఆ కథ ఉన్న పత్రిక (సంచిక) విడుదల అయిన కొన్నాళ్ళకి - దానికిగాను పారితోషికం పంపలేదేమని నేను ఉత్తరం రాశాను. ఆ పత్రిక అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయనీ, ప్రకటనలు అసలు రావడంలేదనీ తెలియజేస్తూ, రవీంద్రనాథ్ గారు నాకు ఉత్తరం రాసారు. నేను దానికి జవాబుగా ''అయ్యా, నేను సత్రంలో ఉచితంగా భోజనం చేస్తూ, స్కాలర్‌షిప్‌లు ఆధారంగా కాలేజీ ఫీజు కట్టుకుంటూ; బి.ఏ. చదువుకుంటున్న విద్యార్థిని. మీరు పంపేది ఎంత అయినా అది అంతమేరకు మా నాయన గారిని సుఖపెడుతుంది. కనుక, మీ ఇష్టం''. అని రాశాను. ఆ ఉత్తరం పోస్ట్ చేసిన పదిరోజులకి నా పేర 25 రూపాయల మనియార్డరు వచ్చింది. కూపను మీద ''మీ కథకు పారితోషికం అయితే ఐదు రూపాయలు కూడా రాదు. కానీ, మీ ఉత్తరంలో స్కాలర్‌షిప్ - అని ఒక మాట ఉంది. ఇది అదే.'' అనిఉంది. అది 1950. (ఆ సంచిక తేదీ 15-4-1950) ఆ రోజుల్లో 25 రూపాయలకు నూరు శేర్ల బియ్యం వచ్చేవి. అంటే ఇప్పటి లెక్క ప్రకారం రూ. 1600 కి సమానం. 18 ఏళ్ళు నిండని కాలంలోనే నాకు ఒక చిన్న కథకి 1600 పారితోషికం (స్కాలర్‌షిప్) లభించింది. ఇప్పుడు నాకు 70. ఆ కథలో నేను చూపిన వస్తువు, శిల్పం, మాటపొందికలను మించి ఇంకా బాగా రాయగలుగుతానేమో, కానీ, 1600 ఎవరిస్తారు? ''కాశికావిశ్వేశుగలసె వీరారెడ్డి.'' అన్నాడు, 'శ్రీ' నాథుడు!

రవీంద్రనాథ్‌గారు, అప్రదర్శక కళలనన్నిటినీ నేను పేర్కొనలేనంత సామర్థ్యంతో, అభిరుచితో, అవలోకనం చేసుకున్నవారు. (''జ్యోతి'' పత్రిక ఆయన దగ్గిర మూతపడి అలా అలా చేతులు మారి, పారిపోయి ఆరిపోయింది.) పుస్తకాలు, పెయింటింగులు, ఎన్‌సైక్లోపిడియాలు, నిఘంటువులు, ఎన్నిటితోనో ఆయన సంచయం మాత్రమే కాక, ఆయన ఆలోచనా మందిరం

కూడా నిండిపోయి ఉంది. కానీ, ఆయన నిష్క్రియా పరుడిగా ఉండలేని, శ్రమజీవి, మేధోజీవి కలగలసిన ధన్యజీవి.

1951 వేసవికాలంలో నేను ''నన్ను నీ పత్రికలోకి తీసుకుంటావా, నీ పత్రికలోకి తీసుకుంటావా?'' అంటూ సందర్శించిన ఎడిటర్లు: శంభు ప్రసాదుగారు, గోరా శాస్త్రిగారు, రవీంద్రనాథ్‌గారు. (కాళిదాసు గారిని సందర్శిద్దామనుకున్నానే కాని, చానోగారు చీవాట్లు పెట్టి పంపించేశారు.) అలా జరిగిన తరవాత రవీంద్రనాథ్ గారి పునర్దర్శనం, నాకు 1988లో: హైదరాబాదులో గోల్కొండ చౌరస్తా ప్రాంతంలో ఉండిన (కళా) ''జ్యోతి'' ప్రెస్ నిర్వాహకుడుగా వారున్నప్పుడు కలిగింది. విశాఖపట్నం పోర్టు ట్రస్టు గృహ పత్రిక ''సాగరిక'' ప్రింటింగు ఆ ప్రెస్సులో జరగాలని కాంట్రాక్టు. ఆ పత్రిక (ప్రకటిత) సంపాదకుడు పోర్టు ట్రస్టు సమాచారాధికారి ఎ. మాధవన్ నాయర్‌గారు. అతనికి తెలుగు మాట్లాడడం (వినడం కూడా) కొద్దిగా వచ్చు గానీ, చదవడం అంత మాత్రం కూడా రాదు. కనక, యాజమాన్యాన్ని ఒప్పించి, ఆ పత్రిక తెలుగు సెక్షన్ పేజీలు చూడడానికి గాను నన్ను హైదరాబాదుకి తీసుకు వెళ్లారు. ప్రెస్ మెయిన్ హాలులో సింహంలా కూర్చుని ఉన్నారు రవీంద్రనాథ్‌గారు. ''ఎన్నాళ్ళకెన్నాళ్లకి!'' అంటూ దండాలు పెట్టుకుంటూ ఆయన్ని సమీపించి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. ''నువ్వు గుర్తు లేకేం? కథకి డబ్బు పంపలేదని పేచీకి దిగావుగా!'' అని నవ్వారాయన. ''జ్యోతి మిమ్మల్ని వదిలినా మీరు వదల్లేదే!'' అని ప్రెస్‌కి ఆ పేరు పెట్టుకున్న సంగతిని చతురోక్తిగా వదిలాను. అప్పటి నుండి వారు 1996లో కీర్తిశేషులయ్యే వరకు ఎప్పుడు ఏ పనిమీద హైదరాబాదు వెళ్లినా ఆయనతో కొన్ని నిమిషాలయినా గడపకుండా తిరిగి రాలేదు. వారి పుత్రులు దేవేంద్ర-బాపన్న అనే అపూర్వ సహోదరులు నాపట్ల నాటినుండి నేటి వరకు చూపుతున్న స్నేహ, ప్రేమ, గౌరవ, ఆదర, ఉదార భావాలూ, చర్యలూ: రవీంద్రనాథ్‌గారు, నన్ను ఎలా చూసుకున్నారో, దానిని స్మృతిలో ఉంచుకోవడం వల్లనే.

విశాఖపట్నం, రాజమండ్రి, బెజవాడలలో నేను ఎన్నో పుస్తకాలు సాహితీ సంస్థల తరపున గానీ, పోర్టు ట్రస్టు తరపున గానీ ప్రింటు చేయించాను. కాని, కళాజ్యోతి ప్రాసెస్ అని పేరూ, రూపూ, వైభవం - మార్చుకుని ఆ (పాత) జ్యోతి ప్రెస్ మరింత ముందుకి (అంటే గోల్కొండ చౌరస్తా సందులోంచి, చార్మినార్ చౌరస్తా సమీపంలోకి, ''ప్రగతి''కి దగ్గరగా కూడా) వచ్చినందువల్ల 1988 తరవాత పుస్తకముద్రణకి ఆ ప్రెస్‌తో సంబంధాలు కొనసాగించుకుంటూ ఉన్నాను.

అది వ్యాపార సంబంధమైన సంగతి, కాని, అభిరుచి సంబంధంగా కళను ఒక జ్యోతిగా ఉపాసించిన రవీంద్రనాథ్‌గారు మూల ప్రకృతి రీత్యా ఎంతటి ''మెటీరియలిస్ట్'' అయినా, ఆయన అవగాహన చేసుకుని పదిమందికీ పంచిన జ్ఞానం అంతకు మించిన Rememberable 'Material'.

'మిసిమి' మాస పత్రిక. అది మూస పత్రిక కాదు. మోస పత్రిక కూడా కాదు. గంగిగోవు పాలు గంటెడయినను చాలు. మరెన్నో మాస పత్రికలు వందలాది పేజీలతో, డజన్లాది బొమ్మలతో, పుంజీల కొద్దీ వస్తు వైవిధ్యాలతో వెలువడి ఉండవచ్చును. 'మిసిమి'లో ఆ

ఆడంబరాలూ లేవు, ఆ రకం వైవిధ్యాలూ లేవు. ఆ పుబ్బ, మఖ సామ్యమూ లేదు. 1990 నుండి ఇప్పటి వరకు అన్ని సంచికలూ నా దగ్గిర ఉన్నాయి. అవన్నీ ఒక్కొక్క దానిని, ఒక్కొక్క సారి చూసి, చదివి విడిచిపెట్టగలగడం అసాధ్యం. 'అప్రదర్శక'కళల గురించి 'రాజకీయ'ం నుండి 'స్వప్న' తత్వాల, శాస్త్రాల వరకు మిసిమిలో వచ్చిన సమాచారం, విశ్లేషణ, చర్చ: అన్యథా అసంభవం. ఆ వ్యాసాల రచనా పద్ధతి ఎవరో ఎవరెవరికో గీతలు గీసి బోధ పరిచినట్లు; ఎంత లోతయిన సంగతులకి అంత విశదాత్మకమయిన శైలి. రవీంద్రనాథ్‌గారికి మిసిమి పత్రిక ద్వారా అంతర్జాతీయ గుర్తింపు ఒకటి సమకూరి ఉండవచ్చు, కాని, అది ఆయనకే స్వంతం కాదని, ఆ గుర్తింపు మిసిమి రచయితలందరిది, పాఠకులందరిదీనని; ఆయన భావించేరు. 1996లో రవీంద్రనాథ్‌గారు కీర్తిశేషులయినప్పుడు ''నాయనలారా! మీరు నాయనగారికి ఏమి చేసినా, చెయ్యకపోయినా మిసిమి మాత్రం ఆగకుండా, ''చెదరకుండా చూడండి''. అని బాపన్న దేవేంద్రగార్లకు ఉత్తరాలు రాసిన వాళ్లు కొన్ని వేలమంది ఉండరు. కాని, ఆ ఉత్తరాలలో ఒక్కొక్కరి ఒక్కొక్క అక్షరం వేవేలు.

రవీంద్రనాథ్‌గారికి నేను ఎంతో ఆత్మీయుడను కాను. మా భౌతిక పరిచయం యాదృచ్ఛికం. ఆ పరిచయం కొనసాగింపు 'కర్మ'ను కారణము. (కర్మ అంటే పని.) అయినా సరే, వారు నన్ను ''ఏదో పనిమీద వచ్చాడు, పని కాంగనే పోతాడు.'' అనే ధోరణిలో ఎన్నడూ పరిగణించలేదు. ఆయన నన్ను నాలుగుసార్లు సత్కరించారు. ఒకటి: 1950 నాడు, రెండు: నా అకాడెమీ అవార్డు కథా సంపుటి ''ఇట్లు, మీ విధేయుడు'' పుస్తకానికి టైటిలు ప్రింటింగ్ చేయించి ఇవ్వడం - (1990); మూడు: నా ''సరదాకథలు'' పుస్తకం స్వీకరించి అంతటితో ఊరుకోక - ఏ కథకునికీ ఇవ్వని స్థానం - అందులో ఒక కథ ('అడుగడుగున గుడి ఉంది') 'మిసిమి' (అక్టోబరు 1995)లో పునఃప్రచురించడం ద్వారా - నాకు ఇచ్చారు. (కథను ప్రచురించి కూడా చేతులు దులిపేసుకోలేదు: 'ఇలాంటి కథలున్న పుస్తకం ఒకటి వెలువడింది; అభిరుచి ఉంటే కొనుక్కోండి' అన్న ధోరణిలో ఒక ప్రకటన కూడా వేసేరు. మరి ఆ సత్కారం కూడా ఏ కథా రచయితకీ - 'మిసిమి'లో లభించలేదేమో కదా.) నాలుగు: పురాణం సుబ్రహ్మణ్య శర్మగారి 'మధురవాణి ఇంటర్‌వ్యూలు' పుస్తకం నేను తయారు చెయ్యగా అంకితం వేసుకోవడం (1997!).

నాకు ప్రతిభ వలన, కృషి వలన ఏవో ''క్వాలిఫికేషన్లు'' లభించి ఉండవచ్చు. కాని, రవీంద్రనాథ్‌గారితో బాటుగా ఈ లోకంలో కొంత కాలం పాటు జీవించి ఉండడం, వారితో పరిచయం గలిగి ఉండడం.

- ఈ రెండు ''యోగ్యతలు'' ఎంతో మిన్న.

రవీంద్రనాథ్‌గారు మేధావులలో కూడా నవీనుడు, ఆధునికానంతరుడు. దీపం (జ్యోతి) ఆయనే, కాంతి (మిసిమి) ఆయనే.

భమిడిపాటి రామ గోపాలం (భరాగో), విశాఖపట్టణం, సుప్రసిద్ధ కథకుడు, కాలమిస్టు పురాణంగారి మధురవాణి ఇంటర్వ్యూల పుస్తక సంకలన కర్త. రవీంద్రనాథ్‌గారికి అంకితం.

మాస పత్రిక

ఆగస్టు - 1998

వెల - రూ॥ 8/-

ఆంధ్రలో జ్యోతి పత్రికతో కొత్త గాలి విచింది. కొత్త రచయితలకు అవకాశం వచ్చింది. ధైర్యంగా నూతన మార్గాలు అవలంబించే వారికి వేదిక లభించింది. అజ్ఞాత రచయితలకు ఊపిరి పోసింది. అలా వచ్చిన ప్రముఖులలో శారద ఒకరు. రవీంద్రనాథ్ ప్రోత్సాహంతో శారద పుంఖాను పుంఖంగా రాసి, రాణించాడు. శారద హోటల్‌లో వర్కర్ అని ఆనాడు చాలమందికి తెలియదు.

వైవిధ్యాల మధ్య జీవితగమనం

☆

ఎన్. ఇన్నయ్య

దేశంలో తెల్ల దొరతనం తొలగితేగాని అభివృద్ధి సాధ్యం కాదని కాంగ్రెస్ అన్నది. బ్రిటిష్‌వారి అండనే బాగుపడతామని జస్టిస్ పార్టీ భావించింది. అటు వంటి పరస్పర విరుద్ధ వాతావరణంలో ఆలపాటి రవీంద్రనాథ్ పుట్టారు.

1922 నాటికే జస్టిస్ పార్టీ అధికారంలో వుంది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఆనాటి ఆంధ్ర ఒక భాగంగా కొనసాగింది. రవీంద్రనాథ్ పుట్టిన గోవాడ గ్రామంలో మధ్యతరగతి వ్యవసాయదారులదే ప్రాబల్యం. వెంకట్రామయ్య, అమ్మెమ్మలు రైతు కుటుంబీకులు. వారి సంతానం రవీంద్రనాథ్. కాని, తనపై తాత దేవయ్య ప్రభావం బాగా వున్నట్లు రవీంద్రనాథ్ తరచు ప్రస్తావిస్తుండేవారు. రవీంద్రనాథ్ పుట్టేనాటికి ఆంధ్రలో రైతులు కాంగ్రెసు జాతీయ పోరాటాలలో పాల్గొంటున్నారు. పర్వతనేని వీరయ్యా చౌదరి పెదనందిపాడు ఫిర్కాలో పన్నుల నిరాకరణోద్యమం ప్రారంభించి, గాంధీ , పట్టాభి రాజకీయ ఎత్తుగడల మూలంగా విరమించుకోవలసి వచ్చింది. ఆ తరువాత 10 సంవత్సరాలకు గాంధీజీ ఆంధ్ర పర్యటనకు వచ్చినప్పుడు రైతులు ఘన స్వాగతం పలికారు.

గోవాడ గ్రామం వచ్చిన గాంధీజీని 10 ఏళ్ళ ప్రాయంలో రవీంద్రనాథ్ చూశాడు. అప్పుడే తాత దేవయ్య చాలా ప్రముఖ పాత్ర వహించారు. గోవాడలో హరిజనుల్ని గ్రామంలోని బావి నుండి నీరు తోడుకోనివ్వడం పెద్ద మార్పు. గోవాడలో గ్రంథాలయం ఏర్పరచి పుస్తకాలు, పత్రికలు తెప్పించడంలో కూడా దేవయ్య పాత్ర వుంది. వీటన్నిటి ప్రభావం బాల్యదశలో రవీంద్రనాథ్ పై పడింది. గాంధీ గారి అహింసా కార్యక్రమంలో భాగంగానే, శాకాహారం కూడా అనేకమంది అలవరచుకున్నారు. అలాగే నూలు వడికి, ఖద్దరు ధరించడం దేశ భక్తికి సూచికగా తలపోశారు.

రవీంద్రనాథ్‌పై గాంధేయ ప్రభావం వున్నదనడానికి ఆయన ఖద్దరు ధరించడం, శాకాహారం తీసుకోవడం పేర్కొన దగినవి. అలాగే గ్రంథాలయానికి పోవడం, పుస్తకాలు పత్రికలు చదవడం గోవాడలో బాల్యదశ నుండే మొదలైంది.

మరోవైపు జస్టిస్ పార్టీవారు అనేక పాఠశాలలు ఆంధ్రలో ముఖ్యంగా గుంటూరు జిల్లా మాగాణి ప్రాంతాలలో ప్రారంభించారు. రవీంద్రనాథ్ గోవాడ నుండి నడచివెళ్ళి తురుమెళ్ళలో చదువుకున్న 5వ జార్జి కారొనేషన్ స్కూలు ఆనాడు అలా వచ్చిందే. దక్షిణామూర్తి అనే హెడ్మాస్టరు క్రమశిక్షణలో తురుమెళ్ళ స్కూలు పేరు మోసింది. రవీంద్రనాథ్ డొంక ప్రయాణాలు చేయలేడని తురుమెళ్ళ స్కూలు హాస్టలులో పెడితే, ఆయనకు చదువు అట్టే వొంటబట్టలేదు. స్వేచ్ఛ కావాలనుకునే విద్యార్థికి, క్రమశిక్షణే అత్యవసరం అనుకునే అధ్యాపకులకూ మధ్య వైరుధ్యం తప్పదు.

తురుమెళ్ళ స్కూలులో ఆనాడు దూర గ్రామాల నుండి విద్యార్థులు వచ్చి హాస్టల్‌లో వుండి చదువుకున్నారు. తల్లిదండ్రులు దక్షిణామూర్తిగారిపై పూర్తి విశ్వాసం వుంచారు. రవీంద్రనాథ్ ఆడుతూ పాడుతూ, ఆకతాయిగా వుండడంతో దక్షిణామూర్తి గారి క్రమశిక్షణా చట్రంలో

యిమడలేదు. ఫలితంగా స్కూలుకు ఉద్వాసన పలకాల్సివచ్చింది. అంతటితో తురుమెళ్ళకేగాక, లాంఛన ప్రాయమైన చదువుకే ఆయన గుడ్ బై పలికారు.

ఒరే రవీ అని రవీంద్రనాథ్‌ను పిలిచిన వారిలో కొసరాజు సాంబశివరావు ఒకరు. ఆయన రవీంద్రనాథ్‌కు తురుమెళ్ళ స్కూలులో సీనియర్ విద్యార్థి. స్కూలు అనుభవాలు, రవీంద్రనాథ్ చురుకుదనం, అప్పుడప్పుడూ బడి ఎగ్గొట్టి, పొలం గట్లమీద ఆడుకున్న తీరు తెన్నులు సాంబశివరావు తీపి జ్ఞాపకాలుగా చెప్పేవారు.

1934 ప్రాంతాల నుండే రవీంద్రనాథ్ సొంత చదువుల్లోనే గడపడం మొదలైంది.

గోవాడ చుట్టుపట్ల వాతావరణమంతా కాంగ్రెస్ ప్రభావంతో వుండేది. అమృతలూరులో అప్పటికే సంస్కృత పాఠశాల పేరుకెక్కింది. గోవాడ సమీపంలోని కావూరులో గొల్లపూడి సీతారామ శాస్త్రి వినయాశ్రమం స్థాపించి స్వామీ సీతారాం అయ్యారు.

గోవాడ నుండి తెనాలి అప్పుడప్పుడూ వెళ్ళి వచ్చే రవీంద్రనాథ్‌ను అక్కడి వ్యక్తుల ప్రభావం, ఉద్యమాల తీరు ఆకర్షించాయి.

తెనాలి ఆంధ్ర పారిస్‌గా ప్రసిద్ధి చెందింది. కళలు, నాటకాలు, ప్రింటింగ్ ప్రెస్‌లు, పత్రికలు ఆనాడు తెనాలిలో తిష్ఠ వేశాయి.

తెనాలికి, గుడివాడ నుండి వలస వచ్చిన త్రిపురనేని రామస్వామి మునిసిపల్ ఛైర్మన్ అయ్యారు. మరోవైపు న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. జస్టిస్ పార్టీలో వున్న త్రిపురనేని రామస్వామి కమ్మకుల మహాసభలలో పాల్గొని ప్రోత్సహించారు. కవిత్వాన్ని భావభేదన కోసం వాడారు. బ్రాహ్మణులలోని అగ్రకుల అహంకారంపై కవిత్వం ద్వారా పోరాడి, పండిత సభలలో సై చేయి అయ్యారు. పురాణాలు, ఇతిహాసాలలోని దోషాలు, లొసుగులు, అపసవ్యాలు ఎత్తిచూపి తీవ్రంగా ఖండించారు. నాటకాలు, గేయాలు, కావ్యాలు రాశారు. కమ్మకులంలో పౌరోహిత్యం ఆరంభించి, పెళ్ళిళ్ళు చేయించారు. తెనాలిలో హిందూ మహాసభతో కొన్నాళ్ళు సంబంధం పెట్టుకున్న త్రిపురనేని రామస్వామి చౌదరి తరువాత ఆర్యసమాజ్‌కు దగ్గరయ్యారు. పేరులో చౌదరి తీసేశారు. అవధానాలు చేసి, గండపెండేరాలు, సన్మాన సత్కారాలు అందుకున్న త్రిపురనేని రామస్వామి ఆనాడు విశ్వనాథ సత్యనారాయణ బ్రాహ్మణత్వాన్ని ఎదుర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పోరాడిన వారిని శ్లాఘిస్తూ గేయం రాసినా, ప్రత్యక్షంగా కాంగ్రెస్‌తో సంబంధం పెట్టుకోలేదు. కమ్మకులం వారికి ఆరాధ్యుడుగా త్రిపురనేని రామస్వామి ఆవిర్భవించాడు. బ్రాహ్మణ ద్వేషికాదంటున్నా, ఆచరణలో అలానే ఆయన్ను పరిగణించారు. తెలుగులో పెళ్ళి మంత్రాలు చెప్పించిన రామస్వామి, తన రచనల ద్వారా ఎందరినో ప్రభావితం చేశారు. తెనాలిలో తన నివాసానికి సూతాశ్రమం అని పేరు పెట్టారు. ఆయన కుమారుడు గోపీచంద్ లా చదివి, రచయితగా గొప్పపేరు పొందారు. 1943 జనవరిలో 52 సంవత్సరాలకే చనిపోయిన త్రిపురనేని రామస్వామి సామాజిక చైతన్యం కోసం పోరాడారు. అలాంటి రామస్వామి ప్రభావానికి రవీంద్రనాథ్ కొంతవరకు గురయ్యారు.

1942లో రవీంద్రనాథ్ పెళ్ళి చేసుకున్నారు. త్రిపురనేని రామస్వామి ఆధ్వర్యం వహించారు. మరో వ్యక్తి అందులో పాల్గొన్నారు. ఆయనే తాపీ ధర్మారావు. తాతాజీ అనే పేరు ఆయనకు స్థిరపడింది. ధర్మారావుగారు ఆనాడు జస్టిస్ పార్టీ పత్రికకు సంపాదకత్వం వహించి, బ్రాహ్మణేతర ఉద్యమంలో పాల్గొన్నారు. పిఠాపురం రాజా జస్టిస్ పార్టీ నుండి చీలివచ్చి ప్రజాపార్టీ పెట్టగా దాని పక్షాన తాపీ ధర్మారావు, దేవులపల్లి కృష్ణ శాస్త్రి పని చేశారు. 1936లో అప్పుడు జరిగిన ఎన్నికలలో జస్టిస్ పార్టీ చనిపోయింది. కాంగ్రెస్ తిరుగులేని పార్టీగా వచ్చింది. తాపీ ధర్మారావుతో చివరి వరకూ రవీంద్రనాథ్ పరిచయం పెంచుకుంటూ పోయారు. హైదరాబాదులో అప్పుడప్పుడూ ఆయన్ను చూసివస్తుండేవారు. ధర్మారావుగారు జస్టిస్‌పార్టీ నుండి కమ్యూనిస్టు పత్రికా సంపాదకుడుగా వెళ్ళి పని చేశారు. దేవాలయాలపై బూతు బొమ్మలెందుకు మొదలు పెళ్ళిళ్ళ విషయాల వరకూ కొత్త పాళీని నడిపించారు. రవీంద్రనాథ్‌ను అవి ఆకర్షించాయి.

తెనాలిలో అనేక ప్రభావాలకు గురైన రవీంద్రనాథ్, జస్టిస్ పార్టీ విద్యాసేవల్ని ఎన్నడూ మరచిపోలేదు. పాములపాటి కృష్ణయ్య చౌదరి చదువుకోక పోయినా ఆనాడు గుంటూరు జిల్లాలో అనేక పాఠశాలలు స్థాపించడానికి మూల పురుషుడయ్యాడు. ఆయన్ను రవీంద్రనాథ్ చివరిదాకా అభిమానంతో పేర్కొంటుండేవాడు. ముఖ్యంగా మాగాణి తాలూకా గ్రామాలలో సంపన్నుల వద్ద భిక్షమెత్తడం, డబ్బున్న వితంతువులకు నచ్చజెప్పి ఆస్తులు పాఠశాలలకు వినియోగించడం రవీంద్రనాథ్‌ను ఆకర్షించిన అంశం. ఒక దశలో పాములపాటి కృష్ణయ్య చౌదరి పాఠశాల విద్యాభి వృద్ధి బోర్డులో సభ్యుడుగా రవీంద్రనాథ్‌ను నియమించినట్లు కోటపాటి మురహరిరావుగారన్నారు. ఎన్నో పర్యాయాలు పాములపాటి వారి పర్యటనలు, చౌరవ గ్రామాలకు ఆయన పెట్టిన విద్యాభిక్ష రవీంద్రనాథ్ కథలుగా చెప్పేవారు. ఆమేరకు జస్టిస్ పార్టీ గొప్ప కృషి చేసిందనేవారు.

త్రిపురనేని రామస్వామి ప్రభావం రవీంద్రనాథ్‌పై పరిమితంగానే వుంది. అలాగే తాపీ ధర్మారావు విషయం కూడా. వారిపట్ల మోతాదు మించిన అభిమానం లేదు గాని, తగు మోతాదులో అభినందన వుంది. ఆనాటి పరిస్థితులలో వారిరువురు చైతన్యం తేవడంలో బాగా ఉపకరించారన్నారు.

రవీంద్రనాథ్ తెనాలిలో ప్రింటింగ్ ప్రెస్ పెట్టడం గొప్ప మలుపు. అది వ్యాపార రీత్యా అవసరమేగాక, ఆయన వ్యక్తిత్వాన్ని విస్ఫారజేసుకోడానికి సాధనం అయింది. తెనాలిలో ప్రింటింగ్ ప్రెస్‌లు స్వాతంత్ర్యానికి ముందు చాలా కీలక పాత్ర వహించాయి. ప్రెస్‌లు చర్చా వేదికలుగా, కళాకారులు, పండితులు, గాయకులు, నటులు, ఉపాధ్యాయులు కలిసే చోటుగా వుండేవి. ప్రూఫ్ రీడర్లు అనేక సందర్భాలలో పండితుల దోషాల్ని దిద్దడం, పద్యాలను యతి గణాలతో సహా సరిచేయడం గమనార్హం.

అలాంటి ప్రింటింగ్ ప్రెస్‌ల మధ్య రవీంద్రనాథ్ జ్యోతి ప్రెస్ స్థాపించారు. తెనాలి బోస్‌రోడ్‌లోని జ్యోతి ప్రెస్ రాడికల్ హ్యూమనిస్టులకు, హేతువాదులకు, స్వతంత్ర ఆలోచనా పరులకు చోటుగా వుండేది.

ప్రింటింగ్ ప్రెస్‌కు బాగా పనికల్పించడమంటే నాడు ప్రభుత్వ అనుమతితో పాఠ్యగ్రంథాలు వేయడం తప్పనిసరి అయ్యేది. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ కేంద్రకార్యాలయం మద్రాసులో వుండడం వలన, విధిగా మద్రాసు ప్రయాణాలు తగులుతుండేవి. ఈ రంగంలో పోటీ కూడా ఎక్కువగానే వుండేది. కవిరాజ పబ్లిషర్స్ మాధవయ్యగారు మొదలు అనేక మంది బరిలో వుండేవారు. సిఫారసులు తప్పనిసరి అయ్యేవి. రవీంద్రనాథ్‌కు యీ విషయంలో మాట సాయం చేసిన వారిలో బెజవాడ గోపాలరెడ్డి, అబ్దుల్ సలాం, వామనరావు (డి.పి.ఐ), బుల్లయ్య (విద్యాధికారి), గోవింద రాజులు నాయుడు ప్రభృతులుండేవారు. మద్రాసు వెళ్ళినప్పుడు కాస్మోపాలిటన్ క్లబ్‌లో వుంటూ అక్కడి సాంస్కృతిక జీవన కార్యకలాపాలలో పాల్గొనడం రవీంద్రనాథ్‌కు అలవాటుగా వుండేది.

సినిమారంగంలో కొంగర జగ్గయ్య, డి.వి. నరసరాజు, పాలగుమ్మి పద్మరాజు, కృష్ణవేణి, కాంచనమాల, గుమ్మడి వెంకటేశ్వరరావు ఆయనకు సన్నిహితులు.

కుమారస్వామి (మైలాపూర్ మోటారు కంపెనీ), కోదండరాంలు దగ్గర మిత్రులు.

ప్రింటింగ్ ప్రెస్ సవ్యంగా సాగుతున్నప్పుడు, తగిన పని లభిస్తున్నప్పుడు, రవీంద్రనాథ్ పత్రికల విషయం ఆలోచించారు. మద్రాసులో పత్రికలకు కావలసిన సమాచారం, పాత మేగజైనులు, పుస్తకాలు లభించేవి. మోర్ మార్కెట్‌లో చౌకగా గ్రంథాలు దొరికేవి.

మద్రాసులో రవీంద్రనాథ్‌కు సన్నిహిత మిత్రులలో శ్రీశ్రీ, ఆరుద్ర వుండేవారని కొద్ది మందికే తెలుసు.

ప్రింటింగ్ ప్రెస్, పత్రికలకు నాందిగా తెనాలిలో రవీంద్రనాథ్‌ను గాఢంగా ప్రభావితం చేసిన విషయం యిప్పుడు ప్రస్తావిద్దాం.

తనను రాడికల్ హ్యూమనిస్ట్‌గానూ, రేషనలిస్ట్‌గానూ, నాస్తికుడుగానూ రవీంద్రనాథ్ ముద్రవేసుకోలేదు. పైగా మానవ వాదులకు కళాపోషణ, కళాభిమానం, రామణీయకత లేదనే విమర్శ ఆయన గమనించాడు. అయితే రవీంద్రనాథ్ తెనాలి జీవితంలో చాల్మా రాడికల్ హ్యూమనిస్టులున్నారు. వారిలో రవీంద్రనాథ్‌కు బాగా సన్నిహితులున్నారు. ఆయనపై ఎం. ఎన్. రాయ్, ఆయన భార్య ఎలెన్ ప్రభావం ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ వున్నది. ఈ విషయం రవీంద్రనాథ్ ఆలోచన పై, ఆయన పెట్టిన పత్రికల పై గాఢంగా వుంది.

అసలేం జరిగిందో చూద్దాం :

కాంగ్రెస్ జాతీయవాద ఉప్పెనకు ఎదురీతగా ఎం.ఎన్. రాయ్ రాజకీయాలలో వివేచన వుండాలని, వికేంద్రీకరణ రాజకీయంగానూ ఆర్థిక పరంగానూ వుండాలన్నాడు. స్వాతంత్ర్యం రాకముందే రాజ్యాంగాన్ని రూపొందించుకోవాలనీ, జాతీయవాదం కాలదోషం పట్టిన సిద్ధాంతమనీ అన్నాడు. ఫైజ్‌పూర్ (మహారాష్ట్ర)లో 1936 డిసెంబరులో ఎం.ఎన్. రాయ్ ప్రసంగం ములుకుట్ల వెంకటశాస్త్రి (ఎం.వి. శాస్త్రి)ని ఆకర్షించింది. కుందూరి ఈశ్వరదత్తు

పీపుల్స్‌వాయిస్ పత్రిక (మద్రాసు) ప్రతినిధిగా వెళ్ళిన ఎం.వి. శాస్త్రి ఆంధ్రలో తన వినూత్న అనుభవాన్ని అబ్బూరి రామకృష్ణారావుతో సహా ఎందరికో చెప్పాడు. అదే సమయంలో 1937 జులై చివరి వారంలో యూత్ మహా సభలకు ఎం. ఎన్. రాయ్ అధ్యక్షత వహించారు. అప్పుడు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఎడిటర్‌గా వున్న ఖాసా సుబ్బారావు రాస్తూ ఎలెన్ గురించి పిచ్చి వ్యాఖ్యానాలు చేశారు. పత్రికా విలేఖరుల గోష్ఠిలో ఆ విషయం ఎం.ఎన్. రాయ్ ప్రస్తావించి సుబ్బారావు పై ఆగ్రహం వెలిబుచ్చారు. దీనికి నిరసనగా నార్ల వెంకటేశ్వరరావుతో సహా అందరూ వాకౌట్ చేశారు. అప్పటి నుంచే ఆంధ్రప్రభలో నార్ల ఏనాడూ ఎం.ఎన్. రాయ్ వార్తలు రానివ్వలేదు. వెన్నెలకంటి రాఘవయ్య ఆధ్వర్యాన నెల్లూరులో ఆగస్టు 1, 1937న రాష్ట్ర వ్యవసాయ కార్మికుల మహాసభకు ఎం.ఎన్. రాయ్ అధ్యక్షత వహించారు. ఆంధ్రలో అలా అడుగుపెట్టిన రాయ్‌ను పర్యటించమని కోరగా తెనాలి, గుంటూరు, కాకినాడ, విశాఖలు పర్యటించారు. తెనాలిలో చాలామందిని రాయ్ ప్రభావితం చేశాడు. రవీంద్రనాథ్‌కూ ఆ గాలి సోకింది. అప్పుడు ముందంజ వేసిన వారిలో ఆవుల గోపాల కృష్ణమూర్తి పేర్కొన దగిన వ్యక్తి. మళ్ళీ 1942లో ఎం. ఎన్. రాయ్ మరోసారి తెనాలి వచ్చారు. ఈ లోగా రాడికల్ డెమొక్రటిక్ పార్టీ ఏర్పడడం, గోపీచంద్ దానికి రాష్ట్రకార్యదర్శి గావడం యింకా ఎన్నో పరిణామాలు జరగడం రవీంద్రనాథ్ గమనించారు. జి.వి. కృష్ణరావు మార్క్సిజాన్ని విమర్శిస్తూ కళలు రామణీయకతపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆయన రవీంద్రనాథ్‌కు అప్తుడు. తన రచనను రవీంద్రనాథ్‌కు అంకితం యిచ్చారు. తెనాలిలో రాడికల్ పత్రిక నడిపారు. విహారి పత్రిక వెలువడింది. ఇవన్నీ ఎం. ఎన్. రాయ్ సిద్ధాంతాలను ప్రజలకు చెప్పాయి. శాస్త్రీయ రాజకీయాలు సాధ్యమేనన్నాయి. కోగంటి రాధాకృష్ణమూర్తి కూచిపూడి నుండి వచ్చి నలంద ప్రచురణల పేరిట హేతువాద సాహిత్యం వెలువరించారు. పి.వి. సుబ్బారావు, ఆవుల సాంబశివరావు, వాసిరెడ్డి శివలింగయ్య, జంపాల శ్యాంసుందర్ మొదలైన వారెందరో రాడికల్ హ్యూమనిస్టు భావాలు ప్రచారం చేశారు. పార్టీకి, ఉద్యమానికి రవీంద్రనాథ్ సన్నిహితం కాలేదు గాని, భావాలకు బాగా దగ్గరవాడయ్యాడు. ఎం.ఎన్. రాయ్ భావాలు ఆయనకు హత్తుకు పోయాయి. పునరుజ్జీవనం కావాలని, భారతీయ చరిత్రను సంస్కృతిని, తత్త్వాన్ని, బౌద్ధాన్ని శాస్త్రీయ దృక్పథంతో చూడాలని రాయ్ చెప్పింది రవీంద్రనాథ్‌కు నచ్చింది. ఆ స్ఫూర్తి తోనే పత్రికలు పెట్టారు. రమణీయకత, కళలు, విమర్శల నిమిత్తం ఒక పత్రిక (జ్యోతి), కళాపోషణ, సెక్స్‌ను శాస్త్రీయంగా చెప్పడానికి రేరాణి పత్రికను ఉద్దేశించారు.

ఆంధ్రలో జ్యోతి పత్రికతో కొత్త గాలి వీచింది. కొత్త రచయితలకు అవకాశం వచ్చింది. ధైర్యంగా నూతన మార్గాలు అవలంబించేవారికి వేదిక లభించింది. అజ్ఞాత రచయితలకు వూపిరి పోసింది. అలా వచ్చిన ప్రముఖులలో శారద ఒకరు. రవీంద్రనాథ్ ప్రోత్సాహంతో శారద పుంఖానుపుంఖంగా రాసి, రాణించాడు. శారద హోటల్‌లో వర్కర్ అని ఆనాడు చాలమందికి తెలియదు.

ఇతరులు వేయలేని, దమ్ములేవని ఒప్పుకున్న కథల్ని చలం పంపగా, అవి జ్యోతిలో చోటు చేసుకున్నాయి. ముఖాలు చూడకుండా, రచనలో పస చూచి ప్రచురించే సంప్రదాయాన్ని రవీంద్రనాథ్ జ్యోతిలో ప్రవేశపెట్టారు.

అన్నట్లు జ్యోతి పత్రికను ''రేషనలిస్ట్'' పత్రికగా రవీంద్రనాథ్ బాహాటంగా చాటారు. కథల పత్రికను అలా పేర్కొనడంలో ఆయన విశిష్టత వుంది. నెల్లూరు కేశవస్వామి కథలంటే రవీంద్రనాథ్‌కు ప్రత్యేకాభిమానం.

జ్యోతి పత్రిక కొన్ని రంగాలలో ఇతరులు చేయజాలని పాత్ర నిర్వహించింది. అందులో రేడియో ప్రసారాలను, దినపత్రికల నాయకత్వాన్ని నిశితంగా పరిశీలించడం గమనార్హం. ఆంధ్రప్రభ సంపాదకుడుగా నార్ల వెంకటేశ్వరరావు ఆనాడు అనేక విషయాలను తన సంపాదకీయాల ద్వారా నిర్దేశించేవారు. ఆయన సంపాదకీయాల కోసమే ఆంధ్రప్రభను చదివిన వారు లేక పోలేదు. అలాంటి సంపాదకీయాన్ని ఒకటి ఎన్నుకొని, జ్యోతి పత్రిక ఒక కార్టూన్ వేసి యిలా రాసింది:

ఇది బొక్కబెరడా
నార్ల సంపాదకీయమా?
చెప్పుకోండి చూద్దాం.

ఇది నార్ల అహంను బాగా దెబ్బ కొట్టింది. ఆయన బాధపడుతూ నా కుమారుడు వెంకట్ చనిపోయినప్పుడే యిలాంటిది నాపై రాయాలా అన్నారు. ఈ విషయం తెలిసి రవీంద్రనాథ్ మద్రాసు వెళ్ళి, కుమారుడు చనిపోయినట్లు తమకు తెలియదని, ఆనాడే తను కార్టూన్ రావడం యాదృచ్ఛికమని చెప్పి, సారీ అన్నారు.

కుటుంబ నియంత్రణ యింకా అమలులోకి రాని రోజులలో ముందుచూపుతో రాడికల్ హ్యూమనిస్ట్‌లో ఎలెన్‌రాయ్ వ్యాసం రాసింది. అది తెనిగించి జ్యోతి ప్రచురించింది. కుటుంబ నియంత్రణ వివాదాస్పదం గావడం జ్యోతి పత్రిక అనువాద వ్యాసం ద్వారానే సంభవించింది. నేడు అమలు జరగకపోయినా, అందరూ అంగీకరిస్తున్న అంశాన్ని ఆనాడే రవీంద్రనాథ్ హ్యూమనిస్ట్ దృక్పథంతో అందించారు.

రేడియో ప్రసారాలు నాటికీ నేటికీ గుత్తాధిపత్యంలోనే వున్నాయి. జ్యోతి పత్రిక నాటిని అంకుశం పెట్టి పొడిచింది. అందులో ఒక ఉదాహరణ కొప్పరపు సుబ్బారావు నాటక ప్రసారం. మృచ్ఛ కటికం నాటకాన్ని రేడియోవారు ప్రసారం చేయడంలోగల దోషాల్ని సమీక్షించిన జ్యోతి పత్రిక నాటి కేంద్రమంత్రి దివాకర్ వరకూ పోయింది. కొప్పరపు సుబ్బారావు రాసిన ఇనుప కచ్చడాలు నాటకం స్టేజి పై ప్రదర్శించడానికి తగిన సూచనలు రాస్తూ మార్జిన్‌లో విపులంగా ప్రచురించారు. సుబ్బారావు గారి మరణా నంతరం ఆయన భార్య సరోజిని కోరికపై రవీంద్రనాథ్, ఆ నాటకాన్ని పునర్ముద్రించి పెట్టారు. కొప్పరపు సుబ్బారావు మంచి మిత్రుడుగా రవీంద్రనాథ్‌కు సన్నిహితులే.

జ్యోతి పత్రికను రేషనలిస్ట్ పత్రికగా పేర్కొన్న రవీంద్రనాథ్ అందుకు తగ్గట్టుగా పత్రిక నడిపారు.

తెలంగాణా నుండి, ఆంధ్రలో అడ్రసులు తెలియని రచయితల నుండి వచ్చిన విషయాలను జాగ్రత్తగా పరిశీలించి ప్రచురించిన ఘనత జ్యోతి పత్రికదే.

ఇంతా చేస్తే ఆలపాటి రవీంద్రనాథ్ ఏమీ రాసేవాడు కాదని తెలిస్తే ఆశ్చర్యమేస్తుంది. ఆయన రాయించేవాడు. భావాలు చెప్పి, కథాకథనం నడిపించాల్సిన తీరు తెన్నులు సూచించి రాయించడమే గొప్ప కళ. రాసిందాన్ని చిత్రిక పట్టడం, అవసరమైన కత్తెర్లు వేయడం కుదించడం, ఎత్తుగడ చూడడం ఇవన్నీ సంపాదకుడుగా రవీంద్రనాథ్ చేశారు. ఇందుకుగాను నిరంతరం చదివేవారు. రవీంద్రనాథ్ ప్రియమైన పత్రిక అమెరికా నుండి వెలువడే టైం వార పత్రిక. అందులో రాజకీయాల నుండి సినిమా వరకూ సైన్స్ నుండి సెక్స్ వరకూ అతి సున్నితంగా, విప్పి చెప్పడం, ఆకర్షణీయమైన భాషలో పోగారితనంతో చెక్కడం చూడవచ్చు. అదే రవీంద్రనాథ్‌కు నచ్చిన అంశం. టైం చదవడం క్రమేణా అలవాటుగా మారి ఒక వారం చూడకపోతే ఏదో లోటుగా వుండేటంత వ్యసనంగా మారుతుందంటారు రవీంద్రనాథ్. టైం వలన ఏ విషయాన్నైనా చర్చించే సత్తా లభించిందని కూడా ఆయన చెబుతుండేవారు. టైంలో రివ్యూ అయిన పుస్తకాలు తెప్పించుకోవడం మరో గొప్ప అవకాశం. పత్రికలలో విశిష్టత, కొత్తదనం, మార్పులకు టైం మంచి అవకాశాన్నిచ్చింది.

దీనికి తోడు ఎం. ఎన్. రాయ్ ఆలోచనా స్రవంతిలోని శాస్త్రీయ ధోరణి రవీంద్రనాథ్‌ను అయస్కాంతంవలె పట్టేసింది. రాడికల్ హ్యూమనిస్టులలో రవీంద్రనాథ్ మెచ్చినవారు ఆవుల గోపాలకృష్ణమూర్తి, జి. వి. కృష్ణరావులు. ఆనాడు తాడికొండ గ్రామం నుండి ఉద్యోగ నిమిత్తం తెనాలి వచ్చిన రావూరి భరద్వాజ (తల్లిదండ్రులు పెట్టిన పేరు శరభాచారి?) కొన్నాళ్ళు రవీంద్రనాథ్ వద్ద పనిచేసి రాణించారు. ఎ. ఎల్. నరసింహారావు కూడా కొంత కాలం పని చేశారు.

ఆంధ్రలో సినిమారంగం ఎలా ప్రారంభమైనా సంస్కరణలకు పునర్వికాసానికి ప్రయత్నించినవారు గూడవల్లి రాంబ్రహ్మం మాత్రమే. ఎం. ఎన్. రాయ్ గురించి పత్రికలు ఏ వార్తా ప్రచురించని రోజులలో రాంబ్రహ్మం ఒక్కరే తన సమదర్శిని పత్రిక ద్వారా రాయిస్టుల ఆలోచనలకు చోటిచ్చాడు. మద్రాసు నుండి రూపవాణి పత్రిక సినిమా విశేషాలతో వెలువడేది. అలాంటి వాతావరణంలో రవీంద్రనాథ్ తెనాలి నుండి సినిమా పత్రిక నడిపి కొత్త దారులు, నూతన పద్ధతులు చూపారు. ఇది కూడా సాహసమే.

ఆంధ్రలో సెక్స్ విజ్ఞానాన్ని శాస్త్రీయంగా ప్రచురించడమేగాక, ఫ్రాయిడ్, హేవలాక్ ఎల్లిస్, మెస్మర్, యూంగ్, యాడ్లర్ వంటి వారి సిద్ధాంతాలను పరిచయం చేసిన ఆద్యుడు రవీంద్రనాథ్ మాత్రమే. అందుకు గాను రేరాణి పత్రిక పెట్టారు. ఆకర్షణీయమైన సెక్స్ రేఖా చిత్రాలను అట్టమీద వేయించి పాఠకుల సందేహాలను శాస్త్రీయంగా డాక్టర్ల ద్వారా తీరుస్తూ నడిపిన రేరాణికి విశిష్ట స్థానం వుంది. మాగాపు రామన్ మొత్తం చూచుకుంటూ, రవీంద్రనాథ్ చెప్పినట్లు నడిపించాడు.

ధనికొండ హనుమంతరావు రేరాణిలో మానేసి అభిసారిక పత్రిక పెట్టారు.

సెక్స్ ప్రచురణల విషయంలో రవీంద్రనాథ్ కృషి తెలుగులో అనితర సాధ్యం. బహుశ సెక్స్ భావాలలో చలంకు దక్కిన ఘనత, సెక్స్ పత్రికారంగంలో రవీంద్రనాథ్‌కు చెందాలి.

అలాంటి తెనాలి పత్రికా ప్రపంచం వరవడి కాస్తా ఉమ్మడి మద్రాసు నుండి ఆంధ్ర ఏర్పడంతో ఆగింది. కర్నూలు రాజధానిగా తాత్కాలిక ఏర్పాట్లు జరిగినప్పుడు, మళ్ళీ ప్రెస్‌కు పని చెప్పుకునే నిమిత్తం రవీంద్రనాథ్ కర్నూలు వెళ్ళవలసి వచ్చింది. కాని మద్రాసు నచ్చినంతగా ఆయనకు కర్నూలు నచ్చలేదు. పత్రికలు కొనసాగించడం కుదరలేదు. అచిరకాలంలోనే ఆంధ్రప్రదేశ్ ఏర్పడి, రాజధాని హైదరాబాద్‌కు మారడంతో రవీంద్రనాథ్ కూడా తన ప్రెస్‌ను రాజధానికి తరలించారు. పత్రికలు ఆగిపోయి, చరిత్రలో భాగం అయ్యాయి. లోగడ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు రవీంద్రనాథ్ వైట్ హాల్‌లో వుండేవారు. అక్కడ నాయుడు మంచి రుచులతో భోజనాలు ఏర్పాటు చేసేవారు. ఆ విధంగా రవీంద్రనాథ్‌కు హైదరాబాద్ కొత్తేమీ కాదు.

సిగరెట్లు, విస్కీ, టెన్నిస్ రవీంద్రనాథ్ నిత్యావసరాలు. హైదరాబాద్‌లో ఒకసారి గుండె పోటు రాగా ఆరోగ్య నియమాలు కట్టుదిట్టం చేసుకున్నారు. అయినా చాలాకాలం సిగరెట్లు తాగి, చివరలో డాక్టర్ల సలహాపై మానేశారు. విస్కీ కూడా తగ్గించారు. ఓపిక వున్నంతకాలం సొంతంగా కారు డ్రైవ్ చేసుకుంటూపోయి, టెన్నిస్ ఆడేవారు.

బౌద్ధం

రవీంద్రనాథ్ బౌద్ధతత్వ ప్రియుడు. బౌద్ధంపై చాలా గ్రంథాలు, కొన్ని అరుదైనవి సేకరించి చదివారు, చదివించారు. సిలోన్ నుండి కొన్ని గ్రంథాలు తెప్పించారు. బుద్ధుని గొప్ప తాత్వికుడుగా, చింతనాపరుడిగా, నీతి మంతుడిగా ఆయన భావించారు. బుద్ధుడు చెప్పిన కొన్ని విషయాలు ఎప్పుడూ ఉదహరిస్తుండేవారు. భిక్షకు వెళ్ళినప్పుడు ఏది ఇచ్చినా అది స్వీకరించాలేగాని, ఫలానిది కావాలనో, ఇచ్చింది వద్దనో అనరాదని బుద్ధుడు భిక్షువులతో చెప్పాడట. ఆ మేరకు పందిమాంసం వండి పెట్టినా భిక్షువులు స్వీకరించవలసిందే. బోధకులు స్థానిక భాషను తప్పనిసరిగా నేర్వాలని, కొంచెం వైద్యం వస్తే మంచిదని బుద్ధుడు భావించాడు. అందువలన ప్రజలలోకి చొచ్చుక పోడానికి బాగా ఉపకరిస్తుందని ఆయన ఉద్దేశాలు ఇవి రవీంద్రనాథ్‌కు నచ్చిన అంశాలు.

బౌద్ధంపై సుజుకి, రైస్ డేవిస్, ఎరిక్‌ఫ్రాం, ఎం. ఎన్. రాయ్ వ్యాఖ్యలు రవీంద్రనాథ్‌కు నచ్చాయి. ఆధునిక బౌద్ధ చింతనా పరిణామాలతో ఆయన ఎప్పటికప్పుడు పరిచయం చేసుకుంటుండేవాడు.

హైదరాబాద్‌లో

ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుండీ చనిపోయేవరకూ రవీంద్రనాథ్ హైదరాబాదులో వున్నారు. జ్యోతి ప్రెస్ ప్రధాన వ్యాపకంగా వుండేది. ప్రభుత్వ పాఠ్యగ్రంథాల స్థానే, రైల్వే పనులు, తెలుగు అకాడమీ పుస్తకాలు అచ్చువేసేవారు.

హైదరాబాద్‌లో నియమబద్ధ జీవితం గడిపిన రవీంద్రనాథ్ ప్రింటర్స్ అసోసియేషన్‌లో చురుకుగా పాల్గొన్నారు. అఖిల భారత సమావేశాలలో చర్చలు జరపడానికి కేరళ వెళ్ళారు.

ప్రతి రోజూ ఉదయం నుండి 12 గంటల వరకూ ప్రెస్‌లో వుంటూ మధ్యాహ్నం నుండి ప్రెస్‌కు వచ్చేవారు కాదు. రవీంద్రనాథ్‌కు చాలా కాలంగా ప్రెస్ పనులు చూచిపెట్టిన వ్యక్తి శర్మ. తరువాత వేరే ప్రెస్ పెట్టుకున్నారు. రవీంద్రనాథ్ కుమారులు చేతికంది వచ్చేవరకూ శర్మ వున్నారు.

సాయంత్రం హైదరాబాద్ ఫతే మైదాన్‌లో టెన్నిస్ ఆడడం, చూడడం, మిత్రులతో గడపడం రవీంద్రనాథ్ నిత్య కృత్యాలలో భాగం. అక్కడ జస్టిస్ జయచంద్రారెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి సదాశివరెడ్డి, బెజవాడ కృష్ణారెడ్డి మొదలైన వారితో టెన్నిస్ ఆటవిడుపు చర్చలు చేస్తుండేవారు. టెన్నిస్ టోర్నమెంట్లు, ముఖ్యంగా వింబుల్‌డన్ తప్పనిసరిగా చూసేవారు. టెన్నిస్‌ను దైనందిన శారీరక వ్యాయామంగా రవీంద్రనాథ్ పాటించేవారు.

హైదరాబాద్‌లోని ఫతే మైదాన్ క్లబ్, సికింద్రాబాద్ క్లబ్, రేస్ క్లబ్‌లలో సభ్యుడుగా రవీంద్రనాథ్ వుండేవారు. రేసుల సీజన్‌లో వెళ్ళి చూసేవారే గాని పందాలు కట్టి ఆడేవారు కాదు. సికింద్రాబాద్ క్లబ్‌లోని గ్రంథాలయం, మాగజైన్ సెక్షన్ అంటే ఆయనకు యిష్టం.

సినిమాలు ఎంపిక చేసుకొని వెళ్ళడం రవీంద్రనాథ్ అభిరుచులలో పేర్కొనదగిన అంశం. మాక్స్‌ముల్లర్ భవన్‌లో జర్మన్, అలయన్స్ ఫ్రాన్సిస్‌లో ఫ్రెంచి సినిమాలు, సారధి స్టుడియోస్‌లో ఉత్తమ భారతీయ భాషల, ఇంగ్లీషు అవార్డు పిక్చర్స్ చూసేవారు.

పుస్తక ప్రదర్శనలకు వెళ్ళడం, నచ్చిన పుస్తకం కొని తన లైబ్రరీకి చేర్చడం రవీంద్రనాథ్ చేసిన మరో మంచిపని.

హైదరాబాద్‌లో అనేకమంది మిత్రులతో, కొత్తవారితో గడిపి తన మానసిక పరిధిని పరిణతం చేసుకోవడం కూడా రవీంద్రనాథ్‌కు అలవాటుగా వుండేది. అలా కలిసిన వారిలో అబ్బూరి రామకృష్ణారావు ఒకరు. సాయంత్రాలు ఆయన యింటికి వెళ్ళి కారెక్కించుకొని, అబ్బూరి వారిని క్లబ్‌కు తీసుకెళ్ళి రెండు పెగ్గుల విస్కీతో కాలక్షేపం చేయడం బాగా వుండేది. నేను విధిగా ఆ త్రయంలో వుండేవాడిని. అప్పుడు రామకృష్ణారావుగారు తన అనుభవాలు, ఎం. ఎన్. రాయ్‌తో తాను గడిపిన రోజులు, పురాణాలలో నీతి పేర జరిగిన బూతు, ఇంకెన్నో చెప్పి, నవ్వించేవారు. అలా బయటకు పోవడం, మాతో గడపడం తరచు కావాలని అబ్బూరి వారు కోరుకునేవారు. కాని ఆయన శ్రీమతి ఆరోగ్య నియమాల రీత్యా అభ్యంతర పెట్టేది. ఆమెకు నచ్చచెప్పి అబ్బూరి వారిని ఎలాగో బయటకు తీసుకురావడం రవీంద్రనాథ్‌కే చెల్లింది. అది చాలా చిరస్మరణీయ అనుభూతి.

అనేకమంది ప్రముఖ రాడికల్ హ్యూమనిస్టులు హైదరాబాద్ వచ్చినప్పుడు సాయంకాలాలు రవీంద్రనాథ్‌తో గడిపిన సందర్భాలు కూడా గొప్ప సన్నివేశాలు. రాడికల్ హ్యూమనిస్ట్ రేషనలిస్ట్ సభలు సమావేశాలకు రవీంద్రనాథ్ వచ్చేవారు కాదు. కాని అందులో పాల్గొనడానికి వచ్చిన వారిని వ్యక్తిగతంగా కలవడం వలన ఆయన తన మనో వికాసాన్ని బాగా పెంచుకోగలిగారు. అలా

కలసిన వారిలో వి. ఎం. తార్కుండే, శిబ్‌నారాయణ్‌రే, ఎ.బి. షా, సి.టి. కర్నిక్ ఎన్నదగినవారు. తాను చెప్పదలచింది ఇంగ్లీషులో కొంచెం నట్టుతూనే రవీంద్రనాథ్ ఆవతల వారికి అర్థమయ్యేట్లు చెప్పేవారు. పైగా మెప్పించేవారు. ఆయన ప్రశ్నల్ని, జిజ్ఞాసని ఎ.బి. షా, శిబ్ నారాయణరే మెచ్చుకున్నారు. సాధారణంగా రెండు పెగ్గుల విస్కీ, అనంతరం విందు, మధ్యలో రసవత్తర చర్చలు హాయిగా గడచి పోయేవి. వీటన్నిటిల్లో నేను సంధానకర్తగా వుండేవాడిని. అప్పుడు ఫొటోలు ఎందుకు తీసుకోలేదా అని యిప్పుడు నేను విచారించి ఏం లాభం!

రవీంద్రనాథ్‌తో చర్చలు జరుపుతూ విందు సమావేశాలలో పాల్గొన్నవారిలో సి. నారాయణ రెడ్డి, జి. రాంరెడ్డి, ఎన్. యాదగిరిరెడ్డి, కె. శేషాద్రి, భవనం వెంకట్రాం, బి. రత్నసభాపతి, ఎం.ఆర్. పాయ్, సంజీవదేవ్ వున్నారు.

సంజీవదేవ్‌ను ఒకసారి ఆట పట్టించాలని, ఆయనతో విస్కీ తాగించాలని ప్రయత్నించి సఫలమయ్యాం. తాగకూడదనే పట్టుదల తనకు లేదని, కాగా తనకు అలవాటు లేదని సంజీవదేవ్ అన్నారు. అయితే మా తృప్తికోసం లాంఛనంగా తీసుకోమంటే ఆయన నిరభ్యంతరంగా అంటూ రెండు పెగ్గులు సేవించడం గొప్ప విశేషం. సంజీవదేవ్‌తో చర్చలు చాలా ఆసక్తియుతంగా సాగేవి. రవీంద్రనాథ్ గారితో ఆ విధంగా సాయంకాలాలు గడిపిన అనేకమంది రచయితలు, కవులు, కళాకారులు వున్నారు. అలాంటి మధురానుభూతులలో కొంగర జగ్గయ్య తాను రాసిన శృంగార చాటువులు వినిపించడం మరువరాని ఘట్టాలు.

డి.వి. నరసరాజును ఉషాకిరణ్ గెస్ట్ హౌస్‌లో అప్పుడప్పుడూ కలిసి కబుర్లు చెప్పుకోవడం రికార్డు చేస్తే బాగుండేదనిపిస్తోంది ఇప్పుడు!

నార్ల వెంకటేశ్వరరావుగారు అప్పుడప్పుడు జ్యోతి ప్రెస్‌కు వచ్చి కూర్చోవడం, మరికొన్ని సార్లు రవీంద్రనాథ్ ఆయన ఇంటికి వెళ్ళి గంటల తరబడి కాలక్షేపం చేయడం గొప్ప సన్నివేశాలుగా నేను పరిగణిస్తాను. నార్లగారు తన అనుభవాలు ఎన్ని చెప్పారో, ప్రపంచ పర్యటన విశేషాలు ఎన్ని విప్పిచూపారో మరి. ఒకప్పుడు నార్లను విమర్శించిన రవీంద్రనాథ్, ఇతర హ్యూమనిస్టులు ఆయనకు సన్నిహితులు కావడానికి కొంత కథ నడచింది.

ఎం.ఎన్. రాయ్ చనిపోయినప్పుడు ఆంధ్రప్రభలో నార్ల సంపాదకీయంలో ఆ విషయం ప్రస్తావించలేదు. దేశంలో ప్రధాన పత్రికలన్నీ రాశాయి. గుంటూరు ఏకాదండయ్య పంతులు హాలులో జరిగిన సమావేశంలో ఆవుల గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ ''ఎవడో బొంపాయి చనిపోతే, వటవృక్షం కూలింది, తార రాలింది'' అని రాసే నార్లకు ఎం.ఎన్. రాయ్ చనిపోతే, కనీసం ప్రస్తావించే ఇంగిత జ్ఞానం లేదా అన్నాడు. ఈ విషయాన్ని యథాతథంగా రిపోర్టర్ సోమయాజులు నార్లకు అందించాడు. నార్లకు అది బాగా తగిలింది. వెంటనే రవీంద్రనాథ్, గుత్తికొండ నరహరి, జి.వి. కృష్ణరావుల ద్వారా ఎం.ఎన్. రాయ్ పుస్తకాలు తెప్పించుకున్నారు. చదివి మరుసటేడు రాయ్‌పై సంపాదకీయం రాశారు. అప్పటి నుండీ క్రమేణా నార్ల హ్యూమనిస్టుగా రూపొందారు.

రవీంద్రనాథ్ వద్ద వుండే మంచి పుస్తకాలు తీసుకెళ్ళి చదివి యివ్వడం, నార్లకు ఒక ఆనవాయితీగా వుండేది. నార్లకు ఆంధ్రజ్యోతి మేనేజర్ కె. ఎల్. ఎన్. ప్రసాద్‌కూ భగ్గున మండిపోయే తగాదాలు వచ్చినా, రవీంద్రనాథ్ ఉభయులతో తన స్నేహాన్ని అట్టిపెట్టుకున్నారు. ప్రతి సంవత్సరం డిసెంబరు 1న కె. ఎల్. ఎన్. ప్రసాద్ పుట్టిన రోజు యింటికి వెళ్ళి రవీంద్రనాథ్ అభినందనలు తెలిపే వారు. నార్ల - కె. ఎల్. ఎన్. ప్రసాద్ తగాదాలో చాలా మంది యిబ్బంది పడినా, రవీంద్రనాథ్ యీ విషయంలో వ్యక్తిగత స్నేహానికీ, పత్రికాముఖంగా వచ్చిన తగాదాకు ముడిపెట్టకుండా వుండగలిగారు.

రవీంద్రనాథ్ మాగజైన్లు, పుస్తకాలు చదవడం బాగా అలవాటుగా మార్చుకున్నారు. తెనాలి రోజులలో అలవాటైన టైం వారపత్రిక జీవితాంతం కొనసాగింది. హైదరాబాద్ వచ్చిన తరువాత ఎన్‌కౌంటర్ (ఇంగ్లాండ్ మాస పత్రిక), సైకాలజి టుడే (అమెరికా మాసపత్రిక), క్వెస్ట్, న్యూక్వెస్ట్, శంకర్స్ వీక్లీ చదివేవారు. పుస్తకాలలో ఆయన్ను ప్రభావితం చేసినవి బౌద్ధసాహిత్యం, ఎం. ఎన్. రాయ్ మానవవాదం, ఎరిక్ ఫ్రాం, సుజికి, ఆర్థర్ కోస్లర్, ఎరిక్ ఎరిక్‌సన్ (గాంధీస్ ట్రూత్), విల్ డ్యురాంట్ (స్టోరీ ఆఫ్ సివిలైజేషన్), మాస్టర్స్ అండ్ జాన్సన్, పాల్‌జాన్సన్, శరత్, టాగోర్, కమలా మార్కండేయ, కుష్వంత్‌సింగ్, నయ్‌పాల్ వున్నారు. విక్రం సేథ్ రాసిన ది సూటబుల్ బోయ్ వంటివి చివరి రోజులలో చూసేరు. తెలుగు నవలాకారుల, సీరియస్ రచయితల ధోరణులు నిరంతరం పట్టించుకున్నారు. సి. నరసింహారావు రాసిన వ్యక్తిత్వ వికాసం, రవిచంద్ రచనలు, డి. ఆంజనేయులు సాహిత్య వ్యాసాలు ఎప్పటికప్పుడు గమనించాడు. ఎక్కడ పలుకువున్నా పట్టేసే గుణం రవీంద్రనాథ్‌ది.

హైదరాబాద్ నుండి కొన్నాళ్ళపాటు రవీంద్రనాథ్ విజయవాడ వెళ్ళి ప్రజాశక్తినగర్‌లో ఇల్లు నిర్మించుకొని వున్నారు. విజయవాడలో ఆయనకు సన్నిహిత మిత్రులు బాజీ (లీలామహల్ యజమాని), కృష్ణమూర్తి (బుజ్జులు). బాజీగారు ఎప్పుడూ ఇంగ్లీషు సినిమాలు ఆడించేవారు. లీలామహల్ వెనుక ఆయన అతిథి గృహంలో మంచివంటలు చేయించి రవీంద్రనాథ్‌తో కబుర్లు చెప్పేవారు. బుజ్జులు (చెన్నుపాటి కృష్ణమూర్తి బస్సుల యజమాని) చదువు కోలేదుగాని మంచి అతిథి. ఆయన కూడా రవీంద్రనాథ్‌కు ఎప్పుడూ కబుర్లు చెబుతూ గడిపేవారు. వీరుగాక విజయవాడలో రచయితలు, కవులు, కళాకారులు రవీంద్రనాథ్ చర్చా బృందంలో వుండేవారు.

రవీంద్ర కుమార్తె దుర్గ పెళ్ళి నన్నపనేని చౌదరితో విజయవాడలోని మాంటిస్సోరి స్కూలులో (కోటేశ్వరమ్మ స్కూలులో) జరిగింది. పెళ్ళి అయిన తరువాత దుర్గ అమెరికా వెళ్ళింది. రవీంద్రనాథ్ అమెరికా ప్రయాణానికి అదొక్కటే కారణం గాకపోయినా, పురికొల్పిన అంశం అనవచ్చు. అమెరికా గురించి చాలా విషయాలు తెలుసుకున్న రవీంద్రనాథ్ ఎట్టకేలకు అమెరికా పయనించారు. అమెరికా వెళ్ళినట్లే వెళ్ళి తొందరగా తిరిగొచ్చేశారు. అదేమిటంటే ఎక్కడికెళ్ళినా ఒకే తీరు కనిపించి, బోరు అనిపించిందన్నారు. న్యూజెర్సీ నుండి రోజూ బస్సెక్కి న్యూయార్క్ టైమ్ స్క్వేర్‌కు పయనించేవారు. బస్సు చార్జి ఒక డాలరు. కొన్నాళ్ళ తరువాత ఫ్లోరిడా రాష్ట్రంలో మయామి బీచ్‌కి వెళ్ళి గడిపివచ్చారు. మొత్తంమీద అమెరికా ప్రయాణం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సాగినా చూడవలసింది చాలా వదిలేసి వచ్చేశారు.

రవీంద్రనాథ్ నేనూ కలసి మద్రాసు, బెంగుళూరు కొన్నిసార్లు ప్రయాణం చేశాం. మద్రాసులో డి. ఆంజనేయులు గారిని తప్పనిసరిగా కలసి చర్చలు జరిపేవాళ్ళం. ఒకసారి మైలాపూరులోని పాలగుమ్మి పద్మరాజు గారింటికి వెళ్ళాం. ఆయన ఉయ్యాలపై కూర్చొని, మమ్మల్ని ఆహ్వానించారు. ఇంట్లో సందడిగా వుంది. ఆడవాళ్ళు ఏదో వ్రతం చేసుకుంటున్నారని సిగ్గుపడిపోయినట్లు చెప్పారు. మేము అదేమీ పట్టించుకోనట్లు పిచ్చాపాటి మాట్లాడి వచ్చేశాము. రాడికల్ హ్యూమనిస్ట్‌గా పాలగుమ్మి పద్మరాజు ''రెండో అశోకుడి మూణ్ణాళ్ళ ముచ్చట'' నవల రాశారు. పార్టీ రహిత ప్రజాస్వామ్యం గురించి చర్చించారు. ఆయన రాసిన గాలివాన కథకు ప్రపంచ కథానికల పోటీలో బహుమతి వచ్చింది. మేము ఆయనింట్లో జరిగే తంతుమావి ఏమనుకున్నామోనని అలా ముడుచుకుపోయారు.

డి. ఆంజనేయులుగారు సుందవల్లి స్ట్రీట్‌లో వుండేవారు. వారి ఏకైక పుత్రిక శాంతిశ్రీ యిప్పుడు పూనాలో పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్. వారితో ఎన్నో విషయాలు చర్చించేవాళ్ళం. శాంతిశ్రీ చాలా చురుకైన, తెలివైన వక్తకూడా. ప్రపంచంలో చాలా దేశాలు పర్యటించింది. ఆమె వాగ్ధోరణిని రవీంద్రనాథ్ మెచ్చుకునేవారు.

హైదరాబాద్‌లో నేనూ, డి. శేషగిరిరావు, రవీంద్రనాథ్ ఎక్కడికెళ్ళినా కలిసి వుండేవాళ్ళం. అందుకని మమ్మల్ని త్రిమస్కటీర్స్ అని కూడా మిత్ర బృందం పిలిచేది. హైదరాబాద్ పాత బస్తీలో కానాబాగ్‌లో కొసరాజు సాంబశివరావు ఒక్కడే పెద్ద యిల్లు తీసుకుని వంటవాడిని పెట్టుకుని వుండేవాడు. అక్కడికెళ్ళి విందులు, విస్కీ ఆరగించి కబుర్లు చెప్పుకునేవాళ్ళం. పర్వతనేని కోటేశ్వర్‌రావు (పోలీస్ ఆఫీసర్) ఎప్పుడైనా మాతో కలిసేవారు, ఒక్కొక్కప్పుడు ధర్మరాజు (ఇంజనీర్) వచ్చి చేరేవారు. కొసరాజు సాంబశివరావు ద్వారానే రవీంద్రనాథ్‌గారి విషయాలు అనేకం నేను తెలుసుకున్నాను. ఆయన ఎం.ఎన్. రాయ్‌కు సన్నిహితవ్యక్తి; రాయ్ అభిమాని. పాత సంగతులు ఎన్నో చెప్పేవారు. అలాగే మేమంతా సింధనూరు వెళ్ళి సాసారావు గారి పత్తిచేలు చూసి సంతోషించాం. సాసారావుగారు అభ్యుదయ రైతు, పత్తాటిన గుజ్జర్ సుఖాడియా (రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి) ఆయన వేలకు వచ్చి మాట్లాడేవారు. అలా ఒకసారి మేమూ కలిశాం. సాపారావు బాపట్ల తాలూకా వాసి. జయప్రకాశ్‌నారాయణ (లోక్‌సత్తా నాయకుడు) మామగారే సాపారావు. కొన్నాళ్ళు జనతాపార్టీలో బెంగుళూరులో ఆయన పనిచేశారు.

హైదరాబాద్‌లో ఒకసారి పార్కిన్‌సన్ లెక్చర్లు అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీలో ఏర్పాటు చేశారు. అలాగే సుప్రసిద్ధ అమెరికా కార్డియాలజిస్టు కూలే (Cooley) ఉపన్యాసాలు ఒకోలో ఆరుబయట ఏర్పాటు చేశారు. వీటికి మేము వెళ్ళి ఎంత ఆనందించామో చెప్పలేను. వీటిపై రవీంధ్రనాథ్ ప్రత్యేక ఆసక్తి చూపారు. దక్షిణాఫ్రికాలో బెర్నార్డ్ తొలి హార్ట్ ఆపరేషన్ జరిపి విప్లవం సృష్టించినప్పటి నుండీ, ఆ విషయంలో రవీంద్రనాథ్ నిపుణుడుగా తయారయ్యాడు!.

రవీంద్రనాథ్‌తో హైదరాబాద్‌లో తరచుకలిసిన మిత్రులలో బూదరాజురాధాకృష్ణ, తాళ్ళూరి నాగేశ్వరరావు, రావూరి భరద్వాజ, సి. ధర్మారావు, అశ్వనీకుమార్ (విజయవాడ), ఎ.ఎల్. నరసింహారావు, మహారాజశ్రీ వున్నారు. అధికార అనధికారు లెందరో ఆయనకు సన్నిహితులు.

యువభారతి నిర్వహించిన సాహితీ సభలకు, ఎం.ఆర్.కృష్ణ నిర్వహించిన వీధి స్టేజి నాటకం, కన్యాశుల్కం, రవీంద్రభారతిలో ఉత్తమ కార్యక్రమాలు, సంయుక్త ఒడెస్సి నృత్యం, మంచి కళా ప్రదర్శనలు సందర్శించడం, రేడియోలో రొమిలాథాపర్ చేసిన ప్రసంగాలు వినడం రవీంద్రనాథ్ అభిరుచులకు ఉదాహరణలు. పాత లైబ్రరీలు ఎవరైనా వ్యక్తులు అమ్మేస్తుంటే వాటిల్లో తనకు నచ్చిన వాటిని ఎంత ధరైనా యిచ్చి కొన్న సందర్భాలున్నాయి.

రాను రాను టైం పత్రిక మత్తుకు విరుగుడుగా న్యూస్‌వీక్ కూడా చదవడం మొదలెట్టి, ఇన్నాళ్ళు తనను టైం ఎలా ప్రభావితం చేసిందీ చెప్పేవాడు. రెండు పత్రికల్నీ సమానంగా ఆదరించే స్థితికి చివరలో చేరారు. అది కూడా విశేషమే.

వయస్సు మీదపడుతూండగా ప్రెస్ బాధ్యతల్ని కుమారులకు అప్పగించి, తాను విశ్రాంతిగా తన అలవాట్లను కొనసాగించడం రవీంద్రనాథ్ చేసిన మార్పు. ముందు వెంకట్ (రెండోకుమారుడు) ప్రెస్ పని చూశారు. ఆయనకు ఇరువురు పిల్లలు. బాగా చేతికొచ్చిన కుమారుడు చనిపోవడం రవీంద్రనాథ్‌కు షాక్‌గానే వుండేది.

మూడోకుమారుడు దేవ్ ఎయిర్ ఇండియాలో పనిచేస్తూ ప్రెస్ రంగంలోకి వచ్చారు. నాలుగో కుమారుడు బాపన్న కూడా ప్రెస్ రంగంలో అడుగుపెట్టడంతో రవీంద్రనాథ్ పూర్తిగా విశ్రాంతి తీసుకోగలిగారు. చివరి కుమారుడు సత్యదేవ్ అమెరికాలో హోటల్ వ్యాపారాలు జయప్రదంగా నిర్వహించి ఇండియాలో వుంటున్నారు.

అలాంటి దశలో రవీంద్రనాథ్ అనుభవాలకు గత స్మృతులకు, ఆలోచనలకు ఆయుధంగా మిసిమి రూపకల్పన చేసుకుంది. ఆ విషయం ఎలాగో చూద్దాం.

''మిసిమి కథా కమామిషు''

''మిసిమి'' పక్షపత్రికగా ఆరంభమై నాలుగు సంచికల తరువాత మాస పత్రికగా మారింది.

జ్యోతిప్రెస్‌కు విదేశాల నుండి మంచి నాణ్యమైన కాగితం తెప్పించాలంటే, పత్రిక పేరిట కోటా సాధ్యమనే తలంపుతో పక్షపత్రికను ఆరంభించారు. పత్రికకు తగిన మేటర్ ఎలా అని రవీంద్రనాథ్ నన్ను అడిగితే, నేను సహాయపడతానని చెప్పాను. ''సుభాష్ చంద్రబోసు గెలిస్తే ఏమయ్యేది'' అనే నా సుదీర్ఘ పరిశోధనాత్మక వ్యాసంతో తొలి మిసిమి సంచిక ఆరంభమైంది. ఎం.వి. రామమూర్తి మరొకటి రాశారు. నాలుగు సంచికలు వచ్చేసరికి, పత్రిక ఆపేయాలా, కొనసాగించాలా అనే చర్చ వచ్చింది. రవీంద్రనాథ్ కుమారులు ఆయన్ను ప్రోత్సహించి, కాలక్షేపంగా వుంటుంది, అచ్చు యిబ్బందిలేదు గనుక సంచిక ఆపరాదన్నారు. ఆ విధంగా మిసిమి నిలదొక్కుకొని మాసపత్రికగా తలెత్తింది. రవీంద్రనాథ్ తన పూర్తి కాలాన్ని పత్రికకు వినియోగించారు.

రవీంద్రనాథ్ క్రమేణా మిసిమిని ఒక ప్రామాణిక పత్రికగా రూపురేఖలు దిద్దారు. ఫోన్లు చేసి వ్యాసాలు రాయించడం, స్టేట్స్‌మన్, టైం పత్రికలలో వచ్చిన సమాచారం ఆధారంగా చక్కని

శీర్షికలు రాయించారు. ఇంగ్లీషు కొటేషన్లు ఎంపిక చేశారు. సుప్రసిద్ధ మానవవాది ఏంబ్రోస్ రాసిన డెవిల్స్ డిక్షనరీ వరుసగా మిసిమి ప్రచురించింది. విక్రంసేథ్ రాసిన ''ఏ సూటబుల్ బోయ్'' కొని వి. కోమలచే విపులమైన రివ్యూ వ్యాసం రాయించారు. మిసిమి కోసం అలా మార్కెట్‌లో అధునాతన సాహిత్యం కొనడం రవీంద్రనాథ్ కార్యకలాపాలలో భాగమైంది. ప్రాచీన ఆధునిక సాహిత్యాలు అన్వేషించడం దైనందిన విషయంగా మారింది. ఫోనులో ఎందరో వ్యక్తులను వివిధ అంశాలపై నిర్విరామంగా సంప్రదించి మిసిమిని బాగా పెంపొందించే కార్యక్రమం చేబట్టారు. ఆ విధంగా మిసిమికి ఒక వ్యక్తిత్వాన్ని కల్పించారు. రానురాను విజ్ఞుల దృష్టి పడింది. లైబ్రరీలు మిసిమి తెప్పించడం మొదలెట్టాయి.

మేధావుల మెతకలు

టైం పత్రికలో పాల్‌జాన్సన్ పుస్తకం ''ఇంటలెక్చువల్స్'' పై పెద్ద రివ్యూ వచ్చింది. అది చూసి పుస్తకం తెప్పించాడు. నాకిచ్చి చూడమన్నారు. నేను ఆ గ్రంథంలో వచ్చిన కొత్త విశేషాల దృష్ట్యా కొన్నిటిని అందించవచ్చని సూచించాను. రవీంద్రనాథ్ నేనూ ఆలోచించి, తెనాలిలో వుంటున్న అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డిగారైతే బాగుంటుందని అనుకున్నాం. రవీంద్రనాథ్ వెంటనే తెనాలి ఫోను చేసి, పుస్తకం పంపగా, వెంకటేశ్వరరెడ్డి కొన్ని శీర్షికలు ఎంపిక చేసి, సీరియల్‌గా రాశారు. మన పాఠకులకు అంతగా ఆసక్తి వుండబోదనుకున్నవాటిని వదలేశారు. పాశ్చాత్య ప్రపంచంలో పాల్‌జాన్సన్ పుస్తకం సంచలనం సృష్టించగా, ఆ విషయాలను అందించిన మిసిమి పాఠకులకు కొత్త పోకడలు చూపింది. జాన్సన్ ఆధారంగా రాసిన మేధావుల మెతకలు ఆ తరువాత వెంకటేశ్వర రెడ్డి పుస్తకంగా వెలువరించారు. మిసిమి ప్రచురించిన వాటిలో అది ప్రాశస్త్యం పొందింది.

మధురవాణి ఇంటర్వ్యూలు

పురాణం సుబ్రహ్మణ్య శర్మ ఆంధ్రజ్యోతి నుండి రిటైర్ అయి హైదరాబాద్‌లో వుంటున్నారు. ఆయనచే మిసిమికి ఏదైనా రాయించాలని నేనూ రవీంద్రనాథ్ అనుకుని అశోక్‌నగర్ అపార్ట్‌మెంట్స్‌లో వుంటున్న పురాణంను కలిశాం. చర్చల సందర్భంగా తలవని తలంపుగా రవీంద్రనాథ్ ఒక సూచన చేస్తూ మధురవాణి చేత గురజాడను ఇంటర్వ్యూ చేయిస్తే ఎలా వుంటుందన్నారు. వెంటనే పురాణం అందుకొని అలాంటి సూచన తానెక్కడో చదివినట్లు జ్ఞాపకం అన్నారు. మధురవాణి చేత కవుల్ని, పెద్ద రచయితల్ని ఇంటర్వ్యూ చేయిస్తే బాగుంటుందన్నారు. ఆ విధంగా సీరియల్ రాయడానికి పురాణం అంగీకరించారు.

పురాణం రాసిన ప్రతి ఇంటర్వ్యూకు రవీంద్రనాథ్ చిత్రిక పట్టారు. పురాణానికి కళ్ళాలు, పగ్గాలు వేశారు. కొంత సెన్సార్ చేశారు. పదాలు దిద్దారు, కొట్టేశారు, మార్పులు చేర్పులు సూచించారు. ఆశ్చర్యమేమంటే, పురాణం వాటన్నిటినీ అంగీకరించడం! నార్ల వెంకటేశ్వరరావు పై రాస్తున్నప్పుడు కె. ఎల్. ఎన్. ప్రసాద్‌తో జరిగిన వ్యక్తిగత సంఘర్షణ ప్రస్తావన మోతాదు మించకుండా రవీంద్రనాథ్ జాగ్రత్త వహించారు. త్రిపురనేని రామస్వామి చౌదరిపై దూకుడుగా రాసిన కుల ప్రస్తావనకు పాలిష్ పెట్టారు.

సమకాలీనులపై రాయడానికి పురాణం ఉపక్రమించినప్పుడు రవీంద్రనాథ్ వద్దని ఆపేశారు. సంపాదకుడుగా ఆయన చేసిన కృషి యీ వ్యాసాల ప్రచురణలో ప్రశంసనీయం. ప్రతి ఘట్టంలోనూ నేను వుండడం వలన, రవీంద్రనాథ్ సంయమనం గమనించాను. పురాణం దగ్గరకు వెళ్ళి తాను ఎలా మార్పులు చేర్పులు చేసిందీ, ఎందుకు అలా చేయవలసివచ్చిందీ చెప్పి, ఆయన ఒప్పుకున్న తర్వాతనే ప్రచురించారు. ఆ విధంగా మధురవాణి ఇంటర్వ్యూల వెనుక గాథ నడిచింది. మిసిమి వ్యాసాలలో దీనికి బాగా పాపులారిటీ వచ్చింది. మిసిమిలో వ్యాసాల కోసం రవీంద్రనాథ్ మనస్సు పెట్టి, అదే తన జీవిత లక్ష్యంగా పని చేశారు. అందుకు తగ్గ గుర్తింపు కూడా సమకాలీనుల నుండి వచ్చింది. కొందరి వ్యాసాలు వెయ్యకపోవడం, వారిచే దెప్పిపొడుపులు స్వీకరించడం సంపాదకుడిగా ఆయనకు తప్పలేదు.

సంజీవదేవ్ తనంతట తానుగా వ్యాసాలు రాసి మిసిమికి పంపారు. సాధారణంగా అడగనిదే ఆయన రాయరు. అలాంటి వ్యక్తి అడగకుండా వ్యాసాలు రాయడం మిసిమి పట్ల ఆయన అభిప్రాయానికి గీటురాయి.

రవిచంద్ పరిశోధనా వ్యాసాలపట్ల రవీంద్రనాథ్ ప్రత్యేక ఆసక్తి కనబరచాడు. లోతైన పరిశీలన, కొత్త కోణాలు రవిచంద్ వ్యాసాలలో వున్నాయన్నారు.

కొత్త సచ్చిదానంద మూర్తిని అడిగి వ్యాసం రాయించారు.

వాదోపవాదాలను అంత ఎక్కువగా మిసిమి ప్రోత్సహించలేదు.

కళలు, సాహిత్యంపై వినూత్న వ్యాసాలు రవీంద్రనాథ్ అడిగి రాయించినవే. ఫిలాసఫి, సైన్స్‌పై నేను రాసిన వ్యాసాలు కూడా రవీంద్రనాథ్ కోరికపై వచ్చినవే. బరువైన విషయాన్ని తేలికగా చదివించాలని రవీంద్రనాథ్ ఉద్దేశం.

గోవాడ సత్యారావుచే మిసిమి కార్టూనా వ్యాసం ఒకటి రాయించి, సంతృప్తి పడ్డారు. టైం, న్యూస్ వీక్, స్టేట్స్‌మన్ పత్రికలిచ్చి వాటి సారాంశాన్ని నిగ్గుతేల్చి రాయమన్నారు. రవీంద్రనాథ్ కోరినట్లు ఆయనకు తృప్తికరంగా వుండే తీరులో సత్యారావు వ్యాసం రాశారు.

సైకాలజీపై రవీంద్రనాథ్‌కు మొదటి నుండీ ప్రత్యేక దృష్టివుండేది. అందులో భాగంగానే సి. నరసింహారావు ప్రచురించిన వ్యక్తిత్వవికాసం నుండి కొన్ని భాగాలు ప్రచురించారు.

కథలను మిసిమిలో ప్రోత్సహించకపోవడం కూడా రవీంద్రనాథ్ ప్రత్యేకతే. కాని చలసాని ప్రసాదరావు, శేషగిరిరావుగార్ల కళల అంశాలు ఆయనకు నచ్చాయి. అలాగే ముఖచిత్రం, మిగిలిన అట్టలపై చిత్రాల ఎంపికకు కాలాన్ని బాగా వినియోగించి సఫలీ కృతులయ్యారు. మిసిమిలో పార్టీ రాజకీయాలకు తావులేదు. ఏటుకూరి బలరామమూర్తి మొదలు ఎవరైనాసరే పరిశోధనాత్మకంగా రాస్తే మిసిమిలో చోటు చేసుకున్నాయి.

ఒక దశలో మిసిమిని యిక ఆపేస్తే బాగుంటుందని అదే ప్రమాణంతో నడపడం కష్టంగా వుందని రవీంద్రనాథ్ భావించారు. కాని మిసిమి ఆయనకు ఎదురు తిరిగింది. కనుక ఆపలేక కొనసాగించారు.

మిసిమిలో వాదాలు, వివాదాల విషయంలో బూదరాజు రాధాకృష్ణను, పాత ఆసక్తికర ఘటనలకు ఆంధ్రపత్రికలో రిటైర్ అయిన శర్మను (సిక్స్టీస్‌లో వుండేవారు జర్నలిస్ట్ కాలనీలో) సంప్రదించడం రవీంద్రనాథ్ ఆనవాయితీ. కొత్త రచయితల్ని ఎప్పుడూ వెతుకుతుండేవారు. మిసిమి కోసం చేయించిన అనువాదాలలో, సర్కేషస్ రచనలలో చక్రపాణి శైలి ఆయనకు నచ్చింది.

మిసిమి సందర్భంగానే ఎ.బి.కె.ప్రసాద్, జయప్రకాష్ నారాయణ్ ఆయనకు పరిచయమయ్యారు.

నెల రోజులకు చనిపోతారనగా రవీంద్రనాథ్ మాయింటికి వచ్చి చాలాసేపు కూర్చొని, ఏవేవో ముచ్చట్లు చెప్పారు. తనకు ఒంట్లో బాగుండడం లేదన్నారు. అప్పటికే కొన్నాళ్ళుగా గడ్డం పెంచిన రవీంద్రనాథ్ ముఖంలో విషాద ఛాయలు గమనించి బాధపడ్డాను. చివరి రోజుల్లో ఆయన డాక్టర్ సోమరాజు (కార్డియాలజిస్ట్)కు సన్నిహితులయ్యారు. సూర్యప్రకాష్ చిత్రపటాన్ని డాక్టర్ సోమరాజుకు బహూకరించారు. కళాత్మకంగా వుండే చిత్రాలంటే రవీంద్రనాథ్‌కు ప్రత్యేక అభిమానం. మిసిమి కోసం అలాంటివెన్నో అన్వేషించి తృప్తి చెందారు.

డాక్టర్ ఎన్. ఇన్నయ్య, హైదరాబాదు, హేతువాది రచయిత, ప్రముఖ పాత్రికేయులు

రవీంద్రనాథ్ ప్రథమ వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న
శ్రీ భమిడిపాటి రామగోపాలం (భరాగో), వేదికపైన ఆసీనులైన
డాక్టర్ భరద్వాజ, డాక్టర్ సి. నారాయణ రెడ్డి, డాక్టర్ జయప్రకాశ్ నారాయణ

సెప్టెంబర్ 1996

వెల. రూ|| 6/-

అనేక విషయాల్లో రవీంద్రనాథ్ గారివి, నావి కలిసే అభిప్రాయాలు కావు. ఒకరకంగా ఆ విషయంలో మేమిద్దరం ఉత్తర దక్షిణ ధృవాల్లాంటి వాళ్లం. అయినా ఆయన నాపట్ల అపారమైన ప్రేమాభిమానాల్ని వర్షించేవారు.

అదే ఆప్యాయతను, ''మంచి రచన'' అని ఆయునకు అనిపించినది ఎవరు రాసినా చూపేవారు.

పసిమి మిసిమి

☆

చలసాని ప్రసాదరావు

డిసెంబర్ 1996
వెల. రూ॥ 6/-

రవీంద్రనాథ్ ... అంటే...''మిసిమి''

''మిసిమి'' అంటే రవీంద్రనాథ్ !

ఆ రెండూ అవిభాజ్యం

రవీంద్రనాథ్ ''మిసిమి''కి రూపకల్పన చేసి జవజీవాలు నింపిన సంపాదకుడు.మాత్రమేకాదు ...

ఆ ''మిసిమి''ని అందరికీ వెలుగుల నందించే పసిమిగా తీర్చిదిద్దారాయన.

పసిమి అందరికీ అందుబాటులో ఉండదు ... నిజమే !

కానీ .... .

కొన్ని కొన్ని రచనలు కూడా అందరికీ మింగుడు పడగలవిగా ఉండవు.

వాటి ''స్థాయి'' ఒక కనీస స్థాయిని అధిగమించిన వారికే అందుబాటులో ఉంటుంది. అర్థం కాగలదిగా ఉంటుంది.

వారినే ''మేధావి పాఠకులు'' అంటున్నాం.

మేధావులూ, మేధావి పాఠకులూ ఒకటే కారు.

మేధావుల పాఠకులు మేధావి పాఠకులు.

''మిసిమి'' మేధావుల పత్రిక. మేధావి పాఠకుల పత్రిక.

ఆ పాఠకులకోసం ఈ మేధావుల చేత కలం పట్టించిన సంపాదకుడు రవీంద్రనాథ్.

ఆ పని కూడా గతంలో ఎవరూ చేయని స్థాయిలో, ఊహించని రీతిలో చేశారాయన. తనతో పాటు ''మిసిమి'' కూడా పసిమిలా వెలిగి పోయేట్లు చేశారు. విద్యావంతులైన ఆధునిక తెలుగు పాఠకుల కంటికి పంచరంగుల పసిమిలా. మేధకు బరువైన మేతలా, హస్త భూషణంగా కూడా తీర్చిదిద్దారాయన.

''మిసిమి'' ముందూ, వెనుకా ఎన్నెన్ని, ఎందరెందరు ప్రపంచ ప్రసిద్ధ చిత్రకారుల అపురూప కళాఖండాలు మిలమిల లాడాయీ ! వాటి ముద్రణలో పాశ్చాత్య ముద్రాపకులకు తీసిపోని నైపుణ్యాన్ని ఎంతగా సాధించారూ !

''మిసిమి''లోని రచనలంటే ప్రత్యేకాసక్తి గలవారికి దాని రూపురేఖలు ఆ ఆసక్తిని మరింతగా పెంచగా, ఆ ''స్థాయి'' మింగుడు పడని కళాభిమానులు సైతం పత్రిక పట్ల ఎంతగా ఆకర్షితులయ్యారో! ఇలాంటి పత్రిక ఒకటి ఉందని తెలియని వారోసంచిక చూడగానే ముగ్ధులై ఇంతవరకూ వచ్చిన మిగతా సంచికలను కూడా సేకరించు కోవాలని తీవ్ర ప్రయత్నం చేసిన సందర్భాలెన్నో.

అంత నిర్దుష్టమైన ముద్రణలో తమ చిత్రాలు కూడా ''మిసిమి''కి అలంకారాలు కాగలిగితే బాగుండునని ఆశ పడిన మన చిత్రకారులెందరో.

రవీంద్రనాథ్‌గారిని పాశ్చాత్యులవి తప్ప మనవారి వర్ణచిత్రాలంతగా ఆకట్టుకున్నట్లు లేదు. వాటి స్థాయి ఆయన్ని మెప్పించగలంతటిదిగా కనుపించ లేదనుకుంటాను. ''ఇవయితే నాకు అందుబాటులో ఉన్నాయి గనుక వేస్తున్నాను. అదే మనవారివయితే ఎక్కడున్నాయో, వాటిని ఎలా సేకరించాలో నాకు అవగాహన లేదు. అన్నీ తెలిసిన మీరు ఈ విషయంలో నాకు సహకరించగూడదా!'' అన్నారాయన నోసారి! ఆ అవగాహన ఆచరణలోకి రాకముందే ఆయన వెళ్లిపోయారు.

భారతీయ, తెలుగుచిత్రకారుల చిత్రాలంటే రవీంద్రనాథ్ గారికి ''ఎలర్జీ'' అని ఒకరన్నారు కూడా. కాని, అది నిజం కాదనుకుంటాను. కాదు, గనుకనే వాలా కాలం క్రితమే తాను మెచ్చిన రంగుల రంగుల తోలు బొమ్మను (Leather Puppet) ''మిసిమి'' ముఖ పత్రంగా తీర్చి దిద్దేరు. దానిలోని అందాల్ని పదుగురకూ ప్రదర్శించారు.

★ ★ ★

ఉన్నవి కాసిన్ని పేజీలే, అయినా ఎంత బరువైనది ''మిసిమి''

నిజానికి ''మిసిమి''లోని అనేక రచనల ''ధోరణి'' నాకు నచ్చదు.

మన సాహిత్యాన్ని, సంస్కృతి, కళలను గుర్తించటానికో, ఆస్వాదించటానికో, విశ్లేషించు కోడానికో, విమర్శించుకోడానికో పాశ్చాత్యుల కొటేషన్లు సేజీలకొద్దీ మన రచనల్లో ఇవ్వనవసరం లేదు. వాళ్ల కళ్లతో మనం చూడనవసరం లేదు. వాళ్లు మెచ్చినదానినల్లా మనం నెత్తికెక్కించు కోనవసరం లేదు.

మన వివిధ సాంస్కృతిక రంగాల మీదా పాశ్చాత్య ప్రభావం స్పష్టంగా ఉంది, నిజమే. అందుకు చారిత్రకమైన కారణాలనేకం. మనకన్నా వాలా ముందే ముందుకు దూసుకు పోయినవారికి మనం పెద్ద పీట వెయ్యటంలో తప్పులేదు. వారి నుండి నేర్చుకోవలసిందెంతైనా ఉంటుంది.

కాని, అదే మన పని కాగూడదు.

నేర్చుకున్న దేనినైనా స్వీయానుభవాల్తో సమీక్షించుకుని, స్వీయ సమాజావసరాలకు అనువర్తింప జేయటం సృజన శీలుర పని. అంతే గానీ, గొప్పవారు మెప్పించింతా నేమేననుకో నవసరం లేదు. నిజానికి వేదాల్లోనే అధిక భాగం ఈనాడెందుకూ, ఏ అవసరానికీ పనికి రాదు.

ఈ అంశాన్నే ఓసారి రవీంద్రనాథ్ గారితో చర్చించినప్పుడు ఆయన అంగీకారంగానో, అనంగీకారంగానో ఏమీ అనలేదు గానీ ''అలా రాసేవారూ, రాయగలవారూ ఉండాలిగదా'' అన్నారాయన.

అలాంటి మౌలిక రచనలు కనుపడినప్పుడు, వాటి రచయితలను గురించి వాకబు చేసి, స్వయంగా కబురు చేసి, సంబంధాలు నెలకొల్పుకుని, పరస్పర చర్చల ప్రభావంతో వారిచేత రచనలు చేయించి ప్రముఖంగా ప్రచురించిన సంపాదకుడు రవీంద్రనాథ్ !

సంపాదకుడంటే ... ఏదో, వచ్చిన రచనల్లోంచి పనికొస్తాయనుకున్నవి నాలుగు ఎన్నిక చేసి అచ్చుకిచ్చే ప్రచురణకర్తగా ఉండి పోగూడదు.

తను పాఠకులకు ఏం అందించాలని ఆశిస్తున్నారో, అలాంటి రచనలకు ఒక ప్రణాళికను రూపొందించి, ఆ ప్రకారం ఆయా రచనలను సమర్థులనుకున్న వారి చేత రాయించి, ప్రచురించే వాడే సంపాదకుడు.

ఆ దృష్ట్యా చూస్తే మన ''నిజమైన'' సంపాదకులు బహుకొద్దిమందిలో ఒకరు రవీంద్రనాథ్.

నలుగురూ వెళ్తున్న ''బాట'' ఎలాంటిదైనా అందరి దృష్టిలో అదే క్షేమకరం. ఎలాంటి రిస్కూ లేనిది.

కానీ .... .

తన ''దారి'' ఏదో నిర్ధారించుకుని, ఆ దారిని ప్రయాణఅ యోగ్యంగా మార్చుకుపోతూ, అందరికీ కాకున్నా, కొందరికైనా మార్గ నిర్దేశం చేసేలా తీర్చి దిద్దటానికి చాలా ఓపిక ఉండాలి. దానికి తోడుగా తెగువ కూడా ఉంటేనే ఏదైనా సాధించగలం.

అవన్నీ ఆచరణలో చూపిన సంపాదకుడు రవీంద్రనాథ్.

★ ★ ★

పన్నెండు, పదహారు సంవత్సరాల వయసు మధ్య, నేను విజయవాడలో ఉంటున్న కాలంలో...
.

దొరికిన పత్రికలూ, పుస్తకాలూ అన్నీ చదివేస్తుండేవాడిని. ఆనాడున్న పత్రికలూ, పుస్తకాలూ తెలుగులో చాలా తక్కువ. అందుకనే అన్నీ చదవగలిగే వాడినేమో !

ఆదశలో నన్ను ఆకట్టుకున్న పత్రికల్లో ''జ్యోతి'' ఒకటి. చదివే వాయసు కాకున్నా అభిసారిక, రేరాణి వంటి పత్రికలు కూడా అలవాటుగా చదివిన జ్ఞాపకం.

'జ్యోతి' నాకారోజుల్లో ఓ విందు భోజనంలా ఉండేది. ఎన్నెన్ని రచనలు ఎందరెందరు రచయితలు! ధనికొండ, చలం, భరద్వాజ, కుటుంబరావు, గోపీచంద్, జి.వి. కృష్ణరావు, శారద.... ఎందరెందరో!

స్కూల్‌చదువు లేని నాకు ''జ్యోతి'' ఓ పాఠ్యగ్రంథంలా ఉండేది. రచనల్లోని వైవిధ్యం లీలగా ఈనాటికీ నాకు గుర్తుంది.

ముఖ్యంగా ధనికొండ, భరద్వాజ పోటాపోటీగా రాసే వారనుకుంటాను. వారి సబ్జెక్ట్ సదా ఒకటే గనుక, కథనంలో వైవిధ్యం చూపకపోతే నిలబడ లేరు. వారు కనుకనే ఆపోటీ కావచ్చు. కానీ ....

ఆ వైవిధ్యం నాకు ఒక్కో రచనా ఓ పాఠం అన్నట్లుగా పనికొచ్చేది. కథరాయటం చాలా సులభం అనే ధీమానిచ్చేది.

''కథలు రాయటం ఎలాగో, ఎంత సులభమో చెప్పి, యువతరానికి ఉత్సాహం కలిగించటానికే ఆ రోజుల్లో నేనంత విరివిగా కథలు రాసేను'' అని వివరించారు కొడవటిగంటి కుటుంబరావుగారు చాలా కాలం తర్వాత, వేరే సందర్భాన్ని గురించి.

అసలుసంగతి అప్పట్లో రవీంద్రనాథ్ గురించి నాకేం తెలియదు. తెలుసుకోవాలనే వయసు కాదది. ఆ తరువాత ఓ నాలుగు దశాబ్దాలు గడిచాక ఆయన నాకు పరిచయమయ్యారు. అనేక విషయాల్లో రవీంద్రనాథ్ గారివి, నావి కలిసే అభిప్రాయాలు కావు. ఒకరకంగా ఆ విషయంలో మేమిద్దరం ఉత్తర దక్షిణ ధృవాల్లాంటి వాళ్లం. అయినా ఆయన నాపట్ల అపారమైన ప్రేమాభిమానాల్ని వర్షించేవారు.

అదే ఆప్యాయతను, ''మంచి రచన'' అని ఆయనకు అనిపించినది ఎవరు రాసినా చూపేవారు. కోరి వారి చేత రాయించుకునేవారు. ఆ రాసినది సంతృప్తికరంగానూ, తాను ఆశించిన స్థాయిలోనూ లేకుంటే నిస్సంకోచంగా దానిని ఫైల్ చేసి ఉంచేసే వారే తప్ప అచ్చుకిచ్చేవారు కాదు.

అలాగే పాతికేళ్ల, యాభయ్యేళ్ళనాటి కవిని కట్టల్లోంచి కూడా రచనల్ని సేకరించి ప్రచురించేవారు.

అందువలననే ''మిసిమి''కి ఆ స్థాయి వచ్చింది.

ఆ స్థాయిని నిలబెట్టటం, మరింతగా పెంచటం, కొందరికే అందుబాటులో ఉన్న రచనలు అందరికీ అర్థమయ్యే రీతిలో రాసి ప్రచురించటం... మాత్రమే మనం ఆయనకు ఇవ్వగలిగిన నివాళి!

ఓ సారి ఇద్దరం శిల్పారామంలో ఎగ్జిబిషన్ జరుగుతుంటే వెళ్లాం.

సరదాగానో, పరిశీలనగానో తిరుగుతూండగా, ఓ షాపు దగ్గర ఆగేం. వాకింగ్‌లో వాడే చేతికర్ర....నగిషీలు చెక్కినది ఒకటి కొన్నారాయన.

నన్ను ఒకటి తీసుకోమన్నారు.

నా కెందుకూ... ? వాకింగ్ ఇంకా మొదలెట్టలేదు గదా.... అన్నాను.

అప్పుడు ఆయనే అన్నీ తిరగేసి, రూళ్ల కర్ర సైజు వేలి కర్ర ఒకటి ఎన్నిక చేసేరు. చెక్కడం పని, కర్ర నాణ్యం బాగున్నాయని మెచ్చుకుంటూ నాకందించారు.

''నా కెందుకండీ ! ఏం చేసుకుంటానూ...'' అని మొహమాటం పడ్డాన్నేను.

''కబుర్లలో అందర్నీ బాదుతుంటారు గదా ! ఇంకాస్త గట్టిగా బాదండి''... అన్నారాయన చిరుదరహాసంతో .

ఆ గంభీర వదనంలో దరహాసం కనుపించటం చాలా అరుదు.

అదీ .... రవీంద్రనాథ్ అంటే !

చలసాని ప్రసాదరావు, హైదరాబాదు, ప్రముఖ రచయిత, చిత్రకారుడు, కళాసాహితీ విమర్శకుడు, కాలమిస్టు, ప్రస్తుతం ఈనాడు గ్రూపు పత్రికలు విపుల, చతురల సంపాదకులు

1949 లో ...

*ఈ వ్యాసంలో రవీంద్రనాథ్ మూర్తిమత్వం **(Personality)** వ్యక్తిత్వాల **(individuality)**ను రూపు కట్టే ప్రయత్నం చేశాను. ఈ రూపు కట్టడాన్ని కేవలం వర్ణన **(description)**తో చేయలేం. అతడితో ముడిపడి ఉన్న సంఘటనలను, అనుభవాలను, ఘటనలను గుది గుచ్చడం ద్వారా మాత్రమే ఆవిష్కారం బాగా జరుగుతుంది. సంఘటనలు, అనుభవాలు ఒకని మూర్తిమత్వాన్ని వివృతం చేస్తాయి. ఆ వివృత ప్రక్రియలో మనకు తెలియకనే అతని మూర్తిమత్వం మన కళ్ళెదుట రూపుకడుతుంది. అందుకే ఈ పద్ధతి చేపట్టాను.*

నా ఆల్టర్ ఈగో రవీంద్రనాథ్

☆

అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

''మిమ్మల్ని కలవడం నాకెంతో సంతోషంగా ఉంది. మీరు తర్క శాస్త్రజ్ఞులని కృష్ణరావుగారు అంటున్నారు. నాకు నిజంగా తర్కం అంటే ఏమిటో తెలియదు. తెలుసుకోవాలని ఆసక్తి. కాస్త తర్కం అంటే ఏమిటో వివరిస్తారా?'' రవీంద్రనాథ్ నాతో మాటాడిన మొదటి మాటలివి.

అది 1961లో ఒకరోజు. నేను, జి.వి. కృష్ణరావు (కీలుబొమ్మలు రచయిత) వి.యస్.ఆర్. కళాశాల నుంచి సాయంత్రం ఇంటికి వస్తున్నాం. బోసురోడ్డులో ఉన్న రవీంద్రనాథ్‌గారి జ్యోతిప్రెస్ మీదుగానే మాదారి. ఆవీధిలో జ్యోతిప్రెస్, జాకోబిన్ పబ్లిషర్స్ పడమరవైపున ఉంటే, వీటి ఎదురుగా తూర్పువైపున జ్యోతిప్రెస్ ఆఫీసు ఉండేది.

జ్యోతి ఆఫీసులో కూర్చొన్న రవీంద్రనాథ్‌గారికి వీధిన వెళ్ళే జనం కనిపిస్తారు. అలాగే మేమూ కనిపించాము. ''కృష్ణరావుగారూ'' అంటూ కేక వేశారు. అప్పుడు మేమిద్దరమూ నడిపించుకొంటూ వెళ్తున్న సైకిళ్ళకు స్టాండ్ వేసి ఆఫీసులోకి నడిచాము. ఆయన ''కూర్చోండి'' అన్నారు. కూర్చోగానే కృష్ణరావు నన్ను చూపించి ''ఈయన మా వి.యస్.ఆర్. కళాశాలలో తర్క శాస్త్రోపన్యాసకులు, పేరు వెంకటేశ్వర రెడ్డి'', అని పరిచయం చేసారు.

''మిమ్మల్ని కలవడం నాకెంతో సంతోషంగా ఉంది. మీరు తర్క శాస్త్రోపన్యాసకులని కృష్ణరావుగారు అంటున్నారు. నాకు నిజంగా తర్కం అంటే ఏమిటో తెలియదు. తెలుసుకోవాలని ఆసక్తి. కాస్త తర్కం అంటే ఏమిటో వివరిస్తారా?'' అన్నారు రవీంద్రనాథ్ జిజ్ఞాసతో.

ఆ సమయంలో నేను ఆయన అలేఖ్య తనూ విలాసాన్ని చూసి విమోహితు డనయ్యాను. ఆ విమోహం ప్రాతిభాసికమే కావచ్చు. ఆయన ఎత్తు ఆరడుగుల పైమాట. పసిమిఛాయ, పల్చటి దేహం, ఆ దేహాన్ని ఆచ్ఛాదించిన తెల్లని పొందూరు ఖాదీ లాల్చీ, పొందూరు యమ్.ఎల్.ఎ. అంచు ఖాదీ ధోవతి. కాళ్ళకు తమలపాకు చెప్పులు. తమలపాకు చెప్పులంటే ఆకు మందం మాత్రమే ఉండే గోల్డ్‌ఫీల్డ్ కంపెనీ చెప్పులు. అవి ఆరోజుల్లోనే 16, 17 రూపాయలుండేవి. ఇప్పుడు అవి దొరకవనుకొంటాను. చేత 555 సిగరెట్ల టిన్ను, ఆ టిన్నుమీద అగ్గిపెట్టె - ఈ రెండూ ఆయన ఎడమచేతి బొటనవ్రేలు - మిగతా వ్రేళ్ళమధ్య సేద దీరుతున్నాయి. ఇవన్నీ ఉండి ముఖం సమవాయంతో అందంగా లేకపోతే ఎలా? నిజంగా ఆయన చాల అందమైన పురుషుడు. ఎవరినైనా ఎంతటి వారినైనా ఆడనైనా, మగనైనా, ఇట్టే ఆకర్షించి తన ప్రతిమను ముద్రించగల మూర్తి ఆయన. తర్కంతో ఎండువారిన కట్టెనైన నన్నే ఆ మూర్తి ఆకట్టుకొంటే, ఇతరుల మాట చెప్పవలసింది ఏముంది? నేను వర్ణించే మూర్తి ఆయన్ను చివరి రోజుల్లో చూసిన వారికి అర్థం కాదు. అయితే ఆయన నాటి మూర్తి ఛాయలను ఊహించుకోవచ్చు చివరి రోజుల్లో ఆయన్ను చూసినా. నేను చూసినప్పు డాయన వయస్సు 39 సంవత్సరాలు. వర్ణించేది నాటి ప్రతిమను. నాటికి నేటికి నేను అంత అందమైన మూర్తిని చూడలేదు. ఇది పొగడ్త కాదు. వస్తుగుణ కథనం.

నేను అలా ప్రాతిభాసిక సత్యంలో విమోహితుడనై ఉంటే, ''ఏమండీ నా ప్రశ్న మీరు వినలేదా? తర్కం అంటే ఏమిటి? అని మళ్ళీ అడిగారు రవీంద్రనాథ్. ''చెవుల పడింది, కాని

మనస్సునే చేరలేదు,'' అన్నాను నేను. ''అయితే ఇప్పుడు మనస్సుకు పట్టించుకొని చెప్పండి'', అన్నారు.

అప్పుడు నా మనస్సులో ఒక సందేహం కలిగింది. ''నేను ఈయనకు కొత్తవాణ్ణి. ఈ ప్రశ్న ఆయన తెలిసి అడుగుతున్నాడా, తెలియక అడుగుతున్నాడా? ఏమీ తెలియని వాడు సర్వం తెలిసినవాడు ఇద్దరూ ఒకటే (అయితే సర్వజ్ఞుడంటూ ఎవరూ ఉండరనుకోండి). మరి ఈయన సంగతి ఏమిటి?'' సరే ఎల్గాగైతే అలాగవుతుందని, ''తర్క-శాస్త్రం అంటే ఆలోచనా శాస్త్రం'', అన్నాను. ''ఆలోచనా శాస్త్రం అంటే ఎలా ఆలోచించాలో నేర్పుతుందా?'' అన్నారాయన. ''ఆలోచించడం చేతకాని వానికి ఎలా ఆలోచించాలో అది నేర్పదు. కాని ఆలోచనా విధానం దోషపూరితమైనదైతే ఆభాసాపూరితమైనదైతే, అందులోని దోషం ఏమిటో, ఆభాస ఏమిటో కనుక్కో-వ డానికి ఉపయోగపడుతుంది. శాస్త్రీయాలోచన లక్షణాలను తెలియజేస్తుంది'' అన్నాను.

కృష్ణరావు ఈ చర్చలో ఏమీ జోక్యం చేసుకోకుండా ''ఏమిటి విశేషాలు?'' అని రవీంద్రనాథ్‌ని ప్రశ్నించారు. ఆయన ఏమి సమాధానం చెప్పారో సరిగా గుర్తులేదు కాని, అప్పుడు కాలేజీలో కృష్ణరావు పరిస్థితి కాలేజీ యాజమాన్యం కారణంగా ఏమీ బాగుండలేదు. ఆ సంగతులేవో ప్రస్తావనకు వచ్చాయి. కృష్ణరావు 1962లో కళాశాల ఉద్యోగానికి రాజీనామా చేయడం, దాని ధూళి నామీద పడడం, నాకు కాలేజీ వారు 1964లో ఉద్వాసం పలకడం జరిగాయి.

అలా అయింది రవీంద్రనాథ్‌తో నా ప్రథమ పరిచయం. తరవాత, ఆయన హైదరాబాద్ మకాం మార్చేంతవరకు దాదాపు ప్రతిదినం జ్యోతి ఆఫీస్‌లో కలుస్తుండే వాళ్ళం తెనాలిలో.

నన్ను విమోహితుని చేసిన ఆయన బాహ్య సౌందర్యానికి నేను మొదట్లో వశుడనైనా, తరవాత ఆయన అంతరంగ సౌందర్యానికి అత్యంతంగా ముగ్ధుడనయ్యాను. ఆయన అంతరంగం అంత సుసంపన్నం కాకపోతే మా స్నేహం అంత సుదీర్ఘ కాలం దాదాపు 35 ఏళ్ళు (61 సం॥ నుంచి ఆయన 1996 ఫిబ్రవరి 11న తుదిశ్వాస తీసేవరకు) కొనసాగేది కాదు. నేను ఆయన అంతరంగంలో ఒక సౌందర్య పిపాసిని, కళాభిమానిని, సాహిత్యాభిమానిని, రసాస్వాదిని, సరసుని, మానవీయతకు ప్రతీకను, దేవుని కాదన్న వానిని, యుక్తి (Reason), సహుని, మర్యాదమన్ననలు ఎరిగిన వానిని, మదిరాపాన నిష్ణాతుని, జ్ఞాన పిపాసిని, ఒక బౌద్ధుని, చతురుని, విమర్శకుని, సమయపాలకుని, రచనా, కళాభివ్యక్తులకు దోహదకారిని, స్నేహసిచ్ఛలుని చూశాను. ఇవన్నీ నేను ఆయనలో చూసినవే. 35 ఏళ్ళ మాగాఢ స్నేహానురాగాలు ఒక జీవితాన్ని అంచనా కట్టడానికి సరిపోతాయనుకొంటాను. అందుకని నా అంచనా పొల్లు పోదు. నేను చూసిన లక్షణాలన్నీ నేను వివరించబోయే సంఘటనలలో ద్యోతకమవుతాయి.

ఎన్నో పగళ్ళు, మరెన్నో రాత్రులు చర్చలు, పుస్తకాలు, జీవితాలు, రచనలు, అస్తిత్వవాదం, మనో విజ్ఞాన శాస్త్రం, బౌద్ధం, ''హైజెన్‌బర్గ్స్ ప్రిన్సిపుల్ ఆఫ్ ఇన్‌డిటెర్‌మెనెన్సీ'', సాపేక్షవాదం, గుళికావాదం (Quantum Physics), టైమ్ మాగ్జీన్, ఎన్‌కౌంటరు (లండన్), ''సైకాలజీ

టుడే'' (అమెరికా) - ఇంత సుదీర్ఘ కాలంలో ఏమి చర్చించామని చెప్పను, ఏమి వదిలివేశామని చెప్పను. ఇక్కడ మేము మహాజ్ఞానుల మని పోజు పెట్టడం లేదు. మాకున్న జ్ఞాన పరిధిలో మేము చర్చలు జరుపుకొన్నాం. అయితే అవి సారహీనాలు, మరీ లవణ హీనాలు కావు. అల్పాలు అంతకంటె కావు.

ఒకసారి ఆయన నాతో ''మీరు కర్క్ గార్డ్ చదివారా? ఆయన ఒక కథ చెప్పాడు: 'ఒక మనిషి తాను ఉన్నా (exist) నన్న సంగతి మరిచి పోయి ఎంత దూరం పోయాడంటే, ఒక రోజు ఉదయం తాను మరణించానని తెలుసుకోవడానికి నిద్రలేచాడు! మరణించానని తెలుసుకోవడానికి నిద్రలేవడమేమిటి? అంతా తలక్రిందులుగా ఉంది. ఏమిటి దీని సంగతి?'' అని అడిగారు.

ఆ రోజుల్లో నేను కొంచెం పొడిపొడిగా అస్తిత్వవాదం చదువుతున్నానేమో (ఆ తరవాత 2000కు జనవరిలో నా ''అస్తిత్వవాదం'' గ్రంథం వెలువడింది) నేను నా తెలిసినమేర ఆయన ప్రశ్నకు ఇలా సమాధానం చెప్పాను: ''ఈ రోజు మనిషి వేగవంతమైన జీవితంలో (ఇవ్వాళ జీవితం మరీవేగవంతమైందనుకోండి) సిద్ధాంతాల్లో, అమూర్తాలోచనల (abstract thinking) లో పడిపోయి తాను ఉన్నా (exist) నన్న సంగతే మరిచి పోయాడు. అంటే అతడు వాస్తవ జీవితాన్ని, కళ్ళెదుట కనిపించే కాంక్రీటు (ఘన) జీవితాన్ని, రక్తమాంసాలను, ఆకలి, వేదన, సంవేదనలు, అనుభూతులను, అనుభవాలను వదిలి ఎక్కడో కూరుకుపోయాడు. అనుభూతులు, అనుభవాలు అనన్యమైనవి (Unique) ఏ ఇద్దరి, ఏరెండు అనుభవాలు ఒకేరకంగా ఉండవు. అటువంటి వాటికి మనిషి దూరంగా జరిగిపోయాడు. అలా ఎంత దూరం జరిగి పోయాడంటే ఒక నాటి ఉదయం తాను మరణించానని తెలుసుకోవడానికి నిద్రలేచేవరకు ఇక్కడ మరణించడమంటే అనన్య, రక్త, మాంస,వేదన, సంవేదనమయ జీవితాన్ని విస్మరించడం. సాధారణ, హేతుబద్ధ, ఎండువారిన సిద్ధాంతాలలో జీవించడం.'' అని నేను సమాధానం చెప్పాను. ఆయన ఇంకేదో ప్రశ్నవేసి సంభాషణ కొనసాగించారు కాని నాకు గుర్తులేదు.

ఒకసారి మా యిద్దరి మధ్య ఒక చర్చ జరిగింది: ఒక విషయాన్ని బాగా హత్తుకొనేలా అంటే అమూర్త విషయాల (Abstract Things) ను, సిద్ధాంతాలను, సార్వత్రికాల (Universals)ను ఎలా చెబితే బాగుంటుంది, హత్తుకుపోతుంది. నియమాలను, నీతిని యధాతథంగా ఒక ప్రకటనలాగా సూత్రం లాగా చెబితే అంతబాగా నాటుకోదు. మరి ఎలాగుంటే బాగా నాటుకుపోతుంది. ''వాటిని విశేషాలు, ప్రత్యేకాలుగా, రక్తమాంసాలను జోడించి ఒక కథలా చెబితే బాగుంటుంది'' అన్నారాయన.

నాకు అంత ప్రతీకాత్మక (Imaginative Thinking) ఆలోచన అంటే బొమ్మలతో కూడిన ఆలోచన - అంటే కళ్ళకు కట్టినట్లు రూపాలతో చెప్పే ఆలోచనా శక్తి నాకు లేదు, నా ఆలోచన ఎండువారిన కట్టెలాగ ఉంటుంది. ఆయన అలాకాక మంచి మసాళా దట్టించి చెప్పగలడు. ఆయన కథలల్లడంలో ఘనుడు. అలాగని అబద్ధాలు చెబుతాడని కాదు. అల్లడం ఆ అర్థం ఉన్నా

పూర్తిగా కథ కల్లకాదు. ఆయన 'అవినీతి' తాండవాన్ని గురించి సిద్ధాంతాలు వల్లించక, చెప్పిన కథను నేను ఇప్పుడు చెబుతాను.

''ఆవిడ పేరు ఉఫెంగ్. ఫెంగ్‌హు గ్రామంలో ఉంటున్నది. రాత్రి సమయం. గదిలో దీపం ఆరిపోయింది. దీపం ఆరిపోవడంతో ఏదో దారుణం, అశుభం జరుగబోతోందని ఆమె మనస్సు శంకించింది. ఆ గ్రామ వాసులు ముగ్గురు ఆడవాళ్ళు తలుపుతోసుకు వచ్చారు. ఆమెను పట్టుకొని తలుపుకేసి ఒత్తి పట్టారు. ఆమె బట్టలూడ దీయసాగారు. అప్పుడామె భర్త గంధకామ్లాన్ని ఆమె ముఖం మీద, స్తనాల మీద, తొడల మధ్య పోశాడు. ఆమె భయంకరంగా అరిచింది. ఆ స్త్రీలు ఆమెను ఒత్తి పట్టి, యాసిడ్‌ను ఆమె ముఖానికి, స్తనాలకు రుద్దారు, జీవితాంతం ఆమె రూపం వికృతం కావడానికి.

ఈ అనుభవ స్మృతిలోని బాధకంటె దారుణమైంది ఈ దాడిలో హస్తం ఉన్న గ్రామాధికారులు చుట్టూ ఆవరించిన మహా నిశ్శబ్దం, ఈ అతిశక్తిమంతులు గర్విష్టులు అయిన ఈ గ్రామ ఉద్యోగులు ఉఫెంగు న్యాయస్థానం చేరడానికి ఉన్న దారులన్నీ బంధించారు.

యుగయుగాలుగా చైనా ప్రజలు పాలకుల అవినీతితో, చట్టరాహిత్యంతో, బాధితులవుతూనే ఉన్నారు. దీనివల్ల రాజవంశాలు కుప్పకూలాయి. ఈ బెడద, పీడకల నేటి చైనాకు తప్పలేదు.

ఒక విషయాన్ని (ఇక్కడ అవినీతిని) అమూర్తంగాక కాంక్రీటుగా చెప్పడం అంటే ఇదే. ఇది ఆయన ప్రతీకాత్మకాలోచనకు మచ్చుతునక.

జి.వి. కృష్ణరావు 'కావ్య జగత్తు' రాశారు. దానిని రవీంద్రనాథ్‌కు అంకితమిచ్చారు. దానిని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎమ్.ఎ. వారికి పాఠ్యగ్రంథం చేసింది.

ఆ తరవాత 1959లో అనుకొంటాను - జి.వి. కృష్ణరావు కేంద్రసాహిత్య అకాడమీ పనుపున ప్లేటో ''రిపబ్లిక్''ను 'ఆదర్శరాజ్యం'గా అనువదించారు. దానిని తెనాలి జ్యోతిప్రెస్‌లో అచ్చువేయడం జరిగింది. ఈ సంగతి ఎందుకు ప్రస్తావిస్తున్నానంటే ఆయనకు సౌందర్య నేత్రం ఉందనడానికి, He has an eye for beauty అని చెప్పడానికి. ఆ గ్రంథ విమర్శకుడు (నాగళ్ళ గురుప్రసాదరావు) ఒక ప్రక్క అనువాదాన్ని మెచ్చుకొంటూనే ప్రింటింగ్ సొగసుకు ముగ్ధుడైనాడు - సాధారణంగా విమర్శకులు గ్రంథం విషయాన్ని మెచ్చుకొంటారు గాని ప్రింటింగు సొబగును గురించి మాటాడరు. ఆ పుస్తకం అంత అందంగా తయారైంది. పుస్తకం తెరిచి ఏదేని ఒక పుటలో ఒక పంక్తి మీద సూదిని ఉంచి క్రిందకు గుచ్చితే, ఆ సూది అన్ని పుటలలోను పంక్తుల మీదుగానే దిగిపోవాలి. ఇది ఉత్తమ ప్రింటింగ్‌కు పరీక్ష. ఆ రోజుల్లో అది లెటర్‌ప్రెస్ అని గుర్తుంచుకోవాలి. అది 12pt. ఇంగ్లీషు బాడీలో ప్రింటు అయింది. రవీంద్రనాథ్ ఇంకో ఐదారు సంవత్సరాలకు చనిపోతారనగా 'ఆదర్శ రాజ్యాన్ని' నేను సెకండ్ హాండ్ మార్కెట్టులో కొనుక్కొంటే, దానిని కావాలని ఆయన తీసుకొన్నారు. బహుశ దాని ప్రింటింగ్ అందాన్ని చూసుకొని మురిసి పోవడానికేమో - మరో విశేషం ఏమంటే ఆ రోజుల్లోనే ప్రింటింగ్ సైన్స్ మీద వచ్చే జర్నల్స్‌ని చదివేవారు. ముద్రణాలయ అధిపతులు ఎంతమంది ఆ పని చేస్తారు?

ఆయన ఎందరో రచయితలకు అభివ్యక్తి (నా డైరీ నుంచి) కల్పించారు. వెలుగులోకి తెచ్చారు. ఎంతటి కళాఖండమైనా అది అడవిలో పడి ఉంటే, ఎవరి కంటా పడకపోతే, అది కళాఖండం కాదు. అది ఎప్పుడు కళాఖండమవుతుందంటే, అది నలుగురి కంట పడినప్పుడే. కన్నె కాలు తగిలితే అశోకం పుష్పించినట్లు, రసాస్వాదుల కన్ను పడగానే ఆ అడవిలోని కళాఖండం వన్నెలీనుతుంది, పుష్పిస్తుంది. అలా రవీంద్రనాథ్ ఎన్నో ''అడవి కళాఖండాల''ను రసాస్వాదుల కళ్ళల్లో పడేట్టు చేసి వెలుగులోకి తెచ్చారు.

1948లో జ్యోతి, రేరాణి, సినీమా పత్రికలను నడిపి ఆయన ఎంతోమంది 'అడవి'లో ఉన్న రచయితలను వెలుగులోకి తెచ్చారు. తెనాలి మారిస్‌పేటలో ఇప్పుడున్న అలంకార్ సినిమా హాల్ సమీప వీధి మలుపులో, బాణలి పెట్టుకొని పునుగులు అమ్ముకొనే 'శారద' (నటరాజన్)ను ప్రపంచానికి జ్యోతి ద్వారా పరిచయం చేసిన ఖ్యాతి రవీంద్రనాథ్‌కే దక్కుతుంది.

శారద రచనలు: 'గొప్పవాడి భార్య' మార్చి 1, 'పరిశోధన' మార్చి 15, 'సంస్కరణ' ఏప్రియల్, 'పిరికి ప్రియుడు' మే 15, 'రహస్యం' 15 జులై 1948ల్లో ప్రచురించబడినవి. అలా ప్రచురించడమే కాదు, వాటిని 48 నుంచి జాగ్రతగా పదిల పరిచారు. ఆ తరవాత ఆయన లైబ్రరీ నుంచి వాటిని శారద సాహిత్యవేదిక, తెనాలి వారు గ్రహించి 1998లో 'రక్తస్పర్శ'శారద కథలతో ప్రచురించిన సంపుటంలో చేర్చారు.

తరవాత ఈ సంపుటాన్ని ప్రచురించడానికి ఆయన స్థాపించిన కళాజ్యోతి ప్రాసెస్, హైదరాబాద్, చేసిన దోహదం అనల్పం. ఈ అనల్ప దోహదాన్ని ఆయన పుత్రులు బాపన్న, దేవేంద్రనాథ్‌లు అందజేశారు. కానిచో 'రక్తస్పర్శ' కథల సంపుటి వెలుగు చూసేదికాదు.

అసలు రచన అంటే 'ఆత్మాభివ్యక్తీకరణం' (Self expression) - అంటే తనను తాను, తన అంతరంగ సుసంపన్నతను బహిర్గతం చేసుకోవడం, గుర్తింపజేసుకోవడం. దీని ద్వారానే ప్రతిమానవునికి ఉండే ప్రచండ ప్రబల వాంఛ - గుర్తింపు కోసం తహ తహ (Craving for recognition) సంతృప్తమవుతుంది. ఇలా సంతృప్తం కావడానికి అంతరంగం రచనై, అక్షరబద్ధమై, అచ్చై, నలుగురి దృష్టిలో పడినప్పుడే సంభవం. ఈ విధంగా రవీంద్రనాథ్ శారద వెలుగు చూడడానికి ఉపాదానకారణమయ్యారు.

ఒక్క శారదకే కాదు అభివ్యక్తి కల్పించింది, ఈనాటి ప్రసిద్ధ రచయిత రావూరి భరద్వాజకు కూడ. ఈ రోజు ఆయన ప్రసిద్ధుడు కాని, నాడు అప్రసిద్ధుడు. ఆ రోజుల్లో రవీంద్రనాథ్ తనని తెనాలి వచ్చేయమని రాసిన ఉత్తరాన్ని చేతబట్టుకొని వచ్చి జ్యోతిప్రెస్‌లో న్యూస్ పేపరు పరుచుకొని నేలమీద పడుకొని గాంధీచౌక్‌లో ఎనిమిదణాల పూట భోజనం చేసి, తెల్ల కాగితం కొనే శక్తిలేక, గోడకంటించిన సినిమా పోస్టర్లను మైదా కోసం మేకలు తింటుంటే, వాటి నుంచి ఆ పేపర్లను లాక్కొని, రెండోవైపు తెలుపు మీద తన కవితాత్మను అభివ్యక్తం చేసుకొనే రచయితను గుర్తించి, 'అలవాటైన ప్రాణం' అనే ఆయన రాసిన కథను రవీంద్రనాథ్ తన 'రేరాణి' మాస పత్రికలో ప్రచురించారు. (ఇవన్నీ నాకు భరద్వాజే చెప్పారు).

ఈ ''అలవాటైన ప్రాణం'' తరువాత పెద్ద చరిత్రనే సృష్టించింది. ఈ కథ అశ్లీలమని పోలీసులు కేసు పెట్టారు. - న్యాయాధిపతి రచయితకు ఐదువందల రూపాయలు జరిమానా అది చెల్లించక పోతే ఆరు నెలల కారాగారం. భోజనానికే సరిగా లేని భరద్వాజ ఎక్కడ నుంచి తెచ్చి కడతాడు? జైలుకే సిద్ధపడ్డాడు. రవీంద్రనాథ్ ఆ ఐదువందలు తాను చెల్లించి భరద్వాజకు జైలు కూటి అనుభవం దక్కకుండ చేశారు. (ఈమాట భరద్వాజదే - మిసిమి 1994 ఆగస్టు)

జడ్జిగారు సరిగా చదవకుండానే తీర్పు చెప్పారేమో, ''ఏదీ ఆ కథను నాకొకసారి ఇవ్వు, మళ్ళీ చదువుతాను'', అని తీర్పు వెలువరించిన తరవాత భరద్వాజను అడిగారట. ఈ సంగతి భరద్వాజ గారే నాతో అన్నారు.

ఆ తరవాత 1959 ప్రాంతాల రవీంద్రనాథ్‌తో ఈ విషయం చర్చించారు. సందర్భం ఏమిటంటే డి. హెచ్. లారెన్స్ రాసిన ''లేడీ చాటర్లీస్ లవర్''ను పెంగ్విన్ వాళ్ళు ప్రచురించగా లండన్‌లో దాని మీద కోర్టుకెళ్ళడం జరిగింది. అక్కడ జడ్జి ఆ నవలను తాను చదవడమే కాకుండా, అడ్డుకోత సమాజం (Cross section of the society) చేత - అంటే, వివిధ వయస్సుల వారి చేత, వృత్తుల వారిచేత, అంతస్తుల వారిచేత రకరకాల వ్యక్తుల చేత, వారికి ఒక్కొక్కరికి ఒక్కో గది ఇచ్చి, ఒకరితో ఒకరు సంభాషించుకొనే వీలు లేకుండ ఏర్పాట్లు చేసి, ఆ నవలను చదివించి వారి వారి అభిప్రాయాలను తీసుకొని ఆ నవల అశ్లీలం కాదని తీర్పు వెలువరించాడు. అయితే భారతదేశంలో ఒక జడ్జీ మాత్రమే చదివి దానిని అశ్లీలమని నిర్ణయించి, దానిని నిషేధించారు. ''అది బ్రిటీషు పద్ధతి. ఇది భారతీయ పద్ధతి'', అన్నారు రవీంద్రనాథ్. ఆ రోజుల్లో లండన్ నుంచి వచ్చే Encounter అనే మాస పత్రికలో ఈ విషయాలన్నీ పడేవి. ఎన్‌కౌంటర్ ఒక అద్భుతమైన పత్రిక. అది ఇప్పుడు లేదు.

'అలవాటైన ప్రాణం' చరిత్ర అంతటితో ముగియలేదు. రవీంద్రనాథ్ ఆనాడు చెల్లించిన ఐదు వందల రూపాయలను, బాగా ఆర్థికంగా వెసులుబాటులో ఉన్న నేటి భరద్వాజ, అప్పటి విషయాన్ని గుర్తు పెట్టుకొని రవీంద్రనాథ్ ఇంకా ఒకటి రెండు నెలలలో తుదిశ్వాస విడుస్తారనగా, వారి పెద్దబ్బాయి రవీంద్రనాథ్, మనుమడు రామోజీరావుతో కలిసి ఇచ్చి ''వడ్డీ లేదు గాని అసలు పుచ్చుకోండి'' అని నా సమక్షంలో బాకీ తీర్చివేశారు. అదీ అలవాటైన ప్రాణం.

రవీంద్రనాథ్ వెలుగులోకి తెచ్చిన రచయితలు ఒక్క శారద (నటరాజన్), భరద్వాజలే కాదు, ఆలూరి భుజంగరావు, ప్రకాశరావు, శార్వరి, అమరశ్రీ, తాళ్ళూరి నాగేశ్వరరావు, హితశ్రీ, శివం, శ్రీనివాసరావు, చౌడేశ్వరి దేవి, వెంపాశా, రంగాచార్య, కొలను బ్రహ్మానందరావు, నిస్సాపనేని సుబ్బారావు, ఈదర లక్ష్మీ నారాయణ, పోలవరపు శ్రీహరిరావు, మొదలైన ఇంకా ఎందరో ఉన్నారు. ఈ కొత్త ముఖాలను అటు చలం ఇటు కొప్పరపు సుబ్బారావుల సరసన నిలబెట్టారు.

వీరందరిని వెలుగులోకి తేవడంలో రవీంద్రనాథ్ ఒక ''కొలబద్ద''ను ఉపయోగించారు. ''రచన బాగా ఉండడం ఉండక పోవడమే'' ఆ కొలబద్ద. ఒడ్డూ పొడుగు, ఇతర 'లావు'లను ఆయన ఎప్పుడూ పరిగణనలోకి తీసుకోలేదు. ఈ కొలబద్దను ఆయన ఎంత కఠినంగా అమలు జరిపిందీ ఒక్క చలం సంగతి చూస్తే అర్థం అవుతుంది.

చలం ముందు 'హంకొ మొహబత్', 'స్టేషన్ పంపు' కథలను వరుసగా పంపారు. ఈ రెండింటిని రవీంద్రనాథ్ జ్యోతి పత్రికలో ప్రచురించారు. ఆ తరవాత చలం మరో కథ 'కళ్యాణి' ని పంపారు. ఆ కథ నచ్చలేదు. అంతకు ముందరి రెండు కథలకంటె భిన్నంగా లేదు. అంతే దానిని తిరిగి చలంకు పంపివేశారు. ఆయన దానిని తిరిగి 'ఆంధ్రజ్యోతి' మాసపత్రిక(మద్రాసు)కు పంపగా, ఆ పత్రిక దానిని ప్రచురించింది.

రవీంద్రనాథ్ వెలుగులోకి తీసుకు వచ్చిన రచయితలలో ఆలూరి భుజంగరావు ఒకరు. నేను వీరిని ''రవీంద్ర స్మృతి''కి ''నాటి రవీంద్రనాథ్‌ను గురించి మీకు తెలిసింది, మీ అనుభవాలు రాసి పంపండి'', అని పలుమార్లు ఉత్తరాలు రాశా. నా ఉత్తరాలకు ఆయన ప్రతిస్పందించలేదు. ప్రతిస్పందించక పోవడానికి కారణం ఒక మిత్రుని ద్వారా తెలిసింది. ''ఆ రోజుల్లో తెనాలి జ్యోతి ప్రెస్‌లో పనిచేసే ఒక గుమాస్తాయెడ రవీంద్రనాథ్ గారి ప్రవర్తన తీరు నాకు నచ్చలేదు. అందుకని నేను రాయదలచ లేదు'', అని భుజంగరావు గారు అన్నారట. ''ఏ విషయంలో ఆయన తీరు నచ్చలేదట?'' నేను నా మిత్రున్ని అడిగాను. ఆయన ఇలా బదులు చెప్పారు: ''ఒక గుమాస్తా రవీంద్రనాథ్ గారికి చెప్పకుండా కాష్‌లోంచి వంద రూపాయలు వాడుకొన్నాడట. రవీంద్రనాథ్‌గారు దానిని వదిలిపెట్టకుండ పోలీసుల వరకు తీసుకు వెళ్ళారట. పోలీసుల వరకు తీసుకువెళ్ళడం ఆలూరి భుజంగరావు గారికి నచ్చలేదట''.

నేను నా మిత్రునితో అన్నాను: ''చెప్పకుండా తీయడం. మొదటి తప్పు. వాడుకొని చెప్పక పోవడం అంతకంటె తప్పు. వాడుకొని చెప్పి ఉంటే ఆయన క్షమించి ఉండేవారేమో. డబ్బు తీసి చెప్పకపోవడం ఏ ప్రమాణరీత్యా చూసినా అది ఒప్పు అనిపించుకోదు. వెంటనే తప్పైపోయిందని అతడు ఒప్పుకొని ఉంటే రవీంద్రనాథ్ తప్పక క్షమించి ఉండేవారు. ఇది ఆయనతో పరిచయం ఉన్నవారెకెవరికైనా తెలిసిన విషయమే.''

(ఈ సంఘటన నాకు చేరిన విధంగా జరిగి ఉంటే నేరాసిన దాంట్లో దోషం లేదు. మరో విధంగా జరిగి నాకు చేరిన తీరు మారి ఉంటే దోషాన్ని సవరించుకోవడానికి సిద్ధం)

రవీంద్రనాథ్ జ్యోతి, రేరాణి, సినీమాల ద్వారా కొందరు రచయితలను 1948 ప్రాంతాల్లో వెలుగులోకి తీసుకొస్తే ఆ తరవాత నాలాంటి వారిని గూడ రచయితగా నిలిపిన ఖ్యాతి ఆయనకే దక్కుతుంది. నాలోని రచయిత బయటకు రావడానికి ముఖ్యంగా దోహదం చేసింది ఆయనే.

నేను 1981 మార్చి, ఏప్రిల్‌ల నాటికి నా స్వప్న సందేశాన్ని పూర్తి చేశా. స్వప్నసందేశం అంటే కలలు చెప్పే అర్థాలు, ఇది సైకాలజీ గ్రంథం. మాటల సందర్భంలో దానిని రచించడానికి దారి తీసిన నేపథ్యాన్ని ఏకరువు పెట్టాను. ''రేపు'' పత్రిక సంపాదకులు సి. నరసింహారావు స్వప్న మనో విజ్ఞాన శాస్త్ర గ్రంథాలు దాదాపు ఒక డజను ఇచ్చి, ''రేపు'' పత్రికకు ధారావాహికంగా స్వప్నాలను గురించి రాయండని కోరారు. నేను ముందు రెండు వ్యాసాలు రాసి పంపాను. నరసింహారావేమో ఆ రెండు వ్యాసాలను తన పేరుతో ప్రచురించుకొన్నాడు. నాకు కోపం వచ్చి ఆ తరవాత రాయడం మానివేశాను. కాని ''రేపు''లో వ్యాసాలు రాయడం కోసం ఆయన

ఈ ''అలవాటైన ప్రాణం'' తరవాత పెద్ద చరిత్రనే సృష్టించింది. ఈ కథ అశ్లీలమని పోలీసులు కేసు పెట్టారు. - న్యాయాధిపతి రచయితకు ఐదువందల రూపాయలు జరిమానా అది చెల్లించక పోతే ఆరు నెలల కారాగారం. భోజనానికే సరిగా లేని భరద్వాజ ఎక్కడ నుంచి తెచ్చి కడతాడు? జైలుకే సిద్ధపడ్డాడు. రవీంద్రనాథ్ ఆ ఐదువందలు తాను చెల్లించి భరద్వాజకు జైలు కూటి అనుభవం దక్కకుండ చేశారు. (ఈమాట భరద్వాజదే - ఋషిపథం 1994 ఆగస్టు)

జడ్జిగారు సరిగా చదవకుండానే తీర్పు చెప్పారేమో, ''ఏదీ ఆ కథను నాకొకసారి ఇవ్వు, మళ్ళీ చదువుతాను'', అని తీర్పు వెలువరించిన తరవాత భరద్వాజను అడిగారట. ఈ సంగతి భరద్వాజ గారే నాతో అన్నారు.

ఆ తరవాత 1959 ప్రాంతాల రవీంద్రనాథ్‌తో ఈ విషయం చర్చించారు. సందర్భం ఏమిటంటే డి. హెచ్. లారెన్స్ రాసిన ''లేడీ చాటర్లీస్ లవర్''ను పెంగ్విన్ వాళ్ళు ప్రచురించగా లండన్‌లో దాని మీద కోర్టుకెళ్ళడం జరిగింది. అక్కడ జడ్జి ఆ నవలను తాను చదవడమే కాకుండా, అడ్డుకోత సమాజం (Cross section of the society) చేత - అంటే, వివిధ వయస్సుల వారి చేత, వృత్తుల వారిచేత, అంతస్తుల వారిచేత రకరకాల వ్యక్తుల చేత, వారికి ఒక్కొక్కరికి ఒక్కో గది ఇచ్చి, ఒకరితో ఒకరు సంభాషించుకోనే వీలు లేకుండ ఏర్పాట్లు చేసి, ఆ నవలను చదివించి వారి వారి అభిప్రాయాలను తీసుకొని ఆ నవల అశ్లీలం కాదని తీర్పు వెలువరించాడు. అయితే భారతదేశంలో ఒక జడ్జి మాత్రమే చదివి దానిని అశ్లీలమని నిర్ణయించి, దానిని నిషేధించారు. ''అది బ్రిటీషు పద్ధతి. ఇది భారతీయ పద్ధతి'', అన్నారు రవీంద్రనాథ్. ఆ రోజుల్లో లండన్ నుంచి వచ్చే Encounter అనే మాస పత్రికలో ఈ విషయాలన్నీ వచ్చేవి. ఎన్‌కౌంటర్ ఒక అద్భుతమైన పత్రిక. అది ఇప్పుడు లేదు.

'అలవాటైన ప్రాణం' చరిత్ర అంతటితో ముగియలేదు. రవీంద్రనాథ్ ఆనాడు చెల్లించిన ఐదు వందల రూపాయలను, బాగా ఆర్థికంగా నిలదొక్కుకున్న నేటి భరద్వాజ, అప్పటి విషయాన్ని గుర్తు పెట్టుకొని రవీంద్రనాథ్ ఇంకా ఒకటి రెండు నెలలలో మరణిస్తారనగా, వారి పెద్దబ్బాయి రవీంద్రనాథ్, మనుమడు రామోజీరావుతో కలిసి వచ్చి ''వడ్డీ లేదు గాని అసలు పుచ్చుకోండి'' అని నా సమక్షంలో బాకీ తీర్చివేశారు. అదీ అలవాటైన ప్రాణం.

రవీంద్రనాథ్ వెలుగులోకి తెచ్చిన రచయితలు ఒక్క శారద (నటరాజన్), భరద్వాజలే కాదు, ఆలూరి భుజంగరావు, ప్రకాశరావు, శార్వరి, అమరశ్రీ, రాచకొండ నాగేశ్వరరావు, హితశ్రీ, శివం, శ్రీనివాసరావు, చౌడేశ్వరి దేవి, వెంవాశా, రంగాచార్య, కోలవెన్ను బ్రహ్మానందరావు, నన్నపనేని సుబ్బారావు, ఈదర లక్ష్మీ నారాయణ, పోలవరపు శ్రీహరిరావు, మొదలైన ఇంకా ఎందరో ఉన్నారు. ఈ కొత్త ముఖాలను అటు చలం ఇటు కొప్పరపు సుబ్బారావుల సరసన నిలబెట్టారు.

వీరందరిని వెలుగులోకి తేవడంలో రవీంద్రనాథ్ ఒక ''కొలబద్ద''ను ఉపయోగించారు. ''రచన బాగా ఉండడం ఉండక పోవడమే'' ఆ కొలబద్ద. ఒడ్డూ పొడవు, ఇతర 'లావు'లను ఆయన ఎప్పుడూ పరిగణనలోకి తీసుకోలేదు. ఈ కొలబద్దను ఆయన ఎంత కఠినంగా అమలు జరిపిందీ ఒక్క చలం సంగతి చూస్తే అర్థం అవుతుంది.

ఆ తరవాత దానిని నేను తెలుగులో 'ప్రేమించడం ఒక కళ'గా తెలుగు లోకానికి పరిచయం చేశాను. 'ప్రేమ పాఠాలు' అని పేరు పెడితే తెల్లవారేటప్పటికి ఒక్క కాపీ కూడ లేకుండ అమ్ముడు పోయేవే కాని పాఠకులను అలా తప్పు దారి పట్టించడం ఆయనకు ఇష్టం లేదు. అందుకనే 'ప్రేమించడం ఒక కళ'గా దానికి పేరు పెట్టాను. ఈ పేరైతే గ్రంథంలోని విషయాన్ని చక్కగా ప్రతిబింబిస్తుంది. ఆ తరవాత దీనిని చాలా కాలానికి 1988 ఆగస్టులో పల్లవి పబ్లికేషన్స్ విజయవాడవారు వేశారు.

తరవాత నాకు అత్యంతంగా ఖ్యాతి తెచ్చి పెట్టిన గ్రంథం ''సిగ్మండ్ ఫ్రాయిడ్''. ఇది బయటికి రావడానికి ఆయనే కారణం. 1948లో ఆయన నడిపిన ''రేరాణి''లో ఎవలాక్ ఎలిస్, సెక్స్, సిగ్మండ్ ఫ్రాయిడ్ రచనలను పరిచయం చేసిన రవీంద్రనాథ్ ''సిగ్మండ్ ఫ్రాయిడ్ జీవితం - ఆయన కృషి'ని గురించిన సమగ్ర గ్రంథం ఇంతవరకు తెలుగులో రాలేదు మీరు ఎందుకు ఆ ఖాళీని భర్తీ చేయరాదు? కావాలంటే పుస్తకాలు నేను సమకూరుస్తాను'', అని నన్ను ప్రోత్సహించి, ఆవైపుకు నన్ను తిప్పారు. ఇది ఎప్పుడో 1970ల నాటి మాట. ఆ తరవాత నేను దానిని చాలా బాగానే రాశాను. లేకపోతే దానిని తెలుగు అకాడెమీ, హైదరాబాద్, ఆరు పునర్ముద్రణలు వేయదు. తెలుగు అకాడెమీ దీనిని ప్రచురించడానికి 1985 కి గాని వీలు పడలేదు. నేను రాసిన సిగ్మండ్ ఫ్రాయిడ్ రాత ప్రతిని రవీంద్రనాథ్‌కిచ్చాను, ఆయన దానిని తెలుగు అకాడమీ డైరెక్టరుకిచ్చి చూడమన్నారు. ఆయన చూసి ప్రక్కన పడేశారు. తరవాత మళ్ళీ కొంత కాలానికి రవీంద్రనాథ్‌గారే ఫోన్ చేసి డైరెక్టరును ''ఫ్రాయిడ్ సంగతి ఏం చేశారు?'' అని అడిగారు. ఆయన ''మీరు చదివారా? బాగుందా? అకాడెమీ వేయతగిందేనా?'' అని అడిగారు ఆయన అన్నింటికి ''అవును'' అని సమాధానం చెప్పారు. వెంటనే అకాడెమీ నా చేత అగ్రిమెంట్ రాయించుకొని డబ్బు ఇచ్చివేశారు. కాని ఆ రాతప్రతిని మూలపడవేశారు. ఆ తరవాత ఎప్పుడో వెంకారెడ్డిగారు డైరెక్టరుగా ఉన్నప్పుడు, నేను వారితో మాట్లాడగా, అది 1985లో మొదటిసారిగా ముద్రితమైంది. తెలుగు అకాడెమీ ప్రచురించిన జనరంజక గ్రంథాలలోకెల్ల 'సిగ్మండ్ ఫ్రాయిడే' ఎక్కువసార్లు పునర్ముద్రిత మైంది.

ఆ తరవాత 1990లో 'మిసిమి'ని స్థాపించడమైంది. 'మిసిమి'ని మరెందుకో స్థాపిస్తే అది మరొకటి అయి కూర్చుంది. 1989, 90ల్లో జర్మనీ నుంచి అచ్చు యంత్రాలను తెప్పించుకొనే ప్రయత్నాలలో ఉన్నారు రవీంద్రనాథ్. యంత్రాలను త్వరగా దిగుమతి చేసుకోవాలన్నా, ఆయంత్రాలను వారు షిప్‌మెంట్ చేయాలన్నా ఏదైనా పత్రిక కోసమైతే పని త్వరగా జరుగుతుంది. అందుకని ఆయన 'మిసిమి'ని రిజిస్టరు చేసి, ప్రారంభించి కొంతమంది ముఖ్యమైన మిత్రులకు పంపించారు. పత్రికకోసం అనేటప్పటి మెషినరీ త్వరగా వచ్చేసింది. ఇహ పత్రికను నడపాల్సిన అవసరం లేదు. అందుకని మూసివేద్దామనుకొన్నారు. కాని ఆ మొదటి సంచికలను చదివిన మేధావి మిత్రులు, నాతో సహా, పత్రికను ఆపడానికి వీలు లేదు, కొనసాగించి తీరాల్సిందే, ''అటువంటి పత్రిక తెలుగులో లేదు, చాల బాగుంది'' అని ఆయనమీద ఒత్తిడి తెచ్చాము. 'పని మంచి పని' అందుకని మిత్రుల సలహాలకు చెవిఒగ్గి తలవంచి పత్రికను నడపడానికే

నిర్ణయించుకొన్నారు. ఆ తరవాత పేజీలు పెంచి పక్షపత్రికను మాస పత్రిక చేశారు. ఈ పత్రిక నిర్వహణ వ్యాసాల ఎంపిక, ఫార్మాట్‌ల గురించి ఎప్పటి కప్పుడు, కొన్ని సందర్భాలలో అయితే ప్రతిరోజూ తెనాలిలో ఉన్న నాతో తెల్లవారు ఝామున ఫోన్ చేసి సంప్రదింపులు జరిపేవారు.

లోగడ 1948లో జ్యోతి, రేరాణి, సినీమా పత్రికలలో వినూత్న శీర్షికలు ప్రారంభించి సాటి పత్రికల కంటె విలక్షణతను సంతరించుకొన్న తీరులోనే ఇప్పటి మిసిమి గూడ తన విలక్షణతను సంతరించుకొంది, ఆయన చేతుల్లో. 'మిసిమి' ఆయన చెక్కిన శిల్పం, అది ఆయన మూర్తిమత్వానికి, అభిరుచులకు ఆలోచనా ధోరణులకు ప్రతీక. విశేషం ఏమిటంటే ఈ పత్రికలో, గేయం, కవిత్వం, కథ, కథానిక, రాజకీయం, క్రికెట్టు, సినిమా, దురద, రస కథలు, పద్యాలు ఉండవు. మసాలా రచనలకు చోటు ఉండదు, అర్ధనగ్న పూర్ణనగ్న సినీతారల బొమ్మలుండవు. ఆయన అభిరుచికి తగినట్టు ముఖ చిత్రం ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంటుంది. అది నేటికీ కొనసాగుతున్నది. ఒకప్పుడు ఎప్పుడైన మిసిమి ముఖ చిత్రంగా నగ్న చిత్రాలు వచ్చినా అవి మహా కళాఖండాలని గుర్తించాలి. వాటిని అశ్లీల చిత్రాలుగా కాక నగ్న అధ్యయనాలు (Studies in nudity) గా పరిశీలించాలి. సౌందర్య, రసాస్వాదులైన 'మిసిమి' మేధావి పాఠకులకు ఈ వివరణ ఇవ్వనవసరం లేదు.

నా చేత ఆయన మిసిమిలో 'మేధావుల మెతకలు' శీర్షికన రూసో, టాల్‌స్టాయ్, మార్క్స్, రసెల్ లాంటి వారి మీద వ్యాసాలు రాయించారు. గొప్పవారికి గూడ మరకలు మచ్చలు ఉంటాయి. అవి ఉండడం వలన వారి ఉన్నతి ఏమైన దెబ్బతిందా? ఆ మచ్చలు లేకపోతే వారు ఇంక ఎంత మహోన్నతంగా ఎదిగిపోయేవారు - అనే విషయాలను దృష్టిలో ఉంచుకొని రాయడం జరిగింది. ఆయన నాకు పాల్ జాన్సన్ రాసిన 'ఇంటలెక్చువల్స్' అనే గ్రంథాన్ని కొని, నాకిచ్చి, దానిని ఆధారంగా చేసుకొని పై శీర్షికను నిర్వహించమన్నారు. అలాగే నెల నెలా రాసాను, ఆ తరవాత ఈ వ్యాసాలను మిసిమి ప్రచురణల క్రింద, ఒక సంపుటిగా 'మేధావుల మెతక'ల పేరుతో 1997 నవంబరు 4న ఆయన జయంతినాడు ఆవిష్కరించడం జరిగింది. ఇక్కడ ఆయన నేనూ గూడ ఒక పొరపాటు చేశాం. అదేమిటంటే మేము ''పాల్ జాన్సన్ ఇంటలెక్చువల్స్ ఆధారంగా'' అని అటు వ్యాసాలు 'మిసిమి'లో ప్రచురితమయ్యే రోజుల్లో గాని (1991), తరవాత 1994లో అవి గ్రంథరూపం పొందినప్పుడు గాని, పేర్కొనలేదు. దీనికి చింతిస్తున్నాను.

మేధావుల మెతకలు 'మిసిమి'కి హైలెట్‌గా ఉండేది. ఆ తరవాత 'మేధావుల మెతకల'ను తలదన్నే శీర్షిక పురాణం వారి ''మధుర వాణి ఇంటర్వ్యూలు'' ఇవి ధారావాహికంగా 'మిసిమి'లో వచ్చాయి. 'మిసిమి'కి ఈ శీర్షిక ఎనలేని ఖ్యాతిని ఆర్జించి పెట్టింది.

అసలు ఈ శీర్షిక గమ్మత్తుగా ప్రారంభమైంది. పూర్వం శంకర్స్ వీక్లీ వ్యంగ్య వహా చిత్ర వైభవం ఉన్న ఒక ఆంగ్ల వారపత్రిక వచ్చేది. ఆ పత్రికలో తన వ్యంగ్య చిత్రాన్ని, తనపై వ్యంగ్య వ్యాఖ్యలను చూసుకోవడానికి నెహ్రూ ఉవ్విళ్ళూరేవారట. ఆ పత్రికలో ఇమాజినరీ ఇంటర్వ్యూ (1975 వరకు వచ్చినవి) అనే ఒక శీర్షిక ఉండేది. అలాంటి శీర్షికను 'మిసిమి'లో ప్రవేశ పెడితే

ఎలా ఉంటుందని నేనూ రవీంద్రనాథ్ ఆలోచించాం. 'బాగుంటుంది, కాని తెలుగులో అలా రాయగలిగిన సమర్థులెవరు?' అనే ప్రశ్న ఎదురైంది. ఎవరూ తట్టలేదు.

అప్పుడు రవీంద్రనాథ్ తన పుత్రుడు దేవేంద్రనాథ్‌కు జూబిలీహిల్స్‌లో ఇల్లు కట్టిస్తూ ప్రక్కనే అద్దె ఇంటిలో ఉంటున్నారు. వారింటికి సమీపంలోనే పురాణం సుబ్రహ్మణ్యం గారు ఉంటున్నారు. ఆయనైతే ఈ శీర్షికను బ్రహ్మాండంగా నిర్వహించగలరనే నిర్ణయానికి వచ్చాము. చాపక్రింద నీరులా, దానితోపాటు 'తేలుకొండి' చురకలు ఆయన మాత్రమే రాయగలరనుకొని, ఆయన్ను అడగడం ఆయన సమ్మతించడం, ఆ శీర్షిక బ్రహ్మాండంగా రక్తి కట్టడం జరిగింది.

ఆ తరవాత పురాణం వారు గతించిన తరవాత, భమిడిపాటి రామగోపాలం సంకలన కర్తగా పూనుకోగా, మధురవాణి ఇంటర్వ్యూలు గ్రంథ రూపంలోకి కళాజ్యోతి పరివర్తించింది. ఆ గ్రంథం వేయి కాపీలను పురాణంగారి శ్రీమతికి, 23 మార్చి 1997న రవీంద్రభారతిలో జరిగిన రవీంద్రనాథ్ ప్రథమ వర్ధంతి సందర్భాన ఇవ్వడం జరిగింది. (రవీంద్రనాథ్ ప్రథమ వర్ధంతి వాస్తవానికి 1997 ఫిబ్రవరి 11న జరగవలసింది. కారణాంతరాల వలన 1997 మార్చి 23కు వాయిదా పడింది)

'మేధావుల మెతకలు', 'మధురవాణి ఇంటర్వ్యూలు' - రెండూ ఆయన సంపాదకత్వానికి హైలైట్లే. ఆతరవాత మిసిమి రవీంద్రనాథ్ మరణానంతరం అదేబాటలో నా సంపాదకత్వంలో నడిచింది, నడుస్తున్నది. అప్పుడు 'మేధావుల మెతకలు', 'మధురవాణి ఇంటర్వ్యూలు' మా మేధావి పాఠకులలో ఒక ఉత్‌చలనాన్ని కలిగిస్తే, ఆ తరవాత ఇప్పుడు 'పోస్టు మాడర్నిజమ్' 1999 నవంబరు - డిసెంబరు ప్రత్యేక సంచికగా వెలువడిన 'మిసిమి', 2001 సంవత్సరం మార్చి - ఏప్రిల్ సంచికలలో ఎరిక్‌ఫ్రామ్ మీద ప్రత్యేక సంచికలుగా వెలువడి మళ్ళీ మరోసారి వారిలో మేధోపర వీచికలను రేకెత్తించింది.

ఆయన 'మిసిమి' సంపాదకత్వ నిర్వహణలో ఒకటి రెండు ''మెర మెరలు'' చోటు చేసుకోకపోలేదు. ఆయనకు రచనలు నచ్చకపోతే అతడు ఎంత పెద్ద రచయిత అయినా, వాటిని తిప్పి పంపేవారు. ఈ వేటుకు చలం గూడ గురి ఆయ్యారు. వ్యాసాల ఎంపికలో ఈ మెరమెరలు తలెత్తలేదు. రచయితల యెడ సమదృష్టి సారించలేదని ఆరోపణ.

నేను పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రిగారి దగ్గరకు ఆమధ్యవెళ్ళి '' 'మిసిమి'కి ఏదైనా వ్యాసం రాయండి'' అని అర్థించాను. ''నేను రాయను'' అన్నారాయన. 'ఎందుకని?' అని నేను ప్రశ్నించాను. నేను ఆరుద్ర రాసిన గుడిలో సెక్సు మీద 'ఋగ్వేదంలో స్త్రీలు' అనే పేరుతో విమర్శరాస్తే, ఆ విమర్శను ఆరుద్రకు పంపి, ఆయన సమాధానం తీసుకొని, నా విమర్శతో పాటు ఆయన సమాధానాన్ని 1994 ఆగస్టు సంచికలో ప్రచురించారు''.

''మరి ఆయన అనుసరించిన పద్ధతి బాగానే ఉంది కదండీ'', అన్నాను. ''అక్కడే ఉంది అసలు కథ. నా విమర్శకు సమాధానం రాయించిన వారు, ఆయన సమాధానాన్ని నాకు పంపి

దానిమీద మళ్ళీ నా విమర్శను గూడ ప్రచురించాలిగదా. ఆయన ఆపని చేయలేదు ఇది అన్యాయం కదా. ఇద్దరిని సమానంగా చూడాలి కదా?''.

''అలా ఆయన చేయడం న్యాయం కాదు, నేను అంగీకరిస్తున్నాను. ఇక ఆ విషయం వదిలివేసి, 'మిసిమి'కి రాయండి'', అని అర్థించి లేచి వచ్చాను.

నా మేధావుల మెతకల మీద జస్టిస్ పి. ఎ. చౌదరి విమర్శ రాస్తే రవీంద్రనాథ్ ఆ విర్శను నాకు పంపి, నా సమాధానం తీసుకొని రెండింటిని ఒకే సంచికలో ప్రకటించారు. ఇది మామూలుగా ఆయన అనుసరించే పద్ధతే. విమర్శ, ప్రతి విమర్శ, ప్రతి విమర్శకు విమర్శ ఇలా పోతే దానికి ''అనవస్థా దోషం'' (regressed infinitum) పడుతుందని ఎక్కడో ఒకచోట ఆపాలి కదా అని ఆపివేసి ఉంటారు. దానిని శాస్త్రిగారు మరో తీరులో చూసి ఉంటారు.

సరిగ్గా ఇలాంటిది కాదు కాని మరో సంఘట జరిగింది. కత్తి పద్మారావు రాసిన 'కులం - ప్రత్యామ్నాయ సంస్కృతి'ని ఆంగ్లం లోకి అనువదించిన డా॥ డి. ఆంజనేయులు ఆ గ్రంథాన్ని మంచిగా పొగడుతూ విమర్శ రాస్తే, ఆ విమర్శ మిసిమిలో ప్రచురితమైంది. ఆ గ్రంథంలో కత్తి పద్మారావు కువారిల భట్టును ఉదయనాచార్యుని బౌద్ధులుగా చిత్రించారు. అసలు కుమారిలభట్టు బౌద్ధాన్ని అంతం చేయడానికి కంకణం కట్టుకొన్నాడు. ఉదయనుడు బౌద్ధులతో వాదవివాదాలకు దిగినవాడు. ఇటువంటి వీరిద్దరిని బౌద్ధులుగా చిత్రించడం తప్పు. సమీక్ష రాసిన ఆంజనేయులు ఇటువంటి మౌలిక విషయాన్ని పూర్తిగా తన విమర్శలో విస్మరించాడు. ఈ విషయాన్ని ఎత్తిచూపుతూ 'మిసిమి'కి టి. రవిచంద్ వ్యాసం రాశారు. దానిని రవీంద్రనాథ్ 'మిసిమి'లో వేయకపోతే అది తరవాత ''ఆహ్వానం''లో ప్రచురితమైంది. ''ఎందుకు వేయలేదు?'' అని రవీంద్రనాథ్‌ను రవిచంద్ ప్రశ్నిస్తే, ''విమర్శ రాసిన ఆంజనేయులు - పెద్దవాళ్ళు. పెద్దవాళ్ళ లోపాలను ఎత్తిచూపడం బాగుండదు'', అని అన్నారాయన.

పెద్దల యెడ, మిత్రుల యెడ అంత నిర్మోహమాటంగా ఉండలేని బలహీనత ఆయనకుంది. దీనిని కాదనలేము.

తరవాత, ఆంధ్రదేశంలో తొలి తరానికి చెందిన కమ్యూనిస్టు రచయితలలో ఒకరై, దాదాపు విస్మృతులై, ఆయన్ను గురించి ఏ కొద్దిమందికో ఏ కొద్దిగానో తెలిసినా, వారు ఆయన్ను గురించి పట్టించుకోని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఆయన మీద విశేష కృషి చేసి టి. రవిచంద్ వెలుగులోకి తీసుకు రాగా, దానిని 'మిసిమి'లో ప్రచురించి ఒక విస్మృత మేధావి కె. బి. కృష్ణను తెలుగులోకానికి పరిచయం చేసిన ఘనత రవీంద్రనాథ్‌కే దక్కింది.

దేన్నికైనా అందమైన పేరు పెట్టడంలో ఆయనకు ఆయనే సాటి. ఆయన తెనాలి బోసురోడ్డులో స్థాపించిన పుస్తక ప్రచురణ సంస్థ పేరు 'జాకోబిన్ పబ్లిషర్స్'. ఇటువంటి పేరును మనం చూడం. అందులో పుస్తక ప్రచురణల సంస్థకు పెట్టడం. 1781 నుంచి 1794 వరకు అత్యంత క్రియాశీలకంగా ఉండి, ఉగ్రవాదాన్ని పెంచి పోషించిన రాడికల్ రాజకీయ క్లబ్‌లో జాకోబిన్‌లు

సభ్యులు. ఈ పేరు దానికి పారిస్ డొమినికన్ కాన్వెంటు నుంచి వచ్చింది. మొదటగా సభ్యులంతా సమావేశమైంది ఈ కాన్వెంట్‌లోనే. ఏతావాతా, జాకోబిన్ అనే ఫ్రెంచి పదానికి అర్థం ఏమిటంటే విధానాలలో (పాలసీలలో) 'అతి రాడికల్' అని. మరి జాకోబిన్ పబ్లిషర్స్ తెనాలి వారు ప్రచురించిన పుస్తకాలు నాకేమీ గుర్తులేవు. వాటిల్లో ఏమైనా రాడికల్ మూలనం ఉందేమో అంతకంటె తెలియదు.

జాకోబిన్ పేరు తెలుగువాడికి విచిత్రంగా అనిపిస్తే ఆయన విజయవాడ ఇంటిపేరు 'పల్లవి'. అలాగే హైదరాబాద్‌లోని తన ప్రింటింగ్ ప్రెస్‌కు తన భార్య కళావతీ, మనుమరాలు జ్యోతి (పాత ప్రెస్ పేరు జ్యోతి) కలిసివచ్చేట్లుగా 'కళాజ్యోతి ప్రాసెస్' అని పేరు పెట్టారు. భార్య మరణానంతరం, తెనాలి శాఖాగ్రంథాలయంలో ఒక పీఠాన్ని నెలకొలిపి దానికి 'ఆలపాటి కళావతీ రవీంద్రపీఠం' అని పేరు పెట్టారు. ఇప్పుడీ కేంద్రం దాదాపు ప్రతినెల ఏదో ఒక సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించి, వ్యాపారజీవితంలో మగ్గి మునిగిపోయిన తెనాలి జీవన సరళికి సాంస్కృతిక శ్వాసను అందిస్తున్నది. వీటి అన్నింటికంటె 'మిసిమి' పేరు విచిత్రమైంది. ఒకసారి ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి 1992లో వడ్లమూడి విజ్ఞాన్ కళాశాలలో ఏదో ఫంక్షన్‌కు వచ్చి ''మిస్టర్ రెడ్డీ, 'మిసిమి' ఏ భాషా పదం అంటావ్? దానికి అర్థం ఏమిటి''? అని నన్ను అడిగారు. అది ఏ భాషా పదమో, దానికి అర్థం ఏమిటో ఖచ్చితంగా చెప్పజాలినంత భాషా పరిజ్ఞానం నాకు లేదు సర్ (నేనాయన దగ్గర 1954 - 57 ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుకొన్నాను). అయినా నేను దానికి 'బంగారం అర్థం అని అనుకొంటున్నాను', అని చెప్పాను. అయినా ఎందుకైనా మంచిదని అక్కడే ఉన్న తెలుగు ఆచార్యుడు డా॥ గరికిపాటి నరసింహారావుని అడిగాను. ఆయన నేను చెప్పిన దాన్ని ధృవీకరించారు.

తరవాత ఈ 'మిసిమి' పేరును తన మరో మనుమరాలికి పెట్టారు. 'మిసిమి' కార్యాలయానికి **Editorial Nest** అని పెట్టారు. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే ఆయన నామకరణ కళా విశేషం తెలియజేయడానికే.

తరవాత ఆయన సమయపాలన చాల గొప్పది. ఇమ్మ్యాన్యూల్ కాంట్ కోనిగ్స్‌బర్గ్‌లో రోజూ సాయంత్రం ఒకే సమయంలో తన యింటి నుంచి వాహ్యాళికి బయలుదేరేవాడు. ఆయన వీధిన అలా వెళ్తుంటే అక్కడి టవర్ క్లాక్ సమయాన్ని ఆయన రాకను బట్టి దిద్దుకొనేవారట. మరి రవీంద్రనాథ్ గూడ అంతే. నేను హైదరాబాద్ వెళ్ళినప్పుడల్లా వారింటిలోనే బస చేసేవాడిని. రోజూ ఉదయం ఏడు గంటలకు కారులో బయలుదేరి సుభాష్ కాంపౌండ్‌లో ఉన్న జ్యోతి ప్రెస్ వాకిట్లో కాలిడేసరికి గడియారం ఖచ్చితంగా ఎనిమిది చూపించేది. ఎనిమిదింటికి ఆయన ప్రెస్ తలుపులు తెరిపించేవారు. మధ్యలో ఒక మలుపు వుండేది ఖచ్చితంగా అక్కడికి వచ్చేసరికి 7.50 నిముషాలు అయ్యేది ప్రతిరోజు ఆ మలుపు దగ్గర గడియారం 7.50 చూపించాల్సిందే. తెల్లవారుఝామున 5.30 గంటలకు **B.B.C.** వార్తలు విని తీరవలసిందే. లంచ్ తరవాత నిద్ర. ఆనిద్రకు ఎట్టి పరిస్థితులలోను అంతరాయం కలగడానికి వీలు లేదు. దినచర్యలో అంత ఖచ్చితంగా సమయాన్ని పాటించేవారు.

ఆయనలో నేను మెచ్చిన గుణం - ఇతరులు ఎంత పెద్దవారైనా చిన్నవారైనా వారిని గౌరవించే తీరు. ఒక చిన్న సంఘటన చెబుతాను. అదే సంవత్సరమో నాకు గుర్తులేదు. ఆయన హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చి కెనాల్ గెస్ట్‌హౌస్‌లో దిగి, నన్ను విజయవాడ వచ్చి తనను కలవమని ఫోన్ చేశారు. నేను ఆయన చెప్పిన విధంగానే మధ్యాహ్నం మూడుగంటలకు గెస్ట్‌హౌస్‌కు వెళ్ళాను. అయితే ఆ సమయానికి ఆయన ఏదో పనిమీద ఎక్కడికో వెళ్ళారు. వెళ్తూ అక్కడ ఉన్న వాచ్‌మన్‌కు ఇచ్చిన ఆదేశాలు ఇవి: ''తెనాలి నుంచి నా స్నేహితులొకాయన వస్తారు. వారిని ఈ కుర్చీలో కూచోబెట్టు, ఈ 'టైమ్' పత్రిక ఇవ్వు. అది చదువుకోమను. ఇక్కడ ఫ్లాస్కులో కాఫీ ఉంది. ఈ కాఫీ ఆయనకివ్వు''. ఆ వాచమన్ అక్షరాల ఆ ఆదేశాలను పాటించాడు. ఇందులో మనం గమనించాల్సింది వచ్చే గెస్ట్ మనస్తత్వాన్ని, స్వభావాన్ని బట్టి, అతనికి ఎలా ఉంటే బాగుంటుందో ఆలోచించి, అలాంటి ఏర్పాట్లు చేయడం, అసలు గెస్ట్‌ను ''పట్టించుకోవడం''.

ఆయన పుస్తక ప్రియుడు. పుస్తకాలను చాల సేకరించారు. సేకరణం అంటే సంగ్రహించడం కాదు, కొనడం. అలా పుస్తకాలు, టైమ్ పత్రిక, సైకాలజీ టుడే, ఎన్‌కౌంటర్ (ఇంగ్లండు)లను చదివి, ఎవరితోనైన, ఏ విశ్వవిద్యాలయాచార్యునితోనైనా ఏ విషయం (Subject) మీదనైన పండితుని స్థాయిలో కాకపోయినా, ''అర్థవంతమైన సంభాషణం'' (Meaningfull dialogue) చేయగల స్థాయికి ఎదిగారు. హైస్కూలు విద్య దాటని ఆయన Encyclopedia Britanicaను తన గ్రంథాలయంలో చేర్చుకొన్నారంటే ఎవరైన ఆయన ఏమిటో ఊహించుకోవచ్చు. ప్రతి ఆదివారం (నేను హైదరాబాద్‌లో ఆయనతో ఉన్న ఆదివారాలు) హైదరాబాద్ నగర వీధుల్ని పేవ్‌మెంట్‌ల మీద పాత పుస్తకాలమ్మే చోట్ల మేమిద్దరం ప్రత్యక్షం. నచ్చినవి కొనేవాళ్ళం. ఎప్పుడూ ఆయన వాటిని తనకోసమే కొనేవారు కారు. నా కోసం గూడ. నేను ఏదైన ఒక బుక్ రివ్యూ చదివి ''నాకు ఆ పుస్తకం నచ్చింది, కావాలి'', అంటే, అది ఎక్కడిదైనా, అమెరికాదైనా తెప్పించేవారు.

ఒకసారి P. Lal అని కలకత్తాలోని జేవియర్ కళాశాల అనుకొంటాను. ఆ కళాశాలకు చెందిన ఆచార్యులు ఆంగ్లంలోకి అనువదించిన 'ధమ్మపదం' కావాలని కోరినదే తడవుగా తెప్పించారు. ఆయనకు అంతకు ముందే బౌద్ధం మీద ఉన్న ఆసక్తి అలాగే కొనసాగడానికి అది దోహదం చేసింది. 'మిసిమి' పత్రిక మకుటం "All that we are is the product of what we have thought" is "We are what we think." - ని ఆ గ్రంథం నుంచే గ్రహించడం జరిగింది. ఈ లాల్ ధమ్మ పదాన్ని 1967లోనే నా కోసం కొనడం జరిగింది. నేను చదివి ఆయనకు ఇచ్చాను. ఆ తరవాత ''ఇప్పుడు నేను లాల్ ధమ్మ పదాన్ని చదువుతున్నాన''ని నాకు 1968 జనవరి 5న రాసిన లేఖలో పేర్కొన్నారు. (ఈ లేఖ స్మృతి సంచికలోనే వేరోచోట ప్రచురితమైంది - చూడండి).

బౌద్ధంలో ఆయనకు నచ్చింది: ''బుద్ధునికి మానవుడు కేంద్రం, దేవుడు కాదు. బౌద్ధం యుక్తి (Reason) సహజమైంది. అనుభవం (experience) బుద్ధునికి ప్రాతిపదిక''. - ఈ మూడు అంశాలలో రెండు అంశాలు - రేషనలిజమ్, హ్యూమనిజాలను - యమ్. యన్. రాయ్

రవీంద్రనాథ్ యువకుడిగా ఉన్నప్పుడే నాటారు. అవి ఆయన జీవిత భూమికలయ్యాయి. ఇటువంటి భావాలు ఎప్పుడో ఆయనలో బీజావాపం జరగడం వల్లనే సంప్రదాయాన్ని కాదని, తన వివాహాన్ని తాపీ ధర్మారావు, త్రిపురనేని రామస్వామి చౌదరిల నేతృత్వంలో చేసుకొన్నారు.

ఆయనకు వివాహమైన కాలంలో స్కూళ్ళల్లోను, కళాశాలల్లోను ''స్త్రీకి విద్య అవసరమా?'' అనే అంశం మీద వక్తృత్వ పోటీలు పెట్టి, పిల్లలచేత చర్చింపజేసేవారు. మరి ఆ రోజుల్లో స్త్రీకి విద్య అనవసరమని భావించేవాళ్ళు కూడ చాలమంది ఉండేవారు, అందుకే ఆ చర్చ.

అయితే రవీంద్రనాథ్ తన కాలానికంటె ఎప్పుడూ ముందున్నవాడు గనుక, అభ్యుదయ భావాలకు దోహదం చేసేవాడు గనుక, ఖాదీ హిందీలతో ప్రభావితుడైనాడు గనుక, స్త్రీకి విద్య అవసరమని భావించినవాడు కనుక, తన సతీమణికి హిందీ పాఠాలను తెనాలి హిందీ ప్రేమీ మండలికి చెందిన సుభద్రాదేవిగారితో చెప్పించారు.

రవీంద్రనాథ్‌గారి సతీమణి కళావతి ఈమెది విజయవాడ. వివాహమై గోవాడలో ఉంటున్నప్పుడు ఈమెకు హిందీ చదువుకోవాలనే ఆకాంక్ష గలిగింది. ఆ రోజుల్లో తెనాలిలో హిందీ ప్రేమీ మండలి తొలి అడుగులు వేస్తున్నది. దానిని బోయపాటి నాగేశ్వరరావు, ఆయన సతీమణి సుభద్ర నిర్వహిస్తూ ఉండేవారు. వీరిద్దరు హిందీ ప్రచారానికి బద్ధ కంకణులు కనుక, విద్యార్థుల ఇళ్ళకు వెళ్ళి పాఠాలు చెప్పేవారు. ఆ విధంగా సుభద్రగారు రోజూ తెనాలి నుండి గోవాడ వెళ్ళి కళావతి గారికి హిందీ పాఠాలు చెప్పివచ్చేవారు. ఆ విధంగా హిందీ - ఖద్దరు రెండూ జనాళి మనస్సులను ఆకట్టు కున్నాయి.

తరవాత ''ఆయన రాసే మనిషి కూడ'' అని చాల మందికి తెలియదు 'ప్రేమాయణం రసాయనమా?' అనే వ్యాసం 1994 'తెలుగు జగతి' ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభల ప్రత్యేక సంచిక - మద్రాసులో ప్రచురితమైంది. ఈ వ్యాసం ఎవరైన చదివి లోతులను పరిశీలిస్తే 'ప్రేమ' గురించిన ఆయన అవగాహనాస్థాయి ఏమిటో అర్థమవుతుంది... (ఈ వ్యాసం ఈ రవీంద్ర స్మృతి సంచికలో ప్రచురితమైంది చూడండి.) ప్రధాని నెహ్రూ ప్రేమ లేఖలు (1991 సెప్టెంబరు, మిసిమి), 'బహుముఖ రామాయణం' (1993 మార్చి మిసిమి) - సమీక్షలు వచ్చాయి. కనుక ఆయన సమీక్షకుడు కూడా. తరవాత అనువాదకుడు కూడా: నాదబ్రహ్మ బీథోవెన్ (1991 ఆగస్టు మిసిమి) అనువాదం వచ్చింది, అంతేకాదు భావానువాదకుడు కూడా. ఇరావతీ కార్వే రాసిన యుగాంతం నుంచి కుంతి, కర్ణుడు, కృష్ణుడు, ద్రౌపది మొదలైన పాత్రల చిత్రణను హృద్యంగా భావానువాదం చేశారు. ఇవన్నీ 1995 సంవత్సరం మిసిమి సంచికలలో వచ్చాయి.

తరవాత మిసిమిని నడపడం కష్టమని ఒక దశలో భావించారు. మానసికంగా, ధనపరంగా స్తోమతు లేక కాదు. రచయితలు - సరైన రచయితలు లేకపోవడం వలన. అప్పుడు నేను ఒక సలహా ఇచ్చాను: ''ముందు పత్రికలో రచయితలకు ఒక అపీలు వేద్దాం. రచయితల ప్రతిస్పందన చూద్దాం. అప్పటికీ వారి ప్రతిస్పందన ఆశాజనకంగా లేకపోతే, మన ఇద్దరం ఆంధ్రలోని నగరాలు

పట్టణాలు అన్నీ పర్యటన చేద్దాం. ఆయా చోట్ల రచయితలను వ్యక్తిగతంగా కలుద్దాం. తప్పక ప్రయోజనం ఉంటుంది.'' ఈ అపీలుకు విషయం రాసింది నేను. ''రచయితల కాటకం'' అని ఆయన దానికి శీర్షిక పెట్టారు. ఇది 1995 సంవత్సరం ఫిబ్రవరి నెల 34వ పేజీలో అచ్చైంది.

కుడ్యంలో ఒక రాయి ఊడింది. తొర్ర పడింది. తొర్రను ఎవరు పూడ్చగలరు? ఆరాయే పూడ్చగలదు. మరేరాయీ పూడ్చలేదు, ఆ రాయి ఎంత మున్ముమ్మార్తులా అలాగే ఉన్నా.

రవీంద్రనాథ్ 1996 ఫిబ్రవరి 11న గతించారు. నా ఈగో కుడ్యంలో ఒక రాయి ఊడింది. ఖాళీ ఏర్పడింది. దానిని వేదనాపూరిత శూన్యం నింపింది. అది పూరించడం ఎప్పటికీ ఎవరి వల్లా సాధ్యం కాదు.

మిసిమి లాంటి మేధో సంపన్న పత్రికకు నేను ఏనాడూ సంపాదకుడనవుతానని కలగనలేదు. నాకు రవీంద్రనాథ్ 'ఆల్టర్ ఈగో' అన్న సంగతి గుర్తించిన ఆయన కుమారుడు బాపన్న నాకా అవకాశం కల్పించారు. దీనికి రవీంద్రనాథ్ మరో కుమారుడు దేవేంద్రనాథ్, కుమార్తె దుర్గ ఆమోదముద్ర వేశారు.

చారిత్రక నియతి వాదాన్ని నమ్మితే నాకు తెలియకనే, నా ఆల్టర్ ఈగో ముందుగానే, భావి మిసిమి సంపాదకునిగా నన్ను శిల్పించింది. దీనిని మరోవిధంగా ఎలా వివరించ గలను?

రవీంద్రనాథ్ బాటలో మిసిమిని నడపాలని సంకల్పం. కాని నాకు రవీంద్రనాథ్ గారికి కొన్ని తేడాలున్నాయి, ఆయన ఎంతగా నా 'ఆల్టర్ ఈగో' అయినా ఆయనలో రస, సౌందర్యాలు తొణికిసలాడుతుంటే, నన్ను సిద్ధాంతాలూ, దర్శనాలు, తర్కం ఆకట్టుకొన్నాయి. ఫలితంగా ఆయన పచ్చని చెట్టు అయితే, నేను ఎండువారిన కట్టెను - ఇద్దరం ఒకే వృక్షానికి చెందిన వారమైనా. ఈ తేడా మిసిమిలో ప్రతిఫలించింది. సహృదయులైన మిసిమి పాఠకులు ఈ విషయం ఇప్పటికే గ్రహించి ఉంటారు.

ఏమి చేస్తాం: "No two minds are alike in this universe"

అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తెనాలి వి. ఎస్. ఆర్. కళాశాలలో
తర్క, తత్వ శాస్త్రోపన్యాసకులుగా పనిచేసి రిటైరయ్యారు.
కేంద్రమానవ వనరుల శాఖ సీనియర్ ఫెలోషిప్ - ప్రస్తుతం 'మిసిమి' సంపాదకులు.

జూలై - 1997

వెం - రూ॥ 6/-

మాస పత్రిక

తెనాలి – ఓ రకంగా నాకు అమ్మ వొడి లాంటిది. అక్కడ ఉద్యోగం దొరకడం నా అదృష్టం! ఆ అదృష్టాన్ని నాకు కలిగించిన వారు, ఆలపాటి రవీంద్రనాథ్ గారు. ''రేరాణి'' పత్రికలో నాదో కథ అచ్చయ్యింది. ఆ కథపేరు ''అలవాటయిన ప్రాణం''. పోలీసులు ఆ కథమీద కేసు పెట్టారు. రవీంద్రనాథ్ గారికి విషయమంతా చెప్పాను. ''నీకేం ఇబ్బంది లేదు. నేను చూసుకొంటాను'' అన్నారు రవీంద్రనాథ్ గారు. కోర్టుకు హాజరయ్యారు. నాకు రూ.*500*/- ఫైన్ వేశారు. అది చెల్లించకపోతే, *6* నెలల జైలు శిక్ష. ఫైను చెల్లించడానికి బ్యాంకు నుండి డబ్బు తెప్పించి శిక్ష నుండి విముక్తుడ్ని చేశారు.

పత్రికా ప్రచురణలో ప్రయోగశీలి

☆

డాక్టర్ రావూరి భరద్వాజ

అమ్మతోడు !

మీ మీద ఒట్టేసి చెబుతున్నాను! చాలా విషయాలు నాకు తెలియనట్లే కథలను గురించి కూడా తెలీదు.

నా చిన్నప్పుడు, మా అమ్మమ్మ, మా నాన్న, ఉయ్యాల లూపుతూ చాలా కథలు చెప్పారు. అవన్నీ నాకు నచ్చాయి. ''ఎందుకు నచ్చా''యని అడక్కండి. నేను చెప్పలేను.

కాస్త ఎదిగాక, బడికెళ్ళడంమానేశాను. మానేశాక జీవితం చాలా కథలు చెప్పింది. ఆ కథలు, ఎంత చేదుగా ఉన్నాయో, ఎంత మంటగా ఉన్నాయో ఎంత దుస్సహంగా ఉన్నాయో, ఇన్నేళ్ళ తర్వాత ఇప్పుడు కూడా నేను చెప్పలేను. కాకపోతే, సూక్ష్మంగా సూచించగలను.

నేను కథలు రాస్తానని, నన్ను తెలిసిన వాళ్ళు అనుకోలేదు; నేనూ అనుకోలేదు. కానీ రాశాను. రాశాక మిత్రులకు వినిపించాను. వారేమో 'ఆహా?' అనో 'ఛా ఛా' అనో అన్నారు.

'ఛా ఛా' అనిపించుకొన్న కథలను తిరగరాశాను. 'ఆహా' అనిపించుకున్న కథలను పత్రికలకు పంపించాను.

మీరు నమ్మండి !

కథలు రాయడం తెలియనట్లే, రాసిన వాటిని పత్రికలకు పంపించడం కూడా నా కప్పట్లో తెలియదు!

పత్రికలకు పంపించిన వాటిల్లో కొన్ని కథలు తిరిగొచ్చాయి. ఎందు కొచ్చాయో తెలీదు. కొన్ని కథల అయిపూ, ఆనమాలూ దొరకలేదు. ఎందుకు దొరకలేదో తెలీదు.

1946 ఆగష్టు 25వ తేదీతో ఉన్న ''ప్రజా మిత్ర'' వార పత్రిక, పోస్టులో నాకొచ్చినపుడు, ఎందుకొచ్చిందో తెలీదు.

రేపర్ చింపి చూశాను. రెండవ పేజీలో ''విమల'' అన్న నా కథ అచ్చయి ఉంది. అచ్చులో నా కథను చూసుకోవడం అదే మొదటి సారి.

1946 చివరిలో, యువజన శిక్షణా శిబిరంలో శిక్షణ పొందడం కోసం నెల్లూరు వెళ్లాను. అక్కడికి చాలామంది నాయకులొచ్చారు. అలా వచ్చిన వారిలో ఆచార్య రంగా గారొకరు, వారు - మా నాన్నకు దగ్గర వారు. ఆర్థికంగా నేను పడుతున్న యాతనలు చూసి, నెల్లూరు వెంకట్రామా నాయుడు గారికి నన్ను పరిచయం చేశారు. దాని ఫలితంగా ''జమీన్ రైతు'' వార పత్రికలో, నాకో చిన్న ఉద్యోగం దొరికింది. అందువల్ల నాయాతనలు కాస్త సద్దుమణిగాయి.

ఆ ఉద్యోగంలో 1947 చివరి దాకా ఉన్నానని గుర్తు.

అప్పట్లో - తెనాలి నుండి ఓ కథల పత్రిక వస్తుండేది. దాని పేరు ''జ్యోతి'' అది ''పక్ష పత్రిక- నిష్పాక్షికం'' అని కింద ఎంబ్లం ఉండేది. సంపాదకులు: రవీంద్రనాథ్.

''జమీన్ రైతు'' పత్రికలో పని చేస్తూనే, తీరిక సమయాల్లో కథలు రాస్తుండే వాణ్ని. అలా రాసిన వాటిల్లో ఒకదాన్ని ''జ్యోతి'' పత్రికకు పంపించాను. రెండు మూడు వారాల తరువాత, ఆ కథ అచ్చయింది. దాని పేరు ''దేవుడు పుట్టాడు''. ఆ కథకు అయిదు రూపాయల ప్రతిఫలం కూడా నాకు లభించింది. ''కథలు రాస్తే డబ్బులు కూడా వస్తాయి'' అన్న కొత్త సత్యాన్ని అపుడే నేర్చుకొన్నాను.

ఆ తరువాత చాలా కథలు ''జ్యోతి''లో వచ్చాయి. పక్ష పత్రిక ''జ్యోతి'' ముందుగా వచ్చింది. ''రేరాణి'' అన్న మాసపత్రిక ఆ తరువాత వచ్చింది.

ఈ రెండు పత్రికలూ, ఆ రోజుల్లో గొప్ప సంచలనాన్ని సృష్టించాయి. ఈ రెండింటి సంపాదక వర్గంలో, ధనికొండ హనుమంతరావు గారుండేవారు.

రకరకాల కారణాల వల్లా, నేను ''జమీన్ రైతు'' పత్రికలో ఉద్యోగం మానుకోవలసి వచ్చింది. పెళ్ళకూరు గోపాల కృష్ణారెడ్డి గారు ప్రారంభించిన ''దీనబంధు'' వార పత్రికలో చేరాను. అక్కడున్నప్పుడే, ఓ చిన్న ప్రేమ వ్యవహారంలో ఇరుక్కొన్నాను. విధిలేక ఆ ఉద్యోగాన్నీ వొదిలేసి, మా స్వగ్రామం తాడి కొండ కొచ్చేశాను.

తాడికొండలో చాలా రకాల పనులున్నమాట నిజమేగానీ, అ వేవీ నేను చేయలేను. నేను చేయగలిగిన పనులేమో తాడికొండలో లేవు. అందువల్ల తిండికీ, గుడ్డకూ నానా అవస్థలూ పడ్డాను.

''మన కోటయ్యగారబ్బాయి రాసిన కథ పత్రికల్లో వచ్చిందోచ్'' అన్న ప్రచారం నా కడుపు నింపలేదు, నాకో మూరెడు గుడ్డను, బారెడు నీడను ఇవ్వలేదు.

సరిగ్గా - ఆ క్లిష్టదశలోనే, మా వూరి పోస్టు మాస్టరు పున్నయ్యగారు నాకో ఉత్తరమిచ్చారు.

అది - జ్యోతి పక్షపత్రిక నించి వచ్చింది !

అందులో ఉన్న పంక్తులు నాకిప్పటికీ గుర్తున్నాయి. ఎప్పటికీ గుర్తుంటాయి...

''మిత్రులు భరద్వాజ గారికి''

''ఈ ఉత్తరం అందంగానే, తగినన్ని గుడ్డలు తీసుకొని తెనాలి కొచ్చేయండి.

మీ

ఆ. రవీంద్రనాథ్

ఆ చిన్న కార్డు, ఆ కార్డులోని పంక్తులు, నా జీవితాన్ని అద్భుతంగా మార్చేశాయి.

తెనాలి, నాకుమరీ కొత్తదేం కాదు. ఎప్పుడన్న వెళ్ళినా, ఒకటి రెండు పూటల కన్నా అక్కడ ఎక్కువ ఉండే వాణ్ని కాదు. అంతకు మించి ఉండవలసి వస్తే, హోటల్లో తిని, రైలు స్టేషన్లో పడుకునే వాణ్ని!

తెనాలి - ఓ రకంగా నాకు అమ్మ వొడి లాంటిది.

అక్కడ నాకు ఉద్యోగం దొరకడం నా అదృష్టం !

ఆ అదృష్టాన్ని నాకు కలిగించిన వారు, ఆలపాటి రవీంద్రనాథ్ గారు.

''జ్యోతి'' కార్యాలయం, గాంధీచౌక్‌కు దగ్గరగా, మెయిన్ రోడ్డు మీద ఉండేది. రెండు షాపుల మధ్య, ఇరుగ్గా ఉండే సందులోంచి నాలుగడుగులు లోపలికొస్తే, విశాలమైన భవంతి. క్రింది భాగంలో ప్రెస్ ఉండేది. పైన రవీంద్రనాథ్‌గారి గది. ఆ గదికి ముందు వరుసలో కుర్చీలు, బల్లలు, బీర్వాలు చిత్తవత్తుగా ఉండేవి.

నా కుర్చీ, నా బల్ల, కింది భాగంలో ప్రెస్సునానుకొని ఉండేవి.

''జ్యోతి'' పక్షపత్రిక, ''రేరాణి'' మాస పత్రికతో బాటుగా ''సినీమా'' అన్న మాస పత్రికను కూడా రవీంద్రనాథ్ గారు ప్రచురించేవారు.

రవీంద్రనాథ్‌గారిని, దగ్గరగా ఎరిగిన వారెంత మంది ఇప్పుడున్నారో నాకు తెలీదు.

వారు - సన్నగా ఉండేవారు, ఎత్తుగా ఉండేవారు, ఎర్రగా ఉండేవారు, ఎప్పుడూ నవ్వుతూ ఉండేవారు. తనకిష్టమైన విషయాన్ని నవ్వుతూ ఆమోదించేవారు. తనకిష్టంలేని అంశాన్ని, నవ్వుతూనే తిరస్కరించేవారు.

ఎపుడూ నవ్వుతూ ఉండడంతో బాటుగా, ఎప్పుడూ సిగరెట్లు కాలుస్తూ ఉండేవారు.

తనముందు కొచ్చిన వారు, బయట వారయినా, తన ఉద్యోగులే అయినా, నవ్వుతూ ఆహ్వానించే వారు. నవ్వుతూనే సిగరెట్‌ను ఆఫర్ చేసేవారు. వారి ముందు సిగరెట్ కాల్చడానికి,ముందుగా నేనూ భయపడ్డానూ ఎంతయినా వారు యజమాని, నేను పనివాణ్ణి. నా భయాన్ని పోగొట్టినవారు రవీంద్రనాథ్ గారే! వారు నేను, ధనికొండ, కొలను బ్రహ్మానందరావు, మాగాపు రామన్.... కలసి ధూమ యజ్ఞం చేసేవాళ్ళం.

''జ్యోతి'' ప్రధానంగా కథల పత్రిక. అయినా - అందులోనూ కవితలు, వ్యాసాలు, విమర్శలు, (నాటికలు) కూడా వస్తూ ఉండేవి.

ఆనాటి ప్రసిద్ధ కథకులు చాలా మంది జ్యోతికి రాశారు. చలం, కుటుంబరావు, గోపీచంద్, మల్లాది రామకృష్ణ శాస్త్రి, పి.వి. సుబ్బారావు, జి.వి. కృష్ణరావులాంటి వారు రాసేవారు. ఎందరెందరో నూతన రచయితలను తెలుగు పఠితలకు పరిచయము చేసిన ఘనతకూడా రవీంద్రనాథ్ గారిదే! ముఖ్యంగా - 'శివం', పి. శ్రీనివాసరావు, 'శారద', ప్రకాశరావు, శార్వరి, 'సులోచన', 'చౌడేశ్వరీ దేవి', 'హితశ్రీ' లాంటి వారెందరో ఉన్నారు.

అప్పుడే - విజయవాడలో, ఆకాశవాణి కేంద్రం ఏర్పాటయింది. అయ్యగారి వీరభద్రరావు, జనమంచి రామకృష్ణ, బుచ్చిబాబు, ఆచంట సూర్యనారాయణమూర్తి, వింజమూరి

శివరామారావు, ఇంకా ఇంకా చాలా చాలా మంది అందులో పనిచేస్తూ ఉండేవారు. ఆ కార్యక్రమాలను గురించి, ''జ్యోతి'' పక్షపత్రిక, నిష్పాక్షికంగా విమర్శలు ప్రచురించడం ప్రారంభించింది. ఆ విమర్శలు రాసిన వారు కొప్పరపు సుబ్బారావు గారు, ప్రోత్సహించినవారు ఆలపాటి రవీంద్రనాథ్ గారు.

ఈ విమర్శలను సమయింప చేయడం కోసం, ఆకాశవాణి విజయవాడ కేంద్రంవారు, ప్రత్యేకంగా ఒక చర్చా కార్యక్రమాన్ని రూపొందించారు. అందులో కొప్పరపు సుబ్బారావు గారిని, ఆలపాటి రవీంద్రనాథ్ గారిని పాల్గొనేట్టు చేశారు.

ఆ తరువాత వెలువడిన జ్యోతి పత్రికలో ఈ ''ప్రత్యేక కార్యక్రమం'' ఎంత చచ్చుగా, చప్పగా, నిర్జీవంగా ఉన్నదో, రవీంద్రనాథ్ గారు అచ్చేశారు.

నాకు తెలిసినంతలో, తెనాలి నుండి వెలువడిన తొలి సినిమా పత్రిక ''సినీమా!'' సంపాదకులు రవీంద్రనాథ్‌గారు.

నాకు తెలిసినంతలో తెనాలి నుండి వెలువడిన తొలి మనో వైజ్ఞానిక మాస పత్రిక - ''రేరాణి'' మాత్రమే దీని సంపాదకులు రవీంద్రనాథ్ గారు.

సిగ్మండ్ ఫ్రాయిడ్, హావలాక్ ఎల్లిస్, మేరీక్టోప్స్ వంటి పేర్లు అంతకు ముందు బహు కొద్ది మంది తెలుగు వారికి తెలిసి ఉండవచ్చు. ఆ పేర్లను ఆనాటి తెలుగు వారి ముంగిళ్లదాకా చేర్చిన వారు రవీంద్రనాథ్‌గారు.

ఆ రోజుల్లో ''రేరాణి'' సర్క్యులేషన్ 15 వేల దాకా ఉండేది. దాదాపుగా ప్రతి సంచికలోనూ, చలం గారి కథో, చౌడేశ్వరీ దేవిగారి కథో, లేదా నా కథో తప్పకుండా ఉండేది.

స్థలా భావం వల్ల, ఒక సంచికలో నా కథ అచ్చుకాలేదు. చాలామంది పాఠకులు రవీంద్రనాథ్ గారికి ఉత్తరాలు రాశారు. కృష్ణాజిల్లాలోని ఒకానొక జమీందారీ కుటుంబీకులు ''రేరాణి'' పత్రికను రిజిస్టర్ పోస్టుద్వారా తెప్పించుకోవడం నాకింకా జ్ఞాపకం ఉన్నది.

ధనికొండ హనుమంతరావుగారు విడిపోయి ''అభిసారిక'' అన్న పత్రికను సొంతంగా ప్రారంభించారు. ఇపుడు ''రేరాణి'' పత్రికా సంపాదకత్వ బాధ్యత యావత్తూ, కొలను బ్రహ్మానందరావుగారి మీదకు వాలింది. ''జ్యోతి'' పత్రికను పూర్తిగానూ, ''రేరాణి'' పత్రికలో కథా విభాగం వరకూ, నేను చూస్తూ ఉండేవాణ్ణి.

నేను ''రేరాణి'' పత్రికలో పని చేస్తున్నప్పటికీ, దానికి పోటీగా వచ్చిన ''అభిసారిక'' పత్రికలో కథలు రాయడానికి, రవీంద్రనాథ్ గారు ఎప్పుడూ అభ్యంతరపెట్టలేదు. ఆయన గారి అనుమతి తీసుకొన్నాకనే, ఇతర పత్రికలకు నేను రచనలు పంపుతుండేవాణ్ణి. ''రేరాణి'', ''జ్యోతి'' పత్రికలలో పని చేస్తున్నాను గనక, నేను రాసినప్పటికి ప్రతిఫలం తీసుకునేవాణ్ణి కాదు.

అప్పట్లో - నా జీతం నెలకు రూ. 25/- (పాతిక) రూపాయలు మాత్రమే! అందులో ఇరవై రూపాయలు భోజనానికి పోతే మిగిలిన అయిదు రూపాయలు కాఫీలకూ, బీడీలకూ

ఖర్చు చేసుకొనే వాణ్ణి. ఏదన్నా గది అద్దెకు తీసుకొంటే నెలకు - కనీసం అయిదు రూపాయలన్నా చెల్లించాలి. అంత శక్తి నాకు లేదు. అందుకని, జ్యోతి ప్రెస్‌లోనే పడుకొంటూ ఉండేవాణ్ణి. తాళాలు నా దగ్గరే ఉండేవి! రమారమిగా 9, 10 మాసాలపాటు అంతా సవ్యంగానే ఉంది. అలాగే పదికాలాలపాటు కొనసాగుతుందనుకొన్నాను.

కానీ -

బైండింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న ఒక కుర్రవాడి ఆరోపణ కారణంగా, నేను నా ఉద్యోగానికి రాజీనామా చేశాను. రవీంద్రనాథ్‌గారు కూడా వెంటనే దాన్ని ఆమోదించారు.

ఇపుడు నాకు రెండు సమస్యలు ఎదురయ్యాయి. ఒకటి: తిండి, రెండు: నివాసం.

రెండవ సమస్యను శార్వరిగారు పరిష్కరించారు. మొదటి సమస్యను నా కథలు పరిష్కరించాయి.

ఉద్యోగం మానుకున్నా - దాదాపుగా రోజూ మేం కలుసుకొంటూనే ఉండేవాళ్ళం. కాఫీలు తాగుతూనే ఉండేవాళ్ళం. సిగరెట్లు కాలుస్తూనే ఉండేవాళ్ళం. ''ఉద్యోగం'' ప్రసక్తిని వారు గానీ, నేను గానీ, ఎప్పుడూ రానివ్వలేదు.

ఇదివరకు - రెమ్యూనరేషన్ తీసుకొనేవాణ్ణికాదు - అక్కడే పనిచేస్తున్నవాణ్ణి గనక, ఇప్పుడు బయటివాణ్ని గనక, అడిగి మరీ తీసుకోవడం ప్రారంభించాను. ''జ్యోతి''లో వచ్చిన కథకు రూ. 25/- లిస్తే, ''రేరాణి''లో వచ్చిన కథకు రూ. 50/-లిచ్చేవారు.

నేను, శారద, తాళ్ళూరి నాగేశ్వరరావు, శార్వరి, అమరశ్రీ, వీరమల్లు రామకృష్ణ, కవిరావు, భుజంగరావు, నాగభూషణం ఆ డబ్బును హాయిగా ఖర్చు చేసుకొనేవాళ్ళం.

ఈ లోగానే, ఓ ఆపత్తు నన్ను ముసురుకొంది.

1948లోనో, 1949లోనో - సరిగ్గా గుర్తు లేదు - ''రేరాణి'' పత్రికలో నాదో కథ అచ్చయ్యింది. ఆ కథ పేరు ''అలవాటయిన ప్రాణం'' ఇతర కథలతో పోలిస్తే, అదేమంత ఘాటయింది కాదు. కానీ - పోలీసులు ఆ కథమీద కేసు పెట్టారు. ఈ ఆపద నుండి బయట పడడానికి, ఒకరిద్దరు న్యాయవాదులు నాకు ఉపాయాలు చెప్పారు.

''ఆ కథ నేను రాయలేదు'' అని చెప్పమన్నారు.

నేనందుకొప్పుకోలేదు.

''రవీంద్రంగారు బలవంత పెడితే రాశా''నని చెప్పండి. శిక్షవేస్తే తగ్గుతుంది'' అని చెప్పారు.

దానికీ నేనొప్పుకోలేదు.

ఈ సంగతి రవీంద్రనాథ్ గారికి చెప్పాను.

''నీకేం ఇబ్బంది లేదు. నేను చూసుకొంటాను'' అన్నారు రవీంద్రనాథ్‌గారు, కోర్టుకు హాజరయ్యారు. నాతోబాటు ధనికొండ హనుమంతరావు, కొలను బ్రహ్మానందరావు కూడ హాజరయ్యారు.

నాకు - అయిదు వందల రూపాయల ఫైన్ వేశారు. అది చెల్లించకపోతే, ఆరు మాసాల జైలు శిక్ష అనుభవించాలన్నారు.

న్యాయమూర్తి గారి అనుమతితో, నేను కోర్టు నుండి బయటికొచ్చాను. రవీంద్రనాథ్ గారికి విషయమంతా చెప్పాను. ఫైను చెల్లించడానికి ''సత్యశ్రీ'' అన్నవాణ్ణి ఏర్పాటు చేశారు. బ్యాంకునుండి డబ్బు తెప్పించారు.

ఈ ఏర్పాట్లన్నీ చూసుకొని, నేను మళ్ళీ కోర్టుకు హాజరయ్యాను.

సాయంకాలం నాలుగ్గంటలయింది. నన్ను జైలుకు తీసుకెళ్ళడానికి పోలీసువారి వాన్ వచ్చింది. నాకేమో గుండెల్లో దడ, చెమటలతో శరీరమంతా చిత చితలాడిపోతోంది. సుమారు నాలుగున్నర గంటల ప్రాంతంలో సత్యశ్రీ వచ్చి, డబ్బు చెల్లించాడు. నా ప్రాణం తెరిపిన పడింది.

అయిదు గంటలయ్యేసరికి మెజిస్ట్రేటుగారు కుర్చీ దిగారు. సరాసరిగా, నా ముందుకొచ్చారు. ''ఆ రేరాణి పత్రికను నాకోసారిస్తారా? ఇంకోమాటు ఆ కథను చదువుకొంటాను -'' అన్నారు.

ఆనాడు, రవీంద్రనాథ్‌గారు చెల్లించిన ఆ అయిదువందల రూపాయలనూ, 1996 జనవరి 14వ తేదీన నేనూ + మా పెద్దబ్బాయి రవీంద్రనాథ్ + వాడి పెద్దబ్బాయి రామోజీరావు కలిసి, చెక్కు రూపంలో ఇచ్చాం. ఆ చెక్కు నెంబరు: 0182519 తేది. 13-1-1996.

ఆ రోజున నా డైరీలో ఇలా రాసుకొన్నాను...

''..... 1948లో నేను రాసిన 'అలవాటైన ప్రాణం' అన్న కథకు, కోర్టువారు విధించిన, అయిదు వందల రూపాయల జుల్మానాను చెల్లించి, నాకు జైలు శిక్షను తప్పించిన ఆలపాటి రవీంద్రనాథ్ గారికి, నేను + రవి + రామోజీ వెళ్ళి, ఆ డబ్బుకు మరో రూ. 58/- చేర్చి, నూతన వస్త్రాలతో, తాంబూలంతో, మిఠాయితో సమర్పించుకొన్నాను. డబ్బు పరంగా, నేనెవరికీ బాకీ లేను. దయా పరంగా చాలామందికి ఋణపడి ఉన్నాను.

(1996 జనవరి 14వ తేదీ ఆదివారం నాటి నా డైరీ నుండి)

రవీంద్రనాథ్‌గారు 1952లో హైదరాబాదు వచ్చారు. నేను 1959లో వచ్చాను. ఆకాశవాణిలో ఆర్టిస్టుగా చేరాను. అప్పుడప్పుడు వారిని కలుసుకొంటూ ఉండేవాణ్ణి. 1975లో, నేను ప్రొడ్యూసర్ నయ్యాక, ఆకాశవాణికి వారిని ఆహ్వానించాను. సహజంగానే ఆయన తిరస్కరించారు. అయినా నేను మొహమాట పెట్టి, వారి ప్రసంగాలను ప్రసారం చేశాను.

దానిక్కారణాలు రెండు మూడున్నాయి.

ఒకటి : విషయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తారు.

రెండు : సాధ్యమయినంత సరళంగా రాస్తారు.

మూడు : సముచితమని వారికి తోచిన సవరణలను ఎవరు ప్రతిపాదించినా వారు సంతోషంతో అంగీకరిస్తారు.

రవీంద్రనాథ్‌గారు ఆనాడు నాకిచ్చిన అవకాశం, నా జీవితాన్ని అనూహ్యంగా మార్చివేసింది. చాలా రకాల పత్రికలతోనూ, చాలామంది రచయితలతోనూ, నాకు పరిచయాలేర్పడ్డానికి, వారిచ్చిన ఉద్యోగమే కారణం!

ఆ అనుభవమే, ఆ ఆత్మ విశ్వాసమే నన్ను మద్రాసు నగరానికి చేర్చింది. అక్కడి అనుభవం కూడా కలిసి నాలోని పట్టుదలను మరింత గట్టి పరిచింది. ఆ దృఢ దీక్ష - ఆకాశవాణిలో నాకు కాస్త చోటును ప్రసాదించింది. నా మాటలకు రెక్కలను ప్రసాదించింది.

దీనికంతా - మూలకారణం - ఆనాడు రవీంద్రనాథ్‌గారు నాకిచ్చిన అవకాశం. అందుకే - వారి పేరును పదే పదే స్మరించుకొనేందుకే - మా పెద్దబ్బాయికి ''రవీంద్రనాథ్'' అని పేరు పెట్టుకున్నాను.

1996 ఫిబ్రవరి 11న, ఆలపాటివారు కన్నుమూశారు.

అప్పటి నా ప్రతిస్పందనలివీ ....

''..... నన్ను తెనాలికి ఆహ్వానించి, ఉద్యోగమిచ్చి, ఆదరించిన ఆలపాటి రవీంద్రనాథ్‌గారు, మరణించారన్న వార్తను, ఇంతకు ముందే విన్నాను, చాలా క్షోభించి పోయాను''.

(1996 ఫిబ్రవరి 11వ తేదీ ఆదివారం నాటి డైరీ నుండి)

''.... నా జీవితానికింత స్థిరత్వం ప్రసాదించిన, ఆలపాటి రవీంద్రనాథ్ గారికి, పాదాభివందనం చేశాను. జీవించి ఉంటే, తిరస్కరించేవారు. స్మశానానికి ప్రయాణమయి, కొంత దూరం వెళ్ళికూడా, వెనక్కొచ్చేశాను. మనుషుల్ని కట్టెల్లా కాల్చడాన్ని నేను చూడలేను....''

(1996 ఫిబ్రవరి 12వ తేదీ సోమవారం డైరీ నుండి)

రవీంద్రనాథ్‌గారు - చాలా ముందుచూపున్న భావుకులు. అర్థ శతాబ్ది కిందటనే, లైంగిక విజ్ఞానాన్ని గురించీ, కుటుంబ నియంత్రణను గురించీ నిర్భయంగా ప్రచారం చేశారు.

అలాంటి సాహసికుని పేరు మీదుగా వారి వర్ధంతినాడు, జయంతి నాడో, ఒక పురస్కారాన్ని ప్రధానం చేయడం భావ్యంగా ఉంటుంది. ఆ ఉద్దేశంతోనే, ఆ సత్కార్యానికి వినియోగించవలసిందిగా, ఓ చిన్న మొత్తాన్ని వారబ్బాయి బాపన్న గారికి అందచేశాను.

ఆ - నా - బంగారు కల వాస్తవరూపం ధరించగలదని ఆశిస్తున్నాను.

డాక్టర్ రావూరి భరద్వాజ, హైదరాబాద్, కథాసాహిత్య స్రష్ట, నవలాకారుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో ప్రోగ్రామ్ ప్రొడ్యూసర్‌గా పనిచేసి రిటైరయ్యారు.

'మిసిమి' పత్రిక ఆయన మూర్తిమత్వానికి ప్రతీక. ఆలోచన, జిజ్ఞాస, ఆధునికత, కళాత్మకత, విలువలకోసం కృషిచేస్తూ జీవితాన్ని పాజిటివ్‌గా, అందంగా చూడటం, అనుభవించడం-ఈ పత్రిక నేర్పుతుంది, రవీంద్రనాథ్‌గారి జీవితంలాగే.

అరుదైన వ్యక్తి

డాక్టర్ ఎ. మంజులత

ఫిబ్రవరి, 1994
వెల రూ.5/-

శ్రీ ఆలపాటి రవీంద్రనాథ్‌గారు అరుదైన వ్యక్తి. చదువుకున్న వర్గంవాళ్ళు, అందులోనూ ప్రపంచపు పోకడలు సరైన విధానంలో (పాజిటివ్‌గా) ఆకళింపు చేసుకున్నవారు, తాము ఏ విధంగా జీవిస్తే బావుంటుందని భావిస్తారో, ఆదర్శమైన మూర్తిమత్వం ఏదని భావిస్తారో ఆవిధంగా జీవించిన వ్యక్తి ఆయనగారు.

శ్రీ రవీంద్రనాథ్ గారికి కళాత్మక దృష్టి ఎక్కువ, కేవలం చిత్ర, శిల్పకళల పట్ల, సాహిత్యంపట్ల ఆసక్తిలోనే కళాత్మక దృష్టికాదు,నాకు తెలిసి ఈ కళాత్మకత ఆయన జీవన విధానంలో ప్రతి అంశంలోనూ భాగం. సాధారణంగా కళారాధకులు వాస్తవికతకు దూరంగా ఉంటారనీ, అందుకే భౌతిక జీవికలో విఫలులవుతారనీ మానవ సంబంధాల విషయంలో క్రమబద్ధత ఉండదనీ, పలుమార్లు సమాజం అనుమతికి విరుద్ధంగా సంబంధాలేర్పరచుకొంటారనీ ఒక సాధారణ అభిప్రాయం ఉంది.

రవీంద్రనాథ్‌గారు తానెంచుకున్న కెరీర్‌లో ఎప్పటికప్పుడు విజయం సాధించారు. నాకు తెలిసినంత వరకూ ఆయన జీవితంలో జీవికకోసం ఏయే కార్యక్రమాలు తలపెట్టినా, అవన్నీ ట్రెండ్‌సెట్టర్‌గా విజయవంతంగా చేశారు. అంతేకాదు, తన జీవికకోసం తానేదిచేసినా, సమాజానికి ఉపయోగపడేట్లుగా కూడా మలిచారు. ఆధునిక దృక్పథం ప్రదర్శించారు. కెరీర్‌లో మంచి విజయాలు సాధించిన తెలుగువాళ్ళలో ఆయన ఒకరుగా నిలిచారు. కెరీర్‌లో మంచిపేరు ప్రతిష్ఠలు వ్యక్తిగతంగా తనకూ, సంస్థాగతంగా తన సంస్థలకూ చేకూర్చారు.

ఆయన స్నేహశీలి; మొదట పరిచయం అయినవారికి మితభాషిగా, మనుష్యుల్ని దూరంగా ఉంచేవ్యక్తిగా అనిపించినా, తనకు పరిచయమైన వారిలో తనకు ఆసక్తి కలిగించే నచ్చిన అంశాలుంటే తానే దగ్గరై స్నేహంచేసిన వ్యక్తి ఆయన. అంటే ఆయన స్నేహం ఎక్కువగా ఆలోచనాపరులతో, జిజ్ఞాసగలవారితో, కళాకారులతో, ఒక్కమాటలో చెప్పాలంటే ఇంటలెక్చ్యువల్స్‌తో ఎక్కువగా ఉండేదని నేననుకొంటాను.

ఒక చిన్నవిషయం ఇక్కడ చెప్పాలి. జూబిలీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌కి ఆయన గ్రంథాలయ కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు. ఆయన సభ్యులుగా ఉన్న కాలంలో తన ఆలోచనా ధోరణికి తగిన వాళ్ళని తోటి సభ్యులుగా చేసి ఆయన ఆ గ్రంథాలయానికి పుస్తకాలు కొనిపించారు. వాటిలో నూటికి తొంభై శాతం తత్వశాస్త్రం, దేశ, ప్రపంచ చరిత్రలూ, మానవీయశాస్త్రాలు, మనోవిశ్లేషణ శాస్త్రం, ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ ఆధునిక సాహిత్యం, విమర్శ, నిఘంటువులూ మొదలైన విషయాలకు చెందిన అరుదైన పుస్తకాలే; రిఫరెన్సు పుస్తకాలే. ''ఇక్కడికొచ్చేవారికి కావలసింది థ్రిల్లర్‌లూ, రోమాన్స్ నవలలూ'', నని ఒకరు అభ్యంతరం చెప్పబోతే, ఆయన ''అవి చదివి అవతల పడేసే పుస్తకాలు; వాటికి లైబ్రరీలో దాచేవిలువలు లేవు. అంతేకాక, వాటికోసం వీథికొక లెండింగ్ లైబ్రరీ ఉంది. అవికొని ఈ గ్రంథాలయం డబ్బు వృథా చెయ్యడమెందుకు?'' అన్నారు. పుస్తకాల విషయంలో, విలువల విషయంలో ఆయన దృక్పథం అదీ.

శ్రీ రవీంద్రనాథ్‌గారు వస్త్రధారణ నుంచి ప్రతి అంశంలోనూ సౌందర్యదృష్టి, ఆధునికత, అదే సమయంలో హుందాతనాన్నిచ్చి, విలువలు పెంచే సంప్రదాయ బద్ధత పాటిస్తూ జీవితంలో సమతౌల్యం ప్రదర్శించి, తన జీవితాన్ని విలువలతో, ప్రయోజనాత్మకంగా అనుభవించిన వ్యక్తి అని నేననుకొంటాను. ఈ విషయంలో ఆయన ఆదర్శప్రాయులని కూడా అనుకొంటాను.

'మిసిమి' పత్రిక ఆయన మూర్తిమత్వానికి ప్రతీక. ఆలోచన, జిజ్ఞాస, ఆధునికత, కళాత్మకత, విలువలకోసం కృషిచేస్తూ జీవితాన్ని పాజిటివ్‌గా, అందంగా చూడటం, అనుభవించడం ఈ పత్రిక నేర్పుతుంది, రవీంద్రనాథ్‌గారి జీవితంలాగే.

శ్రీ రవీంద్రనాథ్‌గారి జ్ఞాపకానికి నా నమస్కారాలు.

డాక్టర్ ఎ. మంజులత, హైదరాబాదు విదుషీమణి, రచయిత్రి,
ప్రస్తుతం తెలుగు అకాడెమీ సంచాలకులు

భేషజాలు లేని స్నేహశీలి

డాక్టర్ వై. విశ్వనాథ్

రవీంద్రనాథ్‌గారితో నాకు మొట్టమొదట 1947-48లో పరిచయ భాగ్యం కలిగింది. ఆయనది గోవాడ. మాది యలవర్రు. రెండూ పక్క పక్క ఊళ్లే. ఆయన వయస్సులో నాకన్నా ఆరేడేళ్ళు పెద్ద. అయినప్పటికీ మా యిరువురికీ సంగీత, సాహిత్యాలంటే గల అభిరుచి కారణంగా ఆనాడు నేను తెనాలి బోస్‌రోడ్‌లో వుండే జ్యోతి ప్రెస్‌కు వెళ్లి ఆయనను పరిచయం చేసుకున్నాను.

ఆయన జ్యోతి ప్రెస్‌ను నిర్వహిస్తూ జ్యోతి గ్రూప్ ఆఫ్ పీరియాడికల్స్ పేరుతో జ్యోతి, రేరాణి, సినీమా పత్రికల్ని నడుపుతుండేవారు. రేరాణి పత్రికను పోలవరపు శ్రీహరిరావు, సినీమా పత్రికను మాగాపు రామన్ చూస్తుండేవాళ్లు. పోలవరపు శ్రీహరిరావుకు పత్రికలో అవకాశమిచ్చి రచయితగా వికసించటానికి దోహదం చేసింది రవీంద్రనాథ్‌గారే. శారద, భరద్వాజ వంటి మట్టిలో మాణిక్యాల్ని ప్రకాశింపజేసినవాడూ ఆయనే. శారద ఏదో హోటల్లో వంటపుట్టిగా పని చేస్తుండేవాడు. తన కథలు రాసే కాగితాలకు నూనె మరకలవుతుండేవి. పాపం! మూర్ఛ రోగంతో బాధపడుతుండేవాడు.

రవీంద్రనాథ్‌గారు సరసుడు, సాహిత్యాభిమాని, స్నేహశీలి, అభ్యుదయవాది. తాను సంపాదకుడిని, ప్రెస్ యజమానిని అన్న భేషజం బొత్తిగా లేనివాడు. అందువల్ల చాలా ఫ్రీగా మాట్లాడేవారు. ఆయన గురించి స్మృతులను ఒక సంపుటంగా వేసి సాహిత్యాభిమానులకు అందజేయాలన్న మీ అభిలాష అభినందనీయం.

డాక్టర్ విశ్వనాథ్ చౌదరి, హైదరాబాద్, సంగీత సాహిత్య అభిమాని,
ప్రపంచ హోమియోపతి మిషన్ సభ్యులు

1942 లో . . .

నిజానికి రవీంద్రనాథ్‌తో నా పరిచయం మూడు సంవత్సరాలే! ఈ మూడు సంవత్సరాలలో మిసిమిలో పది వ్యాసాలు రాశాను. ఈ పది వ్యాసాలు రాసిన కాలమే (జూలై 1993 – సెప్టెంబర్ 1995) మా మధ్య ఉత్తర ప్రత్యుత్త రాలు కానీ ఫోనులో సంభాషణలుకానీ జరిగాయి. నూరు సంవత్సరాల మానవుని జీవితంలో ఈ మూడు సంవత్సరాలు పరిగణనలోకి రావు. కాని నా జీవితంలో ఈ మూడు సంవత్సరాలు మధురమైన సాహిత్యానుభవాల్ని మిగిల్చి, నన్ను నన్నుగా నిలబెట్టాయి.

నా అనుభవాలు

టి. రవిచంద్

సమకాలిక పత్రికా ప్రపంచంలో, సాహితీలోకంలో ఆలపాటి రవీంద్రనాథ్ ఒక విశిష్ట వ్యక్తి. ఆయన కవీ కాదు; రచయితా కాదు; సంపాదకుడూ కాదు. ఆయన ఒక మంచి సాహితీ ప్రియుడు, ఒక సీరియస్ పాఠకుడు. ఒక మంచి పాఠకుడు తన అభిరుచి, ఆసక్తులతో తన సమకాలిక సాహితీ ప్రపంచాన్ని కాకలు తీరిన సంపాదకులకంటె, రచయితల కంటె, కవులకంటె ఎక్కువ ప్రభావం చూపించగలడని రవీంద్రనాథ్ జీవితం మనకు నిరూపిస్తుంది. విశ్వవిద్యాలయాల డిగ్రీలతో, బహుభాషా పరిజ్ఞానంతో ఎవర్నీ ప్రభావితం చేయని రచయితలు, మేధావులు ఉన్న తెలుగు దేశంలో స్వతంత్ర ఆలోచన, ప్రయోగశీలతలే అర్హతలుగా సామాన్యుల నుండి మాన్యుల వరకు అభిమాన పాత్రుడయ్యాడు ఆయన. అటువంటి రవీంద్రనాథ్‌తో నా అనుభవాలను, జ్ఞాపకాలను స్మృతిలోకి తెచ్చుకోవడమంటే ఒక అందమైన అనుభవాన్ని, ఒక సాహితీ బంధాన్ని గురించి జ్ఞప్తికి తెచ్చుకోవడమే! నిత్యం అనేక సమస్యలతో, వేదనలతో, అవమానాలతో బాధపడే సంస్కారవంతులైన సాహితీ ప్రియులకు రవీంద్రనాథ్‌లాంటి వారితో పరిచయం వారి జీవితంలోని అందమైన కలలో కనిపించిన ఒక అలలాంటిది. ఆర్థిక సంబంధాలు, కులబంధాలు తప్పితే మరో బంధం తెలియని మానవ సమాజంలో అందమైన కల అరుదైనదే. ఆ కలలోని అల అంతకంటే అరుదైనది, అపురూపమైనది. క్షణికమైన ఆ అల చాలామందికి ఎటువంటి ఆనందాన్నివ్వదు. నాకది శాశ్వతానందాన్ని మిగిల్చింది. సముద్రమంతటి గంభీరమైన వ్యక్తే అలలాంటి ఆనందాన్ని అందరికి అందించగలడు. ఆలోచనల్ని రగిలించగలడు. అందాన్ని మిగల్చగలడు. మిసిమి రవీంద్రనాథ్ గురించి ఆలోచిస్తుంటే ఇటువంటి భావతరంగాలు అనేకం మదిలో మెదులుతున్నాయి. కాని వాటన్నిటిని మీతో పంచుకోలేను. రవీంద్రనాథ్ మరణించిన తరువాత వెలువడిన మిసిమి తొలి సంచిక చూసినప్పుడు కలిగిన భావాల్ని ఒక సాహితీ మిత్రుడికి రాసిన లేఖలో పేర్కొన్నాను. ఆ లేఖాంశాల్ని యథాతథంగా మీతో పంచుకొంటున్నాను: ''ఈరోజే మిసిమి అందింది. రవీంద్రనాథ్‌గారే సజీవులై మన మధ్యకు వచ్చినంత అనుభూతి కలిగింది. కొంతమంది మనతో ఉన్నంత కాలం వారి విలువ తెలియదు. వారు మనకు భౌతికంగా దూరమయినప్పుడే ఆ విలువ బాగా తెలుస్తుంది. ఆయన లేకపోతే మిసిమి లేదు; మిసిమి లేకపోతే ఆయన లేరన్నంతగా నేను భావించాను. అందువల్లే ఆయన మనల్ని వదిలిపోయారని తెలియగానే, ఓ మధురమైన అనుభూతి, అనుభవం మనల్ని వదిలిపోయాయని బాధ పడ్డాను - బాల గంగాధరతిలక్ ''అమృతం కురిసిన రాత్రి''లో ''నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు'' అన్నాడు. అది చదివినప్పుడు ఎంత గొప్పగా రాశాడనుకున్నాను. మిసిమిని తొలిసారి చూసినప్పుడు తిలక్ చెప్పిన వెన్నెల, అందమైన ఆడపిల్లలు, అక్షరాలు ప్రత్యక్షంగా చూసిన భావన బలీయంగా కలిగింది. ఆ మొదటి అనుభూతిని రవీంద్రనాథ్‌గారు అలాగే చివరి వరకు కలిగించారు. ఆయన మరణానికి ముందు పద్మారావుపై నేను రాసిన వ్యాసం ''కులము - ప్రత్యామ్నాయ సంస్కృతి'' విషయంలో రవీంద్రనాథ్ ధోరణికి నేను బా గా నొచ్చుకున్నాను. అందువల్లే మీతో ఇక మిసిమికి రాయనన్నాను. అది కేవలం తాత్కాలికమైన బాధనుండే వెలువడింది. ఆయనపై నిజమైన కోపం కాదు. ప్రకృతి అనుకూలంగా ఉంటే స్పందిస్తాం. ప్రతికూలంగా ఉంటే నిందిస్తాం. నా దృష్టిలో ఆయన కూడా అందమైన ప్రకృతి లాంటివారే. వారితో నాకు ప్రత్యక్ష

పరిచయం చాలా తక్కువ. అదిమీకు తెలుసు. మిసిమిలో నా వ్యాసాలు వస్తున్న తొలిరోజుల్లో వారు తెనాలి ఏదో కార్యక్రమం పై వచ్చి, నన్ను చూడాలని ఉందని, ఒక్కసారి వచ్చి వెళ్ళమని కబురు చేశారు. వెళ్ళాను. ఆయన్ని చూసి ఆశ్చర్యపోయాను. మరుక్షణమే రస్సెల్ మదిలో మెదిలాడు. మిసిమి రూపు రేఖలు, దానిలో వచ్చే వ్యాసాలు చూసిన వారు సామాన్యంగా దాని సంపాదకుని గురించి వయసు రీత్యా మరోవిధంగా ఊహించుకుంటారు. మరి రవీంద్రనాథ్‌గారు వయసురీత్యా చాలా పెద్దవారు. ఆయన పత్రికే కాదు ఆయన కూడా విలక్షణమైనవారేననిపించింది. ఇక శ్రీశ్రీ చెప్పిన ''కొంతమంది యువకులు తాతగారి నాన్నగారి భావాలకు దాసులు'' గేయం గుర్తుకు వచ్చి నవ్వుకున్నాను. శరీరానికి వయసు ఉందేమోకాని మనసుకు లేదని ఆయన నిరూపించారు. ''ఆయన నిత్య యువకుడు. యువకుడు మరణించాడు. వృద్ధులం మిగిలాం. అదే బాధ''. (రావెల సోమయ్యగారికి రాసిన లేఖ, 2-3-1996).

ఇంతగా మిసిమి ద్వారా నన్ను ప్రభావితం చేసిన రవీంద్రనాథ్‌తో నా పరిచయం 1993వ సంవత్సరంలోనే ప్రారంభమయింది. అంతకుముందు ఆయన పేరు వినడం మినహా ఆయనతో నాకెటువంటి పరిచయం లేదు. ఇటువంటి సమయంలో మిసిమి నా దృష్టికి వచ్చింది. పత్రికలోని వ్యాసాలు ఆసక్తికరంగా, ఆలోచనాత్మకంగా ఉండేవి. నేను సాహిత్యాభిమానినే కాకుండా నిత్య అధ్యయన శీలిని కూడా కావడంతో నాకు తెలిసిన విషయాలు సోదర పాఠక మిత్రులతో పంచుకోవాలనే కోరిక బలంగా ఉండేది. నా ఆలోచనల్ని, నా భావాల్ని, పరిశీలనల్ని సెన్సార్ చేయకుండా ఏ పత్రిక స్వీకరిస్తుందని ఆలోచిస్తున్నప్పుడు మిసిమి గుర్తుకొచ్చింది. కాని మిసిమి రవీంద్రనాథ్ తాత్వికంగా రాడికల్ హ్యూమనిస్టు, నేనేమో మార్క్సిస్టు మానవతావాదిని. నేను అభిమానించే, ఆరాధించే మార్క్సిస్టు మహా పండితుడు, దార్శనికుడు దేవీప్రసాద్ చటోపాధ్యాయ అప్పుడే కీర్తిశేషులయ్యారు (8-5-1993). ఆయన జీవితాన్ని, రచనల గురించి తెలుగు పాఠకులతో పంచుకోవాలనుకున్నాను. ఆయన స్మృతికి నివాళి అర్పించాలనుకున్నాను. దానిలో భాగంగా దేవీప్రసాద్ చటోపాధ్యాయపై 1993లో మిసిమికి ఒక వ్యాసం రాసి పంపాను. అది మిసిమిలో వస్తుందని నేను ఆశించలేదు. ఎందుకంటే దేవీప్రసాద్ చటోపాధ్యాయ నిబద్ధత కలిగిన మార్క్సిస్టు మేధావి. రవీంద్రనాథ్ రాడికల్‌హ్యూమనిస్టు అభిమానిగా ప్రసిద్ధిచెందారు. మిసిమిలో అప్పుడప్పుడు మార్క్సిస్టు వ్యతిరేక రచయితలు దర్శనమిస్తుండేవారు. ఈ పరిస్థితులలో నా వ్యాసం మిసిమిలో వస్తుందని నేను పెద్దగా ఆశించలేదు.

ఊహించని విధంగా మిసిమి సంపాదకుడు రవీంద్రనాథ్ నుంచి మీ వ్యాసం ప్రచురిస్తున్నామని ఒక లేఖ వచ్చింది. సమకాలిక భారతీయ దార్శనికుల్లో నేనెంతో అభిమానించే మార్క్సిస్టు చటోపాధ్యాయను మిసిమి పాఠకులకు పరిచయం చేయగలిగినందుకు ఎంతో సంతోషించాను. ఈ వ్యాసం ప్రచురించబడిన తర్వాత సంపాదకుడు రవీంద్రనాథ్ నుండి మరో లేఖ వచ్చింది. దేవీప్రసాద్ వ్యాసంలో మీరు డా॥కె. బి. కృష్ణపై అధ్యయనం చేస్తున్నానని రాశారు, ఆయన మరుగున పడిన మేధావి, ఆయన జీవితం, రచనల గురించి ఒక వ్యాసం రాసి మిసిమికి పంపగలరా అని ఆయన ఆ లేఖలో కోరారు. ఆ అభ్యర్థన అప్పటి వరకు ఆయనపై ఉన్న రాడికల్ హ్యూమనిస్టు

అనే ముద్ర నుండి నన్ను విముక్తుడ్ని చేసింది. ఇక్కడ ఆ సందర్భమనిపించినా ఒక విషయాన్ని పేర్కొనాలనిపిస్తుంది. జిడ్డు కృష్ణమూర్తి తమ సంభాషణల్లో తరచుగా ఇలా అంటుంటారు - సత్యం బోధ పడాలంటే, మన మనసుల నుండి ముద్రల్ని, ప్రతిమల్ని, సంకేతాలను తొలగించేయమని. అప్పుడే సత్యం యదార్థ రూపం అర్థమవుతుందని. రవీంద్రనాథ్ గురించి నాలో ఏర్పడిన ముద్రాజనితమైన భావన ఈ లేఖతో తొలగిపోయింది. తాత్వికంగా ఆయన ఏ సిద్ధాంతాన్ని అభిమానించినా, రచయితల్లోని సత్యాన్వేషణను, సృజనాత్మకతను, మౌలిక పరిశోధనను ప్రోత్సహించే వారని ఆ లేఖవల్ల అర్థమయింది. ఈ సంఘటన తర్వాత ముఖ పరిచయం కూడా లేని మామధ్య ఏదో తెలియని బంధం ఏర్పడింది. సంపాదకుడికి రచయితకు యాంత్రికమైన సాంకేతిక సంబంధమే కాదు ఉండాల్సింది. వారి మధ్య మానవ సంబంధాలుండాలని భావించిన రాడికల్ మానవుడు రవీంద్రనాథ్. అందువల్లే మిసిమి పత్రికలో రాసే రచయితలతో ఆయన సంపాదక సంబంధాలు కాకుండా మానవ సంబంధాలు పెంచుకుంటుండేవారు. అలా ఆయన ఆంధ్ర దేశంలో సంపాదకుడిగా తన విశిష్టతను రుజువు చేసుకున్నారు. ఆయన మరుగున పడిన మేధావి డా॥ కె. బి. కృష్ణపై వ్యాసం రాయమన్న తర్వాత మరో రెండు వ్యాసాలు మిసిమిలో 1998లో ప్రచురించబడ్డాయి. అవి! 1. అంబేద్కర్‌ను ప్రభావితం చేసిన ఆంధ్రుడు 2. సుప్రసిద్ధ చరిత్రకారుడు డా॥ బి. ఎస్. ఎల్. హనుమంతరావు. ఈ రెండు వ్యాసాలు ప్రచురించబడిన తర్వాత పాఠకుల నుండి మంచి ప్రతిస్పందన వచ్చిందని, రచయితగా మీకు, సంపాదకుడిగా నాకు మంచి పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టాయని ఆయన ఒక సారి అన్నారు. ఈ మాటలు నాకెంతో ప్రోత్సాహాన్నిచ్చాయి. నాకు తెలిసినంతవరకు నేటి పత్రికా ప్రపంచంలో రచయిత రచనలు ప్రచురించబడిన తర్వాత, ఆయనకు, సంపాదకుడికి ఎటువంటి మానవీయ సంబంధం ఉండటంలేదు. కాని రవీంద్రనాథ్ అటువంటి సంపాదకులుకారు. సంపాదకుడిగా రచయితతో నిరంతరం సంబంధాన్ని కొనసాగిస్తూ, అతన్ని ప్రోత్సహిస్తూ, అతని నుండి ఇంకా ఉత్తమమైన రచనల్ని రాబట్టే విధంగా ఆయన రచయితతో సంబంధాలు కొనసాగించేవారని నాకున్న కొద్దిపాటి పరిచయంతో భావిస్తున్నాను. ప్రొఫెసర్ లక్ష్మీ నరసుపై వ్యాసం ప్రచురించబడిన తర్వాత రాసిన లేఖలో మీ వ్యాసాన్ని ఆంగ్లంలోకి అనువాదం చేయడానికి అనుమతి అడిగారని, డైరెక్టుగా మిమ్మల్నే సంప్రదించమని చెప్పానని ఆయన రాశారు. ఈ స్పందన ఎటువంటి రచయితకయినా ఆనందాన్ని కలిగిస్తుంది. ఈ సమయంలోనే మిసిమిలో వచ్చిన పై రెండు వ్యాసాల్ని సి. పి. ఐ. సిద్ధాంత పత్రిక ''కమ్యూనిజం''లో వెంటనే పునర్ముద్రించారు. ఇటువంటి ప్రతిస్పందనలవల్ల రవీంద్రనాథ్‌గారు నాకు మరీ సన్నిహితులయ్యారు. మిసిమి కంటే ముందు ప్రజాసాహితి, అరుణతార, నాస్తికయుగం, ఎదురీత లాంటి పత్రికల్లో నావ్యాసాలు వచ్చేయి. ఆయా పత్రికల సంపాదకుల నుంచి, పాఠకుల నుంచి అనూహ్యమైన ప్రతిస్పందన రావడం సంపాదకుడిగా ఆయనకు, రచయితగా నాకు ఎంతో సంతృప్తిని మిగిల్చింది. ఈ విషయాన్ని గురించి ఆయన మా ఉమ్మడి మిత్రుల దగ్గర పదే పదే అంటుండేవారు.

తాత్విక దృక్పథం రీత్యా, వయసు రీత్యా మా ఇద్దరి మధ్య ఎంత అంతరం ఉన్నప్పటికీ బౌద్ధ పరిభాషలో చెప్పాలంటే ఆయన నాకు కళ్యాణ మిత్రులయ్యారు (Spiritual friend) ఆయన

కోరినట్టు మరుగున పడిన మేధావి డా॥కె. బి. కృష్ణను ''తొలి ఆంధ్ర మార్క్సిస్టు పరిశోధకుడి''గా పరిచయం చేస్తూ ఒక వ్యాసం రాసి పంపాను. ఆ వ్యాస రచనా విధానం ఆయనకు బాగా నచ్చింది. ఆ విషయాన్ని తెలియజేస్తూ రాసిన లేఖలో ఆయన ఇలా అన్నారు ''డా॥ కె. బి. కృష్ణ పరిచయ వ్యాసంలో మీ నేర్పరి తనం, నిజాయితీ, Balance చాలా ఆరోగ్యకరమైన రచయిత లక్షణాలు''. పత్రికారంగంలో దశాబ్దాల అనుభవం ఉన్న ఆయన కలం నుండి ఇటువంటి మాటలు వెలువడటం నాకెంతో ప్రోత్సాహాన్నిచ్చాయి. నిజానికి డా॥కె. బి. కృష్ణ రచనలు నేను గుంటూరు A.C. కళాశాలలో బి.ఎ. చదువుతున్నప్పుడే నా దృష్టికి వచ్చాయి. 1977-1979 సంవత్సరాలలో A.C. కళాశాలలో బి.ఎ. ఫిలాసఫీ చేస్తున్నప్పుడు, డా॥ అంబేద్కర్ విజ్ఞాన సమితిని స్థాపించి విద్యార్థులలో డా॥ అంబేద్కర్ సామాజిక విప్లవ భావాల్ని ప్రచారం చేస్తుండే వాడ్ని. వర్గ సమస్యతో పాటు, కుల సమస్యను కూడా కమ్యూనిస్టులు పట్టించుకోవాలని అనాటి విప్లవ కమ్యూనిస్టు మిత్రులతో వాదిస్తుండేవాడ్ని. నీవు మార్క్సిస్టువై ఉండి డా॥ అంబేద్కర్‌ను ఎలా సమర్థిస్తావని వాళ్ళు అంటుండేవారు. ఒక రకంగా నామీద వ్యతిరేక ప్రచారం కూడా చేస్తుండేవాళ్ళు. నేను మార్క్సిస్టుగానే కుల సమస్యను అర్థం చేసుకోవడానికి, విశ్లేషించడానికి ప్రయత్నించేవాడ్ని. ఈ సమయంలో (1978) ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (బెంగుళూరు)లో సీనియర్ కరస్పాండెంట్‌గా పని చేస్తున్న వి.టి. రాజశేఖర్ (అప్పుడు రాజశేఖర్ షెట్టిగా ప్రసిద్ధుడు) దళిత సాహిత్య అకాడెమి ద్వారా రెండు పుస్తకాలు ప్రచురించాడు. 1. How Marx failed in Hindu India (హిందూ భారతదేశంలో మార్క్స్ ఎలా విఫలం చెందాడు?) 2. Dalit Movement in Karnataka (కర్నాటకలో దళిత ఉద్యమం). ఆయన మార్క్సిస్టు వ్యతిరేకి కాడు. అప్పటికి ఆయనకు మార్క్సిజంలో గొప్ప విశ్వాసం ఉంది. కుల సమస్యను అర్థం చేసుకోవడంలో కమ్యూనిస్టులు వైఫల్యం చెందారని ఆయన ఆరోపణ. దానికి కారణాలను ఆయన పద్ధతిలో విశ్లేషించి చూపారు. అది వాస్తవానికి దగ్గరగా ఉన్నాయి. వాటిని ఎవరూ కాదనలేరు. అయితే హిందూ భారతదేశంలో మార్క్స్ ఎలా విఫలమయ్యాడనే కంటే భారతీయ మార్క్సిస్టులు హిందూ భారతదేశంలో ఎలా వైఫల్యం చెందారని ప్రశ్నించి ఉంటే మాలాంటి వారికి ఆమోద యోగ్యంగా ఉండేది. ఏది ఏమయినా ఆయన విమర్శలో సత్యం ఉంది. దానికి కారణాలు పరిశీలించవలసింది. భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీకి దశాబ్దాల చరిత్ర ఉంది. ఇటువంటి దేశంలో కుల సమస్యను చారిత్రక దృష్టితో పరిశీలించిన మార్క్సిస్టులే లేరా అని ఆలోచిస్తున్నప్పుడు, అప్పుడే ప్రారంభించబడిన విశాలాంధ్ర బుక్ హౌస్ (గుంటూరు)లో డా॥ కె. బి. కృష్ణ రచనలు రెండు దొరికాయి. వీటిలో ఒకటి నా దృష్టిని బాగా ఆకర్షించింది. అది: Political and Social Thought of Buddhist Writers (బౌద్ధ రచయితల రాజకీయ, సామాజిక చింతన). ఈ పుస్తకంలో డా॥ కె. బి. కృష్ణ క్రీ.శ. రెండవ శతాబ్ది నుంచి 5వ శతాబ్దివరకు జరిగిన కుల వ్యతిరేక ప్రతిఘటనోద్యమాలను అధ్యయనం చేయడానికి ప్రయత్నించారు. భారతదేశంలో మార్క్సిస్టుగా ఇటువంటి పరిశోధన చేయడానికి ప్రయత్నించిన వారిలో ఆయన ప్రథముడు. ఆ పుస్తకాన్ని చూడగానే ఏదో కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించినంత (discover) ఆనందం కలిగింది. మార్క్సిస్టుగా కుల సమస్యకు సంబంధించి నేను ఎదుర్కొంటున్న ప్రశ్నలకు దొరికిన సమాధానం,

పరిష్కారం లభించినట్టు భావించాను. అప్పటి నుండి ఆయన రచనల కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాను. మార్క్సిస్టుగా కుల సమస్యను అర్థం చేసుకోవడానికి ఒక మేధావిగా, చరిత్రకారుడిగా డా॥ కె. బి. కృష్ణ మౌలిక కృషి చేశారని గ్రహించగలిగాను.

ఆనాడు ఆయన నామీద బలమైన ప్రభావాన్ని కలిగించారు. ఆనాటి ఆ ప్రభావం యొక్క ఫలితమే మిసిమిలో డా॥ కె. బి. కృష్ణ పై నా వ్యాసం. వైవిధ్యాన్ని, ఆధునిక భావాల్ని ప్రజాస్వామ్య దృష్టితో గౌరవించే రవీంద్రనాథ్ నేనెవరో తెలియకుండానే నా భావాలకు తన పత్రికను వేదిక చేశారు. నన్ను, నా భావాల్ని ఆంధ్ర రాష్ట్రంలోని మేధావి వర్గానికి పరిచయం చేసి, వారిలో వినూత్న భావ సంచలనానికి కారకులయ్యారు.

తెలుగువాడిగా పుట్టి, బౌద్ధ ధర్మాన్ని స్వీకరించి, ఆధర్మంపై ఆంగ్లంలో ప్రామాణిక రచనలు చేసి, కుల నిర్మూలనకు ఉద్యమించి, డా॥ అంబేద్కర్‌ను ప్రభావితం చేసిన ప్రొఫెసర్ పోకల లక్ష్మీనరసు గురించి 1993 సంవత్సరంలో మిసిమిలో ప్రచురించబడిన వ్యాసం కూడా ప్రత్యేకంగా పేర్కొనతగింది. అంతకుముందు ఈ వ్యాసం ''ఎదురీత'' అనే సామాజిక విప్లవ పత్రికలో ప్రచురించబడింది. మిసిమిలో పునర్ముద్రించబడిన తర్వాత ప్రొఫెసర్ లక్ష్మీనరసు జీవితం, రచనల గురించి ఆసక్తి అన్ని వర్గాల మేధావులలో, పాఠకులలో ఏర్పడిందనడంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు. మిసిమిలో డా॥ కె. బి. కృష్ణ, ప్రొ॥ లక్ష్మీనరసు, అశ్వఘోషుడి గురించి ఒక్కొక్క వ్యాసం రాసి ఊరుకోలేదు. నా నిరంతర అధ్యయనంలో, పరిశోధనలో వీరి జీవితాల గురించి ఏ కొత్త విషయం నా దృష్టికి వచ్చినా అది చిన్నదో, పెద్దదో వ్యాస రూపంలో మిసిమిలో దర్శనమిస్తుంది. నేను రాసిన ప్రతి వ్యాసాన్ని తమ పత్రికలో యథాతథంగా ప్రచురించి నాకెంతో ప్రోత్సాహాన్నిచ్చారు రవీంద్రనాథ్. అయితే ఒకే ఒక్క వ్యాసం విషయంలో ఆయన వైఖరి నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. దాని గురించి తర్వాత చూద్దాం. 1995 సంవత్సరంలో యమడ కేకో అనే జపాన్ దేశపు పరిశోధకురాలు తన పరిశోధన నిమిత్తమై గుంటూరు వచ్చినప్పుడు, ఆమె పరిశోధనకు అవసరమైన సమాచారాన్ని తెలియజేస్తూ, ప్రొఫెసర్ లక్ష్మీ నరసు గురించి ప్రస్తావించగా, ఆయన గురించి మీకు తెలుసా, నేనాయన బౌద్ధం పై రాసిన గ్రంథాన్ని జపాన్ భాషలోకి అనువాదమయిన ''ఎస్సెన్స్ ఆఫ్ బుద్ధిజం'' టోక్యో యూనివర్సిటీలోని ఒక ప్రొఫెసర్ దగ్గర చూశానని చెప్పి నన్ను ఆశ్చర్య పరిచింది. అప్పుడు మిసిమిలో నేను రాసిన వ్యాసాన్ని, మేము ప్రచురించిన గ్రంథాన్ని ఆమెకు బహూకరించినప్పుడు ఆమె ఎంతో సంతోషించింది. ఆమె తన పరిశోధన కోసం మద్రాసు (నేటి చెన్నై) లో కొంత మంది తెలుగు, తమిళ సాహితీ ప్రముఖుల్ని కలిసినప్పుడు డా॥ కె. బి. కృష్ణ, ప్రొఫెసర్ లక్ష్మీనరసు గురించి కొన్ని విషయాలు చెప్పారని తెలిపింది. ఆంధ్రలో ఆమె చాలామంది రచయితల్ని, పరిశోధకుల్ని, వివిధ రంగాలలోని ప్రముఖుల్ని కలిసింది. కాని వీరిద్దరిపై మిసిమిలో నేను రాసిన పరిశోధనా వ్యాసాల్ని గురించి కానీ ప్రచురించిన గ్రంథాల్ని గురించి కానీ ఆమెతో ఎవరూ చెప్పలేదు! నన్ను ఆమె కలిసినప్పుడు వీరిద్దరికి సంబంధించిన రచనలు ఇవ్వడంతో ఆనందంతో ఆశ్చర్యపోవడం ఆమె వంతయింది. ఆమె జపాన్ దేశం వెళ్ళబోయేముందు గుంటూరు వచ్చి నన్ను ప్రత్యేకంగా కలిసి, ఆమె బ్రాహ్మణేతర ఉద్యమం గురించి సేకరించిన రెండు అరుదైన

గ్రంథాల జిరాక్స్ ప్రతుల్ని నాకిచ్చి వెళ్ళింది. యమడకేకో నాకు గుడ్‌బై చెప్పి వెళ్ళేముందు ప్రొఫెసర్ లక్ష్మీనరసు ''ఎస్సెన్స్ ఆఫ్ బుద్ధిజం'' జపాన్ భాషానువాదం వీలైతే పంపమని కోరాను. ఆమె జపాన్ తిరిగి వెళ్ళిన మూడు సంవత్సరాల తర్వాత, నేను ఊహించని రీతిలో ఒక లేఖ రాసింది. మరో వారం పది రోజులకు ప్రొఫెసర్ లక్ష్మీ నరసు ''ఎస్సెన్స్ ఆఫ్ బుద్ధిజం'' (జపాన్ భాషానువాదం), సూర్యదేవర రాఘవయ్య చౌదరి ''బ్రాహ్మణేతర విజయం'' ఆంధ్ర రాష్ట్రంలో లభ్యం కాని తెలుగు గ్రంథాన్ని లండన్ లైబ్రరి నుంచి సేకరించి, దాని జిరాక్స్ ప్రతిని పంపింది. అంతేకాదు. తన పి.హెచ్.డి. సిద్ధాంత పత్రం పూర్తి చేయడానికి నేనిచ్చిన పుస్తకాలు, సమాచారం ఆమెకెంతో ఉపయోగపడ్డాయని తెలియచేస్తూ, కృతజ్ఞతలు తెలిపింది. ఈ ఘనతలో మిసిమికి కూడా స్థానం ఉంది. పరిశోధకుడిగా, రచయితగా నా చిరు ప్రయత్నాన్ని ఆంధ్రదేశానికి అందించిన రవీంద్రనాథ్ నాకెప్పుడూ ఆత్మీయుడే, ఆదర్శప్రాయుడే! ఇటువంటి అనుభవాలు, జ్ఞాపకాలు చెప్పుకుంటే చాలా ఉన్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ఇదంతా "An exercise in Narcissm" అవుతుందేమో!

మిసిమి రవీంద్రనాథ్‌తో నా పరిచయం నా రచనల ప్రచురణ వరకే పరిమితం కాదు. మిసిమి సాహిత్య, తాత్విక పత్రికగా బాగా ఎదగాలని, దీనిలో మంచి ప్రామాణిక రచనలు రావాలని ఆకాంక్షించేవాడ్ని. పత్రికస్థాయి పెరగడానికి నాకు తెలిసిన విషయాల్ని సూచనల రూపంలో అప్పుడప్పుడు ఆయనకు తెలుపుతుండేవాడ్ని. ఆయనకు కూడా పత్రికను విశిష్టమైన విషయాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఆకాంక్ష ఉన్నా రచయితల సహాయ, సహకారాలు లేకపోవడం వల్ల అనుకున్నది చేయలేకపోతున్నాని బాధపడేవారు. ఈ లోపాన్ని పరిహరించటం కోసమని పాత సాహితీ పత్రికల లోని అరుదైన మంచి రచనల్ని పునర్ముద్రించమని ఒక సూచన చేశాను. ఈ సూచన ఆయనకు నచ్చిందో, లేదో కానీ నేను పంపిన కొన్ని పాత వ్యాసాల్ని పునర్ముద్రించినట్టు జ్ఞాపకం ఉంది. వీటిలో ముఖ్యంగా పేర్కొనదగింది 1980 ప్రాంతాలలో సుప్రసిద్ధ మార్క్సిస్టు సాహితీవేత్త కె.వి. రమణారెడ్డి ''భారతి'' మాసపత్రికలో అర్చనమా జనాది, బ్రాహ్మణేతర విజయానికి నాంది పలికిన జి. ఎస్.బి. సరస్వతీ స్వామిపై రాసిన వ్యాసం. ఈ తరానికి ఏ మాత్రం తెలియని గొప్ప సంస్కర్త, పండితుడు జి. ఎస్. బి. సరస్వతీ స్వామి, జన్మతః బ్రాహ్మణుడిగా పుట్టి బ్రాహ్మణేతర కులాల అభ్యున్నతికి, ఆత్మ వికాసానికి తోడ్పడ్డ మహాసీయుడు ఆయన. నాటి బ్రాహ్మణేతర ఉద్యమంలో, నేటి దళిత ఉద్యమంలో తలెత్తిన విపరీత ధోరణులకు సమాధానం జి. ఎస్.బి. సరస్వతీ స్వాముల జీవితం. శూద్ర, అస్పృశ్య కులాల ఆత్మగౌరవం కోసం ఆ కులాల్లో పుట్టిన వారికంటే ఎక్కువగా బాధపడి, మధించి సమాజంలో వాళ్ళకు మానవులుగా స్థానం కల్పించటం కోసం తనకు నచ్చిన మార్గంలో చిత్తశుద్ధితో కృషి చేసి సనాతన బ్రాహ్మణాగ్రహానికి గురయ్యాడు. అటువంటి వ్యక్తి జీవితాన్ని కె.వి. రమణారెడ్డి తన శైలిలో పై వ్యాసంలో గొప్పగా చిత్రించారు. దీన్ని నేను పంపించిన వెంటనే రవీంద్రనాథ్ మిసిమిలో పునర్ముద్రించి, తన వ్యక్తిత్వ ప్రత్యేకతను నిరూపించుకున్నారు.

నిజానికి రవీంద్రనాథ్‌తో నా పరిచయం మూడు సంవత్సరాలే! ఈ మూడు సంవత్సరాలలో మిసిమిలో పది వ్యాసాలు రాశాను. ఈ పది వ్యాసాలు రాసిన కాలమే (జూలై 1993 - సెప్టెంబర్

1995) మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు కానీ ఫోనులో సంభాషణలు కానీ జరిగాయి. నూరు సంవత్సరాల మానవుని జీవితంలో ఈ మూడు సంవత్సరాలు పరిగణనలోకి రావు. కాని నా జీవితంలో ఈ మూడు సంవత్సరాలు మధురమైన సాహిత్యానుభవాల్ని మిగిల్చి, నన్ను నన్నుగా నిలబెట్టాయి.

ఈ మధురానుభవాలతో పాటు ఒక చేదు అనుభవం, జ్ఞాపకం కూడా ఉంది. దానిని గుర్తుచేసుకోవాల్సిన అవసరం కూడా ఉంది. ఎంత గొప్ప వారికయినా కొన్ని పరిమితులుంటాయి. ఎవరూ పరిపూర్ణ మానవుడు కాదు. ఎవరూ తప్పులకు అతీతుడు కాదు. ఇవి మానవ జీవితంలో భాగంగానే భావించవచ్చు. మానవుడు నిర్భయంగా పరిపూర్ణ మానవుడిగా ఎదగడానికి ప్రయత్నించాలన్నదే మానవవాదుల లక్ష్యం. కాబట్టి ఏ వ్యక్తిలోని పరిమితుల్నయినా, బలహీనతల్నయినా, లోపాల్నయినా, తప్పుల్నయినా మానవకోణం నుంచి చూడాలన్నదే నా అభిమతం. ఆ కోణం నుండి రవీంద్రనాథ్‌తో ఎదురయిన ఈ సంఘటనను చూస్తున్నాను. కాని సమాజంలో బాధ్యతాయుత స్థానంలో ఉన్నవారు, సత్యాన్వేషణను అభిలషించేవారు, సమర్థించేవారు మాత్రం ఎటువంటి వత్తిడులకు లొంగకుండా సత్యాన్ని నిర్భయంగా, నిజాయితీగా ప్రకటించాలి. 1995 సంవత్సరంలో ''కులము - ప్రత్యామ్నాయ సంస్కృతి'' అనే వ్యాసం విషయంలో రవీంద్రనాథ్ విచిత్రంగా ప్రవర్తించారు. ఈ వ్యాసాన్ని మిసిమికి ప్రచురణార్థం పంపినప్పుడు, దీన్ని చదివి అద్భుతంగా ఉందని, త్వరలో మిసిమిలో ప్రచురిస్తానని లేఖ రాసినాయన, మరికొద్ది రోజులకు ఫోనులో మాట్లాడుతూ మీ వ్యాసాన్ని ప్రచురించలేకపోతున్నానని చెప్పారు. ఆ మాట విని ఆశ్చర్యపోవటం నావంతయింది. ఆ వ్యాస సంచిక సమకాలిక ప్రముఖ రచయితపై నిర్భయమైన విమర్శ. విమర్శ (గుణదోష విచారణ) అనే నిజమైన అర్థంలో రాసిన వ్యాసం అది. తర్వాత ఆ వ్యాసం మరో సాహితీ మాస పత్రికలో ప్రచురించినప్పుడు లభించిన ప్రశంసను నేను ఇప్పటికీ మరవలేను. అదే సమయంలో విమర్శకు గురయిన ఆ ప్రముఖ సామాజిక విప్లవ రచయిత ప్రతిస్పందనను మరవలేను. కారల్‌మార్క్స్ ఏదో సందర్భంలో అంటాడు ''తాత్విక పరిశీలనకు ప్రాథమికావసరం నిర్భయమైన స్వతంత్ర బుద్ధి'' కావాలని. తాత్విక పరిశీలనకే కాదు ఏ పరిశీలనకయినా ''నిర్భయమైన స్వతంత్రబుద్ధి'' ఉండాలి. కాని నిర్భయమైన స్వతంత్ర బుద్ధిని అందరూ, అన్ని సమయాలలో సమర్థించలేరని ఈ వ్యాసం విషయంలో నాకు బోధపడింది. రవీంద్రనాథ్‌తో నా అనుభవాలు, జ్ఞాపకాల నుండి నేర్చుకున్న గుణపాఠం మాత్రం ఒకటి ఉంది. అది - మనకు ప్రేమాస్పదులైన వారికోసం సత్యాన్ని బలిచేయకూడదు. ప్లేటో మాటల్లో చెప్పాలంటే ''సత్యం కంటె మానవెడెన్నడూ ఉపాస్యతరుడు కాడు''.

"Love of Truth should be the guiding principle in any branch of research..."

- H.D. Sankalia

టి. రవిచంద్, గుంటూరు, ప్రముఖ పాత్రికేయుడు, మిళింద పబ్లికేషన్స్ అధినేత.

''భారతి'' నిలిచిపోయిన తర్వాత తెలుగులో అలాంటి ఉన్నత స్థాయిలో పత్రికలు రాలేదు. ఆ లోటును రవీంద్రనాథ్‌గారు కలలుగన్న ''మిసిమి'' పూరించ సాగింది. అది అంతర్జాతీ యంగా మేధావులు చర్చించే సమస్యలు సారస్వ తంలోగాని, కళలలోగాని, సిద్ధాంతంలోగాని, భౌతిక మానసిక శాస్త్రాలలోగాని - అన్నింటికి ఒక కేంద్రీకృత

మిసిమి మార్గదర్శి

☆

కె. శేషాద్రి

నేను ఢిల్లీలో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో పనిచేసి రిటైర్‌అయి హైదరాబాద్‌లోని స్వగృహం చేరిన కొన్ని రోజులకు, నా చిరకాల మిత్రుడు డా. నరిశెట్టి ఇన్నయ్య ఒక రోజు ఎప్పటివలె ఒంటరిగా రాక, ఒక పొడుగాటి, ఠీవితో నున్న గంభీర స్వరూపుడైన వ్యక్తితో వచ్చాడు. ఆయన లాల్చీ, ధోవతి సున్నితంగా ధరించి, చిరునవ్వుతో నిలబడ్డప్పుడు నాకేదో చాలా కాలం నుండి తెలిసిన స్నేహితుడిలా ఒక వింత అనుభూతి. ''ఈనాటి ఈ బంధమేనాటిదో'' అన్నట్లనిపించింది.

ఈ ఆలోచనా పరంపరలలో నేనున్న పరిస్థితిని గమనించిన ఇన్నయ్య ''స్నేహితుడు ఆలపాటి రవీంద్రనాథ్'' గారు అని నాకు పరిచయం చేశాడు. దానికి మించి ఆయనను గురించి నాకేవివరాలు చెప్పలేదు. నేనూ అడగలేదు. ఎందుకంటే, నా అనుభూతిని నేను పేర్కొన్నట్లుగా చిరకాల పరిచితుని గూర్చి, ఇంకా వివరాలు చెప్పడం అనవసరం కదా!

అప్పటికి నామనస్సు కుదుటపడి ''దయచేయండి, కూర్చోండి'' అని అతిథికి ఆహ్వానం పలికాను.

కాస్త కాఫీ పుచ్చుకున్న తర్వాత సికింద్రాబాద్ క్లబ్‌కు వెళ్ళి కాస్సేపు కబుర్లు చెప్పకుందాం రండి అని ఆహ్వానించారు. ఆయన ఇన్నయ్య గారితో అప్పుడప్పుడు ఇంటికి వచ్చి తమ ఇంటికైనా, క్లబ్‌కైనా తీసుకొనివెళ్ళి కబుర్లు చెప్పేవారు. ముఖ్యంగా ఆయనకు Short Stories తాను చదివి అవి బాగుంటే వాటిని అతి స్వారస్యంగా చెప్పటం చాల ఇష్టం. ఆయన ఆ కథలను ఆ సంఘటన లను మన కండ్లముందే జరుగుతున్నట్లు చెప్పేవారు. ముఖ్యంగా మలయాళ భాషలోని కథలు చాల ఇష్టం !

ఆయన రాజకీయాలలో M.N. రాయ్ సిద్ధాంతాలతో ప్రభావితుడైనాడు. తెనాలిలో ఆ రోజులలో M.N. రాయ్ చాలమంది మేధావులను మెప్పించగలిగాడు. రవీంద్రనాథ్ కూడ అలాంటి వారిలో ఒకరు. హేతువాదం, వామపక్ష రాజకీయ సిద్ధాంతం ఆయన క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. టెన్నిస్ ఆడేవారు. తన క్లిష్టమైనది, తన అభిప్రాయాలను తెలియ బరచటానికి, తదితర మేధావులకు ఒక మంచి వేదిక నేర్పరచటానికి ఆయన పత్రికలు నడిపారు. తెనాలిలో ఉన్నప్పుడే ఆయన నడిపిన పత్రికలో రావూరి భరద్వాజ వంటి కొత్తగా జీవిత పోరాటం సాగిస్తున్న రచయితలకు అవకాశమిచ్చి వారిని ఉత్సాహపరచటం ఆయన ధ్యేయం.

హైదరాబాదు వచ్చాక ఆయన ఒక ముద్రణాలయం నడిపారు. కాని వ్యాపారరీత్యా ముద్రణాలయం నడపాల్సివచ్చినా, కేవలం దానికే ఆయన తనను, తనవిలువలను పరిమితం చేసుకోలేదు. త్వరలోనే ''మిసిమి'' అనే మాస పత్రికను నడపాలని నిశ్చయించారు 'మిసిమి' ఒకసార్థక నామంగా వుండాలి. అందులోని వ్యాసాలు, విమర్శలు ఏ సమస్యపై నైనా ఆలోచనాత్మకంగా వుండాలి. కాని ''భారతి'' నిలిచిపోయిన తర్వాత తెలుగులో అలాంటి ఉన్నత స్థాయిలో పత్రికలు రాలేదు. ఆ లోటును రవీంద్రనాథ్‌గారు కలలుగన్న ''మిసిమి'' పూరించ సాగింది. అది అంతర్జాతీయంగా మేధావులు చర్చించే సమస్యలు సారస్వతంలోగాని,

కళలలోగాని, సిద్ధాంతంలోగాని, భౌతిక మానసిక శాస్త్రాలలోగాని- అన్నింటికి ఒక కేంద్రీకృత వేదికగా ఎదిగింది. ప్రపంచ ప్రసిద్ధ చిత్రకారులు చిత్రించిన పటాలను ఆ మిసిమి కవర్ పేజీపై వేసి, లోపల దానిని గురించిన కొన్ని విశేషాలను పేర్కొని ఆంధ్రదేశ కళాభిమానులు, శాస్త్రజ్ఞులు- రచయితలకు, అంతర్జాతీయ మేధావులకు మధ్య నొక సుందరమైన సేతువుగా నిర్మించటంలో ఆయన జీవితాశయం నెరవేరినట్లే.

జాతస్య మరణం ధ్రువం అంటాం. కాని అన్ని మరణాలు, అందరికి ఒకే మాదిరి వుండవు. ముందు వెనుకలలో తారతమ్యం వుంటుంది. ఇదే విషాదకరమైన విషయం. నేను విదేశాలకు వెళ్ళి తిరిగి వచ్చేటప్పటికి రవీంద్రనాథ్‌గారు కన్నుమూశారని, కాని వారు స్థాపించిన మిసిమి జయప్రదంగా నడుస్తున్నదని తెలిసి మనస్సుకు ఓదార్పు కలిగింది.

ప్రొఫెసర్ కె. శేషాద్రి, హైదరాబాదు, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, ఢిల్లీలో పనిచేసి రిటైర్ అయ్యారు. సాహిత్యాభిమాని

వైట్ హౌస్ వద్ద...

రేరాణి
8.
డిసెంబరు.

ఆకాశవాణి ప్రసారం చేసే వివిధ కార్యక్రమాల బాగోగుల గురించి రేడియో రివ్యూ – శీర్షికను మొట్టమొదట తెలుగు పత్రికల్లో ప్రవేశపెట్టింది రవీంద్రనాథ్ గారే.
అంతేకాదు. లైంగిక విషయాల ప్రస్తావనే బూతుగా, అశ్లీలంగా తలచే ఆరోజుల్లోనే అత్యంత సాహసంతో, హావలాక్ ఎల్లిస్ రచనలను అనువదించి 'రేరాణి'లో ప్రచురించారు. అప్పట్లో అది ఒక సెక్స్ పత్రికగా పరిగణింపబడేది. నిజానికి శాస్త్రీయ లైంగిక విజ్ఞాన పత్రిక అది.

తెలుగునాట సాంస్కృతిక పునరుజ్జీవన కృషిలో...

☆

కొత్తపల్లి రవిబాబు

ఆలపాటి రవీంద్రనాథ్ నాకు కేవలం రవీంద్రనాథ్‌గానే పరిచయం. అదీ పరోక్ష పరిచయమే. 'జ్యోతి', 'రేరాణి' 'సినీమా' పత్రికలపై పబ్లిషర్‌గా, సంపాదకునిగా అచ్చయిన ఆయన పేరుతోనే నాకు పరిచయం. ఈ పత్రికలను రవీంద్రనాథ్ తెనాలి నుండి సుదీర్ఘకాలం నడిపారు. పెద్ద పెద్ద పట్టణాల నుండి వెలువడవలసిన పత్రికలు తెనాలి నుండి ప్రచురింపబడటం తెనాలి గొప్పతనమే.

సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమానికి ఈ శతాబ్దపు మొదటి అర్థ భాగంలో తెనాలి కేంద్రంగా వుండేది. ఏకొత్త ఆలోచనా ధార వచ్చినా, ఏ సామాజిక ఉద్యమం వచ్చినా, రాజకీయ ఉద్యమం వచ్చినా వాటి ప్రతిధ్వనులు తప్పనిసరిగా తెనాలిలో వినబడేవి. బ్రాహ్మణేతరులు కూడా సంస్కృతం చదువుకోవచ్చనీ, పెళ్ళిళ్లు చేయవచ్చనీ కార్యాచరణ ద్వారా నిరూపించిన ఉద్యమానికి కేంద్రం తెనాలే! త్రిపురనేని రామస్వామి రచనలు ఆనాటి సామాజికోద్యమానికి ఆయుధాలుగా పనికి వచ్చాయి. ఆర్య సమాజ ప్రభావంతో మరికొందరు సనాతన ఛాందస సంప్రదాయాలకు మొట్టికాయలు మొట్టారు. పురుషాధి పత్య సమాజపు చట్రంలో విలవిలలాడుతున్న మహిళల ఉద్ధరణ కోసం ఆనాటి సమాజానికి షాక్ కొట్టించే విధంగా తనదైన తాత్త్విక దృష్టితో రచించిన చలం రచనలు ఆంధ్ర దేశంపై చూపిన ప్రభావం తక్కువేమీ కాదు. సమూలమైన సామాజిక మార్పును కోరుతూ, తన కథలూ, నవలలూ, వ్యాసాల ద్వారా చక్కటి సామాజిక విశ్లేషణా, అవగాహనా ఇచ్చిన కొడవటిగంటి కుటుంబరావు ఇక్కడి వారే. ప్రజల ఆర్థిక, సామాజిక జీవితాన్ని ఎంతో ప్రతిభావంతంగా తనకథల్లో నవలల్లో చిత్రించిన గోపీచంద్ తెనాలి వారే. చిత్రకళా ప్రపంచంలో, కళా విమర్శలో తనదైన శైలిని సాధించిన ప్రతిభాశాలి, మేధావి సంజీవదేవ్ తెనాలి ప్రాంతపు వారే !

ఆనాటి రచయితలందరికీ వేదికగా వుండేది రవీంద్రనాథ్ నడిపిన 'జ్యోతి' పత్రిక. రావూరి భరద్వాజ, ధనికొండ హనుమంతరావు, శారద, హితశ్రీ, చలం, గోపీచంద్, జి.వి. కృష్ణరావు, సౌరిస్ మొదలగువారి రచనలను తన పత్రికల ద్వారా రవీంద్రనాథ్ పరిచయం చేశారు. ఆకాశవాణి ప్రసారం చేసే వివిధ కార్యక్రమాల బాగోగుల గురించి రేడియో రివ్యూ - శీర్షికను మొట్టమొదట తెలుగు పత్రికల్లో ప్రవేశపెట్టింది రవీంద్రనాథ్ గారే.

అంతేకాదు. లైంగిక విషయాల ప్రస్తావనే బూతుగా, అశ్లీలంగా తలచే ఆరోజుల్లోనే అత్యంత సాహసంతో, హవలాక్ ఎల్లిస్ రచనలను అనువదించి 'రేరాణి'లో ప్రచురించారు. అప్పట్లో అది ఒక సెక్స్ పత్రికగా పరిగణింపబడేది. నిజానికి శాస్త్రీయ లైంగిక విజ్ఞాన పత్రిక అది. దాని కొనసాగింపే నేటికీ ప్రచురింపబడుతున్న 'అభిసారిక'.

రవీంద్రనాథ్ రాడికల్ హ్యూమనిస్టుగా, ఎం.ఎన్.రాయ్ అనుచరునిగా సమాజాన్ని చైతన్యపరచడానికి అనేక శాస్త్రీయ భావనలను, రచనలను తన పత్రికల ద్వారా అందించారు. 1947లో కుటుంబ నియంత్రణపై శ్రీమతి ఎలెన్ రాయ్ రాసిన వ్యాసాన్ని ప్రచురించినందుకు ప్రభుత్వం వీరిపై కేసు నడిపింది.

హేతువాద భావవ్యాప్తికీ, శాస్త్రీయ భావనల ప్రచారానికీ అంకితమై తెనాలి కేంద్రంగా కృషి చేసిన రవీంద్రనాథ్, ఆ తరువాత హైదరాబాద్ నుండి 1990లో 'మిసిమి' పత్రికను ప్రారంభించి మరో సరికొత్త పునరుజ్జీవన ఉద్యమానికి బీజాలు వేశారు. గత అర్థ శతాబ్దంలో ఆనాటి పునరుజ్జీవన ఉద్యమం వెనుకడుగు పట్టింది. భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతులు మరల జీవం పోసుకుంటున్నాయి. అవతార పురుషుల భావన, కర్మ సిద్ధాంతం, మహిళల పట్ల నిరాదరణ, సెక్స్, హింస, ఆర్థిక విలువలకే పట్టం గట్టడం ఈనాడు మనముందున్న సంస్కృతి. నేటి పత్రికలూ, ఎలక్ట్రానిక్ మీడియా మనలను మధ్య యుగాల అంధకారంలోకి నెట్టి వేస్తున్నాయి. ఇప్పుడు కావాల్సింది ధైర్యం, ఆలోచన, విశ్లేషణ, కార్యాచరణ. మేధావులు ప్రజాపరంగా ఆలోచించి, విశ్లేషించి, కార్యాచరణకు ఉద్యమించాలి. అటువంటి కృషికి ఎంతో కొంత సహకారాన్ని 'మిసిమి' ద్వారా అందిస్తున్న రవీంద్రనాథ్‌గారి కుటుంబ సభ్యులకు మనం కృతజ్ఞులమై వుండాలి.

కొత్తపల్లి రవిబాబు,తెనాలి, లెక్చరర్‌గా రిటైరయ్యారు,
'ప్రజాసాహితి' పత్రిక సంపాదకుడు.

లాసెంజల్స్‌లో...

మాస పత్రిక

నవంబర్ - 1998

వెల - రూ॥ 8/-

రవీంద్రనాథ్‌గారికి అనేక విదేశీ పత్రికలు వస్తుండేవి. ఒకే అంశాన్ని వివిధ పత్రికలు ఎలా ప్రచురిస్తాయో, ఆయా పత్రికల విలక్షణత ఎప్పుడెలా దృగోచరమవుతుందో ఆయన నిశితంగా గమనించేవారు. అలాగే తనకు ఆసక్తివున్న అంశాలు ఎవరు, ఏమూల ప్రచురించినా వాటిని వెలికి తీసేవారు. నాకెంతో ఆసక్తికరమైన మనోవిజ్ఞానం ఆయనకు సైతం ఎంతో ప్రీతిపాత్రమైన అంశం. నేను కలసినప్పుడు ఫ్రాయిడ్ పైనా, బి. ఎఫ్. స్కిన్నర్ పైనా, మార్క్స్ పైనా, మైఖెలాంజిలో పైనా కొత్తగా వచ్చిన వ్యాఖ్యానాలు, చెలరేగిన వివాదాలను గురించి వివరించేవారు.

నిండైన వ్యక్తిత్వం!

సి. నరసింహారావు

నా సన్నిహిత మిత్రులు చాలమంది ఆలపాటి రవీంద్రనాథ్ గారికి చిరకాల మిత్రులు. తెలుగు పత్రికా రంగాన్ని గురించి గాని, తెలుగులో తొలి తరం పత్రికా ప్రచురణను గురించి గాని మేము ముచ్చటించుకొనేప్పుడు రవీంద్రనాథ్ గారి పేరు తరచుగా ప్రస్తావనకు వచ్చేది. నేను 1977 మార్చిలోనే రవీంద్రనాథ్‌గారిని మొదటిసారిగా వారింట్లో కలిశాను. ఆనాడు నేను ప్రచురిస్తున్న 'రేపు' మాస పత్రిక తొలి సంచికను వారికి అందించాను. రెండు రోజుల తరువాత ఆయనను తిరిగి కలిశాను. ఆయన నేనందించిన 'రేపు' మాసపత్రికను కూలంకషంగా చదివారు. అభినందన పూర్వకంగా ఆ రాత్రి డిన్నర్‌కు నన్ను ఆహ్వానించారు.

రవీంద్రనాథ్‌గారు నాముందు తరానికి చెందినవారు. ప్రముఖులు. ఆ తరానికి చెందినవారికి యువకుల పట్ల, వారి వ్యాసంగాల పట్ల ఎంతో కొంత చులకన భావం వుండేది. నాకున్న అభిప్రాయం వలన మొదట్లో వారితో స్వేచ్ఛగా మాట్లాడడానికి సంకోచించాను. కాని ఆయనతో రెండు మూడు గంటలు గడపగానే ఆయనను ఒక విలక్షణమైన వ్యక్తిగా స్వతంత్ర తాత్విక దృక్పథం వున్న వారిగా, అత్యంత మర్యాదస్తునిగా గుర్తించాను. తాను క్లుప్తంగా మాట్లాడుతూ, ఎదుటివారి దృక్కోణాన్ని అవగతం చేసుకోవడానికి ఆయన ఎక్కువగా ప్రయత్నించేవారు. ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలతో ఎదుటివారు ఏకీభవిస్తున్నారా, లేదా అని ఎదురు చూసేవేళ, శ్రీ రవీంద్రనాథ్‌గారు మాత్రం ఎదుటివారి అభిప్రాయాలతో తానెంతవరకు ఏకీభవించగలనోనని బేరీజు వేసుకొంటుండేవారు. ఈ సహృదయతను, ఈ వినమ్రతను ఆయనలో గమనించి నేనెంతో ఆశ్చర్య చకితుణ్ణయ్యాను. ముగ్ధుడ్నయ్యాను.

'రేపు' పత్రిక ప్రాచుర్యం పొందుతున్న కొద్దీ చాలమందినన్ను కలవడానికి వచ్చేవారు. అలా కలసినవారిలో రవీంద్రనాథ్‌గారి సూచనపై 'రేపు' పత్రికను చదివామని ప్రతినెలా ఇద్దరు ముగ్గురు చెప్పేవారు. ఆయన సుహృద్భావానికి నేను మనస్సులోనే జోహార్లు అర్పించేవాడిని. తరువాత విజయవాడ నుండి హైదరాబాదు రాగానే తప్పనిసరిగా రవీంద్రనాథ్‌గారిని కలిసేవాడిని. ప్రత్యక్షంగా వారి అభినందనలు పొందాలని ఎదురు చేసేవాడిని. ఆయన పత్రికలోని అంశాలనెలా మెరుగు పర్చాలో సూచించేవారు. పత్రికను గురించి క్లుప్తంగా మాట్లాడుకొన్న తరువాత ఇతర విశేషాలు ముచ్చటించుకొనేవాళ్ళం. ఆయన నుండి నేను ఆశించినట్లు అభినందనలు లభించకపోవడంతో కొంత అసంతృప్తి చెందేవాడిని. తరువాత కొంత కాలానికి గాని వారి తీరు నాకు అవగతం కాలేదు.

పత్రికలోని లోటుపాట్లను కేవలం నాతో మాత్రమే ముచ్చటించేవారు. ఆ పత్రిక విశిష్టతను పనిగట్టుకొని పదిమందికీ చెప్పేవారు. ఆయనలోని ఈ వైశిష్ట్యాన్ని అర్థం చేసుకొన్న తరువాత ఆయన పట్ల నాకు గౌరవ భావమే కాదు గురుభావం ఏర్పడింది. చివరివరకూ అలాగే మిగిలింది.

రవీంద్రనాథ్‌గారు తీవ్రమైన భావోద్వేగానికి లోను కావడం నేనెన్నడూ చూడలేదు. ఒకసారి వారితో నేను ఇంకో ఇద్దరు మిత్రులు కూర్చుని వున్నాం. మేమంతా ఒకే రకమైన అభిప్రాయాలు వున్న వాళ్ళం. ఇంతలో ఆయనకు పరిచయస్తుడైన ఒక కమ్యూనిస్టు నాయకుడు వచ్చి మాతో కూర్చున్నారు. ఆయన దేశ రాజకీయాలను గురించి, చరిత్రను గురించి, దేశంలోని ధనవంతుల్ని

గురించి చాల హేయంగా విరుద్ధంగా, మొండిగా, మూర్ఖంగా మాట్లాడడం, ప్రారంభించారు. అందరం తీవ్ర ఉద్రేకానికి లోనయ్యాం. ఆయన మాట్లాడుతున్నది శుద్ధ తప్పని వాదించడం మొదలు పెట్టాం. కాని శ్రీ రవీంద్రనాథ్‌గారు మాత్రం ఎంతో సంయమనంతో, చిరునవ్వుతో కూర్చున్నారు. ఒక వ్యక్తి తన పిడి వాదనలను మామీద రుద్దడానికి ప్రయత్నిస్తుంటే - అందరం ఆ సిద్ధాంతాల ప్రయోజన రాహిత్యాన్ని, వివరిస్తుంటే - రవీంద్రనాథ్‌గారు తటస్థంగా వుండిపోవడం నాకు మింగుడు పడలేదు. అందుకే వారిని, 'మేము చెబుతున్న వాటితో మీరు ఏకీభవిస్తున్నారు గదా! అని నేను ఒకటికి రెండు సార్లు ప్రశ్నించినా ఆయన చిరునవ్వుతో ఏమీ మాట్లాడకుండా వుండిపోయారు. కొంత సేపటికి ఆ కమ్యూనిస్టు నాయకుడు హేళనగా నవ్వుకొంటూ వెళ్ళిపోయాడు. ఆ తరువాత అలా ముభావంగా ఎందుకు వుండిపోయారని మర్యాదకోసమనా అని రవీంద్రనాథ్‌గారిని నేను కొంత అసహనంతో ప్రశ్నించాను. ''ఆయన చెబుతున్న సిద్ధాంతాలు నేను దశాబ్దాలుగా వింటూనే వున్నాను. ఆయనకు అవి మత విశ్వాసాలవంటివి. వాటిపై వాదోప వాదనలు పూర్తిగా అనవసరం. కాని ఆయన తపన, మొండితనం, సాధనా పటిమ, ప్రజలకేదో మేలు జరగాలన్న ఆరాటం, నేటి దుస్థితి నుండి బయట పడాలన్న అసహనం మీరు గుర్తించినట్లు లేరు'' అని ఆయన వివరించారు. నేను స్తబ్ధుణ్నయ్యాను. ఎదుటి వారు చెప్పే మాటలకంటే - వాటి వెనుకవున్న ఉద్దేశ్యాలను గుర్తించి, అర్థం చేసుకోవడం శ్రీ రవీంద్రనాథ్‌గారి విలక్షణత. ఇందువల్లనే ఆయన ఎప్పుడూ తీవ్రమైన ఉద్రేకాలకు, ఉద్వేగాలకు లోనయ్యేవారు కాదు. అలాగే ఎదుటివారు ఉద్రేకపూరితులైనా, వీరు అందుకనుగుణంగా స్పందించేవారు కాదు.

అదే సమయంలో అందమైన అనుభవాలను ఆస్వాదించడం, తన మిత్రులందరితో పంచుకోవడం ఆయనకు అలవాటు, ఒకసారి వారి అబ్బాయి (బహుశా దేవేంద్ర అనుకొంటాను) అమెరికా నుండి వస్తూ, 'క్వేక్ నాక్స్' అనే రికార్డు తెచ్చారు. ఖండాలు కలిసే చోట, ధ్రువాల వద్ద, అంతా నిశ్శబ్దంగా, ఈ ప్రపంచానికతీతంగా వున్న చోట, ఎటువంటి మానవ సంచారం లేని చోటకలిగే అనుభూతికి శబ్దరూపాన్ని కల్పించే అద్భుతమైన స్టీరియో రికార్డు అది. రవీంద్రనాథ్‌గారు ఈ పూర్వ రంగాన్ని వివరించి, తన స్టీరియో సిస్టంలో ఈ రికార్డును వినిపించినప్పుడు, నేను కళ్ళు మూసుకొని వింటూ ఒక అద్భుత అనుభూతికి లోనయ్యాను. సుదూర తీరాలకు తరలిపోతున్నట్లు ఫీలయ్యాను. నేను కళ్ళు తెరచి ఆయన తన్మయత్వ భావనతో ఆధునిక రాగాలను ఆస్వాదించడం గమనించాను. ''మీరు పది పదిహేనుసార్లు విని వుంటారు గదా! నాకు మొదటిసారి గనుక అద్భుతంగా అనిపించింది. మీరు ఈ సంగీత రసాశికి ఇప్పుడు కూడా మగ్ధులు కావడం ఆశ్చర్యంగా వుంది''. అని అన్నాను. ''ఎన్నిసార్లు విన్నా నాకు మొదటిసారి విన్నట్లే వుంటుంది'' అన్నారాయన. నాకిదొక అద్భుతమనిపించింది. అలాగే తానిష్టపడే గులాబీలను జీవితంలో మొదటసారి చూస్తున్నంతటి అపురూపంగా ఆహ్లాదాన్నంతటినీ తన కనుల్లో నింపుకొని చూసేవారు. ఈ సౌందర్య రసాస్వాదనను ఆయన చివరి వరకూ సజీవంగా, మరుగ్గా నిలుపుకో గల్గడం నాకెంతో సంభ్రమం కలిగించేది. అందరిలో ఇది క్రమంగా మొద్దుబారుతుంటుంది. ఒక నైరూప్య కళాచిత్రాన్ని మొదటిసారి చూసినప్పుడు ఎంతో అద్భుతం అనిపించవచ్చు. తరువాత

సాదాసీదాగా, ఆ తరువాత విసుగ్గా, చిరాగ్గా అనిపించవచ్చు. కాని రవీంద్రనాథ్ గారిది ఇందుకు భిన్నమైన అనుభవం.

రవీంద్రనాథ్‌గారికి అనేక విదేశీ పత్రికలు వస్తుండేవి. ఒకే అంశాన్ని వివిధ పత్రికలు ఎలా ప్రచురిస్తాయో, ఆయా పత్రికల విలక్షణత ఎప్పుడెలా దృగ్గోచరమవుతుందో ఆయన నిశితంగా గమనించేవారు. అలాగే తనకు ఆసక్తివున్న అంశాలు ఎవరు, ఏమూల ప్రచురించినా వాటిని వెలికి తీసేవారు. నాకెంతో ఆసక్తికరమైన మనోవిజ్ఞానం ఆయనకు సైతం ఎంతో ప్రీతిపాత్రమైన అంశం. నేను కలసినప్పుడు ఫ్రాయిడ్ పైనా, బి. ఎఫ్. స్కిన్నర్ పైనా, మార్క్స్ పైనా, మైఖెలాంజిలో పైనా కొత్తగా వచ్చిన వ్యాఖ్యానాలు, చెలరేగిన వివాదాలను గురించి వివరించేవారు.

ఇప్పుడంతటి ప్రాచుర్యంలో లేని వ్యక్తుల్ని గురించి గడచిన కాలపు విశేషాలను గురించి మరింతలోతుగా అధ్యయనం చేయడానికి, వివిధ అంశాలను సమగ్రంగా అవగాహన చేసుకోవడానికి ఆయన చివరివరకూ ప్రయత్నించారు. అన్నీ తెలిసినవేనని, తానింతకుముందు చదివినవేనని ఆయన ఎప్పుడూ భావించలేదు. అందుకే సత్యాన్వేషణ ఆయన వ్యక్తిత్వంలో ఒక విడదీయరాని భాగమైపోయింది. మానవ సంబంధాలు, మానవ ప్రవృత్తిని సరిగా అవగతం చేసుకోవడానికి నిరంతరం చైతన్య శీలంగా వుండి తీరాలని ఆయన విశ్వసించేవారు. 'మిసిమి' పత్రిక పెట్టడానికి ముందు, ఆ తరువాత ఆయనను తరచుగా కలిసేవాడిని. తానో నూతన ఉత్తేజాన్ని పొందడానికి ఈ పత్రికను స్థాపించనున్నట్లు, వ్యాపార బరువు బాధ్యతలన్నీ వదిలించుకొన్న తరువాత తన వ్యాసంగంగా ఈ పత్రిక నిర్వహణను చేపట్టనున్నట్లు వారు చెప్పారు. నాకు తెలిసినంతటి వరకూ ఆయన పత్రికను ఎలా తీర్చిదిద్దాలని గాని, ఎలా వుండాలని గాని ఎవ్వరినీ అడగలేదు. పై పెచ్చు ప్రతిరోజూ ఆయనను కలిసే రచయితలు, పాత్రికేయులతో ఆయన ఈ విషయమై ముభావంగా వుండేవారు. అంతేకాదు, పత్రిక ప్రారంభించిన తరువాత వారినుండి ఎటువంటి రచనలు ఆహ్వానించలేదు కూడా!

రవీంద్రనాథ్‌గారు త్వరలో పత్రిక వెలువరిస్తారని తెలిసినప్పుడు, నేను, ఉభయులకు మిత్రులైన మరో ఇద్దరు ఓ సాయంత్రం కలిశాం. ఆ పత్రిక ఎలా వుండబోతున్నదన్న చర్చ మా మధ్య వచ్చింది. 'మిసిమి' పత్రిక రవీంద్రనాథ్‌గారి వ్యక్తిత్వం ఆరబోసినట్లుగా వుంటుందని నేను చెప్పాను. ఆ పత్రిక వచ్చిన తరువాత నేను చెప్పింది రూఢి అయ్యింది. ఆయనలోని కళాభినివేశం, సౌందర్యారాధన ఈ పత్రిక కవర్ పేజీపైనా, లోపల వేసే చిత్రాలలో ప్రత్యక్షమయ్యేది. ప్రతినెలా ఇలా నైరూప్య చిత్రాలనే ప్రచురించుతుంటే, పత్రిక పాతదో కొత్తదో తెలియడం లేదని, ఎప్పటికప్పుడు ముఖ చిత్రమైనా విలక్షణంగా వుండేట్లు చూడమని నా ఎదుటే ఒకరు రవీంద్రనాథ్‌గారికి సలహా ఇచ్చారు. ''పాఠకులందరి అభిరుచిని నేనంత తక్కువగా అంచనా వెయ్యనని'' ఆయన సున్నితంగా చెప్పారు. ఆ సలహా ఇచ్చిన వ్యక్తి మారుమాట్లాడలేకపోయారు.

ఒక సంవత్సర కాలంలోనే 'మిసిమి' పత్రిక అతి అరుదైన అభినందనలు పొందింది. దిన పత్రికలు సంపాదకీయాలు వ్రాశాయి. సంజీవదేవ్ వంటి ప్రముఖులు 'మిసిమి' వ్యక్తిత్వాన్ని

ఎంతగానో కొనియాడడం జరిగింది. ఇది గుర్తించిన రవీంద్రనాథ్‌గారు ఆశ్చర్యానందాలతో తలమునకలైపోయారు. తన పత్రికకు ఒక వ్యక్తిత్వమున్నట్లు ఇతరులంతా తక్షణమే గుర్తించడం, అభినందించడం వీరిని తన్మయానికి లోను చేసింది. కాని ఈ పత్రిక ఆయనకు 'ఆల్టర్ ఈగో'గా ఆయన వ్యక్తిత్వానికి ప్రతిరూపంగా నేను ముందే గుర్తించాను.

సంపాదకులందరికీ భిన్నంగా ఆయన తన పత్రికలో సంపాదకీయాలకు ఎటువంటి ప్రాధాన్యతనూ కల్పించలేదు. వివాదాస్పదమైన రచనలకు అసలు స్థానం కల్పించలేదు. మధురవాణి పాత్రలో అందరూ అపురూప సౌందర్యరాశిని, ఒక వేశ్యను మాత్రమే చూస్తే, ఆమెలోని మేధాశైశిత్వాన్ని ఈయన దర్శించారు. తన సత్యశోధనలో భాగంగా ప్రముఖులుగా కొనియాడబడుతున్న వారి జీవితాలలోని నూతన పార్శ్వాలను 'ఇంటలెక్చువల్స్' పుస్తకం నుండి వెంకటేశ్వరరెడ్డిగారితో, అనువదింపజేసి ప్రచురించారు. ఉదాశీనత, నిరాశా, నిస్పృహల్లోకి ప్రతి ఒక్కరూ జారిపోయే వయస్సులో ఆయన ప్రతి విషయం పట్లా ఎంతో ఆశావాదాన్ని ప్రకటించేవారు. పాజిటివ్ థింకింగ్‌కు ఆయన అంకితం కావడంవల్లనే, నా పుస్తకం 'వ్యక్తిత్వ వికాసం' లోని అధ్యాయాలను ఆయన ధారావాహికంగా ప్రచురించారు. తన నిండైన వ్యక్తిత్వానికి దర్పణంగా 'మిసిమి' పత్రికకు ప్రాణ ప్రతిష్ట చేసి, ఆ పత్రిక ద్వారా మనకళ్ళముందు నిరంతరం కాంతులీనుతున్నారు.

చివరిగా విల్ డురాంట్ 'లెసన్స్ ఆఫ్ హిస్టరీ'లోని చివరి వాక్యాలను ఉటంకిస్తాను.

''తాము కల్పించుకొనే విలువకు మించి మానవ మనుగడకు వేరే అర్థమూ, పరమార్థమూ ఏదీ లేదు. ఎవరైనా తమ జీవితాలను అర్థవంతంగా తీర్చిదిద్దుకోకలిగినప్పుడు, ఆ జీవితాన్నుండి అద్భుతమైన ఫలితం ఏదయినా వెలువడితే అది వారికి అమరత్వాన్ని ప్రసాదిస్తుంది. మనలో కొందరు అదృష్టవంతులు తమ జీవితకాలంలో వీలైనంతటి జ్ఞానాన్ని సముపార్జించి తమ తరువాత వారికి అందజేయకల్గుతారు. ఇటువంటివారు తుదిశ్వాస విడిచేంతవరకు, తమకు మానవజాతి వారసత్వంగా లభించిన జ్ఞాన సంపదను చూసి నిండు హృదయంతో గర్విస్తారు. ఆ వారసత్వ సంపదే మానవ జాతికి 'మాతృ దేవత'. మానవ జీవితానికి ఆత్మ!''

విల్ డురాంట్ గ్రంథంలోని ఈ చివరి వాక్యాలు రవీంద్రనాథ్‌గారికి కూడా ఎంతో ఇష్టం.

సి. నరసింహారావు, హైదరాబాదు, రేపు పత్రిక సంపాదకులు, తరువాత 'వ్యక్తిత్వ వికాసం' ప్రచురించారు. మనోవైజ్ఞానిక శాస్త్రం పట్ల మిక్కిలి ఆసక్తులు

It's *Smart* to own an OLDS

The 1947 Oldsmobile is smart looking, with smooth flowing lines and tastefully tailored interiors. It's smart handling — restful to ride in and easy to drive. It's a smart buy.

Distributors for
(Kistna, Guntur & W. Godavari Dists.)

Sree Sathyanarayana Motor Stores

Head Office: BEZWADA *Branch* GUNTUR

Wrapper Printed at Saradhi Press. Tenali

''జ్యోతి''లో 1948 నాటి కార్ల ప్రకటన

యూనివర్శిటీ ప్రొఫెసర్లయినా, డాక్టర్లయినా, ఇంజనీర్లయినా, వారితో కలిసి చర్చించే అవకాశం వస్తే, అదొక మరపురాని అనుభూతిగా భావించే వారు. రవీంద్రనాథ్‌గారి ప్రత్యేకత యేమంటే, ఎవరితో ఏ అంశం పై చర్చలు ప్రారంభించినా, అవతలివారు ఎంత ఘటికులయినా, వారికి తెలియకుండానే, చర్చనీయాంశాన్ని అంతిమ దశలో మనస్తత్వ, శృంగార శాస్త్ర సాహిత్యాల వైపు మళ్ళించేవారు. అది మొదలుకాగానే, అవతలివాళ్ళు ఎంత మేధావులైనా, వీరిముందు వినమ్రంగా వినాల్సి వచ్చేది. వారి వాక్చాతుర్యం అలా వుండేది.

మధురమూర్తి

☆

కె.బి. సత్యనారాయణ

ఆగస్టు, 1992
వెల రూ.4/-

ఆలపాటి రవీంద్రనాథ్‌గారితో నా పరిచయం దాదాపు నాలుగు దశాబ్దాల క్రితమే ప్రారంభమయింది. మేమిద్దరం పుస్తక ప్రియులవటంవల్ల ఆపరిచయం తర్వాత క్రమేణా మూడు పువ్వులు ఆరుకాయలుగా ముమ్మరించింది. పుస్తకప్రియులయిన వారెవరికైనా వారితో పరిచయం యేర్పడితే, ఇలాగే కొనసాగుతుండేది కూడ. పుస్తకాలన్నా, వాటిపై చర్చలూ - విమర్శలన్నా, వారికి ప్రాణం లేచి వచ్చినట్లుగా కన్పించేది.

మొదటి సారిగా నేను వారిని కలిసింది 1962లో అనుకుంటాను. అదే సంవత్సరంలో 317 పేజీ లున్న "Law Relating to Medical Profession in India" అనే పుస్తకాన్ని నేను వ్రాసినప్పుడు, దాన్ని ఎక్కడ అచ్చువేయిస్తే బాగుంటుందని ఇద్దరు, ముగ్గురు సాహితీ మిత్రులను సంప్రతిస్తే, గోల్కొండ చౌరస్తాలోవున్న జ్యోతిప్రెస్‌లో వేయిస్తే చాలా బాగుంటుందని అందరూ ఏకగ్రీవంగా సిఫారసు చేశారు. అవి, నేను హైకోర్టు సర్వీసులో ఉంటున్న రోజులు. అందుచేత వ్రాతప్రతిని తీసికొని ఒకనాటి సాయంత్రం జ్యోతిప్రెస్ కెళ్ళి రవీంద్రనాథ్‌గారిని కలిసి వివరంగా మాట్లాడటం, మొత్తం ఖర్చు ఎంతవుతుందో ఎస్టిమేషన్ తీసుకొని ముద్రణా కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. వారు చెప్పిన సమయం కంటే చాలముందుగానే ఆ పుస్తకాన్ని ముద్రించి బైండు చేయించి యిచ్చారు. ముందిచ్చిన ఎస్టిమేషన్‌కన్నా ఇంకా తక్కువే తీసుకున్నారు. నా రచనా వ్యాసంగానికి అలాప్రోత్సాహాన్ని ఇచ్చారు. మా పరిచయం ఆనాడు అలా ప్రారంభమయింది.

అప్రస్తుతమయినా, మరో చిన్న విషయమేమంటే, రవీంద్రనాథ్‌గారు అప్పటికే వేయిగుళ్ళ పూజారిగా వుండేవారు. ఎన్నో రకాల Social activities తో సంబంధాలు కలిగి, రచయితలతోను, పుస్తక ప్రియులతోను, సాంఘిక, సాహిత్య కార్యక్రమాల్లో మునిగి తేలుతుండేవారు. ఈ కారణంగా నేమో, ప్రెస్‌లో జరగవలసిన పని అంతా అప్పట్లో శర్మగారని ఒకాయన చూచుకుంటుండేవారు. వారు రవీంద్రనాథ్‌గారికి నమ్మిన బంటుగా వుండి, తర్వాత కొంతకాలానికి, జ్యోతిప్రెస్‌ని వదలివెళ్ళి సొంతంగా ప్రెస్ పెట్టుకున్నారని విన్నాను. ఇంకో విషయమేమంటే, జ్యోతిప్రెస్‌లో అచ్చయిన నా పుస్తకానికి కవర్ పేజీ ప్రగతి ఆర్ట్ ప్రింటర్స్‌లో రూపొందింది. ఆనాడు అది చిన్న ప్రెస్. ఆ ప్రెస్ యజమాని శ్రీ హనుమంతరావుగారితో పరిచయ భాగ్యం కలిగింది. ఆనాటి ఆ జ్యోతి ప్రెస్, ఆ ప్రగతి ఆర్ట్ ప్రింటర్స్, రెండూ, ఇంతై, అంతై, ఈనాడు మహావటవృక్షాలయి, హైదరాబాదులో పేరొందిన ఆధునిక ముద్రణాలయాలుగా కీర్తితెచ్చుకొన్నాయి. అత్యాధునిక కలర్ ప్రింటింగులో నేడు ఈ రెండు ప్రెస్సులూ ఎంతో ఘనంగా చెప్పుకోబడుతున్నాయి. అలాంటి ప్రముఖ ముద్రణాలయాలతో వాటి ప్రథమదశలోనే నాకు పరిచయం కలగడం నామహాభాగ్యంగా పరిగణిస్తుంటాను.

నేను పుస్తక ప్రచురణ - విక్రయ రంగంలో వున్నాను గనుక, ఏ పుస్తకం కావాలన్నా, లేక వాటికి సంబంధించిన ఏ సమాచారం కావాలన్నా, టపీమని నాకు ఫోను చేసే సంప్రదాయాన్ని నెలకొల్పుకొన్నారు రవీంద్రనాథ్‌గారు. కొద్దో గొప్పో నాకు కూడ ఈ పుస్తకాల పిచ్చి వుంది గనుక, వారు ఫోను చేయగానే కావలసిన పుస్తకాన్ని పంపడమో, లేక కావలసిన సమాచారాన్ని ఇవ్వడమో, నావద్ద లేకపోతే, తర్వాత ఎంత శ్రమయినా తెప్పించి ఇవ్వడమో జరుగుతుండేది. వారడిగే పుస్తకాలు కాని, వాటిని గురించి వారికి కావలసిన సమాచారం కాని వింటుంటే,

చాలసార్లు కొత్త పుస్తకాలను గురించి మాకంటే వారికే ఎక్కువగా తెలుసునన్నట్లు భావించేవాడిని. పుస్తక పరిశ్రమలో వున్న నాకంటే, వీరికి కొత్త పుస్తకాలను గురించి అంత ఎక్కువగా ఎలా తెలుస్తున్నదని ఆరాతీస్తే, వీరు ప్రపంచ ప్రఖ్యాతి చెందిన Times Literary Supplement తెప్పించి చదువుతుండే వారని తెలిసింది. అప్పటి నుండి కొత్త పుస్తకాలను గురించి మేమే వారికి ఫోను చేసి తెలుసుకోవడం ప్రారంభించాము. పుస్తక ప్రపంచంతో వారికున్న అవినావభావ సంబంధం ఆనాడు అలావుండేది. నాకు తెలిసినంతవరకు, నార్లవారిని వదలివేస్తే, అలాంటి పుస్తక ప్రియులు మరొకరు ఈనాటివరకు కన్పించలేదంటే, అదేమీ అతిశయోక్తి ఏమాత్రం కాదు.

1974లో అనుకుంటాను. నన్ను ఫతే మైదాన్ క్లబ్ (FMC)లో వారే Proposer గా వుండి, చేర్పించి సభ్యత్వం ఇప్పించారు. వారి స్నేహితుడు, పారిశ్రామిక వేత్తగా పేరొందిన శ్రీయుతులు శేషగిరిరావుగారి చేత సెకండర్‌గా చేవ్రాలు చేయించారు కూడ. నిజం చెప్పాలంటే, ఆనాడు క్లబ్‌లో చేరవలసిన స్తోమత కలిగిన వ్యక్తినే కాదు నేను. వీరి ప్రోద్బలమే నేను FMCలో చేరటానికి కారణమయింది. ఏవైనా సాహితీ ప్రియుల, పుస్తకప్రియుల సమావేశాలున్నప్పుడు తప్ప, అంతగా నేను FMCకి వెళ్ళే రోజులు కావవి. రవీంద్రనాథ్‌గారు మాత్రం క్రమం తప్పకుండా ప్రతిరోజు సాయంత్రం FMC కి Tennis ఆడటానికి వెళ్ళేవారు. వీరికి పుస్తకాలంటే ఎంత ఎక్కువ మక్కువో, Tennis ఆడడమంటే అంతే ప్రీతివుండేది. వయసుమీరి, Tennis ఆడేంత శక్తి లేని రోజుల్లో కూడ, Tennis Courtకు వచ్చి, ఒక గంట సేపయినా అక్కడ కూర్చొని వెళుతుండేవారు. Tennis అంటే అంత ప్రాణప్రదంగా భావించేవారు రవీంద్రనాథ్‌గారు.

వీరికి శృంగార సాహిత్యంలోనూ, మానసిక శాస్త్రంలోను, ఎంతో పరిశోధన చేసి సంపాదించిన ఎనలేని శాస్త్రీయ పరిజ్ఞానం వుండేది. వీటికి సంబంధించిన అంశాలపై చర్చలు జరిగినప్పుడల్లా వీరిదే పైచేయిగా వుండేది. అలాంటి ఘట్టాల్లో వారి ముందు నిలబడ గలిగిన వ్యక్తి మరొకరు లేరేమోనని పించేది. ఆ అంశాల్లో వారు అంతటి దిట్ట. రవీంద్రనాథ్‌గారు సమకాలీన రాజకీయాలపై గాని, సామాజిక సమస్యలపై గాని చక్కని అవగాహన ఉన్నవారు కూడ. ముఖ్యంగా మానవతావాది వారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లయినా, డాక్టర్లయినా, ఇంజనీర్లయినా, వారితో కలసి చర్చించే అవకాశం వస్తే, అదొక మరపురాని అనుభూతిగా భావించేవారు. రవీంద్రనాథ్‌గారి ప్రత్యేకత ఏమంటే, ఎవరితో ఏ అంశం పై చర్చలు ప్రారంభించినా, అవతలివారు ఎంతటి ఘటికులయినా, వారికి తెలియకుండానే, చర్చనీయాంశాన్ని అంతిమదశలో మనస్తత్వ, శృంగార శాస్త్ర సాహిత్యాల వైపు మళ్ళించేవారు. అది మొదలు కాగానే, అవతలివాళ్ళు ఎంత మేధావులైనా, వీరిముందు వినమ్రంగా వినాల్సి వచ్చేది. వారి వాక్చాతుర్యం అలా వుండేది. నిండుగా పండిపోయిన శాస్త్రీయ పరిజ్ఞానం వారికి పెన్నిధిగా వుండేది.

డబ్బుకోసం తన అవగాహనలు కాని, ఆలోచనలు కాని మార్చుకొనే లేదా మానుకొనే అలవాటేలేని మహావ్యక్తి ఆయన. పత్రికలు నడిపి ఎన్నోసార్లు చేతులు కాల్చుకున్న చేదు అనుభవాలున్నా, ఆ ప్రవృత్తిని ఏమాత్రం మార్చుకోని మహనీయుడు. అందుకు 'మిసిమి' సాక్షిగా వుండిపోయింది. వారి కుమారుడు చిరంజీవి బాపన్నగారు, 'మిసిమి'ని వదిలేయకుండా, అదే పద్ధతిలో కొనసాగించడం ఎంతో ఆనందించదగ్గ విషయం.

రవీంద్రనాథ్‌గారి జీవితం ఒక ప్రత్యేక బాణీకి ప్రతీక. వారిననుసరించడం మరెవ్వరికి సాధ్యం కాని పని. అందుకే వారికి వారే సాటి. వారితీరే వేరు. పూర్తిగా కాకపోయినా, కొన్ని విషయాల్లోనయినా ఈ కోవకు చెందినవారు మరో మిత్రుడు 'రేపు' నరసింహారావుగారు, వారి వారి రంగాల్లో చరిత్రనే సృష్టించ గలిగిన అతిరథులూ, మహారథులూ వీరు. రవీంద్రనాథ్‌గారు తమ హితులు, సన్నిహితులు, పరిచయస్తులకు చిరస్మరణీయులుగానే వుండిపోతారు. పాలబుగ్గల్లా, తెల్లని మిసమిసలాడే లాల్చీ ధోవతుల్లో కన్పించే ఆ మధురమూర్తిని మరచిపోగల శక్తి వారి మిత్రులకెవరికీ సాధ్యం కానిపని. 'మిసిమి' వారి ముద్దుబిడ్డ. 'మిసిమి'లో వారు మన కళ్ళకు కన్పిస్తున్నట్లే వుంటుంది. వారి కళాభిమానానికి, వారి మానవతా వాదానికి 'మిసిమి' ప్రత్యక్ష నిదర్శనంగానూ, సాక్షిగాను దర్శన మిస్తుంది. అలాంటి వారి ముద్దు బిడ్డయిన 'మిసిమి' మరో నూరేళ్ళు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని మనసారా కోరుకుందాం. కీర్తిశేషులు ఆలపాటి రవీంద్రనాథ్‌గారికి అంతకంటె ఘనమైన నివాళి మరేదీ వుండదని భావిస్తాను.

కె. బి. సత్యనారాయణ, హైదరాబాదు, బుక్ లింక్స్ అధిపతి, ప్రచురణకర్త, సాహితీ ప్రియుడు.

మధురవాణి ఇంటర్వ్యూలు గ్రంథావిష్కరణ సభలో
డాక్టర్ జయప్రకాశ్ నారాయణ, డాక్టర్ సి. నారాయణరెడ్డి,
శ్రీ అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, శ్రీ భమిడిపాటి రామగోపాలం (భరాగో)

ఒకసారి 'మిసిమి' సంచికలో ఒక్కటంటే ఒక్కటే అచ్చు తప్పు దొర్లింది. దాన్ని ఎత్తి చూపిస్తే ఎంతగానో బాధపడిపోయారు. అంత **sincere**గా, **honest**గా, **devoted**గా ఒక పత్రికను నడిపించగల సంపాదకులు 'నభూతో నభవిష్యత్' అంటే అతిశయోక్తి గాదు. ఆ అసాదృశమైన నిజాయితీ, నిబద్ధత ఆదర్శప్రాయం, మార్గదర్శకం.

జిజ్ఞాసా శీలి

☆

భీమసేన్ 'నిర్మల్'

మాన్యులు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు 'నా అనువాద రచన ఒకటి జ్యోతి ప్రెస్ అధినేత ఆలపాటి రవీంద్రనాథ్ అచ్చువేశారు. వారిని అడిగి ఓ కాపీ తెచ్చుకో. మీ ఇంటికి దగ్గరేకదా. నా అనువాదం ఎలా ఉందో చెప్పాలి' అని అనడంతో ఒక రోజు సాయంకాలం గోల్కొండ క్రాస్ రోడ్డులో, హెబ్రోనుకు ఎదురుగా ఉన్న జ్యోతిప్రెస్సుకు వెళ్ళాను. బయట ఆవరణలో 4, 5 కుర్చీలు వేసి ఉన్నాయి. నన్నో కుర్చీలో కూర్చోమని, పుస్తకం తెప్పించి ఇచ్చి, అనువాద ప్రక్రియ దగ్గర నుండి సాహిత్య చర్చ మొదలు పెట్టారు రవీంద్రనాథ్‌గారు. తాము చదివిన పుస్తకాలను గురించి అనర్గళంగా చెబుతుంటే, ఆశ్చర్యపడిపోవటం నావంతు అయింది. అమ్మో, ఈయన ప్రెస్ ఓనరు మాత్రమే కాదు, గొప్ప సాహితీవేత్త, voracious reader అనిపించింది.

ప్రెస్సుకు, వారి ఇంటికి (ఆ రోజుల్లో గాంధీనగర్‌లో ఉండేవారు) మధ్యలో మా ఇల్లు ఉండటంతో, తరుచుగా వారిని కలుసుకొని, సాహిత్య కాలక్షేపం చేస్తుండేవాణ్ణి. మా తాతల స్వగ్రామం గోళ్ళమూడిపాడు. వారి వియ్యాల వారిదీ ఆ ఊరు కావడంతో వారికి నా పట్ల ఇంకా ఆత్మీయత, అభిమానం పెరిగాయి. నేను చదివిన హిందీ పుస్తకాలను గురించి ప్రశ్నలడిగి, వాటిలోని మూల ప్రతిపాద్య విషయాన్ని గురించి చర్చించేవారు. వారి ప్రశ్నలకు జవాబు చెప్పేటప్పటికి నా తల ప్రాణం తోకకు వచ్చేది. బందరులో ఉంటూ, 1884 - 86 మధ్య హిందీలో నాటకాలు వ్రాసిన నాదెళ్ళ పురుషోత్తమ కవి (1861 - 1938) గారి జీవిత విశేషాలనూ, రచనా వ్యాసంగం గురించి ఎన్నో విషయాలు అడిగి తెలుసుకున్నారు.

రోజుకు 300 - 400 పేజీలు చదివితేగాని సంతృప్తిగా ఉండదనీ, రాత్రిళ్ళు నిద్ర పట్టదనీ చెప్పేవారు. మేధావుల మెదడుకు పదును పెట్టే వ్యాసాలతో ఒక పత్రిక ప్రారంభించాలనీ, ఆ పత్రికకు 'మిసిమి' అని పేరు పెడదామనుకుంటున్నాననీ చెబుతూ, నా అభిప్రాయాలడిగి తెలుసుకున్నారు.

'మిసిమి' సంచికలను క్రమం తప్పకుండా పంపించేవారు. ఈ వ్యాసం ఎలా ఉంది? ఆ వ్యాసం గురించి మీ అభిప్రాయమేమిటి? అని అడిగేవారు. 'అయ్యా! మీ 'మిసిమి' ఒకటి, రెండురోజుల్లో చదివి అవతల పారవేసేదికాదు. అది ఆలోచనామృతాన్ని అందించేది. దాన్ని ఆస్వాదించడానికి తీరుబడి కావాల'ని నేనంటే తన కృషి సఫలమైందని భావిస్తూ, చిరునవ్వు చిందించేవారు.

ఒకసారి 'మిసిమి' సంచికలో ఒక్కటంటే ఒక్కటే అచ్చు తప్పు దొర్లింది. దాన్ని ఎత్తి చూపిస్తే ఎంతగానో బాధపడిపోయారు. అంత sincereగా, honestగా,devotedగా ఒక పత్రికను నడిపించగల సంపాదకులు 'నభూతో నభవిష్యత్' అంటే అతిశయోక్తి గాదు. ఆ అసాదృశమైన నిజాయితీ, నిబద్ధత ఆదర్శప్రాయం, మార్గదర్శకం.

శ్రీమతి ఐరావతి కార్వేగారు వ్రాసిన 'యుగాంత్' అనే పుస్తకాన్ని వారు చదవడం తటస్థించింది. కీ.శే. బాలచంద్ర ఆప్టేగారు ఆ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించారు.

అక్కడక్కడ నా సహకారం తీసుకున్న సహృదయులు ఆప్టేగారు పీఠికలో నా పేరు కూడా ఉటంకించారు. 'ఇంత మంచి పుస్తకం గురించి నాకిన్నాళ్ళు ఎందుకు చెప్పలేద'ని రవీంద్రనాథ్‌గారు బాధపడ్డారు. ఆ తరువాత ఆ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివి, ప్రభావితులై, శ్రీమతి ఐరావతి గారు చెప్పిన విషయాల ఆధారంగా వ్యాసాలు వ్రాయించి 'మిసిమి'లో ప్రచురించారు.

మహాభారతంలో భీమసేనుడి మానసికతను వర్ణిస్తూ ఎం.టి. వాసుదేవన్ నాయర్‌గారు వ్రాసిన 'రంటామూషమ్' (మనిషి రెండు ముఖాలు) నవలను గురించి చదువుతున్నప్పుడు, చట్టున రవీంద్రనాథ్‌గారు గుర్తుకు వచ్చారు. వినూత్నమైన పంథాలో భీముడి పాత్రను చిత్రించారు నాయర్‌గారు.

కొత్త కొత్త విషయాలను గురించి, భావాలను గురించి తెలుసుకుంటూ- చదువుతూ, వాటిని మననం చేసుకుంటూ, వాటిని పాఠకుల కందించాలన్న తపనగల సంపాదకోత్తములయిన శ్రీ రవీంద్రనాథ్‌గారు సార్థక జన్ములు.

ఈ నాటి సంపాదకులకు, పాఠకులకు, పరిశోధకులకు ఆదర్శప్రాయులు - నిరంతర జిజ్ఞాసయే వారి జీవితానికి కరదీపికగా రూపొందింది. ధన్యులు రవీంద్రనాథ్‌గారు.

డాక్టర్ భీమ్‌సేన్ నిర్మల్, హైదరాబాదు, ప్రముఖ హిందీ సాహిత్యవేత్త, అనువాదకుడు.

రవీంద్ర సంస్మరణ సభలో కళాజ్యోతి ఉద్యోగులు

1948లో కెమెరా క్లబ్ తెనాలివారు నిర్వహించిన ఛాయాచిత్రాల పోటీలో ఉత్తమ ఛాయా చిత్రంగా ఎంపికైనది. ఛాయాగ్రాహకుడు: నాగేశ్వరరావు.

ఆయనొక విజ్ఞానఖని అన్నా అతిశయోక్తికాదు. నేనీ విషయాలన్నీ గమనించి ఆయనతో ''ఏమండీ! ఇంత విజ్ఞానాన్ని మీ పొట్టనిండా నింపుకున్నారు కదా! సంతోషమే! కాని ఈ విద్వత్తును, మీ మేధస్సును సమాజానికి, వ్యక్తు లకు అందివ్వకపోతే మీకు విముక్తి వుండదండీ! మనకు తెలిసిన విజ్ఞానాన్ని పరులకు పంచాలండీ. అలాకాక గర్భస్థం చేసి వెళ్లిపోతే వచ్చే జన్మలో బ్రహ్మరాక్షసులై పుడతారండీ''.

''నీ విజ్ఞానాన్ని నీతోనే అంతరించి పోనీయకూడదని నన్ను ఘాటుగా విమర్శించి చాలా కాలమయింది. ఇప్పటికి 'మిసిమి' లాంటి పత్రికను పెట్టగలిగానని'' నామాటలు 'మిసిమి'పై జరిగిన సభలో ఉటంకించారు.

నాస్మృతి పథంలో...

☆

మల్లాది సుబ్బమ్మ

మిసిమి

అది నిన్నటిదా! మొన్నటిదా! రవీంద్రం గారితో 30 ఏళ్ల అనుబంధం మా కుటుంబానికుంది. రవీంద్రంగారు, మేము చాలా సన్నిహితంగా, ఆప్యాయంగా, అభిమానంతో మెలగటం నా స్మృతిపథంలో ఇప్పటికీ చెరగని ముద్రగా నిలిచిపోయింది. ఈనాటికీ మరువలేని సన్నివేశాలెన్నో వున్నాయి. అది 1970. విజయవాడలో మేము అప్పుడు 'వికాసం' పత్రిక నడుపుతున్న రోజుల్లో మా ఇంటికొచ్చారాయన. అనేక విషయాలు చర్చించాక మేము ప్రెస్సు కొనాలని నిర్ణయించుకున్నామని, మా సాహిత్యం, వికాసం పత్రిక అన్నీ అక్కడే ప్రింటు చేసుకుంటామని చెప్పాం. అప్పుడాయన పకపకా నవ్వి సుఖంగా బ్రతుకుతున్న మీరు కష్టాలు కొని తెచ్చుకోకండి! ప్రెస్ అంటే మాటలా! అది మనల్ని తింటుంది. దాన్ని మనం పోషిస్తూనే వుండాలి. అహరహం శ్రమిస్తూనే వుండాలని హెచ్చరించారాయన.

1978లో మేము హైదరాబాదు రాగానే 'స్త్రీ స్వేచ్ఛ' పేరుతో ఒక మహిళా మాస పత్రికను స్థాపించాం. ఒకనాడు నేను 'జ్యోతి' ఆఫీసుకు వెళ్లి మా పత్రికకు ఒక ప్రకటన ఇవ్వమని అడిగాను. దానికాయన సరే అనలేదు. కాని తరువాత ఒక వారంలో తన కారు డిక్కీలో రూ. 5,000/- విలువగల పేపరు బండిల్సు ఇచ్చి మీ పత్రికకు ఇది నా సహాయం అన్నారు. తరువాత మా సంస్థలు చేసే కార్యక్రమాలకు తరుచూ రావడం, మేము వారి 'జ్యోతి' ఆఫీసుకు వెళ్లి సంభాషించడం పరిపాటి అయింది. రామ్మూర్తిగారితో రవీంద్రంగారి పరిచయం, స్నేహం దరిదాపు 50 ఏళ్ల నుండి కొనసాగుతోంది. ఇద్దరూ హ్యూమనిస్టులు, రేషనలిస్టులు, ప్రజాస్వామికవాదులు, ఎం. ఎన్. రాయ్ ఫిలాసఫర్లు.

1980లో నేను, రామ్మూర్తిగారు లండన్ ఇంటర్‌నేషనల్ హ్యూమనిస్టు సభలకు వెళుతుంటే వారు రైలు దగ్గరకొచ్చి వీడ్కోలు చెప్తూ ''అమ్మా! సుబ్బమ్మగారు! అక్కడ మీరు మ్యూజియమ్‌లు, ఈజిప్షియన్ మమ్మీస్, బకింగ్‌హాం ప్యాలేసులు, కోహినూర్ వజ్రం లాంటివి చూడడం, థేమ్సునదిపై ప్రయాణించడమే కాదు వారి సంస్కృతి, ఆచార వ్యవహారాలు వగైరాలన్నీ చూచివచ్చి యూరప్ దేశాలలో మనం నేర్చుకోవాల్సిన గొప్ప విషయాలను ఇక్కడి స్త్రీలకు చెప్పాలి, తెలిసిందా!'' అంటూ నన్ను ఉద్వేగంతో హెచ్చరించారు. రామ్మూర్తిగారితో మీరు వచ్చేటప్పుడు రెండు విస్కీ బాటిల్సు తేవాలి, అవి ఇండియాలో చాలా అరుదు, దొరకవు కూడా అని చెప్పడం నేను విన్నా. లండన్‌లో భూగర్భ గదుల్లో, షెల్పుల్లో బారులు తీర్చి రకరకాల విస్కీలు, బ్రాందీలు 50 ఏళ్లవి కూడా అమ్ముతారు. అవి అంటే అందరికీ అపురూపం. నేను అదే మొదటిసారి ఆ బాటిల్సు చూడడం. ఆ బాటిల్సు తెమ్మని ఆయన అడిగారు.

ఒక రోజు రవీంద్రంగారు మా మహిళాభ్యుదయ సంస్థ కార్యక్రమానికి ఆహ్వానిస్తే వచ్చారు. సభ ముగిశాక ఇష్టాగోష్టిలో వారిమీద విరుచుకుపడ్డా. అదొక తమాషా కథ. రవీంద్రంగారికి దేశ విదేశాల పత్రికలు, పుస్తకాలు విపరీతంగా చదివే అలవాటు వుండేది. ఆయనొక మేధావి, పండితుడు, అన్ని సిద్ధాంతాలు చదివినవాడు. తర్కవితర్క విమర్శనా భావుకుడు అని మనందరికీ తెలుసు. కొత్త కొత్త సిద్ధాంతాలు, ఆలోచనలు అంటే ఆసక్తి మెండు. ఎంతటి గ్రంథమైనా వూదిపారేసేవాడు. పుస్తకాల పురుగు అంటే అతిశయోక్తి కాదు. రీడింగ్ హాబిట్‌లో రవీంద్రంగారు

ముఖ్యులు. ఈయన కుక్షి నిండా సాహిత్యం, సారస్వతం పొంగిపొరలేవి. ఆయనొక విజ్ఞానఖని అన్నా అతిశయోక్తి కాదు. నేనీ విషయాలన్ని గమనించి ఆయనతో ''ఏమండీ! ఇంత విజ్ఞానాన్ని మీ పొట్టనిండా నింపుకున్నారు కదా! సంతోషమే! కాని ఈ విద్వత్తును, మీ మేధస్సును సమాజానికి, వ్యక్తులకు అందివ్వకపోతే మీకు విముక్తి వుండదండీ! మనకు తెలిసిన విజ్ఞానాన్ని పరులకు పంచాలండీ. అలాకాక గర్భస్థం చేసి వెళ్లిపోతే వచ్చే జన్మలో బ్రహ్మరాక్షసులై పుడతారండి'', మన విజ్ఞానాన్ని సాహిత్యం ద్వారా ప్రజలకందివ్వాలి, లేదా ఉపన్యాసాల ద్వారా ప్రబోధం చెయ్యాలని కొంచెం ఉద్రేకంగా మాట్లాడాను. ఇక్కడొక ముఖ్య విషయం గమనార్హం. రవీంద్రంగారికి, రామ్మూర్తిగారికి రీడింగ్ హాబిట్ చాలా హెచ్చు. ఎంత లిటరేచరైనా అవలీలగా చదివేశేవాళ్లు. ఎప్పుడూ గ్రంథ పఠనమే హాబీగా గల రవీంద్రంగారితో ''అయ్యా రోజుకు 15 గంటలు రామ్మూర్తిగారిలాగా చదువుతారు. ప్రపంచ విజ్ఞానం అంతా మీ ఇద్దరి కుక్షిలో వుంది. విజ్ఞానాన్ని బహిర్గతం చెయ్యకపోతే బ్రహ్మ రాక్షసులై పుడతారనే ఆర్యోక్తి వుందని మరొకసారి హెచ్చరించా'' ఉద్రేకంతో. అప్పుడు రామ్మూర్తిగారు పకపకా నవ్వి ''ఇన్నాళ్లు ఈమె నన్ను మాత్రమే వేధిస్తోంది, ఇప్పుడు మీ మీద దండయాత్ర చేస్తోంది. ఈమె నోటికి తాళం లేదండి!'' అంటూ ఆయన్ని సంబాళించారు.

ఆ తరువాత 'మిసిమి' పత్రిక 1990 ప్రాంతంలో స్థాపన జరిగింది. జ్యోతి, రేరాణి, సినిమాల్లాంటి పత్రిక కాదది. విజ్ఞులు, మేధావులు చదవాల్సిన పత్రిక అది. దాని రూపురేఖలే వేరు. అది గొప్ప పేరు ప్రఖ్యాతులతో విదేశాలలో సైతం మన్ననలు పొంది ప్రత్యేక విశిష్టతను సంతరించుకున్నది. 4-11-95న ప్రెస్ క్లబ్‌లో కాస్త డొక్క శుద్ధిగల వారినందరిని ఆహ్వానించి 'మిసిమి' పత్రిక గురించి సింపోయిజం, చర్చలు, నిర్వహించారు అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఆ సభలో నా అభిప్రాయాలు కూడా పత్రిక గురించి గొప్పగా పొగిడి చెప్పా. పాఠకులంతా సలహాలు చెప్పారు. రసజ్ఞులెందరో ఆ సభలో మాట్లాడారు. అప్పుడాయన నిజమే సుబ్బమ్మగారు ఇలా నన్ను నిలదీసి అడిగింది. ''గొప్ప ఉద్గ్రంథమైనా వ్రాయి. లేదా వారపత్రిక లేక మాసపత్రికనైనా పెట్టవయ్యా! నీకేమి లోటు, డబ్బు వుంది, ప్రెస్సు వుంది, రాసే సత్తా వుంది. నీ విజ్ఞానాన్ని నీతోనే అంతరించి పోనీయ కూడదని నన్ను ఘాటుగా విమర్శించి చాలా కాలమయింది. ఇప్పటికి 'మిసిమి' లాంటి పత్రికను పెట్టగలిగానని'' నా మాటలు ఆ సభలో ఉటంకించారు. 'మిసిమి' షుమారుగా పదేళ్ళుగా నెలనెలా తప్పక వస్తోంది. అది రవీంద్రంగారి ధర్మ పుత్రిక. దానిని వారి బిడ్డలు పునరుద్ధరించటం సమంజసం. ఆయన ఆ పత్రికలో కలకాలం కనిపిస్తూనే వుంటారు.

1996లో వారి సంతాపసభలో అనేకమందిమి పాల్గొన్నాం. చాలామంది కష్టమైనా, యిబ్బందులొచ్చినా పత్రిక ఆపవద్దని, పత్రిక మన జీవితాలకు జీవగర్ర అని వారి బిడ్డలకు, తదితర మిత్రులకు విన్నవించాం. ఎం. ఎన్. రాయ్ రాడికల్ హ్యూమనిస్టు పత్రిక పెట్టి 60 ఏళ్లు అయినా ఆయన అభిమానులు దాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తూనే వున్నారు కదా! అలాగే మనందరం కలిసి దాన్ని బ్రతికించడం మన ప్రథమ కర్తవ్యం. నేను, రామ్మూర్తిగారు 16 ఏళ్ల

క్రిందట 'స్త్రీ స్వేచ్ఛ' పత్రిక పెట్టాం, రామ్మూర్తిగారు పొయ్యారు, నేనూ పోబోతున్నాను, దాన్ని బ్రతికించమని అనేకమందిని అభ్యర్థిస్తున్నా. చిత్తశుద్ధిగలవారే పత్రికా నిర్వహణకు అర్హులు, వారికే చరిత్రలో స్థానం వుంటుంది.

రవీంద్రంగారు మితభాషి, నిరాడంబరుడు, నిగర్వి, స్నేహితులతో ఇష్టాగోష్ఠిలో కూడా ఆయన వారి మాటలు వినేవాడేకాని తాను మాట్లాడటం తక్కువ. మహా మేధావి, అభ్యుదయవాది, హ్యూమనిష్టు, ప్రముఖ హేతువాది, పార్టీరహిత ప్రజాస్వామికవాది, ముఖ్యంగా జర్నలిష్టు. ఆయన జీవితంలో సగభాగం పైగా జర్నలిజానికి అంకితం చేశాడు. మూడు పత్రికలు కడు సమర్థవంతంగా నడిపాడు. అందులో 'మిసిమి' ముఖ్యంగా ఇంటలెక్చువల్ పత్రిక స్థాయిలో పేరు ప్రతిష్టలు తెచ్చుకుంది. ఆ పత్రిక వ్యాపార దృష్టితో స్థాపించలేదు. తాత్విక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో, ప్రాచీన కళలకు, మహనీయుల జీవితాలకు విలువనిచ్చేది 'మిసిమి'. జ్యోతిషం, మత రాజకీయాలు, ఛాందస ఆచారాలకు ఆ పత్రికలో చోటు లేదు. అందువల్లే ఆ పత్రిక ఎడిటర్‌గా రవీంద్రంగారికి కాలిఫోర్నియా యూనివర్శిటీ డాక్టరేట్ బిరుదును ప్రధానం చేసి గౌరవించింది.

రవీంద్రంగారి భార్య కళావతి చనిపోయినప్పుడు రామ్మూర్తిగారు, నేను పరామర్శించటానికి వెళ్లాం. పైకి నిబ్బరంగా కనిపించినా ఆ వియోగ బాధ ఆయన్ని దహించి వేస్తోందని మేము గ్రహించాం. పిల్లల్ని బాధించటం నాకిష్టం లేదు, ఒక వయస్సు మళ్లిన మహిళను వంట, వగైరాలు చేసి నన్ను నమ్రతతో చూచుకునే ఆమెను పంపమని కోరారు. అప్పుడు నేను నడుపుతున్న 'స్త్రీ స్వేచ్ఛ'లో ప్రకటన వేసి ఒకామెను పంపాను. తదుపరి ఆయన తన భార్య పేరుతో నేను నడుపుతున్న టైపు ఇన్‌స్టిట్యూట్‌కి రూ. 5,500/- టైపు మిషన్‌ను కొని డొనేట్ చేశారు.

అకస్మాత్తుగా ఆయన బిడ్డ చనిపోయినప్పుడు మేము వారింటికి వెళ్ళినప్పుడు పుత్ర దుఃఖాన్ని దిగమ్రింగి గంభీరవదనంతో మాతో జీవి పుట్టుక, మరణాలు తెలిసిన మనం రేషనలిస్టులైన మనం, హ్యూమనిజాన్ని అవగతం చేసుకొన్న మనం ఇతరుల సమస్యలను పరిష్కరించగల మనం కృంగిపోకుండా నిబ్బరంగా వుండలేమా! అని ఎదురు ప్రశ్న వేశారు. రవీంద్రంగారు చాలా మితభాషి, ఆత్మాభిమాని, అభ్యుదయవాది, నిర్మొహమాటి, స్నేహప్రియుడు, వదాన్యుడు, స్ఫూరద్రూపి, హేతువాది, హ్యూమనిష్టు, ప్రెస్సు పెట్టినా, పత్రికలు నడిపినా లాభనష్టాలకోసం కాకుండా సిద్ధాంతాలకోసం మాత్రమే చేశాడు. తెనాలిలో 'జ్యోతి' ప్రెస్‌వల్ల చాలా నష్టం వచ్చినా చలించలేదని రామ్మూర్తిగారు చెప్పారు.

నేను 1991లో నా ఆత్మకథ ''పాతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా'' 400 పేజీలది కళాజ్యోతిలో ప్రింటుకిచ్చినప్పుడు కొంత కన్‌సేషన్ ఇప్పించరా అని అడుగుతుంటే రామ్మూర్తిగారు అలా అడగకూడదని కనుసంజ్ఞ చేశారు. వారి బిడ్డలు దేవేందర్, బాపన్నగార్లు మంచి పేరు ప్రతిష్ఠలు గడించి ప్రజల్ని పీడించకుండా చెప్పిన టైముకి బుక్సు, కరపత్రాలు అందిస్తూ మంచి పేరు ప్రతిష్టలు గడించి సిటీలోకల్లా 'కళాజ్యోతి' పెద్ద ప్రెస్‌గా దాన్ని అభి వృద్ధి చేసి తండ్రిని మించిన ఘనతను తెచ్చుకున్నారు. 1996లో రవీంద్రంగారు పోయినా 'మిసిమి'

పత్రికను నిరాఘాటంగా నెలనెలా అదే రీతిలో నిర్వహిస్తున్నారు వారి బిడ్డలు, స్నేహితులు. ఆ పత్రికను పునరుద్ధరిస్తున్నారంటే అది అసామాన్య చర్య అనక తప్పదు.

రవీంద్రంగారి పేరుతో పత్రిక నడపటం మాత్రమే చాలదు. సలహా చెప్పడం తేలిక అనుకోకండి! చేసేవారికి, చెయ్యగలవారికే చెప్తూ వుంటాం. రవీంద్రంగారి పేరుతో ప్రతి ఏటా ఏ పత్రికాధిపతికో, సాహితీవేత్తకో, సంఘ సంస్కర్తకో, సంఘసేవకో, హ్యూమనిస్టుకో ఒక అవార్డును ఇస్తూ ఆ రోజు ఆయన జయంతి సభను జరిపితే ఇతరులకు కూడా ఆ తత్త్వవేత్త స్ఫూర్తితో తమ జీవితాన్ని గడిపి ధన్యత గడించాలనే ఉత్సాహం ఉద్భవిస్తుంది. దానికి శాశ్వత విలువలు చేకూరుతాయి. ఆయన సైతం ఎన్నో ఒడిదుడుకులు, కష్టాల నెదుర్కొని పత్రికలు నడిపి చేతులు కాల్చుకున్నారు. అయినా మొక్కవోని ధైర్యంతో నిలిచి కడగళ్లను అనుభవించి, అధిగమించి చివరికి కృతకృత్యుడై పేరు ప్రఖ్యాతులు గడించి మనకు ఆదర్శప్రాయుడై, నిలిచాడు. మచ్చలేని జీవితం ఆయనది. ఈనాడు ఆయన లేరు, మనమున్నాం. ఆయన పేరు నిలపాల్సిన బాధ్యత మనకుంది. ఆయన ధైర్యం, ఉత్సాహం మనకు రావాలంటే ఆయన స్థాపించిన పత్రికను నిలపాలి. ఆయన పేరుతో గొప్ప అవార్డు స్థాపించాలి. యూనివర్శిటీలో ఆయన పేరుతో ప్రతియేటా ఒక మెమోరియల్ లెక్చర్ పెట్టించాలి. మరి మీరుమాత్రం కాదంటారా! అప్పుడే మనకాయన ఆదర్శప్రాయుడౌతాడు. అలా చేద్దామా!

మల్లాది సుబ్బమ్మ, హైదరాబాదు, హేతువాది, రచయిత్రి,
ఫెమినిస్టు ఉద్యమానికి పెద్ద దిక్కు, సంఘ సేవిక.

1963లో భారత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌తో ఆలపాటి రవీంద్రనాథ్

ఎవరైనా గానీ స్వయం ప్రకాశం కలిగి వుండాలేగాని ఛాయాగ్రహాలుగా ఉండటం ఆయనకు గిట్టదు. రవీంద్రనాథ్‌గారి అల్లుడు చౌదరి **NATCO** అధిపతి ఒకానొక సందర్భంలో చౌదరికి తెలిసినవారే ఎక్కువ మంది వున్న సమావేశంలో రవీంద్రనాథ్ గారిని నేను ''చౌదరిగారి మామగారు'' అని పరిచయం చేశాను. ఆయన వెంటనే, ''చౌదరి మా అల్లుడు'' అని రిటార్ట్ చేశారు. ''నాకూ అడ్రసు వుంది సుమా!'' అని జోక్ చేశారు.

ఆయన లేని వెలితి తీర్చలేనిద

డి. శేషగిరిరావు

రవీంద్రనాథ్‌గారితో నాతొలి పరిచయం 1963లో.

ఎ. ఐ. సి. సి. మహాసభలకు గుంటూరు వేదికయిన సంవత్సరం అది. ఆ సభలు దిగ్విజయంగా జరగడానికి అవసరమైన ఏర్పాట్లను చూసే బాధ్యతను ఆలపాటి వెంకట్రామయ్యగారు నాకప్పగించారు. ఆ సందర్భంగా ఆయన తరచు వస్తూ పోతూవుండేవారు. ఆ క్రమంలో ఒకసారి ఆయన రవీంద్రనాథ్ గారితో కలిసి వచ్చారు. నన్ను రవీంద్రనాథ్‌గారికి పరిచయం చేశారు.

చూడగానే ఎదుటి వ్యక్తి మనస్సులో ముద్ర వేసే స్ఫురద్రూపం రవీంద్రనాథ్ గారిది. ఆజానుబాహుడు, నలగని తెల్లని మల్లెపువ్వులాంటి పొందూరు ఖద్దరు ధోవతి, లాల్చీలో ఆకర్షణీయంగా వున్నారు. ఆయనని ముఖాముఖి కలిసి మాట్లాడ్డం అదే మొదటిసారి అయినా ఆయన గురించి నాకు కొంత తెలుసు. తెనాలిలో జ్యోతి ప్రెస్ ప్రారంభించి 'జ్యోతి', 'రేరాణి', 'సినీమా' పత్రికలు నిర్వహించిన సంగతి తెలుసు. సాహిత్యాభిమాని, చింతనాశీలిగా ఆయనకు పేరుంది. ఆనాటి ఆ తొలి పరిచయం మొక్కయి, మ్రానై ఎదిగి ప్రగాఢ మైత్రీ బంధంగా మా ఇద్దరినీ పెనవేస్తుందని నా కప్పుడు తెలియదు.

కొసరాజు సాంబశివరావు గారని మరో మిత్రుడుండేవారు. రవీంద్రనాథ్‌గారికి అత్యంత సన్నిహితుడు. చాలా చనువుగా మెలిగేవారు. ఆయన ద్వారా నేను రవీంద్రనాథ్ గారిని తరచు కలుసుకునే వాణ్ణి. అలాగే డాక్టర్ వెంకటేశ్వరరావుగారని రవీంద్రనాథ్‌గారి మరోగాఢ స్నేహితుడితో కలిసి సాయంత్రాలు సరదాగా గడిపిన సందర్భాలూ చాలా వున్నాయి. మా మధ్య అలా స్నేహం పెరుగుతూ అనుభవాలు పంచుకునే క్రమంలో ఆయన అంతరంగం నాకు అవగాహన కాసాగింది. ఆయన అలవాట్లు, సరదాలు, హాబీలు, స్వభావశీలాలు, స్నేహప్రవృత్తి, స్వతంత్రాలోచనాధార, చింతనామగ్నత, నైర్మల్యం నాకు విశదమయ్యాయి. ఒక్క మాటలో ఆయన భావనా ప్రపంచం నాకు హృదయైక వేద్యమయింది.

పుస్తకాలు, స్నేహితులే ఆయన ప్రపంచం అనిపించేది. సాహిత్యం, తత్వశాస్త్రం ఆయన అభిమాన విషయాలు. వాటికి సంబంధించిన పుస్తకాలు తెగ చదివేవారు. సమగ్రంగా ఆకళించుకునే వారు. పఠనం ద్వారా తాను పిండుకున్న సారాన్ని, తద్వారా కలిగిన అనుభూతిని ఇతరులతో పంచుకోవాలని తపన పడేవారు. స్నేహితుల్ని పిలిచి వారితో చర్చించేవారు. వారికి అనుపానాలు జరిపేవారు. వారు చదివిన పుస్తకాల్ని, అందులోని విషయాన్ని, వారి అభిప్రాయాల్ని, అనుభూతుల్ని తెలుసుకునేవారు.

ఆయన పరిచయ స్రవంతి చాలా విశాలమైంది; స్నేహ ప్రపంచం విస్తృతం, వైవిధ్య భరితం. కవులు, సాహితీవేత్తలు, పత్రికారచయితలు, అధికారులు, లెజిస్లేటర్లు, ఎంపీలు, వ్యాపారవేత్తలు, ప్రొఫెసర్లు, సరదా పురుషులు, సామాన్యులు ఇలా ఎందరో. ప్రభుత్వంలో ఉన్నత పదవులనెన్నో అలంకరించిన బెజవాడ గోపాల రెడ్డిగారు, ఆంధ్రజ్యోతి వ్యవస్థాపకులు, ఎంపీ K.L.N. ప్రసాద్‌గారు, డాక్టర్ జి. వి. కృష్ణరావు, గోపీచంద్, సంజీవదేవ్, డాక్టర్ సి. నారాయణరెడ్డి, డాక్టర్ బూదరాజు రాధాకృష్ణ ప్రభృత సాహిత్యవేత్తలు, రచయితలు, ప్రధాన న్యాయమూర్తులు శ్రీ ఎ. జయచంద్రారెడ్డి, శ్రీ ఆవుల సాంబశివరావు, శ్రీ కోకా రామచంద్రరావు, శ్రీ పి. ఎ. చౌదరి, లెజిస్లేచర్ సెక్రటేరియట్

కార్యదర్శి సదాశివరెడ్డి, సీనియర్ ఐ.ఎ.ఎస్. అధికారి ఎమ్. ఆర్. పాయ్, ఆయన సతీమణి తార, ఐ.జి.పి. రామచంద్రారెడ్డి, పోలీసు అధికారి శ్రీ పర్వతనేని కోటేశ్వరరావు, ప్రొఫెసర్ వేణు గోపాలరావు, ఎం.పి. మేరీనాయుడు, యం. ఆర్. కృష్ణ, రాడికల్ హ్యూమనిస్టు శ్రీ మల్లాది రామమూర్తి, మహిళోద్యమనేత మల్లాది సుబ్బమ్మ, విజయవాడలో ఆప్త స్నేహితులు బుజ్జులు, బాజీ మచ్చుకి పేర్కొన్న వీరందరూ ఆయన మిత్ర బృందంలోని కొందరు మాత్రమే. ఇంకా మరెందరో వున్నారు. యం. ఆర్. పాయ్ దంపతులు తరచు రవీంద్రనాథ్ గారి ఇంటికి వచ్చి అనేక విషయాల మీద ఇష్టాగోష్ఠి జరిపేవారు. ప్రొఫెసర్ వేణు గోపాలరావు (పోలీసు అకాడమి, ఢిల్లీ) రవీంద్రనాథ్‌గారికి చాలా ఇష్టుడు. సాహిత్యాభిమాని, హొరేషస్ రీడర్ పర్వతనేని కోటేశ్వరరావు గారినీ అభిమానించేవారు.

రవీంద్రనాథ్‌గారు చాలా క్లబ్స్‌లో మెంబరయినా తరచు ఫతే మైదాన్ క్లబ్బుకి వెళ్లేవారు. ప్రతిరోజూ సాయంత్రం టెన్నిస్ ఆడేవారు. శ్రీ జయ చంద్రారెడ్డి, శ్రీ కోకా రామచంద్రరావుగారు ప్రభృత ప్రముఖులతో చాలా విషయాల మీద చర్చిస్తూ, పిచ్చాపాటీ ముచ్చటిస్తూ కాస్సేపు హాయిగా కాలక్షేపం చేసేవారు. స్కాచ్ సేవిస్తూ సంభాషణలు జరిపేవారు. పాన ప్రియులైన మిత్రులకు వారింట పండుగే. రవీంద్రనాథ్‌గారు గొప్ప అతిథేయి.

సాహిత్యం, స్కాచ్, సరదా కాలక్షేపం అంటే ఆయనకు ఎంత ఇష్టమో, భోజనంలో కందిపొడి, కారప్పొడి, శనగపొడి, కరివేపాకు కారం వగైరా పొడులంటేనూ అంత నరతీపి! ఆ రోజుల్లో బేడేకర్ బ్రాండ్ పొడులు ప్రసిద్ధం. అప్పుడప్పుడూ బయటి ప్రాంతాలకు వెళ్లి ఏ ఫాం హౌస్‌లోనో, విహార స్థలంలోనో మిత్రులతో కలిసి మధువు సేవిస్తూ కులాసాగా కాలక్షేపం చేయడం ఆయనకు సరదా. ఒకసారి ఆయన, నేనూ కలిసి రాయచూరులోని మా అగ్రిఫాం సందర్శించి సరదాగా గడిపి వచ్చాం. అప్పుడు కర్నాటక గవర్నర్ శ్రీ సుఖాడియా (అంతకు పూర్వం రాజస్థాన్ ముఖ్యమంత్రి) ఫాం చూడ్డానికి విచ్చేసి కొంతసేపు మాతో గడిపి బెంగుళూరు తిరిగి వెళ్లిపోయారు.

1970 తరవాత పాత్రికేయులు డాక్టర్ ఇన్నయ్య, నేను, రవీంద్రనాథ్ అతి తరచుగా కలిసి కూర్చుంటుండేవాళ్ళం. చాలామంది మమ్మల్ని త్రీ మస్కటీర్సుగా అభివర్ణిస్తుండేవాళ్లు. ఏ రోజయినా నేను కనపడకపోతే మన పెద్ద దిక్కు ఎక్కడ అని వాకబు చేసి వెంటనే పిలిపించండి అనేవారు. కష్టసుఖాల్లో రవీంద్రనాథ్‌గారు తన ఆత్మ విప్పి చెప్పుకొనే ఆప్త వర్గంలో, ఆంతరంగికుల్లో నేను ఒకడినయ్యాను. మా రెండు కుటుంబాల మధ్య విడదీయలేని అనుబంధం అల్లుకుపోయింది. నా శ్రీమతి చారుమతిని చారులత అని పిలిచేవారు. చారులత తనకిష్టమైన పేరని అనేవారు. రవీంద్రనాథ్‌గారి అర్ధాంగి కళావతిగారు ఆయన మనసెరిగి మసలుకొనేవారు. అతిథి మర్యాదలు జరపడంలో ఆమె అలుపెరగరు.

కళావతిగారు డైనింగ్ టేబుల్‌ను వేలెత్తి చూపలేనివిధంగా అమర్చేవారు. కంచాలు, గ్లాసులు ఇతర ఉపకరణాలు కడిగిన ముత్యాల్లా మెరుస్తుండేవి. రవీంద్రనాథ్‌గారు డైనింగ్ టేబుల్ ముందు కూర్చోగానే తన ప్లేటు చేతుల్లోకి తీసుకుని, నీళ్లు పోసి కడుక్కుని ముందు పెట్టుకునేవారు. ఆమె నొచ్చుకుంటే, ''కేవలం ఇది నా అలవాటు. ఏమనుకోకు కళా'' అని అనునయించేవారు. ఎవరినయినా నొప్పించడం ఆయన స్వభావానికి విరుద్ధం.

ఇంట్లో అర్ధాంగిగాని, పిల్లలు గాని ఆయనంటే అలాగే ప్రవర్తించేవారు. ఆయన పండుకొని వుంటే ఎట్టి పరిస్థితిలోనూ నిద్రాభంగం కలిగించేవారు కాదు. పెద్ద కుమారుడు రాంగోపాల్ తెల్లవారగట్ల హఠాత్తుగా మరణించిన పెను విషాద సమయంలో దేవేంద్ర, బాపన్నలు పరుగెత్తుకొచ్చి నన్ను, తిక్కవరపు అనసూయాదేవిగారి క్వార్టర్‌లో బసచేసిన డాక్టర్ వెంకటేశ్వరరావుని లేపి తీసుకువెళ్లారేగాని తండ్రిగారిని డిస్టర్బ్ చేయలేదు. మేం వెళ్లి ఆయన లేచే వరకు వేచి వున్నాం. లేచాక మేము ఆ విషాద వార్తను తెలియజేసినప్పుడు ఆయన ఒక్కక్షణం నిర్ఘాంతపోయారు. విచలితులయ్యారు. మరుక్షణం గంభీర ముద్రదాల్చారు. గోపాలరెడ్డిగారు ఉత్తరప్రదేశ్ గవర్నరుగా ఉన్నప్పుడు సందర్భవశాత్తు సోమాజిగూడలోని ఆంధ్రప్రదేశ్ రాజ్‌భవన్‌లో దిగి తన ఆప్తమిత్రుడు రవీంద్రనాథ్‌గారింటికి ఫోన్ చేయించారు. ఆ సమయంలో రవీంద్రనాథ్‌గారు నిద్రపోతున్నారు. ఫోన్ చేసిన వారు ఎంత పెద్దవారో తెలిసినప్పటికీ, ఇంట్లో వారెవ్వరూ రవీంద్రనాథ్‌గారిని లేపటానికి ఇష్టపడలేదు. ''క్షమించాలి. ఆయన నిద్రపోతున్నారు'' అని మర్యాదగా జవాబిచ్చి ఫోన్ పెట్టేశారు. ఈ సంగతి స్వయంగా గోపాలరెడ్డిగారే నాకు చెప్పారు. అదీ వారింట గల సంప్రదాయం లేదా విలక్షణ క్రమశిక్షణ.

ఎవరైనా గానీ స్వయం ప్రకాశం కలిగి వుండాలేగాని ఛాయాగ్రహాలుగా ఉండటం ఆయనకు గిట్టదు. రవీంద్రనాథ్‌గారి అల్లుడు చౌదరి NATCO అధిపతి ఒకానొక సందర్భంలో చౌదరికి తెలిసినవారే ఎక్కువ మంది వున్న సమావేశంలో రవీంద్రనాథ్‌గారిని నేను ''చౌదరిగారి మామగారు'' అని పరిచయం చేశాను. ఆయన వెంటనే, ''చౌదరి మా అల్లుడు'' అని రిటార్ట్ చేశారు. ''నాకూ అడ్రసు వుంది సుమా!'' అని జోక్ చేశారు. స్వవిషయంలోనే కాదు తన బిడ్డల విషయంలో కూడా ఆయన దృక్పథం అదే. వాళ్లు రవీంద్రనాథ్ తనయులని లోకానికి పరిచయం కావడం ఆయనకు ఇష్టం వుండేది కాదు. ''దేవేంద్ర, దేవేంద్రగా, బాపన్న, బాపన్నగా లోకంలో గుర్తింపు పొందాలి'' అన్నారొకసారి నాతో తన చివరి రోజుల్లో. అలాంటి నిశ్చితాభిప్రాయాలు ఆయనవి. కుమార్తె దుర్గ అంటే అమిత ప్రేమ. రవీంద్ర సాహిత్యం, శరత్ నవలలు ఇంకా అనేక ఇతర పుస్తకాలు ఆమె చేత చదివించారు, పఠానాసక్తి, సాహిత్యాభిరుచి పెంపొందించాలని.

స్నేహితులంటే ఎంతో అభిమానంగా వున్నప్పటికీ, కొన్ని విషయాల్లో నిర్మొహమాటి. ముఖ్యంగా తన పత్రికకు రచనలను అంగీకరించే విషయంలో. గోపాలరెడ్డిగారు 'మిసిమి'కి తన కవితను పంపినప్పుడు రవీంద్రనాథ్‌గారు దానిని ప్రచురణకు స్వీకరించలేదు. గోపాలరెడ్డిగారు అదేమని నోరు తెరచి అడిగినప్పుడు ''మిసిమిలో పద్యాలు గేయాలు వేసే సంప్రదాయం లేదు'' అని సున్నితంగా వివరించారు. మల్లాది సుబ్బమ్మగారికి తనతో ఎంతో చనువు వున్నప్పటికీ ఆమె రచనకు 'మిసిమి' యోగ్యమైన వేదిక కాదని భావించి తిరస్కరించారు. 'మిసిమి' విషయంలో ఆయన కచ్చితమైన ప్రమాణాలు పాటించారు. రచయితల ఒడ్డూ పొడవు కాకుండా రచనలో సరుకుందా లేదా అన్నది ఆయన గీటురాయి. ఆయన తన చివరి రోజుల్లో 'మిసిమి' కోసమే తన కాలాన్ని, శక్తిని, సామర్థ్యాన్ని పూర్తిగా వెచ్చించారు. (లాభనష్టాల బేరీజు ఆయన నైజానికే విరుద్ధం). 'మిసిమి' ముఖపత్రం మీద చిత్రం గురించి వాల్డెన్‌లో ఎంత సమయం ఖర్చు చేశారో నాకు తెలుసు.

1995లో ఒక రోజు మధ్యాహ్నం ఆయన నేను కూర్చుని మాట్లాడుకుంటున్నాం. పోస్ట్‌లో ఒక కవర్ వచ్చింది. బొద్దుగా వుంది. ''రెవ్యూ కోసం ఎవరో పుస్తకం పంపించినట్లుగా వుంది'' అన్నారు రవీంద్రనాథ్. అయినా చించి చూడలేదు. ''నువ్వే కవరు చించి చూడు'' అన్నారు నాతో. కవరు విప్పి చూద్దునుగదా, నా కళ్లు విప్పార్నై. రవీంద్రనాథ్‌గారికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసినట్లుగా కాలిఫోర్నియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి వచ్చిన పట్టా అది. ఏమీ చెప్పకుండా దానిని రవీంద్రనాథ్‌గారి చేతికిచ్చాను. అది చదివి నిర్వికారంగా ఆయన ''ఈ అవార్డుకు నేను అర్హుడినా?'' అన్నారు. ఆయన నిగర్వానికి నిదర్శనం అది.

మర్రోజు ఉదయం ఆయనకు ఫోన్ చేసి 'డాక్టర్ రవీంద్రనాథ్‌గారూ' అని సంబోధించాను. ''ఏమిటి? పిలుపు కొత్తగా వుంది. అలా పిలిపించుకోవడం నాకు ఇష్టం ఉండదు''. అన్నారాయన.

అదే రోజు ఆయనని ఫోన్లో మళ్లీ 'డాక్టర్ రవీంద్రనాథ్‌గారూ!' అని సంబోధించాను. ''మీరు అలా పిలవడం నాకు చాలా ఎబ్బెట్టుగా ఉంది. ప్లీజ్, అలా పిలవ వద్దు'' అన్నారు.

ఈ అవార్డులు బిరుదుల కన్నా ఉన్నతమైంది ఆయన మూర్తిమత్వం (Personality). ఆయన సౌహృదయం, ఆయన సాన్నిధ్యంలోని మాధుర్యం, ఆయన జీవితం, చింతనా....

డి. శేషగిరిరావు, హైదరాబాదు, కీ. శే. రవీంద్రనాథ్‌గారికి, వారి కుటుంబానికి ఆప్త మిత్రులు, బాలానగర్‌లోని శ్రీరామ్ ఇంజనీరింగ్ ఇండస్ట్రీస్ అధినేత.

రవీంద్రనాథ్‌గారి మనుమలు మనమరాండ్రు

పసిడి తునక

అందమైన ఆహార్యం, అంతకన్నా భావస్ఫోరకమైన ఆలోచన కలగలిపిన మనిషి ఎంత ఆకర్షణీయంగా వుంటాడో, పత్రికల్లో 'మిసిమి' అలాంటి పసిడి తునక. సామాజిక వ్యాసంగా అన్నిటిలో అన్ని రంగాలలోనూ సృజనాత్మకత, లోతైన గవేషణ, విశిష్టమైన విశ్లేషణ కలిసి త్రిగుణాత్మకమైన రచనల ద్వారా జిజ్ఞాసాపరులను అయిదేళ్ళుగా అలరింపజేస్తున్నది. సామాన్యుల్లో పరిశోధనాశక్తిని, ఆసక్తిని పెంపొందింప చేయడంలో ఆలోచనాపరుల పాత్ర ప్రపంచం ఎరిగిందే. అలాంటివారి వివేచనకు పదును పెట్టే అసమాన మాస పత్రిక 'మిసిమి'. తెలుగు పత్రికా ప్రపంచంలో అనన్య సామాన్యమైన యీ ప్రయోగాన్ని శ్రద్ధా, దక్షతలతో పాఠకజన మనోభిరామంగా ఆలోచనామృత సంధాయిగా నిర్వహిస్తున్న శ్రీ ఆలపాటి రవీంద్రనాథ్‌గారు తెలుగు చదువరుల కృతజ్ఞతాభివందనములకు సదా సర్వదా బహుధా పాత్రులు. 'మిసిమి' మరింత వన్నె. వాసి సంపాదించుకొనేందుకు యీ అయిదేళ్ల అనుభవం దోహదకరం కావాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను.

– సి. రాఘవాచారి,

ఎడిటర్,

'విశాలాంధ్ర'

తెనాలిలో కాలం గడిపిన రోజుల్లోనే ఎం.ఎన్. రాయ్ భావాల ప్రభావాలు పడ్డాయి. మానవ విలువలతో హేతుబద్ధమైన ఆలోచనతో నూతన సమాజ ఆవిష్కరణ జరగాలని భావిస్తూ - ఆ పరిణామ క్రమంలో ''స్కూల్ ఆఫ్ థాట్'', ''కంపార్ట్‌మెంటల్ థింకింగ్'' లాంటి ప్రాకారాలను అధిగమిస్తూ, మూసలో పోసిన ఊసులు భావాలు వద్దంటూ (దీన్నే **indoctrination** అంటారు) సమాహిత భావ సమ్యగ్దర్శ నంతో, భావుక సమన్వయత్వంతో కథా కథనం సాగించాలన్న ధోరణి ప్రవర్ధమాన మయింది. భేదాభిప్రాయాల పట్ల మన్నన చూపగల ప్రశస్త భావుకత ఆయనకు అలవడింది. ఈ భావుకతలోనే అవిశ్రాంతంగా ఆయన జీవించాడు.

ఆగమ గీతం ఆలపించిన ఆలపాటి

✯

అచ్యుతరామ్

ఛి(ద్రమైన ముద్రలో భద్రం ఎలా వుంటుంది? దీన్ని మార్చటం ఎలా, ఎలా? ఈ ఆలోచనే నా మనోఫలకంపై మెరిసింది. ఇదే నాలో తపనను, తారుణ్యాన్ని పెంచింది అంటూ - సరిగ్గా యీ మాటల్లో కాక పోయినా - యీ బాటల్లోకి అడుగుపెట్టాడు నా మిత్రుడు రవీంద్రనాథ్ పసివాడని పసితనంలోనే. ముదిమి ముంచుకొస్తున్నా ముదం పంచుకొస్తూనే, వయస్సుకు మించిన భావాల వయస్సులో నడుంబిగించి, నయగారపు నవ్యత్వంలో ముందుకు సాగాడు మా రవీంద్ర. ఈ పయనంలోనే కన్ను మూసి కను మరుగయ్యాడు. ఆరని ఆవేదన ఆవహించింది!

ఆరని ఆలోచన మదిలో మెదిలింది. కన్నీటి సిరాలో కలం ముంచి రాయక తప్పటం లేదు; దీంతో కొంతలో కొంత ఉపశమనం పొందుతాను.

మే మిద్దరం పుట్టి పెరిగింది ఒకేవూరు గోవాడలో; చదివింది ఒకే బడిలో; ఆటపాటల ఆటపట్టులయిన ఆరామాల్లో కాలం గడిపాం, బడి పలుకుబడి అర్ధంతరంగానే ముగిసింది నా మిత్రునికి. దాంతో జీవితం బళ్ళో పాఠాలు నేర్చుకున్నాడు. ఎడతెగని పుస్తక పఠనంతో బాటు, అనుభవాల అనుభవాలను పదిలపరచుకుంటూ వడివడిగా నడవడి సాగించాడు. రకరకాల ప్రశ్నార్థకాలతో ప్రపంచార్థకం గ్రహించేందుకు సాగిపోయింది ఆ గమనం. ''తద్వి జిజ్ఞాసిస్వ''తో విశాల భావుకతా రీతుల్లో విహరించాడు. ''నా లైఫే నా లేబరేటరీ'' అంటూ ప్రయోగాల ప్రయోక్తగా వ్యవహరించాడు. రవీంద్రనాథ్ వివాహం విజయవాడ మొగల్రాజపురంలో జరిగింది. కళావతి ఆయన కళత్రం. ఈ వివాహ కార్యక్రమాన్ని సంస్కరణ పద్ధతిలో తాపీ ధర్మారావు. కవిరాజు రామస్వామి నిర్వహించారు. ఆ పెళ్ళిలో ''నేను సైతం'' అంటూ నాలుగు మాటలు పలికాను.

రవీంద్రనాథ్ ప్రౌఢ జీవితం తొలిఘట్టంలో ఆయన కార్యరంగం తెనాలికి మారింది. జ్యోతి ప్రెస్ స్థాపనతో వ్యాపార వ్యాసంగం ప్రారంభించాడు. ఆ రోజుల్లోనే ''జాకోబిన్ పబ్లిషర్స్'' పేరుతో ప్రైవేట్ రంగంలో పాఠ్యగ్రంథాల ప్రచురణకు సారథ్యం వహించాడు. డబ్బు ఒక్కదాంతోనే జీవితం చాలదు. డబ్బుతో బాటు వివిధ రూపాల విలువల విస్తరణకు ఉపక్రమించాలన్న దృష్టితో, వివిధ రంగాలలో శాస్త్రీయ విజ్ఞాన విజిగీషను పెంచగల విధంగా, భావస్ఫోరకమైన రచనలతో జ్యోతి, రేరాణి, సినీమా, లాంటి పత్రికలకు విశిష్ట సంపాదకుడుగా కొన్నేళ్ళు జీవితం కొనసాగించాడు. ఇంచుమించు ఒకదశాబ్ద కాలం పైగా అలా గడిచిపోయింది. ఈ పత్రికల సంపాదకత్వంలో ధనికొండ హనుమంతరావు, రావూరి భరద్వాజ, మాగాపురామన్ లాంటి వారి సహాయ సహకారాలు ఆయనకు అందాయి. తెనాలిలో కాలం గడిపిన రోజుల్లోనే ఎం.ఎన్. రాయ్ భావాల ప్రభావాలు పడ్డాయి. మానవ విలువలతో హేతుబద్ధమైన ఆలోచనతో నూతన సమాజ ఆవిష్కరణ జరగాలని భావిస్తూ - ఆ పరిణామక్రమంలో ''స్కూల్ ఆఫ్ థాట్'', ''కంపార్ట్‌మెంటల్ థింకింగ్'' లాంటి ప్రాకారాలను అధిగమిస్తూ, మూసలో పోసిన ఊసులు భావాలు వద్దంటూ (దీన్నే indoctrination అంటారు) సమాహిత భావ సమ్యగ్దర్శ నంతో, భావుక సమన్వయత్వంతో కథా కథనం సాగించాలన్న ధోరణి ప్రవర్ధమాన మయింది. భేదాభిప్రాయాల పట్ల మన్నన చూపగల ప్రశస్త

భావుకత ఆయనకు అలవడింది. ఈ భావుకతలోనే అవిశ్రాంతంగా ఆయన జీవించాడు. ఈ రకమైన ఆలోచనా తత్వంలో వున్న రోజుల్లోనే గోపీచంద్, కొడవటిగంటి, పి.వి. సుబ్బారావు, ఎ.జి.కె., డా॥ సంజీవదేవ్, డా॥ జి.వి. కృష్ణరావు, ఎ.వి. రెడ్డి, బైరాగి లాంటి వారితో తరచుగా తర్జన భర్జనలు జరుపుతూ వుండేవారు. ఎలెన్‌రాయ్ కుటుంబ నియంత్రణపై రాసిన వ్యాసాన్ని ''జ్యోతి''లో ప్రచురించినందుకు ఆయన్ను ప్రభుత్వం ప్రాసిక్యూట్ చేసింది. తెనాలిలో వున్న రోజుల్లోనే డా॥ జి.వి. కె.'కావ్య జగత్తు'ను ఆయనకు అంకితం చేశాడు.

ఆలపాటి ప్రౌఢ జీవితపు మలిఘట్టం ప్రారంభమయింది హైదరాబాద్‌లో. తిరిగి విపణి విశేష విన్యాసంతో ''కళాజ్యోతి ప్రాసెస్''ను ప్రారంభించాడు. ఆసియా ఖండంలో అత్యంత ఆధునిక ముద్రణా యంత్రాంగంతో యీ ప్రక్రియకు నాంది పలికాడు. ప్రచురణ కర్తగా పేరు ప్రఖ్యాతలు అందుకుంటున్న తరుణంలోనే తిరిగి చరిత్ర చర్వితచర్వణ మయింది. సంపన్నతకు మించింది సంస్కార సంపన్నత అనే భావం మదిలో చోటుచేసుకుంది. దాంతో ఎన్నాళ్లనుండో తాను కలలు గన్న ఓ సరికొత్త కళారూపాన్ని ఆవిష్కరించాడు. జ్ఞాన తృష్ణకు ప్రతీకగా - మరుపురాని మెరుపులా మెరిసింది; మరకువలో మునిగి పోయిన జనాలకు తెరకువ తెరచాపెత్తింది; రామణీయక, వినిమయ, మానవ విలువలను త్రివేణీ సంగమంలా చేసి చూపే వినూత్న విశేషం ఆవిర్భవించింది. ''మిసిమి'' పసిమిలా పల్లవించింది. ఆయన మరణించిన నాటికి ''మిసిమి'' 79 సంచికలు వెలువడ్డాయి. "We are what we think" అంటూ దమ్మపద పథంలో విశిష్ట విశ్లేషణలతో కూడిన రచనా రమణీయతలను తలను పాఠకలోకానికి అందించిన ''పాఠక సంపాదకుడు'' మన రవీంద్ర. భావనా లోకంలో భావప్రభాసాలు విరియించింది ''మిసిమి'' "Dreams of a young girl", "The three graces" లాంటి ముఖ చిత్రాలతో, అడవి బాపిరాజు లాంటి వారి భావస్ఫోరక చిత్ర సచిత్రాలనెన్నింటినో పాఠకులకు మనోజ్ఞ మాధుర్యాలను చిందిస్తూ అందించింది. యువతరానికి ఆలోచనాలోచనాలతో క్విజ్ కార్యక్రమాలు నిర్వహించింది. మధురవాణి మాట కచేరీలతో మనల్ని అలరించింది. "Music shall transcend borders" లాంటి సూక్తులను అనేకానేకాలుగా అందించింది. వన్‌వే ట్రాఫిక్ కాకుండా - నిత్యనూతన భావుకతలకు నిధానంగా నిలబడుతూవున్న పత్రికల్లో అగ్రశ్రేణికి చెందింది ''మిసిమి'', ఎడతెగని ప్రవాహంలా ఎదలోతులను ఎరిగించే పత్రికగా, పాత్రికేయ ప్రపంచంలో ఉదాత్త ప్రమాణాలతో ఈ పత్రికకు తన ప్రత్యేక వ్యక్తిత్వంతో సంపాదకత్వ సందీపనలు అందించిన రవీంద్రనాథ్ కొత్త కొత్త ఫీచర్లతో, ఊహాలోకం ఊసులతో - imaginary interviewల లాంటి పోకడలతో పసిమి 'మిసిమి' మిలమిలను వెలయించాడు. I hate men అనలేదుగాని సర్ వాల్టర్ విట్మన్‌లాగా "I love man" అనే తీరుతెన్నులతో ఆ కలం కలకలం రేపింది.

'మిసిమి' కథాకథనం సాగుతూవుంది. వైరుధ్యం లేని వైవిధ్యాల వైతరణిగా యిది ఆయన సంచాలకత్వంలో ఉన్నత గిరి శృంగాలకు ఎగసింది. మిసిమి ''వర్క్‌షాపు''లతో భావోద్దీపకతకు అద్దంపటిన ఉత్తమ సంపాదకుడు ఆలపాటి. ఒక్క వాక్యంలో చెప్పాలంటే సమ్యగ్దర్శన భావుకతానికేతనం ''మిసిమి'' ముచ్చటగా ఓ ముత్యములాంటిది. ఎప్పటి కప్పుడు సరికొత్త

సరిగమల విరి వెన్నెల వెలుగుల్ని వెలయించే విధంగా ''మిసిమి''ని పాఠకలోక మనోభిరామంగా నిలిపిన నియమబద్ధ సంపాదకుడు రవీంద్రనాథ్. ఒకరకంగా చెప్పాలంటే ఆయనది హైకూ. ఈహైకూ కైకూ అంటే ఆయన వ్యక్తిత్వమే దర్శన నిదర్శనం. తాను మరణించ బోయే ముందు నాకు వ్రాసిన లెటరులో (అదే ఆయన నుండి నా కొచ్చిన ఆఖరు లెటరు) ''మిసిమి నాకు అందించింది సంతోషం; సంతృప్తి'' అని పేర్కొన్నారు. ''మిసిమి'' పత్రిక ఫోర్త్ ఎస్టేట్లకు ఫోర్త్ ఎస్టేట్ కావాలని, unimaginable dimensionsను అందుకోవాలని ఆయన తపన పడుతూ వుండేవారు. ఈ 'మిసిమి' పసిమి పరువం పెంచుతూ రవీంద్రనాథ్ చేసిన కృషి మననీయం. రకరకాల పద చిత్రాలతో, చిత్ర పదాలతో, శేష ప్రశ్నలతో భావుకొన్నతకు ఏతమెత్తిన ఏడుగడలో ఆయన ముందుకు సాగాడు. ఒక సందర్భంలో ''మిసిమి'' పత్రికకు విరాళాలు వద్దు; చందా చెల్లిస్తే చాలు అని ఆయన ప్రకటించారు. ఈ అభిప్రాయంలో వున్న ఉదాత్తత అభినందనీయం.

ఉత్తమ ప్రమాణాలతో, ఉదాత్త భావుకతా విన్యాసాలతో, మరలా పసిమిని చిందించిన ''మిసిమి'' పాత్రికేయ ప్రపంచానికే తలమానికం ''మిసిమి'' మిలమిలతో బాటు పత్రికా ప్రపంచంలో ఆయన మార్గ దర్శక కృషికి గుర్తింపుగా కాలిఫోర్నియా యూనివర్శిటీ ఇటీవల 'గౌరవ డాక్టరేట్'తో సత్కరించడం ముదావహం.

డా॥ రవీంద్రనాథ్ జీవితంలో మరో ముఖ్య విశేషం. తన సతీమణి కళావతి జ్ఞాపకార్థం తెనాలి శాఖాగ్రంథాలయానికి అనుబంధంగా ''ఆలపాటి కళావతీ రవీంద్ర పీఠం'' ఆయన ప్రోత్సాహం తోనే 1994లో రూపు దిద్దుకుంది. ఈ పీఠం ఆధ్వర్యంలో వివిధ సాహిత్య - సాంస్కృతిక-సాంఘిక కార్యక్రమాలు సాగుతూ వున్నాయి. ఈ పీఠం ఆయన వైజ్ఞానిక తత్త్వానికి చెరగని సంకేతం.

సరసవచో సంభాషణలతో, ఆలోచనా ప్రేరకమైన భావాలతో, తన ఆదర్శాలతో రాజీ పడకుండా జీవించిన రవీంద్రనాథ్ కృషీవలత్వం యువతరానికి కర్తవ్య స్ఫోరకం.

డా॥ రవీంద్రనాథ్ రవి కిరణం అస్తమించిందా? లేదు, లేదు ముమ్మాటికీ.

పి. అచ్యుతరామ్, తెనాలి, ఉపాధ్యాయుడు, రచయిత, రాడికల్ హ్యూమనిస్టు.

రవీంద్రనాథ్ వ్యక్తిత్వం ఉన్నతమైనది, మహోన్నతమైనది. అజాతశత్రువు. ఆయన ఏ విమర్శకు దొరకని అతీతుడు. స్నేహమంటే ఆయన ఊపిరి. విరాళానికి వెనుకాడని కర కమలం చిరునవ్వులే చూశాను. చిరుకోపం ఏనాడు చూచియుండలేదు. పెద్ద మేధావి. ఎన్నో గ్రంథాలు ఎందరికో దానమిచ్చిన వితరణశీలి, పఠనాశక్తిని పెంపొందించే వినయశీలి. సాహిత్యాభిమాని, మరువలేని మరపురాని వ్యక్తి

ఆయన వ్యక్తిత్వం మహోన్నతమైనది

★

డాక్టర్ సిహెచ్. వెంకటేశ్వరరావు

సెప్టెంబర్, 1997
వెల - రూ॥ 6/-

శ్రీ రవీంద్రనాథ్‌గారితో నా పరిచయం 1948 నుండి మొదలు అయినది. ఆయన ఎప్పుడు చూచినా ఏదో పుస్తక పఠనములో నిమగ్నమై ఉండేవారు. ఏమి పుస్తకాలు అంటే చెప్పటం చాలా కష్టం. ఇంగ్లీషు, తెలుగు భాషలలో ప్రపంచంలో ఎక్కడ ఏ పుస్తకం అచ్చు అయినా తెప్పించుకొని చదువుతూ మాకు ఇచ్చి చదవమని ప్రోత్సహించేవారు. చాలా బాగుంది ఈ పుస్తకం చదవండి అని బలవంతపెట్టే స్వభావంవారిది. ఎనలేని సాహితీ ప్రియుడు. ఈ విషయంలో ఆయనకు ఆయనేసాటి, మరొకరులేరు.

1947లో జ్యోతి, రేరాణి పత్రికలు ప్రారంభించి ఆ రోజులలోనే సెక్స్ ఎడ్యుకేషన్‌కు నాంది పలికిన మహనీయుడు. దాని అవసరాన్ని ఈనాటి సమాజం గుర్తించినందుకు ఆయన ఆత్మకు శాంతి కలుగుతుంది. పత్రికా ముద్రణలో ఏనాడు ఆయనకు లాభాలు రాలేదు. నష్టాలతోనే నడిపేవారు.

చలంగారి కలం అతిపదునైనది. విప్లవకర నినాదాలాతో ముందుకుపోయేది. అయినా ధైర్యం చేసి రవీంద్రనాథ్‌గారు తమ పత్రికలలో వాటికి స్థానమిచ్చినారు.

రవీంద్రనాథ్‌గారు నేను ప్రతి సమ్మర్‌లో ఉటీ, బెంగుళూరు, కూర్గులలో గడిపేవారం. ఒకోసారి ఏమైనదంటే మేజర్ జనరల్ తిమ్మయ్యగారు పరమపదించారని తెలిసి ఒక స్నేహితుని వెంటబెట్టుకొని శ్రీ తిమ్మయ్యగారి యింటికి వెళ్లి వారికి నివాళులు సమర్పించివచ్చాము. అది మాజీవితాలలో మరుపురాని మరువలేని ఘట్టం. మా జీవితాల జ్ఞాపకాల వాకిళ్లు తెరచి తరచి చూస్తే మృదు మధురమైన స్మృతులు వరదలా ప్రవహిస్తూ, స్పృశిస్తూ వుంటాయి. ఎన్ని వ్రాయాలి, ఎన్ని ఉదహరించాలి? చాలా కష్టం ఇష్టం వున్నా.

శ్రీ రవీంద్రనాథ్‌గారికి రాజకీయనాయకులలో శ్రీ బెజవాడ గోపాలరెడ్డి, శ్రీ నీలం సంజీవరెడ్డి అంటే చాలా అభిమానం. యం.యన్. రాయ్‌గారితో రవీంద్రనాథ్‌గారికి మంచి పరిచయాలున్నాయి. ఆ పరిచయంతో నన్ను స్వయంగా రాయ్‌గారి దగ్గరకు తీసికెళ్ళి పరిచయం చేశారు. మా ఇద్దరి సాన్నిహిత్యానికి ప్రసిద్ధ నటులు శ్రీ గుమ్మడి ఎంతో ఆనందించేవారు.

శ్రీ రవీంద్రనాథ్ వ్యక్తిత్వం ఉన్నతమైనది, మహోన్నతమైనది. అజాతశత్రువు. ఆయన ఏ విమర్శకు దొరకని అతీతుడు. స్నేహమంటే ఆయన ఊపిరి. విరాళానికి వెనుకాడని కర కమలం చిరునవ్వులే చూశాను. చిరుకోపం ఏనాడు చూచియుండలేదు. పెద్ద మేధావి. ఎన్నో గ్రంథాలు ఎందరికో దానమిచ్చిన వితరణశీలి, పఠనాశక్తిని పెంపొందించే వినయశీలి. సాహిత్యాభిమాని, మరువలేని మరపురాని వ్యక్తి రవీంద్ర స్మృతి నా సంస్కృతి.

డాక్టర్ సి. హెచ్. వెంకటేశ్వరరావు, తెనాలి, అందరూ డాక్టర్ అని ముద్దుగా పిలుస్తారు.

Everything has a history and history influences individuals. Even individuals who influence history have their origins in their own history. This is true of Ravindranath. Ravindranath is known by his colleagues, friends, and competitors as well, for his drive for success in the publishing world and his desire for service to the society.

CULTURAL AND INTELLECTUAL ROOTS THAT SHAPED RAVINDRANATH POSSIBLE CHILDHOOD NFLUENCES - A PERSONAL PERSPECTIVE

☆

Alapati Krishna Kumaran (U.S.A)

At the outset I would like to express my thanks to the editors of the special volume honoring Sri Alapati Ravindranath and to Dr. N. Innaiah for giving me an opportunity to say a few words about my cousin. Although Dr. Innaiah suggested that I write about my childhood memories that I have about Sri. Ravindranath I have to confess that I do not have special knowledge of his child hood. He was about ten to eleven years older to me. When I was nine years old he was married and was in the process of leaving the Govada village where we hailed from. The only real direct memories of my cousin were from the times after his marriage and after he set up his residence at Tenali and probably others more intimate with him are better suited to write about this stage of his life. All other memories of Ravindranath that I have are based on a few incidents in his life that my parents and other elderly neighbors commented about in my ear-shot or conveyed to me in casual conversations.

My relationship to Ravindram, as we used know him, is that his father, Alapati Venkataramaiah and my father Alapati Venkatakrishnaiah are brothers, children of Alapati Devaiah through my grand father's first marriage to Seshamma. Devaiah had another son Alapati Suryanarayana in his second marriage to Varramma. My first memories of Ravindranath were related to his attending our paternal grand mothers death anniversary that my father observed every year. It was a routine affair. A few neighbors and Ravindranath and his family members shared a meal. There was nothing unusual or unexpected that happened at those events. The only thing I remember of Ravindranath was that he was fair complexioned and a well built individual, reserved in demeanor and thoughtful.

My father was the older of the two brothers and the two brothers had great affection for each other. They were all in the joint family system until about 1931when the two brothers were in their late thirties or early forties. There is an interesting anecdote about Ravindranath relating to the partition of properties. As I understand, although landed property was partitioned in 1931 moveable property such as jewellery and silver articles were partitioned later. It appears that there was a discussion as how to partition a silver decorative piece (an artistic avian figurine). When one person in the family suggested that it be divided into three pieces Ravindranath showed, I believe, his innate aesthetic sense and prevented it from happening. Thus he showed at a very young age the aesthetic values that he clearly cultivated in later life. I was the youngest child to my parents.

Although I arrived a year after the joint family arrangement was dissolved and each of three brothers (including their step brother) had

their own house holds all in Govada I continued to have the run my parents home and that of Ravindranath's parents. Unfortunately my uncle Venkataramaiah passed away I believe, three years after I was born. Thus my memories of my uncle, Ravindranath's father, and his family are very limited. Ravindram annayya, as I used to call him, was still a teenager and thus my father was a nominal guardian to Ravindranath and his unmarried siblings.

My father used to tell me that he and his brother were very close, and they were always thinking alike. Since my father was living at Amrutalur from about 1910 to about 1930 it was his brother, Ravindranath's father, who was managing my fathers personal finances in Govada. One remark made by my father about his brother that sticks in my mind is that my uncle would say that if you have to have a written contract to do business with some one, one should never do business with that person. He was always trusting and he was obviously a great judge of people. The business they were engaged in was mostly money lending in this context. Imagine the amount of trust in those days. Another remark that one of my neighbors told me about Ravindranaths father is about his civic spirit. He would never spit in the street if he was sitting on his front porch. He would go into his house compound and spit in the front yard there. He would make sure that he would not be the cause for deterioration in the sanitary conditions of the village. I am relating these anecdotes to indicate the type of idol Ravindranath had as his father. A trusting and trustworthy civic minded gentlemen. The trust that Ravindranath placed in his business associates and in his many friends had its origins in the lessons that he learnt from his father.

My first direct memory of Ravindram annayya is at the time of his marriage. I was then nine year old. I distinctly remember my travel to Mogalrajapuram, then a suburb of Bezwada (now Vijayawada). That was my first train travel probably, that excited me enough. But the most exciting thing was the hill in close proximity of the brides home. Several of us children and some adults tried to climb to the top of the hill. I was too young to go to the top. I gave up very soon after I began my climb. At close to the top of the hill facing the street side was a geological fault line marking that gave the impression of a locked door of an iron safe. The legend was that the iron safe door was guarding a store of wealth and learning. May be it was an allegory that wealth and learning could be achieved only with hard work, requiring serious effort. Certainly that legend or indirect admonition did not go vain on Ravindranath. He always

worked diligently and intensely to achieve his goals what ever they may be at the time.

As I said earlier, I must confess that I have very little first hand knowledge of the childhood of my cousin. Hence I am going to narrate here some of the inferences that I made about the making of Ravindranath as a publisher, philanthropist, friend of literati and the underpinnings of his beliefs and personality. Many of these inferences are based on some memories of my contacts with him, and hearsay from family members and neighbors. These memories are more than five decades old and thus, as may be expected, may have been colored by time. All the same these are certainly some of the fundamental facts about the circumstances of his childhood and his up bringing that might have, could have, should have influenced my cousins personality, personal beliefs and the life style. Everything has a history and history influences individuals. Even individuals who influence history have their origins in their own history. This is true of Ravindranath. Ravindranath is known by his colleagues, friends, and competitors as well, for his drive for success in the publishing world and his desire for service to the society. Hopefully my comments here provide an insight to the roots of these drives in Ravindranath's personality.

MOTHER'S READING HABITS PROBABLY INFLUENCED THE FUTURE PUBLISHER

It is my belief that ones own mother influences a child's growth and development both physical and psychological, more than we normally give credit, especially in the rural set up. Let us look at Ravindranath's immediate or what social psychologists are calling the nuclear family. Ravindranath is the second child of Venkataramaiah and Ammemma, and he was the first male child. He has an elder sister, Suguna, and two younger sisters Sunanda and Suseela, and an younger brother, Gopalakrishna, the youngest of five children. Gopal, as we used to call him was of my age. As the elder male child from rural agricultural family great attention was bestowed on him by his parents and relatives. He was always nicely dressed and had the leadership qualities in the sense that he would take charge of things.

My first memory of their family is at the time of Suguna's marriage. My memory is a very pleasant one. My uncle made sure, on that busy day, that I will be served with yogurt with cream my favorite dish!!! I was just less than three years old. Ravindranath was already a teenager becoming confident and independent. I was a little toddler and was probably and I should say naturally ignored by the older cousins and

brothers. This is another reason that my direct knowledge or memory of Ravindranath's childhood is very limited. However, one thing I remember very vividly is that Ammemma, Ravindranath's mother, was a voracious reader of a variety of books in Telugu, including the then popular romance novels even though her formal education was very limited. I am referring to the period when I was seven or eight years old and when Ravindranath was in late teens. That spirit of reading must have some influence in directing Ravindranath in entering book publishing business as well as encouraging budding authors.

FAMILY TRADITIONS ALSO MOLD PERSONALITY TRAITS

As I said above, we lived in Govada which is only 12 miles (19 kilometers) from Tenali. Our families had been resident in Govada for about one hundred years or so before the times I am relating about here, i.e., since about 1830s. Our family was a kind of what one would call to day as carpet baggers i.e., immigrants from another village, Gudavalli. At the time of Ravindranath's birth our family headed by our grand father, Devaiah, was the wealthiest in the village. Ravindranath's great-great grand father, another Devaiah, had built a choultry and endowed it with the necessary income producing land, in order to provide a residence in the village for a Brahmin family who would serve as the priest to perform marriages and other life cycle rituals in the village. This Devaiah had also paid for a drinking water well and for an irrigation channel that helped the farmers in the village. That spirit of social conscience that Ravindranath exhibited in his latter life must have been influenced by this family history. I shall returne to this matter a little later in this article in the context of support of education.

Tenali in the early teens and twenties of the twentieth century had been an active literary and cultural center. Many drama troupes made their debut in Tenali. Many literati were Tenali residents or often visited the town. Probably this cultural awakening was following a long tradition of Tenali region, being the home grounds of the famous poets Tenali Ramalinga and Srinathudu. Kaviraju Tripuraneni Ramaswamy Choudary had set up his abode at Tenali and formed the nucleus of the new way of viewing life and society. An awakening in the traditional agricultural families to pursue intellectual endeavors began. Many of the then prolific authors and thinkers were widely known to the common man in the villages in the area. The influence of Tripuraneni as a poet, a novelist and an essayist influenced the literary world and more importantly it gave a fillip to the educational and literary desires of the non Brahmins.

If one looks at the earlier generation say of my father and his brother, (Ravindranath's father), they did not have much of a formal education beyond second or third grade. This was because my grandfather did not want his boys go to Bapatla to study beyond the 3rd grade. Education beyond 3rd grade was considered irrelevant for future farmers. That was in the late 1800s. Very few schools were established. Education was considered a profession only in the Brahminical tradition. Being from a family of land owners agriculture was considered to be their profession and a means to earn a livelihood. Thus, Devaiah did not see the need for education for his two sons. All the same the two brothers, Venkatakrishnaiah and Venkataramaiah, though lacking formal schooling had the intellect and showed keen interest in learning. They encouraged their children to pursue educational goals. The George Coronation Board High School was established in 1911 initially at Inturu and then was moved to Thurumella, only four kilometers from Govada. I will return later about an incident in Ravindranath's high school life at Thurumella.

Although the wealthy farmers of the late 19th and early 20th century did not encourage their children's education probably in part because of lack of accessible educational institutions in the vicinity they had shown lots of interest in knowledge and learning. Less well-to-do farmers of course could not afford to send their children away for schooling. Our grandfather, Devaiah, for example was reputed to be very generous to scholars and many of them frequented his house thus exposing his children to the classical epic stories and the moral concepts embedded in them. This tradition continued in the life time of his children. Thus, Ravindranath during his childhood must have noticed the respect that his father and grandfather had for learning, a feature nurtured in his own life.

Added to this milieu, my father, Venkatakrishnaiah, because of an unusual constellation of personal and family circumstances at the age of 19 or 20 years had a desire to go back to school and learn what the learned scholars were talking about at his father's home. This was in 1908 or so before Ravindranath was born and probably even before his father was married. Venkatakrishnaiah went to a well respected Sanskrit teacher Brahmasree Vemuri Sivaswami Sastry of Tenali and was accepted as a student despite the fact he was not a Brahmin and received education in Sanskrit literature. My father took the Pundits test and received the first prize at a special meeting of these new graduates (equivalent to convocation) hosted by the maharaja of Vijayanagaram. Soon after my father graduated from the Tenali school that Sanskrit school closed for reasons which are not clear or at least the reasons for which were not

documented as far as I know. My father was then living at Amrutalur at my maternal grand parents home, because he was the eldest son-in-law of the family with no male off spring. Since the Tenali Sanskrit school was closed my father felt the need and started a Sanskrit school at Amrutalur in 1910 or there abouts. This school prepared persons from all castes for careers in teaching Telugu and Sanskrit. He was the secretary and treasurer of the school committee. In addition the school arranged for room and board of students who came from villages that are not within commuting distance, roughly five miles (8 kilometers). This school was the source of the many non-brahmin Telugu and Sanskrit teachers in Guntur and Krishna Districts in twenties, thirties and forties of the last century. This school was largely supported by the joint family headed by Ravindranath's grandfather, Devaiah, my maternal grand father's estate and probably other munificent individuals in the neighboring villages. Thus, Ravindranath was familiar with the need to improve literacy among all peoples and improve their scholarship.

Another development that might have influenced Ravindranath when he was in his early teens was another quasi political and quasi social activity in which Ravindranath's immediate family played an important, if not a crucial role. In early 1930s under the influence of Mohandas Karamchand Gandhi, then not yet called a Mahatma, an ashram was started at Kavuru. This was initiated by Sri Gollapudi Sitarama Sastry, a lawyer who gave up his practice and devoted his life to this ashram called Vinayashram. This idea was fructified by the generous gift of their family properties by Thummala Basavaiah and his wife Durgamba of Kavuru. Kavuru is the village of Ravindranath's maternal grand parents. His maternal grand parents must have known the Basavaiah family well and may be even related to them. Ravindranath was probably in his early teens when this ashram was established and the ashram was considered on a part with Gandhi's Wardha ashram. Ravindranath could not but be influenced by such an event in which his extended family played an important role.

Moreover, the trustees of Vinayashram, of which my father was one, decided to have the four Vedas translated into Telugu and make this knowledge available to the common man. Of course my father was keen in having the vast sacred Sanskrit literature available for individuals of all castes instead of being limited to those with knowledge of Sanskrit. Sri Alapati Devaiah, Ravindranath's grandfather, financially supported the efforts of Vinayashram, to have the Telugu translations of the Vedas printed. Unfortunately to my knowledge only one volume each of the four Vedas were ever printed. If I remember well the foreword for the Telugu translation

of Rigveda said that each Vedam would be published in about 25 volumes. Never mind our grandfather could barely read or write. He was what one would call nisandar although he could sign his name if he concentrated on it enough. Yet he felt the need to support efforts to make the ancient texts of the Indian literature available to the lay individual, the common man. *This project was initiated in the late thirties and probably fructified* in the early 1940s when Ravindranath was establishing his own household at Tenali. Thus publishing and support of publishing were part of family tradition for Ravindranath.

At about the same time i.e., in the early forties my uncle Sri Alapati Suryanarayana, an uncle to Ravindranath too, who was very active in promoting agriculture-related competitions, such as quality cattle breeding for better bullocks and cows, started publishing a journal. This journal, I believe a fortnightly, Vihari, published brief articles on agriculture, short stories and other bits and pieces. But I do not have clear memory of this journal because it was relatively short-lived and I was just entering my teen years. The journal, was just beginning around the time Ravindranath was married and took up the responsibilities of his family affairs. The desire to be a publisher of journal, I believe had strong roots in this exposure and the experience.

SOCIOPOLITICAL CONCEPTS SHAPE PERSONAL BELIEFS AND BEHAVIOR

The question whether basic personality of an individual imprinted during childhood influences the person's sociopolitical beliefs or the sociopolitical constructs developed by an individual in the course of learning and living, shape the individual's personal traits is a debated point. Personal beliefs are constantly developing and evolve with experiences from cradle to maturity, if not from womb to tomb, of an individual. Ravindranath is no exception. As mentioned above Ravindranath had his origins were in a conservative family that was willing to accept and even spearhead innovative social changes. As a young adult Ravindranath came under the influence of the writings of M.N. Roy during his early days at Tenali. There were a number of radical humanists at Tenali at that time. I do not know for certain whether he read the works of Roy and was attracted by his philosophy or he was influenced by his radical humanist friends and associates. In any case he did not embrace Gandhian ideals and join the then immensely popular congress party. His grandfather and an uncle had a part, as mentioned earlier, in giving shape to Gandhian ideals by supporting the establishment of Vinayashram. Nor did he join the then waning Justice party which his younger uncle, Suryanarayana, was favoring. I do not think it was a sense rebellion or showing independence from the elders of the family. I think he read the writings of M.N. Roy and

was very much influenced by his theories and ideas. He may have joined the party organized by M.N. Roy and was probably a staunch supporter. I think that it is his firm convictions that lead him to lean towards radical humanism rather than the other two established parties. Communist philosophy was completely antagonistic to his personality, he was independent minded and democratic, believed in independent enterprise as well.

I believe that Ravindranath's embracing the radical humanist philosophy is based on his understanding of the theory rather than a mere aversion for the parties supported by his other family members. The reasons for believing so are based on the fact that he kept very close family ties even after his embracing the then novel sociopolitical philosophy. I remember Ravindranath coming to Govada to cast his vote in 1946 or so for his candidate. He was disappointed sorely when he found that his name was not on the voter list because he moved away from the village a few years earlier. Kalluri Chandramouli, the congress candidate won the election. Ravindranath was sincere believer of the Royist principles. I remember his explining to me bout Roy's humanistic principles when I was barely thirteen or fourteen years old. I do not think I understood what my cousin was expounding on Roys teachings. He was fully convinced of their validity and sincerely believed in them. I still remember the earnestness with which he would explain to me these principles. Now I think he was trying to convey to my father, to whom he thought he should probably try to explain the rationale for his convictions, rather than educate me in these matters. I know he always had respect for my father although they did not believe in the same socio-political philosophies. I do not know whether he read Roy's writing in the original English text or whether Telugu translations were already available. This is interesting to me because I know that Ravindranath did not complete high school.

An anecdote that I heard about an incident in Ravindranath's formal schooling is of interest in this context. Ravindranath did not complete high school education, not because he did not have the intellectual make up to study but because of a what we would consider now a minor youthful indiscretion. According to the anecdote that I heard, Ravindranath was showing off his fountain pen to his friends. How many students had fountain pens in those days? A few a nib pen and an ink bottle. I went to the same school, George Coronation Board High School in Thurumella. All the student benches had a slot for the nib pen and a slot an ink bottle.

Any way as I understand, Ravindranath was showing off to his class mates his fountain pen and its ink store in the barrel. In his youthful exuberance he was showing how ink would squirt out of the nib if he

vigorously shook the pen. It appears that the direction of his shaking the pen happened to squirt ink on a teacher's back. The tragedy of it was that the strict disciplinarian head master, Sri. Dakshinamurthy, saw the whole incident. He was disciplined out of the school despite entreaties from my father his unofficial guardian at that time. May be that was a good turning point. Otherwise with his intellect and industry Ravindranath would have become another career administrator. I am sure he would have been an administrator with in the government service because in the villages of the nineteen thirties, the colonial days for a member of the agricultural family a revenue collector, an ICS, was the most exalted and respected profession.

INDEPENDENT VISIONARY VIEWS EMERGED EARLY IN LIFE

In those early days when he set up his family at Tenali Ravindranath used to visit us in Govada at least two or three times a year. As mentioned above the joint family properties of Alapati Devaiah and probably his two brothers (Parasuramaiah and Lakshminarayana) were partitioned around 1931. When Venkatramaiah, Ravindranath's father passed away my father served as a temporary guardian as per tradition. It was not a legal contract in the modern sense, it was a mere social tradition. The two brothers were close and naturally the surviving brother took the responsibility. Consequently Ravindranath had respected my father as a surrogate parent. But my father new his limitations. After marriage when Ravindranath decided to set up his family in Tenali there was only a slight murmur of protestation. Why waste money in Tenali, after all the source of income was in the farm land that Ravindranath inherited in Govada and in Kavuru.

I do not know and I can not even guess the thought process that went in Ravindranath's mind. But he started his journal, Jyothi, and the necessary printing press at Tenali soon after moving to Tenali. It was not a mere excuse to justify his living at Tenali. It was not a mere attempt to mollify his relatives who were questioning the additional expenses involved in living Tenali. He was not living at Tenali as an idle rich young man. He was there for a purpose. He was laying foundation for his latent intellectual pursuits. Ravindranath realised early in his life that all the three major needs of life, viz. a) to earn a living i.e., food and shelter, b) be a responsible member of the society and c) coming to grips with an understanding of the purpose of life or the spiritual aspects, must be fulfilled in order to achieve a fulfilling life. He was not satisfied with the life of a farmer as a life long profession. He foresaw the need to change his priorities, set aside the hoary traditions and pursue something more satisfying to his tastes and talents.

Ravindranath realized that any pursuit to fullfil his long term goals takes money, intellectual stamina and philanthropic attitude. I think that Ravindranath realized that need early in his life. I think he fully accomplished what he set out to achieve. He employed his energies enthusiastically and ingenuity diligently to achieve the goals. In fact I remember his early days with his publication activity. He would visit Govada two or three times a year under the guise of having to supervise the agricultural activities, such as transplantation and harvesting. In the initial years after setting up his abode at Tenali he and his wife Srimathi Kalavathi would stay for a day or two in the house in Govada that he inherited and return to Tenali. But in later years, he would come alone and stay at our home. It was during these visits he tried to explain to me the humanist philosophy and principles. They were beyond me at that time.

But it was clear that he was enjoying his role as a publisher of Jyoti. He was sure that he was on the right path. This enterprise that slowly blossomed in to a vast conglomeration of business activities was his vision of what he wanted to make of his life. He was bold in striking new paths different from or unknown to his fathers and forefathers. He was intelligent to choose a path that fills a social need. He was visionary to have started these at a time that breaking tradition was a social taboo. He combined the passionate intensity of an enterprising intellectual and the compassionate conservative attitudes of successful individuals responsibilities to the society. It is remarkable that Ravindranath had accomplished his objectives without losing his traditional values.

Many other authors in this book will explain in great detail the later life story of Ravindranath. He made many friends among the literati and I hope that their articles in this volume will illuminate the blossoms that the family traditions seeded. He was eager to learn and also to earn by promoting learning and literature. Thus, although Ravindranath did not complete high school he acquired the love for learning and also had imbibed the need to propagate knowledge. He evolved into a humanist and this philosophy influenced his life and can be seen in all the activities that he engaged in his life time. I wish I had more contacts with him after the early years. These memoirs and memories of friends, associates and others are a fitting testimony of his accomplishments.

Alapati Krishna Kumaran, Wehr Professor Emeritus,
Marquette Varsity, U.S.A. Consin of Sri Ravindranath.

తెనాలిలోని ఆలపాటి కళావతీ రవీంద్రపీఠం వద్ద...

‘‘కృషి వుంటే మనుషులు ఋషులౌతారు - మహాపురుషులౌతారు’’ అన్నట్లుగా రవీంద్రనాథ్ గారు పట్టుదలతో నిరంతరం పఠనంలో, మేధావుల సాంగత్యంలో తమ సమయాన్నంతా వినియోగించు కొని పత్రికారంగంలో కొత్త ఒరవడితో ఉన్నత శిఖరాలనధిష్టించ గలిగారు. సమాజానికి నూతన వెలుగును ప్రసాదించి - సాంఘిక విప్లవానికి స్వాగతం పలికారు. తన కృషి, చింతనలతో వర్తమాన, భావితరాలకు స్ఫూర్తిమంతులయ్యారు.

కృషి వుంటే మనుషులు ఋషులవుతారు

☆

పావులూరి శివరామకృష్ణయ్య

మిసిమి

మాస పత్రిక

మే, 1992 వెల రూ.3/-

ఆలపాటి రవీంద్రనాథ్ నాకు బాల్య మిత్రుడు. మా ఇద్దరిదీ గోవాడే. ఆరడుగులకు పై చిలుకు ఎత్తు, స్ఫురద్రూపి, ఆకర్షణీయ ధోరణి.అందువల్ల అందర్నీ ఆకట్టుకోగల శక్తి సామర్థ్యాలు మొదటినుండీ ఉండేవి. మా యిద్దరి చదువు సంధ్యలు దగ్గరలోని తురుమెళ్ళ హైస్కూలు వరకే పరిమిత మయ్యాయి. దీనికి కొన్ని కారణాలున్నాయి. మొదటి నుంచీ మా గ్రామం జాతీయోద్య మానికి పట్టుగొమ్మ. అందునా వీరి తాత తండ్రులంతా సంపన్న రైతు కుటుంబీకులైనా - దేశభక్తి, సేవాదృక్పథం కల్గిన వారు గావడం - ఒకవిధంగా మంచిదైనా, చదువు సంధ్యలకు కాస్త ఆటంకము కల్గించిందనే చెప్పాలి. మా చిన్న తనంలోనే మాగ్రామం జాతీయోద్యమాన్ని, ముఖ్యంగా జాతిపిత గాంధీజీని నెత్తిమీద పెట్టుకొంది. వారికీ, వారి ఉద్యమాలకు తృప్తికరమైన సహాయ - సహకారాలు అందించినట్లు నాకు తెలుసు. 1924, 1930, 31 సంవత్సరాల్లో కాకినాడ కాంగ్రెసు జరిపినప్పుడు, మా గ్రామము నుండి ఎందరో యువతీ యువకులు ఆ సభలకు వెళ్ళి, దేశభక్తి భావాలను తమ హృదయాల్లో నింపుకొని పెద్దయిన తరువాత వారి వారి అభిప్రాయాల ననుసరించి రాజకీయ పార్టీల్లో చేరారు. ఈ స్ఫూర్తితోనే వీరి తండ్రిగారైన శ్రీ వెంకట్రామయ్యగారు గోవాడ గ్రామంలో గ్రంథాలయాన్ని స్థాపించారు. ఇది ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరమైన ఆలోచన.

నిజం చెప్పాలంటే రవీంద్రనాథ్ పై పినతండ్రి ఆలపాటి సూర్యనారాయణ గారి రాజకీయ ప్రభావము- స్వయం నిర్ణయ శక్తి, తదితర అభ్యుదయ పోకడల ప్రభావమే హెచ్చుగా వీరిపై పడిందని నా అభిప్రాయము. శ్రీ తాపీ ధర్మారావు, గోపీచంద్, త్రిపురనేని రామస్వామి చౌదరి, ఆవుల గోపాల కృష్ణమూర్తి, పి.వి. సుబ్బారావు మొదలైన హేతువాద నాయకుల ప్రభావం కూడ హెచ్చుగానే పడిందని చెప్పవచ్చు. రవీంద్రనాథ్‌గారు చిన్నప్పటినుంచే సీరియస్ పత్రికలు, రచనలను చదువుతుండే వారు. 1939 ప్రాంతంలో తాపీ ధర్మారావుగారి సంపాదకత్వంలో కాగడా పత్రిక యువకుల్లో ప్రాచుర్యం పొందింది. రవీంద్రనాథ్‌గారు 'కాగడా' చదువుతూ తనకు ఆసక్తి కలిగించే అంశాలను నోట్ చేసుకునేవారు. ఆయన మీద 'కాగడా' పత్రిక ప్రభావం వుండేది. రవీంద్రనాథ్ వివాహానికి తాపీ ధర్మారావుగారు కూడా ఆధ్వర్యం వహించారు. గాంధీజీ, రంగాజీల, తదితర జాతీయ నాయకుల ఆలోచనల ప్రభావం పడింది. మా గ్రామం హెచ్చుగా రంగాగారి యెడ భక్తి ప్రపత్తులు గల్గి ఉంది. శ్రీ సూర్యనారాయణ, రవీంద్రనాథ్‌గార్లు అభిమానించిన ఎం.ఎన్. రాయ్ గారి రాడికల్ పార్టీ పోకడలకు మా గ్రామం అభ్యంతరం పెట్టలేదు. ఆనాడే ఆయన రాడికల్ పార్టీ యూత్ వింగ్‌ని మా ఊళ్లో ఆర్గనైజ్ చేశారు. ఊరు వూరంతా జాతీయ వాదచైతన్యంతో ఉప్పొంగి పోతుంటే, ఆయన తద్భిన్నంగా ప్రజాయుద్ధ (రెండవ ప్రపంచయుద్ధం) నినాదం పట్టుకున్నారు. తాను నమ్మిన సిద్ధాంతాన్ని ఇతరులెవ్వరూ బలపరచక పోయినా ఆయన ఒక్కడే నిర్భీకతతో దానికి నిబద్ధుడై కార్యకలాపాలు నిర్వహించేవారు. పదుగురాడు మాట మీదకన్నా సొంత ఆలోచనలు, విశ్వాసం పైనే ఆయనకు గురి. ప్రజాయుద్ధమన్న ఆలోచనను మేమంతా తీవ్రంగా విమర్శించి, వ్యతిరేకించాము కూడా. ఐనా మా మధ్య ఎలాంటి పొరపొచ్చాలు రాలేదు. ఆవేశకావేశాలు వెదజల్లలేదు. దీనికి కారణం

మనుష్యుల్లో వున్న సంస్కార భావము, సామరస్య ధోరణి. నేటి రాజకీయాలలో ఇలాంటి ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య ధోరణి కాగడా పెట్టి వెతికినా కనిపించడంలేదు. ఇది విచారకరం.

రవీంద్రనాథ్ గోవాడ విడిచిపెట్టి తెనాలిలో ప్రింటింగ్ ప్రెస్‌ను స్థాపించి జ్యోతి, రేరాణి, సినీమా, మొదలైన పత్రికలను విజయవంతంగా నడిపారు. వీటికి కారణం వీరి పినతండ్రి ఆలపాటి సూర్యనారాయణగారు మద్రాసు నుండి ప్రారంభించిన విహారి పత్రికే. ఆ సందర్భంలో మేమంతా ప్రభుత్వానికి వ్యతిరేకమైన నవశక్తి, ప్రజాబంధు, కృష్ణా పత్రికలను చదువుతూ ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమానికి తోడ్పడుతూ ఉండేవారము.

రవీంద్రనాథ్‌గారు ఎం.ఎన్. రాయ్, త్రిపురనేని రామస్వామి చౌదరిగార్ల సాహిత్యం, అభ్యుదయ భావాలతో ప్రభావితులై సామాజిక సేవకు మద్దతిస్తుండేవారు. ఇంతలో హైదరాబాదుకు రంగం మారింది. పాత ధోరణితోనే నూతన అభ్యుదయ భావాలను ప్రచారం చేసేదానికి 'మిసిమి' అనే పత్రికను స్థాపించి పత్రికా రంగంలో ఒక వినూత్న ప్రయోగాన్ని చేసి అనతి కాలంలోనే మేధావంతుల ఆదరాభిమానాల్ని చూరగొన్నారు. దీని కీర్తి ప్రతిష్టలు ఆంధ్రదేశపు హద్దులను దాటి అమెరికా వరకు వ్యాపించాయి. దీని ఫలితమే అమెరికాలోని ఇంటర్నేషనల్ ఆఫ్ కాలిఫోర్నియా వారు గౌరవ డ్కాక్టరేట్ ప్రదానం చేయటం చాలా అభినందనీయము. ఆంధ్రజాతికి కూడా గౌరవనీయమైన విషయమే. ''కృషి వుంటే మనుషులు ఋషులౌతారు - మహాపురుషులౌతారు'' అన్నట్లుగా రవీంద్రనాథ్‌గారు పట్టుదలతో నిరంతరం పఠనంలో, మేధావుల సాంగత్యంలో తమ సమయాన్నంతా వినియోగించుకొని పత్రికారంగంలో కొత్త ఒరవడితో ఉన్నత శిఖరాలనధిష్టించ గలిగారు. సమాజానికి నూతన వెలుగును ప్రసాదించి - సాంఘిక విప్లవానికి స్వాగతం పలికారు. తన కృషి, చింతనలతో వర్తమాన, భావితరాలకు స్ఫూర్తిమంతులయ్యారు.

పావులూరి శివరామకృష్ణయ్య, గోవాడ, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, హిందీ సాహిత్య కోవిధుడు, ఆచార్య రంగా అభిమాని.

చిత్రకారుని దృష్టిలో పురస్కారం

BARE FOOT DOCTOR

మిసిమి 1995

గతం – స్వగతం

మానవునిచే శోధించబడిన శాస్త్ర విజ్ఞానపు నూతన పోకడలు, మానవుడినే ఎలా గులాం చేసుకొన్నాయో? 1947లో ప్రవృత్తి రీత్యా పత్రికారంగంలో ప్రవేశించిన నాకు, "మిసిమి"కి గల సంబంధం అదే తరహాలో మొదలయి, ఆమె సందేహాలను శేష ప్రశ్నలను సమాధానపరచలేని అశక్తుడనని వొప్పుకుని రచయితల కొటకం, జనరేషన్ గ్యాప్ అని సమర్థించుకొని, రాజీపడి, నాటు దాక్షరంగా పట్టాపొందాను. కాని నా జీవితంలో గర్వించదగినది, గుర్తించుకోదగినది, చివరకు మిగిలేది "మిసిమి" మాత్రమే.

జోక్.రి 1947

గుండె గుండెలో స్నేహదీపం వెలిగించి కాంతి సౌరభాలను వెదజల్లి, సౌజన్యానికి ప్రతి రూపంగా నిలిచిన నిర్మల హృదయుడు ఆలపాటి.

సాహితీ రంగంలో – ముఖ్యంగా పత్రికారంగంలో ఆలపాటివారి అభిరుచి, అభినివేశం అభినుతి పాత్రం. నవ్యత, నాణ్యత ఆయన ఇష్టపడే అంశాలు. రమ్యత తెలిసిన రచయితయే కాక విజ్ఞత విరిసిన విమర్శకుడు. కల్పనా మాధుర్యాన్ని ఆస్వాదించిన రససిద్ధుడు. ఉన్నత ఆశయాల ఉల్లాసంతో, ఉత్తమ ఆదర్శాల హృల్లాసంతో మానవతా దీపం వెలిగించాలనే తపన కలవాడు.

గుండె గుండెలో స్నేహదీపం...

☆

డాక్టర్ యం.యల్. గురప్ప చౌదరి

ఆలపాటి రవీంద్రనాథ్‌గారి పేరు వినగానే నాకు 50 ఏళ్ళనాటి 'రేరాణి' మాస పత్రిక గుర్తుకొస్తుంది. అప్పటికి నాకు పాతిక సంవత్సరాల వయస్సు. దక్షిణాదిలోని మధురలో నేను హిందీ శాఖలో అధ్యాపకుడుగా ఉండేవాణ్ణి. మధుర రైల్వే స్టేషన్‌లో తెలుగు వారపత్రికలు, మాస పత్రికలు లభించేవి. నేను ప్రతి నెల 'రేరాణి' - లైంగిక మాస పత్రికను కొనేవాణ్ణి. 'రేరాణి' తెలుగులో మొట్టమొదటి లైంగిక పత్రిక. 'రేరాణి' చదవడానికి - దానిమీద ఆసక్తి కలగడానికి ప్రధానంగా రెండు కారణాలు. ఒకటి నా యవ్వన దశ; రెండవది తమిళనాడులో దక్షిణాదిలో తెలుగు పత్రిక సులభంగా లభించడం. 'రేరాణి' బూతు పత్రిక కాదు - లైంగిక విజ్ఞానాన్ని అందించిన పత్రిక.

ఆ తర్వాత కొంత కాలానికి మొట్టమొదటి చలనచిత్ర పత్రిక 'సినీమా' మాస పత్రికను ఆలపాటివారు ప్రచురించారు. అది ఆనాడు ఏకైక సినిమాల పత్రిక. ఉన్నత ప్రమాణాలు కలిగిన పత్రిక అనవచ్చు. తర్వాత 'జ్యోతి' అనే పక్ష పత్రికతో పత్రికాధిపతిగా రవీంద్రనాథ్ గారికి పత్రికారంగంలో మంచి ఖ్యాతి వచ్చింది. తర్వాత తర్వాత పాఠ్యపుస్తకాల ప్రచురణ కర్తగా కూడా పేరు సంపాదించారు. ఇప్పుడేమో 'మిసిమి' మాస పత్రిక దానికదే సాటి అని ప్రసిద్ధి చెంది తెలుగు మేధావిలోకానికి ఆనందాన్ని అందిస్తున్నది. 'మిసిమి' ద్వారా రత్నకణికల్లాంటి వ్యాసాల్ని, వాస్తవాల్ని తెలుగు జాతికి ప్రసాదించి జ్ఞాన విజ్ఞాన దీధితుల్ని ప్రసరింప జేసిన ధిషణాధురీణుడు ఆలపాటి రవీంద్రనాథ్‌గారు.

రవీంద్రనాథ్‌గారు పసితనం నుంచే పరిణతి చెందిన ప్రతిభను ప్రదర్శించి అనితర సాధ్యమైన పద్ధతిలో ఉన్నత శిఖరాల నధిరోహించే దిశలో పయనిస్తూ విశిష్ట ప్రవర్తనంతో విలక్షణ వ్యక్తిగా ప్రవర్తించారు. ఉన్నత ప్రమాణాలను సంతరించుకొని అన్ని వర్గాల ఆదరాభిమానాలను చూరగొన్న మానవతామూర్తిగా ఎదిగారు.

చిన్ననాడు ప్రాథమిక స్థాయి వరకే విద్యాభ్యాసం చేసినా, ఆ తర్వాత ఆంగ్లాంధ్ర భాషల్లో అవిశ్రాంత కృషి సాగించి - అకుంఠిత దీక్షతో అసంభవ లక్ష్యాల వైపు పయనించి మానవతా ధర్మాన్ని ఆదర్శంగా స్వీకరించి ప్రజాహిత కార్యక్రమాలకు, హేతుబద్ధ జీవితానికి అలవాటుపడి అమలిన వ్యక్తిత్వాన్ని ఆర్జించుకొన్న మహా మనీషి.

ఆంధ్రజాతి వైభవాన్ని, ఆంధ్రభాష ప్రాభవాన్ని గుర్తించిన మేధావి. తెలుగు సంస్కృతిలో ఉన్న సుమధుర కళామాధుర్యానికి, తెలుగుభాషలో ఉన్న సురుచిర భావసౌందర్యానికి, ఈ దేశ దార్శనిక తత్త్వానికి, మానవతావాద మనోహర కృత్యాలకు కర్పూర నీరాజనం పట్టిన ధన్యజీవి.

ఆయనొక రాడికల్ హ్యూమనిస్టు. తన మార్గంలో ఎందరో యువ రచయితలకు ఉత్సాహ ప్రోత్సాహాలందించారు. వారిలో మచ్చుకు సర్వశ్రీ డా॥ రావూరి భరద్వాజ - కథారచయిత, శార్వరి - జర్నలిస్టు, శారద - కథారచయిత, శివం - నాటకకర్త, చౌడేశ్వరీదేవి - కథారచయిత, ఆలూరి భుజంగరావు - అనువాదకుడు.

వీరు ఎంతటి ప్రసిద్ధులో తెలుగు పాఠక లోకానికెరుకే.

గుండె గుండెలో స్నేహదీపం వెలిగించి కాంతి సౌరభాలను వెదజల్లి, సౌజన్యానికి ప్రతి రూపంగా నిలిచిన నిర్మల హృదయుడు ఆలపాటి.

సాహితీ రంగంలో - ముఖ్యంగా పత్రికారంగంలో ఆలపాటివారి అభిరుచి, అభినివేశం అభినుతి పాత్రం. నవ్యత, నాణ్యత ఆయన ఇష్టపడే అంశాలు. రమ్యత తెలిసిన రచయితయే కాక విజ్ఞత విరిసిన విమర్శకుడు. కల్పనా మాధుర్యాన్ని ఆస్వాదించిన రససిద్ధుడు. ఉన్నత ఆశయాల ఉల్లాసంతో, ఉత్తమ ఆదర్శాల హృల్లాసంతో మానవతా దీపం వెలిగించాలనే తపన కలవాడు. మంచి హృదయమున్న రవీంద్రనాథ్‌గారు ఇవ్వాళ మన మధ్యలేక పోయినా మానవతా మందిరంలో ఆయన వెలిగించిన మణిదీపం నిత్యనూతనంగా ప్రకాశిస్తుంటుంది. ఆయన ఆత్మశాంతిని అభిలషిస్తున్నాను.

డాక్టర్ యం. యల్. గురప్ప చౌదరి, హైదరాబాదు, రిటైర్డ్ తెలుగు ప్రొఫెసర్, రవీంద్రభారతి మాజీ కార్యదర్శి, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘ సభ్యులు.

నివాళి

శివలింగం

తెలుగులో మేధావులకు ఒక పత్రికంటూ లేని సమయంలో రవీంద్రనాథ్ గారు 'మిసిమి' పత్రికను నడిపించాలని సాహసంతో కూడిన నిర్ణయం తీసుకున్నారు. నిర్ణీత స్థాయి కలిగిన ఆలోచనా శైలితో కూడిన రచనలను ఆహ్వానించారు. ఉన్నత ప్రమాణాలతో సంపాదక బాధ్యతల్ని నిర్వహించారు. ఉన్నత స్థాయి పత్రికగా 'మిసిమి' గుర్తింపు పొందింది. వర్ధమాన యువ మేధావుల్ని, ప్రసిద్ధ రచయితల్ని ఆకర్షించింది. హేతుబద్ధ శాస్త్రీయ ఆలోచనలకు వాహిక. 'మిసిమి' మేధావుల హృదయాలను ఆకర్షించడమే గాక సామాన్యులను కూడా అలరించింది. మానవతా విలువలకు ప్రాధాన్యతనిచ్చింది. ఎందరినో కవ్వించింది. మరెందరి చేతో రాయించింది.

వారు వెలిగించిన జ్యోతి అవిచ్ఛిన్నంగా వెలగాలంటే తైలధార అందించాల్సిన బాధ్యత అందరిదీను.

రవీంద్రనాథ్ గారు పత్రికోద్యాన వనంలో నాటిన మొక్క 'మిసిమి' ఎదిగి శాఖోప శాఖలుగా విస్తరిల్లి సంశయ కల్లోలంలో సతమతమవుతున్న వారికి నీడనిచ్చి సేద తీర్చింది.

వారి కుమారులు దాన్ని కాపాడుతూ వుండటం వారియందు గల అభిమానం, ఆదరణ, గౌరవం.

శివలింగం, చల్లపల్లి వాస్తవ్యులు ప్రసిద్ధ చింతనాశీలి.

1973లో అమెరికా నుండి ఇండియాకు వస్తూ ఎయిర్ పోర్టులో

1982లో షష్ఠిపూర్తి సందర్భంగా...

మాటల సందర్భంలో, మిసిమిని చక్కని ఆర్టు పేపరు మీద, అందాలు చిందే రంగుల చిత్రాలతో, సుందరమైన ముద్రణతో, కనీసం కాగితం ధరన్నా గిట్టుబాటు కాకుండా ఎన్నాళ్ళిలా మాకందిస్తారు, కష్టంగదా అన్నాను. ఆయన దానికి సహజమైన మందహాసంతో, ''కొందరికి కొన్ని వ్యసనాలుం టాయి, నాకు పత్రికా నిర్వహణే వ్యసనం'' అన్నారు. ''అదీకాక కళాజ్యోతి అనే ముద్రణాలయాన్ని మా పిల్లలు చక్కగా నడుపుతున్నారు. మిసిమిని నాకు బహుమతిగా యిస్తున్నారు''.

నేనెరిగిన రవీంద్రనాథ్

☆

పెన్మత్స హరిశ్చంద్రరాజు

ఏప్రిల్, 1994
వెల రూ. 5/-

పెద్దలు, ప్రఖ్యాత తెలుగు నాటక, సినీ రచయిత శ్రీ డి.వి. నరసరాజుగారు మద్రాసు నుంచి తమ పనుల మీద హైదరాబాదు వచ్చి ఉషా కిరణ్ వారి అతిథి గృహంలో బస చేసేవారు. వారు తీరికగా వున్నప్పుడు వెళ్ళి ఆయనతో నా క్లిష్టమయిన తెలుగు సాహిత్యం, రచయితలను గూర్చి తెలుసుకునేవాడిని. వారు కూడా ఏ మాత్రం విసుగు లేకుండా ఎన్నో విషయాలు చెప్పేవారు.

అలాంటి ఒక సందర్భంలో 1993-94లో అనుకుంటాను, ఆనాటి తెలుగు వార, మాస పత్రికల్లో వస్తున్న రచనల గూర్చి మాట్లాడుకుంటూండగా, వారు ''మీరు మిసిమి చదువుతున్నారా'' అనడిగారు. నేను 'మిసిమి' పేరు ఆరోజే వినడం వల్ల లేదండీ అన్నాను. ''ఆయన శ్రీ ఆలపాటి రవీంద్రనాథ్‌గారు, దేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వమే జ్యోతి, రేరాణి పత్రికలను నడిపారు. ప్రస్తుతం మిసిమిని చాలా వైవిధ్యభరితమైన రచనలతో తెలుగు వారి కందిస్తున్నారు, చదవండి మీకు నచ్చుతుంది అన్నారు నరసరాజుగారు.

ఒక వారం తర్వాత శ్రీ రవీంద్రనాథ్‌గారికి ఫోను చేసి, వారికి తీరిక వున్నప్పుడు, వీలైనప్పుడు వారిని కలవాలని వుందని కోరాను. ఆయన ''మీ యిష్టం, యిప్పుడొచ్చినా సంతోషం'' అన్నారు. వెంటనే బయలుదేరి వారి నెస్ట్‌కు వెళ్ళాను. ఆయన సాదరంగా నన్ను పలకరించిన తీరు, వారి రూపం, పంచెకట్టుకున్న తీరు, మాటల్లోని ఆత్మీయత, నిరాడంబరత నన్ను ఆకట్టుకున్నాయి. మిసిమి సంచికలతో పాటు యితర పుస్తకాలతో నిండి వున్న వారి ఆఫీసులో కూర్చుని, ''మీ గురించి శ్రీ డి.వి. నరసరాజుగారు చెప్పారు. మిమ్మల్ని కలుద్దామనిపించి వచ్చాను అన్నాను. తాపీగా కూర్చున్నాక ''రాజుగారూ మీదేవూరు'' అనడిగారు. మా వూరు ఫలానా అని చెప్పగానే, చిరునవ్వుతో, ''రాజుగారూ, మీరూ మేము చాలా దగ్గరవాళ్ళమండీ, మాది గోవాడ, మీ వూళ్లో ఫలానా వారు, వారి పిల్లలు కులాసాగా వున్నారా? వారు మా కుటుంబానికి బాగా తెలిసినవారు'' అంటూ నాలోని బెరుకు పోగొట్టారు. ఆయనే మళ్ళీ ''యింతకీ నన్నెందుకు కలవాలనుకున్నారు'' అనడిగారు. ''నేను ఇంజనీరుగా పని చేసి ప్రస్తుతం ఏమీ వృత్తి వ్యాపకం పెట్టుకోకుండా, నాకు నచ్చిన ఇంగ్లీషు, తెలుగు సాహిత్యం, తెలుగు పత్రికలు చదువుతూ కాలక్షేపం చేస్తున్నాను. మీ మిసిమిని గురించి శ్రీ డి.వి. నరసరాజు గారి ద్వారా విని, చందా కడదామని వచ్చాను అన్నాను. తన సహజమైన చిరునవ్వుతో మిసిమి చదివారా? అంటే లేదన్నాను. ఆయన ''ముందు మీరు కొన్ని మిసిమి పాత సంచికలు చదవండి మీకు ఆసక్తి కలిగించితే చందా కట్టండి'' అంటూ నా చేతిలో కొన్ని మిసిమి సంచికలుంచారు. వాటిని తీసుకుని, వారికి నమస్కరించి యింటికి చేరాను.

దాదాపు ఒక నెల తర్వాత ''నెస్ట్''లో కలిసి చందా కట్టి సెలవు తీసుకుంటుండగా ''మీరు కేవలం పుస్తకాలతో కాలక్షేపం చేయటమేనా వేరే వ్యాపకాలేమన్నా వున్నాయా అన్నారు. నేను వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చినవాడినవటం వల్ల ఇంటి ఆవరణలో కొన్ని కోళ్ళు, పక్షులు, జింకలు, తాబేళ్ళు, చేపలు పెంచుతుంటానండి అన్నాను. ''ఏమిటీ! చెప్పారు గాదు మీ యింటికి వెళ్దాం పదండి'', అంటూ వారి డ్రైవర్ని పిలిచి మా యింటికి వచ్చి, నా పెంపుడు పక్షులను జంతువులను చూసి ఎంత మురిసిపోయారో! నా వద్ద వున్న పుస్తకాలు చూసి ఇంజనీరుగా పని చేసిన మీకు సాహిత్యమంటే యింత యిష్టమా? చాలా సంతోషం, కీప్‌యిట్ అప్ అంటూ,

మీరు నన్ను ఎప్పుడు కలవాలన్నా మొహమాటం లేకుండా మా యింటికి రండి అంటూ నా భుజమ్మీద చెయ్యివేసి మరీ చెప్పారు. ''జీవితంలో పుస్తకాలకన్నా మించిన స్నేహితులు దొరకరు మంచి అలవాటు'' అంటూ కారెక్కారు. - ఆయనానాడు ఆప్యాయంగా మాట్లాడిన తీరు, వారు నాతో గడిపిన ఆ అరగంటా బ్రతికినన్నాళ్ళు మరువలేని మధురస్మృతి. తర్వాత వారిని కలుస్తూ వారు తెనాలిలో నడిపిన పత్రికల గురించి రచయితలు చలం, భరద్వాజ, శారద, కొడవటిగంటి వారిని గురించి తెలుసుకునేవాడ్ని. చలం, శారదలతో నాకున్న పరిచయంతో వారిని గూర్చి కూడా ప్రత్యేకంగా కొన్ని విషయాలు తెలుసుకున్నాను. మిసిమిలో భారతంలోని పాత్రలైన కుంతీదేవి, కర్ణునిపై చక్కని విశ్లేషణలతో రచనలొచ్చాయి. అవి చదివి నా దగ్గరున్న ''భారతంలో సజీవ శిల్పాలు'' అనే పుస్తకాన్ని వారికందించాను. దాన్ని తిరగేస్తూ, సరైన సమయానికిచ్చారు. చదివిస్తానన్నారు. తిరిగి యివ్వవద్దు నా గుర్తుగా మీ వద్ద వుంచండంటూ వారిని ఒప్పించడానికి నానాయాతనలు పడ్డాను. చాలా మొహమాటం వారికి!

ఒకతూరి, మాటల సందర్భంలో, మిసిమిని చక్కని ఆర్టు పేపరు మీద, అందాలు చిందే రంగుల చిత్రాలతో, సుందరమైన ముద్రణతో, కనీసం కాగితం ధరన్నా గిట్టుబాటు కాకుండా ఎన్నాళ్ళిలా మాకందిస్తారు, కష్టంగదా అన్నాను. ఆయన దానికి సహజమైన మందహాసంతో, ''కొందరికి కొన్ని వ్యసనాలుంటాయి, నాకు పత్రికా నిర్వహణే వ్యసనం'' అన్నారు. ''అదీకాక కళాజ్యోతి అనే ముద్రణాలయాన్ని మా పిల్లలు చక్కగా నడుపుతున్నారు. మిసిమిని నాకు బహుమతిగా యిస్తున్నారు. ఇందులో లాభ నష్టాల మాట రాదం''టూ నా చెయ్యి తట్టారు. వారికి పత్రికలంటే వున్న మక్కువ అలాంటిది.

ఒక రైతు కుటుంబంలో పుట్టి, పెరిగి, దేశ స్వాతంత్ర్యానికి ముందే పత్రికా ప్రచురణకు పూనుకుని తెనాలి రంగంగా సాహితీ క్షేత్రంలోకి దిగి, ఆనాటికెవరూ తలవని కుటుంబ నియంత్రణ గురించి తన పత్రికలో ప్రచురించి ప్రభుత్వ కోపానికి గురయ్యారంటే, తాను నమ్మిన దాని కోసం వెనుదిరగని వారి పట్టుదల చెప్పుకోదగ్గది. సెక్స్‌ను బూతుగా చూసే రోజుల్లోనే ''హెవలాక్ ఎల్లీస్'' గ్రంథాన్ని అనువదించి ప్రచురించారు. అలాంటి సాహితీ కృషీవలుడు తెలుగు వారందరికీ గర్వకారణం.

మిసిమిని ఒక విలక్షణమైన పత్రికగా కేవలం కళ, సంస్కృతి, సాహిత్యం, మనో విజ్ఞాన రచనలతో తెలుగు వారికందించిన శ్రీ రవీంద్రనాథ్‌గారు నేను మరువలేని మహామనీషి. ఆయన ఎంత పొడగరో వారి మనస్సు అంత దొడ్డది. వారి మానస పుత్రిక మిసిమి శ్రీ బాపన్న, శ్రీ అన్నపరెడ్డి గార్ల సారథ్యంలో మరిన్ని కొత్త పుంతలు తొక్కుతూ మరింతగా తెలుగు వారిని అలరిస్తుందని ఆశిస్తూ శ్రీ రవీంద్రనాథ్‌గారికి నా అక్షర నీరాజనం అర్పిస్తున్నాను.

పెన్మెత్స హరిశ్చంద్రరాజు, హైదరాబాదు, తెలుగు సాహిత్యం;
తెలుగు నాటకాభిమాని, వృత్తిరీత్యా మెకానికల్ ఇంజనీర్

రవీంద్రనాథ్‌గారి సోదరుడు, సోదరీమణులు

రవీంద్రనాథ్‌గారి కోడళ్ళు, కొడుకులు, కుమార్తె మరియు మనుమలు మనుమరాండ్రు

He believed in the dictum that everyone was as competent or even more than himself, in the magic of what he used to call "a magic processes of yellow matter".

RAVINDRANATH ALAPATI

N.K. Acharya

Ravindranath was a welcome visitor and a heart warming host. Though, our acquaintance with each only was mainly professional, that subject rarely entered the matters of discussion. He lived in a world totally detached and his mind was always revetted on what he was instantly reading, heard or observed. He enjoyed the world around him. Science and Philosophy occupied the whole mind of Ravindranath. He was concerned about human achievements and not with foibles. He loved astronomy and hated astrology. He admired the moon landings and the physical determination and endurance of the heros who scaled up the Everest heights. He detested wars. He hoped for piece and harmony of human race. Ravindranath is an Voracious reader and believed in transmission of knowledge. That is why, he was a journalist. Printing was a mere avocation for him. The rest of what all he had done was his mission.

Whomsoever he meets, he comes with a proposition about a well-known rationalist author or something about a story about the paintings. Why Wangough painted a girl reaching adolescence and why the tails of horses strong and wavy are left half done leaving, the rest to the imagination making the whole picture a composite piece. Were matters he would raise and discuss. He could recount the whole strong behind each and every painting. He was as much a home with Western Classical painters as with Damerla Rama Rao and Ravi Varma. It is the common experience of everyone visiting him at his office, find Ravindranath glancing through colourful magazines of International repute than scanning the proofs roled out in his press.

Ravindranath was always found in the company of his friends and relatives. Himself making a substantial contribution to the issues under debate he was very receptive and patient to anything the others may say. He believed in the dictum that everyone was as competent or even more than himself, in the magic of what he used to call "a magic processes of yellow matter".

I rarely found him disturbed notwithstanding the several tragedies he suffered.

In the later part of his life, we were visiting bazars, shops and exhibitions of books, art and Sculpture and purchasing novelties and heritage pieces. We were attending the special shows of foreign films. He was thinking of the permanence of the institutions he has founded and was particularly anxious of finding usefulness for the huge and valuable library he has build up. We were discussing about the errors committed by several persons who failed to institutionalise their enterprises. He was thinking of the grandchildren and of the gifts he would like to present them to make the festivals brighter and merrier Perhaps, the happiest moment observed in him was the day when the library authority agreed to build a wing in the name of his wife Smt. Kalavati in the fist floor library to be established by it at Tenali. The Library Authority agreed also to receive and preserve for reading public his personal library comprising of over thousand volumes. For him, it was also a matter of extreme gratification and a fulfilment of his mission when a foundation was created at the library to celebrate Ravindranath day, a function dedicated to literacy programmes and honouring contemporary intellectuals every year. Kalajyothi Process Limited, the MISIMI and the library typically represent the whole of Ravindranath who nestles constantly in our minds, tall and graceful, dressed in fine Pondur Khaddar.

యన్. కె. ఆచార్య, హైదరాబాదు, 'ఇండియన్ రేషనలిస్ట్ మంత్లీ' పత్రిక ఎడిటర్.
ప్రస్తుతం అడ్వొకేట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు.

మిసిమి
జనవరి 1996
వెల. 6/-
మాస పత్రిక

రవీంద్రనాథ్ తన అర్ధాంగి స్వర్గీయ కళావతి పేర తాను ప్రేమించే తెనాలి పట్టణంలో ఏదైనా సత్కార్యం చేయ సంకల్పించారు. మిత్రులు డాక్టర్ వెలగా వెంకటప్పయ్యగారితో సంప్రదించారు. తత్ఫలితంగా కళావతిగారి ప్రథమ వర్ధంతి రోజున ఆలపాటి కళావతీ రవీంద్ర పీఠం తెనాలి శాఖా గ్రంథాలయంలో వెలసింది. రవీంద్రనాథ్‌గారు తన సంతుగా భూరివిరాళం అందించారు. విద్యార్థులకు - ముఖ్యంగా పోటీ పరీక్షలకు వెళ్లే యువ కుల కోసం ఈ పీఠం విధి నుంచి ఎప్పటికప్పుడు కొత్త పుస్తకాలను కొనుగోలు చేసి ఉపయోగంలోకి తేవడంవలన యువతకు మహోపకారం జరిగింది. ప్రైవేటుగా పరీక్షలు రాసేవారికి ఈ పీఠం ఒక కల్ప వృక్షం...

యువతరానికి వరం
ఆలపాటి కళావతీరవీంద్ర పీఠం

డాక్టర్ వెలగా వెంకటప్పయ్య

పౌర గ్రంథాలయ ప్రయోజనం ఒకో దేశంలో ఒకో తీరుగా ఉంటూ వచ్చింది. రాచరిక యుగంలో గ్రంథాలయం రాజులు, రాణులు, జమీందారులకు ఆడంబర చిహ్నంగా ఉండేది. అది కోటలో ఒక భాగంగా ఉండేది. సామాన్యులకు అందు ప్రవేశం ఉండేది కాదు. నవీన యుగంలో గ్రంథాలయం - గ్రంథాలయోద్యమం జాతీయోద్యమంలో భాగంగా పని చేశాయి. స్వాతంత్ర సమరానికి తోడ్పడే గ్రంథాలు, పత్రికలు ఆనాడుండేవి. నాటి గ్రంథాలయ కార్యకర్తల లక్ష్యం స్వాతంత్ర్య సాధన గనుక గ్రంథాలయాలు ఆ దిశలో పని చేయడం తప్పనిసరి. పైగా ఆనాడు గ్రంథాలయాలు స్వావలంబనతో పని చేశాయి.

జాతీయ పునర్నిర్మాణ పాత్ర

స్వాతంత్ర్యం సిద్ధించాక పౌర గ్రంథాలయం జాతీయ పునర్నిర్మాణానికి కృషి చేయాలి, దేశ ఆర్థిక, సాంఘిక ప్రగతికి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలి. ఈ దశలో గ్రంథాలయ రంగం చట్టపరంగా ప్రభుత్వ అధీనంలోకి వచ్చింది. ప్రభుత్వానికి పౌరగ్రంథాలయ విధానం లేకపోవడం గాని, గ్రంథాలయ కార్యకర్తలకు ఈ దిశలో ఆలోచించే అవకాశం, ఓపిక లేకపోవడం చేత గాని పౌర గ్రంథాలయాన్ని స్వతంత్ర భారతావని ఉపయోగించ వలసిన రీతిలో ఉపయోగించలేదు. మనం ఉపయోగించుకోనూలేదు, గ్రంథాలయం అంటే కాలక్షేపం కోసం పనికివచ్చే పుస్తకాలు, పత్రికలు చదువుకొనే కేంద్రం అని అనుకోవడం ఒక దుర్భ్రమ.

గ్రంథాలయం బడిలో చదువు

ఆలపాటి రవీంద్రనాథ్‌గారు పెద్దగా సాంప్రదాయిక విద్య నేర్చుకోలేదు. గోవాడ గ్రామంలో 1918లో తన తండ్రి వెంకటకృష్ణయ్యగారు, మరో ఇద్దరు పెద్దలతో స్థాపించిన రాజరాజ నరేంద్ర గ్రంథాలయం అనే బడిలో రవీంద్రనాథ్‌గారు ఎక్కువగా చదువుకున్నారు. నాడు సామాన్య ప్రజానీకం చైతన్యానికి తోడ్పడిన కృష్ణా పత్రికకు తన తండ్రిగారు చందా చెల్లించేవారు. వారు చదివాక గ్రంథాలయానికి పంపేవారు. ఈ పత్రిక వారిలో చదివే అలవాటు పెంచింది. ప్రతిదీ తనదైన శైలిలో ఆలోచించే విధానం పెంచింది. నిరంతర పఠనం, ఆలోచన రవీంద్రనాథ్ గారిని నూతన వ్యక్తిగా మలిచాయి. మకాం తెనాలి మార్చారు. జ్యోతి, రేరాణి, సినీమా మొదలైన పత్రికలు ప్రారంభించి యువతరాన్ని ఉత్తేజపరచారు.

ఆవిధంగా రవీంద్రనాథ్‌గారు తెనాలిలో దాదాపు 20 సంవత్సరాలున్నారు. తదుపరి మకాం హైదరబాద్‌కు మార్చి ముద్రణా రంగంలో ప్రవేశించారు. అనతి కాలంలోనే హైదరాబాదు అగ్రశ్రేణి ముద్రాపకులలో ఒకరుగా నిలిచారు.

కళావతీ స్మృతి

అనారోగ్యంతో బాధపడుతున్న వారి ధర్మపత్ని శ్రీమతి కళావతి 1993 ఫిబ్రవరి 4వ తేదీ కన్నుమూశారు. తాను ప్రేమించే తెనాలి పట్టణంలో వారి ప్రగతికి కారణమైన కళావతిగారి పేర ఏదైనా సత్కార్యం చేయాలని తలపెట్టారు. తనకు చిరకాల మిత్రుడైన డాక్టర్ వెలగా

వెంకటప్పయ్యగారిని సంప్రదించారు. ఈ సంప్రదింపు ఫలితం - కళావతిగారి ప్రథమ వర్ధంతి రోజున ఆలపాటి కళావతీ రవీంద్రపీఠం, తెనాలి శాఖా గ్రంథాలయంలో వెలసింది. ఇందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ అనుమతి లభించింది. ఈ పీఠం నెలకొల్పేందుకు రవీంద్రనాథ్‌గారు పెద్ద మొత్తంలో విరాళం అందించారు. ఈ సత్కార్యానికి సహకారంగా పట్టణ ప్రముఖులు మరికొంత చేర్చారు. మూలనిధిపై వచ్చే వడ్డీతో ఈ పీఠంలో పలు కార్యక్రమాలు జరుగుతాయి. ఈ పీఠ ఉద్దేశాలు ఇలా ఉంటాయి.

1. పోటీ పరీక్షలకు గ్రంథాలు, వివిధ పరీక్షలకు పాఠ్యగ్రంథాలు, ప్రశ్నాపత్రాల సేకరణ,
2. ఆధునిక విజ్ఞాన విషయాలపై ఉపన్యాసాలు, చర్చలు, గోష్ఠుల నిర్వహణ.
3. తెనాలిలో ప్రముఖుల, వర్ధంతులు, జయంతుల నిర్వహణ

ఇంతటి ఉదాత్త ఆశయాలతో ఈ పీఠం వెంకటగిరికి చెందిన డాక్టర్ వెలుగోటి సాయికృష్ణ యాచేంద్రగారి సంగీత అవధానంతో ప్రారంభమైనది. దరిమిలా గత ఆరేళ్ళ కాలంలో ఆయా రంగాలలో నిష్ణాతులైన ప్రముఖులు ప్రసంగించి, తెనాలి ప్రజలు చాలా విషయాలు తెలుసుకునే అవకాశం కల్పించారు. వివిధ కార్యక్రమాలలో పాల్గొన్న ఈ దశాబ్ది ప్రముఖుల పేర్లను పరిశీలిస్తే ఎంత ఉన్నత స్థాయిలో కార్యక్రమాలు జరిగాయో ఊహించవచ్చు.

1. శ్రీ అట్లూరి వెంకటేశ్వరరావు, మాజీ ఛైర్మన్, ఆల్విన్
2. శ్రీ అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎడిటర్, మిసిమి మాసపత్రిక
3. శ్రీ అమళ్ళదిన్నె గోపీనాథ్, హాస్యభారతి, అనంతపురం
4. జస్టిస్ ఆవుల సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ మాజీ లోకాయుక్త
5. డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, మానసిక వైద్య నిపుణులు, రచయిత
6. ప్రొఫెసర్ కాట్రగడ్డ శారద, ఆంధ్రా యూనివర్శిటీ
7. శ్రీ కాళీపట్నం రామారావు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
8. శ్రీ కె. శివారెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
9. డాక్టర్ శ్రీమతి కొత్త లక్ష్మీ రఘురామయ్య, మహిళా ఉద్యమనేత, సంఘ సేవకురాలు
10. ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి, మాజీ వైస్ ఛైర్మన్, యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్
11. డాక్టర్ కొల్లి శారద, మేయర్, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్
12. డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్, లోక్‌సత్తా
13. డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి, బ్రౌన్ గ్రంథాలయం, కడప
14. డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం, హైదరాబాదు యూనివర్సిటీ
15. శ్రీ జి. మార్కండేయ, ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్

16. డాక్టరు దాశరథి రంగాచార్య, ప్రసిద్ధ సాహిత్యవేత్త
17. ప్రొఫెసర్ పి. ఆదేశ్వరరావు, ఆంధ్రా యూనివర్శిటీ
18. ప్రొఫెసర్ పి. ఎస్. శాస్త్రి, నాగపూర్ యూనివర్శిటీ
19. డాక్టర్ పి. లక్ష్మణరావు, ప్రముఖ హృద్రోగ నిపుణులు, గుంటూరు
20. శ్రీ పి. రాజగోపాలనాయుడు, ఛైర్మన్, వినయాశ్రమం ట్రస్ట్‌బోర్డు
21. డాక్టర్ పి. సత్యనారాయణ, ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్శిటీ
22. శ్రీ మధురాంతకం రాజారామ్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
23. డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, యం.పి.
24. వెంకటాచలం
25. డాక్టర్ రావూరి భరద్వాజ, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీత
26. డాక్టర్ రేవూరి అనంతపద్మనాభరావు, స్టేషన్ డైరెక్టర్, ఆకాశవాణి, విజయవాడ
27. డాక్టర్ వి. చంద్రశేఖరరావు, డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ
28. శ్రీ వి. తిలైనాయగమ్, మాజీ డైరెక్టర్, పౌర గ్రంథాలయ శాఖ, తమిళనాడు
29. డాక్టర్ వి.వి.ఎల్. నరసింహారావు, మాజీ రీజనల్ డైరెక్టర్, ఓపెన్ స్కూల్సు
30. డాక్టర్ వెలుగోటి సాయికృష్ణ యాచేంద్ర, వెంకటగిరి
31. ప్రొఫెసర్ సి.వి. రాఘవులు, నాగార్జున యూనివర్శిటీ
32. డాక్టర్ సంజీవదేవ్, సుప్రసిద్ధ చిత్రకళా విమర్శకులు
33. డాక్టర్ సూర్యదేవర రవికుమార్, పశువైద్య నిపుణులు
34. శ్రీ హితశ్రీ, ప్రసిద్ధ కథా రచయిత
35. ప్రొఫెసర్ హెచ్. ఎ. ఖాన్, మైసూర్ యూనివర్శిటీ

యువతకు మహోపకారం

ప్రముఖులచే ఉపన్యాసాల ఏర్పాటు ఒక ఎత్తయితే, విద్యార్థులకు ముఖ్యంగా పోటీ పరీక్షలకు వెళ్ళే యువకుల కోసం ఈ పీఠం నిధి నుంచి ఎప్పటికప్పుడు కొత్త పుస్తకాలను కొనుగోలు చేసి ఉపయోగంలోకి తేవడం వలన యువతకు మహోపకారం జరిగింది. గత ఆరేళ్ళ కాలంలో ఎందరో యువకులు పోటీ పరీక్షలలో నెగ్గి, ఉపాధి సంపాదించు కున్నారు. ప్రయివేటుగా పరీక్షలు రాసేవారికి ఈ పీఠం ఒక కల్పవృక్షంగా తోడ్పడుతూంది. ఆయా విషయాలపై ఇంతగా అధునాతన గ్రంథాలు, సమాచారం పై తాజా గ్రంథాలు గల గ్రంథాలయం మరొకటి లేదేమో! పాఠకుడు కోరిన గ్రంథాన్ని అప్పటికప్పుడు చదువరికి అందించే సౌకర్యం మన రాష్ట్రంలో ఎక్కడా లేకపోవచ్చు. గత పదేళ్ళుగా రాష్ట్రంలో గల పౌర గ్రంథాలయాలు కొత్త పుస్తకాల సరఫరా సరిగా లేక అలమటించాయి. ఈ పరిస్థితిలో ఆలపాటి కళావతీ రవీంద్రపీఠ సౌజన్యంతో తెనాలి

శాఖా గ్రంథాలయం పలు ప్రామాణిక గ్రంథాలను సేకరించింది. దీనికి తోడు కళాజ్యోతి ప్రాసెస్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి బాపన్నగారు విలువైన కొత్త పుస్తకాలు, ముఖ్యంగా పోటీ పరీక్షల గ్రంథాలు తరచు పంపుతూ ఈ పీఠం సేవలను సద్వినియోగానికి ఎంతగానో దోహదం చేస్తున్నారు. వీరి సాయానికి తెనాలి యువతీ యువకులు కృతజ్ఞులై ఉన్నారు.

యునెస్కో తన పౌర గ్రంథాలయ మానిఫెస్టో (1994)లో పౌరగ్రంథాలయం విద్యకు, సమాచారానికి, సంస్కృతికి తోడ్పడాలని తెలియజేసింది. భారతదేశం యునెస్కోలో సభ్యదేశం కనుక మనకు మానిఫెస్టో అమలు పరచవలసిన బాధ్యత ఉంది. దేశంలోగల ప్రముఖ గ్రంథాలయలెన్నో ఈ విషయాన్ని పట్టించుకోకపోయినా, తెనాలి శాఖా గ్రంథాలయం ఈ మూడు రంగాలకు ఇతోధిక ప్రాముఖ్యాన్ని ఇస్తున్నది. ఇందుకు కారణం ఆలపాటి కళావతీ రవీంద్రపీఠం; అంతేగాక రవీంద్రనాథ్‌గారి కుటుంబ సభ్యుల అండదండలే కారణం అని చెప్పక తప్పదు.

డాక్టర్ వెలగా వెంకటప్పయ్య, తెనాలి, గ్రంథాలయోద్యమనేత, జిల్లా గ్రంథాలయాధికారిగా రిటైర్ అయ్యారు. ఫౌండేషన్ ఫర్ ఇన్‌ఫర్‌మేషన్ అండ్ కమ్యూనికేషన్ సంస్థకు అధ్యక్షులు.

ఆలపాటి కళావతీ రవీంద్రపీఠం, తెనాలిలో

1967లో సదరన్ లాంగ్వేజెస్ బుక్ ట్రస్టువారు ఏర్పాటు చేసిన బుక్ ప్రొడక్షన్ సెమినార్‌లో...

ఇప్పుడున్న సగటు పత్రికలు ఆయన ఆలోచనా చట్రంలో ఇమడ లేదు. ఏదో చేయాలనే తపన ఆయనలో కనిపించేది. ఆ ఆలోచనా పరిణామమే 'మిసిమి' పత్రికా ప్రచురణ. 'మిసిమి' ఆయన అధ్యయన శీలానికి మేత వేసింది. సంపాదకుడుగా, ప్రచురణ కర్తగా సరికొత్త సంతృప్తి కాంతిగా ప్రసరించింది.

కళ-జీవితం మేళవింపు-రవీంద్రనాథ్

☆

వెనిగళ్ల వెంకటరత్నం

'రవీంద్రనాథ్' పేరులోని మాధుర్యం, తన్మయతలకు తగినట్లే ఆలపాటివారిది నిండైన అందం, స్వరూపంలో గాంభీర్యం, విజ్ఞానంలో జిజ్ఞాస అభిప్రాయంలో దృఢత్వం కలబోసిన విలక్షణ వ్యక్తిత్వంతో ఉండేవారు. లోతైన ఆలోచన, అభివ్యక్తిత్వంలో స్వతంత్రత, విషయ విశ్లేషణలో నిశితత్వం, అన్వేషణలో ప్రశ్నా పరంపర ఆయన స్వభావ సిద్ధంగా అలవర్చుకొన్న గుణాలు. అవే ఆయనకు జీవితాంతం వెన్నంటి ఉన్న వరాలు. అతి సన్నిహితులు తప్ప అర్థం చేసుకోలేని వ్యక్తిత్వం ఆయనది. సాహిత్యం, లలిత కళలు, చరిత్ర, తత్వశాస్త్రం, మనోవిజ్ఞానాది విభిన్న రంగాలలో లోతైన అధ్యయనం కలిగిన వ్యక్తి రవీంద్రనాథ్.

తాను గ్రహించిన వాటిలో ఉత్తమమైన అంశాన్ని పదుగురి దృష్టిలోకి తేవాలనే తపన ఆయన్ని పత్రికా సంపాదకుడిని చేసింది. ''పేరుకే నేను ఎడిటర్ని, వాస్తవంలో పాఠకుడిని మాత్రమే'' అని 1947లో తెలుగులో వేళ్ళమీద లెక్కించదగినన్ని పత్రికలు మాత్రమే ఉన్న రోజుల్లో, కళ, సాంస్కృతిక రంగాలకు నెలవయిన తెనాలి నుండి 'జ్యోతి', 'రేరాణి', 'సినీమా' పత్రికలు నడిపిన వ్యక్తి ఇలా అన్నారంటే ''నేను వృత్తి రీత్యా జర్నలిస్టును కాను'' అని చెప్పటమే. 1990లో తమ నాల్గవ పత్రిక 'మిసిమి' ప్రారంభంతో-ఒకే వ్యక్తి తన జీవిత కాలంలో నాలుగు పత్రికలను ఎడిట్ చేసి, ప్రచురణ కూడా తనే చేపట్టిన వ్యక్తిగా సరికొత్త రికార్డు నెలకొల్పారు.

'జ్యోతి'లో తమ కథ ప్రచురితం కావడం గౌరవప్రద విషయంగా, ఘనంగా చెప్పుకొనే వారు ఆనాటి సుప్రసిద్ధ రచయితలు కొడవటిగంటి కుటుంబరావు, గోపీచంద్, చలంలాంటి హేమా హేమీలు. ఈనాటి 'మిసిమి' సంగతి సరే సరి. 'హిందూ' వంటి అగ్రశ్రేణి ఆంగ్ల దిన పత్రిక ప్రశంసలకే పాత్రమైన అత్యంతాధునిక పత్రిక అది.

1990లో 'మిసిమి' ప్రారంభించింది లగాయితు సర్వస్వం మిసిమే అయింది రవీంద్రనాథ్‌కి. అన్ని పత్రికల్లాగ కథలు, కవిత్వం లేకుండా సైకాలజీ, చరిత్ర, తత్వశాస్త్రం, లలిత కళలతో మిసిమిని నింపేవారు. ఆచార్య సచ్చిదానందమూర్తి, బి.ఎస్.ఎల్. హనుమంతరావు, సంజీవదేవ్, ఆర్. ఎస్. సుదర్శనం, పురాణం, రవిచంద్, ఎన్.వి. బ్రహ్మం, రావిపూడి వెంకటాద్రి, చేకూరి రామారావు లాంటి చేయి తిరిగిన రచయితలెందరో 'మిసిమి'లో రచనలు చేశారు. 'మిసిమి' - మేధావుల పత్రిక అనేది వాడుక అయిపోయింది. సంజీవదేవ్‌ని ఒక మిత్రుడు మీరేం చేస్తున్నారిప్పుడంటే - 'మిసిమి'కి రచనలుచేస్తున్నానని అన్నారట. గురజాడవారి 'మధురవాణి' విలేకరిగా పురాణం సుబ్రహ్మణ్యశర్మ దాదాపు రెండు సంవత్సరాలు నడిపించిన 'ఊహాజనిత ఇంటర్వ్యూ' మిసిమికి హైలైట్ అని చెప్పొచ్చు. గుఱ్ఱాన్ని నేర్పుగా నడిపించగల రౌతు రవీంద్రనాథ్. లేకపోతే పురాణం వారి కలం నుంచి మధురవాణి ఇంటర్వ్యూలు అంతచక్కగా పదుగురూ మెచ్చుకొనేలాగా వచ్చేవికావు. 'మధురవాణి' ప్రశ్నలు మేధావులను సయితం ఉక్కిరి బిక్కిరి చేసేవి. ఆమె ప్రశ్నలు బాణాల్లా గుండెల్లో గుచ్చుకొనేవి. ఈ బాణాలను మధురవాణి సృష్టికర్త గురజాడ వారుకూడా తప్పించుకోలేక పోయేవారు. మధురవాణి వాత పడ్డవారిలో కందుకూరి విరేశలింగం, కట్టమంచి రామలింగారెడ్డి, చలం, శ్రీశ్రీ, త్రిపురనేని, విశ్వనాథ సత్యన్నారాయణ, నార్ల - ఇలా ఎంతోమంది

గుట్టుని రట్టు చేసింది. ఆ మహామహుల్లోని చీకటి కోణాలను ఎత్తి చూపింది. మిసిమిలో వ్యాసాలకు దీటుగా అట్టమీద చిత్రాలుండేవి. 'మిసిమి'లో వ్యాపార ప్రకటనలకు తలొగ్గక రాజారవివర్మ, పికాసో, దామెర్ల రామారావు, సంజీవదేవ్, అడవి బాపిరాజు, కొండపల్లి శేషగిరిరావు, ఆలే లక్ష్మణ్ లాంటి వారి చిత్రాలతో పాటు పాశ్చాత్యుల చిత్రాలతో 'మిసిమి'ని పట్టుకొంటే మాసిపోయేటట్లు అలంకరించేవారు.

1947 ప్రాంతంలోనే పత్రికా రంగంలో ప్రయోగాలు చేశారు రవీంద్రనాథ్. ఆకాశవాణి కార్యక్రమాల రివ్యూలు 'జ్యోతి' పత్రికతోనే ప్రారంభమయ్యాయి. 'మృచ్ఛకటికం' రేడియో నాటికనూ, 'జనగణమణ' లో స్వర దోషాలను ఎత్తి చూపుతూ కొప్పరపు సుబ్బారావు గారు రాసిన రివ్యూ వ్యాసం అప్పటి సమాచారశాఖా మంత్రి దివాకర్ గారి దృష్టికి వెళ్ళింది. ఆయన విజయవాడ వచ్చినపుడు రవీంద్రనాథ్‌గార్ని రేడియో స్టేషన్‌కి పిలిపించి అభినందించారట. 1948లో ఎం.ఎన్. రాయ్ సతీమణి ఎలెన్‌రాయ్ కుటుంబ నియంత్రణ ఆవశ్యకతను నొక్కిచెపుతూ రాసిన వ్యాసాన్ని ప్రచురించి నందుకు రవీంద్రనాథ్‌గారి మీద అప్పటి ప్రభుత్వం ప్రాసిక్యూషన్ నడిపింది. 'రేరాణి'లో అచ్చుయిన భరద్వాజ గారి కథ 'అలవాటైన ప్రాణం' మీద పోలీసులు కేసు పెట్టగా అయిదు వందల జుల్మానాగాని, ఆరు నెలలు జైలు శిక్షగాని అనుభవించాలని మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. అయిదు వందలు రవీంద్రనాథ్‌గారు చెల్లించి భరద్వాజ గారికి శిక్ష పడకుండా కాపాడారు. 'రేరాణి' ద్వారా 'లైంగిక విజ్ఞానాన్ని' తొలిసారి విపులంగా, సరళంగా పరిచయం చేసింది రవీంద్రనాథ్‌గారే! 'రేరాణి' అట్టమీద చిత్రాలు మల్టీకలర్‌లో యాభై సంవత్సరాల క్రితం అచ్చుయినవి చూస్తూంటే, ఇప్పటి ఆధునిక ప్రింటింగ్‌కి దీటుగా కనుపిస్తాయి.

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ సి. నారాయణారెడ్డి గారు రవీంద్రనాథ్ గారు మంచి స్నేహితులు. సినారే గారికి రవీంద్రనాథ్‌గారిపై గొప్ప అభిప్రాయం వుంది. ఆయన మాటల్లో ''రవీంద్రనాథ్ వస్తుతః జిజ్ఞాసువు. మౌలిక సాహిత్య సమాలోచకుడు. కాకుంటే తన ప్రాథమిక దశలోనే డాక్టర్ జి.వి. కృష్ణరావు గారి ''కావ్యజగత్తు'' లాంటి గొప్ప విమర్శక గ్రంథానికి కృతిభర్త ఎలా అవుతారు? అలవోకగా పుస్తకాలు చదివే అలవాటు ఆయనకు ఉండేది కాదు. నేర్చుకో తగిన విషయం ఉన్న పుస్తకం అయితేనే ఆయన ఒడిలోకి చొచ్చుకు పోయేది.

ఇప్పుడున్న సగటు పత్రికలు ఆయన ఆలోచనా చట్రంలో ఇమడ లేదు. ఏదో చేయాలనే తపన ఆయనలో కనిపించేది. ఆ ఆలోచనా పరిణామమే 'మిసిమి' పత్రికా ప్రచురణ. 'మిసిమి' ఆయన అధ్యయన శీలానికి మేత వేసింది. సంపాదకుడుగా, ప్రచురణ కర్తగా సరికొత్త సంతృప్తి కాంతిగా ప్రసరించింది.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ చీఫ్‌జస్టిస్ ఆవుల సాంబశివరావు గారూ రవీంద్రనాథ్ గారూ మంచి మిత్రులు. ఇద్దరి మీద ఎం.ఎన్. రాయ్ ప్రభావం ఆరోజుల్లోనే పడింది. ఇద్దరూ వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన వారే, వారిమాటల్లో ''ఆలపాటి మొదట్నుంచి జిజ్ఞాసాపరుడు. యవ్వన ప్రాయంనుంచి ఆయన నాకు తెల్సు. తాను చదువుకొన్నది కొద్దే అయినా, గ్రంథ పఠనంతో

విజ్ఞానాన్ని సంపాదించాడు. పట్టుదలతో మనిషి ఏదయినా సాధించగలడనే దానికి ఆయన జీవితం ఒక గొప్ప నిదర్శనం. పి.హెచ్‌డీలు సంపాదించలేని విజ్ఞానాన్ని ఆయన సంపాదించాడు. తాను సొంతంగా చదివిందీ, పరిశీలించిన పదిమందికీ పంచాలని పత్రికలు స్థాపించి విజయవంతంగా నడిపాడు. ఆయన విజ్ఞాన ప్రియుడు. ఆ విజ్ఞానం కాలేజీలలో, యూనివర్సిటీలలో చదివి నేర్చుకొన్నది కాదు. విజ్ఞానం అందరికీ పంచిననాడే, అది అందరి జీవితాల్లో పాదుకొన్ననాడే ప్రగతి, అభివృద్ధి సుసాధ్యమని ఆయన నమ్మకం. అందుకోసమే ఆయన పత్రికలు నడిపాడు.''

మంచి పుస్తకాలు చదవటం, మంచి స్నేహాలు పెంపొందించుకోవటం, మంచి భోజనం తినటం ఆయనకు ప్రియమైన విషయాలు. ఎవర్నీ నొప్పించకుండా మాట్లాడటం ఆయన అలవర్చుకొన్న సుగుణం. అనుకోని విధంగా ఎవరితో నయినా ఏ మాత్రం పరుషంగా మాట్లాడినా తర్వాత ఎంతో బాధ పడే వారు. ఎవర్నీ విమర్శించే వారు కాదు. ఎవరి పాపాన వాళ్ళు పోతారు అనేది ఆయన ఊత పదం. తనకు అయిష్టమైన అంశాల్ని ఎవరైనా చర్చిస్తుంటే సైగలతోనే వారించేవాడు. ఆయన డబ్బుమనిషి కాడు. ఎప్పుడు ఎంత సంపాదించాడో, దేనికి ఎంత ఖర్చు పెట్టాడో లెక్కలేదు. అధికారులూ, పలుకు బడిగల రాజకీయ నాయకులు అనేక మంది ఆయనకు సన్నిహిత మిత్రులే అయినప్పటికీ 'మిసిమి'కి అడ్వర్టయిజుమెంట్ల కోసం ఏనాడూ ఎవరినీ అడగలేదు. అసలు అడ్వర్టయిజుమెంట్లు పత్రిక అందాన్ని పాడు చేస్తాయని ఆయన అనుకొనే వాడు. చివరి రోజుల్లో మాత్రమే, అదయినా ఇతరుల వత్తిడివలన 'మిసిమి'లో అడ్వర్టయిజు మెంటు కనుపించ నారంభించాయి.

★ ★ ★

రవీంద్రనాథ్‌గారితో నా బంధం విడతీయ లేనిది. నా హైస్కూలు విద్యాభ్యాసం, రవీంద్రనాథ్ గారి స్వగ్రామమయిన గోవాడలో జరగటమే కాకుండా నా డిగ్రీ చదువు పూర్తయ్యే దాకా ఆ ఊళ్ళో ఉండటం వలన నా చిన్నప్పట్నుంచి రవీంద్రనాథ్‌గార్ని అడపాదడపా గోవాడ వొచ్చినపుడు చూస్తుండేవాడ్ని. తెనాలి కాలేజిలో చదువుతున్నపుడు 'జ్యోతి' ప్రెస్ యజమానిగా ముఖద్వారంలో ఆసీనులయిన రవీంద్రనాథ్‌గార్ని చూట్టం జరిగేది గాని మాట్లాడాలంటే భయం. ఆరోజుల్లో ఆయనతో మాట్లాడే ధైర్యం నాకే కాదు గోవాడలో అనేక మంది పెద్ద వాళ్ళు గూడా ధైర్యం చేసే వాళ్ళు కాదు. కారణం - ఆగ్రామంలో వీరిది సంపన్న కుటుంబమే కాక రవీంద్రనాథ్‌గారు తమ గంభీర వదనంతో ఠీవిగా ఉండేవారు.

నేను హైదరాబాదు వచ్చాక అప్పుడప్పుడూ కలవటం జరిగినా మాయిద్దరి మధ్యా సాన్నిహిత్యం చెప్పుకో దగిన స్థాయిలో పెరగలేదు. 1975లో ఇన్నయ్యగారూ, నేనూ ఇంకొంతమంది మిత్రులు కలసి నిర్వహించి నెలనెలా ఉపన్యాస కార్యక్రమాలకూ, సంజీవదేవ్ హైదరాబాద్ వచ్చినపుడు ఏర్పాటు చేసిన మిత్రుల సమావేశాలకు ఆయన తప్పక వొచ్చేవారు. ఏ ఉపన్యాస కార్యక్రమానికి వెళ్ళినా 'వెనకవరస'లో కూర్చోవటమే ఆయన అలవాటు. చివరి ఏడెనిమిది సంవత్సరాలలో మా సాన్నిహిత్యం పెరిగి నెలలో రెండు మూడు సార్లు వారి ఇంటివద్దే కల్సుకునే వాళ్ళం. ఆ

సమావేశాల్లో నాతోపాటు మరి కొందరు మిత్రులూ ఉండేవారు. ఆయన చదివిన పుస్తకాల మీద, సాహిత్య విషయాల మీద సంభాషణ సాగేది. ఫోను చేస్తే ముక్తాయింపుగా కాకుండా ఏదో విషయం మీద చాలా సేపు ఆత్మీయంగా మాట్లాడే వారు. ఇంకా కొద్ది రోజుల్లో చనిపోతారనగా ఆయన సోమయ్యగారూ మా ఆఫీసుకొచ్చారు. రవీంద్రనాథ్‌గారు కార్లో కూర్చొని ఉండగా సోమయ్యగారు నాదగ్గర కొచ్చి విషయం చెప్పారు. నేను ఆయన్ని చూట్టానికి కారుదగ్గర కొచ్చాను. అప్పటికే వారి ఆరోగ్యం క్షీణించగా ఏవో మందులు వాడుతున్నారు. ''మీలో మార్పు కనిపిస్తోంది. ఆరోగ్యం బాగాలేదా'' అంటే - ''అబ్బే అదేం లేదు బాగానే ఉన్నా''న్నారు. ఆ తర్వాత మేం ముగ్గురుం కల్సి సికింద్రాబాద్ క్లబ్‌కెళ్ళి టిఫిన్సు తిన్నాం. (అప్పుడు మద్యనిషేధం అమలులో ఉంది.) మేం తిన్నాక మరో మూడు ప్యాకెట్లు ఆర్డరిచ్చి మా యిద్దరికీ చెరొకటిచ్చి- తీసుకెళ్ళండి ఇంటి దగ్గర పిల్లలున్నారుగా అన్నారు. వయసులో మాయిద్దరికీ తండ్రీ కొడుకులతేడా ఉన్నా ఎంతో సమాదరణ చూపేవారు. ఎక్కువగా నేను రవీంద్రనాథ్‌గార్ని వారియింటి వద్ద కలుస్తుండటం వలన - ఒకసారి 'మీరే ఎప్పుడూ శ్రమ తీసుకొని మాయింటి కొస్తున్నారు. నేనూ మీ యింటి కొస్తానని - దసరా పండగ రోజున కారు డ్రైవరు రాకపోవటంతో వారి చిన్నబ్బాయి సత్యదేవ్‌తో మా యింటికొచ్చి మా కుటుంబ సభ్యులతో కులాసాగ కబుర్లు చెప్పారు. మా అమ్మాయిలిద్దరికీ చెరొక మిసిమి కాపీ ఇంపోర్టెడ్ లక్స్ సబ్బులూ యిచ్చారు.

ఒకరోజు ఆఫీసు పనిలో ఉండగానే రవీంద్రనాథ్ గార్ని మెడిసిటీ హాస్పటల్లో చేర్పించినట్లు, పరిస్థితి బాగా లేదనీ 'కళాజ్యోతి' ప్రెస్ నుంచి ఫోనొచ్చింది. వెంటనే హాస్పటల్ కెళ్ళాను. ఎమర్జన్సీ వార్డులో కృత్రిమశ్వాసతో మృత్యువుతో పోరాడుతున్నారు. డాక్టర్ సోమరాజు గారు పరీక్ష చెయ్యటానికొచ్చి - ఇంకా ఎక్కువ సేపు ఉండరు- అందరికీ కబురంపండని చెప్పారు. ఆ మాటలు నన్ను నిశ్చేష్టుడ్ని చేశాయి. నా కళ్ల ముందే ఆయన తుది శ్వాస విడిచారు. బంగారు ఛాయలో ఉండే ఆయన శరీరం చివరిరోజుల్లో రంగు మారటం వలన ఏదో పై పూతలు పూస్తుండే వారు. ఒకసారి నేను వారింట్లో ఉండగానే వాళ్ళమ్మాయి దుర్గ నాన్న గార్ని చూట్టానికొచ్చింది. నేనామెను లోపలికి ఆహ్వానిస్తూ తలుపు తీయ బోతుండగా 'అమ్మాయిని తర్వాత రమ్మనండి' అని చెప్పారు. నలగని పువ్వులా కనిపించే విగ్రహం, ఒక్కసారిగా వికృతాకారం దాల్చటంవలన, ఆ రూపంలో కుటుంబ సభ్యులకు సైతం కనిపించటానికి యిష్ట పడక అలా చెప్పించారు. అంతటి సౌందర్య పిపాసి ఆయన.

ఆయనతో నా జ్ఞాపకాలు అందమైన అలలు !

వెనిగళ్ళ వెంకటరత్నం, హైదరాబాద్, సాహిత్యాభిమాని, ఉత్తమ పాఠకుడు, అనేక వ్యాసాలు రాశారు, రవీంద్రనాథ్‌కు తొలినుండి అభిమాని, ఇద్దరూ సన్నిహితులు.

జిజ్ఞాసువుల పత్రిక

'మిసిమి' జిజ్ఞాసువుల పత్రిక. పరిశోధకుల వేదిక. మానవీయతకది భూమిక. 'మిసిమి' తొలి సంచిక నుండి చదివాక దాన్ని గురించి నాకు కలిగిన అభిప్రాయమిది. చదివేవారి ఆసక్తిని రేకెత్తించేవి అందులోని వ్యాసాలు. చదువరి ఆలోచనలకు పదును పెడుతుంది ప్రతి సంచిక. మేధావులు కూడా చాలామంది కొన్ని ఆలోచనా రీతులకు కట్టుబడి వుంటున్నారు. కొత్తభావాల యెడ విముఖంగా ఉంటున్నారు. అయితే మానవ శాస్త్రాలు, భౌతికశాస్త్రాలు ఏనాటి కానాడు, సరికొత్త సమాచారాలను అందిస్తున్నాయి. ఇది పరిశోధనా యుగం. మూల విశ్వాసాలనే పునాదుల నుండీ పరిశీలించి, వాటి ఆమోద యోగ్యతను పరీక్షి స్తున్నాయి ఈనాటి పరిశోధనలు. సరికొత్త వెలుగులలో, గూడుకట్టుకొన్న నమ్మకాలు సంశయాత్మకంగా కనిపిస్తున్నాయి. మానవుని భావనా స్వేచ్ఛను పెంచు తున్నాయి పరిశోధనలు. 'మిసిమి'లోని దాదాపు అన్ని వ్యాసాలూ పరిశీలన, పరిశోధనా పత్రాలే. భావ ప్రదీపకాలే. అందుకనే అది జిజ్ఞాసువుల పత్రిక అయింది. పరిశోధకుల వేదికగా రూపొందింది. పాఠకుల్లో స్వతంత్రంగా ఆలోచింపజేసే సాధనం అయింది. మానవ వ్యక్తిత్వానికి పునాది స్వతంత్ర ఆలోచనా పటిమే కదా !

అందమైన ఆకృతి, స్ఫూర్తిదాయకమైన వ్యాసావళి, 'మిసిమి' పేరును సార్థకం చేస్తున్నాయి.

– జస్టిస్ ఆవుల సాంబశివరావు

ఆనాడు గుంటూరు జిల్లాలో చాలా గ్రామాలలో హైస్కూళ్లు వెలిశాయంటే పి.వి. కృష్ణయ్య చౌదరి చలవే. కావూరులోని 'చౌదరి హైస్కూలు' తుమ్మల సుబ్బారావు, రవీంద్రనాథ్‌గార్లు చేసిన ఉపకారానికి మాసిపోని గుర్తుగా భాసిస్తూనే వుంటుంది. లోకానికి కనుపిస్తున్న ఆయన వదనం, అవగతమైన ఆయన హృదయం వేరు. నాకు కన్పించింది వేరు! జీవిత సంధ్యలో హృదయానికి తీవ్ర ఆఘాతాలు తగిలాయి. ఎదిగిన కుమారులిద్దరు పోయారు. తనువున తనువై, మనమున మనసై తోడై నీడై మసలిన మా పిన్ని కళావతి అంతర్ధానమైంది. జీవితం కళ తప్పినట్లయింది. ఆ బడబానలాన్ని ఆయన తన కడుపులో దాచుకున్నారు.

నాకు గోచరమైన చిన్నాన్న వదనం, హృదయం

☆

తుమ్మల వరప్రసాద్

బంధుత్వంరీత్యా రవీంద్రనాథ్‌గారు నాకు చిన్నాన్న అవుతారు. వయస్సులో ఆయన నాకన్నా షుమారు ఇరవయ్యేళ్ళు పెద్ద. అయినా మా ఇద్దరి మధ్య సాన్నిహిత్యం, చనువు, అనుబంధం ఎలా సంభవమైందో నేను విశ్లేషించి చెప్పలేను. అది మా చిన్నాన్నగారిలోని గొప్ప తనం.

వయస్సులో అంతరం, ప్రవృత్తి, సంస్కారం, అభిప్రాయాలలో భేదాలు వ్యక్తుల మధ్య సన్నిహితత్వానికి, పరస్పరం గౌరవం ఇచ్చి పుచ్చుకోవడానికి, ఆత్మీయతకు అడ్డు కావన్నది రవీంద్ర చిన్నాన్నకు, నాకు మధ్యగల ఇంటిమేట్ సంబంధాలే నిదర్శనం. నేను పెరిగి కాస్త పెద్దవాడినయ్యాక చిన్నాన్నగారిని అప్పుడప్పుడూ కలుస్తుండేవాడిని. ఆయన అభిరుచులు, వ్యాసంగంవేరు. నాకు ఆయన మాదిరిగా సాహిత్యాభిరుచి, తత్వచింతన వగైరాలు లేవు. రాజకీయాలవేపు నేను ఆకర్షితుణ్ణయ్యాను. నా ఇరవై రెండో యేటే పల్లపట్ల పంచాయతీ సమితికి ఉపాధ్యక్షుడినయ్యాను. కీ॥ శే॥ వెనిగళ్ళ సత్యనారాయణరావుగారు నాకు గురుతుల్యులు. రవీంద్రనాథ్ చిన్నాన్న గారి రాజకీయ వాసనలు వేరు. ఎమ్. ఎన్. రాయ్ రాడికల్ హ్యూమనిస్టు ఉద్యమం పట్ల ఆయనకు అభిమానం వుండేది. ఆ సిద్ధాంతాల మీద ఆయునకు విశ్వాసం వుండేది. అయినప్పటికీ ఆయున క్రియాశీలరాజకీయాల జోలికి పోలేదు. ఇవన్నీ ఆయన గురించి నేను విన్నవి మాత్రమే.

చిన్నాన్నగారికి సంబంధించిన నా చిన్న నాటి జ్ఞాపకం ఒక్కటే. ఆయన మా ఊరు కావూరు వస్తున్నారంటే ఊళ్లో కలకలం, ఉత్కంఠ. పది - పదిహేనుమంది యువకులు ఆయనని చూడాలని తహతహలాడేవారు. ఆయన మద్రాసు వెళ్లివస్తుంటారని, అక్కడ చాలామంది పెద్దపెద్దవాళ్లు ముఖ్యంగా బెజవాడ గోపాలరెడ్డిగారు ఆయునకు బాగా తెలుసుననీ వాళ్లు విని వుండడం అందుక్కారణం. పైపెచ్చు, ఆయన అందమైన విగ్రహం మరో ఆకర్షణ. చక్కని ఒడ్డూ - పొడవు, మేలిమి బంగారంలాంటి మేనిఛాయ, తెల్లని పొందూరు ఖాదీ ధోవతి, లాల్చీ, చేతిలో మూడయిదుల సిగరెట్ టిన్ను - ఊళ్లోవాళ్లకి ఆయనను చూడాలి చూడాలి అనిపించడంలో ఆశ్చర్యం లేదు.

మా ఊరు ఆయనని జ్ఞాపకం చేసుకునే మరో అంశం కూడా వుంది. 1945-46 దాకా కావూరులో హైస్కూలులేదు. గుంటూరు జిల్లాలోని చాలా ఊళ్లలో ఆనాడు స్కూళ్ళు ఉండేవి కావు. మా ప్రాంతానికి సంబంధించినంతవరకు తురుమెళ్లలోని కింగ్ జార్జి కారొనేషన్ హైస్కూలు ఒక్కటే చుట్టుపక్కల గ్రామాలలోని విద్యార్థులందరికీ చదువుల చలివేంద్ర. రవీంద్రనాథ్ చిన్నాన్న గారే గోవాడలో హైస్కూలు లేక తురిమెళ్ల హైస్కూలులో కొంతకాలం చదువుకున్నారని తెలిసిందే. స్వాతంత్ర్యం రావటానికి కొద్ది సంవత్సరాల ముందు పాములపాటి వెంకటకృష్ణయ్య చౌదరిగారు గుంటూరు డిస్ట్రిక్ట్‌బోర్డు ఛైర్మన్‌గా వుండేవారు. ఆయనతో రవీంద్రనాథ్ చిన్నాన్నకు గాఢ పరిచయం వుండేది. తుమ్మల సుబ్బారావుగారు, చిన్నాన్నగారు పాములపాటి వెంకట కృష్ణయ్య చౌదరిగారిని కలిసి, వారిని ఒప్పించి మా ఊరు కావూరులో హైస్కూలు పెట్టించారు. ఆనాడు గుంటూరు జిల్లాలో చాలా గ్రామాలలో హైస్కూళ్లు వెలిశాయంటే పి.వి. కృష్ణయ్య

చౌదరి చలవే. కావూరులోని 'చౌదరి హైస్కూలు' తుమ్మల సుబ్బారావు, రవీంద్రనాథ్‌గార్ల చేసిన ఉపకారానికి మాసిపోని గుర్తుగా భాసిస్తూనే వుంటుంది.

నా చిన్నప్పుడు చిన్నాన్నగారిని కలిసి మాట్లాడాలంటే భయంగా వుండేది. ఆయన పర్సనాలిటీ అలాంటిది. 1970 కల్లా వెనకటి భయ సంకోచాలు పోయాయి. హైదరాబాదు వచ్చినప్పుడల్లా ఆయనను కలుసుకునేవాడిని అరమరికలు లేకుండా మాట్లాడుకునేవాళ్లం. ఆయన ఆప్యాయతతో నేను మరింత దగ్గరయ్యాను. కుటుంబ విషయాలు, సమస్యలు అంతరంగికంగా చర్చించేస్థాయి చనువు మా మధ్య వృద్ధి అయింది. చెల్లాయి దుర్గ వివాహ విషయంలో రవీంద్రనాథ్ చిన్నాన్నగారితో కొంత ఎక్కువ చనువే తీసుకున్నాను. మా బావమరది చౌదరికి దుర్గను ఇస్తే బాగుంటుందని సూచించాను. ఎందుకంటే చౌదరి అమెరికాలో చదువుకున్నాడు. కట్నకానుకలకు సంబంధించి సమస్య లేదు. చిన్నాన్నగారా - తెనాలిలో చేసిన 'సాహసం' ఫలితంగా ఆర్థికంగా కొంత నష్టపోయారు. హైదరాబాదులో పెట్టిన ప్రెస్ ఇంకా చాలా అభివృద్ధి కావాల్సి వుంది. ఈ కారణంగా ఆయనకు వెసులుబాటుగా వుంటుందని దుర్గ వివాహ ప్రస్తావన చేశాను. 'ఇంకా చిన్నపిల్ల, ఇప్పుడే పెళ్లేమిటి?' అని నా సూచనను వ్యతిరేకించారు. ఆయన అభిప్రాయం తప్పని అనను గాని అప్పటి పరిస్థితుల్లో నా ప్రతిపాదన in family interest సబబని నేను భావించాను. గట్టిగా వాదించాను. ఎట్టకేలకు ఆయన నా వాదనలోని సహేతుకతను గుర్తించారు. అంగీకారం తెల్పారు. దుర్గ వివాహం జరిగింది. వెంకట్, దేవేంద్రల వివాహ విషయంలో కూడా నేను కలగజేసుకున్నాను. ఆయన అభ్యంతరాలు సకారణం కాదని వాదించాను. చిట్టచివరకాయన దిగివచ్చారు. నిర్విఘ్నంగా వివాహాలు జరిగాయి. ఇంకా ఇలాంటివే కొన్ని కుటుంబ సమస్యలపై చిన్నాన్నగారితో వాదప్రతివాదాలకు దిగాల్సి వచ్చింది. ఆయనను ఒప్పించే సరికి తలప్రాణం తోకకు వచ్చిన సందర్భాలున్నాయి. అప్పుడనిపించింది - లోకానికి కనిపిస్తున్న ఆయన వదనం, అవగతమైన ఆయన హృదయం వేరు. నాకు కన్పించింది వేరు! జీవిత సంధ్యలో హృదయానికి తీవ్ర ఆఘాతాలు తగిలాయి. ఎదిగిన కుమారులిద్దరు పోయారు. తనువున తనువై, మనసున మనసై తోడై నీడై మసలిన మా పిన్ని కళావతి అంతర్ధానమైంది. జీవితం కళ తప్పినట్లయింది. ఆ బడబానలాన్ని ఆయన తన కడుపులో దాచుకున్నారు. బహిఃప్రాణం అనుకున్న మిత్రుల దగ్గర కూడా ఆయన బైట పడలేదు. సాయంత్రాలు సన్మిత్ర సంభాషణం, పానగోష్ఠులతో దొర్లిపోయాయి. 'మిసిమి' ఆయన 'ఆల్టర్ ఈగో' అయ్యింది. ఆ వ్యాసంగంలో తన మానసిక వ్యథను మర్చిపోయే ప్రయత్నం చేశారు.

బిడ్డలందర్లో బాపన్న అంటేనే ఆయనకు ఎక్కువ ఇష్టం. అతనిమీదే ఆయనకు ఎక్కువ విశ్వాసం. వ్యాపార నిర్వహణలో అతడి దీక్షా దక్షతలపైన ఆయన నమ్మకం అటువంటిది. ఆయన నమ్మకం వమ్ముకాలేదు. కళాజ్యోతి ప్రాసెస్ ఎలా కళకళలాడుతున్నదీ చూస్తున్నదే. తను చాలాకాలంగా వాడుతున్న చిన్న కారును తప్పించి బాపన్న కాంటెస్సా కారు కొనిపెట్టి, సొంతంగా డ్రైవ్ చేయడం మాన్పించి డ్రైవరును పెట్టాడని చిన్నాన్నగారు నా దగ్గర అభినందన పూర్వకంగా చెప్పారు.

ఆయనకు పట్టుదల ఎక్కువ. కోరినవి వండి వడ్డించే కోడళ్లు వున్నా, వంటావిడను ఏర్పాటు చేసుకుని వండించుకొని తినేవారు. వంట మనిషి లేనప్పుడు క్యారియర్ తెప్పించుకొని తిన్న సందర్భాలున్నాయి. మొదట్లో కుమార్తె దుర్గ వండి పంపించిన భోజనం స్వీకరించినా తరువాత తరువాత అదీ నిరాకరించారు. కళావతి పిన్ని పోయాక ఒంటరితనం దుస్సహమైంది. ఒకనాడు ఉల్లాసపర్చిన వేవీ ఆయనకు ఓదార్పు నివ్వలేక పోయాయేమో! జాతస్య మరణం ధ్రువమ్! అని నన్ను నేను ఓదార్చుకున్నాను.

తుమ్మల వరప్రసాద్, కావూరు, రవీంద్రనాథ్ గారికి సమీప బంధువు, సన్నిహితుడు. హైదరాబాదులో కాంట్రాక్టరుగా సెటిలయ్యారు

సంస్మరణ సభలో డాక్టర్ జయప్రకాశ్ నారాయణ, డాక్టర్ సి. నారాయణ రెడ్డి, ఇతరులు

నాకు యిప్పటికీ తెనాలి గాంధీచౌక్‌లో చూచిన రవీంద్రనాథ్‌గారు, తరువాత దగ్గర దగ్గర **50** సంవత్సరాల తరువాత సీఫెల్ గ్రంథాలయంలో చూసిన రవీంద్రనాథ్‌గారి రూపం నా హృదయ కుహరంలో పదిలం. వీటిని నేను తియ్యలేను, మరెవ్వరికి యివ్వలేను. అవి నాలోనే వుంటాయి, నాతోనే అంతరిస్తాయి.

తొణకని నిండుకుండ

☆

యల్. యస్. రామయ్య

మాస పత్రిక

మార్చి - 1999
వెల - రూ॥ 8/-

మాది పొంచాలవరం. రవీంద్రనాథ్‌గారు పుట్టిన వూరు గోవాడ, మా ప్రక్కవూరు. మా ప్రాంతంలో గోవాడకొక ప్రత్యేకత వున్నది. గోవాడ, 'గోవులవాడ'. గోవాడలో శివరాత్రి తిరునాళ్ళు, ఎడ్ల పందాలు ప్రతి సంవత్సరం చాల హంగామాగా జరిగేవి. గోవాడలో ఆలపాటివారు కొద్ది మందే వున్నా, చాల పలుకుబడిగలవారు. నా చిన్నతనంలో గోవాడ తిరునాళ్ళకు వెళ్ళుతూ రవీంద్రనాథ్‌గారి తండ్రిని, వారి యింటిని చూసే భాగ్యం కలిగింది. అలాగే గోవాడలో పావులూరి వెంకయ్యగారి ధర్మంతో, ఆలపాటి వెంకట్రామయ్యగారి ప్రోత్సాహంతో ఏర్పడిన గ్రంథాలయం అందరికి తెలిసిందే. ఆ గ్రంథాలయం ఎందరికో చదువుకోటానికి ప్రోత్సాహం యిచ్చింది. గోవాడ రాజకీయంగా కూడా స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుండి ముందున్న గ్రామం. ఈ గ్రామం ప్రొ॥ యన్. జి. రంగాగారికి పెట్టనికోట. ఇలాంటి గ్రామంలో రవీంద్రనాథ్‌గారు పుట్టారు. ఆ వాతావరణం వారి మీద బాగా వున్నది. నాకన్నా రవీంద్రనాథ్‌గారు పదిహేను సంవత్సరాలు పెద్దవారైనప్పటికి వారిని గోవాడలో కలవటం తటస్థపడలేదు. కాని వారిని గురించి చాలా విన్నాను.

రవీంద్రనాథ్‌గారిని నేను మొట్టమొదటి సారి తెనాలి కాలేజీలో ఇంటర్ చదువుతుండగా చూశాను. మా తెలుగు లెక్చరరు జి.వి. కృష్ణరావుగారు. వారప్పటికే లబ్ద ప్రతిష్ఠులు, వారితో రవీంద్రనాథ్‌గార్ని తెనాలి గాంధీచౌక్‌లో చూడటం జరిగింది. మనిషి పచ్చని ఛాయ. యువకుడు. చాల వుత్సాహంగా నవ్వుతూ వున్నారు. అప్పటికే రవీంద్రనాథ్‌గారు ప్రచురిస్తున్న 'రేరాణి' కుర్రాళ్ళ కందరికీ పరిచయం. అందువలన వారిని చూసిన మొదటి చూపులోనే ఆయనొక 'రొమాంటిక్' అని అనిపించింది. చదువుకొనే చాలామంది విద్యార్థులు 'రేరాణి' ఏదో పచ్చి సెక్సు పత్రికనీ చదవరాదనీ అనుకొనేవారు. కాని చాటుచాటుగా చదువుకునేవారు.

తరువాత నేను బందరు నేషనల్ కాలేజిలో బి.ఏ. చదవటానికి వెళ్లాను. అక్కడ నాస్నేహితుడు, సహ విద్యార్థి అయిన తూమాటి రమణయ్యగారితో పరిచయం జరిగింది. ఆయన అప్పటికే లోహియా సోషలిష్టు. ఆయన క్లాసు పుస్తకాలకన్నా దినపత్రికలు, మేగజైనులు చదవటం ఎక్కువ. ఆయన అప్పటికే కొల్లూరి కోటేశ్వరరావుగారు ప్రారంభించిన 'తెలుగు విద్యార్థి' పత్రిక ప్రచురణకు సహాయకారిగా వుండేవారు. ఆయన మా గదికి తెస్తున్న 'జ్యోతి', 'సినీమా', 'రేరాణి' పత్రికలను నేను కూడా చదువుచుండేవాడిని. ఈ పత్రికలు తక్కిన పత్రికల కన్నా భిన్నంగా వుండేవి. మంచి కథలు వ్యాసాలు కూడా వుండేవి. అందువల్ల యీ పత్రికలు ఆలోచనాపరులను ఆకర్షించేయి. తెనాలి విడిచిపెట్టిన తరువాత నేను రవీంద్రనాథ్‌గార్ని చూడటం తటస్థించలేదు.

నేను తరువాత బెనారస్‌లో ఎం.ఏ. చదవటం, కొంతకాలం ఢిల్లీలో వుండటం, 1962లో హైదరాబాదు వచ్చి ఉద్యోగంలో చేరటం జరిగింది. కొంతకాలం స్టేట్ ఆర్కైవ్సులో, తరువాత 1974 నుండి 1998 వరకు సిఫెల్ (Central Institute of English and Foreign Languages) లైబ్రేరియన్‌గా పనిచేశాను. ఈ కాలంలో డాక్టరు ఇన్నయ్య గారితో పరిచయం, స్నేహం జరిగింది. వారు తరుచు మా గ్రంథాలయానికి వస్తూ వుండేవారు. వారు ఎప్పుడు

వచ్చినా ఆర్ట్స్ కాలేజి దాకా బస్సులో వచ్చి, మా ఆఫీసుకు నడుచుకుంటూ వచ్చేవారు. వారు 1992లో ఒకరోజున కారులో మరో వ్యక్తితో వచ్చి మా గ్రంథాలయం ముందు దిగారు. గ్రంథాలయానికి వచ్చినవారంతా నాగది విండో ద్వారా కనపడుతుంటారు. డాక్టరు ఇన్నయ్యగారి వెంటవున్న వ్యక్తి ఎవరా అని ఆలోచనలో పడ్డాను. ఆయన సన్నగా, పొడవుగా, తెల్లటి లాల్చి, పంచెలో పొందికగా, ఆకర్షవంతంగా వున్నారు.

డాక్టరు ఇన్నయ్యగారు రవీంద్రనాథ్ గార్ని పరిచయం చేశారు. దగ్గర దగ్గర ఏభై సంవత్సరాల తరువాత మళ్లీ చూడటం జరిగింది. ఎంతమార్పు! నేను ఒక్కతడవ తెనాలిలో గాంధీచౌక్‌లో జి.వి. కృష్ణరావుగారితో చూసిన రవీంధ్రనాథ్‌గారు, ఇప్పుడు డాక్టరు ఇన్నయ్యగారు పరిచయం చేస్తున్న రవీంద్రనాథ్‌గారు, రెండు రూపాలు నామనో ఫలకం మీద కదలాడాయి.

రవీంద్రనాథ్ అందగాడు. వయస్సువచ్చినప్పటికి ఆయనలోని అందం, ఆకర్షణ తగ్గలేదు. మితభాషి, ఆయన చెప్పదలచినది స్పష్టంగా, క్లుప్తంగా చెప్పటం ఆయన వ్యక్తిత్వం. నేను హిందీ రచయిత ప్రేమ్‌చంద్ ఫోటోలు చూశాను గాని, వ్యక్తిని చూడలేదు. రవీంద్రనాథ్ మీసకట్టుకు ప్రేమ్‌చంద్ మీసకట్టుతో ఏదో పోలిక వున్నది. 1992 లోనే ఆయన ముఖంలో కొంత ఆదుర్దా, అసంతృప్తి కనపడుతున్నాయి. ఆయన ఏదో తను చెయ్యవలసింది చెయ్యలేకపోతున్నానే అనే వేదన కమ్ముకొన్నట్టు అగుపించారు.

రవీంద్రనాథ్‌గారితో నా పరిచయం తరువాత మరికొంత పెరిగింది. వారు వంటరిగా తొమ్మిది, పది తడవలు మా గ్రంథాలయాన్ని సందర్శించారు. నాతో 'మిసిమి' గురించి చెప్పటం, తరువాత నేను సభ్యుడుగా చేరటం జరిగింది. వారికి పుస్తకాలంటే చాలా యిష్టం. వచ్చినప్పుడల్లా కొత్త పుస్తకాల గురించి కొత్త మేగజైన్సు గురించి అడుగుతుండేవారు. వారికి తత్వవేత్తలు, కళాకారులు, నోబెల్ గ్రహీతలైన రైటర్సు, సాంఘిక పరిణామాలు, మార్పులు, కళలన్నా చాలా యిష్టం. కొత్తగా వచ్చిన మేగజైన్ల డిజైన్సు, ప్రింటింగు గమనిస్తూ వుండేవారు.

రవీంద్రనాథ్‌గారు మా గ్రంథాలయంలో మంచి పుస్తకాలు వున్నాయి అని అంటూ వుండేవారు. పుస్తకాల గురించి చర్చించేవాళ్ళం. ఒక సందర్భంలో వారు అమెరికాలో గ్రంథాలయాలను గురించి చెపుతూ తాను 'ఎప్పుడు ఏ విధంగా చికాగో నుండి **Encyclopaedia of Social Sciences** తెప్పించిందీ చెప్పారు. ఆయన వద్ద వున్నది అరుదైన ఎడిషన్ అని, ఆ ఎడిషన్ పది వాల్యూమ్‌లలోనే వున్నదని చెప్పారు. తన దగ్గర వున్న గ్రంథాలన్నీ వారికి గుర్తే. అదే సమయంలో యీ **Encyclopaedia** అమ్మితే ఎలా వుంటుంది అని అడిగారు. ఎందుకమ్ముతారు అని అడిగితే, తాను యీ గ్రంథాన్ని వాడటం లేదని, యితరులకు ఎక్కువ ఉపయోగపడుతుంది కదా అని అన్నారు. అట్టి పరిస్థితిలో అమ్మటం ఎందుకండి, ఏదన్నా మంచి గ్రంథాలయానికి దానం చేయండని నేనటం జరిగింది. దానికి వారు సమ్మతిస్తూ, హైదరాబాదులో మంచి గ్రంథాలయాలు లేవని వాపోయారు.

మరొక సమయంలో వారింటి దగ్గరలో జూబ్లిహిల్స్ క్లబ్బులో వున్న గ్రంథాలయాన్ని గురించి చెప్పి, ఆ గ్రంథాలయాన్ని చూసి ఏ విధంగా దాన్ని తీర్చిదిద్దాలో సలహాలివ్వాల్సిందిగా కోరారు. ఈ విషయం గురించి డాక్టరు ఇన్నయ్యగారితో కూడా చెప్పించారు. గతంలో డాక్టరు ఇన్నయ్యగారి కోరిక మేరకు నార్ల వెంకటేశ్వరరావు గారి గ్రంథాలయం గురించి కూడా నేను ఒక రిపోర్టు యిచ్చివున్నాను. నార్ల వారి కలెక్షన్ చాలా విస్తృతమైనది. అలాంటి వ్యక్తిగతమైన కలెక్షన్ ఆంధ్రప్రదేశ్‌లో చాలా అరుదు. రవీంద్రనాథ్, ఇన్నయ్యగార్ల కోరిక మేరకు నేను జూబ్లిహిల్స్ క్లబ్బు గ్రంథాలయాన్ని పరిశీలించి తగు సూచనలు చేయుటం జరిగింది. దీనివలన రవీంద్రనాథ్‌గార్కి గ్రంథాలయాలంటే ఎంత యిష్టమో తెలుస్తుంది. వారు ప్రత్యేక శ్రద్ధ చూపించేవారు.

1995లో ఒకటి రెండు తడవలు కలిశాం. ఆ సందర్భంలో వారికి కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేటు యివ్వటం గురించి చెప్పటం, దానికి వారిని నేను అభినందించటం జరిగింది. అలాగే మేము డాక్టరు వెలగా వెంకటప్పయ్యగారి గౌరవార్థం ఒక పుస్తకం తెచ్చి, సిటి సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన సభకు విచ్చేయటం, వెలగావార్ని ఆప్యాయంగా అభినందించటం జరిగింది. చివరికి తన తరువాత 'మిసిమి' ఏమైపోతుందోనని భయపడుతుండేవారు. వారికి 'మిసిమి' అంటే అవ్యాజమైన ప్రేమ. అంతగా తన పిల్లలను కూడా ప్రేమించలేదేమో.

రవీంద్రనాథ్‌గారు ఒక మహావ్యక్తి, సహృదయుడు. వారి ద్వారా సహాయం పొందినవారు అనేకులు. వారిలో ఏదో సాధించాలనే తపన, సమాజంలో మార్పు రావాలన్న ఆసక్తి మిక్కుటంగా కన్పించేవి. వారి వ్యక్తిగత బాధలను గురించి ఎట్టి పరిస్థితుల్లోను ఎప్పుడు కూడా చెప్పేవారు కాదు. ఎవరన్నా ఆత్మీయులకు చెప్పుకొనే వారేమో తెలియదు. మనిషి గాంభీరంగా వుండి, తొణకని నిండు కుండలా వుండేవారు. తెల్లటి లాల్చి, యిస్త్రీ చెరగని తెల్లటి పంచెలో మనిషి పులుకడిగిన ముత్యంలా వుండేవారు.

నాకు యిప్పటికీ తెనాలి గాంధీచౌక్‌లో చూచిన రవీంద్రనాథ్‌గారు, తరువాత దగ్గర దగ్గర 50 సంవత్సరాల తరువాత సీఫెల్ గ్రంథాలయంలో చూసిన రవీంద్రనాథ్‌గారి రూపం నా హృదయ కుహరంలో పదిలం. వీటిని నేను తియ్యలేను, మరెవ్వరికి యివ్వలేను. అవి నాలోనే వుంటాయి, నాతోనే అంతరిస్తాయి.

యల్. యస్. రామయ్య, హైదరాబాద్, సీఫెల్ (సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్)లో లైబ్రేరియన్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు, సాహిత్యాభిమాని

హృదయ సౌందర్యం, బాహ్య సౌందర్యం రెండూ ఉన్న వ్యక్తులు చాలా అరుదు. ఈ మేలిమి కోవకు చెందిన వ్యక్తుల్లో రవీంద్రనాథ్‌గారు ఒకరు. నిండు విగ్రహం, పసిడి ఛాయ, వయస్సుతోపాటు పెరుగుతూ పోయిన విశాలమైన నుదురు, చక్కటి ముక్కు, గంభీరంగా కన్పించే ఆ ముఖ కవళికల్ని సెకన్లలో ఆహ్లాదంగా మార్చగలిగే అరుదైన చిరు నవ్వు ఆయన స్వంతాలు.

ఓ మహా మనీషి

☆

ఎస్పారె

మిసిమి

మాస పత్రిక

జులై, 1995

వెల రూ. 5/-

పరిచయాలు మానవుని అవసరాల ప్రతిఫలనాలు. ఒక్కొక్క అవసరం ఒక కొత్త పరిచయానికి దారితీస్తుంది; పాత పరిచయాలను బలోపేతం చేస్తుంది. కొన్ని పరిచయాలు అవసరాలను అధిగమించి ఆత్మీయతను పంచుకుంటాయి. కొన్ని పరిచయాలు అనుబంధాల్ని పెంచుకుంటాయి. కొన్ని బాంధవ్యాలను చుట్టు కుంటాయి. మానవజాతి సామాజిక ఉనికి ఈ అల్లికలతోనే ముడిపడి ఉంది.

నాకు వృత్తిరీత్యా భిన్న వ్యక్తులతో, వ్యక్తిత్వాలతో, హోదాలతో నా పరిచయాలు అనేకం. కొందరు పరిచయస్తుల పేర్లు కూడా గుర్తుండవు. కొందరి వ్యక్తిత్వంలోని విశిష్టత ఇట్టే ఆకట్టుకొని, ఆకర్షించి పరిచయాన్ని సాన్నిహిత్యం వైపు లాగేస్తుంది.

అలాంటి విలక్షణత ఉన్న వ్యక్తిత్వాలు బహు అరుదు. ఆ అరుదైన కోవకు చెందినవారు రవీంద్రనాథ్‌గారు.

మెరుగుపెడితే ఇత్తడి బంగారంలా మెరిసినా వాతావరణ పరిస్థితుల ప్రభావానికి లొంగి తన మెరుగును కోల్పోతుంది. కాని బంగారం ఎప్పుడూ తన కాంతిని కోల్పోదు. అలాగే భౌతికంగా హుందాగా కన్పించే వ్యక్తులు పెక్కుమంది తారసపడ్తారు. కాని హృదయ సౌందర్య లేమిని వారి సంభాషణ, వారి చేష్టలు ఇట్టే బయలు పరుస్తాయి. దాంతో ఆ వ్యక్తి బాహ్య సౌందర్యం వెలవెలబోతుంది. హృదయ సౌందర్యం, బాహ్య సౌందర్యం రెండూ ఉన్న వ్యక్తులు చాలా అరుదు. ఈ మేలిమి కోవకు చెందిన వ్యక్తుల్లో రవీంద్రనాథ్‌గారు ఒకరు. నిండు విగ్రహం, పసిడి ఛాయ, వయస్సుతోపాటు పెరుగుతూ పోయిన విశాలమైన నుదురు, చక్కటి ముక్కు, గంభీరంగా కన్పించే ఆ ముఖ కవళికల్ని సెకన్లలో ఆహ్లాదంగా మార్చగలిగే అరుదైన చిరు నవ్వు ఆయన స్వంతాలు. మితభాషి ఐనా అవసరాలకనుగుణంగా తూచి మాట్లాడటం ఆయనకు తెలియదు. మనస్ఫూర్తిగా ముచ్చటించటం ఆయన అలవాటు. స్పష్ట భావాభివ్యక్తి ఆయనకు యిష్టమైన సంభాషణా పద్ధతి. ఎదుటివాడు ఎంతటివాడైనా కల్పించుకొని కన్పించిన వారందరితో మాట్లాడే వ్యక్తిత్వం మాత్రం కాదు. స్వాభిమానానికి, అహంభావానికి తేడా గుర్తించగల్గే సునిశిత దృష్టి అందరికీ ఉండదు. అది గుర్తించి స్వాభిమానిని గౌరవించగల్గే సహృదయం ఆయనకుంది.

ఆయన అభిరుచుల పరిధి విశాలమైంది. పలువురు మేధావులతో సన్నిహిత సంబంధాలు ఆయనకుండేవి. Literature, Philosophy, Politics, Fine arts ఇత్యాది శాఖల్లో నిష్ణాతులైన వారెందరితోనో ఆయనకు పరిచయ సంబంధాలున్నా, తనకు నచ్చితే వయస్సు, హోదా, ఆర్థిక స్తోమతల తేడాలేమీ పట్టించుకోకుండా ఎదుటివాణ్ణి ఆప్యాయతతో పిల్చి, మనస్ఫూర్తిగా మాట్లాడగల్గే అరమరికలు లేని నిష్కల్మష హృదయం; యింకొకరి ఆమోదానికి ఎదురుచూడకుండా తన యిష్ట ప్రకారం మనస్సు ఆమోదించిందాన్ని చేయగల్గిన ఆత్మస్థైర్యం ఆయన విశేష లక్షణాలు.

అందుకేనేమో వయస్సులో చాలా చిన్న వాణ్ణయినా, ఆయనతో ఎందులోనూ సరితూగ లేకపోయినా నాతో ఎంతో సన్నిహితంగా మాట్లాడేవారు.

ఒక విషయంలో నేను మొహమాటాన్ని వ్యక్తం చేసినప్పుడు "To be humble is a nice quality. But you must be shrewd & assertive when the situation demands. And you have got a rightly balanced attitude. చెప్పదలచుకున్నది ప్రదర్శించుకోటానికి ప్రయత్నించకున్నా, చెప్పవలసి వస్తే నిర్మొహమాటంగా చెప్పగల్గడం a right thinking & straight forward personality లక్షణాలు. And that makes all the difference." అన్నారు. ఆయనతో మాట్లాడిన ప్రతిసారి ఒక గైడ్‌తో, ఫిలాసఫర్‌తో మాట్లాడిన అనుభూతి నాకు కలిగేది.

ఒక సందర్భంలో మాట్లాడుతూ ''కళ్ళు సినిమా చూశారా'' అని అడిగారు. చూడలేదని చెప్పాను. ''చూడండి చాలా బాగుంద''న్నారు.

అది నా మిత్రుడు ఎం. వి. రఘు డైరెక్ట్ చేసాడని తెలిపాను.

విప్పారిన ముఖంతో ''మీరెప్పుడైనా మీ మిత్రుణ్ణి కల్సినప్పుడు Congratulate him, he has done a good job" అన్నారు.

''మిత్రుడిప్పుడు అందుబాటులో లేడు. నా పరిధినిదాటి వెళ్ళాడు'' అన్నాను.

నా జవాబులో ఏదో అపశృతిని గమనించారు.

మెల్లిగా నవ్వారు.

''అలా మీరు ఊహించుకుంటున్నారు. అతను అందుబాటులో లేకపోవటానికి కారణం మీరనుకుంటున్నట్లు అతని సెలబ్రిటీ స్టేటస్ కారణం కాకపోవచ్చు. తమ స్వంత ఫ్యామిలీస్‌కే సమయం కేటాయించలేని ప్రొఫెషనల్స్ చాలామంది ఉన్నారు. They cannot help it. పరిస్థితుల్ని విస్మరించి మన ధోరణిలోనే ఆలోచించి ఓ నిర్ణయానికి రాకూడదు'' అంటూ నావైపు చూశారు.

''ఆ మాత్రం నేను ఆలోచించలేనా'' అన్న ఎక్స్‌ప్రెషన్ నాముఖంలో కన్పించకపోయినా ఆ భావాన్ని ఎక్కడి నుంచో పసిగట్టినట్లు ''అంటే ఈ విషయాలు మీకు తెలియనివికావు; సందర్భానుసారం ఎదుటివారు గుర్తు చెయ్యటం వల్ల దాని ప్రభావం మన ఆలోచనల మీద పడుతుంది.... అంతే'' అన్నారు.

రవీంద్రనాథ్‌గారు నిర్మొహమాటంగా, ఖచ్చితంగా తన అభిప్రాయాన్ని వెలిబుచ్చడంలో వెనుకాడరు. కాని దానివల్ల ఎదుటివాడికి ఏ మాత్రం ఇబ్బంది కల్గినా పసిగట్టగల్గే సునిశిత

దృష్టి, అలా జరిగిందనిపిస్తే సున్నితంగా దానికి సమాధానాన్ని జతపర్చగల్గే పరిజ్ఞానం ఆయన వ్యక్తిత్వపు అంతర్భాగాలు.

ఇంకో సందర్భంలో....

ఫస్ట్ ఫ్లోర్‌లో చిన్న క్యాబిన్ - నా వర్క్‌ప్లేస్. రవీంద్రనాథ్‌గారు అన్నిమెట్లు ఎక్కి నా దగ్గరకు వచ్చి ఎదురుగా కుర్చీలో కూర్చున్నారు.

''మీరు అంటూ...'' నేనేదో అనబోయాను. (ఫేషియల్ ఎక్స్‌ప్రెషన్స్‌ను ఇట్టే రీడ్ చెయ్యగల దృష్టి ఆయనకుందని మళ్ళీ చెప్పనక్కర్లేదు.)

చేత్తో "Be comfortable" అన్నట్లు సంజ్ఞ చేశారు. ఓ పేపరు కటింగ్ నా ముందుంచి ''ఎలా ఉందీ Photograph" అని అడిగారు.

''చాలా బావుంది'' మామూలుగా సమాధానం యిచ్చాను.

''మిసిమి కవర్ పేజీలో వేద్దామనుకుంటున్నాను. కాని ఇంతవరకు మిసిమి కవరుమీద రెప్యూటెడ్ ఆర్టిస్ట్‌ల పెయింటింగ్స్ మాత్రమే వేస్తూ వచ్చాము. ఈ ఫోటోను పెయింట్‌గా మార్చివేస్తే బావుంటుందనిపించింది. మీరు గుర్తుకొచ్చారు. ఇది మీచేత చేయించాలనిపించింది.'' అంటూ నాకళ్ళలోకి చూశారు.

చిరునవ్వుతో ''నామీద మీకున్న అభిమానానికి థాంక్స్, కాని దీనికోసం అన్నిమెట్లెక్కి మీరు పైకి రావాలా? ఫోన్ చేసినా, కబురు చేసినా నేను మిమ్మల్ని కల్సి ఉండేవాడిని'' అన్నాను.

''అది పద్ధతి కాదు'' అంటూ పెదవి దాటని చిరునవ్వును ప్రదర్శించి -

''నేను ఒక పనిని తీసుకొని మీ దగ్గరికి వచ్చాను. మీరు పది పనులు విడిచిపెట్టి నా దగ్గరకు రావలసి వచ్చేది.'' అంటూ మెల్లగా లేచి ఆ వెంటనే కొన్ని కుశల ప్రశ్నలు వేసి ''వచ్చే నెల కవర్‌మీద వేద్దామనుకున్నాను. Still, take your own time" అంటూ ఆయనతో పాటు లేచిన నాతో కరచాలనం చేసి మెల్లగా మెట్లవైపు నడిచారు.

ఆయన ఎప్రోచ్, ఆయన మాటల సౌమ్యత నామీద ఎలాంటి ప్రభావం చూపిందంటే చేతిలో ఉన్న పనులను ఆపలేకపోయినా ఆయన పనికోసం ఓ సమయాన్ని కేటాయించి అనుకున్న టైమ్ కన్నా ముందే పెయింటింగ్ చేసి అందివ్వగల్గాను. ''జామిట్రీన్స్'' అనే టైటిల్‌తో జులై 95 మిసిమి కవరుమీద అచ్చయ్యింది. పలువురు మేధావులు ఆయన గురించి రాసి వుంటారు. ఆయన చరిత్రను చాటిచెప్పే విషయాలు ఎందరి రచనల్లోనో చోటు చేసుకొని ఉంటాయి. కాని నాకు తెల్సిన రవీంద్రనాథ్‌గారు తొణకని నిండుకుండ. ఓ మహా మనీషి.

ఎస్పారె (రహమత్ అలీ), హైదరాబాద్, ప్రముఖ చిత్రకారుడు, కథా రచయిత

ప్రింటింగ్ బిజినెస్‌లో ఆయన ఆనాడు తెగ సంపాదించి వుండకపోవచ్చు. కాని ఆయన వ్యాపార దక్షత అమోఘం. ఆయన డబ్బు మనిషి కాదు. ఔదార్యం జాస్తి. మిత్రుల పనయితే, చాలా తగ్గించి తీసుకునేవారు. చిన్నా చితకా ప్రింటర్స్‌ని ఉదారంగా ఆదుకున్న సందర్భాలు నాకు చాలా తెలుసు. ఔదార్యం వారి రక్తంలో వుంది.

ఔదార్యశీలి

మురళి

షుమారుగా నాలుగు దశాబ్దాల నాటిది మా పరిచయం. 1963లో నాకు రవీంద్రనాథ్‌గారు పరిచయమైనప్పటికీ, పబ్లిషర్‌గా ఎరుగుదును, కాని ఆయన నన్నెరగరు. పరిచయం అయిన తరువాత మా మధ్య స్నేహం అల్లుకుపోయింది. ఆయన గొప్ప స్నేహశీలి, ఆర్ద్ర మనస్కుడు.

రవీంద్రనాథ్‌గారు నాకంటే 14 సంవత్సరాలు పెద్దవారు. అయినా నాతో చాలా ఆత్మీయంగా వుండేవారు. చనవుగా మెలిగేవారు. పదేళ్లపాటు దాదాపు ప్రతిరోజు నేను వారి ప్రెస్‌కు వెళ్లి కొద్దిసేపయినా మాట్లాడి వస్తుండేవాడ్ని. ఏ రోజైనా నేను వెళ్లకపోతే ఆయనకు తోచేది కాదు. వెంటనే నా కోసం ఆరా తీసేవారు. కబురంపేవారు.

ముద్రాపకుల సంక్షేమం ఆయనకు చాలా ముఖ్యం. చిన్న చిన్న ప్రింటర్లు టెండర్లు వేసేటప్పుడు తక్కువ రేటు కోట్ చేసి పోటీకి వచ్చిన సందర్భాల్లో ఆయన నన్ను వెంట బెట్టుకొని వారితో సమావేశమయ్యారు. అలా కోట్ చేయడం వల్ల కలిగే నష్టాన్ని వివరించి వారిని Convince చేసేవారు. వారికి వేరే చోట్ల వర్క్ లభించే అవకాశాలు కల్పించేవారు. చక్రపాణిగారు మద్రాసు నుంచి అడపదడప హైదరాబాదు వచ్చి ఓ వారం రోజులు గడిపి తిరిగి వెళ్లిపోయేవారు. నేను, రవీంద్రనాథ్‌గారు ఆయనను కలుసుకుని సమస్యలు చర్చించేవాళ్లం. రవీంద్రనాథ్‌గారు పుస్తక ప్రియుడు, సాహిత్యాభిరుచి కలిగినవాడు కావటం వల్ల చక్రపాణిగారితో సాహిత్యం, సినిమాలపై మాట్లాడేవారు. ప్రింటర్స్‌కి సంబంధించిన సమస్యలమీద సమావేశమవుతున్నామంటే, చక్రపాణిగారు హైదరాబాదులో వుంటే తప్పకుండా వచ్చేవారు. రవీంద్రనాథ్‌గారంటే ఆయనకు చాలా అభిమానం.

చక్రపాణిగారు, రవీంద్రనాథ్‌గారు ఇద్దరూ నిర్మొహమాటానికి పెట్టింది పేరు. వారి మధ్య ఒక తేడా వుంది. చక్రపాణిగారు కట్టె విరిచి పొయ్యిలో పెట్టినట్లుగా మాట్లాడేవారు. రవీంద్రనాథ్‌గారు చాలా మృదువుగా చెప్పేవారు. ఒక వాక్యంలో చెప్పాల్సింది పది వాక్యాలలో చెప్పేవారు. ఎదుటి వ్యక్తి ఎక్కడ నొచ్చుకుంటాడో అని ఆలోచించేవారు. పరుషంగా మాట్లాడ్డం ఆయన స్వభావానికే విరుద్ధం.

ప్రింటింగ్ బిజినెస్‌లో ఆయన ఆనాడు తెగ సంపాదించి వుండకపోవచ్చు. కాని ఆయన వ్యాపార దక్షత అమోఘం. ఆయన డబ్బు మనిషి కాదు. ఔదార్యం జాస్తి. మిత్రుల పనయితే, చాలా తగ్గించి తీసుకునేవారు. చిన్నా చితకా ప్రింటర్స్‌ని ఉదారంగా ఆదుకున్న సందర్భాలు నాకు చాలా తెలుసు. ఔదార్యం వారి రక్తంలో వుంది.

బడేసాబ్, సుధాకర్, రంగారావు, నేను రవీంద్రనాథ్‌గారితో చాలా చనవుగా వుండేవాళ్లం. కలిసి పార్టీలు చేసుకునేవాల్లం. కలిసి డిన్నర్లు ఆరగించేవాళ్లం. ఆయన నన్ను తన పిల్లల కన్నా ఎక్కువగా దగ్గరకు తీశారు. నా ఉన్నతిలో ఆయన పాత్ర వుంది. మిత్రులందరం కలిసి ఒకమాట అనుకున్నప్పుడు దానికి కట్టుబడి వుండాలనేది ఆయన Principle. అలా కలసి మెలసి వున్న మిత్రుల్లో ఒకరు ఏదో టెండర్ వేసే సందర్భంలో ఉమ్మడిగా అంగీకారానికొచ్చిన రేటును కాదని

ద్రోహబుద్ధితో తక్కువ రేటు కోట్ చేశాడు. రవీంద్రనాథ్‌గారు అలాంటి పెడపోకడని క్షమించేవారు కాదు. అంతిమంగా అతడు సకాలంలో పనిపూర్తి చేయలేకపోయాడు, నష్టాల పాలయ్యాడు, ప్రభుత్వం అతడిని బ్లాక్‌లిస్ట్ వేసింది. ఆవర్క్ మేమే పూర్తి చేశాం. ఎవడు తీసుకున్న గోతిలో వాడే పడతాడని ఆయన నమ్మిక. ఆయన తన ఆహారపుటలవాట్లలో ఎంత నియమబద్ధంగా వుండేవారో, వ్యాపార విషయాల్లో అంత సూత్రబద్ధంగా వుండేవారు.

ఆయన నుంచి నేను చాలా నేర్చుకున్నాను. ఆయన శీల, సంస్కారాల్ని ఒరవడిగా భావిస్తాను. ఆయనతో నేను గడిపిన రోజుల నాటి జ్ఞాపకాలు నాకెప్పటికీ అనిర్వచనీయ ఆనందానుభూతి కలిగిస్తాయి. స్ఫూర్తినిస్తాయి.

మురళి, హైదరాబాదు - చారి అండ్ కంపెనీ ముద్రణాలయ అధిపతి

జూన్ - 1999
వెల - రూ॥ 8/-

ముద్రాపకుల మధ్య సంఘీభావం పెరగాలి, నష్టకారకమైన పోటీ తగ్గాలి అన్నది రవీంద్రనాథ్ గారి ఆశయం. ప్రింటర్స్ అసోసియేషన్‌లో చేరారు. టెండరు వేసే విషయంలో ప్రింటర్ల మధ్య పరస్పరం గొంతులు కోసుకునే ప్రమాద కర ధోరణి నశించి ఉభయతారకంగా వుండే సహకార వైఖరి ఆకు తొడగాలని ఆయన భావించారు. ఆ దిశగా కృషి చేశారు. సఫలీకృతు లయ్యారు.

విశ్వదాభిరాముడు!

☆

బడేసాబ్

కొందరు వ్యక్తులతో కొద్దిపాటి పరిచయం కూడా గాఢమైన స్నేహంగా వర్ధిల్లి జీవితాంతం లతలా అల్లుకుపోతుంది. అలాంటి అతి కొద్దిమంది వ్యక్తుల్లో ఆలపాటి రవీంద్రనాథ్‌గారు ఒకరు.

ఆయన నాకు 1952లో మొట్టమొదటిసారి పరిచయమయ్యారు. ఆయన ప్రింటర్ మాత్రమే కాక, పబ్లిషర్ కూడా అయినందున D.P.I. (డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్) ఆఫీసుకు పనులమీద వచ్చిపోతుండేవారు. చందా నారాయణ శ్రేష్ఠిగారి ద్వారా రవీంద్రనాథ్‌గారిని ముఖాముఖి కలుసుకుని పరస్పరం మాట్లాడుకునే అవకాశం కలిగింది. ఆ రోజుల్లో నేను శివాజీ ప్రెస్ వర్కింగ్ పార్ట్‌నర్‌ని. రవీంద్రనాథ్‌గారు విక్టోరియా జీస్‌లో దిగేవారు. అదే తరువాత శ్రీ ఏసెస్‌గా ప్రఖ్యాతి పొందింది. చాలా కాలం కిందటే అదీ చాప చుట్టేసింది. రవీంద్రనాథ్‌గారికి ఇష్టమైన మరో హోటల్ White Hall. నాయుడుగారని ఆ హోటల్ ప్రొప్రయిటరు. నాకు రవీంద్రనాథ్‌గారి ద్వారా పరిచయమయ్యాడు. Text Books టైటిల్ పేజి, ఇన్నర్ టైటిల్ మార్చాల్సిన పనిపడ్డప్పుడల్లా వస్తుండేవారు. వారు కోరింది నేను చేసిపెట్టేవాణ్ణి. అప్పటికి ఆయన ఆల్ మకాం తెనాలే.

1957 లో ఆయన హైదరాబాదు వచ్చినప్పటి నుంచి మేమిద్దరం తరచు కలుసుకోవటంతో మా మధ్య దోస్తీ పెరిగింది. ముద్రాపకుల మధ్య సంఘీభావం పెరగాలి, నష్టకారకమైన పోటీ తగ్గాలి అన్నది రవీంద్రనాథ్‌గారి ఆశయం. ప్రింటర్స్ అసోసియేషన్‌లో చేరారు. టెండరు వేసే విషయంలో ప్రింటర్ల మధ్య పరస్పరం గొంతులు కోసుకునే ప్రమాదకర ధోరణి నశించి ఉభయతారకంగా వుండే సహకార వైఖరి ఆకు తొడగాలని ఆయన భావించారు. ఆ దిశగా కృషి చేశారు. సఫలీకృతులయ్యారు. ఆనాడు A.P. Text-Book Press అధిపతిగా ఉన్న నారాయణ రావుగారిని నేను, రవీంద్రనాథ్‌గారు, మురళిగారు కలిశాం. మా సమస్యలు చర్చించాం. చక్రపాణిగారి అబ్బాయి సుధాకర్‌గారు మాతో సన్నిహితంగా వుండేవారు. మేం నలుగురం తరచు కలుసుకుంటుండేవాళ్లం. ఫతే మైదాన్ క్లబ్‌కు రవీంద్రనాథ్‌గారు డిన్నరుకు ఆహ్వానించేవారు. చాలా సాయంత్రాలు సరదాగా గడిపేశాం. ఆయన సాన్నిధ్యంలో మాధుర్యం ఆస్వాదించాను కాబట్టే ఈ విశేషాలు చెప్పాల్సి వచ్చింది.

1969-70లో అని నాకు గుర్తు - కేరళలో Book Fair జరిగితే వెళ్లాం. సెమినార్‌కు హాజరయ్యాం. మురళిగారు కూడా మాతో కలిసి వచ్చారు. పుస్తకాలంటే ఆయనకెంత ప్రాణమో అప్పుడు ప్రత్యక్షంగా చూశాను. మళయాళ సాహిత్యం మనకన్నా చాలా పురోగమించిందని చెప్పారు. టి. శివశంకర పిళ్లై, చెమీన్ మొదలైనవారి నవలల పైన మాతో ముచ్చటించారు. తెలుగు మీడియంలో చదువుకున్నాను. ఉర్దూతో నా పరిచయం కొద్ది.

ఆంధ్రప్రదేశ్ మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్‌లో రవీంద్రనాథ్‌గారు క్రియాశీల పాత్ర నిర్వహించేవారు. ఆయన ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ముద్రాపకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. అసోసియేషన్ కింద లక్షల రూపాయల నిధి వుంది. దానికి సంబంధించిన ట్రస్టుకు ఆయనే చైర్మన్. వారు ఇప్పుడు లేకపోయినా ఇంకా దానికి ఛైర్మన్ వారే.

వీరిని గురించిన మధుర స్మృతులెన్నో, వారి కుమార్తె దుర్గ వివాహానికి విజయవాడ వెళ్లాం. మురళి బ్రదర్ మ్యారేజికి గుడివాడ వెళ్లాం. చిన్నబాబు పెళ్లి చూశాను. పప్పన్నం తిన్నాను. రవీంద్రనాథ్‌గారి మనవరాలి పెళ్లి కొండాపూరులో చాలావైభవోపేతంగా జరిగినప్పుడూ వెళ్లాను. ఆశీర్వదించి వచ్చాను. రవీంద్రనాథ్‌గారు లేని లోటు స్పష్టంగా కనిపించింది. వారు లేరే అని హృదయం మూలిగింది.

ఆయనను హాస్పిటల్‌లో చేర్చినప్పుడు నాకు ఎవ్వరూ చెప్పలేదు. మురళిగారికి తెలుసట! కాని ఆయన నాకు చెప్పలేదు. తీరా ఆయన పోయాక ఆ విషాద వార్తను వినాల్సి వచ్చింది. అంతిమ దినాలలో ఆయనను చూడలేక పోయానే అన్నబాధ ఎప్పుడూ నామనస్సులో కలుక్కుమంటూనే వుంటుంది.

రవీంద్రనాథ్‌గారి కన్నా మిన్నగా నేను ప్రేమించిన మిత్రుడు వేరొకరు లేరు. సాయంత్రాలు సరదాగా దొర్లించేప్పుడు, ఒక వూపులో ఆయన వల్లించిన వేమన శతకంలోని పద్యం గుర్తుకొచ్చి నవ్వుకుంటూ వుంటాను. ''చెప్పులోని రాయి, చెవిలోని జోరీగ, కాలిలోని ముల్లు, కంటిలోని నలుసు'' అంటూ విశ్వదాభిరామ వినురవేమతో ముగించేవారు. ఆ పద్యమే ఎందుకు చదివేవారో నాకు తెలియదుగాని రవీంద్రనాథ్‌గారు మాత్రం ఆయన మిత్రులకు విశ్వదాభిరాముడే.

బడేసాబ్, హైదరాబాదు - లోగడ శివాజీ ప్రెస్ వర్కింగ్ పార్ట్‌నర్ - ప్రస్తుతం సికింద్రాబాద్‌లో సొంత ప్రెస్ నిర్వహిస్తున్నారు.

పెద్దయ్యగారు దొడ్డ మనిషి

– గాదే ఈశ్వరరావు (బైండర్)

ఇప్పటికి 42 సంవత్సరాల నాటి మాట. జ్యోతి ప్రెస్ ముషీరాబాదులోని గోల్కొండ చౌరస్తా దగ్గర్లో వుండేది. బైండరుగా జీవితం ప్రారంభించి, కొన్నేళ్ల అనుభవం సంపాదించిన నేను 1959లో బైండింగ్ కాంట్రాక్టు దొరుకుతుందేమోనని జ్యోతి ప్రెస్‌కు వెళ్లాను. ఆ రోజుల్లో గవర్నమెంటువారి పాఠ్య పుస్తకాల ప్రింటింగు పనిలో అయిదు ప్రెస్‌లు బిజీగా వుండేవి. శివాజి ప్రెస్, సిటిజన్ ప్రెస్, చారి ప్రెస్, వెంకట్రామ, జ్యోతి ప్రెస్‌లు ఆ అయిదూ. అందుకని నేను జ్యోతి ప్రెస్‌కు వెళ్లాను. పెద్దయ్యగారు (రవీంద్రనాథ్‌గారు) కూర్చుని వున్నారు. ఆ రూపం, ఆ దర్జా చూడగానే చెప్పకనే ఆయనెవరో తెలిసిపోయింది.

''సార్ బైండింగు కాంట్రాక్టు కోసం వచ్చాను. మీదయ'' అన్నాను.

పెద్దయ్యగారిని చూడటం నాకదే మొదటిసారి.

''నిన్ను బొత్తిగా ఎరగను కదా! ఏమీ తెలియకుండా ఎలా ఇవ్వమంటావ్?'' అన్నారాయన.

ఆయనన్నది సబబే.

''నీ కంటే ముందు ఒకరిద్దరు కాంట్రాక్టర్లు వచ్చారు. రేపు వాళ్ల మనుషులందరినీ తీసుకుని వస్తానన్నారు'' అని ఆయనే చెప్పారు.

నేను పని చేసిన ప్రెస్‌లేవో మనవి చేశాను.

''నేను పుట్టి పెరిగింది ఇక్కడే సారూ. శివాజి ప్రెస్ బడే సాబ్‌కు ఫోన్ చేసి అడగండి'' అన్నాను.

పెద్దయ్యగారు శివాజి ప్రెస్‌కు ఫోన్ చేశారు.

''మీ చేతికి బంగారం దొరికింది. అతనిని నేనెట్లా వొదులుకుంటాను?'' అని జవాబిచ్చినట్లుగా బడే సాబ్ నాతో తరవాత చెప్పారు.

''రేపు రండి చూద్దాం'' అన్నారు రవీంద్రనాథ్‌గారు.

మరుసటి రోజు ఉదయం 7-30కి జ్యోతి ప్రెస్‌కు వెళ్లాను. నాతో పాటు పనివాళ్లను కూడా తీసుకొని పోయాను.

నన్ను చూడగానే పెద్దయ్యగారు, నీ మనుషులందర్నీ వెంట బెట్టుకుని వచ్చావా?'' అని ప్రశ్నించారు. నా మనుషుల్ని హాజరు పర్చాను. పని ప్రారంభించడానికి ముందు పూజ కోసం 50 రూపాయలిచ్చారు. అవి తీసుకుని పూజకు కావాల్సిన సామగ్రి కొనడానికి బజారుకు వెళ్లగానే పెద్దయ్యగారిని మొట్టమొదట దర్శనం చేసుకున్న ముఠావాళ్లు నేను పూజా సామగ్రి కొనటం చూసి తిరుగుముఖం పట్టారు. ఆ రోజు మొదలుకొని 1979 దాకా 20 సంవత్సరాలపాటు

ఏకధాటిగా జ్యోతి ప్రెస్‌లో బైండింగుపని చేశాను. ఆరోజుల్లో జ్యోతిప్రెస్‌లో విక్టోరియా ప్రింటర్ అని పెద్ద పేరు కలిగిన జర్మన్ మెషీను ఉండేది. రోజుకి రెండు లక్షల ఇంప్రెషన్స్ ఇచ్చేది.

పెద్దయ్య ప్రతిరోజూ ఉదయం ఏడున్నరకి వచ్చి 11-00 గంటల దాకా వుండేవారు. తరవాత మళ్లీ సాయంత్రం నాలుగింటికి వచ్చి కొద్దిసేపు కూర్చుని టెన్నిస్ ఆడటానికి వెళ్లేవారు. నేను ప్రెస్‌లో చేరిన తరవాత గమనించిన అంశం ఇది.

పెద్దయ్యగారు దొడ్డమనిషి. పైసలు కావాలని అడిగితే ఇస్తానని నోటితో చెప్పేవారుకాదు. లేదనీ చెప్పేవారు కాదు. కింది పెదవి పైకి లేపితే, శాంక్షన్ అయినట్టు లెక్క!

1979 తరవాత నాకు శ్రీ రామాబుక్ డిపో నుంచి పిలుపు వచ్చింది. ఒకటి నుంచి పదో తరగతి వరకు 172 రకాల ఇంగ్లీషు మీడియం పాఠ్య పుస్తకాలు ప్రచురించే సంస్థ అది. 1985లో అది మూత పడింది.

జ్యోతి ప్రెస్‌లో 20 సంవత్సరాల పాటు నేను పని చేసినప్పటి కాలాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే పెద్దయ్యగారి ఔదార్యాన్ని చూపే ఘట్టాలు కళ్లముందు ఆడతాయి.

ప్రతి శనివారం మాకు పేమెంటు జరిగేది. 1964 దసరా రోజుల్లో కొంత పైకం కావాలని అడిగాను.

ఆయన కొంచెం కోపగించుకున్నారు.

''టైమెంతయింది?'' అనడిగారు.

''నాదగ్గర వాచీ లేదు సార్!'' అన్నాను.

''వాచ్ కొనుక్కోడానికి కూడా డబ్బు లేనంతటి బీదరికమా?'' అనడిగారు.

''సంపాయించిన పైసలు పొట్టకూటికి, ఒంటిమీద బట్టకీ సరిపోతై సార్. ఇంకా వాచ్ ఏంకొనను!'' అన్నాను.

మేనేజరు శర్మగారికి చెప్పారు నాకు వాచ్ కొనివ్వమని. దసరా గిఫ్ట్‌గా నాకు వాచ్ దొరికింది. పెద్దయ్యగారి దయాగుణం అలాంటిది. నా వర్కర్లకు వారు ఈనాం ఇవ్వాల్సిన పనిలేదు - అయినా 500 రూపాయలు ఈనాముగా ఇచ్చారు.

రాంగోపాల్ బాబుగారు ప్రెస్ చూసుకుంటున్నప్పుడూ నేను పని చేశాను. చాలా ఉత్తముడు. ఆయన తరవాత వెంకట్‌బాబుగారు వచ్చారు. వారూ సమర్థులు, ఉదారులు.

ఇప్పుడు నాకు 70 ఏళ్ళు. ఏడుగురు కొడుకులు, ఒక కూతురు. మనవలు, మనవరాళ్లు 28 మంది. ఈ ముసలితనంలో నన్ను పోషించేవాడు ఒక్కడూ లేడు. ఎవరి బతుకులు వాళ్లవే. కూలిబతుకు కుక్కబతుకు! ఈ కష్టకాలంలో మళ్లీ చిన్నబాబుగారే ఆదరువయ్యారు. నా దగ్గర ఒకనాడు అర్ధరూపాయి కూలికి పనిచేసిన వాళ్లు కళాజ్యోతిలో ఈవాళ హెడ్ బైండర్లుగా పని చేస్తున్నారు. నాకు సంతోషమే కాదు గర్వంగా వుంటుంది.

తండ్రిని గురించి తనయులు, తనయ

నమ్మకం నిలబెట్టావు

దేవేంద్రనాథ్

మా నాన్నగారు చాలా విలక్షణమైన వ్యక్తి-సామాన్య గృహస్థు కెవరికైనా వుండే సంసార తాపత్రయాలు ఆయనకు బొత్తిగా లేవు. చాలా detachedగా వుండేవారు. అందువల్ల జీవితంలో సంభవించిన ఒడిదొడుకులకు ఆయన చలించలేదు. విషాద సంఘటనలు, అనుభవాలకు విచలితుడు కాలేదు. నా చిన్నతనంలో మా ఇంట్లో బంగారం మొత్తం పోయింది. విచారణ కొచ్చిన పోలీసు అధికారికి సాధారణ అతిథి మర్యాదలు చేసి, ఏమీ జరగనట్టే ప్రవర్తించిన నాన్నగారిని చూసి ఆ అధికారి విస్తుపోయాడు. ఉన్న బంగారం యావత్తు దొంగలు ఊడ్చుకు పోయినా, ఇంత నిబ్బరంగా నిర్వికారంగా ఉన్నారేమిటని ఆ ఎస్.ఐ. ఆశ్చర్య పడిపోయాడు. అలాంటివి జరిగితే బెంబేలెత్తిపోతూ గుండెలు బాదుకొనే మనుషుల్నే ఆ అధికారి తన సర్వీసులో చూసి వుండటమే ఆయన ఆశ్చర్యానికి కారణం. కుటుంబంలో సంభవించిన విషాదాలకూ ఆయన కుప్పకూలిపోలేదు. తన రక్తం పంచుకొని పుట్టిన తనయులిద్దరు చనిపోయినప్పుడూ ఆయన గరళం మింగిన శివుడి మాదిరిగానే వున్నారు. లోపల ఎంతో దుఃఖించి వుండవచ్చు, బైటికి మాత్రం నిబ్బరంగా గంభీరంగా వుండి పోయారు. తన emotions తనలోనే అణచిపెట్టుకున్నారు. ఆ నిర్లిప్తత పిల్లలతో అటాచ్మెంట్ లేదనే అభిప్రాయానికి తావిచ్చింది.

నేను హైదరాబాదులో సెయింట్ జార్జి గ్రామర్ స్కూల్లో చదువుతూ సెలవలకు తెనాలి వెళ్లే వాణ్ణి. మొదట్నుంచీ ఇంగ్లీషు మీడియంలో చదవటం వల్లనైతేనేమి, హైదరాబాదులో వుండటం కారణంగా అబ్బిన తెలంగాణా యాసవల్లనైతేనేమి నా తెలుగు అక్కడి వాళ్లకు వింతగా వుండేది. నా sense of humourని ఆయన గమనించారు. ఆయన ముఖంలో మెచ్చుకోలు కనిపించేది. తాను చిన్న తనంలో అర్థంతరంగా చదువు ఆపేసినందువల్ల, నేను విద్యాధికుడిని కావాలని కోరుకునేవారు. తాను విఫలమైన అకడమిక్ రంగంలో నేను సఫలుడిని కావాలని ఆకాంక్షించారు. ఆయన పుస్తక ప్రియుడు. ఎడతెగకుండా పుస్తకాలు చదివారు. మా కుటుంబంలో ఆయన పఠనాభిలాషను పుణికి పుచ్చుకున్న వాణ్ణి నేనొక్కడినే. 1964 నుండి క్రమం తప్పకుండా Time, Statesman ఇత్యాది పత్రికలను ఆయన తెప్పించుకుని చదివేవారు. అప్పుడు నా వయస్సు పదేళ్లు. వాటిని చదివి అర్థం చేసుకునే వయస్సు వచ్చినప్పటి నుంచి నేనూ ఆ పత్రికల్ని తదేకంగా చదివే వాడిని. ఆ పత్రికలలోని విషయాలపై నాన్నగారు నాతో చర్చించేవారు. నన్ను adult గానే కాదు, తన స్నేహితుడి మాదిరిగా పరిగణించేవారు. వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం ఫస్ట్‌బ్యాచ్‌లో M.Com. పాసయ్యాక. నాన్నగారు గోల్కొండ చౌరస్తా దగ్గర నడుపుతుండే జ్యోతి ప్రెస్‌లో చేరాను. ఆ రోజుల్లో అది లెటర్ ప్రెస్. ముద్రణా రంగంలో ఇప్పటి మాదిరిగా ఆనాడు అధునాతన సంకేతిక పరిజ్ఞానం విస్తారలేదు.

నాకది తగిన రంగం కాదని నాన్నగారు అభిప్రాయపడ్డారు. నేను బైట మంచి ఉద్యోగంలో చేరి వృద్ధిలోకి రావాలనుకునే వారు. నాకు సరయిన exposure వుండే వేరే వృత్తిలో ప్రవేశిస్తే, ప్రపంచం గురించి నా అవగాహన పెరుగుతుందనీ, నా దృక్పథం విశాలం అవుతుందనీ అనేవారు. నేను ఆంధ్రా బ్యాంక్‌లో ఆఫీసర్ హోదాలో జాయినయ్యాను. దరిమిలా Air Indiaలో అంతకన్నా మంచి ఉద్యోగం లభించింది. నాలుగేళ్లు పనిచేశాను. వివాహమైంది. హైదరాబాదు తిరిగి వచ్చాను.

నాన్నగారు నన్ను Air Indiaలో ఉద్యోగం మానేసి మళ్లీ ప్రెస్‌లో చేరమని ఒత్తిడి చేశారు. ఒకప్పుడు నాకు ఈ రంగంలో భవిష్యత్తు లేదని వేరే మంచి ఉద్యోగంలో సెటిల్ కమ్మని ప్రోత్సహించిన నాన్నగారే హఠాత్తుగా పల్లవి మార్చడం నాకు ఆశ్చర్యం కలిగించింది. నిర్ణయం తీసుకోవడానికి నాకు ఆరు నెలలు పట్టింది. కొంత ఇబ్బందిగా ఫీలయ్యాను. Air Indiaలో ఉద్యోగం మానేసి కళాజ్యోతిలో తిరిగి చేరాను.

తరువాత నాకు కను విప్పయింది. ఆయన నాపై ఒత్తిడి తేవడం సరైనదేనని. ముద్రణా రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం అనూహ్యమైన మార్పునకు దోహదం చేసింది. ఫొటో టైప్ సెట్టింగు, కంప్యూటీకరణ ప్రింటింగ్ రంగాన్ని సమూలంగా మార్చి వేశాయి. నాన్నగారికి ఎంత గొప్ప vision వుందో నాకు అర్థమైంది. కళాజ్యోతి ఉన్నతికి నావంతుగా సేవలందించగలగడం నాకు గర్వకారణం.

ఆయన ప్రెస్‌కు వస్తూ పోతుండే వారే గాని ఎన్నడూ జోక్యం కలిగించుకునే వారు కాదు. 1983 తరవాత మా నాన్నగారికి నాకు మధ్య మేజర్ inter-action లేదు. మా అన్నదమ్ములిద్దరి కృషిలో కళాజ్యోతి ప్రాసెస్ వికాసం సంతరించుకొంటుందని ఆయన ఆశించారు. విశ్వసించారు. ఆయన నమ్మకం రుజువయింది, నిజమయింది.

మా ఇద్దరబ్బాయిల్లో పెద్దబ్బాయి మా నాన్నగారి పోలికే అంటారు. ఇంటర్ చదువుతున్నాడు. చాలా bright student. తాతగారి పేరుప్రతిష్ఠల్ని మా బిడ్డలు నిలబెట్టటం కన్నా మాకు ఆనంద కరమైంది వేరేముంటుంది?

దేవేంద్రనాథ్, రవీంద్రనాథ్‌గారి మూడో కుమారుడు
కళాజ్యోతి ప్రాసెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

నా తలపులలో నాన్నగారు

దుర్గ నన్నపనేని

ఊహ తెలిసినప్పటి నుంచి నాన్నగారికి బాగా దగ్గర నేనే. ముగ్గురు మగ బిడ్డల తరవాత పుట్టిన ఆడ పిల్లనని నేనంటే గారాబం. తెనాలిలో వుండగా రోజూ టెన్నిస్ ఆడటానికి వెళ్తూ నన్ను వెంట తీసుకుని వెళ్లేవారు. హైదరాబాదు వచ్చేసి సెటిలయ్యాక సికింద్రాబాద్ క్లబ్‌లో వున్న స్విమ్మింగ్ పూల్‌లో నాన్నగారు నాకు ఈత నేర్పించారు.

అన్నయ్య లెవ్వరూ నాన్నగారి ముందు నిలబడి మాట్లాడ్డానికి సాహసించేవారు కాదు. నాన్నగారితో నాకున్న చనువునుబట్టి ఏ విషయమైనా నిర్భయంగా నిస్సంకోచంగా మాట్లాడేదాన్ని. ఎదురు చెప్పాల్సి వచ్చిన సందర్భాలలో కూడా ఏమాత్రం అదురు బెదురూ వుండేది కాదు. ఆయన పుస్తక పఠనంలో లీనమైనప్పుడు మాత్రం చాలా జాగ్రత్తగా మెలిగేవాళ్లం. పిన్‌డ్రాప్ సైలెన్స్ కోరుకొనేవారు. పుస్తకాలు, స్నేహితులే ఆయన ప్రపంచం. నాయనమ్మగారు కూడా కనపడ్డ పుస్తకమల్లా చదివేవారట! నాన్నగారి ఆలన పాలనా ఆయన నాయనమ్మగారే చూసేవారట! బహుశా నాన్నగారి పుస్తక పఠనాభిలాష మా నానమ్మగారి నుంచే అలవడి వుంటుంది. ఆయన హైస్కూలు చదువు కారణాంతరాల వల్ల అర్థాంతరంగా ఆగిపోయినా, ప్రైవేట్ టీచర్‌ను పెట్టుకొని ఇంగ్లీషు చెప్పించుకున్నారని మా పెద్దవాళ్ల ద్వారా విన్నాను.

మా మేనత్త సునందాదేవి అంటే మా నాన్నగారి చెల్లెలు ఒక సంఘటనను ప్రస్తావిస్తూ వుండేవారు. నాన్నగారు తురుమెళ్ల హైస్కూలులో చదువుతుండే రోజుల్లో తురుమెళ్ల నుంచి గోవాడ వస్తూ దారిలో సిగరెట్టు కాల్చారట. ఆ సంగతి మా తాతగారి చెవిని వేశారు ఒక శ్రేయోభిలాషి! మా తాతగారు కోపంగా నాన్నగారి మీద దెబ్బ వేశారట. దాంతో నాన్నగారు కోపగించుకొని ''నా భాగం నాకు పంచివ్వండి'' అన్నారట.

''భాగం పంచుకుని ఏం చేస్తావు?'' అనడిగారు తాతగారు.

''పుస్తకాల షాపు పెట్టుకుంటా'' అని నాన్నగారి జవాబు.

చిన్నతనం నుంచే నాన్నగారికి పుస్తకాలంటే ఎంత గాఢమైన అనురక్తో చెప్పడానికే ఈ ప్రస్తావన. తనలాగే నేను కూడా సాహిత్యాభిమానిని కావాలని నా చేత రవీంద్రనాథ్ టాగోర్, శరత్‌బాబుల సాహిత్యం చదివించాలని ఆయన ప్రయత్నించారు. నాలో ఆ అభిలాష నాటుకోకపోయినా, మా పెద్దబ్బాయి రాజీవ్ తాతగారి పుస్తక పఠనాభిలాషను, సాహిత్యాభిరుచిని పుణికిపుచ్చుకున్నాడు. జీన్స్ ప్రభావం అనుకుంటాను.

నా వివాహం నా పదహారో యేటే జరిగింది. అప్పటికి నేను మెట్రిక్ పాసయ్యాను. చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు ఆ రోజుల్లో సహజమే. మా నాన్నగారు తన 18వ యేటే వివాహం చేసుకున్నారు. నా విషయంలో ఆయన వైఖరి వేరు. నేనింకా కొన్నాళ్లు చదువుకొనసాగించాలని ఆయన కోరిక. పరిస్థితులు తోసుకువచ్చి, అమెరికాలో చదువు పూర్తిచేసి సంపాదనలో పడ్డ నన్నపనేని చౌదరిగారితో నా వివాహం జరిగింది. నేను అమెరికా వెళ్లిపోయాను. చౌదరిగారు మాకు దగ్గర బంధువులే.

నేనక్కడ ఉన్నానని నాన్నగారు అమెరికా సందర్శించారు. నెల రోజులు గడిపారు. చికాగో వగైరా నగరాల్ని ఆయన ఒక్కరే వెళ్లిచూసి వచ్చారు. నయాగరా జలపాతం చూడ్డానికి వెళ్లినప్పుడు నేను కూడా నాన్నగారితో పాటు వెళ్లాను. ఫ్లోరిడా రాష్ట్రంలోని మయామి బీచ్ సందర్శించి, కొద్దిరోజులు కులాసాగా గడిపి వచ్చారు.

నాన్నగారు శరీర పోషణ, ఆరోగ్యం విషయంలో అమితశ్రద్ధ తీసుకునేవారు. వ్యాయామం, నడక, టెన్నిస్ దినచర్యలో భాగం. మా అమ్మ మరణం నాన్నగారిపై చాలా ప్రభావం చూపింది. వారిద్దరూ ఎంతో అన్యోన్యంగా వుండేవారు. అమ్మకు ఆయన భగవత్ స్వరూపుడు. ఆయనకు ఏ లోటూ రాకుండా ఆమె చూసుకునేవారు. ఆమె పోయాక నాన్నగారిలో మార్పు వచ్చింది. ఒంటరితనంలోని బాధ కావచ్చు. పైపెచ్చు Skin allergy వచ్చి ఆయనను కృంగదీసింది. తన చక్కదనం, మేనిఛాయ చెడకుండా కాపాడుకునే నాన్నగారు కొన్ని మందుల వాడకం వల్ల కలిగిన దుష్ప్రభావం ఫలితంగా సంభవించిన అలర్జీ ఆయనకు కొద్ది నెలలు మనశ్శాంతి లేకుండా చేసింది. నన్ను కూడా తన గదిలోకి రానిచ్చేవారు కాదు.

'మిసిమి' పత్రిక నాన్నగారికి గొప్ప సాంత్వనం కలిగించింది. దానికి విద్యావంతుల నుంచి, మేధావుల నుంచి వచ్చిన గుర్తింపు ఆయనకు సంతృప్తి నిచ్చింది. జీవిత చరమాంకంలో 'మిసిమి' ఆయనకు సర్వస్వమైంది. కాని ఆయనలో కలిగిన కొన్ని మార్పులు నాకు అసంతోషం కలిగించకపోలేదు. అయిన వాళ్లకి దూరంగా గిరిగీసుకుని కూర్చుంటే ఎలా అని నాకు బాధ కలిగేది. ఇతరులెవ్వరికీ తన కారణంగా ఇబ్బంది కలగకూడదని తన భోజనం తానే వండించుకొని తినేవారు. తను ఇతరులెవరి మీదా దేనికీ ఆధారపడకూడదన్న ఫీలింగ్ ఆయనకుండేది.

నావరకు నేను నా ఇద్దరు పిల్లలకు దగ్గరగా వుండాలని, నా వాత్సల్యాన్ని వారికి పంచివ్వాలని, వాళ్లా అమ్మానాన్నల అనురాగ మాధుర్యం ఆస్వాదించాలని అందరం ఒకేచోట కలిసివుండే ఏర్పాటు చేశాను. కుటుంబానికి సంబంధించి మా ఇద్దరి దృక్పథాలు ఒకటి కాకపోవచ్చు, ఆయన మా అందరికీ ప్రేమాస్పదుడే.

ఆయన 1996 ఫిబ్రవరిలో హాస్పిటల్‌లో వున్న పది రోజులూ నేను ఆయన దగ్గరే వున్నాను. ఆయనని కనిపెట్టుకునేవున్నాను. ఒక రోజు ఆయన నన్ను ఇంట్లో ఏం కూర చేశావని అడిగారు. తోటకూర పప్పు అని చెప్పాను. అదంటే నాన్నగారికి ఎంతిష్టమో!

నాన్నగారు హాస్పిటల్‌లో చేరడానికి ముందు నేననుకునేదాన్ని - ఆయన మరో పదేళ్లు జీవించి వుంటారని. కాని, చివరిదశలోని విషాదానుభవాలు, హృదయఘాతాలు, కొన్ని మందుల రియాక్షన్, అలెర్జీ, శ్వాసకోశ రుగ్మత - అన్నీకూడి ఆయన ఆయుషు కుదించాయి. కాకుంటే - ఆయన అంత ముందుగా మాకు దూరమయ్యేవారు కారు.

దూరమయ్యారని భావించడం సరికాదేమో! జ్ఞాపకాల రూపంలో, నెలకొల్పిన సంస్థల రూపంలో నాన్నగారు మా మధ్య నిలిచే వున్నారు!

దుర్గ నన్నపనేని, రవీంద్రనాథ్ ఏకైక తనయ - నాట్కో చౌదరిగారి అర్ధాంగి

నా బాల్యంలో నాన్నగారిని గురించిన
జ్ఞాపకాలు బహుకొద్ది

బాపన్న

1968-69లో సెయింట్‌పాల్స్‌లో నేను నాలుగో తరగతి చదువుతున్నప్పుడు ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ప్రారంభమై ఊపందుకొంది. హైదరాబాదులో మా చదువులకు అంతరాయం కలుగుతుందని నాన్నగారు నన్ను, అక్కను, తమ్ముణ్ణి, అమ్మను విజయవాడ పంపించారు. అక్కడ అయిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నా చదువు కొనసాగింది. నా బాల్య, కౌమారాలు విజయవాడలో మా అమ్మ సంరక్షణలో గడచిపోయాయి. అందుచేత నా మీద మా అమ్మ ప్రభావమే బలీయమైంది. ఆమె నిదానం, మృదు స్వభావం, పొందిక, ఆచూతూచి అడుగువేసే తత్వం, జాగ్రత్తలతో కూడిన కార్యశైలి నా భావి జీవిత గమనానికి ఒరవడి అయ్యాయి.

నాన్నగారి ప్రత్యక్ష ప్రభావం నా మీది లేకపోయినా పరోక్ష ప్రభావం తప్పకుండావుంది. ఆయన ఏయే కార్యకలాపాలలో తలమునకలై వున్నా ఆహారపుటలవాట్లలో వేళల్లో నియమబద్ధంగా వుండేవారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్, రాత్రి డిన్నర్ అన్నీ టైమ్ ప్రకారం జరిగి పోవాల్సిందే. అలాగే లంచ్ తరువాత విశ్రాంతి. మిన్నువిరిగి మీద పడ్డా నియమ భంగం జరగడానికి వీల్లేదు. టెన్నిస్, సన్మిత్ర సంభాషణం, పాన గోష్ఠి - అన్నీ కాలనియతికి కట్టుబడి వుండేవి. ఆ క్రమ శిక్షణ నా మనస్సు మీద ముద్ర వేసి నన్ను ప్రభావితుడుని చేసింది.

విజయవాడలో నేను చదువుతున్నప్పుడు మా నూతన గృహ నిర్మాణం జరిగింది. ఇంటి పనిలో చురుగ్గా involve అయ్యాను. వ్యవహార కుశలత అబ్బింది. ఇంటర్ తరవాత హైదరాబాదు తిరిగి వచ్చేశాను. అప్పుడు వాసవి కాలేజి ఆంధ్రా యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రారు శ్రీ కె.వి. గోపాల స్వామి గారి సారథ్యంలో నడుస్తుండేది. ఆయన నాన్నగారికి మంచి స్నేహితులు. నాన్నగారు నా చదువు విషయంలో ఆయనకు ఫోన్ చేశారు. అదే కాలేజీలో B.Com. (Hon's)లో చేర్పించమని ఆయన సలహా ఇచ్చారు. వాసవిలో నేను B.Com. (Hon's) చేశాను.

1980లో నా చదువు పూర్తయింది. C.A. చేద్దామని నా కోరిక. అంతలో నాన్నగారు నా కొకపని అప్పగించారు. విజయవాడలోని మా భూములు పట్టణ భూగరిష్ఠ పరిమితి చట్టం (Urban Land Ceiling Act) కిందికి వచ్చాయి. చట్టంలోని కొన్ని సుళువులు, సూక్ష్మాలు తెలియక మొదట్లో మావాళ్లు దాఖలు చేసిన రిటర్న్ కారణంగా మేం చాలా నష్టపోయే పరిస్థితి ఎదురయింది. నేను నాన్నగారు చెప్పిన ప్రకారం విజయవాడ వెళ్లి, ల్యాండ్ సీలింగ్ కార్యాలయంలో చట్టం లోతు పాతులు క్షుణ్ణంగా తెలిసిన కింది ఉద్యోగుల్ని కలిసి నష్టం నివారించే దిశగా చట్టబద్ధమైన మార్గాలేమిటని ఆరా తీశాను. ఆ ప్రకారంగా Revised return దాఖలు చేశాం. వృధాగా భూమి కోల్పోయే ప్రమాదం

తప్పింది. నాన్నగారు నాకు అప్పగించిన పనిని విజయవంతంగా పూర్తిచేయడంతో ఆయనకు నా కార్యదక్షత మీద గురి కుదిరింది. నాన్నగారితో నా తొలి interaction అదే.

భావికార్యక్రమం గురించి ఆలోచనలో పడ్డాను. లెటర్ ప్రెస్‌లో ఏం ఫ్యూచర్ వుంటుంది? కన్‌స్ట్రక్షన్ బిజినెస్ చేపట్టాలనుకున్నాను. విజయవాడలో మా గృహనిర్మాణం సందర్భంగా అందులో నాకు అక్షరాభ్యాసం జరిగినట్లయింది.

మా సంస్థ జ్యోతి ప్రెస్‌లో చేరాల్సిందిగా నాన్నగారు నన్ను కోరారు. విజయవాడలో ఆయన నాకప్పగించిన పనిని విజయవంతంగా పూర్తి చేసిన మీదట నా మీద ఆయనకు కలిగిన నమ్మకమే అందుకు కారణం. ప్రెస్ కార్య నిర్వహణ బాధ్యతను అప్పటిదాకా నిర్వహిస్తూ వచ్చిన శర్మగారికి పక్షవాతం వచ్చింది, అది మరో కారణం. ప్రింటింగ్ ప్రెస్‌ల పరిస్థితి ఆశావహంగా లేదు. 1968 దాకా ప్రభుత్వ పాఠ్య పుస్తకాల ప్రచురణ కొంత లాభ సాటిగానే సాగింది. దరిమిలా పదేళ్ల పాటు ప్రభుత్వం ఆ పనిని ప్రైవేటు ప్రెస్సులకు ఇవ్వడం మానేసింది. 1981లో ప్రభుత్వ నిర్ణయం మారింది. పాఠ్యపుస్తకాల ప్రచురణ తిరిగి ప్రైవేటు ప్రెస్సులకే దక్కింది. లెటర్ ప్రెస్‌లకు మళ్లీ పునరుజ్జీవనం ప్రసాదించినట్లయింది. జ్యోతి ప్రెస్‌కు గణిత పాఠ్య గ్రంథం ప్రింట్ చేయడానికి ఆర్డర్ వచ్చింది. రాత్రింబవళ్లు పనిచేసి నిర్ణీత సమయానికి ఆ బృహత్కార్యం పూర్తి చేశాం. అది రికార్డ్ అని చెప్పవచ్చు.

1982లో ఢిల్లీలో PAMEX ఎగ్జిబిషన్ జరిగింది. ఆఫ్‌సెట్ మెషీన్ లేకుండా ప్రెస్‌ను అభివృద్ధి చేయడం అసాధ్యామనిపించింది. దాని ఖరీదు ఎనిమిదిన్నర లక్షల రూపాయలు. ఆ రోజుల్లో అది భారీ మొత్తమే. బ్యాంకు నుంచి రుణం తీసుకుని మెషీన్ కొనుగోలు చేయాలి. నాన్నగారికి విషయం వివరించాను. అంత పెట్టుబడిని అప్పు చేసి సంపాదించి, సక్రమంగా అసలూ, వడ్డీ చెల్లిస్తూ సక్సెస్‌ఫుల్‌గా ప్రెస్‌ను నిర్వహించగలమా అని, ఆయన సందేహం. ఎనిమిదిన్నర లక్షల రుణమంటే మాటలు కాదు.

''నీకు కాన్ఫిడెన్స్ ఉందా?'' అనడిగారు నాన్నగారు !

నా ఆత్మ విశ్వాసాన్ని వ్యక్తం చేశాను. నా సమర్థతపైన ఆయనకు నమ్మకం ఉంది.

1982 ఫిబ్రవరి 26 కల్లా లెటర్ ఆఫ్ క్రెడిట్ బ్యాంకు వారు ఇవ్వాలి. నాన్నగారు లంచ్ తర్వాత కొంతసేపు విశ్రాంతి తీసుకోనిదే బైటికి కదలరు. ఎల్.సి. పని వెంటనే పూర్తి కావాలి. ఎక్కువ సమయం లేదు. ఆరోజు మధ్యాహ్నం 2.30కి కోఠీలోని ఆంధ్రబ్యాంకు మెయిన్ ఆఫీసుకు చేరాం. ఎమ్.డి. మూర్తిగారు నాన్నగారి స్నేహితులు. కాని ఆయన మద్రాసు వెళ్లారు. నాన్నగారు ఆయనతో ఫోన్లో మాట్లాడారు. జీవితంలో ఆయన ఏనాడూ ఎంతగాఢ మిత్రుడిని కూడా స్వల్ప సహాయమైనా అడిగి వుండలేదు. నా ఉత్సాహం, జిగీష చూసి అలా నా వెంటవచ్చి నా కోసమని ఆయన మూర్తి గారికి ఫోన్ చేశారు. ఆయన వెంటనే చిక్కడపల్లి బ్రాంచి మేనేజరుకు ఎల్.సి. పనిపూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు.

1982 ఆగస్టులో ఆఫ్‌సెట్ మెషీన్‌ను నెలకొల్పాం. నాన్నగారు నాకు చెక్ పవర్‌కూడా ఇచ్చారు. పాత ఖాతాదారులందరూ మళ్లీ మాకు సహకరించారు. దాదాపు 90 శాతం ప్రైవేటువర్కు, 10 శాతం మాత్రమే ప్రభుత్వం వారి పని. మాకు ఎసెట్స్ లేవు. మార్కెట్‌లో బ్రహ్మాండమైన గుడ్‌విల్ ఉంది. రోజుకు 16 గంటలు పనిచేశాం. 1983లో మా అన్నయ్య దేవేంద్రనాథ్ ప్రెస్‌లో తిరిగి చేరారు. అది నాకు పెద్ద ఎసెట్.

1986లో Major expansion సంకల్పించి సక్సెస్ అయ్యాం. 1989లో ప్రెస్‌ను అద్దె భవనం నుంచి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్‌లో కొనుగోలు చేసిన సొంత భవనంలోకి మార్చాం. విస్తరణ నిరంతర ప్రక్రియ. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వికసించిన కొద్దీ ఆ ప్రక్రియ కొనసాగుతూనే వుంటుంది.

1984 నుంచి నాన్నగారు ప్రెస్ విషయంలో ఎన్నడూ కలగ జేసుకోలేదు. మా సామర్థ్యంపైన ఆయన విశ్వాసం అటువంటిది.

1987లో నా వివాహ నిశ్చితార్థం సందర్భంగా నాన్నగారు తన వియ్యంకునితో (నాకా బోయే మామగారు) సీరియస్‌గా ఒకమాటన్నారు.

''మా అబ్బాయికి యీవరకే ఒక పెళ్లయి పోయింది, ఇది రెండో పెళ్లి!'' మా మామగారు ఒక్క క్షణం నిర్ఘాంత పోయారు. ఆయనింట్లో వారు మొహమొహాలు చూసుకున్నారు.

''మా వాడికి మొదటి పెళ్లాం ప్రెస్సు, మీ అమ్మాయి రెండో భార్య'' అని నాన్నగారు జోక్ చేశారు.

అప్పటికిగాని ఆడపెండ్లివారు తేరుకోలేదు.

1995లో కొండాపూరులో కళాజ్యోతి ప్రాసెస్ విస్తరణ కార్యక్రమంలో భాగంగా స్థలం, నూతన భవనాలు, కలర్ ప్రాసెస్ యంత్రాలు, పరికరాలు ఏర్పాటవుతున్నాయి. నాన్నగారు కొండాపూరులోని మా కొత్త స్థలంలో ఒక టేకు మొక్క నాటారు. అది దినదిన ప్రవర్ధ మానంగా ఎదుగుతోంది. జ్యోతి ప్రెస్ కూడా ఆయన నాటిన మొక్కే. అది నేడు కళాజ్యోతి ప్రాసెస్ లిమిటెడ్‌గా దిగ్విజయంగా పురోగమిస్తోంది. ఆయన మనుమడు, మా అన్న వెంకట్‌గారి కుమారుడు చిరంజీవి రామనాథ్ మూడోతరం ప్రతినిధిగా మాతో కదం కలిపి ముందుకు నడుస్తున్నాడు. తన తాతగారి పేరు ప్రతిష్ఠలు నిలబెట్టే కృషికి నిబద్ధుడయ్యాడు.

నాన్నగారి జీవితంలో చాలా సంఘటనలు జరిగాయి. విషాదాను భవాలు ఎదురయ్యాయి. ఆయన స్థితప్రజ్ఞుడు.

నాన్నగారికి ఎందరో పెద్ద పెద్ద వాళ్లతో స్నేహసంబంధాలుండేవి. ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. అధికారులు తెనాలి వస్తే, ఆయనను కలవకుండా, ఆతిథ్యం స్వీకరించకుండా వెళ్లేవారు కాదు. హైదరాబాదులోనూ ఉన్నత స్థానాల్లో వున్న వారితో నిత్య స్నేహ సంబంధాలుం డేవి. బెజవాడ గోపాలరెడ్డిగారు, రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డిగారు, చీఫ్ జస్టిస్ ఆవుల సాంబశివరావు, జస్టిస్

జయచంద్రారెడ్డి, జస్టిస్ కోకా రామచంద్రరావు ప్రభృత మహామహులెందరో నాన్నగారితో ఆత్మీయంగా వుండేవారు.

''రవీంద్రనాథ్‌గారు కులాసాగావున్నారా? ఏం చేస్తున్నారు?'' అని సంజీవరెడ్డిగారు తమ ఉభయులకూ తెలిసినవారు వెళ్తే అడుగుతుండేవారు. నాన్నగారు ఎంత పెద్దవారిని గానీ తనకిది కావాలి అని అడిగి ఎరుగరు. ఆయన మూర్తిమత్వం సమున్నతమైంది కావడం చేతే వారందరికీ ఆయన ఆత్మీయులయ్యారు.

ఆయన మాకేమి ఆస్తిపాస్తులు మిగిల్చి వెళ్లారనేది కాదు లెఖ్ఖ! కుటుంబానికి ఆయనను బట్టి కలిగిన పేరుప్రతిష్ఠలు, సమాజంలో మన్నన, మాన్యతలు ఎన్ని ధనరాశులు కుమ్మరిస్తే మాత్రం సిద్ధిస్తాయి?

నాకు బాబు పుట్టినప్పుడు నాన్నగారు తన మనుమనికి చాణక్య పేరు సూచించారు. నేను సిద్ధార్థ అని పేరు పెట్టాను. నాన్నగారికి బౌద్ధం అంటే ఆరాధనా భావం గనుక ఆ పేరు పెట్టాను. నాన్నగారిని బట్టే బౌద్ధం అంటే నాకూ విశ్వాసం. నా రెండో బిడ్డ పాప. ఆమెకి 'మిసిమి' అని పేరు పెట్టాను. అయనకు చాలా సంతోషం కలిగింది. 'మిసిమి' ఆయన ఆల్టర్ ఈగో కదా!

సిద్ధార్థ తన తాతగారిలాగే టెన్నిస్ ఆటగాడు. జీన్స్ ప్రభావం! 12 సంవత్సరాల లోపు బాలుర టెన్నిస్‌లో దేశం మొత్తంలోని టాప్ టెన్ (మొదటి పదిర్యాంకర్లు) లో సిద్ధార్థ ఒకడు. నాన్నగారు జీవించి వుంటే టెన్నిస్‌లో మనవడి ప్రావీణ్యం చూసి ఎంత ఉప్పొంగి పోయేవారో!

1996 ఫిబ్రవరిలో ఆయనకు శ్వాసకోశ వ్యాధి ఎక్కువ కాగా హాస్పిటల్‌లో చేర్చాం. వ్యాధి తీవ్రత ఆయనకు మొదట తెలీదు. రొటీన్ ట్రీట్‌మెంటే అనుకున్నారు. బంధుమిత్రులు హాస్పిటల్‌కి వచ్చిపోవడం చూసి ఎందుకిక్కడ వీళ్లందరూ అని అనుకున్నారు. తరవాత కోమాలో పడిపోయారు. మధ్యలో ఒకసారి తెలివొచ్చినప్పుడు ఆయన తనవాళ్లనెవరి గురించీ అడగలేదు.

''నేను పోతే 'మిసిమి' ఏమవుతుంది?'' అనడిగారు.

'మిసిమి' అంటే ఆయనకంతటి నిబద్ధత. కాబట్టే 'మిసిమి' ప్రచురణను లాభనష్టాలతో నిమిత్తం లేకుండా కొనసాగిస్తున్నాం. డబ్బు కొలమానం కాదు. 'మిసిమి'ని నాన్నగారు ఆశించిన విధంగా నిర్వహించడానికి కావాల్సిన మంచి రచనలు లభించినంత కాలం పత్రికకు ఏ ఢోకా వుండదు. 'మిసిమి' చిరంజీవిగా ఉండాలనే మా ఆకాంక్ష కూడా.

బాపన్న, రవీంద్రనాథ్‌గారి నాలుగో కుమారుడు - కళాజ్యోతి ప్రాసెస్ మేనేజింగ్ డైరెక్టర్

జ్యోతిగా వెలిగి మిసిమి వెదజల్లారు

సత్యదేవ్

నాన్నగారిని గురించి ఈ సంపుటిలో ఎందరో ఆయన స్నేహితులు, బంధువులు, సాహితీ మిత్రులతో సహా మా అక్క, అన్నయ్యలు చాలా విపులంగా రాశారు. ఆయన సంతానంలో ఆఖరి వాణ్ణయిన నాకు వారికన్నా ఎక్కువ తెలుసుననిగాని, వారికి తెలియనవి నేను ఎరుగుదునని గాని అనుకోను. కాబట్టి నేనేం రాసినా చర్విత చర్వణం అవుతుంది.

ఆయన ప్రపంచంలో మాకన్నా పుస్తకాలు, స్నేహితులే ఎక్కువ. రసాత్మకమైన వాక్యాన్ని చదివితే తనకు కలిగే అనుభూతి, తన్మయత కొలమానానికి అందవు. తన బిడ్డలు ప్రయోజకులై కళాజ్యోతిని కలకలలాడిస్తున్నందుకు పొందిన ఆనందం కంటే కూడా పుస్తక పఠనంలో, సన్మిత్ర సంభాషణంలో కలిగిన రసానుభూతే ఎక్కువ. అలాంటివారు చాలా అరుదుగా వుంటారు. భార్య, పిల్లలు, బేంకు బాలెన్సు, సిరిసంపదలు - ఈ తాపత్రయాలకు ఆయన దూరంగా ఉన్నారు. మనశ్శాంతి పొందారు.

జీవిత కాలమంతా జ్యోతిలా వెలిగారు. చేతనైనరీతిలో లోకానికి మిసిమి వెదజల్లారు.

సత్యదేవ్, రవీంద్రనాథ్‌గారి చివరి అబ్బాయి కేటరింగ్ టెక్నాలజీలో పట్టా తీసుకున్నారు. అమెరికాలో రెస్టారెంట్ నడిపారు, ప్రస్తుతం హైదరాబాదులో సెటిలయ్యారు.

మిసిమికి
అభినందన మాల

పాఠకులు
ప్రముఖుల
ఆశంసలు
ప్రశంసలు

'మిసిమి'

డి.వి. నరసరాజు

హైదరాబాద్ నుండి - 'మిసిమి' అని ఒక మాస పత్రిక వెలువడుతోంది.

దాని సంపాదకుడు ఆలపాటి రవీంద్రనాథ్‌గారు.

'సంపాదకుడు' అంటే కేవలం జీతం మీద పనిచేసే - సంపాదకుడు గాదు.

ఆయనే - ఆ పత్రికకు యజమాని, సొంతదారు - వగైరా - వగైరా -

ఆయన పత్రికారంగానికి చిరపరిచితుడు. దాదాపు 50 ఏళ్ల క్రితమే - తెనాలి నుంచి - 'జ్యోతి', 'రేరాణి', 'సినీమా' మొదలైన వారపత్రికలను స్థాపించి నడిపిన అనుభవజ్ఞులు.

కేవలం స్వయం కృషితో ఎవరిమీద ఆధార పడకుండా -పత్రికా - ప్రచురణ రంగాలలో ఆయన చేసిన కృషిని గుర్తించి - యీ మధ్య ఒక అమెరికన్ యూనివర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్ డిగ్రీని ప్రసాదించింది.

అందుకు - ఆయనను సన్మానించాలని కొందరు మిత్రులు సూచిస్తే - ఆయన ఒప్పుకోలేదు.

సన్మానాలు కొందరి ఒంటికి సరిపడవు !

రవీంద్రనాథ్‌గారు 50 ఏళ్ల క్రితమే - పత్రికా రంగంలో ప్రవేశించారంటే ఇప్పుడు ఆయన వయసు వూహించుకోవచ్చు.

ప్రస్తుతం - ఆయనకు - కుటుంబ బాధ్యత లేమీ లేవు.

పిల్లలంతా పెద్దవాళ్లై - వాళ్ల వాళ్ల పనులు చూసుకుంటున్నారు.

ఆయనకిప్పుడు కావలసింది - ఆరోగ్యదాయకమైన వ్యాపకం.

ఆ వ్యాపకం తనకు యిష్టమైనదై ఉండాలి. అప్పుడే అది ఆరోగ్యదాయకమవుతుంది.

అందుకే ఆయన 'మిసిమి' పత్రిక ప్రారంభించారు.

నాలుగేళ్ల నుంచి - నడుస్తోంది పత్రిక. చేతిలో మంచి ప్రెస్ ఉంది !

తనకు అభిరుచి ఉంది. అందువల్ల 'మిసిమి' చాలా అందంగానూ - అచ్చు తప్పులు లేకుండాను వెలువరిస్తున్నారు రవీంద్రనాథ్‌గారు!

'మిసిమి' సామాన్య పాఠకులందరూ చదివే పత్రిక కాదని - ఆ పేరే చెబుతోంది. 'మిసిమి'కి అర్థం కోసం నిఘంటువు వెదుక్కోవలసిందే !

అది మేధావుల పత్రిక అంటున్నారు. దానిని బట్టి - తెలుస్తుందికదా- ఎక్కువ కాపీలు అమ్ముడు పోవని.

నాలాంటి చందాదారులే - ప్రధాన పోషకులు!

పత్రిక నష్టంతోనే నడుస్తుందని - అందరికీ తెలుసు !

'యిలా నష్టం' మీద - ఎన్నాళ్లు నడుపుతారు?' అని అడిగితే-

'నాకు ఓపిక ఉన్నన్నాళ్లు నడుపుతాను. తరువాత మూసేస్తే - నన్ను అడిగేవాళ్లు లేరుగదా!' అంటారాయన.

తన ఆరోగ్యానికి - ఒక వ్యాపకంగా ప్రారంభించినా

'మిసిమి' కొద్దిమందినైనా - తృప్తి పరచగలిగితే-నాకు అంతే చాలు నంటారు ఆయన!

'మీకు నచ్చితేనే చందాలు పంపండి. లేక పోతే వద్దు, అని గూడా చెబుతారు.

పత్రిక ఖర్చు భారం కాస్తయినా తగ్గడానికి ఈ మధ్య - ఆయన - ఒకటి రెండు పేజీలు అడ్వర్టయిజుమెంటులు వేస్తున్నారు.

అవి - 'పత్రిక స్థాయిని - దిగజారుస్తున్నయ్! అడ్వర్టయిజ్‌మెంట్లు వేయవద్దు! కావాలంటే జీవిత సభ్యులను చేర్చుకోండి. మే మంతా చేరతాం' అని ఒకరిద్దరు మిత్రులు సూచించారు.

అందుకు ఆయన యిష్టపడలేదు! నిజమే !

జీవిత సభ్యత్వం అంటే ఎవరి జీవితం?-ఆయన జీవితమా?-పత్రిక జీవితమా ? సభ్యుల జీవితమా?

ఈ మధ్య ఆయనకు - కుతూహలం కొద్దీ ఒక కోరిక కలిగింది.

'మిసిమి'ని గురించి - పాఠకులు ఏమనుకుంటున్నారు?

అందుకని - కిందటి వారం - హైదరాబాద్ ప్రెస్ క్లబ్బులో - చిన్న సదస్సులాంటిది ఏర్పాటు చేశారాయన.

సన్నిహిత మిత్రుల్ని కొందరిని - ఆహ్వానించారు ! ప్రెస్ వారిని గూడాపిలిచారు.

సాహితీ ప్రియులైన - ఒక రిటైర్డు జడ్జీ గారు అధ్యక్షత వహించారు.

యిద్దరు ప్రొఫెసర్లు - ఒక సీనియర్ పాత్రికేయుడు - నేను (నేను ఏ కేటగిరీలోకి వస్తానో మరి) వుపన్యసించాం !

మేమందరం - నిర్మొహమాటంగా - మాట్లాడతామని - రవీంద్రనాథ్ గారి నమ్మకం!

దాదాపు అందరూ అలాగే మాట్లాడారు ! 'మిసిమి' మేధువుల పత్రిక అన్నారు.

వేదికమీద ఉన్న వారందరూ మేధావులన్నారు.

ఒకవేళ - 'మిసిమి' బాగా లేదంటే నన్ను మేధావుల 'లిస్టు'లోంచి తొలగిస్తారేమోనని భయపడ్డాను!

ఆ మాటే నా ప్రసంగంలో - చెప్పాను.

పత్రికలలోని - వ్యాసాలలో భాష చాలా జటిలంగా వుంటున్నదనీ

అందరికీ అర్థమయ్యే - వ్యావహారిక భాషలో వ్రాస్తే మంచిదని ఒక సంఘ సేవకురాలు సూచించారు.

అది అంత - సులభం కాదేమోనని పించింది.

ఎందుకంటే - సైకాలజీ - సైకో యనాలిసిస్ - పారా - సైకాలజీలాంటి సబ్జెక్ట్స్ మీద వ్రాసేటప్పుడు

ఇంగ్లీషు పదాలకు - సరైన - తేలిక తెలుగు పదాలు - దొరకడం కష్టం.

సంస్కృత పదాలమీద ఆధారపడక తప్పనట్లు తోస్తుంది.

ఆ సంస్కృత పదాలు - అర్థం కావడమూ కష్టమే.

వాటికి బదులు - ఇంగ్లీషు పదాలు యధాతథంగా వుపయోగిస్తే మంచిదేమో ననిపిస్తుంది.

కొందరు రచయితలు క్లిష్టమైన విషయాన్ని క్లిష్టతరమైన సంస్కృత పద గుంభనతో మరింత - 'క్లిష్టతరం' చేస్తారు !

కొందరు - తాము కన్‌ఫ్యూజ్ కావడమే గాక - పాఠకుల్ని గూడా - సక్సెస్ ఫుల్‌గా కనఫ్యూజ్ చేయగలరు!

మరికొందరు - కేవలం - తమ 'విజ్ఞాన' ప్రదర్శన కోసమే వ్రాసినట్లు కనపడుతుంది.

అప్పుడప్పుడు - అది -మరి 'అజ్ఞాన ప్రదర్శన'గా కూడా పరిణమించడం కద్దు !

పత్రికలో - ప్రచురించే - ప్రతి వ్యాసమూ ప్రతి చందాదారుకీ - అర్థం కావాలనే - రూల్ ఏమీలేదు!

నా మటుకు నాకు చాలా వ్యాసాలు అర్థం కావు !

ఒక్కొక్క సంచికలో - నాకు అర్థమయ్యేది ఒక్క వ్యాసం ఉన్నా- నేను తృప్తిపడతాను!

ఏది ఏమైనా -పాఠకులకు 'మిసిమి' ఎటువంటి అపకారమూ చేయదు.

అందులోని విషయాలు - అర్థమైన వారికి అవుతయ్! కాని వారికి కావు ! అంతే !

లక్షల మంది పాఠకులు చదివి - ఆనందించాలని ఆయనా ఆశించడంలేదు.

తన కృషిని - మనసార - ఆనందించి అభినందించే పాఠకులు పది మంది ఉన్నా చాలునని - ఆయన ఆశిస్తున్నారు.

ఆయన ఆశ - నిరాశ కాదని - దురాశ అంతకంటే కాదని - హామీ యివ్వవచ్చు !

(ఈనాడు సౌజన్యంతో)

రవీంద్రనాథ్‌గారితో నా ప్రథమ పరిచయం 1950లో విజయవాడలో కొప్పురపు సుబ్బారావు గారి లిటిల్ థియేటర్ కార్యాలయంలో.

ఆ తరువాత నేను 1951లో సినిమా రంగానికి మదరాసు వెళ్ళిపోయాను. అందువల్ల రవీంద్రనాథ్‌గారితో కొంత యెడబాటు కలిగినది.

మళ్లీ నేను సినిమా పనుల మీద హైదరాబాద్ వస్తూ పోతూ వున్నప్పుడు - 1982 తరువాత జుబిలీ హిల్స్‌లోని - ఉషాకిరణ్ మూవీస్ గెస్టు హౌస్‌లో వుండేవాణ్ణి. రవీంద్రనాథ్ గారు గూడా - జుబిలీహిల్స్‌లో యిల్లు కట్టుకున్నప్పుడు - తరచు కలుసుకుంటుండేవాళ్లం.

మిసిమి పత్రిక - ఆయన అభిరుచికి నిదర్శనం. ''పత్రిక మీకు నచ్చితేనే చందాదారులుగా చేరండి'' అని మరీ మరీ చెప్పేవారు. మంచి అభిరుచులుగల మేధావి రవీంద్రనాథ్‌గారు. నాకంటె రెండేళ్ళు చిన్నవారు. బ్రతికివుంటే తెలుగు సాహిత్యానికి - జర్నలిజానికి ఎంతో సేవ చేసి వుండేవారు.

'మిసిమి' పత్రికను - అదే ప్రమాణాలతో తీసుకువస్తున్నందుకు - రవీంద్రనాథ్ గారి కుమారులను - సంపాదకులను మనసార అభినందిస్తున్నాను.

డి.వి. నరసరాజు

డి.వి. నరసరాజు, హైదరాబాదు, సుప్రసిద్ధ సినీ రచయిత, కాలమిస్టు.

మిసిమి ఆయన ప్రతిబింబం స్మృతిగీతం

సి. ధర్మారావు

ఆలపాటి రవీంద్రనాథ్‌గారి 'మిసిమి' ఆయన భావుకతకు, సౌందర్యాను రక్తికి ఓ ప్రతిబింబం, స్మృతి గీతం. విలక్షణ సంపాదకునికి 'సుప్రభాతం' నివాళి.

ఫలప్రదంగా 73 నిండు వసంతాలు, 79 మిసిమి పక్ష మాస పత్రికలు పండించి ఆలపాటి రవీంద్రనాథ్ వెళ్ళిపోయారు.

ఆయన సాహసి, భావుకుడు, సౌందర్యానురక్తుడు, నవ్యతా పిపాసి.

సహజంగానే 'మిసిమి' ఇవన్నీను. మిసిమి అంటే - ఒక వైదగ్ధ్యం, ఒక నిగారింపు, ఒక మిల మిల. ముట్టుకుంటే మాసిపోతుందేమో అన్నట్టు రంగుల నందివర్ధనంలా వుంటుంది ఈ పత్రిక. పిల్లలకి దొరక్కుండా భద్రంగా చదువుకుని పాఠకుడు పుస్తకాల అరలో దాచుకోవలసిందే.

వివిధ వాయిద్యాలని సమ్మేళనపరిచే సంగీత దర్శకుడు సంపాదకుడు - అనేవారు గోరా శాస్త్రి. ఇంతమాత్రమే అయితే, పలికే ఆ రాగం, వచ్చే ఆ పాట సంపాదకుడిది కావచ్చు, చదువరులది కావచ్చు, పత్రికాధిపతిది కావచ్చు. కాని మిసిమి రాగం, తానం, పల్లవి, ఆలాపన కూడ ఆలపాటి వారివే, ఆయన సొంతం. ''నా సరదా కోసం నడుపుతున్నాను మిసిమి'' అని ఆయన పదే పదే చెప్పేవారు. ''ఈ మధ్య అది నన్ను మించి నాకు అందకుండా పోతోంది'' అని ముసిముసిగా చివరిరోజుల్లో అనేవారు. అంతగా పత్రికతో తాదాత్మ్యం చెందినవారు అరుదుగా కనిపిస్తారు.

ఒక పాఠకుడే ఈ పత్రికకి సంపాదకుడు అని కూడా రవీంద్రనాథ్ అంటుండేవారు. అంటే ఆయన కలం చేతబట్టి పెద్దగా ఏమీ రాయరు. 'సంపదకీయం' అంటూ ఏ స్వకీయం, పరకీయం వుండవు. బహుశా ఈ అర్థంలోనే ఆయన 'పాఠక సంపాదకుడు'గా పేరుకెక్కారు. కాని ఇది డొల్లమాట. ఆయన తనకి ఏం కావాలో అది రాయించుకునే వారు. లేదా తను చెప్పదలచుకుంది రాయగలవారు ఎక్కడ ఏమూల నక్కి వున్నా దుర్భిణీ వేసి పట్టి రాయించేవారు. అందుకే ఓ సంజీవదేవ్, జి.వి. కృష్ణరావు, పురాణం వంటి ముగ్గురు నలుగురు ప్రసిద్ధులు తప్పిస్తే, 'మిసిమి' నిండా ఎప్పటికప్పుడు కొత్తవారే కనిపిస్తారు. అందుచేత ఆలపాటి వారిని పాఠక సంపాదకుడనడం కంటే 'మహారాజ' లేదా 'సర్వం సహా' సంపాదకుడనటమో సబబవుతుంది. పోల్చవలసివస్తే - అలనాటి వీరేశలింగం పంతులో, తరువాతి తరం వాడైన ప్రకాశం పంతులో తప్పించి ఇలా యథేచ్ఛగా నడిపిన సంపాదకులు దొరకరు.

1942 ఆగస్టు విప్లవం నాటికి రవీంద్రనాథ్ 20 సం॥ల యువకుడు. మంచికో, చెడ్డకో నలుగురితో పాటు పోయే తత్వం కాదు గనక, స్వాతంత్ర్యోద్యమ ఛాయలకి ఈయన పోలేదు. తండ్రి స్వాతంత్ర్యయోధుడయినా కూడ, ఏ పక్షమూ కాని (నిష్పాక్షిక) పక్షపత్రిక 'జ్యోతి'ని 1946లో స్థాపించాడు. చలం, ధనికొండ, భరద్వాజ వంటి అసంప్రదాయకుల రచనలు ఇందులో వస్తుండేవి. ఇక తెలుగు యువ పఠితుల్ని కొత్త లోకాలకి తీసుకుపోయి, రహస్యంగా 'నైటక్వీన్స్'

సెక్సు పరిమళాలతో వుక్కిరి బిక్కిరి చేసిన 'రేరాణి' ని కూడా అదే చేత్తో నడిపేవారు - మూడో చెయ్యి కూడా సృష్టించుకుని 'సినీమా' మాసపత్రిక కూడా ఏకకాలంలో నడిపారు. ఉన్నది కొద్దిపాటి ప్రెస్సు, తెనాలి లాంటి చిన్నపట్టణంలో. బ్లాకుమేకింగుకు బెజవాడ పరుగెత్తాలి. రంగులయితే ఏకంగా చెన్నపట్నానికే. అయినా ఆ సాహసం చూడండి. పత్రికలన్నీ మద్రాసునుంచే ఎందుకు రావాలి అని ఆయన పట్టుదల.

సంతాన నిరోధ పద్ధతులవలంబించమని శ్రీమతి ఎలెన్‌రాయ్ రాసిన వ్యాసాన్ని 'జ్యోతి'లో ప్రచురించి గగ్గోలు పుట్టించారు 1947లోనే. అధికారులు దండించబోయారు గాని కేసులో ఈయనే నెగ్గారు.

ఈయన ఓడిపోయింది, భరద్వాజగారి కథ కేసులో. ''అలవాటైన ప్రాణం'' ఆ కథ పేరు. అది బూతు కథ అని మేజిస్ట్రేటు గారు 6 నెలల ఖైదు లేదా రూ. 500/- ల జరిమానా విధించారు కథకునికి. ఇప్పుడు రూ. 50 వేలు అనిపించే ఆ జరిమానా సొమ్ము చెల్లించి రవీంద్రనాథ్ కథకుడిని కాపాడారు.

ఈ పోట్లగిత్త తత్వం తగ్గి, క్రమంగా బోధితత్వం అబ్బింది రవీంద్రనాథ్‌కి. 1990లో మొదలెట్టిన 'మిసిమి'కి మకుటసూక్తిని ఆయన బౌద్ధుల 'దమ్మపదం' నుంచి తీసుకున్నారు. దాన్ని ఇంగ్లీషులోనే అచ్చొత్తేవారు. ''మన మనుగడ సర్వస్వం మన ఆలోచనల పర్యవసానం. అంటే, మన ఆలోచనే మనం'' అని ఆ సూక్తి. ఇది ఆయన మానసిక పరిణతినే కాకుండా భావ పరిణతిని కూడా తెలుపుతుంది. ఆయనలోని నూతనత్వ, కళా, రసదృష్టులు వన్నె తగ్గలేదు. కాని ఆలోచనా శీలి ఒక మెట్టు పైన నిలబడ్డాడని చెప్పవచ్చునుకుంటాను. ఈ విలక్షణ పత్రిక రెండుమూడు వేల ప్రతులు అమ్ముతున్నదని ఆయన చెప్పినట్టు గుర్తు. కనీసం ఇరవైవేలమంది తెలుగు పాఠకులు చదువుతున్నారని ఆయన గర్వపడేవారు. మొదటగా అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి వరసగా రాసిన ''మేధావుల మెతకలు''తో జిజ్ఞాసువుల దృష్టిని ఆకర్షించిన ఈ పత్రిక, తర్వాత కీర్తిశేషులతో మధురవాణి జరిపిన రసబంధురమైన ఇంటర్వ్యూలతో పఠితుల్ని కట్టిపడేసింది. ఇది రాసినవారు దీనికి అన్నివిధాల అర్హులయిన పురాణం శర్మగారు.

ఇక ఈ సంపాదకుడికి అభిమానమయిన విషయాల్లో మచ్చుకికొన్ని:

(1) బౌద్ధం; (2) భారత తాత్వికతలోని భౌతికవాదం; (3) పాశ్చాత్య మనస్తత్వ శాస్త్రం; (4) భారతీయ, పాశ్చాత్య రసవాదాలు; (5) సాంకేతిక ప్రగతి నీడల్లో ఆధునిక మానవుడు; (6) పురాణేతిహాసాల్లోని విశిష్టపాత్రలు, మనపై వాటి ప్రభావం; (7) ప్రొ. లక్ష్మీ నరసు, భట్టిప్రోలు హనుమంతరావు, కె.బి. కృష్ణ వంటి ప్రముఖుల అజ్ఞాత కృషి; (8) అన్ని దేశాల, అన్ని కాలాలవి అరుదైన కళాఖండాలు; (9) శృంగారోద్దీపకమైన కళామూర్తులు, ఫొటోలు.

ఇక ఆయన చేసిన ప్రయోగాలు, చమక్కుల్లో కొన్ని:

- రస్సెల్, రాయ్, పుట్టపర్తి, ఖండిత నాయిక డయానా ముఖచిత్రాలతో మిసిమి
- అధికారికంగా ఒక ఎం.పి. సంపాదనలు.
- వ్యంగ్య వైభవంలో చివరిమాట అనదగ్గ 'డెవిల్స్ డిక్షనరీ'ని ఇంగ్లీషులోనే అందించడం.

- సందర్భోచితంగా ఐ.రా.స. మీద క్విజ్, అట్లాగే సాహిత్య క్విజ్‌లు.
- ‘రచయితల కాటకం’ అని ప్రకటన.
- వినాయక చవితికి వివిధ దేశాల గణపతి మూర్తులు.
- గాంధీ జయంతి నాడు భక్తులు సోనియాని పూజిస్తున్న కార్టూన్.

ఇలాంటివెన్నో వింతలు! ఉదయం పత్రిక ‘మిసిమి’ని పుణ్యపత్రిక అన్నా, ఆంధ్రభూమి దినపత్రిక ‘నిష్కామకర్మ’ పేర ఈయన మీద ఏకంగా సంపాదకీయమే రాసినా, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం డాక్టరేటు ఇచ్చినా ఆశ్చర్యమేముంది?

ఫిబ్రవరి 1996ది ఆఖరి ‘మిసిమి’ రవివర్మ బొమ్మని తన పాఠకులు గుర్తిస్తారనే ధైర్యం కాబోలు, సింపుల్‌గా ‘సీతాపహరణం’ అని ముఖ చిత్రం. ముఖం కప్పుకుని ఏడుస్తున్న సీత, వృద్ధుడైన రావణుడు పైన గాలిలో వున్న జటాయువు పై వేసిన కత్తివేటు, రక్తం వోడుతూ తెగిపడుతున్న జటాయువు ఒక రెక్క - భీభత్సంగానూ, కరుణామయం గానూ ఉంది.

కాల రావణుడు ఆయనపై కత్తి విసిరాడు. మనస్థితి కరుణామయంగా, దీనంగా వుంది. మళ్ళీ ఎప్పటికో ఓ రవీంద్రనాథ్!

బంగారానికి పరిమళం

హుసేన్ సాగరంలో ఒక కలువ పువ్వు కనిపిస్తే ఎలా వుంటుంది? గంజాయి వనంలో ఒక తులసి మొక్క కనిపిస్తే అప్పుడు ఎలా ఉంటుంది? కాకుల గోలమధ్య ఒక కోయిల పాట వినిపించితే ఎలా వుంటుంది? తెలుగు వ్యాపార, వ్యవహార పత్రికల మధ్య 'మిసిమి' అనే బంగారు పత్రికను చూచినప్పుడు ఖచ్చితంగా అలాగే వుంటుంది. పాఠకులు కొని చదువుకునే పత్రికలకూ, చదువుకున్న వారు చదువుకునే పత్రికకూ వున్న తేడా తెలిస్తే 'మిసిమి' విశిష్టత అర్థం అవుతుంది.

పాఠకులకు ఎలాంటి సరకు కావాలి, పత్రిక సర్క్యులేషన్ ఏ రీతిగా పెంచుకోవడానికి ఎలాంటి తమాషాలూ, చక్కిలి గింతలూ, అంగాంగ వర్ణనలూ కావాలి, చౌకబారు అభిరుచికి ఎలాంటి షడ్రసోపేతమైన విందు వడ్డించాలి అని మిగిలిన తెలుగు పత్రికలన్నీ పోటీపడుతున్న వేళ నిరాడంబరంగా, చల్లగా, ఎంతో చక్కని మంచి సంస్కారం వున్న పత్రికను ఎలాంటి లాభవాంఛ, ప్రతిఫలాపేక్షగానీ లేకుండా రవీంద్రనాథ్ నిర్వహిస్తున్నారు. దానిని బుద్ధిమంతులూ, సంస్కారులూ, చదువుకున్న వారు. మేధావులూ మాత్రమే చదువుతారు. 'మిసిమి' పత్రికను ఎరుగని వారూ, చూడని వారు అత్యధిక సంఖ్యలో వుంటారు. చాలా తక్కువ మంది చదివే మంచి పత్రికను అయిదు సంవత్సరాలునుంచి ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి అయన నడపటానికి కారణం ఏమిటో నిత్య వ్యాపార, సర్వలాభ సంస్కారులకు అర్థం కాదు.

ఈ మన తెలుగు నాట ఉత్తమ సంస్కారుల సంఖ్య చాలా తక్కువ. అందునా మంచి పత్రికలు కోరేవారూ, మంచి పత్రికలు చదివే వారు మరీ తక్కువ. అలాంటి అల్ప సంఖ్యాకుల కోసం రవీంద్రనాథ్ ప్రచురిస్తున్న 'మిసిమి' గురించి మన తెలుగునాట ఎక్కువమందికి తెలియక పోవడంలో ఆశ్చర్యం లేదు. ఇలాంటి పత్రికలకు ప్రచారం వుండదు. దానిని నడిపినందుకు లాభాలు రావు. అలాంటి పత్రికల సంపాదకులకు సమాజంలో గ్లామర్‌గానీ, ప్రతిష్టగానీ ఏర్పడవు. గంధపు మొక్కలాగా నిరాడంబరంగా, గుంభనంగా వుండిపోవాల్సిందే. అయితే అది గంధపు చెట్టు అని ఎరిగిన వారు దానిని గౌరవిస్తారు. 'మిసిమి' గురించి అమెరికాలోని ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా వారికి తెలియడం, వారు దాని విశిష్టతను గుర్తించడం ఎంతో సంతోషించాల్సిన విషయాలు. ఇప్పుడు గదా ఆ బంగారానికి కొంత పరిమళం అబ్బింది.

(జూలై 22, 1995 మహానగర్ దిన పత్రిక సంపాదకీయం)

ఆలపాటితో మధురవాణి

పురాణం సుబ్రహ్మణ్య శర్మ

(మిసిమి సంపాదకులు ఆలపాటి రవీంద్రనాథ్ చౌదరిగారు గదిలో కొన్ని ప్రాచీన వస్తువుల్ని సర్దుతూ, మొక్కల్ని సరిచేస్తూ, చేతిలో పత్రికతో పచార్లు చేస్తూ వుంటారు. ప్రవేశం మధురవాణి)

మధురవాణి : కన్యాశుల్కంలోంచి నన్ను బయటకు లాగి నలుగురిలో పడేట్లు చేశారు. మీరూ, మీ స్నేహితుడూ.

చౌదరిగారు : నిన్ను ఒక వేశ్యగాకాక పెద్ద పండితురాలిని చేశాము గదా!

మధురవాణి : నాకేం ఒరిగింది? మీ కోరిక తీరింది తప్ప.

చౌదరిగారు : మధురవాణి ఒక చతురవాణిగానే కాక మేధావి గావటం నీకిష్టంలేదా!

మధురవాణి : లోపల సంతోషమే మీ చిలిపితనానికి, చాలామందిని నా చేత అల్లరి పెట్టించి మీరు ఆనందించినట్లున్నారు తగునా?

చౌదరిగారు : కాదు గర్వించాను 'మిసిమి' స్థాయి నీవల్ల పెరిగినందుకు.

మధురవాణి : దీనివల్ల మీరే తగువులు పడతారా?

చౌదరిగారు : అవన్నీ శర్మగారివి. కీర్తి 'మిసిమి' ది.

మధురవాణి : తడిక తోసినవాడిది తగూ అని. దెబ్బలు మంచానికి.

చౌదరిగారు : శీర్షికా నిర్వహణం ఒక ముళ్ళ కిరీటం.

మధురవాణి : జీవితం ఒకశిలువ, ప్రతివాడూ ఒకక్రీస్తు అని అన్నాడో ఆధునిక కవి.

చౌదరిగారు : చూశావా నువ్వు కూడా కవిత్వాలు వల్లిస్తున్నావు. అంతా 'మిసిమి' మహిమ.

మధురవాణి : కన్యాశుల్కంలోంచి నన్ను బయటకు లాగి మాట్లాడించాలని మీకెలా తట్టింది?

చౌదరిగారు : అది ఒరిజినల్గా గురజాడ వారి అయిడియా. ఆయనెక్కడో ఒక ఇటాలియన్ పుస్తకంలో చూశాట్ట.

మధురవాణి : ఏమిటది?

చౌదరిగారు : ఒక ప్రాస్టిట్యూట్ చేత ఆకాలంలోని సమాకాలీన మహానుభావుల్ని ఊహాజనితంగా ఇంటర్వ్యూ చేయించి ప్రకటించాలని. ఆ ఇటాలియన్ కర్త కోరిక గురజాడ వారు గమనించి అలాంటిదేదో చేయాలనుకున్నారు.

మధురవాణి : అటు తిరిగి ఇటు తిరిగి ఆ కోరిక తీర్చడానికి మీరు, మీ స్నేహితుడూ నడుం కట్టారన్న మాట.

చౌదరిగారు : మేం ఆ అయిడియా మీద పనిచేశాం గాని గురజాడ వారి ముందు మేమెంత?

మధురవాణి : నృత్య సంగీతంలో పడికొట్టుకునే మమ్మల్ని సాహిత్య మేధావుల ప్రపంచంలోకి లాగారు. నక్క ఎక్కడ? నాకలోకమెక్కడ?

చౌదరిగారు : సంభాషణా చాతుర్యం అంటే నీదే.

మధురవాణి : చమత్కారానికి కాదు, మాధుర్యానికి నాకా ప్రసిద్ధి.

చౌదరిగారు : మనపూర్వ సాహిత్యంలో విప్రనారాయణుడు మోహించిన వేశ్య అప్పగారు మధురవాణి. వసంతసేనను చూసి గురువు గారు నిన్ను దిద్దారు కాబోలు.

మధురవాణి : ఆవిడకు చారుదత్తుడు దొరికితే నేను గిరీశం గారి పాలబడ్డాను. తర్వాత రామప్ప పంతులు. సరే పేకాటలో అంతా.

చౌదరిగారు : నీతో పేకాడిన వారు ధన్యులు.

మధురవాణి : రామప్ప పంతులు కమాను మీద వెళ్ళినపుడు మరి నాకు కాలక్షేపం కావడమెల్లాగ?

చౌదరిగారు : నీ కాలక్షేపానికే కదా అన్ని ఇంటర్వ్యూలు ఏర్పాటు చేసింది 'మిసిమి' లో.

మధురవాణి : ఏమి చమత్కారమండీ? మీ గర్ల్ ఫ్రెండ్ కోసం మీరు చేసినవన్నీ నాకోసం అంటారే?

చౌదరిగారు : 'మిసిమి' నా గర్ల్ ఫ్రెండని నీకెల్లా తెలిసింది.

మధరవాణి : సానివాళ్ళకు కర్ణపిశాచి వుంటుంది.

చౌదరిగారు : విజయనగరంలో ఆనందగజపతి మహారాజుకాలంలో మద్దెల మహాలక్ష్మి అనే వేశ్యారత్నం వుండేదట. ఆవిడ మహా గొప్ప సంగీత విద్వాంసురాలు. ఆవిడ అలవోకగా ఒక రాగం విసిరితే విని పట్టుకుందామని నారాయణదాసు గారిలాంటి హరికథా పితామహులు చూసేవారట. నీ పాత్రకి ఆవిడ గురజాడ వారికి ప్రేరణ అంటారు పెద్దలు.

మధురవాణి : మొట్టమొదటి కన్యాశుల్కంలో నేనున్నానండోయ్.

చౌదరిగారు : కాని అందులో నీ రూపం 'కలర్‌లేస్ ఇన్‌క్విటీ' అన్నారు గురజాడ.

మధురవాణి : రెండో కన్యాశుల్కంలో నన్ను ఎంతగా పెంచారంటే మా గురువుగారు.... (సిగ్గుపడును)

చౌదరిగారు : నిన్ను మోహించేటంత. ముని సుబ్రహ్మణ్యం గారికి రాసిన ఉత్తరంలో I am enamoured of her అన్నారు. కవి తన సృష్టిని తానే మోహించడం అపూర్వం. నిన్ను మోహించకుండా ఎవరుండగలరు? (నవ్వు)

మధురవాణి : ఆపండి. You too Brutus అని మీరు కూడానా (అలుగును)

చౌదరిగారు : 'మిసిమి' నువ్వు చదివావా?

మధురవాణి : నిజం చెప్పమంటారా? అబద్ధం చెప్పమంటారా?

చౌదరిగారు : నిజం ఎవరిక్కావాలి? అబద్ధమే చెప్పు. (ముసి ముసి నవ్వు)

మధురవాణి : ఆ వ్యాసాలు మీకు మట్టుకు అర్థం అవుతాయా? నిజం చెప్పాలి.

చౌదరిగారు : అలా ఎందుకనుకున్నావు?

మధురవాణి : ఒక్కొకళ్ళు ఒక్కొక్క భాషలో రాస్తారు పెద్ద పెద్ద విషయాలు, అవి అర్థమై చావవు ఓ పట్టాన.

చౌదరిగారు : అటువంటి విషయాలు, సంగతులు వున్నాయని కనీసం మనవాళ్ళకు తెలియ చెప్పటం మిసిమి డ్యూటీ. మచ్చుకి అంబేద్కర్‌ని ప్రేరేపించినది ఒక తెలుగు వాడి పుస్తకమని బైట పెట్టామా లేదా?

మధురవాణి : వీరేశలింగంగారిని ఉత్సాహపరిచింది సామిధేని ముద్దుకృష్ణమనాయుడని ఎందరికి తెలుసు? 'మిసిమి' వల్ల కదా!

చౌదరిగారు : దొంగా దొరికావు. నువ్వు చదువుతావు 'మిసిమి'ని. కఠినమని పైకి దొంగ కబుర్లు చెబుతావు తెలివిగా.

మధురవాణి : మీ పత్రికలో చాలా వ్యాసాలు కుప్పు సామయ్యగారు మేడ్ డిఫికల్టు.

చౌదరిగారు : ఆ విషయాలు అలాంటివి. శాస్త్రవిషయాలు సులభంగా పకోడీల్లా ఎలా ఉంటాయి?

మధురవాణి : అయితే మీ 'మిసిమి'కి స్త్రీలు పాఠకులు కాలేరు.

చౌదరిగారు : తెలుగువారు ఎప్పుడూ ఎదగకుండా చచ్చు కథలూ, పుచ్చు నవల్లూ, పిచ్చి కవితలూ చదువుకుంటూ స్థిరోభవ పరదోభవ అని అలాగే వుండాలనా?

మధురవాణి : తెలుగువాళ్ళకి ఓ పట్టాన అర్థం కాని పత్రిక నిర్వహించినందుకే మీకు ఆ అమెరికా వాళ్ళేదో పురస్కారం ఇచ్చారట - డాక్టరేటు.

చౌదరిగారు : నీ వేళాకోళానికేం గాని, ఒకళ్ళు మెచ్చి మేకతోలు కప్పుతారనీ, ఒకళ్ళు తెగడుతారనీ నేను 'మిసిమి'ని నడపలేదే? నా ఆనందం కోసం, నా తృప్తి కోసం. నేను ఖాళీగా వుండకుండా ఏదో ఒకటి చెయ్యాలి కదా!

మధురవాణి : మీ తాలూకు వారంతా సినిమాలు తీశారుగా. మీరూ ఓ సినిమా తీసి వుండాల్సింది. తెలుగువారికి సినిమా పిచ్చి తప్ప మరేమీ లేదు.

చౌదరిగారు : సినిమాలు నా ఒంటికి పడవు. అయినా నన్ను ఆటపట్టించడానికి కాకపోతే నీవా ప్రశ్న నన్ను అడగడానికి నేను అలా కనిపిస్తున్నానా? జీవితం గంభీరమైనది. కాలం అంతకన్నా విలువైనది కదా!

మధురవాణి : అన్నట్లు ఓ మాట అంటాను కోపం తెచ్చుకోరు గదా!

చౌదరిగారు : కోపం దేనికి? ఎందుకు? నీ మీదా -

మధురవాణి : మీరు మిసిమి బంగరు రంగులో వున్నారు. మీ బాడీ కలర్‌కి సూటవుతుం దని 'మిసిమి' అని పేరెట్టారేమోనని మీ పత్రిక్కి -

చౌదరిగారు : ఫెమినైన్స్ ఆర్ ఫూల్స్ అన్నాడు గిరీశం.

మధురవాణి : ధనికొండ హనుమంతరావు రేరాణి వెనక మీరేనటగా సారధ్యం?.

చౌదరిగారు : ఒక మారు మెజిస్ట్రేటు కోర్టులో శిక్ష కూడా పడింది నాకు, ఫైన్ వేశారు.

మధురవాణి : తెలుగు జర్నలిజంలో మేగజైన్ జర్నలిజానికి పునాదులు వేసిన వారిలో మీరొకరనుకుంటా. అవునా?

చౌదరిగారు : జ్యోతి నడిపినా, ఆ వెనక రేరాణి నడిపినా నా ఒరవడి నాదే. సంచలనం రేపితే భావజడత్వం బద్దలయి తీరుతుంది.

మధురవాణి : మీరు రాయిస్టులనుకుంటా. ఆమ్లెట్లు వేయాలంటే గుడ్లు బద్దలు కొట్టాల్సిందే శ్రీశ్రీ చెప్పినట్లు.

చౌదరిగారు : ఫ్యామిలీ ప్లానింగ్, జనాభా సమస్య మీద వ్యాసం వేస్తే నార్లవంటివారు ఇది ఎందుకు వేశారు అని అభ్యంతరం చెప్పారు.

మధురవాణి : ఎన్. టి. ఆర్ గారు ఫ్యామిలీ ప్లానింగ్ ఉపన్యాసాలు చెబితే బాగుండదు కదా!

చౌదరిగారు : వారి కుటుంబ సమస్యలే రాష్ట్ర జీవన్మరణ సమస్యలయ్యాయి. రాజకీయాలు మనకెందుకు గాని నేను అందరు తత్వవేత్తల్ని ఆకళింపు చేసుకున్నా. అబ్బూరి రామకృష్ణారావుగారు, చలం అంతా రాయిష్టు వాసన చూసినవాళ్ళమే.

మధురవాణి : మీరేదన్నా 'నో' అంటే, చౌదరిగారు నో అన్నారు, ఏముందోనని రచయితలు పునరాలోచన చేసే స్థితి వుంది.

చౌదరిగారు : మరి ఇప్పిటిలా కాక ఎడిటర్ ఎవరికీ తల వంచకూడదు. పోతన గారిలా 'ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి. . . . !'

మధురవాణి : బౌద్ధం పట్ల మీకు ఆసక్తి హెచ్చునుకుంటా.

చౌదరిగారు : బౌద్ధమతాన్ని తరిమేసి తన సరిహద్దుల నుంచి ఇండియా ఆత్మహత్య చేసుకుంది అన్నారు గురజాడ.

మధురవాణి : వీరేశలింగం, నాయుడుగారు, కృష్ణశాస్త్రి ఇలా అంతా హిందూ వైదిక మతం నుంచి దూరమైనవారే. మిమ్మల్ని మీ తపనని తెలుగువారు గుర్తించలేరు కదా!

చౌదరిగారు : నేను సైలెంట్ వర్కర్ని. కొద్దిపాటి చదువు మాత్రమే చదువుకున్నవాణ్ని. నాకు పుష్పగుచ్ఛాలు అక్కర్లేదు. పన్నీటి జల్లులూ అవసరం లేదు.

మధురవాణి : అవును. సూర్యచంద్రుల్ని ఎవరు గుర్తించాలి?

చౌదరిగారు : నన్ను ములగచెట్టు ఎక్కించకు. నేను మామూలు మనిషిని ప్లీజ్!

మధురవాణి : మామూలు మనిషీ జిందాబాద్! పునర్జన్మ లేదన్న 'మిసిమి' జిందాబాద్. తమసోమా జ్యోతిర్గమయ.

(సుప్రభాతం, 20 మార్చి 1996)

(1992 జులై మిసిమి నుండి)

మేలిమి బంగారం 'మిసిమి'

పురుషులందు పుణ్యపురుషులు వేరయా - అన్నాడు వేమన. పత్రికలందు పుణ్య పత్రికలు వేరయా - అంటాం మనమందరము కూడా 'మిసిమి' పత్రిక సంచికలు రెండు, మూడు చదివితే.

'మిసిమి' ఒక విలువైన మాసపత్రిక. అట్టమీద బొమ్మ మొదలు బాక్ కవర్‌తో సహా ఆసాంతం ఎంతో కళాత్మకంగా, అర్థవంతంగా, ప్రయోజనాత్మకంగా నెల నెలా తీర్చిదిద్దబడే పత్రిక 'మిసిమి'. అట్టమీది బొమ్మ- అదెప్పుడూ ఎవరో ఒక ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు రచించిన రంగుల బొమ్మే. వేర్వేరు మ్యూజియంలలో ప్రైవేటు కలెక్షన్లలో ఉండే మహాద్భుతమైన పెయింటింగ్సు - 'మిసిమి' - కవరు పేజీని నెలకొకటిగా అలంకరిస్తూ ఉంటాయి. లోపలి పేజీలలో వాటి వివరాలందించబడతాయి సంక్షిప్తంగా. అసలది చూచేటప్పటికి రసజ్ఞులైన పాఠకుల హృదయాలు పులకిస్తాయి. ఇక విషయానికి వస్తే.....

నెలకో 32 పేజీల ఆలోచనాత్మకమైన అంశాలను వ్యాసాల రూపంలో, చర్చల రూపంలో పాఠకుల కందిస్తుంది - 'మిసిమి'. రాజకీయాలు, సినిమాలు, కవరుపేజీ కథనాలు - వగైరాలు ఇవేకదా నేటి మాస, వార దిన పత్రికలందించే గడ్డి భోజనం. 'మిసిమి' వీటిని వడ్డించదు. పాఠకుల మనస్సులకు 'మిసిమి' బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తుంది. వారి ఆలోచనలను తగు మోతాదులో ఉత్తేజపరుస్తుంది.

భారతీయ దర్శనాలు పరిచయం చేయబడతాయి - ఒక సంచికలో. తాత్వికులు జిడ్డు కృష్ణమూర్తితో ముఖాముఖి - మరో సంచికలో. చార్వాక దర్శనం మీద వివరణ ఉంటుంది - యింకో సంచికలో. కథలంటూ యిద్దామనుకుంటే సుప్రసిద్ధ కథా రచయితల ఒకనాటి ప్రసిద్ధ కథలను పునర్ముద్రణ చేస్తుంటుంది - 'మిసిమి'.

కాలక్షేపానికి చదివే పత్రిక కాదు - 'మిసిమి'. సాహిత్యం, వేదాంతం, తత్వశాస్త్రం, మనో వైజ్ఞానిక శాస్త్రం, మన దర్శనాలు, సామాజిక సిద్ధాంతాలు - యిటువంటి లోతైన అంశాలకు సంబంధించి దుర్గ్రాహ్యమైన విషయాలను కూడా సులభ గ్రాహ్యంగా అందిస్తుంది - 'మిసిమి'.

సాధారణ పాఠకులు చదివే పత్రిక కాదు - 'మిసిమి'. ప్రత్యేకమైన ఆసక్తి, మానసిక పరిణతి కలిగిన పాఠకులు చదవదగిన పత్రిక యిది. మానవ జీవితాన్ని దాని గంభీరపు లోతులు మహోన్నత శిఖరాలు అధ్యయనం చేయగోరేవారు చదివే పత్రిక యిది. అందుకే ఈ పత్రిక గురించి చాలా మందికి తెలియదు.

'మిసిమి' సంపాదకులు, పబ్లిషరు, సర్వస్వం ఆలపాటి రవీంద్రనాథ్‌గారే. పత్రికా రంగం కూడా వ్యాపార పోకడలు పోతూ, కొంకిరి పూలు పూయిస్తున్న కాలంలో - లాభాపేక్ష లేకండా, నష్టానికి వెనుదీయకుండా 'మిసిమి' వన్నెలు తగ్గకుండా చూసుకొస్తున్నవారు - శ్రీ ఆలపాటి. 74 సంవత్సరాల వయస్సులో కూడా వీరిలోని ధ్యేయనిష్ఠ. మిసిమి తరగలేదు. వన్నె మాయలేదు.

ఒకప్పుడు 'జ్యోతి' మాస పత్రికను వీరు నిర్వహించేవారు. రవీంద్రనాథ్ 'రేరాణి, సినిమా' లాంటి పత్రికల సంపాదకత్వ బాధ్యతను కూడా నిర్వహించారు. 'మేధావుల మెంతకలు', 'మధురవాణి ఇంటర్వ్యూ'లతో పాఠక లోకం ఆలోచనా స్రవంతిని మలుపు తిప్పిన రవీంద్రనాథ్ అనేక వినూత్న శీర్షికలను 'మిసిమి' పాఠకులకు అందించారు.

1948లోనే కుటుంబ నియంత్రణ అవసరాన్ని నొక్కి చెప్తూ వీరప్పట్లో ప్రచురించిన ఒక వ్యాసానికి కోర్టులపాలు కావలసి వచ్చింది. ఈనాడా కుటుంబ నియంత్రణ ఎంత అవసరమో అంతా గుర్తించారు కదా! అటువంటి దూరదృష్టిగల రవీంద్రనాథ్ అంతటి దూరాలోచనతో... అంతకు మించి మనిషిని ఉత్తమ మానవుడిగా తీర్చిదిద్దాలనే ఆకాంక్షతో నిర్వహిస్తున్న 'మిసిమి'కి జేజేలు పలుకుతూ, రవీంద్రనాథ్‌కు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నది.

(తెలుగు విద్యార్థి, ఆగష్టు 1995)

Professor **K. Satchidananda Murthy**

Padma Bhushan, Vachaspati, Kalaprapurna, Vidyasagara,

Shri A. Ravindranath is known to be both well-read and widely read. He is an intellectual as well as a person who has had a successful career in the business of publishing and printing. He has ideas, enthusiasm, expertise and means. So, five years ago he launched a new sort of journal in Telugu, MISIMI, and has been running it with zeal.

MISIMI is beautifully produced and a number of its articles are of the type which are perhaps not to be found in any other Telugu periodical. Literature, philosphy, psychology, religion, art and biography: these are the subjects on which most articles have appeared in it. To some extent, the better ones among them seem to be those which treat their themes/ topics in new ways, show famous pesonalities as subject to raga-dvesha, or scoff at orthodox beliefs and customs which have no rational basis.

MISIMI is, therefore, a quite unique one among Telugu periodicals at present. Sri Ravindranath publishes its journal mainly for his pleasure and self-fulfilment, while it brings happiness and new insights to disceming readers. On its completing half a decade of its existence, I wish MISIMI a bright future.

A Tribute Dr. Alapati, the Founder Editor of Misimi

REDISCOVERING ONESELF

"THE HINDU"

"All that we are is the product of what we have thought" - Dammapada.

Crowning his Misimi, a Telugu Magazine, with the saying in which he believed heart and soul, Alapati Ravindranath Chowdhary brought out 79 issues. Misimi is one of those rarest of rare gems in terms of literary value which is difficult to be found in the contemporary scene, however deep one may fathom.

Misimi is not a run of the mill magazine. Before delving into its qualitative value, it would be better if the editor is understood. He was born on November 4, 1922 in Govada village of the erstwhile Tenali Taluk. In his early years of journalistic pursuits, he brought our "Jyothi" and "Rerani". Famous writers like Chalam, Gopichand and G.V. Krishna Rao contributed stories to "Jyothi". When he failed as a publisher in Tenali, he came down to Hyderabad and started another printing press "Kala Jyothi" and began publishing Misimi from 1990. He became an ardent follower of Buddhism and turned a retionalist. Apart from Buddhism, philosophical streams of the East and West, modern man under the canopy of technology, mythological and historical characters and their influence on our lives, artists and their works, are some of the articles featured in this unique magazine.

It is not often that one comes across quality printing with quality features on quality subjects. Misimi - Lustre, is resplendent. It is a monthly (fortnighty too sometimes) magazine. It is a small and compact one with hardly about 40 pages. It is grace and beauty that goes into it. It comes with the freshness of a morning dewdrop filled with the fragrance of jasmine. No one can smell it. But it is there. Right from the cover page, usually a famous work of art reproduced, to the last page. Misimi only means rediscovering oneself.

Misimi contains everything that a curious mind wants to know. Not run of the mill magazine, says K.V.S. Madhav.

Misimi takes a long time to be read. Then, one can never throw it away like other magazines because it is a collector's item with information culled out from the past and present. It is a painstaking effort but the sheer commitment of Ravindranath makes it all look so easy.

The literary magazine contains everything that an inquisitive mind would like to devour. For example, the March 1995 issue contains articles on Pablo Picasso, Kundanlal Saigal, a review of Telugu literature, an article on a literary character and a piece on philosophy. Its September 1994 issue contains articles on Kautila, Kanya Sulkam (of Guruzada Apparao) and Bertrand Russel. Works of Ravi Verma, Demerla Rama Rao and Vaddadi Papaiah adorned the cover pages. A brief history and the background of such illustrations was given inside.

Alas, he is gone now. The selectivity of the contents was such that it could attract only a sale of about 1,200 copies. But Misimi encouraged new writers always. The February 1996 issue was Ravindranath's swan song.

The six-year-old Misimi has lost the Midas touch of its conceiver. Keeping the magazine at the zenith reached by the dreamer called Ravindranath may not be an easy task. Readers would miss Puranam's Madhuravani in Misimi.

His son, Mr. A. Bapanna (incidentally his daughter is named Misimi), says though people want us to continue publishing Misimi it becoming increasingly difficult for us. It is not a matter of money. We used to sustain losses on every issue. We do not mind taking the blow provided the quality is restored. But how? Who can guide Misimi to its pristine path like my father did?

A meeting is to be held to discuss the future of Misimi. Ravindranath's family members are planning to hold discussions to bring out special volumes.

Ravindranath claimed once that Misimi would fill the vacuum in Telugu magazine journalism. For me, every reader is an editor of the magazine. Does his dream-Misimi-also follow his footsteps? Probably Ravindranath himself wrote the epitaph when he carried the blurb - no re-birth for this anniversary number - on the cover page sometimes.

"Misimi", the literary magzine, commanding a dedicated band of readers. Despite odds, the magazine is brought out, keeping alive the family tradition.

(The Hindu, Monday, January 6, 1997)

నిలువెత్తు సంతకం

డా॥ ఆలపాటి రవీంద్రనాథ్, మిసిమి వ్యవస్థాపక సంపాదకులు, నవంబరు 4, 1922న, పూర్వపు తెనాలి తాలూకా గోవాడ గ్రామంలో జన్మించారు. ఎలాగో ఈ అస్తిత్వంలోకి ''విసిరివేయబడిన'' తరవాత తన అస్తిత్వానికి అర్థం కల్పించుకొన్న తీరు అద్భుతం. అందుకే 'మిసిమి' కి "All that we are is the product of what we have thought" is "We are what we think." అనే ధమ్మపద వాక్యాన్ని మకుటం చేసుకొన్నారు. చదువులు హైస్కూలుదాటకపోయినా, నాడు 1948 ల్లో రేరాణి, సినీమా, జ్యోతి లాంటి విశిష్ట, విలక్షణ పత్రికలు నడపినా, రూపురేఖాలావణ్యంలో, విషయ వైశిత్యంలో తనకు తానే సాటి అయిన 'మిసిమి'ని వ్యవస్థాపించి, సంపాదకించినా, "Time" (USA) పత్రికా పఠనా వ్యసనానికి లోనైనా, రసెల్ రాసిన "History of Western Philosophy", Will Durant, Gabrielలు రాసిన "The Story of Civilization" గ్రంథాలను అవలోఢనం చేసినా, - వీటన్నింటిలో ఆయన ఎదిగిన, చేరన ఎత్తులు, తన అస్తిత్వానికి చెప్పుకొన్న, కల్పించుకొన్న అర్థం (సారం) కనిపిస్తుంది. తెనాలిలో జ్యోతి ప్రెస్‌ను ప్రారంభించి దానిని హైదరాబాద్‌కు తరలించి, హైదరాబాద్‌లోనే అగ్రగామి అయిన కళాజ్యోతి ప్రాసెస్ లిమిటెడ్ గా ఎదిగించడంలో ఆయన ప్రతిభ కనిపిస్తుంది.

ఆయన అనన్యకతను దర్శించాలంటే ఆయన పేరు పెట్టడాన్ని చూడాలి. అవి అందంగా ఉంటాయి. అవి మరొక చోట కనిపించవు. ఆయన పెట్టిన పబ్లికేషన్స్ పేరు 'జాకోబిన్' పబ్లిషర్స్. స్థాపించిన పత్రికల పేర్లు 'రేరాణి', 'జ్యోతి', 'సినీమా', 'మిసిమి' విజయవాడలో ఇంటికి ఇచ్చిన విలాసం 'పల్లవి'. ఆయనకు సౌందర్య నేత్రం ఉంది. He has an eye for beauty. అందుకే అలాంటి పేర్లు పెట్టగలిగారు. పేర్లకు తగ్గట్టు వాటిని ''నాజూకు''గా తీర్చి దిద్ద గలిగారు.

''ఎవరితోనైనా, ఏ విషయం మీదనైనా ''అర్థవంతమైన'' సంభాషణ సాగించగల సామర్థ్యాన్ని నాకందించింది 'Time' అంటారు ఆయన. నాలుగు దశాబ్దాల పాటు 'Time' పత్రికని క్రమం తప్పక, తుదిశ్వాస (1996 ఫిబ్రవరి 11) విడిచేవరకు చదివారు. "Anatomy is Destiny" అన్నాడు ఫ్రాయిడ్. ఈ స్థాయికి ఎదగడానికి ఆయన అవిరళ కృషేకాదు, ఆయన రూపురేఖా తనూ విలాసం కూడా కారణమే. అనితరమైన ఆయన సౌందర్యం మొదటిగా బాటవేస్తే, ఆ బాటకు ఆయన మేధ కళాభిరుచులు బలం చేసి రంగులు దిద్దేవి.

జీవితాన్ని రెండు రకాలుగా జీవించవచ్చు : (1) Living fully and (2) Fully Living. కొంతమంది జీవితాన్ని తామరాకు మీద నీటి బొట్టులా, ఉపాంతం (Margin) లో, లోతులు తాకకుండా జీవిస్తారు. అలా కాకుండా జీవితాన్ని నిండుగా గాఢంగా జీవించాలంటారు ఆయన. ఇదే Living fully అంటే. ఇహ మరొకటి, మనకిచ్చిన కాలాన్నంతా - సహస్రచంద్ర దర్శనకాలమో, నూరు శరత్తుల కాలమో జీవించడం. ఇది కాలాన్ని నింపే జీవితం. ఎండు వారిన కట్టెలా కాక,

గణితసూత్ర (mathematical), వ్యాకరణ సూత్ర (grammatical) మానవునిగా కాక, గాఢాభి నివేశంతో, నిండుగా, లోతుగా, పూర్ణంగా అరిమరికలు లేని, ''ఎంపిక లేని ఎరుక'' (Choice less awareness) తో జీవించాలంటూ ఉండేవారు ఆయన. అనడమే కాదు, ఆదారిలో కొంతమేర నడిచారు.

ఆయన స్థాపించిన, చేపట్టిన ప్రతి దాని మీద మనకు ఆయన ''సంతకం'' కనిపిస్తుంది. 'మిసిమి' మీద ఇప్పటికీ.......

('మిసిమి' నవంబరు - 1997 నుండి)

Dr. K. JAGGAIAH, B.A., D.Litt.
MOVIE ARTISTE

'మిసిమి' పత్రికను ఆదినుంచీ క్రమం తప్పకుండా చదివే పాఠకులలో నేనొకణ్ణి. ఆ అర్హతతో మీకు రెండు ముక్కలు వ్రాయాలనిపించింది.

యిది ELITE పత్రిక. ఇలాంటి పత్రికలు పూర్వం ఉండేవి కాని ఇప్పుడు అరుదు. ఆ కొరతను మీరు తీరుస్తున్నందుకు నా అభినందనలు. పాక్షికదృష్టి లేకపోవడం మీ Policy లో సుగుణం. విషయ సంకలనంలో కావలసినంత వైవిధ్యం ఉంది. వ్యాసాలు చాలావరకు మంచి స్థాయిలో ఉండడమేకాక, ఆసక్తికరంగా కూడా ఉంటున్నై. 'దర్శనాలు', 'చిత్రకళ' గురించిన వ్యాసాలు ఈ సందర్భంగా పేర్కొనదగినవి. అక్కడక్కడా కొన్ని రచనల్లో మాత్రం CLARITY ఉండడం లేదు. వ్రాసేవాళ్లు పండితులు కావచ్చు. కాని వాళ్లు వ్రాసేది మాత్రం పండితులు కానివాళ్ల కోసం (అలాగని పామరులు కాదు) అని గుర్తించుకోవడం అవసరం.

DEVIL'S DICTIONARY ప్రచురణ ఒక ప్రత్యేకాకర్షణ. ఎక్కడా దొరకనిది ప్రచురించి గొప్ప సేవ చేశారు. ప్రసిద్ధమైన, ప్రసిద్ధులైనవారి PAINTINGS ముఖచిత్రాలుగా ఎన్నుకుంటున్న మీ అభిరుచికి Hats Off. కాని నాకు నచ్చని ఒకే ఒక విషయం : మీరు కూడా ఇటీవల COMMERCIAL ADVERTISEMENTS వేయడం. నా దృష్టిలో అది 'విరోధాభాస',. ఆ పేజీలను కూడా మంచి చిత్రాలకు వాడుకుంటే, క్వాలిటీ నిలబడుతుంది.

ఏమైనా మీరు మంచి పని చేస్తున్నారు. ఈ పత్రికను మీరు మీ తృప్తికోసం నడుపుతూ ఉండవచ్చు; కాని దానివల్ల చదివేవారికి అంతకంటే ఎక్కువ ప్రయోజనం కలుగుతున్నదనడం మరింత వాస్తవం.

CHEERS AND MAY YOUR TRIBE INCREASE !

'MISIMI' MARCHING AHEAD

It does one's heart good to see a serious periodical like 'MISIMI', not only surviving but marching from strength to strength, month by month. It is not a matter of circulation but of cerebration. Even if there are a thousand readers influenced by its content, it will be a substantial gain to the intellectual life of the Telugu - speaking public.

I was particularly impressed by the article (reproduction of a lecture, rather) on the origin of the caste system in India by the late Dr. BSL Hanumantha Rao. Caste-system is one of the most intriguing but durable features of Indian polity. Almost everybody denounces it on the public platform, but few or none seem to have the guts to break away from its bonds in private life. As for its origin, there are as many theories as there are scholars or pseudo-scholars. Dr. Hanumantha Rao had done some original research and broken new ground in this confusing jungle of myths and legends, miscalled theories. It was a pleasant surprise to read of the presence of the priestly class in the Harappan civilisation, which had come into the Aryan society; also that the 'Sudras' were not 'Dasyus' or 'Dravidians'. (a valuable addition to Dr. B.R. Ambedkar's booklet, "Who are the Sudras"?).

Mr. Sardesai Tirumala Rao's brief but pointed note on 'Sex and Sringara' was refreshingly frank. We have a long hallowed tradition of hypocrisy. That is why it is just as well that the Rigveda and Sri Venkateswara Suprabhatam are left to remain in Sanskrit. I am sorry that Tirumala Rao, whom I knew well, with his quest for knowledge, is no more.

There are many talented scholars, like B. Srinivasacharya, who is a good critic, In addition to being a seasoned translator.

Even the quotations used to fill blank spaces have a quality of their own. The paragraph on Indian tradition from M.N. Roy, in which he says: "India experienced neither a Renaissance nor a Reformation. The intellectual stagnation lasted until the middle of the 19th century, when a faint echo of the modern rationalist and liberal thought reached India to disturb India partially. During the latter half of the century, the intellectual life of the country was influenced by a number of men who preached revolt against religious orthodoxy, intellectual parochialism and social injustice. There was no great philosopher amongst them".

These observations should make us think and re-assess our own heritage with objectivity.

- Dr. D. Anjaneyulu, Madras.

(మిసిమి పై పాఠకుల అభిప్రాయములు - ఆగస్టు, 1994 ప్రత్యేక సంచిక)

విశిష్ట మాస పత్రిక

'మిసిమి' సంపాదకులు ఆలపాటి రవీంద్రనాథ్ గారికి,

నమస్కారం.

'మిసిమి' అయిదు సంవత్సరాలు పూర్తిచేసుకొని ఆరవ సంవత్సరంలో ప్రవేశిస్తున్నందుకు 'మిసిమి'కీ, దాని సంపాదకులకూ, దాని రచయితలకూ, పాఠకులకూ, దానికి సంబంధించిన ఇంకా ఇతరులకూ హార్దికాభినందనలు తెలుపుకోటం ఎంతో ప్రమోదకరంగా వున్నది.

తెలుగులో ఇటువంటి విశిష్ట మాసపత్రిక అస్తిత్వం తెలుగులోని ప్రౌఢ సాహితీరంగానికి ఎంతో గర్వకారణం. కల్పనా సాహిత్యం, కవితా సాహిత్యం వాటి రంగాల్లో అవి చాలా విలువైనవే, సందేహం లేదు. అదంతా హృదయ సాహిత్యం. కాని మనిషి హృదయ సత్తాతో మాత్రమే జీవించలేడు. హృదయానికి తోడు మేధ కూడ ఎంతో అవసరం.

అటువంటి మేధను ప్రతిబింబించే తెలుగు పత్రికలు ఇటీవలి కాలంలో లేవనే చెప్పాలి. ఈ లోపాన్ని గుర్తించిన రవీంద్రనాథ్‌గారు ఈ లోపాన్ని తీర్చసంకల్పించి 'మిసిమి'ని స్థాపించి ఈ లోపాన్ని తీర్చారు. ఇందులో ఆలోకనకు, ఆలోచనకు, సమాలోచనకు, శాస్త్రీయ దృక్పథానికి, తాత్త్విక, తార్కిక చర్చలకు, భౌతిక విజ్ఞాన, మనో విజ్ఞాన సత్యాన్వేషణలకు వైశిష్ట్యాన్ని, వైలక్షణ్యాన్ని, వైవిధ్యాన్ని పాఠకులకు అందిస్తూ వారి జిజ్ఞాసా జ్వాలను ప్రజ్వరింపజేయటంలో సఫలులు అయినారు.

ఇటువంటి ప్రగాఢ పత్రికను నడపటంలో ప్రధానమైన చిక్కు ఏమంటే కల్పనా సాహిత్యాన్ని సృష్టించే రచయితల వలె ఇటువంటి మేధా సాహిత్యానికి రూపం ఇచ్చే రచయితలు ఎక్కువగా వుండకపోవటం.

అయినా, ఇటువంటి ప్రగాఢ రచయతలు కొందరైనా లేకుండా లేరు తెలుగు సాహితీరంగంలో, రవీంద్రనాథ్‌గారు అటువంటి విశిష్ట సమర్థు లందరనూ గాలించి పట్టుకొని 'మిసిమి'ని పూర్తిగా మెరిసే విధంగా, మసక రానీయకుండా ప్రోజ్వలంగా తీసుక వస్తూనే వున్నారు.

ఒక పత్రిక స్ఫూర్తితో జీవించాలంటే, ఆర్తిని ప్రత్యక్షం కాకుండా చూడాలంటే దాని సంపాదకులకంటే కూడ, రచయితల కంటేకూడ ప్రముఖ అవసరం దాని పాఠకులు.

మంచిదానికి దాని భవిష్యత్తు ఎల్లప్పుడూ మంచిగానే వుంటుంది.

– సంజీవదేవ్

రవీంద్ర లేఖిని

రవీంద్రనాథ్ స్వీయ రచనలు

విలువల పరివర్తనంలో మహాభారతం ఒక మైలురాయి

యుగం అనే పదాన్ని రెండు రకాలుగా అర్థం చేసుకోవచ్చు. ఒకటి హిందువులు అర్థం చేసుకొనే తీరులో. వీరు విశ్వకాల చక్రాన్ని నాలుగు భాగాలుగా విభజిస్తారు. వాటిని సత్య, త్రేతా, ద్వాపర, కలియుగాలంటారు. రెండో అర్థం ఆధునికార్థం. అంటే నాగరికత సంస్కృతి, విలువలు ఆధారంగా కాలాన్ని విభజించడం. ప్రాచీన యుగమని, మధ్యయుగమని, ఆధునిక యుగమని ఆధునికులు కాలాన్ని విభజిస్తారు. ఈ వ్యాసంలో యుగం అనే పదాన్ని రెండో అర్థంలో అర్థం చేసుకోవాలి. హిందువుల నమ్మకాల ప్రకారం మహాభారత యుద్ధం ద్వాపరయుగాంతంలో జరిగినా, ఆధునికార్థంలో అది విలువల పరివర్తన దిశలో ఒక మలుపుకు శ్రీకారం చుట్టింది. ఈ మలుపు నుంచి విలువలన్నీ పూర్తిగా మారిపోయాయని కాదు. విలువలు ఎప్పుడూ మారుతూనే ఉంటాయి.

ప్రేమాయణం రసాయనికమా?

ప్రేమ మీద వెలువడినంత సాహిత్యం ఇంతవరకు మరో విషయం దేనిమీద వెలువడలేదు. ఈ 'వస్తువు' దొరక్క పోతే కవులూ, గాయకులూ, నవలాకారులూ ఏమీ చేసి ఉండేవారో? సినీ పరిశ్రమ ఏమైఉండేదో? బహుశా ప్రపంచానికి పిచ్చెక్కి ఉండేది. ప్రేమకోసం యుద్ధాలు జరిగాయి. గ్రీకు పురాణం ఇలియడ్‌లో హెలీనా అనే ఒక స్త్రీ కొరకై వేయి నౌకలు యుద్ధానికి బయలుదేరడం మనం చూస్తాం. ఆ యుద్ధంలో ప్రాణాలు పోయిన వారి సంఖ్య గణనాతీతం. ఇట్టి కథలు మనకు ఏదేశ చరిత్ర తిరగవేసినా కనిపిస్తాయి. ఈ ప్రేమను పదాలలో బంధించాలని మహాకవులు ప్రయత్నించారు. ఒక పదిహేడవ శతాబ్దకవి ప్రేమను ''అరుణారుణ జపాకుసుమం'' (red red rose) అన్నాడు. సింక్లేర్ లూయీ దానిని ''ఉదయతార, సాంధ్యతార''గా వర్ణించాడు. అయినా అది కవులకుగాని మరెవరికీగాని చిక్కదు, దొరకదు. అది దొరకకపోయినా చిక్కక పోయినా ఇహలోకమైందే. లైంగిక సంబంధిగూడ.

ప్రేమాయణం రసాయనికమా?

ఆలపాటి రవీంద్రనాథ్

ప్రేమ మీద వెలువడినంత సాహిత్యం ఇంతవరకు మరో విషయం దేనిమీదా వెలువడలేదు. ఈ 'వస్తువు' దొరక్క పోతే కవులూ, గాయకులూ, నవాలకారులూ ఏమి చేసి ఉండేవారో? సినీ పరిశ్రమ ఏమైఉండేదో? బహుశా ప్రపంచానికి పిచ్చెక్కి ఉండేది. ప్రేమకోసం యుద్ధాలు జరిగాయి. గ్రీకు పురాణం ఇలియడ్‌లో హెలీనా అనే ఒక స్త్రీ కొరకై వేయి నౌకలు యుద్ధానికి బయలుదేరడం మనం చూస్తాం. ఆ యుద్ధంలో ప్రాణాలు పోయిన వారి సంఖ్య గణనాతీతం. ఇట్టి కథలు మనకు ఏదేశ చరిత్ర తిరగవేసినా కనిపిస్తాయి. ఈ ప్రేమను పదాలలో బంధించాలని మహాకవులు ప్రయత్నించారు. ఒక పదిహేడవ శతాబ్దకవి ప్రేమను ''అరుణారుణ జపాకుసుమం'' (red red rose) అన్నాడు. సింక్లేర్ లూయీ దానిని '' ఉదయతార, సాంధ్యతార''గా వర్ణించాడు. అయినా అది కవులకుగాని మరెవరికిగాని చిక్కదు, దొరకదు. అది దొరకకపోయినా చిక్కకపోయినా ఇహలోకమైందే. లైంగిక సంబంధిగూడ.

మనం ఇక్కడ రొమాంటిక్ లవ్‌ను గురించి చెప్పుకొంటున్నాము. దీనిని సరిగా తెనిగించడం కుదరదు. దీనిని కాల్పనిక ప్రేమ, అద్భుత ప్రేమ. పెళ్ళికి దారితీసే ప్రేమ (courtly love), మోహప్రేమ (passionate love) మనోహర ప్రేమలుగా చెప్పవచ్చు. ఇది రాయప్రోలుగారి అమలిన శృంగారం, ప్లేటో ప్రేమ (platonic love) కంటే భిన్నమైంది. ఇలాంటి రొమాంటిక్ ప్రేమ మొదట్లో అనేక సంస్కృతులలో లేదు అంటే మనకు ఆశ్చర్యం వేస్తుంది. గ్రీకు సంస్కృతిలో గూడ ప్రేమ ఆడ-మగ మధ్య లేదు. మగ-మగ, ఆడ-ఆడ మధ్య మాత్రమే ఉండేది. అసలు ఇటువంటి ప్రేమ- ఆడ- మగ మధ్యప్రేమ 12వ శతాబ్ది నుంచి ప్రారంభమైనట్లు కనిపిస్తుంది. దీని లక్షణాలు విధిమీద ఆధారపడడం, అహేతుకత, అనియాంత్రియత, బాధ ఉల్లాసాల సమ్మిళితం. ఈ ప్రేమ బహుశ ఆరోజుల్లో వివాహ పూర్వ, వివాహం కాని ఆడ - మగ సంబంధాలకు మాత్రమే పరిమితమైందని అనుకోవచ్చు. అంటే వివాహమైనవారు విధిబద్ధులు (duty bound) కనుక, వారికి అటువంటి అనుభూతులు కలిగి తీరుతాయని భావించబడింది.

తరవాత పద్దెనిమిదవ శతాబ్ది చివరలోగాని ఈ రొమాంటిక్ ప్రేమ జీవిత భాగస్వామిని ఎన్నుకోవడంలోకి, వైవాహిక సంబంధాలలోకి ప్రవేశించలేదు. తరవాత కాలంలో వ్యక్తిత్వం (individuality)కు ప్రాముఖ్యం పెరగడంతో దీని ప్రభావం గూడ ప్రేమ మీద పడింది. ఆ తరవాత పందొమ్మిదవ శతాబ్ది చివర, ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంలో ఆడ-మగ లైంగిక సంబంధాల మీద విక్టోరియన్ ఆదర్శాల ప్రభావం పడింది. ఆ తరవాత 1940, 1950లో గాని ప్రేమకు, సెక్సుకు దగ్గర సంబంధం ఏర్పడలేదు; లైంగికతమీద విక్టోరియా యుగ ఆదర్శాల ప్రభావం సడలిపోలేదు. మన దేశంలో గూడ 1950ల నాటి ప్రేమ గీతాలను నేటి ప్రేమ గీతాలతో పోలిస్తే మనకూ ఇది అర్థమవుతుంది.

ప్రేమ మానవ జీవితాలలో చాల ముఖ్యమైనదయినా, దీనిమీద అధ్యయనాలు జరగవలసినంతగా జరగలేదు. కొంత వరకు మానవ శాస్త్రజ్ఞులు, మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞులు, సామాజిక శాస్త్రవేత్తలు అధ్యయనం చేశారుగాని, జీవ రసాయనిక శాస్త్రవేత్తలు అసలు దీనిపై దృష్టి సారించనే లేదు.

గ్రీకులు నాలుగు రకాల ప్రేమల గురించి చెప్పారు: 1) కుటుంబ ప్రేమ: దీనిని పిల్లలు - తల్లిదండ్రులకు మధ్య ఉండే మమతానురాగాలని చెప్పవచ్చు. 2) (agape) : దానధనర్మాలు, దాతృత్వాలకు సంబంధించింది. తన సంపదను అందరితో పంచు కోవాలనే కోరిక. అయితే ఇందులో గుప్తదానం మాత్రమే ఉంటుంది. 3) అభిమానం: ఇది స్నేహానికి దగ్గర. ఇతరులను గౌరవించడం, ఇతరులతో కలసిమెలసి ఉండాలని, కలిసి పని చేయాలని, ఇతరులతో పంచుకోవాలని ఉంటుంది. 4) మన్మథ ప్రేమ: ఇది మనం చెప్పుకొంటున్న రొమాంటిక్ ప్రేమ.

ఈ రొమాంటిక్ ప్రేమను నిర్వచించడం చాలా కష్టం. రీస్ అనే సామాజిక శాస్త్రవేత్త ప్రేమ సంబంధానికి నాలుగు కొలతలున్నాయన్నాడు. 1) పరస్పరాకర్షణ 2) స్వీయ నివేదనం (Self disclosure) 3) ప్రవర్తనాత్మక పరస్పరాధారం 4) ఔద్వేగిక పరస్పర ఆదరణ. ఈ నాలుగు కొలతలు ఒక దానిని ఒకటి ప్రభావితం చేసుకొంటాయి. పరస్పరాకర్షణ కలిగినప్పుడు తమ విషయాలు రెండోవారికి చెప్పుకొంటారు. ఇలా చెప్పుకోవడంతో పరస్పరాకర్షణ అధికమవుతుంది. ఒకరి మీద ఒకరు ఆధారపడతారు. అంటే కొన్ని పనులు చేయడంలో ఇద్దరు కలిసి పనిచేసి, ఈ కలసి పనిచేయడం ద్వారా పరస్పరానందం పొందుతారు. పరస్పర సంతోషం పరస్పరాధారానికి దారితీస్తుంది. చివరకు ఔద్వేగిక పరస్పరాధారం ఆకర్షణను పెంచుతుంది. తిరిగి ఇది మిగతావాటికి దారితీస్తుంది. ఇద్దరు ప్రేమపాకంలో పడ్డాక ఒకదాని నుంచి రెండోదానిని విడదీయడం సాధ్యం కాదు. ఇంత చెప్పిన తరవాత, ప్రేయసి ప్రియుణ్ణి, ''నీవు నన్ను ఎందుకు ప్రేమిస్తున్నావు'' అని అడిగితే అతడు సమాధానం చెప్పలేడు.

మరి ఇంతకూ ఈ రొమాంటిక్ ప్రేమకు నిర్వచనం ఏమిటి? ఎరిక్‌ఫ్రామ్ దీనిని ''రెండో వ్యక్తితో పూర్తిగా సమ్మేళనం కావాలనే ఆరాటం''గా వర్ణించాడు. ఎరిక్ హెచ్. ఎరిక్‌సన్ ప్రకారం ''రెండు వ్యక్తిత్వాలు (identities) ఒకటి కావడం'' అంటాడు. ఇతడి ప్రకారం పరిణత ప్రేమ ప్రత్యేక అహం (ego identity) ఏర్పడిన తరవాతనే సాధ్యం అవుతుంది. ఈ 'ఏకం కావడాన్ని' సమ్మేళనాన్ని కొలవడం సాధ్యం కాదు. అందుకని ఇతరులు ప్రేయసీ ప్రియుల ప్రవర్తన పరంగా ప్రేమను నిర్వచించారు. ప్రేమికులు ఒకరికొకరు దగ్గరగా ఉండాలని కోరుకొంటారు. దూరంగా ఉన్నప్పుడు ''అంతా పోయినట్లే'' బాధపడతారు. ప్రేమించిన వ్యక్తిమీదే ఆసక్తి అంతా పూర్తిగా కేంద్రీకృతం అవుతుంది. ఆ ఆసక్తిలో రెండోవారికి చోటు ఉండదు. మనసు నిండా ప్రేమికుడే ఉంటాడు; లేదా ప్రేయసి ఉంటుంది. చేయగలిగినంత సహాయం ప్రేమికులు ఒకరికొకరు చేసుకొంటారు. వీరు లైంగికంగా గూడ ఒకరినిచూసి ఒకరు ఉత్తేజితులవుతారు. ప్రేమించిన వ్యక్తిలోని లోపాలను విస్మరించి, మంచి గుణాలను మాత్రమే గమనిస్తారు.

మొత్తం మీద రొమాంటిక్ ప్రేమ అనేది తీవ్ర సాకారాత్మక ఉద్వేగం. ఈ ఉద్వేగంలో నాలుగు అంశాలుంటాయి. (1) ఉత్తేజం (2) ప్రేమను ఆదర్శీకృతం గావించే సాంస్కృతిక సన్నివేశం

(3) వాస్తవ లేదా స్వైరకల్పిత వ్యక్తి సాన్నిధ్యం లేదా వ్యక్తి ఆకర్షణీయం అని భావించబడాలి (4) తాను ప్రేమలో పడ్డాననే విశ్వాసం. ఇలాంటి ప్రేమోద్వేగంతో ప్రభావితులైన వ్యక్తులు అంటే ప్రియుడు ప్రేయసిలో, ప్రేయసి ప్రియునిలో మొత్తం ప్రపంచాన్నే దర్శిస్తారు. ఇంతకు ముందు వారు ఏ రెండో వ్యక్తిని అంత లోతుగా గాఢంగా చూసి ఉండరు. వారికి ప్రేమే సర్వస్వం - అదొక ఉల్లాసం, ఒక ధారాపాతం, అది ఒక స్వేచ్ఛ, ఒక బానిసతనం, ఒక మత్తుమందు.

ఇంతగా మనుషులను ప్రభావితం చేసే ప్రేమను జీవశాస్త్రవేత్తలు, మానవ శాస్త్రవేత్తలు సరిగా దృష్టిసారించి శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేయలేదు. కొంతమంది శాస్త్రవేత్తలు ప్రేమ ఐదు ఆరు శతాబ్దాల క్రిందటే ఆరంభమైందని భావించారు. నాగరికత పెరిగేకొలది విరామం (పనిలేనితనం) ఎక్కువయిందని, అటువంటి పని లేని నాగరికత ఉబుసుపోక, వ్యాపకం కోసం ఈ ప్రేమోన్మాదం బుర్రలో చోటు చేసుకుంటుందని భావించారు. ప్రేమను సాంస్కృతిక భ్రాంతిగా వారు అభివర్ణించారు. అసలు దీనిని పాశ్చాత్య సంస్కృతి ఫలితం అన్నారు. అందుకనే ఈ ప్రేమ అన్ని నాగరికతలలో కనిపించదన్నారు. పాశ్చాత్య నాగరికతలో విరామం, సాహిత్య కళాభిరుచులు పెరిగాయి. అందుకనే ఆ నాగరికతలో రైతులు (మొరటు వారు) రతి కార్యంతో సంతృప్తి చెందితే, కులీనులు, జమీందారులు (నాజూకు మనుషులు) ప్రేమలో పడతారు. ''వివాహం అవసరమా?'' అనే గ్రంథంలో మనో విజ్ఞాన శాస్త్రజ్ఞుడు లారెన్స్ కాస్లర్ ఇలా అంటాడు: ''మానవ స్వభావంలో ప్రేమ అంతర్భాగం అంటే నేను ఒక క్షణం గూడా విశ్వసించను. సామాజిక ఒత్తిడులు పనిచేస్తున్నాయి''.

కాని కొంతమంది శాస్త్రవేత్తల దృష్టి వేరొక విధంగా ఉంది. గత కొన్నేళ్ళుగా వీరు పై చెప్పిన వాటికంటే భిన్నాభిప్రాయాలను వెలువరిస్తున్నారు. ప్రేమ కేవలం పాశ్చాత్య నాగరికత, సంస్కృతుల ఫలితం కాదు. విలియమ్ జాంకోవిక్ అనే శాస్త్రవేత్త 166 సంస్కృతులను పరిశోధించి వాటిల్లో 147 సంస్కృతులలో కాల్పనిక ప్రేమను గమనించానన్నాడు. మరి ఈ 147 సంస్కృతులు పాశ్చాత్యాలు కావు కదా! దీనిని బట్టి ప్రేమ విరామ సృష్టి, సాంస్కృతిక భ్రాంతి కాదు. ప్రేమ వాస్తవం, జైవికం, శారీరకం అని తెలుతుంది. దాని వేరులు శారీరక వ్యవస్థలో నాటుకొని ఉన్నాయి.

మనకు పైకి మత్తుగా, అహేతుకంగా, అర్థరహితంగా కనిపించే ప్రేమ, దాని మూలాలకు వెళ్ళి చూస్తే అది పరిణామం, జీవ, రసాయన వ్యవస్థల మీద ఆధారపడినట్లు అర్థమవుతుంది. అది ఒక సర్జక శక్తి. మానవజాతి మనుగడ సాగించడానికి, పరిణామాన్ని సజావుగా నడపడానికి ప్రకృతి పన్నిన కుట్ర ప్రేమ. అందుకే మానసిక శాస్త్రవేత్త మైకల్ మిల్స్ ప్రేమను ''మన చెవుల్లో మన పూర్వీకులు చెప్పే గుసగుసలు, ఊసులు''గా అభివర్ణించాడు.

పరిణామ క్రమాన్ని చూసినట్లైతే, మానవజాతి నాలుగు కాళ్ళమీద నడవడం మాని, రెండు కాళ్ళపై నిటారుగా నడవడం ప్రారంభమైనప్పుడే అంటే దాదాపు నాలుగు మిలియన్ల సంవత్సరాల పూర్వమే రొమాంటిక్ ప్రేమ ఆరంభమై ఉండవచ్చు. అలా నిలబడి ఒకరి నొకరు

చూసుకోవడంతో, జంతువులా నాలుగు కాళ్ళమీద నడిచేటప్పటికంటె, పూర్తి వ్యక్తిని చూడడం మొదటిసారిగా సాధ్యమైంది. లైంగిక అవయవాలు ఇప్పుడు పూర్తిగా కనిపిస్తాయి. ఛాతినీ, స్తనాలను, కన్నుల రంగును దర్శించ వీలైంది. ఒకరు రెండోవారికి ఒక అనన్యమైన ''ఎరొ''గా కనిపించారు. ఆడ-మగ ఒకరి కళ్ళల్లోకి ఒకరు తదేకంగా చూసుకొన్నప్పుడు, అరచేతుల్లో చెమటలు పోయడం, విమూఢంగా కనిపించేటట్టు పళ్ళికిలించడం లాంటి ప్రక్రియలకు దారితీసే నాడీ రసాయనాలు మస్తిష్కం నుంచి రక్తప్రవాహంలోకి స్రవించడం బహుశా నాడే మొదలైంది. అదే రొమాంటిక్ ప్రేమ ప్రఫుల్లం కావడానికి నాంది పలికింది. జంతువులు వెనక నుంచి రతి జరిపితే, నిటారుగా నిలబడ్డ మానవుడు ముఖా-ముఖి బంధాన్ని అనుసరించాడు. దీనితో రతి కార్యం కొత్త పుంతలు తొక్కింది. దీనిలో ''చూపులు'' వ్యక్తి ఆకర్షణలు విస్తృతంగా చోటుచేసుకున్నాయి.

పిల్లలను కనడానికి ప్రేమ అవసరం లేదు. వీర్యం బ్యాంకుల నుండి తెచ్చుకొని కనవచ్చు. సెక్సు ఉంటె చాలు అని మనకు తెలుసు. కాని మరి పిల్లలను సాకడానికి కుటుంబం అవసరం. అంటే స్త్రీ-పురుషులు కలిసి కుటుంబంగా జీవించాలి. అప్పుడే పిల్లలు ఎదిగి పెద్దవారవుతారు. మరి కేవలం సెక్సు ఆ ఇద్దరిని అలా కలిపి ఉంచదు. లైంగిక వూపు తగ్గిన తరవాత ఎవరి దారిన వారు పోవచ్చు. ఇద్దరిని బంధించి ఉంచేది ప్రేమ మాత్రమే. ఈ విధంగా ప్రేమ మానవ పరిణామ ప్రక్రియకు దోహదం చేస్తుంది.

మనం సంస్కృతి జీవులం కనుక, మనం ప్రేమను, మన సంస్కృతి చెప్పినట్లు శాశ్వతం అని భావిస్తాం. కాని ఫిషర్ అనే సైకాలజిస్టు అనేక సంస్కృతులను పరిశీలించి, ఈ 'మోహం' కాలపరిమితి నాలుగు సంవత్సరాలే అని తేల్చింది. పూర్వకాలంలో జంటలు నాలుగేళ్ళపాటు మాత్రమే - అంటే పిల్లలు శైశవం దాటేవరకు మాత్రమే సాగేవి. తరవాత నూతన భాగస్వాములను ఎన్నుకొనేవారు. ఈనాటి విడాకులు రేట్లను చూసినా, ఇదే విషయం రుజువు అవుతున్నది. వివాహానంతరం నాలుగో సంవత్సరంలో విడాకులు అధికంగా ఉన్నాయి. ఆ నాలుగో సంవత్సరంలో మరో బిడ్డ కలిగితే ఆ జంట మరో నాలుగు సంవత్సరాలు కొనసాగుతుంది. అదనపు బిడ్డలు ఇలా జంటల బంధాలను పొడిగిస్తారు. ఇలా ఒకటి, రెండు అదనపు బిడ్డలు కలిగిన తరవాత, వారు పరిణతి చెంది కలిసే జీవనం సాగిస్తారు. దీనిని ''చతుర్వర్ష కాంక్ష'' (Four year itch) అంటారు. మార్లిన్ మన్రో నటించిన ''సప్తవర్ష కాంక్ష''లో (Seven year itch) ఈ విషయం కనిపిస్తుంది. చాతుర్వార్షిక మోహాలను ప్రకృతి వెదజల్లుతుందని ఫిషర్ భావిస్తున్నారు.

మనుషుల్లో ప్రేమను ప్రకృతి చిగురింప జేస్తే, సంస్కృతి ప్రేమలో విశ్వాస పాత్రతను ప్రవేశపెట్టింది. ''ఒకరు ఒకరినే ప్రేమిస్తారు. హృదయంలో రెండోవారికి చోటులేదు. భార్య భర్తకు విశ్వాస పాత్రురాలై ఉండాలి. అలాగే భర్త భార్యకు'' లాంటి మాటలు మనం వింటూ వుంటాం. పరిణామ ప్రక్రియకు దోహదంగా, ప్రకృతి ఏర్పాటు చేసిన ప్రేమలో విశ్వాస పాత్రతకు చోటులేదు. తొలి దినాల నుంచి చూసినా, ఏక ప్రథ (ఒకరితోనే పొందు) ఆదర్శవంతమైనదిగా కనిపించినా, ఈ ముసుగులో చాటు మాటు వ్యవహారాలు చోటు చేసుకొంటూనే ఉన్నాయి అని ఫిషర్

అంటున్నారు. ఇలాంటి చాటుమాటు వ్యవహారాలతో, తరవాతి తరానికి నూతన జన్యువులు ప్రసాదింపబడే అవకాశాలు హెచ్చు అయ్యాయి.

ఈవిధంగా ప్రేమ పరిణామ ప్రక్రియలో ప్రకృతి ఆడిన ఆటే కాదు. జైవిక లేదా రసాయనిక ప్రక్రియలకు పెట్టిన అందమైన పేరు ''ప్రేమ''. ప్రేమ రసాయనిక ప్రక్రియ ఎలాగో ఇప్పుడు చూద్దాం.

ప్రేయసీ ప్రియులు ఒకరి కళ్ళల్లోకి ఒకరు తదేకంగా చూసుకొన్నప్పుడు, చేతులు చేతులు పెనవేసుకొన్నప్పుడు, ఒకరి శరీరాన్ని మరొకరు వాసన చూసినప్పుడు మస్తిష్కంలో ఒక వరద బయలుదేరి నరాలగుండ ప్రవహిస్తుంది. చర్మం కెంపు బారుతుంది. అరిచేతులు చెమటలు పోస్తాయి. ఉచ్ఛ్వాస నిశ్శ్వాసల అధికమవుతాయి. బుగ్గలు గులాబిరంగుగా మారుతాయి. దీనికంతటికి కారణం శరీరంలో సంభవించే రసాయనిక చర్యలే.

ప్రేమలో పడుతున్నప్పుడు, ఆ సమయంలో ఏదో ఉల్లాసాన్ని అనుభవిస్తాడు. దీనికి కారణం ఆమ్ఫిటమైన్స్ సదృశ రసాయన పదార్థాలు అతనిని ముంచెత్తడమే. దీనిలో డోపమైన, నొరెపినెఫైన్ ఇంకా ముఖ్యంగా ఫెనిలెథిలమైన్ (PEA) లు ఉంటాయి. The Science of Love: Understanding Love and Its Effects on Mind and Body" అనే గ్రంథంలో ఆంతోని వాల్ష్ ఇలా అంటున్నారు: ''కొత్త వారిని చూసి నీవు స్పందించే అతిమోహ, వ్యామోహ దరహాసాన్ని PEA ఇస్తుంది. ఆకర్షణీయమైన వ్యక్తిని చూసినప్పుడు మస్తిష్కంలోని PEA ఫ్యాక్టరీ ఉద్దీపితమవుతుంది''. కాని ఈ PEA వల్ల లేచిన ఉత్తుంగ తరంగాలు ఎక్కువకాలం నిలవవు. అందుకనే కాల్పనిక ప్రేమ (మోహ ప్రేమ) కలకాలం నిలవదని అంటారు. కాలం గడచేకొలది ఈ PEA కి వ్యతిరేకంగా శరీరం సహనశక్తిని Immunity అలవరుచుకొంటుంది. రెండు మూడేళ్ళ తరవాత శరీరం కావలసినంత PEA ను ఇవ్వలేదు. ఈ రకంగా రసాయనాలు విదళితం కావడంతో చాలమంది సంబంధాలనే తెంచుకొంటారు. ముఖ్యంగా ఆకర్షణ మత్తుల విషయంలో ఇది వర్తిస్తుందని డా॥ మెకల్ లెబోవిట్జ్ అన్నారు. మొదట్లో ప్రేయసి ప్రియుల మధ్య ఉన్న మత్తు, మోహాలు తరవాత తరవాత కరిగిపోతాయి.

కాని కొంతమంది ప్రేమ మొదటి సంవత్సరాన్ని దాటుతుంది. ఇలాంటి వారిలో మరోరకం రసాయన పదార్థాలు - ఎండోర్ఫిన్స్ - మస్తిష్కంలో జనిస్తాయి. ఇవి ప్రేమికులకు ఉపశమనం కలిగిస్తాయి. అందుకని అవి వారికి ఒకరకం భద్రత, ప్రశాంతి, నెమ్మదిని కలిగిస్తాయి. అందుకనే జంటలో ఒకరు చనిపోయినప్పుడు రెండోవారికి విపరీతమైన బాధ కలుగుతుంది.

ఇక్కడ మనం ఆంఫెటమైన్‌లు, PEA వల్ల కలిగే మోహావేశానికి, ఎండార్ఫిన్‌లవల్ల కలిగే దీర్ఘకాలిక, సన్నిహిత, స్నిగ్ధ రాగబద్ధతకు తేడాను గుర్తించాలి. ''తొలిప్రేమ, అవతలి వ్యక్తి నీలో కలిగించిన అనుభూతి ప్రకారం కలిగిన ప్రేమ. పరిణత ప్రేమ ఎలాంటిదంటే ''అవతలి ఉన్నవానిని ఉన్న విధంగా ప్రేమించే ప్రేమ'' అన్నాడు మార్క్ గౌల్‌స్టన్ అనే సైకియాట్రిస్ట్. అదే ''మోహ ప్రేమ''కు సహానుకంప ప్రేమ''కు తేడా.

ప్రేమ ప్రక్రియలో పనిచేసే మరో రసాయనం ఆక్సిటోసిన్. ఇది మస్తిష్కంలో ఊరుతుంది. నరాలను సున్నితం చేస్తుంది. ఉద్దీపింప జేస్తుంది. ఇది మామూలుగా తల్లులకు పాలు పడడానికి పిల్లల్ని హత్తుకొని ముద్దాడడానికి దోహదం చేస్తుంది. అదేవిధంగా ఇది ప్రేమికులలో హత్తుకొని పడుకోవడానికి దారితీయవచ్చని ఊహిస్తున్నారు. అంతేకాదు ఇది విస్పృష్టికి (భావప్రాప్తికి) తోడ్పడవచ్చని చెప్తున్నారు.

ఇక్కడొక ప్రశ్న ఉదయిస్తుంది. రసాయనాలు ప్రేమకు దోహదాలైతే, ఎవరు ఎవరితోనైనా ప్రేమలో పడవచ్చుకదా. పలానా వ్యక్తి పలానా వ్యక్తితో ప్రేమలో పడాలని లేదుకదా. మరి అలా జరగడం లేదుకదా. దీనికి సమాధానాన్ని మనం జీవశాస్త్రంలోను, రసాయన శాస్త్రంలోను చూడవలసిందే.

మగవారు గరిష్ఠ సంతానాన్ని కనగల వయస్సు ఉన్న స్త్రీనే అంటే 18 నుంచి 28 సంవత్సరాలు స్త్రీలనే ఎంచుకొంటే, స్త్రీ మాత్రం భద్రత, సంతానాన్ని ఇవ్వగల, సమాజంలో అంతస్తున్న పురుషుని ఎంచుకొంటుంది. ఇవి కొంతవరకు సత్యమే అయినా, మరి పద్మ హొయలు సూర్యున్ని ఆకర్షించినంతగా సీతవగలు ఆకర్షించవు, కారణం ఏమిటి?

ప్రకృతి ఒక ప్రత్యేక వ్యక్తికోసం ఒక ప్రత్యేక వ్యక్తిని ఏర్పాటు చేసింది అంటాడు వాల్ష్. ప్రతి ఒక్కరి బుర్రలో, ఆదర్శ ప్రియుని (ప్రేయసిని) ఎన్నుకొనేవిధంగా మార్గదర్శక సూత్రం - ఒక ప్రేమ పటం (love map) - నిక్షిప్తమై ఉంటుంది. అందుకని ప్రేమించడం ఆ పటం ప్రకారం జరగవలసిందే. అందుకని ఏక కాలమందు ఇద్దరు వ్యక్తులను ప్రేమించడం సాధ్యం కాదు. ఈ పటం చిన్నప్పటి నుంచి వ్యక్తి పొందిన అనుభూతులు ఆధారంగా రూపొందుతుంది.

అందుకని మొత్తంమీద రొమాంటిక్ ప్రేమ ఒక మానసిక ఉద్వేగం కాదు. అది జైవికం, మస్తిష్క ముద్రా సమన్వితం, రసాయనాల ఫలితం, పరిణామ పరికరం, ప్రకృతి పన్నిన వ్యూహం.

ఈ వ్యాసం 1994లో 'తెలుగు జగతి' ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభల ప్రత్యేక సంచిక - మద్రాసులో ప్రచురితమైంది.

విలువల పరివర్తనంలో మహాభారతం ఒక మైలురాయి

యుగం అనే పదాన్ని రెండు రకాలుగా అర్థం చేసుకోవచ్చు. ఒకటి హిందువులు అర్థం చేసుకొనే తీరులో. వీరు విశ్వకాల చక్రాన్ని నాలుగు భాగాలుగా విభజిస్తారు. వాటిని సత్య, త్రేతా, ద్వాపర, కలియుగాలంటారు. రెండో అర్థం ఆధునికార్థం. అంటే నాగరికత సంస్కృతి, విలువలు ఆధారంగా కాలాన్ని విభజించడం. ప్రాచీన యుగమని, మధ్యయుగమని, ఆధునిక యుగమని ఆధునికులు కాలాన్ని విభజిస్తారు. ఈ వ్యాసంలో యుగం అనే పదాన్ని రెండో అర్థంలో అర్థం చేసుకోవాలి. హిందువుల నమ్మకాల ప్రకారం మహాభారత యుద్ధం ద్వాపరయుగాంతంలో జరిగినా, ఆధునికార్థంలో అది విలువల పరివర్తన దిశలో ఒక మలుపుకు శ్రీకారం చుట్టింది. ఈ మలుపు నుంచి విలువలన్నీ పూర్తిగా మారిపోయాయని కాదు. విలువలు ఎప్పుడూ మారుతూనే ఉంటాయి. అయితే ఆ మార్పు గణనీయమైనదని మాత్రమే అర్థం. నాటి పితృస్వామ్య వ్యవస్థ నేటి దాకా కొనసాగుతున్నది. అలాగే నాటి సాహిత్య రూపాలు నేడు లేవు. అంటే కొన్ని మారతాయి. కొన్ని ఇంకా ఎక్కువకాలం కొనసాగుతాయి.

మహాభారత యుద్ధం దాయాదుల మధ్య అంతస్తు కోసం, ఆస్తి కోసం జరిగిన పోరు. వివిధ స్థాయిలలో ఇదే పోరు భారతదేశంలో అనేక కుటుంబాలలో కొనసాగింది. భారత దేశంలోనే కాదు దాదాపు అన్ని పితృస్వామ్య వ్యవస్థలలో ఇదే కొనసాగింది. ఈ ఇతిహాసం క్షత్రియ కుటుంబానికి సంబంధించిందే అయినా, బ్రాహ్మణ కుటుంబాలు, వ్యక్తులు గూడ పాలుపంచుకొన్నారు. అయితే ఈ కథలో వైశ్యశూద్ర వర్ణాలకు ప్రాముఖ్యం లేదు. దాదాపుగ ఆ రెండు వర్ణాలు విస్మరించబడ్డాయి.

అగ్రవర్ణాలు - బ్రాహ్మణ, క్షత్రియ - రెండు ఆధిపత్యం కోసం తగవులు పడ్డాయి. అంతేకాదు అవసరాన్ని బట్టి పరస్పర సహకారాన్ని అందించుకొన్నాయి. దేవతల మెప్పుకోసం జరిపే పూజలలో, ఇంకా ఇతర జాతక కర్మకాండాది క్రతువులలో యజ్ఞయాగాదులలో క్షత్రియులు బ్రాహ్మణ సహకారాన్ని తీసుకొన్నారు. బ్రాహ్మణులకు ఇదే హాయి అనిపించింది. కొద్దిమంది బ్రాహ్మణులు మాత్రం స్వతంత్రంగానో, లేదా క్షత్రియుల పోషణలోనో అరణ్యాలలో తపస్సు చేసుకొంటూ, గురుకులాలు నడిపారు. ద్రోణుడు, పరశురాముడు లాంటి వారు క్షత్రియాధికారాన్ని ఎదిరించారు. వైశ్య శూద్రుల ప్రస్తావన భగవద్గీతలో మాత్రం ఉంది. వైశ్యులు పశువులను మేపుకొని వ్యవసాయం; వ్యాపారం చేసుకొన్నారు. శూద్రులు పై మూడు వర్ణాలకు సేవలు చేసేవారని చెప్పింది. అయితే తరవాత కాలాల్లో ఇవన్నీ తలక్రిందులయ్యాయి. జైన బౌద్ధుల కాలంలో బ్రాహ్మణుల స్థాయి దిగజారింది. జైన, బౌద్ధమతాలకు దన్నుగా నిలిచిన వైశ్యులు జైన బౌద్ధ కథలలో నాయికా, నాయకులయ్యారు. ముఖ్యంగా జైన కథల్లో వైశ్యులు ప్రముఖ స్థానాన్ని ఆక్రమించారు. ఈ నూతన ఔన్నత్యంతో వైశ్యులు కష్టంతో కూడిన వ్యవసాయాన్ని వదిలి, తేలికగా

ఉండే వ్యాపారం, కుదువ వ్యాపారం చేశారు, భూస్వాములయ్యారు. శూద్రులు కాయకష్టం ఆవశ్యకమైన వ్యవసాయాన్ని, ఇతర చేతి వృత్తులను చేపట్టారు. మహాభారత కాలం వరకు క్షత్రియులే రాజ్యాలు యేలారు. ఆ తరవాత చాలామంది ప్రఖ్యాత పాలకులు క్షత్రియేతరులు. కోసలను 500 నుంచి 600 వరకు ఏలిన పసేనది క్షత్రియుడు కాడు. చంద్రగుప్త మౌర్యుడు శూద్రుడు (300 బి.సి.), హర్షుడు (600 ఎ.డి.) వైశ్య. ఈ ప్రఖ్యాత చక్రవర్తులే కాక ఇంకా చాలమంది క్షత్రియేతరులు రాజులయ్యారు. షుంగ, కణ్వాలాంటి బ్రాహ్మణులు రాజ్యాలు యేలారు.

మహాభారతం నాలుగు వర్ణాలను పేర్కొంది. కులాలను అంటే జాతులను మహా భారతం పేర్కొనక పోయినా అవి ఉన్నాయి. అటువంటి కులాలలో ఒకటి సూతకులం. సూతకాలం చాతుర్వర్ణాలలో పేర్కొనబడకపోయినా, అది ''మొదటి రెండు వర్ణాల కంటె తక్కువదిగాను, చివరి రెండు వర్ణాల కంటె పైన ఉంది'', అని శల్యుడు చెప్పాడు. వారికి జరిపే సంస్కారాలు ఇతరులకు జరిపే సంస్కారాల కంటె భిన్నమైనవి.

మహాభారతంలో తరచుగా పేర్కొనబడ్డ మరో జాతి నాగులు. వీరి కన్యలను క్షత్రియులు వివాహమాడారు. చాతుర్వర్ణ వ్యవస్థలో వీరి స్థానం ఏమిటో ఎక్కడా పేర్కొనబడలేదు. వీరూ రాజ్యాలు యేలారుగాని, క్షత్రియులుకారు. వీరుకాక పశుపక్షుల నామాలతో వ్యవహరించబడిన కులాలున్నాయి (ఖాండవ దహనం), దీనిని బట్టి భారతం కుల సమాజాన్ని పూర్తిగా ప్రతిబింబించలేదని తెలుతుంది. క్రీస్తుశకం సమాజంలో వచ్చిన సంకీర్ణత నాటి సమాజంలో లేకపోయినా, శుద్ధవర్ణవ్యవస్థ మాత్రం లేదు.

''భార్య భర్త మాట వినాలి. అతడికి విశ్వాసపాత్రురాలై, విధేయురాలై ఉండాలి.'' ఇది భారత కాలం నాటి ఆదర్శం. ఈ ఆదర్శం తరవాతి కాలంలో స్వల్ప మార్పుకు లోనైంది. ఆ కాలంలో భర్తవలన సంతానం కలగకపోతే వారసులు లేకపోతే భర్త ఆదేశం పై ఆమె, ఏ ఇతర మగవానితోనైనా సంతానాన్ని కనవచ్చు. దీనిని 'నియోగం' అంటారు. దత్తత కంటె నియోగం మంచి పద్ధతి అని నాడు భావించేవారు. అసలు స్త్రీ క్షేత్రంగా పరిగణించబడింది. భర్త పనుపున, పుత్ర సంతానం కోసం, వారసుల కోసం, బీజాన్ని ఏ పురుషుడైనా ఆ క్షేత్రంలో నాటవచ్చు. అయితే ఈ పరిస్థితి తరవాత కాలంలో మారిపోయి దత్తత మాత్రమే అంగీకారం అయింది. నియోగం అంతరించడంతోపాటు, స్త్రీ చేసే చిన్న చిన్న పొరపాట్లను గూడ సహించలేని స్థితి నెలకొంది. ఆనాడు, శత్రువులు జయించి ఎత్తుకుపోయి, బహుశ వాడుకొన్న స్త్రీలను, తిరిగి శత్రువును జయించి తెచ్చుకోవడం జరిగితే, వారికి యధాస్థానాన్ని కల్పించారు. స్త్రీలకు పూర్వస్థానాన్ని కట్టబెట్టడం వారి యెడ అనుకంపవల్ల కాదు. స్త్రీ పురుషుని ఆస్తిలో భాగం. ఆమెను శత్రువుల బారి నుండి కాపాడుకోలేక పోవడం అతనికి అవమానం. శత్రువులను జయించి తిరిగి తన స్త్రీని తెచ్చుకోవడం అతనికి గర్వకారణం. అయితే ఈ రకమైన దృక్పథం తరవాత కాలంలో పూర్తిగా మారిపోయింది. తరవాత కాలంలో పాండవులు ఎవరూ పరులు ఎత్తుకు పోయిన స్త్రీని పరిగ్రహింప నిరాకరించారు. సతీత్వానికి (పాతివ్రత్యానికి) భారత కాలంలో కంటే తరవాత కాలంలో ఎక్కువ విలువ ఇవ్వడం జరిగింది.

రావణుడు ఎత్తుకుపోయిన సీతను పరిగ్రహించడానికి రాముడు సీతకు శీల పరీక్ష పెట్టడం ఆధారంగా మనం రామాయణకాలాన్ని భరతకాలం తరవాతదిగా చెప్పవచ్చు. దీనిని సాహిత్యం తలక్రిందులుగా చెప్పిందనుకోండి.

భారతకాలంలో సామాజిక వ్యవస్థకు మూలగర్ర పితృస్వామ్య కుటుంబం. తండ్రిని గౌరవించడం, సోదరుల యెడ అనుకంపతో ఉండడం, పురుషుని లక్షణమైతే; భర్తను సేవించడం పుట్టినింటి కంటె మెట్టినింటికి పూర్తిగా గౌరవం ఇచ్చి, మెట్టినింటిలో భాగం అయిపోవడం పిల్లలను సాకడం స్త్రీ ధర్మం.

భారతకాలం విలువలు కొంచెం సంకుచితంగానే ఉన్నాయని చెప్పాలి. ఈ సంకుచి తత్వం కారణంగానే ఖాండవ దహనంలో ఉన్న ఘోర హింసను గుర్తించ లేకపోయారు. అటువంటి ఘోరాలు ఈనాడు జరగడం లేదని కాదు, కాని ఈ ప్రపంచంలో ఇప్పుడు కొన్ని సంస్థలైనా అటువంటి ఘోరకలిని ఖండిస్తున్నాయి. అప్పుడు ఎవరూ కృష్ణార్జునుల ఈ చర్యను విమర్శించలేదు. యజ్ఞయాగాదులు, జంతుబలులు ఉండే ఆ సమాజానికి అది ఘోరమనిపించి ఉండదు. బుద్ధుడు, జైనమహావీరుడు వచ్చిన తరవాతనే అది ఘోరంగా కనిపించి ఉండచ్చు.

భీష్ముడు రెండు విలువలకు ప్రాముఖ్యం ఇచ్చాడు. ఒకటి తన వంశం అవిచ్ఛిన్నంగా కొనసాగాలనుకొన్నాడు. రెండోది స్వయంగా విధించుకొన్న ఆదర్శం. ఇది చాల సంకుచితమైంది. దీనిని అతడు వదిలివేస్తే చాలబాగుండేది. అదే భీష్మ ప్రతిజ్ఞ. ఒక వ్యక్తి విలువకు సామాజిక విలువకంటె ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. తన కుటుంబ భావి తరాలకు హాని కలుగుతుందని తెలిసిగూడ. ఆ సంకుచితత్వం నంచి బయట పడలేక పోయాడు. భారతంలో అందరికీ నైతిక విలువలు తెలుసు. సమయం వచ్చినప్పుడు ప్రతి దానిని వ్యక్తిగతంగానే చూశారు.

భారతకాలపు దేవతలంతా వేద, పురాణదేవతలు. దేవాలయాలను భారతం ఎక్కడా పేర్కొనలేదు. దేవాయతనం అంటే దేవుని ఇల్లు. ఈ పదం ఆది పర్వం (64, 40;) భీష్మ పర్వం (108, 11;) అను శాసన పర్వం (10, 18) అశ్వమేధిక (69, 15;) లలో పేర్కొనబడింది కాని, ఇవి తరువాతి ప్రక్షిప్తాలే. ఈ ముగ్గురిలో సూర్యుడు ప్రముఖుడు. శివుడు ఆ తరువాత, సహస్రనామాంకిత విష్ణువు చివరికి వస్తాడు. నైయమిక కర్మలు యజ్ఞం ఆధారంగా జరిగేవి. పవిత్రాగ్నికి నైవేద్యాలు పెడితే, దేవతలకు దూత అయిన ఈ అగ్ని, వాటిని దేవతలకు చేర్చేవాడు. ముఖ్య సమయాలలో జంతువులను బలి ఇవ్వడం ఉండేది. అయినా, తరవాతి శతాబ్దులలో ఈ యజ్ఞ సంస్కారం బాగా పెరిగిపోయింది. ఇంద్ర, సూర్య, రుద్రులు ముఖ్య దేవతలు. ఇంద్రుడు ఏలే స్వర్గాన్ని నాటి ప్రజలు విశ్వసించారు. నరకం ఉందని భావించినా, అంత స్పష్టమైన భావనలేదు. మృతులకు నెలనెల శ్రాద్ధం పెట్టేవారు. కర్మ - పునర్జన్మ సిద్ధాంతం - పూర్తి గట్టిగా పాదుకుపోయింది. ధర్మాధర్మాల, ఆత్మానాత్మల చర్చ భారతంలో ఉంది. తరవాత తరవాత ఈ బౌద్ధిక చర్చ అంతరించి, భక్తి మార్గం చోటు చేసుకొంది. వైష్ణవం, శైవం, బౌద్ధంల కంటె భిన్నమైన ముఖ్య మత ఆలోచన ఒకటి ఉన్నా దానికి ఒక పేరంటూ లేకపోయింది. ఆ ముఖ్య స్రవంతి ఎటుబడితే అటు మలచ

వీలైనదిగా, ద్రవస్థితిలో ఉండిపోయింది. ఈ ముఖ్య ఆలోచనా స్రవంతినే తరవాత విదేశీయులు హిందూవాదం (Hinduism) అన్నారు. ఇవ్వాల్టికి గూడ ఆలోచనా పరుడైన ఏ హిందువు గూడ తన మతానికి సుస్పష్టమైన నిర్వచనాన్ని ఇవ్వలేకుండా ఉన్నాడు. దానిని గురించి అతడు చెప్పేదల్లా '' ఇది నా వ్యాఖ్యానం'' మాత్రమే అని.

ధర్మాధర్మాల గురించి, మతస్వభావం గురించి, మానవుని భాగధేయం (destiny) గురించి భారతంలో చర్చించినంతగా బైబిల్‌లోగాని, కురాన్‌లోగాని, మరే ఇతర మత గ్రంథంలోగాని చర్చించలేదు. అందుకనే మహాభారతం, రామాయణం కంటె గూడ, మరే ఇతర గ్రంథం కంటె గూడ మనకు దగ్గర అనిపిస్తుంది. పాశ్చాత్య సాహిత్యం మానవ జీవితం విలువ, మానవ అస్తిత్వానికి అర్థం, దురవస్థ, నిరర్థకతల గురించి పర్యాలోచిస్తుంది. ఇది మనకు, ధర్మరాజు, అర్జునుడు అనుభవించిన ''మానవ విజయంలోని శూన్యత''ను గుర్తుకు తెస్తుంది. విజయానంతరం ధర్మరాజు అంటాడు: ''ఈ విజయం నాకు పరాజయం అనిపిస్తున్నది''. అర్జునునికి తెలుసు తనకు విజయం తథ్యమని అయినా, ''వారునన్ను చంపినా నాకు వారిని చంపాలని లేదు. ఈ అల్పభూ ఖండమే కాదు స్వర్గాధిపత్యం ఇస్తానన్నా, వారిని నేను చంపను'' అంటాడు.

మహాభారత కాలంలో భక్తిసంప్రదాయం మొదలుకాలేదు. అర్జునుడు కృష్ణుని భక్తుడు కాదు. అతని అనుంగు స్నేహితుడు మాత్రమే.

భారతం తరవాతి యుగంలో దేవతలు, సాహిత్యం, విలువలు పూర్తిగా విభిన్నాలే. ఈ కాలంలో ఆలోచనలో తార్కిక చిక్కదనం పలుచబడినా, ''మానవాళి మొత్తాన్ని కరుణతో చూడాలి'' అనేది ప్రబలమైంది. ఇతరుల యెడ కరుణ చూపడం అంటే తనను తాను కరుణించుకోవడమే. జర్మన్ దార్శనికుడు హైడెగర్ దీనినే ఇలా అంటాడు: ''అస్తిత్వం (Dasein=being-in-the-world; tobe=sein; there=da) దాని స్వభావ రీత్యా నాశనంగావింప బడగలిగినది. దాని పుట్టుకలోనే మృత్యుబీజం వుంది''. ''భవానికి (being) అభవం (non-being) అంటే భయం. తాను కారణంగా కాక, ఇతరుల కారణంగా ఈ భయం జనిస్తుంది. రోగం, ముసలితనం, మరణాలు బుద్ధుని ఈ ప్రపంచానికి విముఖుని చేశాయి. అందుకని విరాగాన్ని ప్రవచించాడు. లేకపోతే, ఈ ప్రపంచంతో ఎక్కువగా పెనవేసుకొంటే, ఎక్కువ భయం, వ్యాకులతలు కలుగుతాయి. ఈ తత్వాలన్నీ గూడ 'జాతస్యమరణం ధృవం' అన్న సత్యంమీదే ఆధారపడ్డాయి. హైడెగర్ ఇంతటితో ఆగిపోతే బుద్ధుడు, కృష్ణుడు ఇంకొంచెం ముందుకు పోయి, ''మరణించిన ప్రతిది పుట్టాల్సిందే'' నన్నారు. అయితే కృష్ణుడు చెప్పే పునర్జన్మ, బుద్ధుడు చెప్పే పునర్జన్మలు వేరువేరు. హైడెగర్‌కు మాత్రం నీకు దృశ్యమానమవుతున్న రీతిలో ఏది ఉందో అదే ఈ ప్రపంచం. భవిష్యత్ లేదు, భూతం లేదు. అందుకని ''ఇప్పుడు''. ''ఇక్కడ'' (Now & Here)ల గురించి మాత్రమే ఆలోచించు. విలువలను గురించి మాట్లాడడంలో అర్థంలేదు. కాని మహాభారతం చెప్పిన దర్శనం అచలం, అస్ఖలితం, అస్తిత్వవాదుల దర్శనం పరాజయం, నిస్పృహల నుంచి జనించింది. మానవదురవస్థను చూసి అస్తిత్వవాదం, బౌద్ధం కన్నీరు కార్చాయి. మహాభారతం ఈ కన్నీరు కార్చలేదు.

మహాభారతంలో లేనిది, తరువాత వచ్చింది ''వీరపూజ'' (వ్యక్తిపూజ) (Harowor- ship). ఇది బుద్ధుని కాలం నుంచి వచ్చింది. ''బుద్ధః శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి'' ఇతర రూపాలలో ఇది నేటి సమాజంలో విస్తృతంగా ఉంది. ఈ వీరపూజ లేక వ్యక్తిపూజ భక్తి సంప్రదాయానికి పునాది. ఈ వీరుడు (దేవుడు) తనను ఈ నిరర్థక జీవితం నుంచి కడతేరుస్తాడని మనిషి నమ్ముతాడు, 'నాయకుడు' 'ప్రవక్త'లను పూజించడం ఒక రూపం. రెండోది, ''దేవుని పూజిస్తే తన కోర్కెలు తీరుస్తాడు, కష్టసమయంలో ఆదుకొంటాడు'', అని భావించడం. ఇది ప్రపంచం అంతట ఉంది; ఇవేవీ మహాభారతంలో లేవు.

ఆ తరవాత, మహాభారతంలో కనిపించిన నిరాశానిస్పృహలు, కుంఠనం, నిష్ఠురత, వాస్తవికతలు, తరవాతి భారతీయ సాహిత్యంలో మనకు ఎక్కడా గోచరించవు. కొన్ని ఉదాహరణలు చూద్దాం.

కావ్యాను శాసనాన్ని, నాటకీయతను మొదటిగా నిబద్ధించిన భరతుడు ''నాటకం ఎప్పుడూ విషాదాంతం కారాదు'', అని అనుశాసించాడు. తరవాతి నాటకాలన్నీ ఈ సూత్రాన్ని తు.చ. తప్పకుండా అనుసరించాయి. మూలంలో విషాదాంతమైన రామాయణాన్ని గూడ సుఖాంతం చేయడం జరిగింది. నాయిక, నాయకులు వారి పిల్లలు చివరకు కలుసుకోవడం ఉంది. కాళిదాసు విరచిత విక్రమోర్వశీయం, శాకుంతలం ఇదే సూత్రాన్ని పాటించాయి. ప్రేమ, విరహం, పునస్సమాగమం సూత్రాన్ని అనేక నాటకాలు అనుసరించాయి.

మహాభారత శాకుంతలాన్ని, కాళిదాసు శాకుంతలంతో పోలిస్తే పై విషయాలన్నీ ద్యోతకమవుతాయి. మహాభారతంలోని రాజు, శకుంతల ఇద్దరూ ఒకరిని మించిన వారు మరొకరు. ఇద్దరూ ఇద్దరే; జిత్తుల మారివాళ్ళు. ఎంత చిక్కించుకోవడానికి వీలైతే అంతా పొందాలనుకొనేవాళ్ళు. భరతుని తీసుకొని శకుంతల రాజాస్థానానికి వెళ్తుంది. దుష్యంతుడు ఆమెను గుర్తించి గూడ, ఎరగనట్లు నటిస్తాడు. అపవాదు భయంతో అలా చేస్తాడు. అప్పుడు ఆకాశవాణి భరతుని అతని కుమారుడుగా ప్రకటిస్తుంది. వారసుడు లేని కారణాన, దుష్యంతుడు భరతుని, అతని తల్లిని సంతోషంతో పరిగ్రహిస్తాడు. ఇదొక సూటి కథ. ఇది భారత కథ ఈ స్వార్థాపేక్ష, అనైతిక కథను కాళిదాసు ఒక అందమైన స్వాప్నికగానాటకంగా తీర్చిదిద్దాడు. మరుపురాని అందమైన రామణీయకతతో కథను మలిచాడుగాని, మూలంలో ఉన్న తీవ్ర అసిధార పాత్ర శీలం ఇందులో రాలేదు. మూల భారతం ఆస్థాన దృశ్యంలో ఆచితూచి మాట్లాడే కేంద్రక పాత్రలు దుష్యంత శకుంతలలు పరస్పర ప్రత్యాభియోగాలు చేసుకొనే వారి వాక్చాతుర్యం, నభూతో నభవిష్యతి. కాని కాళిదాసు శకుంతల ఒట్టి అమాయిక, అడవిపిల్ల. దుష్యంతునికి శాపాన్ని అంటగట్టి, అతనిని దోషాల నుంచి ప్రక్షాళనం చేయించాడు కాళిదాసు. అందమైన రమణీయ కావ్యలక్షణం కోసం కాకపోతే, చివరి పునస్సమాగమ దృశ్యాన్ని చదవలేము.

సంప్రదాయ సాహిత్యం మృదుమధుర స్వరంతో, సంవేదనతో నిండి ఉన్నా అది భ్రమపూరితం. కాని మహాభారత సాహిత్యం సంక్షిప్తం, నిష్ఠురం, ఘనం, కర్కశమూ అయినది. అయితే ఇందులో బౌద్ధికాంశ ఉండి, ఆలోచింప జేస్తుంది.

మహాభారతం ముందరి ఐతరేయంలోని హరిశ్చంద్రుని కథకు మహాభారతం అనంతర పురాణ సంబంధ హరిశ్చంద్రుని కథకు ఎంతో తేడా ఉంది. ఐతరేయంలోని హరిశ్చంద్రుడు మానవుడు. మానవ స్వభావాన్ని పుణికిపుచ్చుకొన్నాడు. వరుణ వరప్రసాది అయిన తన పుత్రుడు, లోహితుని వరుణునితో చేసుకొన్న ఒప్పందం ప్రకారం అతనికి బలి ఇవ్వాలి. కాని పుత్ర వాత్సల్యాన్ని వీడలేక (ఇది మానవ సహజం) ఎన్నో సాకులు చెప్పి, చివరకు ఒక బ్రాహ్మణుని పుత్రుని తన కొడుకుకు బదులు బలి ఇవ్వడానికి ఏర్పాటు చేస్తాడు. ఆ బ్రాహ్మణ బాలుని నూరు గోవులను ఇచ్చి రోమపాదుడు కొంటాడు. అతనిని బలి ఇవ్వడానికి ఎవరూ ముందుకురారు. మరో మూడు వందల ఆవులు ఎక్కువ ఇస్తే ఆ పని చేయడానికి ఆ బాలుని పేద తండ్రి ముందుకు వస్తాడు. (ఇది పేదరికపు బాధ, ధనం అంటే ఆశ. ఇవీ మనుష్యులకుండే లక్షణాలే) చివరకు ఆ బాలుడు వరుణుని ప్రార్థించడంతో కథ సుఖాంతమవుతుంది. అయితే ఆ బాలుడు అటువంటి నికృష్టపు తండ్రి వద్దకు వెళ్ళక, విశ్వామిత్రుని పెంపుడు బిడ్డఅయి, తరవాత ఋషి అవుతాడు.

కాని పురాణంలో హరిశ్చంద్రుడు, కలలో చేసిన వాగ్దానం నిలబెట్టుకోవడానికి, - (తన రాజ్యాన్ని ఒక బ్రాహ్మణుడికి ఇచ్చినట్లు కలగంటాడు. తెల్లారి నిజంగానే ఆ బ్రాహ్మణుడు వచ్చిరాజ్యం అడుగుతాడు). తనను, భార్యను బానిసలుగా అమ్ముకొంటాడు (బ్రాహ్మణునికి అడిగిన దానికంటె ఎక్కువ ఇవ్వడం ఆచారం. అందుకని తనకున్న రాజ్యం కంటె అధికంగా ఇవ్వాల్సి వచ్చింది). లోహితుడు పాముకాటుతో మరణించినప్పుడు అతని తల్లి అతనిపై బడి రోదిస్తుంది. దీనికి బ్రాహ్మణుడు కుపితుడై పిల్లల్ని తినే మారిగా మారమని శపిస్తాడు. ఆమెకు మరణ శిక్ష విధింపబడగా హరిశ్చంద్రుడు ఆమెను వధించవలసి వచ్చింది. అతను గొడ్డలి ఎత్తినప్పుడు దేవతలు అడ్డుపడతారు. ఇదీ క్లుప్తంగా కథ. ఇందులో మానవస్వభావ లక్షణాలు ఏమీలేవు. మొదటి హరిశ్చంద్రుడు దేవునికి కూడ తన కొడుకును ఇవ్వడానికి ఇష్టపడడు. రెండో హరిశ్చంద్రుడు కలలో చేసిన వాగ్దానాన్ని నిలుపుకోవడానికి నానా అగచాట్లు పడతాడు. ఇతడు వాగ్దానం నిలుపుకోవడం గూడ వట్టి శుష్క ప్రక్రియయే. అంతా డొల్ల, మానవాతీత గుణాలు అనేక రెట్లు పెరిగి కనిపిస్తాయి.

మహాభారతంలో పాత్రలన్నీ మానవసహజమైనవి. సుఖదుఃఖాలను మానవులులాగే అనుభవించారు. మనుషులు ఏమి చేస్తారో వాళ్ళూ అదేచేశారు. తప్పు చేస్తే శిక్ష అనుభవించారు. విధి నుంచి తప్పించడం ఎవరి తరంకాదు. అలాగే వారు దుఃఖాన్ని, వినాశాన్ని, కష్టాలను, సుఖం, విజయం, సంతోషాలతోపాటే అనుభవించారు. భీష్మునికి, ద్రోణునికీ ఇవి తప్పలేదు. ఆశలు, నిరాశలు, నిస్పృహలు అన్నీ మానవసహజమైనవే. మహాభారతం స్వప్న ప్రపంచాన్ని సృష్టించలేదు. అద్భుతాలు లేవు. విధిని మార్చడానికి దేవతలు అడ్డుపడలేదు. దురదృష్టం అదృష్టంగా మారలేదు. ఎవరి విధిని వారు నిర్వర్తించారు. ఒక పారితోషికం కోసం కాక, వారంతా గౌరవంగా జీవించాలనుకొన్నారు. గౌరవంగా మరణించాలనుకొన్నారు. తమకు వారసత్వంగా లభించిన విలువలను, మానవాళికి సహజమైన విలువలను, వారు పరిరక్షించాలనుకొన్నారు, అలాగే చేశారు.

తరవాతి యుగంలో విలువలన్నీ పూర్తిగా మారిపోయాయి. సత్యం, సాహసం, విశ్వాసం, భక్తి అన్నీ 'అతి'కి తీసుకు పోబడ్డాయి. ఈ 'అతి' ఆదర్శాలను ప్రతిబింబించే పాత్రలను మలిచిన తీరు అపస్వరాలను పలుకుతుంది. నాయికా నాయకులు మధ్యలో పడే కష్టాలన్నీ చివరకు సుఖం పొందడానికే, వీరి కష్టాలు తాత్కాలికాలు. చివరి సుఖాల కోసమే ఈ కష్టాలు కల్పించబడతాయి. విలువలంటే గౌరవంతో కాక, సత్ప్రవర్తన తెచ్చే పారితోషికం కోసం పాత్రలు అలా ప్రవర్తిస్తాయి. సర్వం త్యాగం చేసిన హరిశ్చంద్రుడు చివరకు అంతకంటె బ్రహ్మాండమైన స్థితిలో ఉంటాడు. ఉత్తర రామచరితంలో రాముని చేత చంపబడ్డ శంబుకుడు, మునపటికంటె మంచి స్థితిలోకి వస్తాడు. సీత భూమిలోకి అంతర్థితం కావడం మాయ. ప్రతి కష్టం మంచితనానికి పరీక్ష. ప్యాసైతే అంతా వైభవమే. ఈ రసవిద్య (Alchemy)లో వాస్తవిక నిష్ఠుర జీవితరేఖలు పూర్తిగా అంతర్థితమై, దాని స్థానంలో స్వప్న ప్రపంచం సృజించబడుతుంది. ఆ స్వప్న ప్రపంచంలో నాయికా నాయకులు తరవాత కలకాలం సుఖంగా జీవిస్తారు. అంతటితో కథ కంచికిపోతుంది. ఈ కథే ఈనాటి సాహిత్యానికీ వర్తిస్తుంది. వాస్తవజీవితంలో ఎదురుదెబ్బలు తిని పలాయనం చిత్తగించే వారికి ఈ సాహిత్యం ఊరట కల్పిస్తుంది. దీనికి ఒక్క బౌద్ధసాహిత్యమే సాపవాదం (Exception) శంకరుని తాత్త్వికసాహిత్యం ఇంకా ఇతర కథలు అటువంటివే. వీటిల్లో అందం, సౌరభం అన్నీ ఉంటాయికాని, భారతంలో ఉన్న అసిధారాప్రజ్ఞ మాత్రం ఉండదు. భక్తి సాహిత్యం మరీ అధ్వాన్నమైంది. ఎన్ని దుర్మార్గాలు చేసినా, అజామిలుడు, మరణశయ్య మీద 'నారాయణ' శబ్దం ఉచ్చరిస్తే (ఆ నారాయణ శబ్దం కూడ అతని కొడుకు పేరు) దేవ దూతలు అతనిని స్వర్గానికి తీసుకుపోతారు. గురువైనవాడు, ''నాలో మంచిని మాత్రమే అనుకరించు, చెడును వద్దు'' అని చెప్పాలని మహాభారతం చెప్తే, గురువును అంధభక్తితో అనుకరించమని జ్ఞానేశ్వర్, తుకారామ్, రామదాసులు చెప్పారు. ఈ విధంగా సాహిత్యం వాస్తవానికి విడాకులిచ్చింది.

మహాభారత కాలానికి ముందరి రచనలన్నీ మౌలికాలు. అవన్నీ మంత్రాలు, కర్మకాండ, ఇంకా ఇతర కథలు. మహాభారతం గూడ మౌలిక రచనే. ఇంకా తరవాత వచ్చిన సాహిత్యమంతా వేదోపనిషత్తులకు టుప్టీక మాత్రమే. వ్యాఖ్యానం మాత్రమే. మౌలిక ఆలోచనా ధారలేదు. తరవాత వచ్చిన ధర్మానికి, పద్యానికి, కల్పనకు, విమర్శకు మూలం మహాభారతమే.

మహాభారతకాలంలో మనుష్యులు, దేవతలు తిన్న ఆహారం తరవాత కాలంలో వాడకంలో లేదు. నాటి ప్రజలు మేషపాలకులు (పశుపాలకులు) యవలు పండించేవారు. గోవులు, గుర్రాలు వారి ఆస్తి. క్షత్రియుల ప్రతిష్ఠ తమకున్న గుర్రాల సంఖ్యమీద ఆధారపడి ఉండేది. గుర్రాలు లాగే రథాలతో యుద్ధం చేసేవారు. (రథ చక్రాలకు ఆకులు ఉండేవి.) సైనికునికి గుర్రపు స్వారీ తెలియదు. గుర్రపు స్వారీ క్రీస్తుశకంలో భారతదేశంలో ప్రవేశించింది. భారతకాలానికి గోమాంస భక్షణ ఉంది. కర్ణుడు శల్యుని తిట్టినప్పుడు, ''మీ మద్ర దేశంలో గోమాంసం తింటారు, మద్యం సేవిస్తారు'', అని అంటాడు. వేట ఉండేది, రాజులంతా తాగేవారు. పాలు, పెరుగు, ఘృతం యజ్ఞాలలో అర్పించేవారు. ఘృతం అంటే నెయ్యి కాక ఆవుల కొవ్వు ఇతర జంతువుల కొవ్వు గూడ ఉపయోగించారు. ''ఆజ్యం'' అజం (మేక) నుంచి నిష్పన్నమై ఉండవచ్చు. వాళ్లు ఏది

తింటే అదే దేవతలకు నైవేద్యం పెట్టారు. నేడు ఆ దేవతలు లేరు, ఆ ఆహార పదార్థాలు తినడమూ లేదు.

లిపి వ్యవహారానికి వస్తే నాడు లిపి లేదు. అశోకుని శాసనాలకు ముందు లిపి ఉన్న దాఖలాలు లేవు. మహాభారతం గూడ లిపిని గురించి ఎక్కడా పేర్కొనలేదు. అందుకే మన మహర్షులను నిరక్షరాస్యులు అన్నాడు మాక్స్‌ములర్. అందుకే వేదాలు మౌఖికంగా ప్రసారమయ్యాయి. భారతంలో వార్తలను మౌఖికంగానే పంపారు. విదురుడు లక్షా గృహం వ్యవహారం గురించి, ధర్మరాజుకు కబురు ఒక నమ్మకస్తుని ద్వారా మౌఖిక సందేశం (మాటల కబురు) పంపుతాడు. లేఖ కాక వాచక రూపంలో పంపుతాడు. కాని తరవాతి కొంతమంది కవులు, రుక్మిణి కృష్ణునికి ప్రేమలేఖ రాసినట్లు చెప్పారు. అసలు లిపే లేనప్పుడు రుక్మిణి రాయడం, కృష్ణుడు దానిని చదవడం ఎలా సాధ్యం.

వేదాలు, ఉపనిషత్తులు, మహాభారతంలో ఆరంభమైన భారతీయ సమాజం, భారతకాలం తరవాత ఒక్కసారిగా ఎందుకు తలక్రిందులుగా పల్టీ కొట్టింది? అంతగా జీవిత వాస్తవికతలను అనుభవించి ఆలోచించిన సమాజం, అంధవీరపూజ (వ్యక్తి పూజ)కు, భక్తివాద స్వాప్నిక పలాయనాన్ని ఎలా అంగీకరించింది? గోమాంసంతో సహా అన్ని రకాల మాంసాలు తిన్న మనుషులు నైయమికంగా గోమూత్రం, గోమయాలను (ఆవు ఉచ్చను, ఆవు పేడను) త్రాగడం తినడం అటువంటి చతుష్పాదజంతువైన ఆవును తమ తల్లిగా అంగీకరించడంలో సంతృప్తిని ఎలా పొందుతారు? ఇవి ప్రశ్నలు. మేధావులకు మేత మాత్రమే.

మూలం: ఐరావతీ కార్వే
అనుశీలనం: డా॥ ఆలపాటి రవీంద్రనాథ్

(1997, ఫిబ్రవరి 'మిసిమి')

కర్ణుని స్వగతం

మహాభారతం నాటికే కుల గజ్జి వుందా

- నేనెవరిని? నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రు లెవరు?
- నన్ను పెంచి పెద్ద చేసినవారికి ఋణపడలేదా?
- విద్యకంటే, కులమే ప్రధానమా?
- మానవత్వం ముందా, కులం ముందా?
- వీరు మానవులెప్పుడవుతారు?

ఒక వ్యక్తి తన తల్లిదండ్రులు, కులము తెలియని స్థితిలో ఒకవిధమైన మనోవేదనకు గురైనవాడు దానినే (Identity crisis) అంటారు. అలాంటి బాధనే కర్ణుడు ఎదుర్కోవలసి వచ్చింది. ఈ స్థితిని విజయవంతంగా పూర్తి చేసినవారు తమ రంగంలో అఖండ విజయాలను సాధిస్తారు. ముఖ్యంగా నేటి యువత దీనిని ఎక్కువగా ఎదుర్కొంటోంది. ఇది నాటి కర్ణునికీ, విదురునికీ గూడా తప్పలేదు. అసలు ఈ సంకటస్థితి అనేది ''తానెవరు?'', ''తానేమిటి?'' అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం కనుగొనడంలో ఉంది. అందుకే ''ఆత్మానం విద్ధి'' "Know thyself" నిన్ను నీవు తెలుసుకోవడంలో మోక్షం ఉంది. ప్రశ్నకు సమాధానం పూర్తిగా సంతృప్తిగా చెప్పుకోగలిగినవారు ఎవరూ లేరనే చెప్పవచ్చు. పసిబిడ్డలు మొదట మాటలు నేర్చుకొనేటప్పుడు అమ్మ, అత్త, తాతలతో ప్రారంభిస్తారు. ఆ పదాల వెనుక ఉన్న అర్థం కొంచెం కొంచెంగానైనా అర్థమయ్యేది ఇక్కడే. తరవాత మరికొన్ని పదాలు నేర్చుకొన్నా, ఈ కోవలో చివరగా పిల్లవాడు నేర్చుకొనేది 'నేను' అనే పదం. ఈ పదం భావన నాలుగేళ్ళు వచ్చేసరికి గాని సరిగా ఉపయోగించి అర్థం చేసుకోలేడు. 'నీచే' అనే దార్శనికుడు తన కొడుకు ప్రథమంగా ''నేను'' అనే పదాన్ని ఉపయోగించిన నాడు పెద్దవిందు ఏర్పాటు చేస్తానని, అలాగే చేశాడట. ''నేను'' భావనతో పాటు ''నీవు'' భావనగూడ ఏర్పడుతుంది. క్రమంగా ''నేను'', ''నన్ను'' ''నాది'' పాదుకొంటాయి. కాని ఈ పదాల వెనుక అర్థం అప్పటికి ఎప్పటికి పూర్తిగా బోధపడదు. 'నేను' పదం ఏ రెండు క్షణాలలోను ఒకటిగా ఉండదు, అది గతి శీలమైంది. 'నేను' భావన విస్తృతమయ్యే కొలది నేను, నా తండ్రి, నా తల్లి, నా స్నేహితుడు, నా వస్తువులు, నా నుంచి ఇతరులు ఫలాన ఫలానావి ఆశిస్తున్నారు, వారి ఆశలనను నేన దృష్టిలో ఉంచుకోవాలి లాటి కొలతలు ఏర్పడుతాయి. అసలు 'నేను' భావన ముఖ్యంగా సామాజిక సంబంధాలనుంచి నిష్పన్నమవుతుంది. 'నేను' అంటే ఎవరు? ''నేను అనుకొంటున్న నేను 'నేను' కాదు. నీవు అనుకొంటున్న 'నేనూ', 'నేను' కాదు. నన్ను గురించి నీ వేమనుకొంటున్నావని నేనమకొంటున్నానో అదే ''నేను''. (I am not what I think I am, not what you think I am, I am what I think you think I am). ఈ విధంగా సామాజిక సంబంధాల నుంచి ఏర్పడిన 'నేను' - 'కొడుకు'గా, భర్తగా, తండ్రిగా, స్నేహితునిగా, క్లబ్ సభ్యునిగా, వృత్తి చేసేవానిగా ఎన్నో పాత్రలు నిర్వహిస్తుంది. ఈ పాత్రలు 'నేను' తాదాత్మ్యతను (Identity)ని నిర్ణయిస్తాయి. సామాజిక ప్రవర్తన, సమాజంలో అతని స్థాయి అతనికి విహితమైన

కర్మకాండని అతడు ఏమిటో, ఎవరో నిర్ణయిస్తాయి. ఈ విషయాల్లో ఒడుదుడుకులు ఏర్పడిన వారు తాదాత్మ్యతా సంకట స్థితిని తప్పించుకోలేరు.

కులగజ్జి:

కర్ణుడు, విదురుడు ముఖ్యంగా ఈ స్థితి నుంచి బయట పడలేక పోవడానికి కారణం, సమాజంలో వారికి ఇవ్వబడిన స్థానం. జన్మ సమాజంలో మన స్థానాన్ని, స్థాయిని నిర్ణయిస్తుంది. అలాగే వారి జన్మ వారి స్థానాన్ని అపరివర్తనీయంగా ఒక్కమాటే నిర్ణయించివేసింది. విదురుడు సూత స్త్రీకి జన్మించాడు. అతనికి తద్విహితమైన జాతక కర్మలే నిర్వహించబడ్డాయి. ధృతరాష్ట్రుడు అతనిని తన సోదరుడని ప్రక్కన కూర్చోబెట్టుకొన్నా, అతనికి ఎవరూ క్షత్రియ కన్యను అర్ధాంగిగా ఇవ్వలేదు. క్షత్రియులకు దక్కే గౌరవం అతనికి దక్కలేదు.

కర్ణుడూ ఇదే విషవలయంలో పడ్డాడు. సమాజంలో అతనికి ఒక స్థిరమైన స్థానం దక్కలేదు. అతనికి న్యాయంగా రావలసిన స్థానమేదో అతనికి తెలుసు. దానికోసమే అతడు జీవితాంతం ఆక్రోశించాడు, పోరాడాడు. దానిని పొందలేక పోవడంలోనే అతని బాధంతా ఉంది.

రాధ, అధిరథులు కర్ణుని ప్రేమగానే పెంచినా, వారెప్పుడూ అతడు తమకు దొరికిన విధానాన్ని అతని నుంచి దాచలేదు. అతడొక బంగారు పేటికలో క్షత్రియోచితమైన తను త్రాణంతో, కర్ణకుండలాలతో దొరికాడని వారు అతనికి చెప్పారు. వారు అతనికి వసుసేనుడని క్షత్రియ నామమే పెట్టారు. కనుక అతడు సూతుల ఇంట పెరిగినా, అతనికి తన వర్ణమేదో తెలుసు. పెంపుడు తల్లిదండ్రులను అతడు బాగా ప్రేమించినా ఏ నాటికైనా తన అసలు తల్లిదండ్రులు తనను అంగీకరించి క్షత్రియునిగా ప్రకటించకపోతారా అనే ఆశతోనే పెరిగాడు. సూతుడుగానే మిగిలిపోవడం అతనికి ఏ మాత్రం ఇష్టం లేదు. ఇదీ అతని జీవన ఘర్షణ. తాదాత్మ్యతా సంకట స్థితి.

సూతుడుగా అతడు ఆయుధ విద్యకు అనర్హుడు. అందుకనే బ్రాహ్మణుడుగా మారువేషంలో గురువు దగ్గర విలువిద్య నేర్చుకొని, యాదృచ్ఛికంగా విషయం బయటపడి, ''నేర్చుకొన్నదంతా మరచి పోదువుగాక'' అని శపింపబడ్డాడు. ఈ కథ ప్రక్షిప్తంగా కనపడుతోంది. ఎందుకంటే అతని గురువని చెప్పబడిన పరశురాముడు కర్ణునికన్నా ఎన్నో శతాబ్దాలు ముందువాడు. దీనినిబట్టి మనకు తెలిసేది ఏమంటే, నాడు యుద్ధ విద్యలకు బ్రాహ్మణ క్షత్రియులు మాత్రమే అర్హులనీ, ఇలాంటి నియమం ఉన్నా కూడా కర్ణుడు ఎలాగో యుద్ధ విద్యల్లో ప్రావీణ్యత సంపాదించాడనీ.

తన యుద్ధ విద్యా కౌశలాన్ని ప్రదర్శించబోయి ఒకసారి కర్ణుడు భంగపడ్డాడు. ద్రోణుని దగ్గర కౌరవ, పాండవులు విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఆయన వారి ప్రావీణ్యతా ప్రదర్శనను రాజాస్థానంలో ఏర్పాటు చేశాడు. ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి, విదురుడు, భీష్ముడు ఆ ప్రదర్శనను తిలకించడానికి విచ్చేశారు. అర్జునుడు ధనుర్విద్యలో అందరిని తలదన్ని అందరి మెప్పు పొందాడు. ఆ సమయంలో చిన్న కలకలం రేగింది. ప్రవేశ మార్గం వద్ద బలిష్ఠుడైన యువకుడొకడు ప్రవేశించి ''అర్జునుడు చేసిన దంతా నేనూ చేయగలను'' అని చెప్పి, ప్రదర్శనకు

పూనుకొన్నాడు. తన కౌశలాన్నంతా ప్రదర్శించిన తరవాత అర్జునుణ్ణి ద్వంద్వ యుద్ధానికి సవాలు విసిరాడు. ఈ యువకుడే కర్ణుడు. అంత వరకు ఇతడెవరో రాజాస్థానంలో ఎవరికీ తెలియదు. ఈ సంఘటన చిన్నదే అయినా, బహు నాటకీయంగా జరిగింది. తరువాత జరగబోయే భారత కథకు మంచి పట్టునిచ్చింది. నూతన అర్థాన్ని కల్పించింది.

ద్రోణుడు అసలు తన శిష్యుల ప్రదర్శనను ఏర్పాటు చేశాడు. బయటవారినెవరినీ ఆహ్వానించలేదు. అధిరథునికీ తెలియదు. తన యుద్ధ విద్యా కౌశలం చూసిన తరవాత, తన క్షత్రియ మాతాపితలు తనను పుత్రునిగా అంగీకరించవచ్చుననే ఆశతోనే కర్ణుడు రంగ ప్రవేశం చేశాడు. ఇదే అతని ఉద్దేశం అయితే, విద్యాప్రదర్శన చేసి ఊరుకొంటే సరిపోయేది. అర్జునుణ్ణి ద్వంద్వ యుద్ధానికి ఆహ్వానించవలసిన పనిలేదు.

ఈ సంఘటన మరో ప్రశ్నను లేవనెత్తుతుంది. అది వారి వయస్సుల ప్రశ్న. ఈ సంఘటనా సమయంలో ధర్మజునికి పదహారు సంవత్సరాలున్నాయనుకొంటే, అర్జునికి పదునాలుగు సంవత్సరాల కన్నా ఎక్కువ ఉండే వీలులేదు. ఎందుకంటే ఇద్దరి మధ్యలో భీముడు ఉన్నాడు గదా. ఒకవేళ ధర్మరాజుకు పద్దెనిమిది సంవత్సరాలనుకొంటే, అర్జునిడికి పదహారు. కర్ణుడు కుంతికి వివాహానికి ముందు పుట్టాడు గనుక, అర్జునునికంటె నాలుగేళ్లు పెద్దవాడవుతాడు. అంటే అతడు బాల్యాన్ని దాటి వయోజనులు **(adult)** అవుతాడు. ఈవిధంగా చూస్తే ఒక వయోజనుడు ఒక బాలుని సవాలు చేయడం ఏమి సబబు? కర్ణుడు ఎప్పుడూ కోపంలో ఇలాంటి అనుచితమైన పనులనే చేస్తాడు. తొందరపాటును ప్రదర్శిస్తాడు. వేగిరపాటు క్షత్రియ శీల లక్షణమే అయినా సంకుచిత మనస్కుడుగా ఉండకూడదు. దీనిని కర్ణుడు ఉల్లంఘించాడు.

తానొక క్షత్రియుని అక్రమ సంతానమనే బాధ అతనిని పట్టి పీడిస్తోంది. కొన్ని పరిస్థితులలో అటువంటి అక్రమ సంతానాన్ని క్రమ సంతానంగా గుర్తించవచ్చుగాని, ఈ కర్ణుని విషయంలో ఇది కుదరలేదు. అతడు సూత వర్గం తరపున కాని, యుద్ధ కౌశలం ఉన్న ప్రతి ఒక్కరిని క్షత్రియునిగా గుర్తించాలనే సిద్ధాంతం కోసం కాని పోట్లాడడం లేదు. అది వర్గపోరాటం కాదు. తన స్వంతం కోసం పెనగులాడుతున్నాడు. ప్రదర్శన క్షేత్రంలో గుర్తింపూ పొందలేక పోయాడు. అతని జన్మ రహస్యమూ రహస్యంగానే మిగిలిపోయింది. ఫలితంగా కుపితుడైపోయాడు.

కర్ణుడు సవాలు విసిరినప్పుడు అక్కడ ఉన్న క్షత్రియ జనం రెండు వర్గాలుగా చీలిపోయింది. ధర్మరాజు, అతని సోదరులు, భీష్ముడు అర్జునుని వైపు నిలబడ్డారు. దుర్యోధనాదులు కర్ణుని కోపు కాశారు. యుద్ధనీతి తెలిసిన కృపాచార్యుడు ఇలా ప్రకటించాడు:

''ఇదిగో, పాండునందనుడు అర్జునుడు సవాలును అంగీకరిస్తున్నాడు. ఓ అజ్ఞాత అభియోక్తు! మీ రెవరు? మీ కులమేది?''

కర్ణుడు కన్నుల నిండ నీరు నిండగా మూగవోయాడు. అప్పుడు దుర్యోధనుడు కల్పించుకొని, ''యుద్ధవీరుడు కులగోత్రాలు ప్రకటించ పనిలేదు. అర్జునునికి రాజు కాని వానితో పోరాడడం ఇష్టం లేకపోతే, అతనిని నేను ఇదే రాజును చేస్తున్నా''నని అంగరాజ్యానికి రాజును చేశాడు. (ఇదంతా

కూడ తరువాత కలిపిన కథగా కనిపిస్తున్నది. ఎలాగంటే - దుర్యోధనుడు ఆ సమయంలో రాకుమారుడే కాని రాజు కాదు. అతడి తండ్రి సింహాసనాన్ని అధిష్ఠించగా, భీష్ముడు రాజ్యాన్ని పాలిస్తున్నాడు. తరువాత ప్రకరణంలో ధర్మరాజు రాజవుతాడనేది స్పష్టం చేయబడింది. ఈ పరిస్థితులలో దుర్యోధనుడు కర్ణునికి రాజ్యాన్ని ఎలా ఇస్తాడు? అందుకని కర్ణ అంగరాజ్యాభిషేకం అసంభవం). కర్ణుడు ఎక్కడకు వెళ్ళింది తెలిసికొన్న అధిరథుడు బిరబిర పరుగెత్తు కొచ్చాడు. అతనిని చూచిన కర్ణుడు ఎదురేగి, 'తండ్రీ' అని సంబోధించాడు. అధిరథుడు అతనిని కౌగలించుకొన్నాడు. దీనితో కృపాచార్యుని సందేహం తీరింది. ఈ విధంగా క్షత్రియత్వం పొందాలనే అతని ఆస అడియాస అయింది. సూతుడనే విషయం బహిరంగమైంది. పుండుమీద కారం చల్లినట్లుగా భీముడు, ''నీవు నీ వృత్తికి అనుగుణంగా కత్తికాక చర్నాకోల పట్టవలసినవాడవు, అలాగే ఉండు'' అన్నాడు. అప్పుడు దుర్యోధనుడు కర్ణుని కౌగిలించుకొని తన స్నేహ హస్తాన్ని అందించాడు. అప్పటికే సూర్యాస్తమయమైంది. తగవు, ప్రదర్శన అలా ముగిశాయి.

తనను సతతం వేధిస్తున్న ''తానెవరు?'' అనే ప్రశ్నకు సమాధానం చిక్కకపోగా, కర్ణుడు మరింత అయోమయంలో పడిపోయాడు. అప్పుడు కాకపోయినా, తరవాత ఎప్పుడో కర్ణుడు అంగరాజయ్యాడు. దుర్యోధనుని కొలువులో నిలిచిపోయాడు. అతనికి హితుడు, స్నేహితుడు అయ్యాడు. కాని ఇది ఏమాత్రం అతని సామాజిక అంతస్తును పెంచలేక పోయింది. క్షత్రియునితో సమానం కాలేకపోయాడు. దుర్యోధనుడు కూడ తన కుటుంబం నుంచి ఒక క్షత్రియ కన్యను కర్ణునికి కట్టబెట్టలేదు (ఉద్యోగ పర్వంలో కర్ణుడు చెప్పినట్లు, తానేకాదు తన పుత్రులు గూడ సూత కులంలోనే వివాహమాడారు). కర్ణుడు దుర్యోధనుని అంటిపెట్టుకొని ఉన్నది వాత్సల్యంతో కాదు, విశ్వాసపరంగానే. తన హీనకులం బహిరంగంగా ధ్రువీకరించబడిన కొలదీ, తన క్షత్రియ మూలం లోలోపల తన మనస్సులో నాటుకుపోసాగింది. దీనితో అతని మనోవ్యథ మరింత ప్రబలమైంది.

పాండవులతో తన కేవిధంగాను సంబంధం ఉందని అతనికి తెలియదు. మరి పాండవులను ఎందుకు ద్వేషించినట్లు? బహుశా ఈ దిగువ కారణాలు కావచ్చు: మనం ఇంతకు ముందు చెప్పుకొన్నట్లు, భీముడు కావాలనే పుండు మీద కారం చల్లాడు. అర్జునుని విలుకానితనంపై అతనికి అసూయ ఉంది. పాండవ శత్రువైన దుర్యోధనుని స్నేహం మరోకారణం. దురదృష్టం ఏమిటంటే, ఈ మొదటి సమావేశంలోనే అతని న్యూనత బయటపడింది. దానితో అతనిలో అసూయా ద్వేషాలు పెరిగాయి. ఆ తరవాత గూడా ఎప్పుడూ కర్ణార్జున సమాఘాతంలో అర్జునుడిదే పైచేయి అయింది తప్ప, కర్ణుడు గెలిచింది లేదు.

ద్రౌపదీ స్వయంవరంలో మత్స్య యంత్రాన్ని ఛేదించినవాడు అర్జునుడే. (కర్ణుడూ ప్రయత్నించాడనీ, అతడు హీన కులజుడు కాన ద్రౌపది ఒప్పుకోలేదనీ పాఠాంతరం). అతడప్పుడు బ్రాహ్మణ వేషంలో ఉన్నాడు. ఒక క్షత్రియ కన్యను బ్రాహ్మణుడుగెలవడమేమిటని క్షత్రియులంతా అర్జునునిపై బడ్డారు. అప్పుడు భీమార్జునులు ఒక ప్రక్క, కర్ణునితో సహా క్షత్రియులంతా రెండో ప్రక్క. భీమార్జునులు క్షత్రియ వాహినినంతా నిర్జించారు. కొంతసేపు యుద్ధం జరిగిన తరవాత

కర్ణుడు తాను బ్రాహ్మణులతో తలపడనని చెప్పి యుద్ధం నుంచి నిష్క్రమించినట్లు తెలుస్తుంది. యుద్ధంలో దెబ్బతిన్న అతడు అవమానం నుంచి బయట పడడానికి పన్నిన కుంటిసాకుగా అది కనిపిస్తున్నది.

ద్యూత సంఘటన అందరిని పరీక్షకు గురిచేసింది. అంధుడైన ధృతరాష్ట్రుడు ''ఏమి జరుగుతోంది? ఏమి జరుగుతోం''దని ప్రశ్నిస్తున్నాడు. దుశ్శాసనుడు సంతోషంతో ఎగిరి గంతులు వేస్తున్నాడు. విదురుడు ద్రౌపది గౌరవ రక్షణకు యత్నిస్తున్నాడు. బహిరకుడైన కర్ణుడూ ఈ కుటుంబం తగవులో పాలుపంచుకున్నాడు. అత్యంతంగా అందరికంటే హీనుడనని ఋజువు చేసుకొన్నాడు. ధర్మజుడు ద్యూతంలో ఓడి తనను, తమ్ములను, భార్యను ఒడ్డి ఓడిపోయాడు. ద్రౌపదిని రాజసభకు బరబరా ఈడ్చుకు వచ్చారు. ''తనను కోల్పోయి నన్ను కోల్పోయాడా? నన్ను కోల్పోయి తనను కోల్పోయాడా?'' - అనే ద్రౌపది ప్రశ్నకు సమాధానం సభ నుంచి రాలేదు. ఒక్క వికర్ణుడు (దుర్యోధనుని తమ్ముడు) మాత్రం ఒక కులీన మహిళకు ఇలాంటి అవమానం జరుగరాదని వాదించాడు. అప్పుడు కర్ణుడు లేచి వికర్ణునికి అడ్డు తగిలాడు: ''పంచ భర్తృక లంజకంటే గొప్పది కాదు. అటువంటి లంజను సభకు ఈడ్చుకు రావడంలో దోషం ఏమీలేదు. అదీ, దాని భర్తలూ - అందరూ దాసజనమే. వాళ్ళ ఒంటిమీది బట్టలు గూడ వారివి కావు ''వారి ఒంటిపై ఆభరణాలను తొలగించండి.'' ఇది వినగానే పాండవులు తమపై ఉత్తరీయాలను తామే తొలగించారు. అప్పుడు దుశ్శాసనుడు ద్రౌపది వస్త్రాపహరణం ప్రారంభించాడు. ద్రౌపదిని అంతగా వస్త్రాపహరణం చేసి అవమానించడానికి కారణం కర్ణుని ప్రోద్బలమే. కర్ణుడు ఈ మాటలు పలుకక ముందు ద్రౌపది వస్త్రాలు తీసివేయాలనే ఆలోచనే ఎవరికీ రాలేదు. కౌరవ పాండవులు తగవు పడింది రాజ్యంకోసం. దానిని యుద్ధం ద్వారానో పాచికల ద్వారానో పరిష్కరించుకో వచ్చు. అది వారి ఇష్టం. కాని ఈ విధంగా ఒక భద్ర మహిళను అవమానపరిచే కుసంస్కారానికి కర్ణుడే మూలం. ఇందులో కర్ణుని హీన, అహీన కులానికి ఏమీ సంబంధం లేదు. అసలు ఏ పరిస్థితులలోనైనా ఒక ఉన్నత కుల సంజాతను అవమానం చేయవచ్చా? అనేది మౌలిక ప్రశ్న. అసలు దాయాదుల మధ్య తగవులో తాను తల దూర్చవలసిన అవసరం కర్ణుడికి ఏముంది? పాల్గొన్నాడు. పాల్గొని తన అంతర్గత ఒత్తిడి క్రింద మానవతా విలువలనే మరచిపోయాడు.

ఘోష యాత్రలో గూడ కర్ణుని అవగుణం కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. ఒక యుద్ధ వీరుడుగా పాటించవలసిన ధర్మాన్ని పాటించలేకపోయాడు. దుర్యోధనుడు సపరివారంగా అంగరంగవైభవంతో తమ పటాటోపాన్ని, వైభవాన్ని పాండవులకు ప్రదర్శించడానికి ఘోషయాత్ర నెపాన పాండవులున్న అరణ్యప్రాంతానికి వెళతాడు. దుశ్శాసనుడూ, కర్ణుడూ గూడా తోడు వెళ్తారు. (అప్పుడు పాండవులు అరణ్యంలో ప్రవాసంలో ఉన్నారు). ఈ సమయంలో వనయాత్రకు వచ్చిన గంధర్వులతో దుర్యోధనాదులకు యుద్ధం జరుగుతుంది. కర్ణుడు పారిపోయి ప్రక్క గ్రామంలో తలదాచుకొంటాడు. పాండవులు గంధర్వులను నిర్జించి, బంధితుడైన దుర్యోధనుని విడిపించి, హస్తినకు పంపుతారు. ఈలోపు భీష్ముడు దుర్యోధనుని గంధర్వులు బంధించారని విని యుద్ధానికి

బయలు దేరుతాడు. దుర్యోధనుని పాండవులు విడిపించారని మార్గమధ్యంలోనే భీష్మునికి తెలుస్తుంది. అప్పుడు కర్ణుడు భీష్ముని కలిసి, దుర్యోధనుని క్షేమ సమాచారాలడుగుతాడు. భీష్మునికి కోపం వచ్చి, ''రాజుకు విశ్వాసులైన వారెవరూ రాజు ఎలా ఉన్నాడని అడిగేందుకు బ్రతికి ఉండరు. రాజు అపాయకర పరిస్థితులలో ఉంటే, నీ రక్షణ ఎలా చూసుకొన్నావు? రాజుమీద నీకున్న ప్రేమ కపట ప్రేమ'' అని అన్నాడు. ఇప్పటి వరకు తాను దుర్యోధనునికి స్నేహితుడననే భ్రమలో ఉన్నాడు. భీష్ముడు పెట్టిన చీవాట్లతో తల వాచిపోయింది. ఈ పరీక్షలోనూ కర్ణుడు ఓడిపోయాడు.

మరో సంఘటన గోగ్రహణం. కౌరవులు విరటుని ఆవులను తోలుకు వచ్చే ఘటన అప్పుడు అర్జునుడు ఒక్కడే కౌరవులనందరిని తరిమి, వారి దుస్తులను విరటుని కూతురుకు బొమ్మ గుడ్డలుగ బహూకరిస్తాడు. పిరికిపంద అయిన సారథిని పెట్టుకొని అర్జునుడు కౌరవుల నందరిని నిర్జించడమే కాదు; కర్ణుని పై తన ఆధిక్యతను రుజువు చేసుకొన్నాడు. ఇక్కడా కర్ణుడు అర్జునునికి దీటు కాలేదు.

కర్ణుడు సూర్యసుతుడని చెబుతారు. ఆ సంగతి తెలియకుండానే అతడు మొదటి నుంచి సూర్యుణ్ణే పూజిస్తాడు. ఎందుకో తెలియదు. సహజ కవచ కుండలాలతో అతడు పుట్టాడు. వాటికి ఏవో అద్భుత శక్తులున్నాయి. కాని వీటిని ఇంద్రునికి ఇచ్చాడు. మరి ఈ సహజ కవచం, మనం ఇంతకు ముందు చూసినట్లు ఇప్పటి వరకు కర్ణుడు చేసిన యుద్ధాలలో అతనికి ఏమాత్రం దాని అద్భుత శక్తితో పనిచేసినట్లు కనపడదు. అసలు ఇంద్రుడు వాటిని కోరినప్పుడు తన శరీరం నుండి రక్తం కారుతుండగా వాటిని పెరికి అతనికి ఇవ్వవలసిన అగత్యం ఏమీలేదు. తాను అంతటి ఉదారుడనని, దాతనని రుజువు చేసుకోవలసిన అవసరం ఏమిటి? కర్ణుడు ఎప్పుడూ గూడా మంచి, చెడూ - రెండింటిలోనూ అతికి పోతాడు. తన స్థానాన్ని గురించిన అభద్రతాభావం దీనికి కారణమా? తాను క్షత్రియుల కంటె ఎందులోను ఏమాత్రం తీసిపోనని రుజువు చేసుకోడానికి సహజ కవచ కుండలాలను దానం చేశాడా?

కర్ణుణి జీవితంలో మహదానందాన్ని ఇచ్చిన సంఘటనలు లేకపోలేదు. అవి రెండు: ఇందులో ఒకటి తానెవరో తెలిసిన సంఘటన. అప్పుడు అతని మనస్సులో ఏర్పడిన శంకాస్థితి నుంచి మహోదాత్తంగా అతడు బయటపడ్డాడు. అతడు జీవితమంతా శంకా స్థితిలోనే ఉండిపోయాడు. ఈ రెండు సంఘటనల్లో అతని ఆలోచనలు, చేతలు స్పష్టంగా, నిర్ణయాత్మకంగా ఉన్నాయి. కృష్ణుడు వచ్చి పాండవులతో చేరి పొమ్మని కర్ణుని అడుగుతాడు. ఈ సందర్భంలోనే అతడు కుంతి పెద్ద కొడుకని, ఆ కారణంగా అతడు పాండవులకు అగ్రజుడని చెప్పి, క్షత్రియునిగా అతనికి గుర్తింపు (అతడి జీవిత లక్ష్యం), ద్రౌపదిని పొందే అవకాశాన్ని గూడా కల్పిస్తామని, రాజ్యార్హతలన్నీ లభిస్తాయని కృష్ణుడు వాగ్దానం చేస్తాడు. కర్ణుడు ఇక్కడ చాలా హుందాగా ప్రవర్తించాడు. ఒక్క పరుష వాక్యం గూడ మాటాడకుండ అతడు యిలా సమాధానం చెప్పాడు: ''మీరడిగేది జరుగనిది. అసంభవం. నా జీవితం అంతా సూతుల మధ్య గడిచింది. నేను, నా కొడుకులు వారి పిల్లలనే చేసుకొన్నాం. ఇప్పుడు వారి నుంచి తెంచుకొని రాలేను. ఏదైనా నేను రాజ్యాన్ని జయిస్తే దానిని దుర్యోధనునికి కానుకగా ఇస్తాను. నన్ను బలవంతం చేయకండి.'' అప్పుడు కృష్ణుడు ''సరే,

అలాగేకానివ్వు'' మని వెళ్ళిపోయాడు. కర్ణుడు మహోదాత్తుడని, నిజమైన స్నేహితుడని, ప్రేమ, విధులతో తనను పెంచిన కుటుంబానికి బంధితుడని, ప్రలోభానికి లొంగని వాడని ఈ సంఘటన రుజువు చేస్తుంది.

ఇక రెండో సంఘటన కర్ణ - కుంతీ సంవాదం. చాల ఉగ్రంగా మాట్లాడుతాడేగాని అందులో సంకుచిత మనస్కత గోచరించదు. కర్ణుడు గంగ ఒడ్డున సూర్య నమస్కారం చేస్తుండగా కుంతి వచ్చి అతనిని కలిసింది. నమస్కారం పూర్తి చేసిన అనంతరం, ఆమె దిక్కుకు తిరిగి, ''మీరు ఏమి పనిమీద వచ్చారు?'' అని అడిగాడు. అప్పుడామె అతని జన్మ రహస్య గాథను వివరించి, ''పాండవులతో చేరు, కర్ణార్జునులంటే ఏమిటో ప్రపంచానికి చాటు'' అని కోరింది. ''మీరు నా జన్మ రహస్యాన్ని వివరించినంత మాత్రాన నా కష్టాలు గట్టెక్కుతాయనుకొంటే మీరు పొరపాటు పడినట్లే! మీరు చెప్పిన కథ నన్ను క్షత్రియునిగా ధ్రువీకరిస్తుందేకాని, నాకు విహితంగ జరుగవలసిన క్షత్రియ సంస్కారాలేవీ జరుగలేదు. పుట్టగానే మొదట జరగవలసిన జాతక కర్మ జరగలేదు. అప్పుడేమో మీరు నన్ను గాలికి వదిలివేశారు. ఇప్పుడేమో స్వార్థ ప్రేరణతో మాత్రమే నా దగ్గరకు వచ్చారు. కృష్ణుడు, అర్జునుడు అంటే ఎవరికైనా భయమే. ఇప్పుడు నేను కౌరవులను విడనాడితే అర్జునుడిని చూసి భయంతో పక్షం మార్చానంటారు. నా బలాన్ని చూసుకొనే దుర్యోధనుడు ఈ యుద్ధానికి తలమునకల సన్నద్ధుడయ్యాడు. మీరడిగింది నేనెప్పటికీ చేయలేను. అర్జునుణ్ణి తప్ప, మీ సుతులలో అన్యులెవరిని చంపను. అర్జునుడు నన్ను చంపితే మీ అయిదుగురు కొడుకులు మీకు ఉంటారు. అలాకాకనేనే అర్జునుని చంపితే, అప్పుడూ మీకు ఐదుగురు పుత్రులుంటారు'', అని కర్ణుడు కుంతికి చెప్పాడు. అప్పుడు కుంతి, ''అయితే నీ మాట నిలబెట్టుకో'' అని చెప్పి వెళ్ళిపోయింది.

ఇక్కడ కర్ణుడు చెప్పినదాంట్లో ద్వేషం ఏమీ లేదు. కాని తాను అర్జునుని తప్ప తక్కిన వారిని చంపననే మాట పరీక్షకు నిలువదు. పైకి చూడడానికి అదేదో ఔదార్యంగా కనిపిస్తుందే కాని ఇది అతడు మామూలుగా ఆర్భాటంగా చేసిన ప్రతిజ్ఞలాంటిదే. అసలు అతనికి కుంతి అంటే ప్రేమగాని దయగాని లేదు. సోదరులంటే దయచూపవలసిన అవసరం అంతకంటె లేదు. అతడు సోదరులను చంపను అని అనడంలో అతనికి ఉన్నది ఔదార్యం, ప్రేమా కావు. జుగుప్స. అతని వాగ్దానం వెనుక ఉంది సములతో తప్ప అసములతో పోరు చేయరాదని. ఈ జుగుప్స, అతి విశ్వాసం, అతిశయం క్షత్రియులకు సహజమే. అయితే ఇక్కడ అది అసందర్భ ప్రేలాపన. ఇప్పుడు జరుగుతున్నది నిజమైన యుద్ధం. యుద్ధంలో దుర్యోధనుని గెలిపించవలసిన బాధ్యత అతనికి ఉంది. అంతేగాని వ్యర్థ ప్రేలాపన గాదు అతడు చేయువలసింది. సోదరులను, ముఖ్యంగా ధర్మరాజును, చంపననడంలో దుర్యోధనుని కార్యానికి విఘాతం కలుగుతుంది. దుర్యోధనుని అవసరాన్ని విస్మరించి, డాంబికతతో కొట్టుకుపోయాడని చెప్పవలసి వస్తుంది.

ఈ సంఘటన అతడు నిజంగా ఎవరో అతనికి తెలియ జెప్పింది. దీనితో అంతః సంఘర్షణ, అంతరంగ అభద్రత పరిష్కృతమై ఉండాలి. అయితే పైకి మాత్రం అతడు ఈ నూతన గుర్తింపును స్వీకరించి, తదనుగుణంగా ప్రవర్తించలేడు గనుక, ఆ గుర్తింపును పరిత్యజించాడు. తన స్నేహితునికి

బాసటగా నిలిచినందుకు ఆ నైతిక విభవాన్ని పొందగలిగాడు. కాని తరవాతి కాలంలో అతడు మళ్ళీ పాత గాడిలోనే పడిపోయాడు. అతడి చర్యలే అతని పతనానికి దారితీశాయి. ఇతరులూ అతినిని క్షమించలేదు.

మహారథుల ఎంపికలో భీష్ముడు కర్ణుణ్ణి రెండో శ్రేణి వానిగా నిర్ణయిస్తాడు. ఈ అంచనా కర్ణుని సామాజిక అంతస్తును ఆధారం చేసుకొని చేసింది కాదు. అతని వైయక్తిక పరిమితులు, దోషాలు ఆధారంగా చేసింది మాత్రమే. దీనితో కర్ణునికి కోపం వచ్చింది కాని, తరవాత సంఘటనలు భీష్ముని తీర్పే సరైనదని రుజువు చేశాయి. మహారథి అంటే, రథం మీద నిలబడి బాణాలు వేయడమేకాక రథాన్ని నడపడం గూడ చేత కావాలి. భీష్మ, కృష్ణ, అర్జునులకు రెండూ తెలుసు. కర్ణుడికి రథంపై నిలబడి యుద్ధం చేయడమే తెలుసుకాని, రథం నడపడం రాదు. నడుస్తున్న రథం మీద నుండి బాణాలు సరిగా సంధించాలంటే రథం నడపడం, తెలిసినవాడే రథగతి అర్థమై, సరిగా సంధించగలుగుతాడు. భీష్మ కర్ణుల ఈ తగవు కారణంగా కర్ణుడు భీష్ముని క్రింద యుద్ధం చేయనని అలిగి కూర్చున్నాడు. తొమ్మిది రోజులు యుద్ధంలో పాల్గొనలేదు. ఇక్కడ కర్ణుడు తన అభిమానం చూసుకొన్నాడే కాని, దుర్యోధనుని హితాన్ని చూడలేదు. (కర్ణుడు గనుక యుద్ధంలో పాల్గొంటే భీష్ముడు యుద్ధం చేయ నిరాకరించాడని పాఠాంతరం.)

ద్రోణుడు కూడా భీష్ముని అభిప్రాయాన్నే బలపరిచాడు: ''కర్ణునికి తల బిరుసు. పాత్ర తెలియక కరుణ కురిపిస్తాడు. యుద్ధంలో వెన్ను చూపుతాడు. తప్పుడు నిర్ణయాలు చేస్తాడు. రథికునిగా అతనికి పూర్తి మార్కులు వేయలేను.'' ఆ రోజుల్లో ద్రోణుడు యుద్ధ విద్యల్లో ఆరితేరినవాడు. అతడు విమర్శనైనా కర్ణుడు కాతరు చేయవలసింది. కాని అతడు ఆత్మవిమర్శ చేసుకోలేదు.

భీష్ముని అనంతరం కర్ణుడు రంగప్రవేశం చేశాడు. సైన్యం అతనిని సేనానిని చేయమని కోరింది. అప్పుడు కర్ణుడు ద్రోణుని సేనానిగా చేయవలసిందిగా సూచించాడు. ద్రోణుడు మూడు రోజులు నాయకత్వం వహించాడు. ఈ మూడు రోజుల్లో కర్ణునికి అర్జునుణ్ణి ఎదుర్కొనే సందర్భం లభించలేదు. ఈ లోపు పదునారేడుల బాలుడు అభిమన్యుని ఆరుగురు యోద్ధలు చంపితే, ఈ ఆరుగురిలో కర్ణుడూ ఒకడు. ఆ పిల్లవాని రథం విరిగిపోగా, అతడు నేలపైదూకి అక్కడినుంచే ఆ ఆరుగురు మహావీరులను ఒంటరిగా ఎదుర్కొన్నాడు. పదహారవదినం ద్రోణుని అనంతరం కర్ణుడు నాయకత్వం స్వీకరించాడు. అప్పటికే ఇరువాగులవారు ఎంతో మంది చనిపోగా, పాండవులు కొద్ది ఆధిక్యంలో ఉన్నారు. ద్రోణుని కొడుకు అశ్వత్థామ సంధిచేసుకోమని దుర్యోధనునికి సలహా ఇచ్చాడు. కర్ణుని అండ చూసుకొని, ఎవరూ సాధించలేనిది కర్ణుడు సాధిస్తాడని దుర్యోధనుడు గురుపుత్రుని సలహా చెవిని పెట్టలేదు. కాని కర్ణుడు అనితరమైనదేదీ సాధించలేదు.

తరవాత రోజు శల్యుని రథసారథ్యం వహించమని కర్ణుడు కోరాడు. క్షత్రియుడు, ఒక దేశానికి రాజు అయిన తాను ఒక నీచకులజునికి సారథ్యం చేయడంకంటె ఇంటికి పోవడం మంచిదని శల్యుడు అన్నాడు. ఎలాగో దుర్యోధనుడు బ్రతిమిలాడి శల్యుని ఒప్పించాడు. శల్యుడు

రథంతోలుతూ ఉండగా మార్గమధ్యంలో శల్యునికి కర్ణునికి సంవాదం జరిగింది. బహుశా ఈ సంవాదం తరవాతి కాలంలో ప్రక్షేపింపబడి ఉండచ్చును. శల్యుడు ఇలా అంటాడు: ''ఊరికే డాంబికాలు పోకు. అర్జునుణ్ణి చూడగానే నీకు గుండె జారిపోతుంది.'' ఇలాంటి హెచ్చరికలు అధిక్షేపాలు సైనికునికి కోపం తెప్పించడానికి చెబుతారు. అర్జునుడు యుద్ధం సేయనని విల్లంబు క్రింద పడవేస్తే, కృష్ణుడు అతనిని అధిక్షేపించి, కోపం తెప్పించి, యుద్ధానికి పురికొలుపుతాడు. శల్యుడన్న మాటలకు కర్ణుడు కుపితుడై, శల్యుని రాజ్యమైన మద్రలోని స్త్రీలంతా త్రాగుబోతులు, తిరుగుబోతులు, గోమాంస భక్షకులు అని తిడతాడు. ఈ సంవాదాన్ని మనం అంతగా నమ్మడానికి వీలులేదు. తరతరాలుగా మద్ర, హస్తినాపుర రాజవంశాల మధ్య పిల్లల్ని ఇచ్చి పుచ్చుకోవడాలు ఉన్నాయి. పైగా శల్యుడు హస్తినాపురానికి బంధువు, రాజు. అతనిని కర్ణుడు అలాంటి మాటలన్నాడంటే నమ్మడం కష్టం. అయితే ఈ పాఠం మహాభారతం critical edition లో గూడా ఉంది. అసలు ఆ రోజుల్లో క్షత్రియ స్త్రీలంతా త్రాగేవారు, గోమాంస భక్షణ చేసేవారు. అది మామూలే. త్రాగుడు నిషేధం తరవాతి కాలానికి సంబంధించింది.

కర్ణుడు ఈ విధంగా ప్రేలిన తరవాత శల్యుడు మాటాడడం ఆపివేశాడు. బహుశః అర్జునుని అనుకరించడానికేమో! రథానికి తెల్ల గుర్రాలను పూన్చవలసిందని కర్ణుడు ఆదేశించాడు. ఇది వట్టి తెలివిమాలినపని. యుద్ధంచేయడానికి నమ్మకమైన సారథి, సుశిక్షితమైన, చిరపరిచితమైన గుర్రాలు, అలవాటైన రథం ఉండాలి. ఇది సామాన్య సూత్రం. దీనిని అతడు పాటించి ఉండాల్సింది. ఇప్పటికే అతని సారథి (శల్యుడు) అతనికి కొత్తవాడు. పైగా గుర్రాలను గూడా మార్చమని ఆదేశం. అతడు వేసిన మొదటి అడుగే తప్పటడుగు. మామూలు ప్రకారం ఈ రథం వెనుక విల్లంబులు, బాణాలు పెట్టుకొని మరో రథం అనుసరించి వస్తున్నది. కౌరవ శ్రేణుల మధ్యకుపోయి, ''అర్జునుడు ఎక్కడ? నాకు చూపండి. అతడిని ఎవరూ చూడలేదా? నాకెక్కడా కనిపించడేం?'' అని కర్ణుడు అరిచాడు. శల్యుడు అప్పుడు అర్జునుని దిశగా రథం నడిపించి ''అడుగో అర్జునుడు. దుర్యోధనుని రుణం తీర్చుకునే సమయం ఇదే'' అన్నాడు. అక్కడకు వెళ్ళేసరికి అతని కొడుకు. వృష సేనుడు అర్జునుని ఎదుర్కొంటున్నాడు. కర్ణుడు ఏదైనా చేయగలిగేలోపే అర్జునుడు వృషసేనుని చంపాడు. దీనితో కర్ణుడు మూగవోయాడు. కన్నుల నీరు నిండింది. అప్పుడు అర్జునుని ఎదుర్కొన్నాడు. క్రమంగా అర్జునినిది పైచేయి అయింది. కర్ణుని కవచం ముక్కలైంది. నిస్పృహతో నాగాస్త్రాన్ని అర్జునునిపై సంధించాడు. (పాము కూర్చున్న బాణం - బహుశ దీని అర్థం అది విషపూరితమని, అది తాకినవారు విషగ్రస్తులై చనిపోతారని). ''అర్జునుని కంఠానికి మీరు బాణం ఎక్కుపెడితే, మీ గురి సరిగా లేదు. సరి చూసుకోండి'', అని శల్యుడు హెచ్చరించాడు. కర్ణుడు దానిని పెడచెవిని బెట్టాడు. అది గురితప్పి అర్జునుని కిరీటాన్ని తాకింది. దీనికి మరో పాఠం గూడ ఉంది. ఈ బాణం వస్తున్నప్పుడు కృష్ణుడు రథాశ్వాలను మునిగాళ్ళమీద వంచి రథాన్ని 24 అంగుళాలు క్రిందికి దించాడట. ప్రతి సంఘటనను కృష్ణుని గొప్పతనాన్ని పెంచడానికి కలిపినట్లే, ఈ సంఘటన తరువాతి కాలంలో కృష్ణుని గొప్పతనాన్ని పెంచడానికి కలిపి ఉండవచ్చు.

ఏది ఏమైనా కర్ణుడు గురి తప్పడానికి అప్పుడే చనిపోయిన పుత్రుని వలని శోకం కారణం కావచ్చు. ఇదే సమయంలో అతని రథం బురదలో కూరుకుపోయింది. (ఇది యుద్ధం మొదలైన 17వ రోజు). కర్ణుడు రథం మీది నుంచి క్రిందకు దూకి కూరుకుపోయిన చక్రాన్ని పెకలించ ప్రయత్నించాడు. ఇది ఒక మనిషికి సాధ్యమయ్యే పనికాదు. అదీగాక యుద్ధం మధ్యలో అసలు అతడు మరో రథానికి ఎందుకు మారలేదో మన కర్థం కాదు. సూర్యాస్తమయ మవుతోంది. నాటికి యుద్ధం చాలించే సమయం ఆసన్నమైంది. కొంత వెసులుబాటు దొరుకుతుందేమోనని కర్ణుడు ఆశించాడు. అతడు అర్జునుని ఇలా అర్థించాడు:

''కూరుకు పోయిన చక్రాన్ని పెకలిస్తున్నాను. యుద్ధనీతి నీ వెరుగనిది కాదు. రథం మీద ఉండి నేలమీద ఉన్నవానితో పోరాడరాదు. యుద్ధనీతిని పాటించు.''

కృష్ణుడికి కర్ణుని వదలిపెట్టడం ఇష్టం లేదు; కృష్ణుడు కర్ణుని మాటలను కర్ణుణనికి అప్పుచెప్పాడు: ''ద్రౌపది వలువలు వలవమని దుశ్శాసనుని నియోగించినప్పుడు ఈ నీతి ఏమైంది? మీరు ఆరుగురు కలిసి ఒక బాలుని, అతడు నేలపై ఉన్నప్పుడు, పడగొట్టినప్పుడు నీ యుద్ధనీతి ఏమైంది?''

పాపం! అర్జునిడికి వదిలిపెడదామనే ఉంది. కాని కృష్ణుడు అర్జునునికి విధి తెలిపి, పురికొలుపుతాడు. కృష్ణుడు ఈ ప్రశ్నలు వేయడం ద్వారా కర్ణునికి న్యాయమడిగే అర్హత లేదని తెలియజేశాడు. అంతేకాక అర్జునునికి జరిగిన రెండు అన్యాయాలను అతనికి గుర్తు చేశాడు. ''ఇతడు నా భార్యను అవమానించాడు. నా పుత్రుని క్రూరంగా చంపాడు. ఇతను బ్రతకడానికి వీలులేదు''. అంటూ విల్లు ఎక్కుపెట్టి, ''ఈ భాణం కర్ణుని అంతంచేసి, నన్ను సుక్షత్రియునిగా ప్రతిష్ఠించుగాక'', అని అర్జునుడు బాణం వేశాడు. అది గురి తప్పలేదు. అర్జునుడు గురి తప్పడం ఎరుగడు.

మహాభారత గాథలో కర్ణుడు మొదట శాస్త్రాస్త్ర విద్యా ప్రదర్శనలో ప్రవేశిస్తాడు. అప్పుడతడు అర్జునుని ద్వంద్వ యుద్ధానికి సవాలు చేస్తాడు. అదే సవాలును ఎదుర్కొనే అవకాశం ఈ చరమాంకంలో వచ్చింది. అప్పుడది చిన్న పిల్లల ఆట. ఇప్పుడది నిజమైన యుద్ధం. చంపడమో, చావడమో - రెండే దారులు. తాను జీవితాంతం ద్వేషించిన, అసూయపడిన శత్రువును ఎదుర్కొంటున్నాడు. అటువంటి శత్రువు నుంచి ఏరకమైన ఆపేక్షను యాచించ ఉండవలసింది కాదు. మళ్ళీ ఇక్కడ కర్ణుడు ఎన్నడూ చేయరాని పని చేశాడు. ''తానేమిటి? తన హక్కులేమిటి?'' అని తెలుసుకోకుండానే కర్ణుడు అంతమయ్యాడు.

గ్రంథం: **యుగాంతం** రచన: **ప్రొ. శ్రీమతి ఇరావతీ కర్వే**

సాహిత్య అకాడమీ సౌజన్యంతో భావ పరిశీలన: **రవీంద్రనాథ్**

(1995, నవంబర్ 'మిసిమి')

పికాసో

కళా జగత్తులో ఆ నామం చిరంజీవి- చిత్రకళా ప్రపంచంలో మేరునగంలా నిలిచిన 'వామన' ఠీవి - భావితరాలకు ప్రేరణ కలిగించిన కళల దీవి - పాబ్లోరూయిజ్ పికాసో. ఆధునిక చిత్రకళలో అద్వితీయుడు. చిత్రకళా ప్రియులకు సదా ఆరాధ్యుడు.

1881 అక్టోబరు 25న స్పెయిన్‌లో జన్మించిన పికాసో, జీవితంలో అత్యధిక భాగాన్ని గడిపింది మాత్రం ఫ్రాన్సులో. ఆయన రక్తంలో ప్రవహించిన స్పానిష్, జూయిష్, ఇటాలియన్ సంస్కృతులు - ద్వివిధ జాతీయ పరిసరాలు ఆయనను దేశ కాలావధులను దాటి విశ్వ విశాల కళా దృష్టిని ఆయనలో నిలిపాయి. పికాసో తండ్రి జోసె రూయిజ్ బ్లాస్కో కూడా చిత్రకారుడు కావడంతో, తండ్రి ప్రోత్సాహంతో పికాసో బాల్యంలోనే సాంప్రదాయిక చిత్రకళారీతులలో అసమాన ప్రజ్ఞ సంపాదించాడు. కేవలం 15 సంవత్సరాల ప్రాయంలో తన తల్లి చిత్రాన్ని అత్యద్భుతంగా చిత్రించిన మేధావి పికాసో. అటు తరువాత పికాసో మొత్తం జీవితం చిత్రకళకే అంకితమైపోయింది. ఆ అంకిత భావంలో ఉదయించిన సరికొత్త సృష్టి, ఆయన సాంప్రదాయిక చిత్రకళా రీతులను అధిగమించి, వినూత్నమైన విలక్షణమైన రీతులను సృష్టించడంలో నిమగ్నమైంది.

మానవ శరీరాకృతులను తనదైన శైలిలో మలచిన 'అపర విశ్వామిత్రుడు'. ఆయన చిత్రించిన 'ది త్రీ డాన్సర్స్' (1925) చిత్రకళలో అపూర్వమైన సంచలనాన్ని కలిగించి, ఆధునిక చిత్రకళలో నూతన రీతులకు మార్గదర్శకమైంది. చిత్రకళా సాంప్రదాయిక ఎల్లలను దాటి తనదైన కొత్త ప్రపంచాన్ని తన కళ ద్వారా ఈ లోకానికి అందించిన పికాసో ప్రభావం నుండి తప్పించుకున్న చిత్రకారులు చాలా కొద్దిమంది మాత్రమే ననడం అతిశయోక్తి కాదు. పికాసో మోడల్స్‌ని అట్టే ఉపయోగించుకునేవాడే కాదు. చిత్రకళలో సదా నూతన రీతులను సృష్టించిన పికాసో కుంచెనుండి నవ్యమైనది, అతి ముఖ్యమైన రీతి 'క్యూబిజమ్' (cubism) ఆవిర్భవించింది. ఒక మిత్రునికి లేఖ వ్రాస్తూ, సుప్రసిద్ధ ఫ్రెంచి చిత్రకారుడు సేజాన్, ''ప్రకృతిలోని ప్రతిదాన్ని స్ఫియర్స్ కింద, కోన్స్ కింద, సిలిండర్స్ కింద మార్చవచ్చు నన్నాడు.'' ఈ సూక్తి ప్రేరణతోనే కావచ్చు, పికాసో క్యూబిస్టు కళారీతిని సృష్టించాడు. తన మిత్రులు, సహచరులైన గ్రిస్ , డిరెయిన్, వ్లామింక్, మాటిస్సే, బ్రాక్యులతో కలిసి పికాసో 'క్యూబిజాన్ని' వృద్ధి చేశాడు. పికాసోను ఆఫ్రికా నాగరికత, సంస్కృతి ఎక్కువగా ఆకర్షించాయి. ఈ ప్రభావం కొంత అతని చిత్రకళపై పనిచేసింది. ఆ ప్రేరణలోనే 'నీగ్రో' కళాఖండం రూపుదిద్దుకుంది. అటు తరువాత సర్రియలిజం (Surrealism) సాహిత్యం నుంచి చిత్రకళకు రావడం మొదలై నవ్య కళా రీతులకు సాగి, నూతన దిగంతలాను తాకింది పికాసో సృష్టి.

పికాసో చిత్రకారుడే కాదు శిల్పి కూడా. అగ్గిపెట్టెలపై, సిగరెట్టులపై ఆయన కొన్ని చిత్రాలు వేశాడు. కాగితం ముక్కలను అంటించి కొన్ని చిత్రాలుచేశాడు. ఇసుకతో, బొగ్గుతో, సీమసున్నంతో కొన్ని చిత్రాలు రూపొందించాడు. శిల్పాల విషయంలో కూడా ఆయన చేయని ఇంద్రజాలం

లేదు. రూపంలో నైరూప్యాన్ని, నైరూప్యంలో రూపాన్ని చూడడం పికాసో వైశిష్ట్యం. ఈ పంథాలోనే ఆకృతిని వికృతిగా, వికృతిని ఆకృతిగా రూపొందించడమన్నది ఒక్క పికాసోకే సాధ్యమైంది. ఏ సూత్రంగానీ ఏ నియమంగానీ, ఏ సంప్రదాయం గానీ ఆయనను బంధించలేదు. క్రొత్త దారుల్లో పోవడం మూలంగానే పికాసో తనకు తానే సాటిగా నిలిచాడు.

''కళ కళ కోసం కాదు, ప్రజా శ్రేయస్సు కోసం'' అని నమ్మిన నిజమైన కళాకారుడు పికాసో. రెండు ప్రపంచ యుద్ధాల బీభత్సంలో శిథిలమైన ప్రపంచ దురవస్థను గమనించి, తన కళ ద్వారా ప్రజలకు సందేశాన్ని, ధైర్యాన్ని అందించి వారిలోని నైరాశ్యాన్ని నిర్మూలించ ప్రయత్నించిన ధీశాలి. అందుకు నిదర్శనం ఆయన కుంచె సృష్టించిన ''గెర్నికా'' (1937). తాను చెప్పదలచుకొన్న విషయాన్ని సూటిగా, నిస్సంకోచంగా చెప్పడం పికాసో నైజం. ఆ నైజం ఆయన సృష్టించిన 'యిజా' లలో కనబడుతుందన్నది జగమెరిగిన నిజం. ''నా చిత్రకళ నాకంటె శక్తిమంతమైనది. దానికేమి కావాలో నన్ను నిర్దేశించి మరీ చేయిస్తుంది'' అంటాడు పికాసో, తన కళను గురించి. ''ఎంత ప్రయత్నించినా నేను చిన్న పిల్లల్లాగా బొమ్మలు వేయలేను'' అని నిగర్వంగా చెప్పుకున్న పికాసో, సదా విలక్షణుడే! కళా స్రష్టగా తన జీవితంలో ఎప్పుడూ వైవిధ్యాన్ని ప్రదర్శించాలని కోరుకునే పికాసో దిన చర్య కూడా వింతైనదే! ఆయన రాత్రంతా తన కళాసృష్టి చేసి, పగలంతా విశ్రాంతి తీసుకునేవాడు. ఆయన విలాసవంతమైన జీవితాన్ని ఇష్టపడేవాడు. పహిల్వాన్‌లా కనబడేవాడు.

'దక్షిణ నాయకుడు' పికాసో -

పికాసో చిత్రకారునిగా, శిల్పిగానే కాదు, వ్యక్తిగా కూడా విశృంఖలత్వం గలవాడు. అందమైన ఆడవాళ్ళంటే ఆయనకు విపరీతమైన మోజు. చిత్రకారునిగా ఎంతటి సంచలన కర్తో, శృంగార పురుషుడిగా మరో కృష్ణుడు, పికాసో శృంగార జీవితం అతని చిత్రకళకు ఇంకొంత స్ఫూర్తి నిచ్చింది. అతను తన జీవితంలో ప్రవేశించిన స్త్రీలను, ''దేవత'' లతో పోల్చేవాడు.

ప్రేయసిగా అతని జీవితంలో మొదట ప్రవేశించిన స్త్రీ ఫెర్నాండే ఒలివియర్. ఈమె సాహచర్యంలో పికాసో అక్రోబాట్స్ (Acrobats), డాన్సర్స్ (Dancers), హార్లెక్విన్స్ (Harle-quins) చిత్రాలను, ఫెర్నాండేతో కలిసి మెడ్రానో సర్కసును చూసిన ప్రేరణతో సర్కస్ కళాకారుల చిత్రాలను సృష్టించాడు పికాసో.

1907లో 'Les Demoiselles d' Avignon' అన్న చిత్రంతో మొదట పికాసో తన సృష్టిలో సహజత్వాన్ని తగ్గించి, రేఖాగణితాన్ని చిత్రాల్లో జోడించ సాగాడు. ఆ సృష్టి చిత్రకళా ప్రపంచంలో అపూర్వ సంచలనాన్ని రేకెత్తించింది. ఈ సమయంలోనే ఈవా అనే అమ్మాయి అతనికి చేరువైంది. పికాసో పెర్నాండేని వదిలించుకుని ఈవాను ప్రేమించ సాగాడు. ఈవా స్నేహంలోని ప్రేరణతోనే పికాసో 'క్యూబిజమ్' లో కొత్త ప్రయోగాలు చేశాడు. కానీ, ఈవా ఆకస్మిక మరణం పికాసోను కృంగ దీసింది. సరిగా ఈ సమయంలోనే (1917లో) జీన్ కొక్టూ, పికాసోను పెరేడ్ (parade) చిత్రీకరణ కోసం రోమ్‌కు తీసికెళ్ళాడు. అక్కడ వాటికన్‌లో పికాసో మైకెలాంజెలో, రాఫెల్

చిత్రాలను అధ్యయనం చేశాడు. అక్కడే ఓల్గా కొక్లోవా అన్న జవరాలి ప్రేమలో పడి, జూలై 12, 1918న ఆమెను పెళ్ళాడాడు. ఓల్గాయే పికాసో మొదటి లీగల్ భార్య! 1921 ఫిబ్రవరి 4న వీరి కలల పంటగా కొడుకు పౌలో పుట్టాడు.

1920-1930 మధ్యకాలంలో పికాసో ఆధునిక చిత్రకళలో నవ్యరీతులను సృష్టించాడు. ఆ ప్రభావం సర్రియలిజమ్ (Surrealism) ఎక్స్ప్రెషనిజమ్ (Expressionism), అబ్స్ట్రాక్ట్ పెయింటింగ్ (Abstract Painting) లపై గాఢంగా పనిచేసింది. 1927లో పికాసో 17 ఏళ్ల మేరీ తెరెసా ప్రేమలో పడటం, ఆమె గర్భవతి కావడంతో ఆయన మొదటి భార్య ఓల్గా ఆయనను విడిచి పెట్టినా, ఆమె తన మరణాంతరం వరకూ పికాసోకు ప్రతిరోజూ సుదీర్ఘమైన ఉత్తరాలు రాసేది. తెరిసాకు ఆడపిల్ల జన్మించింది. ఆమె పేరు 'మాయ'. తరువాత డోరా అనే ఫోటోగ్రాఫర్ ఆయన జీవితంలో ప్రవేశించింది. ఆమె తరువాత ఫ్రాంకోయిస్ అనే అందగత్తె పికాసో భార్య కాగలిగి, ఇద్దరు బిడ్డల తల్లియైన తరువాత ఆయనను వదిలింది.

1961 లలో పికాసో 'జాక్వెలిన్'ను వివాహమాడాడు. ఇదే ఆయన చివరి వివాహం. జాక్వెలిన్ ఆయన జీవితాంతం ఆయనకు మానసికమైన ప్రశాంతతని కలుగ జేసింది. ఆమె సాహచర్యంతో పికాసో ఉత్తమ సాహిత్యానికి తగ్గ ఉత్తమ కళా ఖండాలను సృష్టించాడు. Les Femmeds D' Algers, Las Meninas, D'ejuner Sur L'Herbe మొదలైన కళాఖండాలను జాక్వెలిన్ ప్రోత్సాహంతోనే పికాసో సృష్టించ గలిగాడు.

పికాసో సృష్టించిన ది డ్రాప్ కర్టన్ (The drop-curtain), ది షీగోట్ (The She-Goat), ది వోల్లార్డ్ షూట్ (The Vollard Suite), గర్ల్ యిన్న ఎ కెమిస్ (Girl in a Chemise), ది అక్రోబాట్స్ ఫామిలీ విత్ ఎ మంకీ (The Acrobat's Family with a Monkey), త్రీ వుమెన్ (Three Woman), ఉమెన్ రన్నింగ్ ఆన్ ది బీచ్ (Woman Running on the Beach), ది థర్డ్ క్యూబిస్ట్ (The Third Cubist) మొదలైన కళాఖండాలు చిత్రకళా జగత్తులో ఆయన ముద్రలు, చిత్రకళకు ఆయనో యుగ పురుషుడు! అయన సృష్టించిన వినూత్న, విలక్షణ రీతులను విపరీతమైనవని విమర్శించిన వారూ లేకపోలేదు. అయినా ఆ విమర్శకులే పికాసో సృజనాత్మక శక్తిని, వైవిధ్యాన్ని గుర్తించక తప్పలేదు. పికాసో పేరు వినలేదనే వారు ఆయన కళను హర్షించలేని వారు బహు అరుదు.

1973, ఏప్రిల్ 9న ఈ కళాస్రష్ట తన కల్పనా జగత్తులో విహరించడానికి తన కాయాన్ని వదిలి వెళ్ళాడు. అయినా ఆయన శకం కొనసాగుతోంది చిత్రకళా ప్రపంచంలో.

'మిసిమి' రచనల వర్క్‌షాపు

(1995, మార్చి 'మిసిమి')

LOOKING AT A MASTERPIECE

Seated Woman (Marie-Thérèse Walter)

In January 1937, Picasso painted a series of portraits of his young mistress, Marie-Thérèse. The two had become lovers some ten years earlier and the liaison had brought Picasso's life a new happiness and calm. In this smiling portrait, Marie-Thérèse's harmonious form has been deliberately distorted, to incorporate several views in one image. Picasso did not necessarily set out with this intention. He has concentrated on Marie-Thérèse's most salient features- her drowsy eyes, relaxed hands, rounded form and her patterned dress and hat: but, in the process of painting, the sitter has undergone a transformation, as Picasso has become immersed in the curving rhythms of his subject overall. In essence, however, Picasso's emotional response to Marie-Thérèse's qualities - her serene, contemplative nature and volup tuous sensuality - has produced, at least, just as true and beautiful a portrait as any conventional likeness.

TRADEMARKS

Distortion

Picasso often subjects his forms to grotesque distortions, allowing his initial idea the same mobility as his thoughts. He once stated: 'I paint what I know, not what I see' - and, in a certain sense, when one *knows* that a face has two eyes, it can seem perverse to represent it with one. Picasso was aware that his distortions were often subversive but, as he explained, 'Whatever the source of the emotion that drives me to create, I want to give it a form which has some connection with the visible world, even if it is only to wage war on that world.'

‘షాహెన్‌షా - ఎ - ముస్సఖి మర్హామ్’
కుందన్‌లాల్ సైగల్

మొయిలిని చూసి నెమలి ఆడితే, సైగల్ పాట మనుషుల మనసుల్ని తాకి ఆడు కొంటుంది. ఈ రెండింటికి సామ్యము ప్రత్యక్షంగా అల్పమైనా, పరోక్షంగా బహుళం.

నాదం నుంచే సృష్టి జరిగిందనే వాదం నిజమే అయితే పంచ భూతములలో నాద మూలకమైన ఆకాశము సర్వత్రా వ్యాపన శీలమైనది. తద్గుణమగు నాదం కూడా సర్వత్రా వ్యాపించినదే 'The musci of spheres' అన్న పాశ్చాత్యుల భావన కూడా దీని అనుసరణ జనితమేననవచ్చు. నాదం (గానం, సంగీతం) ప్రతి జీవిలోనూ ఏదో ఒక రూపంలో కనబడకపోదు. ఈ సంగీతం కొందరికి సాధనతో సాధ్యమైతే, మరికొందరికి జన్మతః వచ్చినది. అలాంటి వరప్రసాదే మన కుందన్‌లాల్ సైగల్.

1904 ఏప్రిల్ 4న జలంధర్‌లో జన్మించిన కె.యల్. సైగల్, రైల్వే శాఖలో పనివారి మీద అజమాయిషీచేసే గుమాస్తాగా తన జీవితాన్ని ప్రారంభించాడు. ఏ గురువు వద్దా సంగీతం నేర్చుకోని సైగల్‌కు పాటలు పాడటం ప్రవృత్తి. ఆ పాట అతని జీవితంలో ఒక భాగమైందనడం కంటె పాటే అతని జీవతమైంది అనడం సబబు. అతని గానాన్ని అతని చుట్టుపక్కల వారంతా విని ఆనందించేవారు. రైల్వేశాఖలో ఉద్యోగం మానివేసి సైగల్ కొంతకాలం ''టైపురైటర్స్'' అమ్ముతూ జీవించాడు. ఆ జీవనంలోనకూ అతని పాటే అతని బాట. ఎక్కువగా ప్రయాణంపై మక్కువలేని సైగల్ ఆ ఉద్యోగం కూడా వదులుకొని, కలకత్తాలోని ‘న్యూ థియేటర్స్’ లో గుమస్తాగా చేరాడు. ఆ సంస్థలో పనిచేసుకుంటూ యథాప్రకారం కూనిరాగాలు తీస్తున్న సైగల్ గాత్రం విని, ఆ సంస్థ నిర్మిస్తున్న ‘శుభ్ - కా - సితారా’ చిత్రంలో గాయకునిగా పరిచయం చేశారు. ఈ సంఘటన 1932లో జరిగింది. అదుగో, అప్పుడే ఓ అద్భుత గాయకుడు మన భారతావనికి అవ తరించాడు. లోకం సంతోషించింది. నిజానికి సైగల్ పాడడు. అతడు పలికే మాటలే పాటగా రూపుదిద్దుకొంటాయి. అంతటి మధుర కంఠం సైగల్‌ది. తుమ్మెదల ఝుంకా రాన్ని యథాతథంగా పలికించిన సైగల్ గళం అద్భుతమైనది. అమరమైనది. ఆరోహణ, అవరోహణలు పుట్టుకతోనే అబ్బిన సైగల్ సాధారణంగా అష్టమస్వరాన్ని (ఆలాపన) ఎప్పుడో ఒకసారి ఉచ్ఛస్థాయిలో ఆలపించేవాడు. అందుకే కాబోలు ‘గానకోకిల’ లతా మంగేష్కర్ ఒక ఇంటర్వ్యూలో ''సైగల్‌లాగా అష్టమ స్వరాన్ని ఆలాపించాలన్నదే తన జీవితాశయం''గా పేర్కొన్నారు.

ఒక్క లతా మంగేష్కరే కాదు, ముఖేశ్, కిశోర్ కుమార్, తలాత్ మహమ్మద్ లాంటి ప్రఖ్యాత గాయకులందరూ సైగల్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన గాత్రాన్ని అనుకరించినవారే. సైగల్ వర్ధంతి సందర్భంగా ‘ఆల్ ఇండియా రేడియో’ వారి కార్యక్రమంలో లతా మంగేష్కర్ సైగల్ పాట ''సోజా రాజకుమారీ! ....'' ని ఆలపించగా అంతటి మాధుర్యం రాకపోయేసరికి రేడియో స్టేషన్ వారు తెలివిగా సైగల్ గాత్రాన్నే జత చేశారు. అందుకే లత, ''చూశారా! ఇంతకీ ఆయనెక్కడా?

నేనెక్కడా?'' అని వినమ్రంగా తన ఓటమిని అంగీకరించారు. అదే సందర్భంలో ముఖేశ్ ''నేను సైగల్‌గారిని కలిసి సీనియర్‌గా సలహా యిమ్మనగా ఆయన 'నన్ను (సైగల్‌ని) అనుకరించవద్దు, నీ సొంత బాణిని నీవు పెంపొందించుకో' అన్నార''ని తన అనుభవాన్ని జ్ఞాపకం చేసుకున్నాడు. అందుకే ముఖేశ్ తొలి పాట ''దిల్ జల్తాహైతో జల్నేదే''లో పల్లవిలో సైగల్‌ని అనుకరించి విఫలుడైనా, చరణాలలో తన గొంతులోని మాధుర్యాన్ని పలికించి విజయం సాధించాడు. ఆ తరువాత ముఖేశ్ ఎప్పుడూ సైగల్‌ని అనుకరించలేదు. సైగల్‌గొంతును అనుకరించాలంటే అందరూ విఫలమౌతామేమోనని భయపడేవారు. అందుకేనేమో తలాత్ మహ్మద్ మాత్రం లభ్యం కాని సైగల్ పాటలోని పంక్తుల నేరుకుని మరీ పాడతాడు. అయినా సైగల్ సైగలే. శ్రావ్యమైన గానం సైగల్ ఆస్తి. గాయకుల్లో అతనో మకుటంలేని మహారాజు. ఆయననెవరూ అనుకరించ లేరు. సి.హెచ్. ఆత్మ అనే మంచి గాయకుడు తన జీవిత కాలంలో సైగల్ పోలికలున్నా అనుకరించలేక పోయానని వ్యధ నొందాడు. అంతటి శక్తివంతమైన ఇంద్రజాల గాత్రం సైగల్‌ది. ఆ గాత్రంలోని సమ్మోహక శక్తి ఎవరినైనా ఇట్టే ఆకర్షించేది. సైగల్ మాత్రం ఇది ''దేవుడిచ్చిన వరమనే'' నమ్మేవాడు. అదే అందరితో చెప్పేవాడు.

ఉస్తాద్ ఫియాజ్ ఖాన్ మాత్రం, సైగల్‌ని ఒక వీధి పాటగాడిగా మాత్రమే గుర్తిస్తా నన్నాడు. అయినా ఆ అపశ్రుతిని సైతం సంతోషంగా స్వీకరించిన సైగల్, నిజమైన శ్రుతి తెలిసినవాడు. అందుకు నిదర్శనం - హెచ్. యం. వి. వారు రికార్డు చేసిన ''ఝుల్నా ఝులావోరీ ...'' అన్న సైగల్‌పాటకంటే శ్రావ్యంగా పాడాలని ఎన్నో ప్రయత్నాలు చేసి విఫలుడయ్యాడు ఆ ఉస్తాద్ ఫియాజ్ ఖాన్.

''దుఃఖ్‌కే అబ్ దిన్ బీతాత్ నహీ'', ''కరుణ్ క్యా ఆశ్ నిరాశ్ భాయి'' అన్న కరుణ రసాత్మకమైన పాటలైనా, ''ఏక్ రాజే కా బేటా'' అన్న చిన్న పిల్లల పాట అయినా, ఉల్లాస భరితమైన ''హమ్ ఆప్నా ఉన్వే బనా న సకా'' అన్న పాట అయినా ఒక్క సైగల్‌గొంతు నుండి జనించడం మూలంగానే అతనికి దగ్గరలో కూడా ఎవ్వరూ రాలేకపోయారు. ఎప్పటికీ మళ్ళీ మళ్ళీ వినాలనిపిస్తాయి. ''మధుకర్ శ్యామ్ హమారే ఛోర్'', ''అంధేకి లాఠీ తూహిహై'', ''నైన్ హీన్ కోరాహ్ దిఖా ప్రభూ !'', ''నిస్ దిల్ బర్సత్ నైన్ హమారే'' అన్న పాటలు ఎంతటి కఠిన హృదయులనైనా కరిగించి కన్నీరు పెట్టించక మానవు. ఆయనను గాయకుడిగా చలన చిత్రరంగానికి పరిచయం చేసిన బి.యస్. సర్కార్ (న్యూ థియేటర్స్, కలకత్తా)తో కలిసి పాడిన 'కొంటె పాటలు' సైతం అందరినీ ఆసక్తిలో ముంచుతాయి. సైగల్‌ను గాయకుడిగా తీర్చి దిద్దడంలో తోడ్పడిన పంకజ్ మల్లిక్‌ని సైతం అనతికాలంలోనే అధిగమించాడు సైగల్. ఒకసారి సైగల్ జలుబు కారణంగా ఒక సినిమాకు పాటలు పాడలేకపోయాడు. ఆ సంస్థవారు పంకజ్ మల్లిక్‌తో పాడించి విడుదల చేయగా ఆ సినిమా 'బాక్సాఫీసు' వద్ద ఘోరపరాజయాన్ని చవిచూసింది. సైగల్ కోలుకున్న తరువాత అదే సినిమాకు అవే పాటల్ని సైగల్ చేత పాడించి, మళ్లీ విడుదల చేయగా అఖండ విజయం సాధించిందాచిత్రం. అంతటి ఇంద్రజాలం సైగల్ గొంతులో ఉంది. అయినా పంకజ్ మల్లిక్‌గానీ, ఎవరూగానీ సైగల్‌పై అసూయ, ద్వేషం పెంచుకోలేదు సరికదా అందరూ ఆయనను, ఆయన గానాన్ని అభిమానించేవారే.

సైగల్ గానం ఎంతటి ఉన్నతమైందో, అతని శీలం, వ్యక్తిత్వం కూడా అతని కీర్తి శిఖరానికి సమాన స్థాయిలో ఉండటం విశేషం. ''ఉదార చరితానాం తు వసుధైక కుటుంబకమ్'' అన్నట్లు సైగల్‌కు రాజా - పేదా తేడాలు ఉండేవి కావు. ఒకసారి సైగల్ తన మిత్రుడైన ఓ ధనవంతుడి పార్టీలో ఉండగా ఆ మిత్రుడు సైగల్‌ని పాట పాడమని కోరాడట. అందుకు సైగల్, ''నీకు నా పాట వినాలనిపిస్తే మా ఇంటికి వచ్చి ఫీజు చెల్లించి నా అపాయింట్‌మెంట్ తీసుకో, అప్పుడు వీలైతే నేను పాడగలను'' అన్నాడట. కానీ అదే సైగల్, మరోసారి ఓ పేదవాడు అతని తలుపు తట్టి, ''మీ పాటకచేరి టిక్కెట్టుకొని మీ పాట ప్రత్యక్షంగా వినే స్తోమత నాకు లేదు. అయినా మీ పాట ప్రత్యక్షంగా వినాలన్నది నా జీవితాంశయం'' అంటూ భయంతో వణుకుతూ అడగ్గా సైగల్ అతణ్ని సాదరంగా ఆహ్వానించి, అతిథి మర్యాదలు చేసి, కేవలం అతని కోసం మూడు గంటలపాటు ఏకధాటిగా పాడాడు. సైగల్ మాటల్లో కాదు, కాదు పాటల్లో చెప్పాలంటే ఎవరూ ధనవంతుడు కానీ, ఎవరూ పేదవాడు కానీ లేడంటాడు సైగల్. 'అందరమూ విధి చేత చిక్కినవారమే' అన్నది అతని నమ్మకం. శక్తివంతమైన వ్యక్తిత్వం కలిగిన సైగల్ శీలవంతుడిగానూ ఉన్నతుడే. ఆయన కుమార్తె శ్రీమతి నీనా మర్చంట్ 4 డిశంబర్, 1993న ఒక లేఖలో ''కొంతమంది మా నాన్న గారి జీవితాన్ని ప్రణయగాథగా చిత్రించాలని చూశారు. కానీ మా నాన్న ఎన్నడూ ఎవరితోనూ ఎలాంటి ప్రణయ సంబంధం ఏర్పరచుకోలేదు. ఒక్క మా అమ్మతో తప్ప. మా అమ్మ చాలా అందంగా ఉండేది. మా నాన్నకు మా అమ్మ అంటే ప్రాణం. నేను పుట్టిన రోజున మా నాన్న విపరీతమైన జులుబుతో బాధపడుతూ కొంచెం 'బ్రాందీ' సేవించారు. తరువాత అది ఆయన అలవాటుగా మారింది. కుటుంబ స్నేహితులైతే తప్ప ఏ స్త్రీలూ కథానాయికలు గానీ, మహిళాభిమానులుగానీ ఎవరూ మా ఇంటికి వచ్చేవారు కాదు. మా నాన్న శీలవంతుడు'' అని చెప్పుకుంది.

తన గాత్రంతో స్వరాల మాయాజాలం చూపే సైగల్ జనన, మరణ కాలా విషయంలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. 'గ్రామ ఫోన్ కంపెనీ ఆఫ్ ఇండియా'కు చెందిన శ్రీమతి రోనితామిత్రా చెప్పిన దాని ప్రకారం రికార్డుల మీద 1904-1946 అని ఉన్నది కానీ, సైగల్ కుమార్తె శ్రీమతి నీనా మర్చంట్ మాత్రం ఆయన జీవిత కాలాన్ని 1905-1947గా చెబుతున్నారు.

హిందీ, ఉర్దూ, పంజాబీ, పర్షియన్, తమిళ, బెంగాలీ భాషల్లో తన గాత్రాన్ని వినిపించి ఎన్నో హృదయాలను ఆనంద డోలల్లో ఊగించిన సైగల్ మొత్తం ఎన్ని పాటలు పాడాడన్న ఖచ్చితమైన సంఖ్య తెలియడం లేదు. యం.వి. కామత్ అనే ఆయన ప్రకారం సైగల్ అన్ని పాటలు భారతదేశంలో ఇద్దరి వద్ద మాత్రమే ఉన్నవి. వారిలో ఒకరు ప్రఖ్యాత హిందీ నటులు అశోక్ కుమార్, మరొకరు విఖ్యాత క్రికెటర్ బి. యస్. చంద్రశేఖర్. చంద్రశేఖర్ మాత్రం సైగల్ పాటలు వినడానికి మాత్రమే ప్రత్యేకంగా ఒక టేప్ రికార్డర్‌ని ఉపయోగిస్తారట. ఆయన ఆ టేప్ రికార్డర్‌ని, సైగల్ పాటల కేసెట్స్‌ని పవిత్రంగా భావిస్తారట. ఐ.యన్.ఆర్.ఇ.సి.వో (INRECO) వారు 1970లో స్టీరియో ఫోనిక్ విధానంలో 'కె.యల్. సైగల్ పాటల ఆల్బమ్'ని విడుదల చేశారు. కానీ 'స్టీరియో సూపర్ ఇంపోజిషన్' మూలంగా ఆ ఆల్బమ్‌లోని సైగల్ గాత్రం సరిగా వినిపించక, అభిమానులకు బాధ కలిగించింది. సైగల్ ఎప్పుడూ తక్కువ వాయిద్యాలతోనే పాడేవాడు.

చాలావరకు హార్మోనియం, తబలాలను మాత్రమే వినియోగించుకొనేవాడు. ''అబ్ మై క్యా కరూం కిత్ జా'' అన్న పాటకు - అసలు వాయిద్యాలు తోడు లేవు. అసలు సైగల్ కంఠానికి నేపథ్య సంగీతం అనవసరము అనేవారున్నారు. ఎన్నో సైగల్ పాటలను గమనిస్తే ఆయనకు మాత్రమే సాధ్యమైన ఆరోహణ, అవరోహణ క్రమబద్ధతలు స్పష్టం కాగలవు.

1950 నుండి పాకిస్తాన్ రేడియో సైగల్ పాట వినిపించే ముందు ''షాహెన్‌షాహి మౌషిఖీ మెర్హూమ్ కుందన్‌లాల్ సైగల్'' అని ఆయనను గౌరవిస్తూండగా, మన ఆకాశవాణి, దూరదర్శన్‌లు ఆ మహా గాయకుడి పేరు జ్ఞప్తికి తెచ్చుకోకపోవడం విచారకరం. అయితే 'సిలోన్ రేడియో' మాత్రం కె. యల్. సైగల్ అనే పేరునైనా గుర్తుంచుకోవడం విశేషం! ప్రతిదినం ఉదయం గం. 7.55 ని. లకు ఆ ఇంద్రజాల గానాన్ని వినవచ్చు. జనవరి 18 సైగల్ వర్ధంతి, ఏప్రిల్ 4 సైగల్ జయంతి తేదీలలో మాత్రం రోజంతా ఎప్పుడైనా ఆ మధుర స్వరాన్ని వినవచ్చు. 1970లో 'ఆల్ ఇండియా రేడియో' వారు 'వివిధ భారతి'లో రెండు అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహించారు. అందులో ఒకటి ప్రసిద్ధ సంగీత దర్శకులు, దర్శకులు, నటులు ఆయన పాటలను గుర్తు చేసుకుంటూ ఆయనకు అర్పించిన నివాళి. మరొకటి ఏకధాటిగా గంటసేపు సాగిన సుప్రసిద్ధ సంగీత దర్శకులు నౌషాద్ సంగీత విభావరి. అందులో నౌషాద్ సైగల్ పేరును విస్మరించడం సంగీత అభిమానులకు విస్మయం కలిగించింది. కానీ, 'వివిధ భారతి'లో ''పత్తర్ బోల్ ఉఠే'' పేరున సైగల్ జీవితంలోని కొన్ని సంఘటనల ద్వారా సైగల్ మానవత్వాన్ని గురించి తెలియజేసి సంతోషపరచింది.

ఎదుటి వారికి నీతులు చెప్పి, తాము పాటించకుండా ఉండే వారి కోవకు చెందకుండా సైగల్ తన పాటల ద్వారా ఏ సందేశం తెలిపాడో ఆ సందేశానికి కట్టుబడి ఉన్న మహామనీషి. ''రెహ్మత్ పే తేరి మేరేకో నాజ్ హై, బందాహూ మై జాన్తాహూ, తూ బందా నవాజ్ హై'' అంటూ తనను తాను దేవునికి బందీగా చేసుకున్న ఆస్తికుడు. సైగల్ పాడిన పాటల్లో ఏది గొప్పదో చెప్పాలంటే కష్టం ! ప్రయత్నించినా వ్యర్థం! ఆయన ప్రతిపాటా అమూల్యమైన ఆణిముత్యం. ''బాబుల్ మోరా నైహార్ ఛోటా జాయే''. ''దియజలావ్'', ''లగ్ గయి ఛోట్ కరే జ్వామే'', ''లాభ్ సహిపీకి బాతీయా'', ''అబ్ క్యాబాతా మై తేరే మిల్నే సే క్యామిలా'', ''దునియా మైహూ, దునియా కా తలబ్‌గార్ నహీ'', ''పీయేజా అవుర్ పీయేజా'' - ఈ పాటల్లో ఏది గొప్పదో చెప్పలేము. ఆయన కంఠం నుండి జాలువారిన పాటలన్నీ చిరంజీవులే నన్నది మాత్రం నిత్యసత్యం. ''పంజాబ్ యూనివర్శిటీ (చండీగడ్)'' వారు 'సైగల్ బాణీ' మీద ఒక ప్రత్యేకమైన కోర్సు ప్రవేశపెట్టాలన్న ఆలోచనలో ఉండటం ఆనందించదగ్గ విషయమే.

సైగల్ తన మొదటి చిత్రం ''శుభ్ కా సితారా'' నుండీ తన ఇంద్రజాల కంఠంతో శ్రోతలకు, ''దేవదాసు''లో ''బాలమ్ ఆయే బాసో మేరీ మన్‌మే'' అంటూ పాడుతూ, నటించి ప్రేక్షకులకు తన సమ్మోహక శక్తితో ఆరాధ్యుడైనాడు. ఇప్పటి వరకూ అంతటి సమ్మోహక శక్తికలిగిన నట, గాయకుడెవరూ భారత దేశంలోలేరనే చెప్పక తప్పదు. భారత దేశంలో సంగీతం గురించి ఎప్పుడు, ఎక్కడ మాట్లాడినా విన్పించే మహత్తర నామం కె. యల్. సైగల్.

'మనసు' కవి ఆచార్య ఆత్రేయ తొలి సినిమా గీతం 'పోరా బాబూ! పో...' (దీక్ష 1950) సైగల్ గానం ప్రేరణతోనే రచించారట. 1934 లోని సైగల్ ''దేవదాసు'' ప్రభావం భారతదేశమంతటా ఉండటంతో, తెలుగులో ''దేవదాసు''ను నిర్మించే సమయంలో (దాదాపు 18 ఏళ్ళ అనంతరం, 1952లో) కూడా దర్శక, నిర్మాతలు, సంగీత దర్శకుడు ఎంతో ఆలోచించి చివరకు శరత్ 'దేవదాసు'ను మూలంగా తీసుకుని 'దేవదాసు' పాత్రను మార్చుకున్నారు. అంతేగాకుండా సంగీతంలో పాశ్చాత్య స్వరాలను ఆశ్రయించవలసి వచ్చింది. అందుకే శ్రీమతి షబనా ఆజ్మీ ఇటీవల దూరదర్శన్‌లో ''మోర్టల్ మెన్ ఇమ్మోర్టల్ మెమోరీస్'' (Mortal Men Immortal Memories) కార్యక్రమంలో, ''హిందీ చిత్రరంగంలో అద్భుత తారగా, భారతదేశంలో గాత్ర మాయావిగా నిలిచిన సైగల్ ప్రతీ పాటా మనల్ని మత్తెక్కించకమానదు'' అన్నది నిజమే ననిపిస్తుంది.

సైగల్ కిష్టమైన పాట ''హమే జీకే క్యా కరేంగే, జబ్ దిల్ హీ టూట్ గయా'' (హృదయం పగిలిపోయాక మనం జీవించి లాభమేమి?) అంటూ లోకంతో పనిలేదనుకున్నారేమో, లేక 'ముహ్ పార్ లగీ హై, మోహ్రే ఖామోషీ మై క్యాకహూ? జో మౌత్ నే కహా హై వో హస్తి కా రాజ్ హై'' (మౌనంతో పెదవులు మూత పడితే నేనేం చెప్పను? మరణం అస్తిత్వం యొక్క రహస్యం చెప్పింది) అని అస్థిత్వ రహస్యాన్న తెలుసుకున్నాక ఈ లోకంలో ఉండటానికిష్టం లేక జనవరి 18, 1946లో 42 ఏళ్ళ వయసులోనే శాశ్వతంగా మూతబడిన పెదవులు, ఈనాడు మన మధ్య లేకపోయినా ఆ పెదవుల నుండి బయల్పడిన పదాలు మన మనసులను తాకుతూనే ఉంటాయి.

'కుందన్ లాల్ సైగల్ గానం' చరిత్రలో నిలిచిపోయిన మహత్తరమైన అద్భుతం.

సంకలనం: రవీంద్రనాథ్ — 'మిసిమి' రచనల వర్క్‌షాపు

(1995, మార్చి 'మిసిమి')

SPENDER, SIR STEPHEN
(1909 - 1995)

SPENDER, Sir Stephen (Harold) (1909-), was born in London, and educated at University College School, Hampstead, and Oxford (University College), where he was a contemporary and friend of *Auden, Isherwood and *MacNeice. Thus began a famous association with other writers who developed social and political themes from a left -wing standpoint, though his political affiliation (with the Communist Party) was brief. He visited Spain during the Civil War (1936-9), assisting the Republican cause with propaganda activity. During the Second World War he served in the National Fire Service in London, and was for two years co-editor, with Cyril Connolly, of the literary monthly *Horizon*. His contribution to the volume of essays *The God that Failed (1951)*, and his reversal of the critical position he adopted in *The Destructive Element (1935)* with the publication of *The Creative Element (1953)*, establish his rejection of Communism in favour of a liberal individualism. In the later year he became inaugural co-editor of *Encounter*, an anti-Communist political and literary monthly supported initially by the US Central Intelligence Agency. By this time his main period of creativity as a poet had virtually ended though his work as a critic, and as a translator of Spanish and German (and later, Greek) poetry and drama continued and expanded.

Spender's early verse (in books such as *Poems, 1933*, and *The Still Centre, 1939)* catches movingly the alarm and confusion in the atmosphere of 1930s Europe, and affirms, in poems like 'The Funeral' and 'An Elementary School Classroom in a Slum', the political values he then held (a very personal, humanistic socialism). It also deliberately substitutes for the traditional English poet's devotion to nature a celebration of technological achievement ('The Express' and 'The Pylons'). At this time he displays at his best an eloquent Romantic pity for the poor and the oppressed, and a gift for rendering scenes of wartime suffering and destruction (in Spain, and in London during the air-raids) with photographic accuracy, even if the images sometimes remain somewhat unfocused. These prominent features of his poetry diverted attention at first from the presence of a deeply self-questioning personality, unsure how to match poetry to either external events or his own feelings. How he should, or could, commit himself emotionally is a recurrent theme; reassessment and revision of the poems is a constant habit. He is only too aware of a heritage of daunting greatness (in Beethoven, say, or Holderlin) which transcends his untidy and violent modern experience.

(From August 1995 'MISIMI')

తూర్పు పడమరల కలగలుపు

దిక్కులు కలుసుకోనకపోవచ్చునుగానీ, మనుషుల అభిప్రాయాలు, ఆలోచనలు ఏదో ఒక సందర్భంలో అంతో ఇంతో ఒకేలా వుంటాయి. మనిషి పుట్టుకతో పాటే పరిశోధన ప్రారంభమైందంటే ఆశ్చర్యపడవలసిన పనిలేదు. ఆ పరిశోధనలోనే మనిషి నిరంతరం తన చుట్టూ ఉన్న పరిసరాల్ని తన కనువుగా మార్చుకోసాగాడు. ఈ పరిణామం అంతం లేనిది, మనిషికి ఆలోచనలు రావడం మాననంతవరకు. అయితే ఏదో ఒక 'సమస్య' అనేది లేకపోతే కొత్త మార్పును మనం సాధించలేమన్నది కూడా నిజం!

ప్రస్తుతం తూర్పు పడమరల అభివృద్ధి కానీ, అభిప్రాయాలు కానీ ఒకేలా ఉన్నాయా? అంటే - ఊహూc! అని సమాధానమియ్యవలసి వుంటుంది. ఎందుకంటే పశ్చిమదేశాలు అభివృద్ధి కర విలువలపై ఆధారపడి పురోగమిస్తున్నాయి. విభిన్న సాంస్కృతిక విలువలతో సతమతమవుతూ అభివృద్ధికై ఘర్షణ పడుతూవున్న దేశాలు తూర్పు దిశన ఉన్నాయి. తూర్పు దేశాలు నూతన సమాజాలుగా అవతరిస్తాయా? లేక ఓటమితో రూపు మాసిపోతాయా?

చరిత్రలో ఇంతవరకూ జరగని విధంగా తూర్పుపడమర దేశాలు అతివేగంగా ఒక దానికొకటి దగ్గరవుతున్నాయి. ఇలా జరగడం ఈనాడు కొత్తకాకపోయినప్పటికీ, గతంలో లేని వేగం ప్రస్తుతం మనకు కనిపిస్తుంది. సాంకేతిక విప్లవం, విస్తరిస్తున్న విజ్ఞాన పరిశోధనలు, ఎలక్ట్రానిక్ రహదారి తూర్పు పడమరల మధ్య ఉన్న దూరాన్ని (భౌగోళికంగా కాదు) తగ్గిస్తున్నాయి. ఉదాహరణకు ఎక్కడో వేలమైళ్ళ దూరంలో విదేశాలలో జరుగుతున్న టెన్నిస్ పోటీలను మారుమూల పల్లెలో మన ఇంట్లో కూచుని చూడగలుగుతున్నాం. అలాగే మనదేశంలో జరిగే విశేషాలను విదేశీయులు దర్శించగలుగుతున్నారు. ఈ వేగంలోని నేపథ్యాన్ని గమనించినట్లయితే మూడు ముఖ్యాంశాలు మనకు అవగతమవుతాయి.

మొదటిది, కలయిక అనివార్యమనేది. 15వ శతాబ్దం వరకు, మనం రెండు, విభిన్న ప్రపంచాల్లో నివసించి వున్నాం. రెండు విభిన్న ప్రపంచాలు వుండడమే కాదు, ఎన్నో విశిష్టమైన గుర్తింపులు ప్రపంచంలో విస్తరించి వుండేవి. అయితే, పెట్టుబడిదారీ విధానం పుట్టి పెరిగే కొద్దీ విభిన్న సమాజాలు, తిరుగులేని విధంగా ఐక్యతా మార్గంలోకి ప్రవేశించాయి.

మనం, మన సాంస్కృతిక, భాషా ప్రత్యేక లక్షణాలను యింకా కొనసాగిస్తున్నాం. అయితే, మన ఆర్థిక వ్యవస్థలు మాత్రం అతివేగంగా తారుమారౌతు వున్నాయి. సమాజాల్లోని వర్గవైరుధ్యాలు, వివిధస్థాయిల్లో కొనసాగుతున్న ఆర్థికాభివృద్ధి, కొంత వరకు పెట్టుబడిదారీ విధానాన్ని వికృతపరచి, దాని ప్రవేశాన్ని అడ్డుకోవచ్చు. ఏమైనా, యీనాడు పెట్టుబడిదారీ విధానం ఒక్కటే ఆధునికాభివృద్ధికి మార్గదర్శిగా నిలబడింది.

రెండవ వాదన - పెట్టుబడిదారీ విధానం, (దాన్నే మార్కెట్ శక్తులు అనికూడా అంటారు) చరిత్రలో పురోగమన పంథా (పర్యావరణ వాదులు తిరోగమనమని అంటారు) తన వేగాన్ని పెంచుకుంది. దానికి తిరుగులేదు. ఎందుకంటె, పెట్టుబడిదారీ విధానానికి, మార్కెట్ శక్తులు యింజను లాంటివి. ప్రచార సాధనాలు శకటంలాంటివి. ప్రచార సాధనాలు ఎంతో వేగంగా విస్తరిస్తున్నాయి. వాటిని ఆపేశక్తి ఎవరికీ లేదు. కొన్ని శతాబ్దాల ముందు వాటి ఉనికిగాని, నడకగాని గుర్తింపు పొందలేదు. కాని 20వ శతాబ్దం రెండో భాగంలో కంప్యూటర్లు, సాటిలైట్ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రచార సాధనాల వాడి, వేగం గతంలో లేని విధంగా పరిధులను దాటిపోయాయి.

సంఘంలో పరిమాణాత్మక మార్పు, గుణాత్మక మార్పును సృష్టిస్తుందనేది సత్యం. మన కాలంలో యీ మధ్య ప్రచార, వార్తా సాధనాల స్వరూప, స్వభావాల్లో అతిశీఘ్రంగా వచ్చిన అభివృ ది సాటిలేనిది. అలాగే ప్రపంచంలోని సాంఘిక, ఆర్థిక వ్యవస్థల్లో విస్తరించిన పెట్టుబడిదారీ విధాన ప్రభావం మనం యిదివరకు ఎప్పుడూ కనీవినీ ఎరగము. ఉదాహరణకు, వ్యవసాయ విప్లవాన్నే తీసుకోండి. ప్రపంచంలోని దేశాలన్నింటిలో సాంఘిక ఆర్థిక పరంగా, వ్యవసాయ రంగంలో ఒకే తరహా పద్ధతులు వచ్చేందుకు కొన్ని వేల సంవత్సరాలు పట్టింది. కాని ఆధునిక కాలంలో వ్యవసాయ శాస్త్ర విజ్ఞానం శీఘ్రంగా అన్ని దేశాలకు విస్తరించింది. అలాగే మార్కెట్ శక్తుల ప్రభావం నాలుగు లేక ఐదువందల సంవత్సరాల కాలంలో జరిగిన మార్పు కంటే గత 50 సంవత్సరాల కాలంలో జరిగిన అభివృద్ధిని గమనిస్తే, వచ్చే 25 సంవత్సరాల్లో పెట్టుబడిదారీ విధానం ప్రపంచంలోని మారుమూల ప్రాంతాల్లోకి కూడా దూసుకొని వెళ్తుందనీ, ఎప్పుడూలేని విధంగా మానవజాతిని ఏకం చేస్తుందనే విషయం బోధపడుతుంది.

ఇక మూడవ వాదన - మన వద్దనున్న సాక్ష్యాధారాలను బట్టి, మార్కెట్ శక్తులు అభివృద్ధి చెందేందుకు ప్రత్యేకమైన, నైతిక సూత్రాలుగాని, విలువలుగాని అవసరం లేదని చెప్పడం సరికాదు. ఐరోపాలో తొలిరోజుల్లో, ఫ్లారెన్స్, వెనిస్‌లోని యూదులు, ఇటాలియన్ల బ్యాంకుల వల్లనే ప్రొటెస్టంట్ నైతిక సూత్రాల ప్రేరణతో పెట్టుబడిదారీ విధానాన్ని అవగాహన చేసుకున్నారని కొందరు మేధావులు పేర్కొన్నారు. ఇప్పుడు తూర్పు ఆసియాలోని జపాన్ అద్భుత విజయాలు సాధించడంతో అక్కడ పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యేక నైతిక విలువలు లేవని చెప్పలేము. మార్కెట్ విలువలు ఎక్కడ వేళ్లూనినా, అక్కడ వాటి ప్రభావం ఇట్టే కనిపిస్తుంది. విద్య, మంచి ప్రజాపరిపాలన లాంటి వాటిని అభివృద్ధి చేసే సామర్థ్యాన్ని బట్టి నవీన సమాజాల్లో పెట్టుబడిదారీ విధానం జయప్రదమౌతుంది.

గతంలో వెయ్యి సంవత్సరాలు సాంఘికార్థిక అభివృద్ధి పద్ధతితో, గత ఐదు శతాబ్దాల పద్ధతిని పోల్చి చూసినట్లయితే, మార్కెట్ శక్తులు తిరుగులేని విధంగా ముందుకు పోతాయనే సత్యం మనకర్థమౌతుంది. 18వ శతాబ్దంలో ఆడమ్‌స్మిత్, 19వ శతాబ్దంలో కార్ల్ మార్క్స్ యీ ధోరణిని గమనించి వారి అభిప్రాయాలను గ్రంథస్థం చేశారు. మార్క్స్ గొప్ప రచనలైన కమ్యూనిస్ట్

మానిఫెస్టో, దాస్ కాపిటల్, తర్వాత బయటపడ్డ రాత ప్రతులు - యీ నూతన పరిమాణాలపై మార్క్స్ యొక్క ఆశ్చర్యాన్ని, ఆవేదనను వ్యక్తం చేశాయి. పెట్టుబడిదారీ విధానాన్ని ఒక భయంకరమైన రాక్షసిగా ఆయన చూశాడు. మార్కెట్ శక్తులు, అద్భుతమైన సృజనాత్మక శక్తి అనీ, దాన్ని వేగంగా లొంగతీసుకోకుంటే, మన నాగరికతనే స్వాహా చేస్తుందని ఆయన గమనించాడు. పెట్టుబడిదారీ విధానానికి విరుగుడుగా ఆయన ''శాస్త్రీయ సోషలిజం''ను ప్రతిపాదించాడు. భూస్వామ్య, పెట్టుబడిదారీ విధానాలు రెండింటికీ మానవత్వంతో కూడిన సోషలిజమే ప్రత్యామ్నాయం అని ఆయన పేర్కొన్నాడు. మార్క్స్ గతాన్ని సరిగ్గానే చదవగలిగాడు. కాని భవిష్యత్తును గురించిన ఆయన జోస్యం సరియైంది కాదని తేలిపోయింది. పెట్టుబడిదారీ విధానం, స్వయం సర్దుబాట్ల బాటలో గతితర్కంగా ముందుకు పోయింది తప్ప మార్క్స్, ఆయన శిష్యులు చెప్పినట్లుగా పెట్టుబడిదారీ విధానం నాశనం కాలేదు. మానవత్వ విలువలతో అది అభివృద్ధి దిశగా సాగిపోతూ వుందని నేడు మనం చూస్తున్నాము.

ప్రస్తుత కాలాన్ని గమనిస్తే, పెట్టుబడిదారీ విధానానికి ప్రతిగా వున్న సోవియట్ యూనియన్ ప్రయోగం 1989లో కుప్పకూలిపోయింది. ప్రాక్ పశ్చిమ పెద్ద దేశాలు, మార్కెట్ శక్తుల విధానంలో తమ ఆర్థిక పద్ధతులను మలచుకోటానికి పోటీపడుతున్నాయి. అభివృద్ధి చెందుతూ వున్న దేశాల్లో యింకా పురాతన సాంప్రదాయాలుగల సమాజాలు ఎన్నో వున్నాయి. అవన్నీ, పెట్టుబడిదారీ విధానానికి ముందుగా వున్న, సాంఘిక, ఆర్థిక విధానాలనే కొనసాగిస్తూ వున్నాయి. అయితే ఫలప్రదం కాని పోరాటాలు సలుపుతూ వున్నాయి. ఆసియాలో మార్కెట్ శక్తులతో సర్దుబాటు చేసుకొనేందుకు ముమ్మరంగా పోరాటాలు సాగుతున్నాయి. పెట్టుబడిదారీ ఆధునీకరణ మార్గంలో ప్రయాణించిన దేశం, ఆసియాలో జపాన్ మొట్టమొదటిది. 19వ శతాబ్దంలో నిదానంగా మొదలెట్టి, ప్రపంచ యుద్ధం తర్వాత 1950-73 కాలంలో వేగాన్ని పెంచుకుంది. ఆ కారణంగా, ఉత్తర అమెరికా, ఐరోపాదేశాలు నిర్వహించే "WEST" అనేక్లబ్బులో దానికి సభ్యత్వం లభించింది. అది ఎంతో గౌరవప్రదమైనదిగా భావించబడింది. మార్కెట్ ఆర్థిక పద్ధతుల మార్గం, కేవలం పశ్చిమదేశాల ప్రత్యేక హక్కు కాదని, ప్రత్యేక నైతిక విలువలతో కూడి వుందని జపాన్ నిరూపించింది. ఆసియాలోని మిగతా దేశాలు యిప్పుడు ఆ బాటనే అనుసరిస్తున్నాయి. అయితే, జపానంత వేగంగా అవి పోతాయో లేదో వేచి చూడవలసి వుంది. కాని వాటి మార్గం గురించి ఏమాత్రం సందేహం లేదు.

పెట్టుబడిదారీ విధానానికి సాంకేతికవేగం, సామర్థ్యం కీలకాంశాలు. ఆసియా లోనూ, అమెరికాలోని అనేక ప్రాంతాల్లోనూ, పురాతన సాంప్రదాయ సమాజాలు కొనసాగుతున్నప్పటికీ, ఆధునీకరణ, యిదివరకటి కంటె యిప్పుడు ఎక్కువ వేగంగా జరుగుతూ వుంది. ఐరోపాలో ఆధునీకరణ కార్యక్రమం శతాబ్దాలపాటు జరిగి, ప్రజావిప్లవాలకు కారణభూతమైంది. ఇప్పుడు ఆ మార్పు కొన్ని దశాబ్దాల్లోనే జరిగిపోతూ వుంది. ఇప్పుడు అధికభాగంలో, ఇండియా, చైనాలతో సహా ఆధునీకరణ కార్యక్రమాలు ముమ్మరమయ్యాయి. వచ్చే 20 సంవత్సరాల కాలంలో అవి ఏ మార్గంలో ముగిసిపోతాయో యిప్పుడే చెప్పలేము. అయితే వేగాన్ని బట్టి, సరితూగే సామర్థ్యాలను,

అవి సృష్టించుకోవలసి వుంది. అలా కాకుంటే నాడు శతాబ్దాలపాటు ఐరోపాలోనూ, నేడు తూర్పు ఐరోపాలోనూ ఏర్పడ్డ సాంఘిక, రాజకీయ ఉపద్రవాలను అవి ఎదుర్కో వలసి వుంటుంది.

ప్రసార సాధనాల్లో జరిగిన విప్లవాత్మక మార్పుల కారణంగా వార్తలు అతివేగంగా దిశదిశాంతరాలకు కొద్ది నిమిషాల్లోనే వ్యాపిస్తూ వున్న తరుణం యిది. దీన్ని ప్రచార సాధనాల్లో వచ్చిన మూడవ విప్లవంగా వర్ణించారు. మొదటిది - ఈజిప్టులో మొట్టమొదటి లిపిని కనిపెట్టడం. రెండవది 15వ శతాబ్దంలో గ్యుటెన్‌బర్గ్ అచ్చుయంత్రాన్ని కనిపెట్టడం. గ్యుటెన్‌బర్గ్ బైబిల్‌ను అచ్చువేయడం వల్ల అది ఎక్కువ మంది ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. అంతేకాదు ప్రజాప్రచార సాధనంగా మార్కెట్ శక్తులు విస్తరించేందుకు విప్లవాత్మకంగా పనిచేసింది. మూడవ విప్లవం మనం యిప్పుడు చూస్తున్నాం. నాగరికత మీదనే అత్యంత ప్రభావాన్ని చూపుతూవుంది. వార్తాపత్రికలు, రేడియో, టెలివిజన్, రవాణా, కంప్యూటర్లు, ఫ్యాక్స్‌మెషన్లు అతివేగంగా ప్రపంచవ్యాప్తంగా ప్రసారాలను వ్యాపింపచేస్తున్నాయి. సాంప్రదాయ సమాజాల వాకిటిముందుకు నూతన అభివృద్ధి సాధనాలను తెచ్చి, మార్కెట్ శక్తుల ఆర్థిక విధానాలు వారి అందుబాటులోకి తెచ్చాయి. మరోప్రక్క, మార్కెట్ శక్తులు పనిచేసే సమాజాల్లో ఎనలేని సాంఘిక, ఆర్థిక వొత్తిళ్లను సృష్టించాయి.

'పశ్చిమ విలువలు', 'ప్రాక్ విలువలు' అంటూ ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరగడం యాదృచ్ఛికంగాదు. ప్రపంచంపై పెత్తనాన్ని ఆసియా సంపాదించడం అంత సులభసాధ్యం కాదని కొందరు వాదిస్తారు. సాంస్కృతిక పరమైన సంఘర్షణలో ప్రపంచం అస్తవ్యస్త మౌతుందని మరి కొందరు చెప్తారు. శతాబ్దాల పర్యంతం వున్న కుటుంబ వ్యవస్థపైన జీవిత విలువలపైన, పురాతన సాంప్రదాయ ఆర్థిక, రాజకీయ విధానాలపైన 'ఆధునీకరణ' భయోత్పాతాన్ని సృష్టించిందనేది వాస్తవమైనా, ఆసియా అత్యున్నత నైతిక విలువల వల్ల 'శీఘ్రగతి'న అభివృద్ధి సాధ్యమౌతుందని కొందరు భావించారు. ఇదే సమయంలో 'పశ్చిమ' దేశాల్లో ఆతురత, భయం చోటుచేసుకున్నాయి. ''వారు ఎలా చేయగలుగుతున్నారు! నైతిక విలువలతో నిమిత్తం లేకుండా వారు ఆధునీకరణ చేయడం సాధ్యమా? ప్రపంచాధిపత్యం కోసం ఏమి జరుగుతుంది?'' అనేవే ''తూర్పు'' దేశాలపై 'పశ్చిమ' దేశాల భయాందోళనకు కారణం. దానికి 'తూర్పు' దేశాలు ఇచ్చేది ''మాకు తెలియదు'' అనే వుదాసీన సమాధానమే. ప్రస్తుతానికి మనం గమనించేదేమిటంటే, ప్రసార సాధనాలు అత్యధిక పురాతన సాంప్రదాయ భావాలను పోగొట్టి అవ్యవస్థమైన జ్ఞానాన్ని కలిగించాయి.

ఇలాంటి అవ్యవస్థ నుండి వెనక్కిపోయే సమస్యలేకపోవచ్చు. ఆసియాలో ఎక్కువ దేశాలు విజ్ఞానంలో క్లిష్ట పరిస్థితులను అధిగమించాయి. టెలివిజన్‌లు, పట్టణాల్లోనూ, నగరాల్లోనూ వెల్లివిరిశాయి. వార్తాపత్రికల ఆదాయం పెరిగింది. ప్రకటనల ఆదాయం ఎక్కువైంది. ఆసియాలో మురికి వాడల్లో కూడా టెలివిజన్ ప్రత్యక్షమయింది. టెలిఫోన్ల వాడుక విపరీతంగా పెరిగింది.

నూతన ప్రసారాల ద్వారా, పెట్టుబడిదారీ విధానం, వెనుకబడిన దేశాల్లోకి ఎంతవేగంగా ప్రచారమౌతుందో తెలుసుకోటానికి ఒక వుదాహరణ - ఈ మధ్య ఇండియాలో వ్యాపించిన ప్లేగు

వుదంతాన్ని తీసుకుందాం. సూరత్‌లో వ్యాపించిన యీ వ్యాధి ప్రపంచమంతటా భయాన్ని కలిగించింది. దానికి దేశ విదేశీ ప్రచార సాధనాలు సాయపడ్డాయి. అవి పోటీలు పడి మరీ ప్రచారం చేశాయి. ప్లేగు రావడం నిజమే. అది సహజంగానే ఆందోళన కలిగించింది. అయితే, మలేరియా, కలరా మాదిరి వ్యాధులతో భారతదేశంలో చనిపోయినంతమంది, ప్లేగువల్ల చనిపోలేదు. అయినా విదేశీ ప్రచారం తీవ్రంగా జరిగింది. 1994 సెప్టెంబర్ రెండవ భాగంలో సూరత్‌లో ప్లేగు వ్యాపించింది. వేల సంఖ్యలో పట్టణాన్ని వదలి పారిపోయారు. కొందరు తమతోపాటు ఆ వ్యాధిని తీసికెళ్లారు. వెంటనే ఆవార్తను దేశ విదేశాల్లోని వార్తాపత్రికల్లో ప్రచురించారు. టెలివిజన్లలో ప్రధానకాల బులెటిన్లలో చూపించారు. ఇంకేముంది, గల్ఫ్ దేశాలు, సౌదీ అరేబియా భారతదేశ విమానాలను తమ దేశానికి రానివ్వలేదు. తమ విమానాలు భారతదేశానికి వెళ్లనివ్వలేదు. ఇండియా పేరు వింటూనే విదేశాల్లో ప్రజలు ముక్కుకు చేతిగుడ్డ పెట్టుకున్నారు. అమెరికా వెళ్లే ఒక డెల్టా ఏర్‌లైన్స్ విమానంలో ఒక ప్రయాణీకుడు ప్రయాణం పడక వాంతి చేసుకున్నాడు. అందులోని ప్రయాణీకులు భయపడిపోయారు. దాన్ని B.B.C., CNN టెలివిజన్లు ప్రచారం చేశాయి. మన ప్రభుత్వం దిగ్భ్రాంతి చెందింది. మదర్ థెరిసాను కూడా రోమ్‌లోని విమానాశ్రయంలో వైద్య పరీక్ష చేశారు.

బొంబాయిలో స్టాక్ మార్కెట్ మూడురోజులపాటు దిగబడిపోయింది. ప్రతిరోజు, ఉదయం, సాయంత్రం, ప్రతి గంటకు ఒకసారి B.B.C., CNN ప్లేగు వార్తల ప్రసారంతో దేశ విదేశాల్లోని ప్రజలు బెంబేలెత్తిపోయారు. అలాంటి భయాందోళన యింకా కొనసాగి వుంటే, స్టాక్ సూచిక యింకా పడిపోయి వుండేది. అదేవిధంగా అంతర్జాతీయ పెట్టుబడిదార్లు, తమ పెట్టుబడులను దేశ మార్కెట్ల నుండి వెనక్కి తరలించుకొని పోయేవారు. కోట్లాది విదేశీమారక నిల్వలు త్వరలోనే కరిగిపోయేవి. 1991 ముందు నాటి సంక్షోభం దేశాన్ని ముంచి వుండేది.

ప్లేగు అంత భయంకరమైంది కాదని తర్వాత తెలిసింది. మందులతో ప్లేగును నయం చేయవచ్చు. సూరత్‌లో ప్లేగువల్ల చనిపోయింది 51 మంది. మలేరియా, కలరావల్ల అంతకంటె ఎన్నోరెట్ల మంది చనిపోయారు. సూరత్ పాలనా యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. దానికి తోడు, స్థానిక రాజకీయ నాయకులు ప్లేగంటూ పట్టణంలో ఏదీలేదని ముందు బుకాయించారు. కాని బొంబాయిలో సూరత్ నుంచి వచ్చే వారిపై వైద్య పరీక్ష చేశారు. బొంబాయిలో ప్లేగువల్ల ఎవరూ చనిపోలేదు. రెండు వారాల్లోనే మామూలు పరిస్థితి ఏర్పడింది. భారతదేశ వార్తాపత్రికలు మేల్కొని వెంటనే సరియైన సమాచారాన్ని అందించాయి. దాంతో విదేశీ ప్రసారాలు అనుగుణంగా స్పందించాయి. 'ప్లేగు' అనే పేరుతోనే ఆ భయం కలిగింది తప్ప ''వ్యాధిక్రిమి'' వల్లకాదు. ఆ పదం బైబిల్‌లో వుంది. అది జానపదాల్లో వుంది. శాపనార్థాల్లో ఎక్కువగా వాడతాం.

అయితే, ఐరోపా జనాభాలో మూడోవంతు "Black Death" అనే వ్యధివల్ల చనిపోయిన రోజుల్లో టెలివిజన్ లేదు. ఏం జరుగుతుందో తెలిపేందుకు వార్తాపత్రికలు లేవు. ప్లేగును దూరంచేసే విధానాలు, దాన్ని గురించి ఎందుకు భయపడకూడదో చెప్పే ప్రసార సాధనాలు ఆనాడులేవు. భారతదేశంలో 20వ శతాబ్దం మొదట్లో ప్లేగువల్ల ఒక కోటి మంది చనిపోయారు. ఇప్పుడు చనిపోయింది 51 మంది మాత్రమే! వ్యాధిని రెండు వారాల్లోనే కంట్రోలు చేశారు.

అలాంటి సంఘటన, ఒక ఆసక్తి కరమైన పాఠాన్ని నేర్పుతుంది. తన పురాతన సంప్రదాయాలను నిలుపుకుంటూ, ఆధునీకరణ కోసం శ్రమించే సమాజం, ప్రపంచం కనుసన్నల నుండి తన యిక్కట్లను ఏమాత్రం దాచివుంచలేదు. అయినప్పటికి ఆధునీకరణను దేశం త్రోసివేయలేదు. ఆ సంఘటన మొదట్లో కలిగించిన భయాగ్నికి వార్తా ప్రసారాలు ఆజ్యం పోశాయి. గత కాలపు ఆర్థిక వ్యవస్థ నుండి మార్కెట్ శక్తుల ప్రపంచంలోకి అడుగేసేందుకు భయపడవచ్చు. కాని అవే ప్రచార సాధనాల పుణ్యమా అంటూ తిరిగి మామూలు పరిస్థితి నెలకొనడం జరిగింది. అదే విధంగా మార్కెట్ శక్తుల భయం నుండి కూడా బయటపడుతుంది.

రెండువందల సంవత్సరాల ముందు పశ్చిమ దేశాల్లో అధికభాగం ఆధునికతకు దూరంలో వుండేవని మనం తెలుసుకోవాలి. ఐరోపాఖండం రోతగా, రోగభ్రష్టమై, విద్యాహీనమై వుండేది. జీవనం అసహ్యాకరంగా, అనాగరికంగా, అతి తక్కువ ప్రమాణంలో వుండేది. అలాంటి ఐరోపా నేటి పరిస్థితికి ఎలా వచ్చింది? ప్రత్యేక నాగరికత వల్లనా? లేక మార్కెట్ శక్తులవల్లనా? ఒక దేశం మార్కెట్ శక్తుల అధీనంలో వుంటే, ఆ సమాజం, గట్టిపడి స్వయంగా క్రమశిక్షణ నలవరించుకుంటుంది. పురాతన సాంప్రదాయ సమాజం నుండి అధునాతనంగా అభివృద్ధి అయ్యేందుకు మార్కెట్ శక్తులే కారణం.

''తూర్పు'' ''పడమర'' అనే పదాలకు యీ రోజు చెప్పే అర్థం, 19వ శతాబ్దం వరకు తెలియలేదు. 'పశ్చిమ' భావాలు వెల్లివిరిసిన 'హెల్లెనిక్' నాగరికత రోజుల్లో కూడా, వాటికి సాటిగల పదాలు లేవు. ప్రపంచంలోనే ఒకనాడు సాటిలేని ఆధిపత్యంలో వున్న గ్రీసుకు, పశ్చిమ ఐరోపాతో కంటె, ఉత్తర ఆఫ్రికా, పర్షియా, వాయవ్య సరిహద్దు దేశాలు, భారతదేశంతోనే ఎక్కువ సంబంధాలుండేవి. పశ్చిమ ఐరోపాదేశాలు గ్రీసు నుండి వుత్తరోత్తరా వుత్తేజం పొందాయి.

ఇప్పటి గ్రీసు ఐరోపాలో వుంది. పురాతన గ్రీసు భౌగోళికంగానూ, చారిత్రకంగానూ, ఐరోపాకు చెందలేదు. గ్రీసు వారసత్వం పశ్చిమ దేశాలకే కాదు ప్రపంచం మొత్తానికి చెందినట్టిది. ఇప్పుడు అది పశ్చిమ దేశాలకు జీవనధారగా పిలువ బడుతూ వుంది. చరిత్రలో జరిగిన అన్యాయం, అతిక్రమణ యిప్పుడు ద్యోతకమౌతున్నాయి. నేటి యుగంలో ''పశ్చిమం'' అనే భావం 'స్వీయ అభినందన' సిద్ధాంతం నుండి ఎదురులేని వాస్తవంగా గుర్తింపబడింది. ''తూర్పు'' భావన ఎన్నో శతాబ్దాల నుండి వుంది. 19, 20 శతాబ్దాల ఐరోపా వలస విధానంతో పాటు దాని రాజకీయ స్వభావం పెంపొందింది. ఒక సమయంలో ''తూర్పు'' అనేది నీచంగా పరిగణింపబడేది. ఎందుకంటె, చారిత్రకంగానూ, నాగరికరీత్యా అంతకు మించి యితరత్రా పిలువబడేందుకు సాధ్యం కాలేదు. ''పశ్చిమం'' 'వున్నత' మైందనే భావన వుండేది. అది దృఢమైననైతిక విలువలపై ఆధారపడి వున్నట్లుగా భావించబడేది 'పశ్చిమం' ''మేము'' అని గర్వకారణంగా వుండేది. వలస పాలకులకు అనాగరికులను ''వారు''గా అనిపించేవారు. ''తూర్పు'' భిన్నంగా వుండడమే కాదు, వారి అంతర్గత తర్కం, సూత్రాలు, 'పశ్చిమం' అర్థం కాని విధంగా వుండేది. అయితే ''తూర్పు'' సాంస్కృతికంగానూ, ప్రమాణాల రీత్యా, అంతరంగిక పొందికతో తన సరిహద్దులో తనకు తాను సంపూర్ణంగా సంఘటితపడిన ప్రపంచం.

''తూర్పు'' మేధావులు వలస పాలనాధిపత్యం క్రింద ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నారు. దానికి ప్రతీకగా ''తూర్పు'' సిద్ధాంతంలో గొప్ప సుగుణాన్ని గమనించి 'పశ్చిమ' విలువలకంటే అదే గొప్పదని భావించారు. ''తూర్పు'' విలువలు ''పశ్చిమం'' విలువలకు పూర్తిగా భిన్నమైనవని చాలామంది వాదిస్తున్నారు. మలేషియా మహతీర్ మహ్మద్, సింగపూర్ లీకువన్ యు, యిలాంటి వారు 'ఆసియా' భావాన్ని సమర్థిస్తున్నారు. అలాంటి వాక్చాతుర్యం వెనక, వారి ప్రభుత్వ రాజకీయావసరం వుండవచ్చు అయితే, చాలమంది పశ్చిమేతర మేధావులు యీ వివాదాన్ని సునిశితమైన దృష్టికోణంతో చూడవచ్చు.

సింగపూర్‌కు చెందిన కిషోర్ బహబూబాని 1993 సెప్టెంబర్, అక్టోబర్ "Foreign Affairs" పత్రికలో యీ విధంగా రాశాడు - ''మానవ నాగరికతా సంపద, విజయాల కోశాగారంగా ''పశ్చిమం'' నేటికీ వుంది. మానవుని అద్భుత పురోగమనాన్ని గురించి చాల 'పశ్చిమ' విలువలు వివరిస్తాయి. శాస్త్రీయ దృక్పథం, హేతువాద దృష్టితో పరిష్కారాలను కనుగొనడం కల్పనా భావాలకు సవాలును అంగీకరించడం లాంటి 'పశ్చిమ' విలువలు ముఖ్యమైనవి. మొత్తంలో కొన్ని విలువలు హానికరమైనవి కావచ్చు. కొన్ని మంచివి, కొన్ని చెడ్డవి కావచ్చు. 'పశ్చిమం' బయట వుండి చూస్తేనేగాని స్పష్టంగా అవి కనబడవు. అది తనచేతులారా, తన పతనాన్ని ఏ విధంగా కొని తెచ్చుకుందో కూడా తెలుస్తుంది.''

ఈ అభిప్రాయం ప్రకారం ''తూర్పు'' భవిష్యత్తులో ప్రపంచ నాయకత్వం వహిస్తుందని వీరి ఆశాభావం!

మార్కెట్ శక్తులు తమకు వుచితమైన మార్గంలో పయనిస్తూ వున్నప్పుడే, సాంస్కృతిక రాజకీయ వివాదాలు కొనసాగాయి. జపాను, మిగతా తూర్పు ఆసియా దేశాలు పురోగమించి సౌభాగ్యవంతం అయ్యేందుకు వారి ప్రత్యేక నాగరికతా విలువలు కారణం కాదు. కొన్ని ఆర్థిక మూల సూత్రాలను గుర్తించి అర్థం చేసుకొన్న వారి సామర్థ్యమే దానికి కారణం. అలాగే మిగతా ఆసియా దేశాల ఆర్థిక విధానాలు పై దేశాల వాటితో పోలివున్నాయి, అని ప్రపంచ బ్యాంకు తన 1993 రిపోర్టులో పేర్కొంది. మిగతా అభివృద్ధి చెందే దేశాలు కూడా ఈ మార్కెట్ ఆర్థిక విధాన మూలసూత్రాలను అవలంబిస్తే, సిద్ధాంతపరంగా అవి ఆధునీకరణ మార్గంలో సత్ఫలితాలను సాధించగలవు. కొన్ని ఆసియా దేశాలు ఆచరణ రీత్యా, ఆమార్గంలోనే పురోగమిస్తున్నాయి. అయితే రాజకీయ నాయకులు దాన్నుండి దృష్టిని మళ్ళించేందుకు సంస్కృతికి సంబంధించిన వాదానికి దిగారు. ఆ వాదనలలో, వుద్రేకాన్ని రెచ్చగొట్టే కుటుంబ విలువలు, సెక్స్ నీతి, అతి త్వరగా మారుతున్న ప్రపంచంలో ప్రాముఖ్యం వహించాయి.

ఒక విషయాన్ని మనం దృష్టిలో వుంచుకోవాలి. ఐరోపా కూడా ఎల్లకాలం ఆధునికంగా వుండలేదు. మార్కెట్ అవసరాల దృష్ట్యా తన రోజువారీ జీవన విధానం అనుభవాలు, నమ్మకాలు దెబ్బతింటున్నా వివిధ మార్గాల్లో ఆధునీకరణ దిశగా ఐరోపా సాగింది. 'కాలం' ప్రాముఖ్యాన్ని

అది గుర్తించింది. ఆధునీకరణకు అది చాలా ముఖ్యం. ఐరోపాలో పెట్టుబడిదారీ విధానం పెరిగే దశలోనే గడియారం కనుగొనబడిందేమో! కాలమే వ్యత్యాసాలను రూపుమాపే గొప్పశక్తి. అది క్రమశిక్షణను విధిస్తుంది. లీ కువన్ యు కాలానికి ప్రాముఖ్యాన్నిచ్చి దాన్ని గట్టిగా అంటి పెట్టుకొని వుండేవాడు. బహిరంగ స్థలాల్లో వుమ్మివేయడం లాంటి ఆసియన్ల పాత అలవాట్లను అసహ్యించుకొనేవాడు. అలా వూసేవారికి జరిమానా విధించి శిక్షించేవాడు. ఈ మధ్యకాలం వరకు ఐరోపాలో కూడా ప్రజలు బహిరంగ స్థలాల్లో వుమ్మివేసేవారు. ఇప్పుడు దానికోసం నగిషీపాత్రలను వాడుతున్నారు. ఆధునీకరణ జరిగేకొద్దీ మంచి ఆరోగ్యసూత్రాలు అలవడ్డాయి. ఆసియా దేశాలు కూడా ఆ దారిలోనే పోతూ ఉన్నాయి.

ఐరోపా అనుభవానికి, యిప్పటి ఆసియా అనుభవానికి ప్రత్యేకమైన తేడా వుంది. ఐరోపాలో పారిశ్రామిక విప్లవం ముందే మేధా విప్లవం వచ్చింది. జపాన్ యితర ఆసియా దేశాల్లో అది తలక్రిందులుగా వచ్చింది. ఇది రెండు ప్రపంచయుద్ధాల ఫలితం కావచ్చు. ఐరోపా సాధించినదాన్ని, పశ్చిమేతర దేశాలు ద్విగిణీకృతంగా సాధించాయి. ముఖ్యంగా జపానుదేశం ఎంతో సాధించింది. అభివృద్ధితో పాటు, జపాను, సాంప్రదాయ విలువల సామరస్యాన్ని సాధించింది. జపాను మేధా విప్లవం కొంత ఆలస్యమైందే తప్ప, అసలు రాకుండా పోలేదు. వ్యక్తి వాదం పెరిగింది. దాంతో ప్రత్యేక జపాను పాత్ర రూపు మాసిపోయింది. క్లుప్తంగా చెప్పాలంటే, జపాను మార్పు మార్గంలో నిష్క్రమణకు తావులేదు.

జపాను సమాజం, దాని విలువలు వేగంగా పరిణామం చెందుతున్నాయి. జపాను, యింకా యితర తూర్పు ఆసియా దేశాల్లో స్త్రీ స్థానం మారుతూ వుంది. కుటుంబం, పనితీరులో మార్పు వచ్చింది పురుషాధిక్యత వున్న సమాజంలో, పూర్తిస్థాయి పొందాలంటే, స్త్రీలు యింకా చాలాదూరం ప్రయాణం చేయవలసి వుంది. అయినా, స్త్రీ అంతస్తులో మార్పు రావడంతో, కుటుంబ వ్యవస్థపైన, పురాతన సాంఘిక అవగాహనపైన పునః విచారణ జరుగుతూ ఉంది. పశ్చిమ దేశాల్లో కూడా కొంతకాలం క్రితం అదే జరిగింది. వీటన్నిటికీ మూలకారణం సాంకేతికాభివృద్ధి అని చెప్పకతప్పదు.

విలక్షణమైన నూతన ఆసియా సమాజం ఏ విధంగా పరిణామం చెందుతుందో చెప్పలేము. ప్రత్యేక ఆసియా "సమాజమంటూ ఈ రోజున లేదు. నానావిధాల సాంస్కృతిక లక్షణాలు వున్న ఆసియా ఖండంలో చాలావరకు ఏకరూపంతో సులభంగా గుర్తుపట్టగలిగే ''ఆసియా విలువలు'' మాత్రం వున్నాయి. 21 శతాబ్దం తొలి సంవత్సరాల నాటికి, ఆసియా దేశాల్లో హాంకాంగ్, సింగపూర్‌ల లాగా పట్టణాలు పెరిగి 'ఆధునీకరణ' కనిపించే అవకాశం వుంది. ఆసియాలోని యిప్పటి నగరాలు, పశ్చిమ దేశాలలోని నగర వాతావరణానికి అంతగా భిన్నమైనవి కావు. ''పశ్చిమ'' 'ప్రాక్' నగరాలన్నీ ఒకే నమూనాలో యిమిడి పోయాయి.

ప్రస్తుత పరిభాషలో మనం వివరించే ''భౌగోళిక గ్రామం'' అనేది 21 శతాబ్దం మధ్యకాలంలో ''భౌగోళిక నగరం''గా మారవచ్చు. ఎందుకంటే, మానవ నాగరికత చరిత్రలో గ్రామ నాగరికత నుండి నాగరికతకు వృద్ధి చెందడం మన కాలంలో జరిగినంత వేగంగా యిదివరకెప్పుడూ జరగలేదు. దీనికి ప్రచార సాధనాల సహాయం ఎంతో వుంది. అప్పటికి, మనలో ఎవరైనా బ్రతికి వున్నట్లయితే, విభిన్న ప్రపంచాల గురించి, రెండు ప్రపంచాల కలయిక అసాధ్యమనే దాన్ని గురించిన వాదనలు విన్నట్లయితే, అవి మనకు పరిహాసంగా కనిపిస్తాయేమో!

అప్పటికి ప్రపంచం తన సమస్యలన్నీ పరిష్కరించలేకపోవచ్చు. చరిత్ర ముగింపుకు రాకపోవచ్చు. నూతన సంఘర్షణలు ప్రపంచాన్ని గడగడ లాడించవచ్చు. అప్పటి నగరాలు యిప్పటిమాదిరి, వాణిజ్యవాడలు, పార్కులు, మురికివాడలు, దేదీప్యమానకాంతులు, చీకటిదారులతో వుండవచ్చు. సమాజంలో జాతుల మధ్య, లేక భాషా, సంస్కృతుల మధ్య వచ్చే, వర్గభేదాలు, అపశ్రుతులు తొలగిపోవచ్చు. ఇప్పటి గందరగోళం నుండి బ్రతికి బయట పడితేనూ, పర్యావరణ, యితర విధ్వంసాల నుండి రక్షించుకోగలిగితేనూ, భౌగోళిక రీత్యా మనమంతా ఒకేవిధమైన గమ్యాన్ని చేరవచ్చు. ఎందుకంటే, మార్గంలో ఎన్ని అడ్డంకులున్నా, వాటిని దాటి 'ఆధునీకరణ' ఒకే దిశకు సాగిపోతూ వుంది. మనం ఏమనుకున్నా ప్రపంచ ప్రసార సాధనాలతో ముందుకు సాగిపోయే మార్కెట్ విధానం వేరే విధంగా వుండదు.

ఈ వ్యాసానికి ప్రేరణ:

1. గౌతమ్ అధికారి జార్జి వాషింగ్టన్ యూనివర్సిటీలో వుపన్యాసము.
2. Future Shock by Alvin Toffler
3. పర్యావరణ, కాలుష్యంపై గార్డియన్ వ్యాసము.
4. Small is Beautiful - Schumacher
5. ఆంధ్రదేశంలో సర్కారు జిల్లాల గ్రామాల్లో జరుగుతున్న ప్రచార సాధనాలు.

('మిసిమి' రచనల వర్క్‌షాప్)

(1995, జూలై 'మిసిమి')

తొలి కెరటాలు

అర్థశతాబ్ది కిందటే 'జ్యోతి' నూతన భావ స్ఫోరక రచనలకు ప్రతీతి. మచ్చుకు ఇచ్చిన ఈ కొద్ది రచనలు 'జ్యోతి' అనితర రీతికి ఆనవాళ్లు.

జ్యోతి వెలుగులు

1948 నాటి ''జ్యోతి''

రావూరి భరద్వాజ

''జ్యోతి'' పాత సంచికలను తిరగవేస్తున్నప్పుడూ, ''రేరాణి''లోని పాతకథలను చదువుకొంటున్నప్పుడూ, నా చిన్నతనంలోకి నేను తొంగిచూసుకొంటున్నట్టుగా ఉంటుంది. నా పునాదుల్లోకి నేను చొచ్చుకుపోతున్నట్టుగా ఉంటుంది.

నేను కథలు రాయడం మొదలెట్టింది 1943-1944ల్లో కావచ్చు. నా తొలికథ అచ్చయింది 1946వ సంవత్సరంలో. అచ్చులో నా కథను చూసుకొని, నా పేరును చూసుకొని, అక్షరాలా నేను పొంగిపోయ్యాను. ''పొంగిపోయాను'' అన్నది చాలా చిన్నమాటా, చాలా చాలా బలహీనమయిన మాటానూ.

కథలు రాస్తే డబ్బిస్తారన్న సంగతి, నాకు 1948లో గానీ తెలీదు. అలా తెలియచేసినవారు జ్యోతి మేనేజిమెంటువారు. ఆ పత్రిక తెనాలి నుండి వెలువడుతూ ఉండేది. తొలిసారిగా అయిదు రూపాయల పారితోషికం నాకిప్పించిన ''దేవుడు పుట్టాడు'' అన్న నా కథ, ''జ్యోతి'' పత్రికలో అచ్చయింది. ఇది జరిగిన రెండు మూడు మాసాలకే నేను ''జ్యోతి'' పత్రికలో ఉద్యోగిగా చేరాను. ఇది - నేను కలలో కూడా ఊహించని సంఘటన.

నాకిప్పటికీ బాగా జ్ఞాపకం... ''ఈ ఉత్తరం అందంగానే, తగినన్ని గుడ్డలు తీసుకొని తెనాలి రండి!'' అంటూ వచ్చిన ఓ కార్డు నా జీవితాన్ని గొప్పగా మలుపుతిప్పుతుందని, నేననుకోలేదు. ఆ ఉత్తరం రాసింది ఆలపాటి రవీంద్రనాథ్‌గారు. నేను తెనాలిలో బతకడానికీ, పత్రికారంగంలో, కాలు నిలదొక్కుకోడానికీ, ఆ ఉత్తరమే కారణం!

''జ్యోతి'' పక్షపత్రిక, చాలామంది కొత్త రచయితలను వెదికి పట్టుకొచ్చింది; అప్పటికే ప్రసిద్ధులైన రచయితల సరసన వారిని నిలబెట్టింది! 'శారద', భుజంగరావు, ప్రకాశరావు, నేనూ కొత్తవాళ్ళమే! మా అందరి పేర్లూ; అటు చలంగారి పక్కనా, ఇటు కొప్పరపు సుబ్బారావుగారి పక్కనా, చూసుకొని, పొంగిపోతూ ఉండేవాళ్ళం.

కొత్తదనం కోసం, తహతహలాడిపోయే రవీంద్రనాథ్‌గారు, ఆ తరువాత; ''రేరాణి'' అన్న మాసపత్రికను ప్రారంభించారు. అంతదాకా, విద్యాసంపన్నులకే పరిమితమయిన హేవలాక్ ఎల్లిస్, సిగ్మండ్ ఫ్రాయిడ్, రచనలను సరళమయిన తెలుగులోకి మార్చి సామాన్య పాఠకులకందచేసింది ''రేరాణి'', ''జ్యోతి'' పత్రికలే ! క్షయవ్యాధిని గురించి, సిఫిలిస్ వ్యాధిని గురించి, జనాభా సమస్యలను గురించి, విడాకులను గురించి - సాహసోపేత మయిన ఎన్నో వ్యాసాలను ఈ పత్రికలు ప్రకటించాయి.

చలనచిత్రపరిశ్రమ మద్రాసులో ఉన్న కారణంగా, సినిమా పత్రికలన్నీ మద్రాసు నుండీ వెలవడుతుండేవి. నాకు గుర్తున్నంతలో, తెనాలి నుండి వెలువడిన తొలి సినిమా మాసపత్రిక ''సినీమా!'' ఈ మూడు పత్రికల బాధ్యతలన్నీ రవీంద్రనాథ్ గారివే!

''రేరాణి'' మాసపత్రికలో అచ్చయిన ''అలవాటైన ప్రాణం'' అన్న నా కథ మీద పోలీసులు కేసు పెట్టారు. అయిదువందల రూపాయల జుల్మానా గానీ, అది చెల్లించని పక్షంలో ఆరుమాసాల జైలుశిక్ష గానీ'' అనుభవించాలని మేజిస్ట్రేటు తీర్పు చెప్పారు. నేను రెండోదానికి సిద్ధపడ్డాను. రవీంద్రనాథ్‌గారు అయిదువందలూ చెల్లించి నాకీ ఆరుమాసాల జైలు అనుభవం లేకుండా చేశారు. 'అనుభవం' అంటే గుర్తుకొచ్చింది. ''మా అనుభవాలు'' అన్న శీర్షికను ఆనాడే ప్రారంభించి, చాలామంది కొత్త రచయితలను పరోక్షంగా ప్రోత్సహించింది ''జ్యోతి''.

''రచన బాగా ఉండడం ఉండకపోవడం'' అన్నది తప్ప, ఇంకే అంశమూ, సంపాదకుల దృష్టిలో ఉండేదికాదు. ''హంకో మొహబత్'' - ''స్టేషన్‌పంపు'' అన్న చలంగారి కథలు ప్రకటించాక, ఆయనగారే ''కళ్యాణి'' అన్న ఇంకో కథను ప్రచురణకోసం పంపించారు. ''మిగతా రెండింటిలాగే ఇదీ ఉంది!'' అన్న అభిప్రాయంతో, ఆ కథను చలంగారి తిప్పి పంపించింది ''జ్యోతి'' పత్రిక. ఆ తరువాత అదే కథ, అప్పట్లో మద్రాసు నుండి వెలువడుతున్న ''ఆంధ్రజ్యోతి'' మాసపత్రికలో అచ్చయిందనుకోండి.

ఆ రోజుల్లో, విజయవాడలో కొత్తగా రేడియో కేంద్రం వెలిసింది. దాని ప్రసారశక్తి చాలా పరిమితం. అయితేనేంగానీ, దానిచుట్టూ, ''సాహిత్యోపాసకులు, కళాకారులు'' ఎప్పుడూ బిలబిల్లాడు తుండేవారు. అప్పట్లో రేడియో ఉద్యోగులు కూడా, ఆ ప్రయోగానికి - దాదాపుగా కొత్తవారు. ఆ కారణంగా కార్యక్రమాలను రూపొందించడంలోనూ, ప్రసారం చేయడంలోనూ, చాలా పొరపాట్లు జరుగుతూ ఉండేవి. వాటన్నింటినీ ''జ్యోతి'' పత్రిక నిర్భయంగా తూర్పారబడుతుండేది. ఆ విమర్శలకు తట్టుకోలేని రేడియో ఉద్యోగులు కూపీలు తీసి, విమర్శచేస్తున్న కొప్పరపు సుబ్బారావుగారినీ, ఆ విమర్శలను ప్రచురిస్తున్న ఆలపాటి రవీంద్రనాథ్‌గారినీ, ఒక కార్యక్రమంలో ఇరికించి ప్రసారం చేశారు. ఆ కార్యక్రమం అలా కాకుండా, ఎలా ఉండాలో సూచిస్తూ మరుసటి సంచికలో మళ్ళీ విమర్శ వొచ్చింది. అప్పట్లో - సర్దార్ పటేల్, రేడియో శాఖకు కేబినెట్ హోదాగల మంత్రిగా ఉండేవారు. ఆర్. ఆర్. దివాకర్ సహాయమంత్రిగా ఉండేవారు. ఈ విమర్శల ఆంగ్లానువాదాలను చదివి, లోపాలను సవరించి, కార్యక్రమాలు సక్రమంగా ప్రసారం కావడానికవసరమయిన అన్ని చర్యలనూ, వారు తీసుకొన్నారు. ఆ విషయంలో జ్యోతి సంపాదకుల సహాయ సహకారం కూడా పొందాలని - మంత్రి దివాకర్ విజయవాడ వచ్చినప్పుడు రవీంద్రనాథ్, కొప్పరపు వారిని ఆహ్వానించి చర్చలు జరిపారు.

''జ్యోతి'' పాత సంచికలను తిరగవేస్తున్నప్పుడూ, ''రేరాణి''లోని పాతకథలను చదువుకొంటున్నప్పుడూ, నా చిన్నతనంలోకి నేను తొంగిచూసుకొంటున్నట్టుగా ఉంటుంది. నా పునాదుల్లోకి నేను చొచ్చుకుపోతున్నట్టుగా ఉంటుంది.

ఈనాడు, ఆబాలగోపాలం ఆర్భాటం చేస్తున్న అనేక సమస్యలను గురించి - మద్యపానం, జనాభా పెరుగుదల, పాఠశాలల్లో లైంగిక విజ్ఞాన బోధనం - వంటి అనేక అంశాలపై నాలుగున్నర దశాబ్దాల కింతటనే, శాస్త్రీయమైన సాహసోపేతమయిన ఎన్నో వ్యాసాలను నిర్భయంగా ప్రచురించిన ''జ్యోతి'' పత్రికతో, నాకూ అంతో ఇంతో సంబంధమున్నదని చెప్పుకోవడానికి, నేనెప్పుడూ గర్వపడుతుంటాను.

(1994, ఆగష్టు 'మిసిమి ప్రత్యేక సంచిక)

హెచ్చరిక

కాని ప్రపంచానికి ఒక దురభ్యాసం వుంది. ఇంతకు ముందు ఇంతకు ముందు వచ్చిన ప్రవక్తల ప్రబోధాలను ఆతృతతో విని, ఆమోదించి, తృటికాలం చలించి, తిరిగి మామూలు గాడిలో ప్రయాణం సాగిస్తూ వచ్చింది. లేకపోతే ఆయా ప్రవక్తల సిద్ధాంతాలూ వేదాంతాలూ దేవాలయాల్లో, చర్చీల్లో, మసీదుల్లో, ప్రార్థనమందిరాల్లో ఎండకు వడలకుండా భద్రపరిచి, సమయోచితంగా ఇతర అవసరాలకు ఉపయోగించుకుంటూ వచ్చింది. రాముడూ, క్రీస్తూ, మహమ్మదూ, బుద్ధుడూ - వీరందరు లోకోత్తర పురుషులే, మార్గదర్శకులులే. కాని యాతావాతా వారి మూలంగా ప్రపంచానికి కల్గినవి ఆవేశపూరిత పురాణాలూ. మత కలహాలూ - మిగిలినవి, మాయని చీలికలూ, తీరని దుఃఖాలూ. ఆ మహా పురుషులు శతాబ్దాల ముందుకు చూడ గలిగితే - తమ మహోత్కృష్ట ప్రబోధాలకు ఫలితాలు ఈవిధంగా వుంటాయి అని తెలుసుకో గలిగితే - ఆ పని నుండి విరమించుకొని వుండి వుందురేమో!

ఏమయినాసరే, గాంధీ మహాత్మనా చుట్టూ ఉద్రేకపూరితమయిన పురాణాలూ, ఇతిహాసాలూ, మత సిద్ధాంతాలూ కల్పించి బుద్ధదేవుళ్ళలాగా తయారు చేస్తే కొందరికి ఆత్మతృప్తి కలగవచ్చు - కాని మాకు ఆ దేవుళ్ళమీద ఎందుకో అసూయగా వుంటుంది. మన గాంధీజీని మానవమాత్రునిగా స్మరించుకోవటంలోనే ఆత్మ సంతృప్తి వుంటుంది. మానవమాత్రులకు వుండాలిసిన లోపాలన్నీ వుండికూడా ఆత్మ బలాన్ని చాటిన గాంధీజీ మన మానవత్వానికి మెరుగు పెట్టడం లేదా?

కావున భారతదేశానికి ముఖ్యంగా చేయదగ్గ హెచ్చరిక ఏమనగా - ప్రజానీకం మీద గాంధీజీకి వున్న ప్రాబల్యాన్ని గాంధీజీ పేరుతోనే దుర్వినియోగ పరచటం కూడదనీ; ఇంకా ఏమత సాంఘిక రాజకీయ సంస్థగాని, ఏ నాయకుడు గాని ఇది ఒక మహదవకాశంగా తీసుకుని దేశంలో అనవసరమయిన కల్లోలాలు కల్పించి స్వంత ప్రాబల్యంకోసం ప్రాకులాడటం నీచమనీ హెచ్చరిస్తూ ప్రియమయిన మన మహాత్ముని ఆత్మకు సంపూర్ణ శాంతి కలుగుగాక అని ప్రార్థించుచున్నాము.

సంపుటి 1
15 ఫిబ్రవరి 1948
సంచిక 13

జ్యోతిలో ప్రచురితమైన మహాత్ముని నిర్యాణం సందర్భంగా ఎడిటోరియల్‌లో కొంతభాగం

మహాత్మాగాంధీ దివంగతులైన సందర్భముగా

పెరల్ బక్

అమెరికన్ రచయిత్రి పెరల్‌బక్ సాహిత్యంలో నోబెల్ ప్రైజు గ్రహీత. చైనా సమాజాన్ని, సామాన్య ప్రజానీకాన్ని ఇతివృత్తంగా తీసుకుని అనేక నవలలు రచించారు. గుడ్ ఎర్త్ ఆమె రచించిన నవలల్లో ఆణిముత్యం.

మా కుగ్రామంలో మామూలు వలెనే సూర్యోదయమైంది. దూరాన బడికి పోవలసిన కుర్రవాళ్ళను పెందలకడనే నిద్ర లేపవలసి వొచ్చింది. ఆకాశం బూడిదరంగుతో వుంది. మంచు దట్టంగా పడుతూవుంది.

హఠాత్తుగా మా ఇంటిపెద్ద వొచ్చి ''ఇంతకుముందే రేడియో అతి విషాదవార్తను చెప్పింది... గాంధీజీ మరణించారట!''

కొన్ని వేల మైళ్ళదూరంలో అమెరికాలో వున్న వారికి యీ వార్త ఎలావుంటుందో ఊహించలేరు. తన జీవితాన్నంతటినీ ప్రజాసేవకు వినియోగించిన శాంతిదూత గాంధీజీ హత్య చేయబడ్డారు. పది సంవత్సరాల కుర్రవాడు కన్నీటితో ''తుపాకుల్ని ఎవ్వరూ కనిపెట్టకుండా ఉన్నట్టయితే ఎంత బాగుండేది!'' అన్నాడు.

మా కుటుంబంలో ఎవరమూ గాంధీజీని చూచి ఉండలేదు. మేము ఇండియా వెళ్ళినప్పుడు ఆయన జైల్లో ఉన్నారు. ఆయన మాకొక యోగి. తాను నమ్మినదాన్ని ధైర్యంగా ఎదుర్కోగల మహాత్ముడు.

విచారంతోనే మామూలు దైనందిన కార్యాలు చేసుకుపోసాగాం. గాంధీజీ పలుకుబడి అమెరికాలో ఇంత గొప్పగా ఉండటంలో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు.

గంటక్రితం రోడ్డున పోతూవుంటే ఒక రైతు ''లోకంలో అందరూ గాంధీజీ చాలా మంచి వాడని అంటారు. మరి ఎందుకని హత్య చేయబడ్డాడు?'' అని అడిగాడు. నేను తల వూపాను.

''జీసస్ క్రైస్టును ఎందుకు చంపించి ఉంటారో - అలాటి కారణమే కావొచ్చు'' అన్నాడు నిట్టూరుస్తూ.

ఆ రైతు నిజం మాట్లాడాడు. క్రీస్తును శిలువ వేసిన సంఘటనకూ, గాంధీజీ కాల్చబడ్డ సంఘటనకూ ఎంతైనా పోలిక వుంది. మా ఒక్క కుటుంబమే కాకుండా ఈ అమెరికా దేశంలోని ప్రతి కుటుంబమూ - లోకమే గాంధీజీకోసం విచారపడుతూవుంది.

(జ్యోతి, గాంధీ సంచిక..... 15, ఫిబ్రవరి 1948)

రేపటి జనసంఖ్య

నారాయణరావు

ఏ దేశం ఐశ్వర్యం అయినా దాని మనుష్య సంపత్తిపై ఆధారపడి వుంటుంది. దేశంలో అందుకు కావలసినన్ని ముడిపదార్థాలు, శక్తి (విద్యుచ్ఛక్తి) అనుకూల పరిస్థితులు విరివిగావున్నా, ఆ ప్రజలు అజ్ఞానులుగాను, బలహీనంగాను వుంటే అది అనాథస్థితిలో ఉండక తప్పదు. దేశాభ్యుదయానికి దానిప్రజలే ఆయువుపట్టు. జనసంఖ్య తక్కువగా వున్న దేశాలు ఆర్థికంగా, పచ్చగా వుంటాయి. అట్లే జనసంఖ్య హెచ్చుగా వున్న దేశాలు చాలా హీనస్థితిలో వుంటాయి. జనసంఖ్యకు తగ్గట్టు దాని పరిశ్రమలు చక్కగా అభివృద్ధి చెంది వుండాలి. దేశానికి కావలసినది బలీయమైన, జ్ఞానవంతమైన జన సంఖ్య - మనదేశంలో కావలసినదానికంటె ఎక్కువ ప్రజలున్నారు. కాని వారిలో యెక్కువమంది అజ్ఞానులు - బలహీనులు, తినటానికి సరిగా తిండిలేని బీదలు - వీరిసంఖ్య దేశానికి లాభదాయకం కాదు. ఆరోగ్యవంతులైన, తెలివిగల మనుష్యసంపత్తే మనకు కావలసింది - మనదేశంలో జనసంఖ్య విపరీతంగా పెరిగిపోతూంది. ఇప్పటికే యెక్కువ అవటం వల్ల మనలో ఎందరికో తినటానికి తిండిలేక మలమల మాడిపోవాల్సి వస్తోంది. యీ జనసంఖ్య ఇంకా హెచ్చితే యేమవుతుంది? మన దేశంలో ఎక్కువ జనసంఖ్యకు కారణమేమిటి?

సంతానానికి మనదేశం కల్పవృక్షం వంటిది

సంతానం-కర్మ-దేవుని మహత్యం అంటారు మన పెద్దలు. నిజంగా సంతానం దేవుని మహత్యమేనా? 'మీకు ఏమీ తెలియదు. సంతానానికి మనం యేమి చేయగలం? మనచేతిలో ఏంవుంది? పిల్లలు కావాలి అనేవాళ్ళకు పిల్లలు లేకపోవటం ఏమిటి? బీదవాళ్ళకు ఇంత సంతానం ఏమిటి?' అంటారు మన పెద్దలు.

''వాళ్ల అదృష్టం - వాళ్ల కర్మకి మనం కర్తలమా? వాళ్లు ఎందుకు పుట్టారో ఏ గొప్ప యింటిలోనో పుట్టరాదూ? ఇదంతా ఆ జగన్నాటక సూత్రధారుడి మహిమ... నోరిచ్చినవాడే ఆహారమిస్తాడు'' అంటారు మన పెద్దలు.

చెట్టుకు వేలకొలది విత్తనాలిచ్చేడు, చేపకి వేలకొలది గుడ్లిచ్చాడు, పందికి-పది, పదిహేను పిల్లల్నిచ్చేడు. అటువంటి ఉదార పురుషుడు పిల్లలు కావాలోయ్ అనేవాళ్లకి పిల్లల్నివ్వకపోవటం యేమిటి? వాడి బొంద, గొడ్డయి పోవటం ఏమిటి వట్టి తెలివి తక్కువ గాక - ఇక బీదవాళ్లకు ఇందరు పిల్లలేమిటంటే.....

మనిషియై పుట్టుటమెందుకు సుఖించటానికేనా? ఆ సుఖం మనకెలావస్తుంది. సుఖించాలి అంటే మన ఇంద్రియాల్ని తృప్తి పరచాలి - బీదవాళ్లు తమ ఇంద్రియాల్ని తృప్తిపరుస్తారు? అందమైన చక్కని వస్తువులను, బొమ్మలను - దృశ్యాలను చూడాలి - వాటికై డబ్బు వెచ్చించాలి. డబ్బు బీదవాడి అందుబాటులో లేదు కనుక కళ్లతో సుఖాన్ని సంపాదించలేడు.

ఇక చెవులు: చక్కని మధుర సంగీతాన్ని చెవులు కాంక్షిస్తాయ్. దానికి డబ్బు కావాలాయె. ఇక ముక్కు: మంచి సువాసనలను వాంఛిస్తుంది - దానికీ డబ్బు? ఇక నాలుక: మంచి రుచికరమైన ఆహారం కావాలాయె - దానికీ సొమ్ము? ఇక చర్మం: మెత్తనివి, మృదువైనవి, పక్కలూ దుస్తులూ కావాలి - వాటికైనా డబ్బే?

బీదవాడు రోజుకి - రూపాయి కూలి తెచ్చుకొనేటప్పుడు - పై భోగాలెట్లా వస్తాయ్? వాడు సుఖించాలి అంటే ఆరవ యింద్రియం (కామం) కంటే వేరు మార్గంలేదు. వానికి ఎప్పుడు ఏ క్షణమందు మనస్సు కలుగుతే, అప్పుడు తన పశుకామాన్ని తీర్చుకొని ఆనందిస్తాడు. గత్యంతరంలేక వొప్పుకునే బానిస భార్య - అందుకే వాడికి కావలసినంత మంది పిల్లలు!! మనదేశంలో జనసంఖ్య ఎంత? అందులో బీదవారెందరు? వాళ్ళందరు సుఖించే మార్గం? - అది కామం..... అందుకే మనదేశంలో ఇంత ఎక్కువ జనసంఖ్య.

దినదినానికి యెక్కువవుతున్న యీ జనసంఖ్య మనకి ఆర్థికంగా చాలా ముప్పు తెస్తుంది. మనదేశంలో 100కి 75 మంది హిందువులు - (ఇప్పుడు 100కి 85 మంది హిందువులు). హిందూమతం ప్రకారం గృహస్థధర్మం అన్ని ధర్మాలకంటే గొప్పది.

హిందూధర్మం ప్రకారం పిల్లలు - అందులో (పాపం నాకు సరిగ్గా జ్ఞాపకం లేదు - యేదో పురాణం ప్రకారం సంతానహీనుడయిన ఋషిపుంగవునికి స్వర్గం లేకపోతే అష్టకష్టాలు పడి తుదకు పిట్ట అయి, పిల్లలు కన్నాట్ట) అందుకు ఏవో కొన్ని పురాణాలు కష్టపడి కల్పించారు. పాపం, చూడండి - భారతంలో కుంతీదేవి (పతివ్రత) అదేదో మంత్రశక్తి వల్ల నలుగురు కొడుకుల్ని కని తన భర్తకు స్వర్గం సంప్రాప్తింపచేసింది. ఈ పురాణాలు... ధర్మాలు మనకింతవరకూ.... ఈ మృత్యువుతో పోట్లాడిస్తున్నాయ్.

''నారు పోసినవాడే నీరు పోస్తాడు'' అన్న పలుకులకిక ఈ నవ్యభారతంలో స్థానం వుండకూడదు.

వివాహాలు: మత ధర్మంగా వివాహం చేసుకోవాలి - కాబట్టి వివాహం చేసుకోగలుగుతే మానరు. ఏజ్ ఆఫ్ కన్‌సెంట్ కమిటీ ప్రకారం 50% యువతులకి 15వ ఏడులోగా పెండ్లి ఐపోతూంది - వాళ్ల ఆరోగ్యం ఏమవుతుంది అనే ప్రశ్న లేనేలేదు - యేమీ యెరుగని యువతులు తల్లులైతే, వారికి పుట్టే సంతానం ఎట్లా ఉంటుంది - వీళ్లే అనారోగ్యవంతులైతే వారి పిల్లల ఆరోగ్యం ఏమవుతుంది? దీనివలనే యెక్కువ చావులు. ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతున్నవంటే మనం సిగ్గుపడవలసి వొస్తుంది - కాని ఏం చేస్తున్నాం? కట్టుకోవటానికి మంచి గుడ్డలేక-తలకి నూనెలేక - కాలికి చెప్పుల్లేక - ఎందరు తండ్రులు తమ సౌఖ్యాల్ని తమ బిడ్డలకై ఆహుతి చేస్తూన్నారు - కాని అప్పటికీ వారు తమ బిడ్డలకు సౌఖ్యం చేకూర్చ గల్గుతున్నారా? అదే ఒక ఆరోగ్యమైన బిడ్డ అయివుంటే వారి జీవితాలెంత సుఖదాయకంగా సాగిపోయి ఉండేవో! ఇది బాగా ఆలోచించే పాశ్చాత్యులు అంటారు "You want a Baby or a Baby - Austin" అప్పట్లో Baby Austin కారుండేది. అసలే సామాన్య మనుష్యుడు, విద్యాహీనుడు, అమాయకుడు, ఆపై దైవభక్తి, పిచ్చి పిచ్చి నమ్మకాలు

గలవాడు. బీదవానికి పిల్లలు పుట్టడం నష్టం కాక లాభం. "A child is not a burden but an asset to a poor man" పిల్లలు చిన్నప్పటి నుండియే యేదో పనిచేసి కుటుంబానికి సహాయపడతారు. కాబట్టి బీదవాళ్ళకు యెక్కువ సంతానమైతేనే మంచిది అనేవాదన వుంది.

డార్విన్ ''ఒక జంట యొక్క సంతానంతో ప్రపంచమంతా నిండిపోతూంది'' అన్నాడు.

''ఒక జత మనుష్యుల సంతానం, 1750 సంవత్సరాల్లో ఇప్పటి ప్రపంచ జన సంఖ్యను మించుతుంది.''

మన దేశంలో యెక్కువ జనసంఖ్యను అరికట్టేందుకు మనం ప్రయత్నించాలి. జన సంఖ్య యొక్క ప్రాముఖ్యత డాక్టర్ హట్టన్ యొక్క రిపోర్టునుబట్టి తెలుస్తుంది.

"Attention has already been drawn to the grave increase in the population of this Country. The actual figure of the increase is about 34 millions, a figure approaching equal with that of the total population of France and Italy".

ఒక్క 1921-1931 మధ్య అనగా 10 సంవత్సరములలో పెరిగిన జనసంఖ్యయే (340 లక్షలు). ఫ్రాన్సు ఇటలీ దేశాల యొక్క మొత్తము జనసంఖ్యకు సమీపించుచున్నది.

మనదేశం యుద్ధానికి పూర్వం బర్మా సయాం దేశాల నుండి ఆహారధాన్యాలు దిగుమతి చేసుకొనేది - అంటే మన దేశం, దానిప్రజలకు సరిపోయే ఆహారం ఉత్పత్తి చేసుకోలేదు - యుద్ధానంతరం - మనం పడుతున్న అగచాట్లు, ఏదేశంలోనూ వుండవు.

కాబట్టి అన్ని విధాలా మనం చాలా చెడ్డపరిస్థితుల్లో ఉన్నాము. మన జనసంఖ్య యెక్కువ కాకుండా ఉన్నట్లయితే మనం ఇప్పుడనుభవిస్తున్న గడ్డుదినాల్ని చూడకపోయే వాళ్ళం. భవిష్యత్తు జనసంఖ్య బలిష్ఠంగానూ, ఆరోగ్యంగానూ ఉండటమే మనం వాంఛించేది.

దానికి కావలసినవి - మనో నిగ్రహం. కామాన్ని వీలైనంతవరకూ అరికట్టటం.

సంతాననిరోధం - దీనికై ప్రభుత్వమే చేయిచేసుకోవాలి - మంచి ప్లానులతో సంతాన నిరోధం ఏవిధంగా ఉపయోగించేదీ ఆలోచించాలి. దీనికై పల్లెల్లోను, పట్టణాలలోనూ, సినీమా ద్వారా, మ్యాజిక్ లాంటర్న్స్ ద్వారా మంచి ప్రచారం ఇవ్వాలి - ప్రతి పట్టణం లోనూ, ఆసుపత్రులలోను దీనిని ఉచితంగాను, లేక తక్కువ ధరలకు, పంచిపెట్టుతూ వాటి నుపయోగించే మార్గాల్ని సామాన్య ప్రజలకు నచ్చ జెప్పాలి.

ఫ్రాన్సు దేశం చేసిన తప్పును మనం తిరిగి చేయరాదు. మన సంతాన నిరోధం ఒక క్రమపద్ధతిలో పనిచేయాలి. మన దేశంలో డాక్టర్లకే దీన్ని గురించి ఎక్కువ తెలియ నప్పుడు, మనదేశంలో 10 గ్రామాలలో తొమ్మిదింటికి డాక్టర్లే లేకపోయేటప్పుడు - ఇంకా ప్రజలకెట్లా తెలుస్తుంది? కాబట్టి దేశాభ్యుదయానికై తయారుచేసిన ప్రణాళికల్లో, సంతాననిరోధానికి స్థానం వుండాలి.

మనదేశ జనుల యొక్క కొనుగోలు శక్తి హెచ్చించాలి. అంటే దానికి సమంగా జనసంఖ్య పెరుగుదలను అరికట్టాలి. రెండవది చేయక ఎంత కష్టపడ్డా మనకష్టాలు నిష్ఫలమౌతాయి. యేం చేయాలన్నా మొట్టమొదట ప్రజలకు విద్య గరపాలి.

బూర్జువా పరిశోధకుడైన సోని ''ఇండియాలో పరిస్థితులను గురించి ఏమాత్రం తెలిసినవారైనా, మొత్తం జనాభాలో నాలుగింట - మూడవ వంతు నిత్యదరిద్రంలో మునిగివున్నారనీ, కనీస జీవితావసరాలకైనా వారికి తక్షణ నివారణ అవసరమనీ.... ఇండియాలో ఎల్లప్పుడూ కడుపు నిండీ నిండకుండా కాలం గడుపుతున్నారనీ అంగీకరిస్తారు'' అన్నాడు.

వివిధ దేశాలలో పుట్టుకల సంఖ్య - ఇంగ్లాండు 17, ఫ్రాన్సు 18, జర్మనీ 17, హాలెండు 28, ఇండియా 33. పైదాన్నుండి మనదేశంలో ఎంత ఎక్కువమంది ఏటా పుడుతున్నారో తెలుస్తుంది.

ఒక చదరపు మైలునకు జనసంఖ్య: న్యూజిలాండు 12, ఈజిప్టు 34, ఇండియా 246. పైదేశాలు వ్యవసాయం మీద ఆధారపడ్డ దేశాలుగాని వాటి జనసంఖ్య మనకంటే చాల తక్కువ.

పెద్ద కుటుంబాలు, మన పెద్దలదృష్టిలో దేవుని అనుగ్రహ చిహ్నాలు - కాబట్టి సంతాన నిరోధానికి ముందు ఎన్నోకష్టాలు ఎదుర్కోవలసి వుంటుంది -

ఏదియెట్లున్నను, మన జనసంఖ్య పెరుగుదలని తగుమార్గంలో, తగుపరిస్థితుల్లో అరికట్టాలి · లేకపోతే?...

(1948 జ్యోతి)

అణు విస్ఫోటం కన్నా జన విస్ఫోటం భయంకరమైందన్న భవిష్య దృష్టితో 'జ్యోతి' ఈ రచనను ప్రచురించింది. ఎమ్. ఎన్. రాయ్ సతీమణి ఎలెన్‌రాయ్ కుటుంబ నియంత్రణపై రాసిన వ్యాసాన్ని ప్రచురించినందుకు ప్రభుత్వం రవీంద్రనాథ్‌పై కేసు నడిపింది. ఈనాడు ప్రభుత్వం, సమాజం బెంబేలెత్తుతున్న సమస్య తీవ్రతను రవీంద్రనాథ్ ఆనాడే గుర్తించి స్పందించారు.

గొప్పవాడి భార్య

శారద

గొప్పవాడికే సుగుణాలు లేకపోయినా, వాటిని అలవాటు చేసుకోవటం యాతనైనా, ఆ గొప్ప గుణాల్ని డాబుగా ప్రదర్శిస్తో గొప్పవాడైనాడు. గొప్పవాడి అసలు పేరు, అందరూ మరిచి, గొప్పవాడనే పిలుస్తున్నారు. గొప్పవాడు అందరూ అన్నం తినటం మామూలు పనిగనక, తను నువ్వులనూనె, నారింజకాయల తొక్కల రసమూ, బహిరంగంగా తాగటం అలవాటు చేసుకున్నాడు. కాని లోపాయికారీగా అన్నం తింటూనే వున్నాడని, ఎవరో తెలియనివారో, తెలిసినవారో అన్నా, పత్రికలు ఇట్లాంటి వాటిని ప్రజలు నమ్మరని, ప్రచారం చేసి, గొప్పవాడి గొప్పతనం నిలబెట్టినై. గొప్పవాడిదివరకే, పెళ్ళి చేసుకొని, ఇద్దరు కొడుకుల్నీ, ఓ కూతుర్నీ కన్నాడు. గొప్పవాడి భార్య గొప్పవాడి గొప్పతనం కోసం, గొప్ప పనులు చేయలేక, గొప్పవాడి చేత నానా చివాట్లు తింటోంది. కాని, భార్యాభర్తలు చాలా అన్యోన్యంగా ఉండటం గొప్పవాడి గొప్పతనం గనక, పైకి గొప్పవాడు, భార్యని చాలా గొప్పగా నలుగుర్లో గౌరవిస్తున్నాడు.

గొప్పవాడిలో గూడా సామాన్యకామం ఉన్నది. అది అప్పుడప్పుడు అతన్ని మామూలు మనిషిని చేసినా, గొప్పవాడు తన గొప్పతనానికి, విరుద్ధమని, భార్యకి ఏభైయ్యేపడి వొచ్చి, తనకీ ఇంద్రియాల శక్తి అడుగంటిం తర్వాత, నిష్కామకర్మ, ఇంద్రియాల్ని జయించినట్టు ప్రకటించి, భార్యచేత గూడా ఇంద్రియ నిగ్రహం చేయిస్తూ, పదహారేళ్ళ మనుమడికి ఇంద్రియ నిగ్రహం బోధ పరుస్తున్నాడు.

గొప్పవాడు, లేని సుగుణాల్ని ప్రకటించటంలో గొప్పతనం బాగా గ్రహించాడు. ఇప్పుడు చాలా గొప్ప గొప్ప సుగుణాల్ని ప్రదర్శిస్తున్నాడు. కాని గొప్పవాడి భార్య సాధారణ మనిషి కావటం ఆవిడకి గట్టి చిక్కే వొచ్చింది. ఆవిడ గొప్పవాడి అనుమతి లేకుండా ఎక్కడికీ వెళ్ళరాదు. కాని గొప్పవాడి కోసం, గొప్పగా నలుగురిలో గొప్ప మాటలు మాట్లాడాలి. ఇవన్నీ పాపం గొప్పవాడికి చాతవుకాని, తెలీదాయెను! గొప్పవాడ్నీ భార్యనీ, పత్రికా విలేఖరులు ఏదన్నా అడిగితే, గొప్పవాడి భార్య నవ్వాలి గాని, ఏమీ మాట్లాడ గూడదు. ఆమె పతి ''అనుసరణీయ'' గాక పోవటం ఆవిడ గొప్పతనానికే గాక, గొప్పవాడి ప్రతిష్టకీ భంగమాయెను మరి.

2

గొప్పవాడి భార్య చదువుకోలేదు. కాని, గొప్పవాడికి ఇది నామర్దాకాదు? తనే గొప్ప సూత్రాలు కొన్ని ఆవిడ పేర పత్రికలకి పంపిస్తున్నాడు. గొప్పవాడి భార్య పేర, కొన్ని పత్రికల్లో, అనేక వ్యాసాలు, ఫోటోలు, ప్రచురిస్తున్నారు, ఆవిడంత సుగుణవతి ఎక్కడన్నా ఉందా అనిపించేట్టు. కాని గొప్పవాడి భార్యకి మాత్రం ఇదంతా ప్రాణానికి వొస్తోంది. ఆవిడ గొప్పవాణ్ణి ఒకనాడు, పత్రికా విలేఖరులు, ఫోటో గ్రాఫర్లు, పెద్దమనుషులూ, లేనప్పుడు చూసి మెల్లిగా, ''ఏమండీ! మీరు తినకపోతేమానె

నన్నన్నా కాసిని వండుకు తిననివ్వండి, మీ గొప్పతనం మీకే ఉంటుంది'' అని అడిగింది, జిహ్వచచ్చి. కాని గొప్పవాడు ఒప్పుకోలేదు. గొప్పవాడి భార్య పకోడీలు తిన్నదంటే, అందులో ఉల్లిపాయ పకోడీలు, ఇంకేమున్నా ఉందా? ఎంత లోటు గొప్పతనానికి? అందుకని, మెల్లగా భార్యని మందలించాడు.

3

జీవితం, ఆనందాన్ని, అభిరుచుల్ని, గొప్పవాడి గొప్పతనం కోసం ధారపోసి, గొప్పవాడి భార్య, బతకటం దుర్భరమని భావించి, ఒకనాడు గొప్పవాడు, రహస్యంగా ధ్యానం వంకతో, వేసీ, నల్లమందు, గొప్ప కోసం తాగే నుంచినూనే, తాగి, డాక్టర్లకి గూడ అలివిగాకుండా, గొప్పగా చచ్చింది. ఆవిడ చావడం గూడా గొప్పవాడి గొప్పతనం నిలబెట్టే విషయమే! గొప్పవాడు, న్యాయంగా ఆవిడ్ని దహనం చేయవలసి ఉన్నా, గొప్పవాళ్ళనరూ, అట్లా చేయలేదు గనక, గొప్పగా, మంచి ముహూర్తంలో, భగవన్నామం జపిస్తో, ఆవిడని సమాధి చేసేడు. ఆవిడ ఆత్మని బతికున్నప్పుడు పెట్టిన గొప్ప క్షోభలు చాలక, చచ్చిం తర్వాత గూడా, ప్రార్థనలు చేసి, ఆవిడ ఆత్మ ఏలోకానికి చేరాల్సిందీ, తనే నిర్ణయిస్తున్నాడు! గొప్పవాడు, తన భార్యకి గొప్పగా సమాధి చేయటం, వగైరా, అన్ని ఫోటోలు, పత్రికల్లో, గొప్పగా ప్రకటించారు. గొప్పవాడి జీవితమే గొప్ప మరి! గొప్పవాడు, తన 60వ జన్మ దినోత్సవానికి, భార్య ప్రథమ సంవత్సరీకానికి, డబ్బు వసూలు చేసి, భార్య పేర గొప్ప తోట వేయించి, దాంట్లో, ఎల్లకాలాల్లోనూ, చల్లగా, వెచ్చగా ఉండే కుటీరం నిర్మించుకుని, గొప్పగా నివసిస్తున్నాడు. తోటలో, తన గొప్పతనం కోసం, అన్నీ ధారపోసి, ఉసూరు మని చచ్చిన వెనకటి, ఇద్దరు శిష్యుల పేరా, రెండు రాతిస్థూపాలు నాటించాడు, తన కొత్త, లేత శిష్యురాలి చేత.

(1, మార్చి 1948 జ్యోతి పక్ష పత్రిక)

1950 ప్రాంతంలో తన నూరు కథలు, అయిదారు నవలలతో ఆంధ్ర పాఠకలోకాన్ని కదిపి కుదిపి వేసిన 'శారద'కు ప్రోత్సాహం ఇచ్చి ప్రాచుర్యం కల్పించింది జ్యోతి. శారద మాతృభాష తెలుగు కాదు. తెలుగు చదువుకోలేదు. 12-13 యేళ్లు వచ్చేవరకు ఆంధ్రదేశంలో అడుగు పెట్టలేదు. అతని పేరు నటరాజన్, తమిళతంబి. తెలుగు పాఠకులకు శారదగా పరిచితుడు, ప్రసిద్ధుడు. సమాజంలో కొత్తగా అడుగిడుతున్న వ్యాపార విలువల చిత్రణ, ఒక వ్యవస్థ నుండి మరో వ్యవస్థ వైపు దూకుతున్న ఆనాటి మనుషుల గుణగణాల పరివర్తన శారద నవలల్లో ప్రతిఫలించాయి.

నీ కొడుకో నీ కూతురో జనించగానే మహదానందం పొందేవు - పండగ చేసుకున్నావు - కాని - ఓ రహస్య ప్రశ్న.

నీ కొడుకుకో నీ కూతురుకో నువ్వెంతమట్టుకు తండ్రివి?

నాకు తెలుసు - నేనెదురుగా ఉంటే చంపేంత కోపం నీకు వచ్చిందని -

కాని - విజ్ఞాన శాస్త్రంలో కోప తాపాలకి అర్థం లేదు. తావులేదు. ఏ ప్రశ్నయినా నిశ్చలంగా ఎదుర్కోవలసిందే!

నీ మనశ్శాంతికి మరో ప్రశ్న కూడా వేస్తా - నీ శిశువుకి నీ భార్య ఎంత వరకూ తల్లి?

పై ప్రశ్నలకు సమాధానం తెలుసుకొనే ముందు కొన్ని ముఖ్య విషయాలు గ్రహించాలి మనం.

జీవరాసులనంత కోట్లు మొన్న మొన్ననే నిర్మించిన అతి సూక్ష్మదర్శని (Ultra - microscope) తో కూడా చూడబడని అతి సూక్ష్మ జీవులు మొదలుకొని, ఏనుగూ, తిమింగిలంలాంటి అతిపెద్ద జంతువుల వరకూ ప్రపంచంలో ఉన్నాయి - వీటి జీవిత కార్యాలూ, జీవ చరిత్రలూ కూడా అన్నిరకాలుగా ఉంటాయి. కాని - జీవి అనదగిన ప్రతి పదార్థానికీ ఒక గుణం ఉమ్మడిగా ఉంది. అది ఏదంటే: తన తెగని పునర్నిర్మిస్తూ, పునరుద్భవింపజేస్తూ, శాశ్వతం చేయడానికి ప్రయత్నం చేయడం.

మానవ తెగలో స్త్రీలూ, పురుషులూ ఉన్నారు. గుర్రాల్లో, ఏనుగులలో, ఎలకల్లో, పక్షులలో, చేపల్లో - యింకా అనేక మిలియన్ల జీవులలో కూడా యిలాగే ఆడ, మొగ ఉన్నాయి. ఈ ఆడా, మొగ జీవులు తమ దేహాల్లో ప్రత్యేకించబడిన భాగాలలో లింగకణాలని తయారు చేస్తాయి. మొగ జీవులలోనివి పుంబీజాలూ, ఆడ జీవులలోనివి గ్రుడ్లూ అని సాధారణంగా అందాం. గ్రుడ్లూ, పుంబీజాలూ, కలుసుకుని, సంయోగించి నూతన జీవులవుతాయి. ఆడచేప అసంఖ్యాకంగా తనగ్రుడ్లని నీటిలో వదలిపెటుతుంది. అలాగే మొగచేప తన బీజాలని కూడా నీటిలో వదులుతుంది. నీటిలో తేలియాడుతూన్న యీగ్రుడ్లూ, పుంబీజాలూ అదృష్టవశాత్తూ సన్నివేశమై సంయోగించి చిన్న చేపలవుతాయి. కొన్ని పక్షిజాతుల్లో సంభోగానంతరం మగపక్షి

తనదారిని తాను పోతుంది. ఆడ పక్షి మిగిలిన కార్యమంతా నిర్వహిస్తుంది. యీతీరుగా పునరుద్భవకార్యంలో స్త్రీ పురుష జీవులు వేరు వేరు తెగలలో వేరు వేరు బాధ్యతలు వహిస్తారు. మానవ తెగలో నీ కొడుకూ నీ కూతురూ ఎట్లా జనించారో కొంతవరకూ తెలిసికొన్నాం.

కాని - పునరుద్భవానికి యిదొక్కటే మార్గం కాదు. ఆడా, మగా తెగలవసరం లేకుండానే యీ కార్యం నెరవేరుతుంది కొన్ని జీవులలో. ఇట్టాంటివి లింగ (asexual) పునరుద్భవం సాధారణంగా న్యూనజీవ తెగలలో ఉంటుంది. వీటిలో స్త్రీ పురుష భేదం లేదు.

ఉదాహరణంగా, ఏకీకరణజీవి ''ఎమీబా'' తీసుకుందాం. ఈ జీవిలో ఒక్కగా నొక్కకణమే ఉంటుందని మొదటే తెలుసుకున్నాం. యిది పెరిగి పెద్దదయి, రెండు సమానభాగాలుగా ఒక విచిత్ర పద్ధతిలో విడిపోయి, ఏ భాగానికాభాగం తిరిగీ ఒక పరిపూర్ణమైన ఎమీబాగా తయారవుతుంది. ఇలాగే సూక్ష్మజీవులనేకంలో (Bacteria) లింగావసరం లేకుండానే సులభ పద్ధతిలో ఒకటిరెండు ముక్కలై ప్రతిముక్కా పూర్ణజీవి అవుతుంది. కనక, మనంగాని, యితర భౌతికశక్తులుగాని ధ్వంసం చేస్తేనే తప్ప, యీ ఏక కణజీవులకి మరణమన్నది లేదు. ప్రతిముక్కా పరిపూర్ణ జీవి అవుతుంది. యివి ''అమరజీవులు''- దేవతలన్నమాట. వీటిలోని వివిధాంగ విచక్షణా, అవయవ నిర్మాణం, లింగభేదం కూడా లేదు.

లింగమన్నది జీవ పరిణామంలో ఒక దశకు వచ్చిన తర్వాత కనపడిన నూతనత్వం, దీని ప్రాముఖ్యతా, ఉపయోగం, (నిరుపయోగం?) మరోమారు తెలుగుకుందాం.

జీవం పరిణామం చెందినకొద్దీ జీవిలో కణాల సంఖ్య హెచ్చవుతుంది. వివిధావయవాలూ, ప్రత్యేక కార్యాలకి ప్రత్యేక అంగాలూ నిర్మితమౌతాయి. నీలో ఒక్కొక్క అంగుళానికి కొన్ని లక్షల కణాలున్నట్టు యిదివరకే తెలుసుకున్నాం.

కాని- యీ లక్షలాది కణాలూ ఒక గ్రుడ్డూ, పుంబీజ కలయికలో నుంచి ఉద్భవించిన సంగతీ, సంయోగించిన గ్రుడ్డు ఏ విధంగా విభజించుకుని, ప్రత్యేకించుకుని, వివిధాంగాలని నిర్మిస్తుందో కూడా తెలుసుకున్నాం. దీన్నే విభజీకరణ (Differentiation) అంటారు. ఈ విభజీకరణావస్థలోనే కొన్ని కణాలు పునరుద్భవాంగాలుగా అందులోని లింగ కణాలుగానూ ఏర్పడతాయి.

నీ కొడుకుకూ, నీ కూతురుకూ యుక్త వయస్సు రాగానే, పునరుద్భవాంగాలు తమ ధర్మాన్ననుసరించి వృద్ధిపొంది పుంబీజాలనీ, గ్రుడ్లనీ పెంపొందిస్తాయి. వారి వారి వివాహానంతరం తిరిగీ అందరిలాగే జీవలహరికి తోడ్పడుతారు. వారికి కూడా కొడుకులూ కూతుళ్లూ జన్మిస్తారు. యింకా కొంత కాలానికి వారుకూడా ముదుసళ్లౌతారు. ఈ ప్రకారం యీ మానవ యంత్రం తన విద్యుక్త ధర్మం నెరవేర్చిన తర్వాత అంతిమక్షణంలో దీర్ఘ సమాధి చెందుతుంది.

కాని జీవనదిమాత్రం నిరాటంకంగా ప్రవహిస్తూ పోతుంది. యీ నిరాటంక ప్రవాహానికి కారణం ఏమిటి? నువ్వు పురుషుడవయితే నీ పుంబీజమూ, నీ భార్య గ్రుడ్డూ, స్త్రీ వైతే నీ అండమూ, నీ భర్తబీజమూ కలిసిన సంయోగం!! జీవిత విచిత్రాలలో యిది వొకటి! నీ గ్రుడ్డునీ దేహంలోజనించి, పిదప విడిపోయి పుష్పించి, ఫలించి, అనేక మిలియన్ల కణాలయి అందులో

కొన్నిటిని తిరిగి జీవయాత్రాభివృద్ధికి నియోగించి నీ శిశువు రూపంలో జీవిస్తోంది. అనంతంగా సాగే యీ పద్ధతే జీవప్రవాహం. కనక వ్యక్తి దేహంలోని యితరాంగాలన్నీ ముదిమి చెంది, కృశించి, మరణంచెందక మునుపే, ఆ వ్యక్తిలోని ఓ చిన్నభాగం విడిపోయి, తన ననంతం చేసుకునేందుకు నూతనాశ్రయాన్ని నిర్మించుకుంటుంది. యీ పదార్థానికి మాత్రం జరామరణాలు లేవు. యిదికూడా ''అమరజీవి'' దీన్నే ''వైస్మాన్'' (Weismann) అన్న శాస్త్రజ్ఞుడు ''అమరపదార్థం'' (Germplasm) అన్నాడు మరణించే మిగిలిన పదార్థ మంతటినీ ''సోమా'' (Soma) అంటారు. నీలో నాలోకూడా సుమారు వెయ్యికి 999 పాళ్ళు ''సోమా,'' ఒక పాలు ''అమరపదార్థం'' ఉన్నాయి.

యీ అమరపదార్థం తరతరాలుగా జీవిస్తూ తనకి ఆశ్రయమిచ్చి, సంరక్షించి, తన కామక్రోధ, మోహాలకీ, ప్రేమ, ఉద్రేకాలకీ, జీవశక్తికీ తానిచ్చే నూతన తరాన్ని సృష్టించుకుని అందులోనికీ, తరువాత మరోతరంలోనికీ ప్రవహిస్తూ పోతుంది. నీవూ, నేనూ, మనమందరం కూడా యీ అమరపదార్థ ప్రవాహంలో అక్కడక్కడ ఏర్పడే అనిత్యపు ఆనకట్టల లాంటి వాళ్ళం. యీ జీవపదార్థమే జీవిత వారసత్వాన్ని Heredity కూడా తరతరాలకి అందిస్తుంది. విపులంగా తెలుసుకుందాం. ఒక్కొక్కతరం ఒక్క ఆనకట్టవంటి దన్నమాట. జీవప్రవాహమంతవరకూ వచ్చి కొద్దికాల మక్కడ శ్రమ తీర్చుకుని, నీలో నాలో అమర పదార్థన్ని తిరిగి వృద్ధిచేసి, ఉప్పొంగి, ఆనకట్ట పైకిపొరలి ప్రవహించి తన గమనాన్ని సాగిస్తుంది.

యీ సంగతి తెలిసిన తర్వాత నీలో ఉన్న అమర పదార్థం అచ్చంగా నీ స్వంతంగాకుండా అనేక తరాల నుంచీ, అనాదినుంచీ వస్తోందని బోధపడుతుంది. నీకు, కనక నీ కొడుకుకో, నీ కూతురుకో నువ్వెంతవరకూ తండ్రివి? నువ్వెంత మట్టుకు తల్లివి? అన్న ప్రశ్న నీలో మొదట రగులు కొలిపిన కోపాన్ని రేప కూడదు. ఎంచేతంటే- నీ కొడుకో, నీ కూతురో అయిన సంయోగిత గ్రుడ్డులో తండ్రినుంచి పంబీజం, తల్లినుంచి సంక్రమించిన అండమూ ఉన్నాయి. పుంబీజంలోని 24 క్రోమోజోములూ, అండంలోని 24 క్రోమోజోములూ కలిసి నీ శిశువు కణంలోని 48 క్రోమోజోము లయ్యాయి!! కాని ఆ పుంబీజమో, గ్రుడ్డో తరతరాల నుంచీ ప్రవాహంలో వచ్చి, తాత్కాలికంగా నీలో మకాంచేసి, ఆ కాలంలో నీ వల్ల జీవశాస్త్రికంగా కొన్ని పరిస్థితులు అనుకూలిస్తే కొద్దిగా మార్పు చెందిన ''అమర పదార్థ విశేషం!! కనుక జీవశాస్త్ర రీత్యా నీ కొడుకుకూ, నీ కూతురుకూ, నీవే కాకుండా నీ వెనుక తరాలన్నీ కూడా యించుమించుగాం తల్లిదండ్రులన్నమాట!! అన్ని తరాల్లో నీ దొక్కతరమైన నువ్వెంత మట్టుకు తండ్రివో (తల్లివో) నువ్వే ఆలోచించుకో!!

మరో విషయం - వయో నిర్ణయంలో కూడా మనం మరో పొరపాటు చేయడం అలవాటూ, పద్ధతీ, సాంప్రదాయమూ అయిపోయింది.!! సాధారణంగా శిశువుకన్నా తల్లితండ్రులు పెద్ద వాళ్లని ఏకగ్రీవంగా ఒప్పుకుంటాం మనం!! కాని, పై విషయాలు తెలిసిన తర్వాత కూడా అలా

అనుకోవటం పూర్తిగా నిజంకాదు అని తేలుతుంది!! అసలు, ''నీ వయస్సు'' అంటే ఏమిటి? ''నువ్వు'' అంటే ఏమిటి? యీ ప్రశ్నలు చిలిపిగానో, లేకపోతే వేదాంతంలాగో కనపడవచ్చు! కాని అదేమీ కాదు!! ''నీ'' అన్న వ్యక్తిలో రెండు భాగాలున్నాయి! నీ కాళ్లూ చేతులూ, ముక్కూ, కన్నూ, నోరూ, యిత్యాది అంగాలు - యివి తరతరానికీ ఎప్పటికప్పుడు తయారయి, ఆ తరంతో అంతమయ్యే అనిత్య ''సోమా'' భాగం. రెండోభాగం ''నీ''లోని ''అమరపదార్థం'' (Germ - plasm)!! కనక ''నీ వయస్సు'' కూడా రెండురకాలు!! ఒకటి ''నీ'' అమరపదార్థ వయస్సు - రెండు ''నీ'' సోమాయుతవయస్సు!! కాలప్రమాణంలో 'నీ' సోమా నీ శిశువు సోమాకన్నా అప్పుడే కొద్ది సంవత్సరాల క్రిందటినుంచీ ఉంది. కనుకనే నీ శిశువు కన్నా నువు 'పెద్ద' వాడవని అనుకుంటున్నావు, యితరులూ, ప్రభుత్వమూ ఆ పద్ధతినే అనుకరించి ''శిశువుకన్నా తల్లిదండ్రులు'' పెద్ద అని వ్యవహరించుతున్నాయి!! అంటే మీ సోమాయుత వయస్సునే లెక్కలోకి తీసుకుంటున్నారన్నమాట! అది లోక సహజమై పోయింది!! కాని - ''అమరపదార్థ వయస్సు'' తీసుకుంటే, నీ శిశువులో ఉన్న అమరపదార్థం నీ దానికన్నా హెచ్చుకాలం అనుభవించిందన్నమాట! కాలప్రమాణంలో అమరపదార్థ వయస్సు పోనుపోను హెచ్చవుతుంది!! కనక యీ వయస్సు ప్రకారం, ప్రతి శిశువూ తన నూతా సితలకంటే పెద్దదన్నమాట!! నీ కొడుకూ, నీ కూతుళ్లకన్నా నువ్వూ నీ భార్యా చిన్నవాళ్ళున్నమాట!! యీ విషయం జ్ఞాపకముంచుకోవటం అప్పుడప్పుడు చాలా లాభదాయకం ప్రతీ తల్లి దండ్రులకీ!! ఇప్పుడు ముగించేముందు మరొక్క విషయం మాత్రం తెలుసుకుందాం. నీ శిశువుకు నువ్వు 24 క్రోమోజోములూ, నీ భార్య 24 ఇవ్వటంవల్ల నీ శిశువు వారసత్వాన్ని మీరిద్దరూ సమానంగా నిర్ణయిస్తారు. కనక '' ఆత్మావైపుత్రనామాసి'' (నేనే పుత్రుడనై జన్మించుచున్నాను) అన్న వాక్యంలో సత్యం సగమూ, అసత్యం సగమూ ఉందన్నమాట!! నువ్వే కాకుండా నీ శిశువులో నీ భార్యకూడా సమానంగా ఉంది. హెచ్చుతగ్గులు ఎంచడం ఒక మూఢనమ్మకానికి బలికావడమున్నమాట! మళ్లీ మారు నీ కొడుకూ, నీ కూతురు గురించి మరికొన్ని విషయాలు తెలుసుకుందాం!!

జ్యోతి,
1 మార్చి,
1948.

నవ్యమానవ వాదం

రచన: యం. యన్. రాయ్, అనువాదం: ఆవుల గోపాలకృష్ణమూర్తి ఎం.ఎ.బి.ఎల్., ప్రచురణ: శ్రీ కృష్ణా బుక్ డిపో, తెనాలి. 1/8 క్రౌన్ సైజు 82 పేజీలు. వెల: రూపాయి.

ఒక్కొక్క దేశంలో ఒక్కో గొప్ప మార్పు వొచ్చేందుకు ఒక పెద్ద విప్లవం జరిగితీరాలి. గత లోక చరిత్రలో ఇలాటి ఉదాహరణలు ఎన్నో ఉన్నవి. క్రమంగా ప్రపంచమంతటా మార్పులు వొస్తూనే ఉన్నవి. కాలక్రమాన మేధావులు ఆలోచించిన సూత్రాలప్రకారం - ఆ మార్పులు మంచికీ, చెడుకూ కూడా దారితీస్తూ ఉన్నవి. గత ప్రపంచ యుద్ధం ఆఖరు కావటంతో అనేక దేశాల్లో అనేక గొప్ప మార్పులు జరిగే సూచనలు కనిపిస్తున్నవి; కొన్ని దేశాల్లో జరిగినవి కూడాను.

ఐతే కేవలం ఒకవర్గం వారి స్వార్థం కోసం కాకుండా ప్రజలందరికీ - కనీసం చాలామందికి అందుబాటులో ఉండే విధానంకోసం ప్రతిదేశమూ ఎదురుచూస్తూనే వుంది. ఒక్కో రాజకీయ పక్షం వారు, ఒక్కోరకం ప్రణాళికను తయారు చేశారు. దాన్నే వారు ప్రజల్లో నాటుకునేట్టు చేయసాగారు.

మనదేశంలో గొప్ప రాజకీయ మేధావుల్లో యం.యన్. రాయ్‌కి అత్యుత్తమ స్థానం వుంది. ఆయన రచనల్లో విజ్ఞానం వెల్లివిరుస్తుంది. ఆచరణీయ సిద్ధాంతాలా ఆయనవి అంటే - అది దేశం ఆచరించినప్పుడే కాని రుజూకాదు. ఐతే - రాయ్ చెప్పే ప్రణాళికను తీసివేసేందుకు వీల్లేదు. వర్గబుద్ధితో కాకుండా, విశాలదృష్టితో చూస్తే ఆయన చెప్పేదాంట్లో ఎంతో సత్యంవుంది. రాజకీయవాదుల్లో అనేక అభిప్రాయభేదాలున్నవి. అవి రాజకీయంగా కాకుండా, వ్యక్తిగతంగానూ వర్గగతంగానూ మారి ఉండటం శోచనీయం అదృష్టి లేకుండా యీ పుస్తకం చదివినట్టయితే ఒక నూతనదృక్పథానికి గురికాక తప్పదు. సత్యాన్ని శోధించవలసిన బాధ్యతవున్న ప్రతిరాజకీయ వాదీ చదవవలసిన పుస్తకం.

అనువాదం చాలా సాఫీగా నడిచింది. సులభశైలిలో ఉండటంవల్ల - మూలాన్ని చదువుతూన్నట్టే వుంది.

(జ్యోతి, 1 మార్చి, 1948.)

లేఖాయణం

MISIMI
మిసిమి

Editor:
Ravindranath Alapati Ph Off 612337

26.6.93

రవీంద్ర లేఖలు
రవీంద్రకు లేఖలు

(ఈ ట్రైప్డ్ లేఖను రవీంద్రనాథ్‌గారు ప్రస్తుత మిసిమి సంపాదకులు అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డిగారికి 5-1-1968న రాయగా అది 8-1-1968న చేరింది. ఇది ఎందుకు రాయవలసి వచ్చిందంటే, ఆయన తేదీ లేకుండ, ఎవరిని ఉద్దేశించి రాసింది పేర్కొనకుండ రాశారు. స్కూల్ ఫైనల్ దాటనివ్యక్తి ఈ లేఖ రాశారంటే, ఆయన ఏ ఎత్తులకు ఎదిగిందీ, ఈ ఉత్తరం చదివిన వారికి అర్థం అవుతుంది - భాషాపరంగా, విషయం దృష్ట్యా, చింతనా సామర్థ్యం పరంగా.)

My Kerala trip was colourful and pleasant. It was a real change from the routine.

At present I am reading " Dhammapada ". It is an original translation from Pali by Prof. P. Lal. The book is very interesting and stimulating, fresh and modern. For example, I quote for your perusal, from the preface - " All that we are is the product of what we have thought" is " we are what we think".

In my leisure hours, I get imbibed in various thoughts. Some are short-lived, some are agitating truths, some convincing, some contradictory and some conflicting... I do not know how to resolve the contradictions.... between the images of the past and the realities of the present - Do you remember sometime back we were discussing why the literature is limping compared to the giant strides of science and technology. I presume you are following the marvellous feat of transplantation of heart by Dr. Christian Bernard at Cape Town. The patient, Washansky, lived for 18 days after the replacement of his heart by that of Miss Phillip. Now, I do not know, who lived during this 18 days..was it Washansky or the donor ? I think this is another sledge hammer blow on literature, which glorified the heart in thousands of pages. Now the modern medical science has proved that the heart is merely an innocent pump !.

With what little knowledge I have in Philosophy, Eastern and Western, I have many a thoughts which are parked in my mind that are debatable. That is, can one taste purity itself without the purity of mind and body? Something like, cannot one taste the sweetness without the aid of sugar! What have you to say on these subjects.

My Kerala trip was also a revealing one. It was a peep into the life and traditions of the people there. There I met many authors with differant views and ideologies. One among them was Mr. Thahagi Sivasankaran Pilly, the author of 'Chemmen'. His books are translated in 14 languages and are popular in Western countries. At the outset I feel the Malayalam literature is far advanced in quality and quantity. Mr T. Sivasankaran Pillay was with me for 3 hours. The dialouge was very illuminating. About the Kerala society, my impressions are, the MAN there is a partner of family firm. For us he is the head of the family. There the man is a part-time man, part-time mother, part-time maid, part-time cook etc. In Kerala traditional sex roles in the homes are quite differant from that of Andhra. There the women are assertive We know the percentage of literacy in Kerala is highest in India. My observation was that .. since intel lectualality is equated with masculinity in

in our culture, — the intelectual women may entertain strong doubts about their femininity. One intellectual and cultured woman confessed to me in private conversation that the old fashion and diaphagram and the new fashion pill allow the women to have more freedom of decision in regard to their sexual relations.

I will be coming over there for Bhogi. There is a special significance in my life on every Bhogi festival day. I shall utilise this occasion to burn such things that have enslaved me. I would very much like to have your, as professor of philosophy, opinions about all the debatable points in this letter.

With best wishes.

Yours sincerely

(A. Ravindranath)

N.B. About the Vishakapatnam. Your data and information is not encouraging. Anyway we will discuss the pros and cons of it in person.

(ఆయన నా దగ్గర ఏ విషయాన్నీ దాచలేదు... పై లేఖలో చివరి పేరాలో ''నా జీవితంలో భోగి (సంక్రాంతి) కి ఒక ప్రత్యేక సాకూతార్థం ఉంది. నన్ను బానిసగా చేసుకొని సంకెళ్ళు వేసిన ఆ సాకూతార్థాన్ని కాల్చి వేయడానికి రేపు రాబోయే భోగిని... (తెనాలిలో)... ఉపయోగించుకొంటాను.''

ఆ రోజుల్లో ఆయన్ను బంధించి కట్టిపడవేసిన సాకూతార్థాలేవో నాతో పంచుకొనే ఉంటారు. మేము చర్చించే ఉంటాము. ఆ రోజు ఈ విషయాలను ఎక్కడైనా రాసి ఉంచాలని, భవిష్యత్తులో ఇలాంటి అవసరం ఎదురవుతుందనీ నేను ఊహించ లేకపోయాను. 1968 నాటి ఆ ''అంతరంగిక విషయాలు'' స్మృతిధార నుంచి జారిపోయాయి. నేను వాటిని తిరిగి తోడి తీయలేను. అవి ఎప్పటికీ విస్మృతాలే.

మరో విషయం పోస్టు స్క్రిప్టు N.B. లో ఒక విషయం ప్రస్తావించారు. విశాఖపట్టణం గురించి.

1967 డిసెంబరులో ఆయనకో ఆలోచన వచ్చింది. విశాఖపట్టణంలో మరో ''జ్యోతి ప్రెస్‌ను నెల కొలిపి, నన్ను, బాసన్నగారిని (ఆయన నాలుగో కుమారుడు) అక్కడి నుంచి వ్యాపారం నడపాలని. అందుకని అక్కడ ప్రింటింగ్ ఫీల్డు ఎలా ఉందో అధ్యయనం చేయమని నన్ను విశాఖపట్టణం పంపారు. అక్కడ ఆ రోజుల్లో ఫీల్డు బాగోలేదు. ఆ విషయమే వ్రాశాను. దానికి ప్రతిస్పందన ఆ పోస్టు స్క్రిప్టు N.B.)

Ph: Res: 229631

Dr. RAVURI BHARADWAJA, D.Litt.,

11.8.95

పూజ్యులు

శ్రీ రవీంద్రనాథ్ గారికి నమస్కారాలు!

[illegible]

PTO

"Kaanthaalayam", 159/2RT, Vijayanagar Colony, HYDERABAD - 500 457

TUMMAPUDI
GUNTUR DT
522 330
11.8.95

ఆత్మీయులు
డాక్టర్ రవీంద్రనాథ్ గారు,
కాలిఫోర్నియా అంతర్జాతీయ విశ్వవిద్యాలయం అభిమానంగా ఇమ్మన్న డాక్టరేట్‌ను చేసినందుకు మా హార్దికాభినందనలు.

అవి మామూలు అభినందనలు కావు. అసలైన అభినందనలు వేరే వున్నాయి. అవి "మిసిమి" సంబంధాలు. "మిసిమి"ని అంత దక్షతతో సృజనాత్మకంగా, సమీక్షాత్మకంగా, భావుకంగా, తాత్వికంగా నడుపుతున్నందుకు మిమ్మల్ని మనసారా అభినందించకపోతే నా కలం అపవిత్రమవుతుంది.

స్వర్గీయ నాయుడమ్మగారిని గురించి ఒక సంక్షిప్త రచనను ఇందు వెంట పంపినాను. దాన్ని మీకు అవకాశం వున్న "మిసిమి" సంచికలో ప్రధాన వ్యాసంగా ముద్రించండి ఆయన గౌరవార్థం.

మహానాడుకు కొందరు మిత్రులు "ఏమి చేస్తున్నావు" అని అడిగితే "మిసిమి"కి రచనలు చేస్తున్నానని చెప్పాను. అందుకు వారు "మంచి పని చేస్తున్నావు" అని [illegible] వెలిబుచ్చారు. వారంతా "మిసిమి" పాఠకులు, పాఠకశ్రేణులు. చాలు.

Encl: Article.

ఆనందంతో,
సంజీవదేవ్

डा. आर. वी. वैद्यनाथ अय्यर
Dr. R. V. Vaidyanatha Ayyar
Tel. : 3386995, 3381040
Fax : 3384093

सचिव
भारत सरकार
पर्यटन और संस्कृति मंत्रालय
संस्कृति विभाग
नई दिल्ली -११० ००१
SECRETARY
GOVERNMENT OF INDIA
MINISTRY OF TOURISM & CULTURE
DEPARTMENT OF CULTURE
NEW DELHI - 110001

August 28, 2000

Dear Sri Venkateswara Reddy Garu,

Thank you very much for your letter dated August 16, 2000.

In fact after skipping through the special issue of 'Misimi' on post-modernism I wanted to write to you complimenting you on the publication. Never never did I dream I would come across in Telegu articles on this arcane subject. I should not have been surprised for the first issue which you sent me had an article on the Frankfurt School. I should not have been required for the first issue which you sent me had an article on the I was particularly delighted to come across the translation of Sokal's hoax which incidentally is referred to in my Sahitya Akademi speech. I am rather curious to know the profile of your readers, for those who wish to grapple with Literary Theory world as well grapple the obscure texts in English

I was also delighted to know that you are an Andhra University alumnus, a child of the same Zeitgeist

Please find enclosed the English transcript of my Sahitya Akademi lecture (my friend, classmate & roommate in the University, RVR translated into Telegu) as well as an article of Steven Weinberg, a Novel laureate in Physics, on Sokal's hoax.

With regards,

Yours sincerely,

(R.V. Vaidyanatha Ayyar)

Sri A Venkateswara Reddy,
Editor MISIMY
Tenali
(Andhra Pradesh)

'మిసిమి' ఆలపాటి స్మృతి

Misimi Editor dies

అక్షరాంజలి

Rediscovering oneself

రవీంద్రనాథ్‌కు
పత్రికల,
ప్రముఖుల
నివాళి

స్మృత్యంజలి

ఏటుకూరి బలరామమూర్తి

ఆదివారం ఫిబ్రవరి 11, మధ్యాహ్నం 3.30 ప్రాంతంలో మా ఇంట్లో చదువు కుంటున్నాను. ఫోన్ మోగింది. 'తాతగారూ మీకే' అని మా చిన్నమనుమరాలు చెప్పింది. రవీంద్రనాథ్‌గారి తమ్ముని కుమారుడు హైదరాబాద్ నుండి ఫోన్‌లో రవీంద్రనాథ్‌గారు మరణించారనే ఆశనిపాతంలాంటి వార్త చెప్పారు.

జనవరి 29న నేను రచించిన 'విశిష్ట విశ్లేషణ' గ్రంథావిష్కరణకు ముఖ్య అతిథిగా వారిని పిల్చాము, బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో. ఎంతకూ వారు రాలేదు. తర్వాత వస్తారు గదా అని సభను నిర్వహించాము. మర్నాడు తెలిసింది, వారు అనారోగ్యకారణంగా 'మెడిసిటీ'లో చేరారని.

విజయవాడ తిరిగివచ్చిన వెంటనే వారి పేర జాబు వ్రాశాను. 'మిసిమి' మాసపత్రిక రవీంద్రనాథ్‌గారి పెంపుడు బిడ్డ. వారు లేనిదే 'మిసిమి' లేదు. మీకోసం కాకపోయినా, మిసిమి పత్రిక కోసమైనా మీరు అనారోగ్యం నుండి కోలుకోండి అని ఆ జాబులో వ్రాశాను. 10 రోజులు కూడా గడవలేదు. మరణవార్త విన్నాను. బహుశా నా ఉత్తరం వారి టేబుల్ మీద వుండివుండవచ్చు. అసంఖ్యాకులైన వారి సాహితీ మిత్రులలో నేనూ ఒకడిని అని గుర్తించి, వారి తమ్ముని కుమారుడు నాకు ఫోన్ చేశాడనుకోవాలి.

వారితో నా పరిచయమే విచిత్రంగా జరిగింది. కీ. శే. జి.వి. కృష్ణరావుగారు మా ఉభయులకు ఉమ్మడి మిత్రులు. వారి సంస్మరణ సంచికలో, చాలాకాలం క్రితం వారు అనువదించిన విగ్రహ వ్యావర్తిని పై నేనొక సమీక్ష వ్రాశాను. అది రవీంద్రనాథ్‌గారిని ఆకర్షించింది. 'మిసిమి'లో ఆ వ్యాసాన్ని అచ్చువేసి నాపేర పంపించారు. నాటి నుండి గత మూడేండ్లుగా మిసిమి నాకు వస్తూనే వుంది.

వారి పత్రిక పేరు 'మిసిమి' - వారి దేహచ్ఛాయ కూడా మిసిమి. బహుశా ఆ పేరు రావటానికదే కారణమేమో.

నాటి నుండి సుమారు 10, 12 వ్యాసాలు, సాంఖ్యం, బౌద్ధం, శూన్యవాదాలపైన, గ్రీకు తాత్త్వికులపైన వారి పత్రికలో వ్రాశాను. వారి పత్రికలో అచ్చుకావటం అంటే తెలుగు మేధోలోకంలో ఒక స్థానం సంపాదించుకోవటమే. అదే పారితోషికం. అది చాలదన్నట్లు ప్రతి వ్యాసానికి కొంత పారితోషికం పంపేవారు.

హైదరాబాద్ వెళ్ళిన రెండు సందర్భాలలో వారి ఆఫీసు (RTC Cross Roads) కళాజ్యోతి ప్రెస్‌కు వెళ్ళి వారితో సుదీర్ఘంగా చర్చించాను.

వారు క్రమబద్ధంగా చదివింది తిరువెళ్ళులో 6వ క్లాసు వరకు మాత్రమే. డిగ్రీలు లేని పండితులకోవకు చెందినవారు. వారితో మాట్లాడుతుంటే ప్రాచ్య, పాశ్చాత్య తాత్వికులు, సాహితీవేత్తలు, పరిశోధకులు, విమర్శకులు అందరి ప్రస్తావన వచ్చేది.

తొలిరోజులలో వారిపై ఎం. ఎన్. రాయ్ ప్రభావం హెచ్చు. కాలంగడిచినకొద్దీ అన్ని సిద్ధాంతాల సారాన్ని ఆకళింపు చేసుకుని, జీర్ణించుకోవటమే జ్ఞానాన్వేషణకు మార్గం అనే భావనకు వారు చేరుకున్నారు. ఈ భావ సాన్నిహిత్యమే, నన్ను వారికి సన్నిహిత సాహితీ మిత్రులలో ఒకరినిగా చేసింది.

1946లో జ్యోతి, రేరాణి, మిసిమి పత్రికల ప్రచురణ ద్వారా వారు గొప్ప సంచలనం సృష్టించారు. సంచలనం ద్వారానే భావ జడత్వం బద్దలై సత్యాన్వేషణకు మార్గం సుకర మౌతుందని వారి విశ్వాసం. 1952లో హైదరాబాద్ చేర అత్యాధునికమైన 'కళాజ్యోతి' ప్రింటింగ్ ప్రెస్ స్థాపించారు. హైదరాబాద్‌లోని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే అత్యున్నత ప్రింటింగ్ ప్రెస్‌లలో అది ఒకటి.

దాదాపు 7 ఏండ్లుగా వారు 'మిసిమి' పత్రికను నిర్వహిస్తున్నారు. ఉత్తమ సాహితీ విలువలు గల వ్యాసాలు మాత్రమే ప్రచురించేవారు. సంచలనాత్మక జర్నలిజం వదిలి వేశారు. సంచలనాత్మకభావ ప్రసారాన్ని మాత్రం చేస్తూనే వున్నారు. తమకు నచ్చకపోతే, ఎంతటి సన్నిహితులైనా ''అయ్యా మీ వ్యాసం బాగులేదు'' అని నిర్మొహమాటంగా చెప్పగల ధీశాలి. చెప్పటం విశేషం కాదు, అవతలి వారిచేత కూడా ''బహుశా ఔనేమో'' అనిపించగల నేర్పు, మంచితనం, మృదుభాషిణ వారి సొత్తు.

''నా పిల్లలకు ఆస్తి సంపాదించి పెట్టాను. నా మానసిక తృప్తి కొరకు లాభనష్టాలతో నిమిత్తం లేకుండా 'మిసిమి' నడుపుతున్నానని'' వారు అనేవారు. వారి పుత్రులు ఎన్నడూ యిందుకు అభ్యంతరం చెప్పని సహృదయులు.

బౌద్ధం పట్ల వారికు ఆసక్తి, అభిరుచి హెచ్చు. అదే రవీంద్రనాథ్‌గారిని బాగా ఆకట్టుకున్న అంశం. తెనాలిలో కొన్ని నెలల క్రితం జి.వి. కృష్ణరావు స్మారకసభలో నేను మాట్లాడాను. ''రవీంద్రనాథ్‌గారు మీ పేరు సూచించారు. బహుశా వారు కూడా సభకు రావచ్చు'' అన్నారు నిర్వాహకులు.

సాహితీ, సాంస్కృతిక రంగాలలో ఎక్కడ ఏ మూల చిన్న 'మెరుపు' కనిపించినా, ఆ మెరుపును భూమార్గం పట్టించి తెలుగు వారికి అందుబాటులోకి తీసుకురావటమే వారి ఏకైక తపన.

వీరి ఘనతను తెలుగువారు గుర్తించలేదు. అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యా లయంవారు 1995లో డాక్టర్ ఆఫ్ లిటరేచర్ డిగ్రీతో సత్కరించారు.

ఇంతటి ఉత్తమ సంస్కారి, అంతర్ముఖులు అరుదుగా జన్మిస్తూ వుంటారు.

''ఆఫ్ఘనిస్థాన్‌లోని బామియాన్ ప్రాంతం (మతోన్మాద తాలిబన్లు ఇటీవల పురాతన బుద్ధ విగ్రహాలను విధ్వంసం చేసింది ఇక్కడే) ఆసియా నాగరికతకు, సంస్కృతికి మాత్రమే ప్రతీక

కాదు. అది భారతీయ చింతన కళలు పాశ్చాత్య దేశాలకు, అదే విధంగా పాశ్చాత్య చింతన, కళలు, భారతదేశంలో ప్రవేశించడానికి సింహద్వారంగా ఉపకరించింది......

ఈ మార్గం వ్యాపారం వాణిజ్యాలకే ప్రధాన మార్గంగానే కాదు, ప్రపంచ ప్రసిద్ధి చెందిన విజేతలు సైరస్, అలెగ్జాండర్, చెంఘిజాఖాన్, తైమూరు, బాబరులాంటి వారు ఇదే మార్గంలో ప్రయాణించటమే కాకుండా యుద్ధాలు చేసిన చారిత్రక దాఖలాలున్నాయి. ఇందరు మహా విజేతలు, నిరంకుశ చక్రవర్తులు ఈ మార్గంగుండా వెళ్లినా, యుద్ధాలు చేసినా ఆ శాంతమూర్తి అహింసా వాది బుద్ధుడి విగ్రహాల జోలికి ఎవరూ వెళ్ల లేదు. పాశ్చాత్య చరిత్ర కారులచే మహా నియంతగా, అనాగరికుడుగా, నరరూపరాక్షసుడిగా చిత్రించబడిన చెంఘిజ్ ఖాన్ కూడా బామియాన్ విగ్రహాల వైపు కన్నెత్తి చూడ లేదు......

ఎంతో చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యం వున్న అక్కడి బామియాన్ విగ్రహాల జోలికి ఎన్ని రాజకీయ, మతపరిణామాలు జరిగినా ఎవరూ వెళ్లలేదు. నేటి మతోన్మాద తాలిబన్ల అనాగరక, ఆటవిక, వికృతచర్యలకు ప్రేరణగా హూణుల చర్యలు కనిపించినా, వారు కూడా చేయలేని పనిని తాలిబన్లు ఎటువంటి సంకోచం లేకుండా మానవతా మూర్తి, శాంతిదూత విగ్రహాలపై దాడి చేయగలిగారు....................

రాతి విగ్రహాల కోసం ప్రపంచమంతా ఇంత రాద్ధాంతం చేయాలా అని తాలిబాన్ల నేత ముల్లా ముహ్మాద్ ఒమర్ ప్రకటించడం ఆయన వివేచనా రాహిత్యాన్ని, చారిత్రక అజ్ఞానాన్ని సూచిస్తుంది. బుద్ధుడి విగ్రహాలు కేవలం ఒక దేశానికి, మతానికి ప్రాతినిధ్యం వహించడం లేదు. బుద్ధుడి విగ్రహాలు ప్రపంచంలో ఎక్కడయినా, ఎప్పుడయినా వివేచనకు, విచక్షణకు, వికాసానికి, వినయానికి ప్రతీకలుగు నిలిచాయిగాని ఉన్మాద చర్యలకు ప్రేరణ కాలేదు.

మే *2001*
మిసిమి సంచికలో
శ్రీ టి. రవిచంద్ వ్యాసం

పుస్తకం మూసిన పాఠకుడు

సతీష్‌చందర్

మీరు ఎప్పుడైనా పాఠకుణ్ని చూశారా? అదేం ప్రశ్న. మాధురీ దీక్షిత్‌ని ఎప్పుడైనా చూశారా- అన్నట్లు. గ్లామర్ - రచయితలకే దక్కని రోజుల్లో పాఠకుడికెక్కడిది? కాని, అసలు గ్లామరంటూ వుంటే పాఠకుడి దగ్గరే వుంటుందని నాకు గట్టి అనుమానం. స్కూల్లో ఫస్టుమార్కులేసిన మాస్టారుని ఎప్పుడయినా మర్చిపోతామా? పోనీ గుండుసున్నలు చుట్టిన మాస్టారిని మార్చిపోతామా? మొదటి మాస్టారు ఎలా వున్నా - రెండో మాస్టారిని అసలు మరచిపోం. పాఠకుడూ అంతే.

ఒక రచన భవిష్యత్తును అయిదు నిమిషాల్లో తేల్చేస్తాడు. 'ఓహో బ్రహ్మాండం' అనో, 'ఛీ ఛీ! పరమ చెత్త' అనో చెప్పడానికి ఏమాత్రం సంకోచించడు. సాహిత్య ప్రపంచానికి చక్రవర్తి పాఠకుడే. అలాంటి చక్రవర్తిని చూడాలని ఏ రచయితకుండదు? నాకూ అలాంటి కోరికొకటి వుండేది.

మా వాసు గారు (కె. వాసుదేవరావు, సీనియర్ జర్నలిస్టు) నన్నొక సాయంత్రం పూట పిలిచి ''మీకివాళ పాఠకుణ్ణి చూపిస్తాను. వస్తారా?'' అన్నారు. లాల్‌బహదూర్ స్టేడియం దగ్గరికి తీసుకువెళ్ళారాయన. లోపల ఎవరెవరో భూగోళం లాంటి బంతుల్ని కాళ్ళతో అవలీలగా తన్నేస్తున్నారు. ప్రపంచాన్ని జయించే క్రీడాకారులు కాబోలు. ఎవరి అభిరుచి మేరకు వారు జీవించగలగడమే ప్రపంచాన్ని జయించడం. ఫతే మైదాన్ ముంగిట సోఫాలో ఒక వ్యక్తి దర్జాగా కూర్చుని వున్నాడు. చిన్నగాలి - నా చెవుల సందుల్లోంచి గుసగుసలాడుతూ వెళ్ళిపోయింది. నాకు అనుభవమే, పొద్దున్న వీచే గాలి పనిచెబుతున్నట్లుంటుంది. సాయంత్రం వీచే గాలి పలకరిస్తున్నట్లుంటుంది. మల్లెపువ్వంతటి తెల్లటి లాల్చీ, పైజమా వేసుకుని వున్నాడు. మమ్మల్ని చూసి విలాస వంతంగా నవ్వాడు. అవును పాఠకుడే డెబ్బయిరెండేళ్ళ పాఠకుడు. మా వాసుగారు పరియచం చేశారు. ఆయన కరచాలనం చేశాడు - చెయ్యెత్తు పాఠకుడు. పేరు ఆలపాటి రవీంద్రనాథ్.

''మీ 'ఇతిహాసం' (పక్షం పక్షం వెలువడే రాజకీయ వ్యంగ్యం) చదువుతున్నాను. మీకు అరవయ్యేళ్ళు 'పైనే వుంటాయనుకున్నాను. మీ కుర్రవాళ్ళలో' కూడా అలాంటి వ్యంగ్యం రాసేవాళ్ళున్నారా?'' అన్నాడాయన. కాస్త నొచ్చుకున్నాను. ఆయన తరం మీద ఆయనకంత ప్రేమవుంటే తప్పేమిటి - అని నచ్చ చెప్పుకున్నాను (తనని మాత్రమే ప్రశంసించి తన తరాన్ని విమర్శిస్తే ఏ రచయితకైనా అంత ఆనందకరమైన విషయం కాదు)

ఆ రోజున నేను 'పాఠకుడి' విశ్వరూపం చూశాను. ఆ 'పాఠకుడే' పలుపత్రికల సంపాదకుడని తెలిసి ఆశ్చర్యపోయాను. రసజ్ఞతే విజ్ఞతయితే పాఠకుణ్ణి మించిన విజ్ఞుడు మరొకడు వుండడు.

వెనకటికి అంతర్జాతీయ కథల పోటీకి న్యాయ నిర్ణేతగా వుండమని సోమర్సెట్ మామ్‌ని పిలిచారట. ''నన్ను కాకుండా ఎగబడి చదివే పాఠకుణ్ని పిలవండి. అతడే మంచి న్యాయ నిర్ణేత

కాగలడు'' అని ఆహ్వానాన్ని తిరస్కరించాడట. నిజమే మరి. ఫలానా రచన వల్ల గుండె చెరువే అయిందో, నదే అయిందో - ఎవరు తేల్చగలరు? ఒక్క పాఠకుడు తప్ప. కాబట్టి మంచి పాఠకుడు అయితే తప్ప మంచి సంపాదకుడు కాలేడు. సాక్షాత్తు పాఠకుడే సంపాదకుడైతే ఆ పత్రిక ఎలా వుంటుందీ? 'మిసిమి'లా వుంటుంది. రవీంద్రనాథ్ అప్పటికే అరవై 'మిసిమి'లు (మాస పత్రికలు) తెచ్చారు. ఇక ఆ రాత్రి అంతా మిసిమి ముచ్చట్లే.

పాఠకుడితో పరిచయమయ్యాక పదే పదే కలవాలనిపించేది. ఒకసారి పాఠక కుటీరానికి వెళ్ళాను. పుస్తకాల దొంతర్లు చూపించాడాయన. ఒక వైపంతా మూడు దశాబ్దాల 'టైమ్' పత్రికలే. అనవసరంగా నవ్వాను. ''మీకు తెలుసా? టైమ్ హేజ్ ఛేంజ్డ్ మైటైమ్'' (టైమ్ పత్రిక నా జీవిత గతినే మార్చి వేసింది) అన్నాడాయన. 'టైమ్' చదివితే - గిరీశం చెప్పినట్లు - సురేంద్రనాథ్ బెనర్జీ అంత గొప్పవాడు కాకపోయినా - అంతటి మేధావుల సమక్షంలో నిర్భయంగా కూర్చోవచ్చుంటాడు. అలాగని 'టైమ్'ని పొగడ్డమే ఆయన పని కాదు. డాక్టర్‌కు కూడా రోగం వచ్చినట్లు - టైమ్‌లో కూడా తప్పులు వస్తుంటాయంటాడు. కాకపోతే చాలాచాలా అరుదుగా. ఒక్కసారి టైమ్ పత్రిక టైమ్ బాగోక ఒక వార్త అచ్చువేసింది. అది కళాకారుడి మరణ వార్త. ఆ వార్త రాసిన విలేకరికి కాస్త కవిత్వం పుప్పొంగి కళాకారుడి కళ్ళను వర్ణించాడు. అతనివి మట్టి ఛాయలోని నీలం కళ్ళు (Muddy Blue Eyes). ఈ వర్ణనకి ఎప్పుడో వదిలేసిన కళాకారుడి మొదటి భార్యకి కోపం వచ్చింది. ''నా భర్తవి నీలం కళ్ళు (Blue Eyes) మాత్రమే. మట్టి ఛాయ (Muddy) గా వుండవు'' అని రాసింది. ఆ ఉత్తరాన్ని ప్రచురిస్తూ టైమ్ చాలా కొంటెగా క్షమాపణ చెప్పింది. ''బహుశా మట్టి మా కళ్ళలో వుండి వుండాలి'' (Mud might be in our eyes) అన్నది టైమ్ ఎంతో హుందాగా. ఈ హుందాతనాన్ని రవీంద్రనాథ్ పదే పదే గుర్తు చేస్తుండేవారు. టైమ్ పత్రికలో ఆయనకు నచ్చే మరో అంశం - కాల్పనిక సాహిత్యం లేక పోవడం, అదుగో ఆ వారసత్వంతోనే ఆయన 'మిసిమి'ని తెస్తున్నానని చెప్పాడు. అయితే ఒకసారి రచన పంపమని నన్ను అడిగితే కాల్పనిక సాహిత్యమే ('అజ్ఞానకాంక్ష' అనే వ్యంగ్య కథనం) పంపాను. సహృదయులు కావడం చేత నా పెంకెతనాన్ని మన్నించి అచ్చు వేశారు. ఆమాట కొస్తే పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు ''మధుర వాణి' తో చేయించిన ఇంటర్వ్యూలూ కల్పించినవే. కాకపోతే కథలూ, నవలలూ, నాటకాలు వంటి కాల్పనిక రచనలు కావు.

'మిసిమి' అంటేనే ఆయనకు ప్రాణం. ఆయన మాటల్లో చెప్పాలంటే 'మిసిమి' ఆయనకు మిగిలిన గాళ్ ఫ్రెండ్. బూదరాజు రాధాకృష్ణగారు పెట్టిన మంచి పేరు. ఇదే పేరును రవీంద్రనాథ్ మనుమరాలికి కూడా పెట్టుకున్నారు. విషయం చెబుతూ - ''రేపు పొద్దున్న కాలేజీ కుర్రాళ్ళెవరయినా నా మనుమరాలిని పట్టుకుని - మిసిమీ డోన్ట్ మిస్ మీ - అని అంటే నాది పూచీ కాదు'' అని కూడా అన్నారు గమ్మత్తుగా నవ్వుతూ.

అసలు రవీంద్రనాథ్‌కి పత్రికల కన్నా పత్రికల్లో రాసే రచయితలంటే విపరీతమైన మోజు వుండేది. ఎందుకుంటే ఆయన తెనాలిలో వుండేటప్పుడు కృష్ణాపత్రిక చూసేవారు. అప్పటి కృష్ణాపత్రిక రచయితల్ని భుజాలమీద ఎక్కించుకుని మోసేది. ఆ మోజుతోనే ''పెళ్ళి దాని

పుట్టుపుర్వోత్తరాలు'' వెలికి తీసిన తాపీ ధర్మారావుకూ, కుల వివక్షతాట వలిచిన సూత పురాణకర్త త్రిపురనేని రామస్వామికి దగ్గరయ్యేడు. అదే గ్లామర్‌తో ఆయన పెళ్ళి తంతుని పురోహితుడితో కాకుండా త్రిపురనేని జరిపించారు. ఈ విషయాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ పెళ్ళిలో వచ్చిన చిన్న గొడవని చెప్పారు. పెళ్ళి విందులో ఒక దళిత యువకుడు (గాంధీగారి పరిభాషలో హరిజనుడు) కలబడి భోజనం చేయబోయాడు. అందకు శూద్రులైన పెద్దలంతా ఆందోళన పడిపోయారు. అతన్ని బయటికి పంపించబోయారు. అప్పుడు రవీంద్రనాథ్‌కు కోపం వచ్చింది. ''ఇది నా పెళ్ళి. నా యిష్టం. అతడ్ని భోజనం చేయనివ్వండి. ఆకలికి కులం లేదు'' అని కస్సున లేచాడు.

ఇక మరో స్టార్ గుడిపాటి వెంకటచలం. ఈ స్టార్‌ని దగ్గర చేసింది తను 1948లో ప్రారంభించిన 'జ్యోతి' పత్రికే. ఒకసారి రవీంద్రనాథ్ చలంగారి ఇంటికి కథకోసం వెళ్ళాడు. అప్పుడు వెన్నెలలా నవ్వగలిగిన సౌరిస్ ఎదురయ్యింది. చలంగారి అమ్మాయే. చలం అప్పుడే రాసిన ''మూడు రాణుల కథ '' తెచ్చి ఇచ్చింది. రవీంద్రనాథ్ ఆబగా అక్కడికక్కడే ఆసాంతం చదివేశాడు. ఎదురుగా వున్న సౌరిస్‌ని చూసి ''యు ఆర్ ది ఫోర్త్ క్వీన్'' (నువ్వు నాలుగో రాణివి) అనేశాడు. హాస్యం, చమత్కారం నిజమైన పాఠకుడిలో నిబిడీకృతమైవుంటాయి. ముందు రచయితల్లోని పున్నమినే చూసిన రవీంద్రనాథ్‌కి తర్వాత్తర్వాత కొందరు రచయితల అమావాస్యం ముఖాలు చూడాల్సి వచ్చింది. 'రేరాణి' అనే మరో పత్రికను నడిపి ఆర్థికంగా నష్టాలు చవిచూడవలసి వచ్చింది. ఆ తర్వాత హైదరాబాద్ రావడం వ్యాపార రంగంలో స్థిరపడడం వాటంతట అవే జరిగి పోయాయి. ఎన్ని వ్యాపకాలున్నా పుస్తక పఠనాన్ని ఆయన వదలలేదు. బెట్రండ్ రస్సెల్ స్వీయ చరిత్ర ఆయనకు బాగా యిష్టం. పత్రికల్లో 'పంచ', 'శంకర్స్ వీక్లీ' లు ఆయన అభిమానాన్ని బాగా చూరగొన్నాయి. కొత్త పుస్తకాన్ని చదవడం ఒక డిస్కవరీ అంటాడాయన.

ఇలా రాయడాన్ని ఉదారంగా రచయితలకు వదిలేసి పుస్తకాల్నే పట్టుకుని వేళ్ళాడే పాఠకుడు చాలాచాలా అరుదు. మహా అయితే ఒక రోణంకి అప్పలస్వామి, ఒక ఆలపాటి రవీంద్రనాథ్. ఉత్తమ పాఠకులు ఎప్పుడూ చిరంజీవులే!

కాకపోతే 'మిసిమి' నేస్తం లేని ఏకాకి అయింది. ''నా తర్వాత కూడా 'మిసిమి'కి ఒక బోయ్ ఫ్రెండ్‌ని చూడాలి'' అంటుండే వారాయన. ఆయన భ్రమగా నీ 'మిసిమి'కి స్వయంవరంపెట్టినా ఇంద్రధనువుని ఎక్కుపెట్టగల రవీంద్రనాథ్ లాంటి రసజ్ఞుడు ఎక్కడ దొరుకుతాడు?!

పాఠకుడికి కొత్త పాఠాలు నేర్పిన ఆలపాటి మరి లేరు!

ఎన్. ఇన్నయ్య

పత్రికా రంగంలో ఒక వినూత్న పంథాలో పయనించే 'మిసిమి' పత్రికను ప్రచురిస్తూ, దానికి సంపాదకత్వం వహించి పాఠకుల ఆలోచనా ధోరణులలో విప్లవాత్మక మార్పును సాధించారు. 'మిసిమి'లో మధురవాణి (కన్యాశుల్కం) విలేకరిగా ఎందరో గతించిన సాహితీ ప్రముఖులతో ఊహాజనిత పరిచయ సంభాషణం చేయించి ఒక విలక్షణమైన వరవడిని సృష్టించారు. కల్పనా సాహిత్యం జోలికి పోకుండా పత్రికను నడపవచ్చని ప్రయోగం చేసి, అటువంటి పత్రికలకూ పాఠకులుంటారని 'మిసిమి' ద్వారా రుజువు చేశారు. ప్రముఖ చిత్రకారుల వర్ణచిత్రాలతో అందంగా ప్రచురితమయ్యేది. రవివర్మ, పికాసో, దామెర్ల రామారావు, అడవి బాపిరాజు, సంజీవదేవ్, కొండపల్లి శేషగిరిరావు, రాజయ్య వంటి సుప్రసిద్ధులు, లక్ష్మణ్ వంటి యువ చిత్రకారుల చిత్రాలు ముఖచిత్రాలుగా వెలువడ్డాయి.

ఆయన కలం పట్టలేదు, పట్టించాడు. రచయితలకు భావాలు అందించాడు. పాఠకుడుగా రచనల్ని సరిదిద్దించాడు. అందుకే ఆయన పాఠక సంపాదకుడుగా ప్రసిద్ధి చెందాడు. అలాంటి ఆలపాటి రవీంద్రనాథ్ 1922 నవంబరు 4న గుంటూరు జిల్లా గోవాడ గ్రామంలో పుట్టారు. ఆయన తండ్రి దేవయ్య అంటరానితనం పోగొట్టే కృషి చేసిన గాంధేయుడు. గోవాడ పక్కనే తురుమెళ్ళలో చదువుకోడానికి వెళ్లిన రవీంద్రనాథ్ 6వ తరగతితోనే ఆపేసి, స్వయంగా చదివి తన ప్రతిభకు వన్నెచిన్నెలు దిద్దుకున్నాడు. ఇంగ్లీషు, తెలుగు పత్రికలు, పుస్తకాలు చదవడం జీవితంలో హాబీగా పెట్టుకున్నాడు. సహృదయుడు, స్నేహపాత్రుడైన రవీంద్రనాథ్ టైం వారపత్రిక వ్యసనపరుడునని సగర్వంగా చాటుకునేవాడు. అలాంటి గాంధేయ వాతావరణ ప్రభావితుడైన రవీంద్రనాథ్ చిన్నపటి నుండి కళా హృదయుడుగా, రసజ్ఞుడుగా పెంపొందాడు.

తెనాలిలో జ్యోతి ప్రెస్ స్థాపించి పాఠ్య గ్రంథాలు ముద్రించేవాడు. ఆయన ప్రెస్ చిన్న ఎడిషన్ క్లబ్బుగా, గోష్ఠి కేంద్రంగా వుండేది. 1942 క్విట్ ఇండియా ఉద్యమం తెనాలిలో ముమ్మరంగా సాగినప్పుడు రవీంద్రనాథ్‌ను పోలీసులు పట్టుకుపోయి, ఒక రోజు స్టేషన్‌లో పెట్టి వదిలేశారు. రోజూ టెన్నిస్ ఆడేవాడు. విలాస వంతమైన జీవితం గడుపుతూ, జీవితంలో సున్నిత మెళకువల్ని చవిచూచాడు.

1948 నాటికి ''జ్యోతి'' పత్రికను తెలనాలి నుండి రవీంద్రనాథ్ నడిపాడు. అందులో ఎందరో రచయితలకు అరంగేట్రం జరిగింది. రావూరి భరద్వాజ, ధనికొండ హనుమంతరావు వంటి

వారు ఆయన వద్ద పనిచేశారు. జి.వి. కృష్ణరావు వంటి వారు తమ రచనల్ని ఆయనకు అంకితమిచ్చారు. హేవలాక్ ఎల్లిస్, యూంగ్, యాడ్లర్, సిగ్మండ్ ఫ్రాయిడ్ వంటి రచయితల్ని తెలుగు పాఠకలోకానికి అందించడంలోనూ, సెక్స్‌ను సైంటిఫిక్‌గా ఆకర్షణీయంగా చదివించడం లోనూ రవీంద్రనాథ్ కారకుడయ్యాడు. చలం ప్రభావం ఆయనపై లేక పోలేదు.

భావసాహసాలను పత్రికా ముఖంగా తీసుకురావడానికి ఎం. ఎన్. రాయ్ సిద్ధాంతాలు రవీంద్రనాథ్‌పై ప్రభావం చూపెట్టాయి. ఆనాడు కుటుంబ నియంత్రణ కావాలన్న ఎలెన్ రాయ్ వ్యాసం ''జ్యోతి''లో వేస్తే రవీంద్రనాథ్ ఇబ్బందులకు గురికావలసి వచ్చింది. ''రేరాణి'', ''అభిసారిక'' పత్రికలకు ప్రోత్సాహకుడైన రవీంద్రనాథ్ ఎందరో రచయితలతో పరిచయమయ్యాడు. ఆవుల గోపాల కృష్ణమూర్తి ఆయనకు సన్నిహిత మిత్రుడు.

తాపీ ధర్మారావు పౌరోహిత్యంలో కళానతిని పెండ్లి చేసుకున్న రవీంద్రనాథ్‌కు 5గురు కుమారులు ఒక కుమార్తె కలిగారు.

తెనాలి నుండి నడిపే పత్రికలు ఆగిపోయిన తరువాత రవీంద్రనాథ్ హైదరాబాద్‌కు మారి ముద్రణా కార్యకలాపాలు సాగిస్తూ, టైం పత్రిక నుండి విజ్ఞాన సర్వస్వం వరకూ తిరగేస్తుండేవాడు. వ్యక్తిగతంగా ఎందరితోనో చర్చించి, రాయించడం ఆయన ప్రత్యేకత. బెజవాడ గోపాలరెడ్డి, డి.వి.నరసరాజు, ఆవుల సాంబశివరావు, నార్ల వెంకటేశ్వరరావు, సి. నారాయణరెడ్డి, పాలగుమ్మి పద్మరాజు, కొప్పరపు సుబ్బారావు, జగ్గయ్య, సంజీవదేవ్ ఆయనకు సన్నిహిత అభిమాన మిత్రులు. ఎం. ఎస్. రాయ్ గురువు. 1973లో రవీంద్రనాథ్ అమెరికా వెళ్ళి ఆయన కుమార్తె, అల్లుడు దుర్గ, నన్నపనేని చౌదరి వద్ద న్యూజెర్సీలో వుంటూ రెండు మాసాలు పర్యటించి న్యూయార్క్ తదితర ప్రాంతాలు చూచారు. అమెరికాలో ఏ నగరానికి వెళ్ళినా ఒకేతీరు కనిపించి, విసుగెత్తినట్లు చెప్పారు.

మన దేశంలో ఇంచుమించు అన్ని రాష్ట్రాలలో పర్యటించిన రవీంద్రనాథ్, చివరి దశలో ''మిసిమి'' మాస పత్రిక ప్రారంభించి, పాఠక సంపాదకుడుగా 5 సంవత్సరాలు సాగించి, విశిష్ట వ్యక్తిగా పేరొందారు. సైకాలజీ, మెడిసన్, సెక్స్, రాజకీయాలు, జర్నలిజం, ఇంకా అనేక సమకాలీన సమస్యల్ని చర్చిస్తూ మిత్రులతో గడిపేవారు. ఆయన గ్రంథాల్ని కొన్ని సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి కొన్ని గౌరవ డిగ్రీని పొందారు. తెనాలిలో గ్రంథాలయానికి ఇచ్చారు. భట్రాజీయం గిట్టని రవీంద్రనాథ్, వేదికలు ఎక్కేవాడు కాదు. సన్మిత్రుడుగా మిగిలిపోయాడు.

కన్నీటి వీడ్కోలు

చంద్రశేఖర్ రెడ్డి

తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక ఒరవడిలో రచనలు చేసి 'మిసిమి' పత్రికను తెలుగులోకి తెచ్చిన ఆలపాటి రవీంద్రనాథ్ ఇటీవల మరణించడం సాహిత్య లోకానికి తీరని లోటు. కల్పనా సాహిత్యం జోలికిపోకుండా పత్రికను నడపవచ్చని ప్రయోగం చేసి అటువంటి పత్రికలకూ పాఠకులుంటారని మిసిమి ద్వారా రుజువు చేశారు.

మిసిమి విలేకరి మధురవాణి; కన్యాశుల్కంలోని ప్రధానపాత్ర మధురవాణి విలేకరిగా, పురాణం సుబ్రహ్మణ్య శర్మ సృష్టించిన ''ఊహాజనిత సంభాషణం తెలుగు పత్రికా ప్రపంచంలోనే ఒక కొత్త వరవడిని తీర్చిదిద్దింది.

సంతాన నిరోధం ఒక పాపంగా భావించే రోజుల్లో 1947లో ఎం. ఎన్. రాయ్ సతీమణి, శ్రీమతి ఎలెన్‌రాయ్ కుటుంబ నియంత్రణ పై రాసిన వ్యాసాన్ని ప్రచురించినందుకు గాను, ప్రభుత్వం ఆలపాటి పై ప్రాసిక్యూషన్ నడిపింది. జనాభా అదుపుదలకు కుటుంబ నియంత్రణ ఆవశ్యకతను 50 సంవత్సరాల క్రితమే గుర్తించిన మేధావి ఆలపాటి.

రవీంద్రనాథ్ భార్య కళావతి మూడు సంవత్సరాల క్రితం మరణించారు.

భావాల వీచికై అలవోకగా తాకి
సాహితీ వీణపై రసరాగాలు మీటి
ఆటుపోటులకు ఆగేది లేదంటు
రేరాణిగా అరసి జ్యోతిగా వెలిగి
'మిసిమి' రేఖల్లోన మెరుపుగా మెరిసి
అలసిపోయిన రవి నేడు నిదురపోతున్నాడు.

తెనాలి తాలూకా గోవాడ గ్రామంలో 1922 నవంబర్ 4వ తేదీన రవీంద్రనాథ్ జన్మించాడు. వెంకట్రామయ్య. అమ్మెమ్మలు ఈయన తల్లితండ్రులు. వెంకట్రామయ్య గారు వ్యవసాయదారులు. అభ్యుదయ భావాలుగల విశాల హృదయులు. రవీంద్రుడు బాగా చదువుకోవాలని ఉన్నతుడు కావాలని ఆయన ఆశించారు. ఆదర్శాలబాటలో పయనించాలనే వెంకట్రామయ్య గారి కాంక్షయే రవీంద్రుని ప్రగతికి శ్రీరామరక్షగా నిలిచి పురోగతిని సాధించంది. తురుమెళ్ళ గ్రామంలోని కారొనేషన్ హైస్కూల్లో రవీంద్రుని విద్యాభ్యాసం జరిగింది. పెద్దల నుండి మంచి చెడ్డలను పిల్లలు గ్రహిస్తారు అన్న విషయం నిజం. 1935లో గాంధీజీ స్వాతంత్రోద్యమాన్ని ఉధృతం చేస్తూ తెనాలి వచ్చారు. దేశభక్తుడైన వెంకట్రామయ్యగారు గాంధీజీని 'గోవాడ' కు ఆహ్వానించి తనవద్దనున్న ధనాన్ని విరాళంగా ఇచ్చి 'ఉడతాభక్తి' ప్రదర్శించారు. కనీసం తాగడానికి నీళ్ళుకూడా కరువై చెరువులన్నీ ఎండిపోయిన కాలాన వెంకట్రామయ్యగారు హరిజనుల్ని తమ బావిలోన నీళ్ళను

తోడుకోమని చెప్పినందున ఊరివాళ్ళు కొందరు ఆయనని వెలివేసారు. గాలికంటు లేదు - కడలి కంటు లేదు అన్న మాటల్ని తన కార్యాచరణ ద్వారా మరోసారి ఋజువు చేసారు. మొట్ట మొదటగా గోవాడ గ్రామంలో గ్రంథా లయాన్ని నెలకొల్పడంలో వెంకట్రామయ్యగారు ఎంతో కృషి చేసారు. వెంకట్రామయ్య గారి అభ్యుదయ భావాలు రవీంద్రుని ఊహలకు ఊపిరి పోసి ఆయన ఆశయసౌధానికి పునాది వేసాయి. 1943లో చేకూరి బాపనయ్య భ్రమరాంభల కుమార్తె కళావతిని తాపీధర్మారావు, త్రిపురనేని రామస్వామి గార్ల ఆధ్వర్యంలో అభ్యుదయ వివాహం చేసుకున్నారు. వృత్తిపరమైన అనుభవం ఏమాత్రం లేకపోయినా 1947లో తెనాలిలో జ్యోతి ప్రెస్‌ను ప్రారంభించారు. 'రేరాణి' 'జ్యోతి' అనే రెండు జంట పత్రికలు స్థాపించి ప్రబోధకరమైన సమాచారాన్ని అందజేయడానికి శత విధాల ప్రయత్నించారు. సంపాదకుడుగా ఆయన ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని పత్రికలను నడిపించారు. అనేకమంది రచయితలను మనకు పరిచయం చేసారు. రావూరి భరద్వాజ, శారద, హితశ్రీ, ధనికొండ హనుమంతరావు వంటి అనేక మంది నేటి ప్రఖ్యాత రచయితలకు ప్రోత్సాహం ఇచ్చి వారిలోని సృజనాత్మకతకు శ్రీకారం చుట్టారు. చలం, గోపీచంద్, జి.వి. కృష్ణరావు, సౌరీస్ వంటి ప్రసిద్ధుల అత్యాధునిక భావాలలో రూపుదిద్దకున్న రచనలకు తన పత్రికలలో చోటు ఇచ్చి పాఠకులకు అందించారు. ఆకాశవాణి కార్యక్రమాలపైన ప్రత్యేక సమీక్షలను వ్రాసిన ప్రధమ సంపాదకులు రవీంద్రనాథ్. అప్పటి సమాచార శాఖామంత్రి ఆర్. ఆర్. దివాకర్ ఈ సమీక్షలను గురించి తెలుసుకొని ఎంతగానో మెచ్చుకున్నారు. 'సినిమా' అనే సినిమా పత్రికను కూడా ప్రారంభించారు. ఆర్థికంగా నష్టపోయారు.

1957లో హైదరాబాదు తరలివచ్చారు. పత్రికలను ఆపేసి ప్రెస్ ద్వారా జీవిత యాత్ర ఆరంభించారు. కొత్త జీవితం సాగిస్తూనే మళ్ళీ సృజనాత్మకమైన నూతన ప్రయోగాలకు శ్రీ కారం చుట్టి 'మిసిమి' అనే పక్షపత్రికను 1990లో ఆరంభించారు. జర్నలిజంలోని మెళకువలను గ్రహించినా కళాభిరుచి అనే ఆదర్శప్రాయమైన ఆశయాల అనుబంధంలో 'బందీ' అయిపోయి 'మిసిమి'ని మాసపత్రికగా కొనసాగించారు.

'మిసిమి' పత్రిక ద్వారా ఆయన చేసిన సాహితీసేవ అమూల్యమైనది. అశ్లీల అసభ్యకరమైన అంశాల చుట్టూ అల్లరి చిల్లరి కథలనల్లి పత్రికలు సొమ్ము చేసుకుంటున్న సమయంలో తాత్విక, మానసిక, మత, రాజకీయ, కళాసాహిత్య చరిత్రలను మధించి సాంస్కృతిక రంగాన నిష్ణాతులైన విజ్ఞుల రచనలను ప్రచురించి, విభిన్నమైన అనుభూతులను పాఠకలోకానికి పంచి, ప్రతిష్టాత్మక దినపత్రికల ప్రశంసా పూర్వక సంపాదకీయాల ద్వారా అభినందనలు అందుకొన్నారు. 1996 ఫిబ్రవరి 11న హైదరాబాద్‌లో శ్వాసకోశవ్యాధికి చికిత్స పొందుతూ అస్తమించిన. ఆలపాటి రవీంద్రనాథ్ కిదే సలక లేక పలుకుతున్న కడసటి కన్నీటి వీడ్కోలు.

Professor **K. Satchidananda Murthy**
Ph.D.,Hon. D.Litt.,Hon.Dr.Phil.,Hon.Sc.D.

Vice President,
International Federation of Philosophical Societies

Phone : 08644-88-203
"Aparajita"
Sangam Jagarlamudi,
Guntur Dist., A.P. 522 213
INDIA

I am greatly distressed to learn about the passing away of Dr. A. Ravindranath. Through self-study he acquired deep and wide knowledge about many subjects. During 47-57 he edited and published innovative journals. In 1990 he started a unique journal MISIMI and so far brought out 79 issues. Devoted to art, philosophy, psychology and literature it is a monthly of high standard both from stand point of its contents as well as production. He conducted it marvellously with missionary zeal.

Recently he established and endowed at Tenali an organisation to promote and propagate science & culture.

Dr. Ravindranath was a person of progressive views and high culture. Talking with him was a pleasure and highly informative.

On this occasion I share the grief with his many friends and family. I hope an able editor can be found for MISIMI.

(K. Satchidananda Murthy)
20 II 1996

Dr.D. ANJANEYULU
(AUTHOR & JOURNALIST)
"SAKETA" 14, Mandavalli Street,
MADRAS - 600 028. Ph : 494 38 24
Sir,

I was shocked to hear the sad news of the passing away of Dr. Ravindranath Alapati. He has had the distinction of editing a Telugu periodical, మిసిమి, possibly the only one of its kind today - high class, not highbrow, scholarly, not scholastic; intellectual, not academic; stimulating, not sensational. It used to remind me of **'Encounter',** which, unfortunately, has ceased publication.

Sri Ravindranath was a man of taste, a largely self-educated man. It was in the High School at Thurumella (in Tenali Taluk, Guntur District) that we had first met, as pupils of the same class, almost sixty years ago. But he didn't stay on at school for a long time. We belonged to neighbouring villages he to Govada and I to Yelavarru. Hailing from an affluent family, he didn't have to work for a living.

But, we didn't then know that we were both interested in journalism, though in different ways, he as a printer and publisher in Telugu (In Tenali); and I as a working Journalist (in English), after a longish study at the University and professional training (in Madras). But we didn't happen to meet again for many years. It was only in the early 'Seventies, while I was in Hyderabad on official assignment that I happened to renew my acquaintance with Mr. Ravindranath at the residence of our mutual friend, Dr. N. Innaiah.

Strictly speaking, I began to know him rather closely, after he had started MISIMI some years ago. I enjoyed reading it every month and he valued my impressions, which he published in the periodical. During his annual visits to Madras, for a change, he used to do me the courtesy of meeting me at home discuss aspects of the journal and the prospects for improving it. I could see that he had grown remarkably mature over the years. He was serious and balanced, lively and original.

He loss is almost irreparable. I can only hope that the task he had undertaken will be continued by his sons, friends, colleagues and admirers.

Dr.D. ANJANEYULU
12th February, 1996.

Hyd/29
12 2/96

Dr. DVR Poosha, Ph.D., FCSEPI
Consultant in Psychosexul Medicine
Editor and Publisher : Abhisarika Sex-Science Monthly

Member :
Indian Assoc. Sex Educators, Counselors and Therapists,
American Assoc. Sex Educators, Counselors and Therapists
British Association for Sexual and Marital Therapy
Society for the Scientific Study of Sex, USA.

ABHISARIKA, 40, Industrial Estate, SAMALKOT (A.P.) - 533 440
Tel : (08852) 454, 474 • Fax : 91-8852-965

I have read in the news papers about the sudden demine of Sri Alapati Ravindranath. I felt sad as, as readers of Misimi we will be missing him so much. Thanks to his great love for literature, and thanks to the resources and indication he had, he could render excellent service to literature & its lovers than Misimi. May his soul rest in peace.

May the Misimi, probably his another loving child, cherish in the hands of his inheritors.

Dr. DVR Poosha

Kolluri Koteswara Rao
Ex-M.L.C.
Editor
Telugu Vidyardhi

Phone : 2 6 3 1
Post Box No. 1
Machilipatnam- 521 001.

శ్రీ రవీంద్రనాథ్‌గారు పరమపదించారనే వార్త విని దిగ్భ్రాంతి చెందాను. పత్రికారంగంలో నూతన పద్ధతులను ప్రవేశపెట్టి పాఠకులను ఎంతో ఉత్తేజితులను జేశారు. మాబోటివారికి మార్గదర్శకులుగా నిలచారు. జీవిత చివరి భాగంలో ప్రారంభించిన 'మిసిమి' ద్వారా సాహిత్య వేత్తలు కూడా ఆలోచించే విధముగా నూతనత్వముతో మేధావులను సయితం ఆలోచించే విధంగా ఉత్తమ వ్యాసాలను అందించి, అందరి ప్రశంసలు అందుకున్నారు. విశిష్ట వ్యక్తిత్వం గల పత్రిక సంపాదకులు శ్రీ రవీంద్రనాథ్‌గారు. అలాంటి ఉత్తమ వ్యక్తిని పత్రికా ప్రపంచం కోల్పోయింది.

శోక తప్తమైన మీకు, మీ కుటుంబ సభ్యులకు నాతరపున, తెలుగు విద్యార్థి పత్రిక ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను. నిండు హృదయముతో ఆమహనీయునికి నివాళులర్పిస్తాన్నాను.

కొల్లూరి కోటేశ్వర రావు

J. Hanumath Sastri
M.A. (Eng.; Tel) B.Ed.
Lecturer in English (Retd.)

MAHATI
1/1845, Gandhi Nagar,
CUDDAPAH - 516 004.
Phone : 23923

Date : 19-2-1996.

శ్రీ ఆలపాటి రవీంద్రనాథ్ గారిని ప్రత్యక్షంగా చూచే అవకాశం కలగలేదు.

మిత్రులు డా॥ వెలగా వెంకటప్పయ్య గారి ద్వారా వారి పరిచయ భాగ్యం కల్గింది.

శ్రీ ఆలపాటి రవీంద్రనాథ్‌గారి సంపాదకత్వంలో వెలువడుతూ వుండిన 'జ్యోతి' 'సినీమా' పత్రికల పాఠకుడిగావారి పట్ల నాకెంతో గౌరవముండేది.

'మిసిమి' పత్రిక సంపాదకత్వం చేపట్టిన తర్వాత వారు 'మిసిమి' పాత సంచికలను సి.పి. బ్రౌన్ గ్రంథాలయానికి ఉచితంగా పంపుతూ వచ్చారు. ఆరీతిగా, వారితో పరిచయం కల్గింది. ఇటీవల 'మిసిమి' పత్రికకు, నానుండి 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' వ్యాసం కోరారు. పంపగా వెంటనే ప్రచురించారు.

బ్రౌన్ గ్రంథాలయం పట్ల వారెంతో ఆసక్తిని చూపారు.

పత్రికా రంగంలో నానాటికీ విలువలు క్షీణిస్తూన్న సమయంలో, మహోన్నతాశయంతో 'మిసిమి' పత్రికను వెలువరించి, ఆ పత్రికను సాహిత్యాభిమానులు గుండెకు హత్తుకొనే విధంగా నిర్వహించారు.

వారి కన్ను మూతతో, ఒక విశిష్ట పత్రికా సంపాదకుని, సహృదయులైన ఒక మహామనీషిని తెలుగు వారు పోగొట్టుకొన్నారు. ఆ లోటు తీరేది కాదు. వారి ఆత్మకు చిరశాంతి లభించుగాక.

'మిసిమి'ని కొనసాగించటం వారికి సముచిత స్మారకం కాగలదు.

జానమద్ది హనుమచ్ఛాస్త్రి

మాకినీడి సూర్య భాస్కర్
32-8-5, శ్రీ ఎస్.పెంటయ్య గారిల్లు, నెల్లి అప్పన్న సెంటర్,
రాజాజీ వీధి, కాకినాడ - 533 007.

కాకినాడ,
16-2-1996.

మా తమ్ముడిగారి పాపకు పుట్టు వెంట్రుకలు తీయించే నిమిత్తం ఫిబ్రరి 9న బయలుదేరి తిరుపతి వెళ్లాం. 14వ తేదీ తిరిగి వచ్చాక, ఈ రోజు, అంటే ఫిబ్రరి 16న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి తిరుప్రసాదాన్ని ఈయాడానికి డా. మిరియాల రామకృష్ణగారి యింటికి వెళ్లాను. వెళ్తూనే విన్న మాట - ''మిసిమి రవీంద్రనాథ్‌గారు చనిపోయారు'' అని. అంతే, అక్కడున్న కుర్చీలో కుప్పకూలి పోయాను. కొంత సేపటి వరకు నోటమాట రాలేదు.

పూజ్యులు శ్రీ రవీంద్రనథ్‌గారితో నాలుగేళ్ల నా పరిచయం ప్రత్యక్షం కాకపోయినా, ఆయన ఆత్మీయత మాత్రం ఉత్తరాల ద్వారా ప్రత్యక్షరంలో ప్రత్యక్షమయ్యేది. మిసిమి పత్రికలో నావి 8,10 వ్యాసాలు, కొన్ని వర్ణచిత్రాలు ప్రచురించినందుకు కృతజ్ఞతలు చెప్పుకొందామన్నా, అందని లోకాలకు వారు వెళ్లిపోయారు.

మిసిమి ప్రచురణార్థం, ఉడుతా సాయంగా నేను కొంత పంపినప్పుడు వారు 'మిసిమి'కి విరాళాలు వద్దు' అంటూ మృదువుగా తిరస్కరించారు. 'చందా కట్టి చందాదారులుగా చేర్పించండి' అంటూ యింకా మృదువుగా మందలించారు. అప్పటికే వారు పత్రికను సంవత్సరంపాటూ ఉచితంగా పంపుతూ వచ్చారు. ఉచితంగా వస్తోందని అందుకున్నానే తప్ప, ఆయన మందలించే వరకు చందా కట్టాలన్న ధ్యాస నాకు లేకపోయినందుకు మనసులో చాలా సిగ్గుపడ్డాను.

కాలిఫోర్నియా యూనివర్సిటీవారు రవీంద్రనాథ్ గారికి గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసినప్పుడు నేనెంతో సంతోషించాను. హర్షంతో, ''అప్పటి రవీంద్రనాథ్ ఠాగూర్ వలె, మిమ్మల్ని మన యూనివర్సిటీలు గుర్తించకపోయినా, విదేశీ విశ్వవిద్యాలయం గుర్తించి డాక్టరేట్ యివ్వడం చాల ముదావహం'' అని నేను రాసినప్పుడు, వారెంతో సరళంగా ఆయన విజయం వెనుక మిసిమిని ప్రోత్సహించిన రచయితలున్నారని ప్రత్యుత్తర మిచ్చారు. అంతటి నిరాడంబరమైన వ్యక్తిత్వం శ్రీ రవీంద్రనాథ్‌గారిది !

రవీంద్రనాథ్‌గారికి ఆడపిల్లలు ఉన్నారో లేదో తెలీదు కాని, 'మిసిమి' పత్రికను ఆయన అనుంగు పుత్రిక కంటె అధికంగానే ఊహించారు, ప్రేమించారు.... తీర్చిదిద్దారు. ఆయన లేని కారణంగా మిసిమి అనాధ కారాదు. అదే మనం ఆయన కీయగల ఘనమైన నివాళి. అప్పుడే ఆయన ఆత్మకు శాంతి చేకూరగలదని నేను విశ్వసిస్తున్నాను.

'మిసిమి' లాభనష్టాలతో నిమిత్తం లేకుండా ప్రచురించే విషయంలో వారి అబ్బాయిలేనాడూ వారికి అభ్యంతరం చెప్పలేదని విన్నాను. ఆ విధంగానే యిప్పుడు కూడా వారి పుత్రులు ఆయన ఆరంభించిన 'నిష్కామ కర్మ'ను కొనసాగించగలరని ఆకాంక్షిస్తున్నాను.

Ven. K. Sangharakshita
President
Anand Buddha Vihar Samiti

Buddha's Light International Association
Andhra Pradesh Chapter, Secunderabad, India

10-5-368/2, Sainagar, Tukaramgate, North Lallaguda, Secunderabad - 17.
Andhra Pradesh, India. Tel : 0091-40-7732421; Fax : 0091-40-842477 (BFMB- 298)

14th February 1996

We at Ananda Buddha Vihar are deeply shocked by the news of sudden demise of Late Shri Alapati Ravindranath on Sunday, the 11th of February 1996 His 40 long years of service in the field of Publication and writing is indeed remarkable. He was a renowned scholar and eminent thinker. His thought provoking work was truly recognised by the University of California and conferred him with Doctorate. His well noted publication 'MISIMI' is indeed benefitting many wisdom seekers.

We the members and Trustees of Ananda Buddha Vihara Trust extend our deepest heartfelt condolence. May his work and supreme example of spreading knowledge inspire every one of us.

Ven. K. Sangharakshita Mahathero
Chairman,
Ananda Buddha Vihara Trust.

"రవీంద్ర స్మృతి"

వి. హరిసర్వోత్తమరావు

శ్రీ ఆలపాటి రవీంద్రనాథ్
స్నేహసౌశీల్యానికి ఘనాపాటి
మనసున్న మహా మనీషి
ఆత్మసౌందర్యమున్న మహోన్నతుడు
మమతలు వర్షించే మనసు
అందుకే మిత్రులందరికి హర్షం
విశ్వాసం ఆయన శ్వాస
అదే అందరికి ఈ నాటికి మిగిలిన భాష
సన్నిహితుడు అహితుడుగా మారలేదు
హితమే ఆయన అభిమతం
తాత్త్విక ఆలోచన ఆయన నాగరికత
'మిసిమి' వారి సులోచనం
సాహిత్యం ఆరోప్రాణం
మానసిక చింతన ఆయన సంస్కృతి
తాపీవారి ధర్మం ఆయనకు నచ్చిన మర్మం
గురజాడ తీసిన జాడ ఆయన మెచ్చిన ఓడ
నార్లవారి నవీనం వీర్ని ఉత్తేజ పర్చిన నవనీతం
కట్టమంచి వారి మంచి వీరి మదిలో వెలిగే దీపం
కందుకూరి వారి కవనం మధురమైన పాయసం
త్రిపురనేని వారి సిద్ధాంతం జీర్ణించుకొన్న హృదయం
ఇవే శ్రీ రవీంద్రనాథ్ అంతరంగ తరంగాలు
మనం వారిలో చూచిన మర్మాలు ధర్మాలు

వేముల లక్ష్మీనర్సయ్య
యాదగిరిపల్లి (గుట్ట), పిన్ - 508 115,
నల్లగొండ జిల్లా, ఫోన్ - 793

తేది : 19-10-1995
గురువారము

గౌరవ శ్రీ రవీంద్రనాథ్ గారికి, పి.హెచ్.డి.(యు.ఎస్.ఎ.)
సంపాదకులు, ''మిసిమి మాస పత్రిక'' గారికి నమస్కారములు.

నేను తమ మాస పత్రిక చందాదారునిగా చేరి మూడు మాసములు మాత్రమే. 8-9-10వ నెల సంచికలు అందినవి.

<u>అందులో</u>

1. వరుసగా పై మూడు సంచికల్లో శ్రీ సత్తెనపల్లి రామమోహన్‌రావు గారి ''మాధురవాణి మాట కచేరి'' తన్మయులంచేయుచున్నది. ఈ మధురవాణి మాట కచేరి ఏ నెల నుండి సాగుచున్నది తెలిపిన ఆయా మాస పత్రికలను సేకరించుకోవాలని అభిప్రాయం.

2. కుంతి - ద్రౌపది దీన గాథలంటూ శ్రీ శ్రీనాధుని సంకలనం శ్రీ రవీంద్రనాథ్‌గారి భావ పరిశీలన - స్త్రీల, సాంఘిక విలువలతో పాటు అలనాటి చారిత్రక సత్యాలెన్నో పాఠకుని ముందుంచిన మహానుబావులకు ధన్యవాదములు తెలుపుచున్నాను.

ఈ సందర్భములో నాదొక మనవి

అహల్య- మండోదరి - తారా - కుంతీ - ద్రౌపది - ఈ పంచ కన్యలలో మిగతా ముగ్గురిని పై విధంగా విశ్లేషించిన ఈ నవనీత చోరులెంతో తృప్తి చెందుదురని.........

మీ

వేముల లక్ష్మీనర్సయ్య

సచిత్ర పక్ష పత్రిక

మేనేజింగ్ ఎడిటర్ : రవీంద్రనాథ్

ఎడిటోరియల్...

భారత దేశ చరిత్రలో యీ రోజు మరువరానిది. పరదేశీయుల పాలననుంచి యీనాడే మనం విముక్తులమయ్యాం. ఏళ్ళ తరబడిగా దేశభక్తులు పోరాడిన స్వాతంత్ర్య సమరానికి తగిన ప్రతిఫలం వొచ్చింది.

స్వీయ దేశీయుల పాలనలో గడిచిపోయిన సంవత్సరంలో చెప్పుకోదగ్గ మార్పులేమీ రాలేదు. ప్రజలు సుఖవంతులుగా ఉన్నారని చెప్పేందుకు వీల్లేదు. నైజాం. సమస్య ఇంకా తేలలేదు. దేశంలో మత సామరస్యంకూడా పూర్తిగా నెలకొల్పబడలేదు. గతించిన సంవత్సరంలో బాపూజీ నిర్యాణం ఒక్క భారతదేశానికే గాకుండా, లోకమంతకూ విచారనీయాంశంగా ఉండిపోయింది. ఒక పక్షంవారు; ఇతర పక్షాలవారి ప్రాధాన్యతను తొక్కి వెయ్యాలనే యెత్తులు ఇంకా సాగుతూనే ఉన్నవి. వీటన్నిటినీ ప్రభుత్వం చక్కజేస్తుందనే ఆశిస్తున్నాము. సంవత్సర కాలపరిమితి ప్రభుత్వానికి చాలదనే సంశయం కూడా లేకపోలేదు.

''జ్యోతి''కి యీనాడే జన్మదినం కావటం ముదావహం. గత సంవత్సరమంతా పత్రిక సకాలంలోనే వెలువడుతూ, మీ అందరి మన్ననలనూ అందుకుంది. మాకు చేదోడుగా వున్న రచయితలకూ, చిత్రకారులకూ, ఏజంట్లకూ, ప్రకటన కర్తలకూ తదితర మిత్రులకూ కృతజ్ఞులం.

ఈ జన్మదిన సంచికలో ఎన్నో కథలనూ, గేయాలనూ ఇచ్చాము. ''జ్యోతి'' రాజకీయంగా తగినంత పాటుబడటం లేదనే కొరత వుంది. రాజకీయాలకోసం, కేవలం ఒక పక్షానికి మాత్రమే చెందేవారి వినోదార్థం, కొన్ని పత్రికలు వున్నవి. బురఖా రాయుళ్ళ ప్రాధాన్యం కూడా తక్కువ మోతాదుల్లో ఉండటం లేదు. ఇలాటి సందర్భాలలో రాజకీయాలకు ప్రత్యేకాభిమానాన్ని చూపుతూ మేము ఒకపక్షం వారిని నిష్కారణంగా ఎత్తటంగాని, లేక ఇంకో పక్షంవారిని కిందికి పడదొయ్యాలని ప్రయత్నించటం గాని చేయదలచలేదు. ఎందుకంటే ఆపనిని చేసేందుకు కొన్ని పత్రికలు ఉండనే ఉన్నవి.

సంపుటి 1
15 ఆగస్టు 1948
సంచిక 23, 24

చంద్రలేఖ

(విమర్శ)

ప్రొడ్యూసర్స్	:	జమినీ పిక్చర్స్
దర్శకత్వం	:	ఎస్. ఎన్. వాసన్
సంగీతం	:	ఎస్. రాజేశ్వరరావు
కథ	:	ఎ. కె. శేఖర్
ఛాయాగ్రహణం	:	కమాల్ ఘోష్
శబ్దగ్రహణం	:	సి. ఇ. బిగ్స్

నటీనటులు : టి. ఆర్. రాజకుమారి, ఎం. ఎస్. సుందరీబాయి, ఎం. కె. రాధ, రంజన్ ఎన్. ఎస్. కృష్ణన్, టి. ఎ. మధురం మొదలైనవారు.

మూడు సంవత్సరాలుగా తయారై, 35 లక్షల రూపాయలు ఖర్చుపెట్టిన యీ చిత్రం యి నెల 9వ తారీకున అనేక తావుల్లో విడుదలైంది. చిత్రం చూడకపూర్వమే ఇంత ధన వ్యయమై చిత్రాన్ని చూడాలనే కుతూహలం ప్రేక్షక జనానికి కలగటంలో ఆశ్చర్యం యేమీ లేదు.

చిత్రం 18600 అడుగులదైనా ఎక్కువ విసుగ్గా లేదు. దీనికికారణం చక్కని దృశ్యాల అమరిక కమ్మని సంగీతం. చిత్రం పొడుగునా బ్రహ్మాండమైన సెట్టింగుల్ని అమర్చటంవల్లా, చక్కని ఛాయ గ్రహణమూ, శబ్దగ్రహణమూ ఉండటంవల్లా ప్రేక్షకుడు తేలిగ్గా తృప్తిపొందే అవకాశ ఏర్పడుతోంది.

ప్రేక్షకులు కేవలం పొద్దుపుచ్చేందుకు చిత్రాల్ని చూస్తున్నారు. అది వొక వినోదం వినోదింపచెయ్యగల చిత్రాన్ని విజయవంతంగా చెప్పవొచ్చు. చిత్రం చూసేప్పుడు ఎక్కువ పనిచేసేవి కళ్ళూ, చెవులు. ఆ రెంటికీ తగినంత వినోదాన్ని సమకూర్చటంలోనే చిత్ర నిర్మాతల తగినంత శ్రద్ధ తీసుకున్నారు. తీసిన దృశ్యాన్ని తియ్యకుండా చూపటంవల్ల ప్రేక్షకుడు నిర్మాతల చెప్పే ధన వ్యయాన్ని నమ్మగలుగుతున్నాడు.

చిత్రంలో కొత్తదనంకూడా లేకపోలేదు. క్లాసూ మాసూ కూడా ఆనందించదగ్గ ఘట్టాలు అనేకం ఉన్నవి. కథా విధానం అంత బాగుండకపోయినా, ఆ లోపాల్ని కప్పిపుచ్చేందుకుగాను కన్నులు మిరుమిట్లుగొలిపే దృశ్యాలంకరణలు ఉన్నవి. యీ చిత్రం యొక్క విజయం దృశ్యాలతీరూ, సంగీతమూ అని చెప్పక తప్పదు.

కథకు ఒక స్వతంత్ర ధోరణిలేదు. అనేక కథలనుంచి చిన్న చిన్న భాగాలు తీసుకొని, వాటన్నిటినీ కలేసినట్లు వుంది. ' ఎడ్గార్ వాలెస్' నవలల సారాంశం ఎక్కువగా కనిపిస్తోంది. కథలోని సందర్భాల క్రమం బాగాలేదు.

నటన విషయంలో - టి. ఆర్. రాజకుమారికి విశేషంగా చెప్పుకోవాల్సిన రూపం లేకపోయినా, ఆమె నటన బాగానేవుంది. సుందరీబాయ్, యం. కె. రాధ, రంజన్‌ల నటనకూడా ఎక్కడా చెడలేదు. కృష్ణన్, మధురం హాస్యం కథకు అతికింది. అంత మోటుగా లేకుండా వినోదాన్ని కలిగిస్తోంది.

చిత్రం చూస్తున్నంతసేపూ తమిళ చిత్రాన్ని చూస్తున్నట్టు బాధపడం. సంఘటనలు తెలుస్తూనే వున్నందువల్ల యీ పర భాష మనను బాధ పెట్టటం లేదు.

తమిళ చిత్ర పరిశ్రమ వెనకపడివున్నదనే అభిప్రాయంతో ఇన్నాళ్ళూ తృప్తిపొందే చిత్ర నిర్మాతలు, యీ మాదిరి చిత్రాన్ని నిర్మించేందుకు ప్రయత్నిస్తారేమో? ఇదే తెలుగు చిత్రమైనట్టయితే డబ్బును దోచిపారేసేది.

$3^1/_2$ గంటల చిత్రం అవటమే పెద్ద లోపంగా కనిపిస్తోంది. సామాన్యంగా మనం ప్రతి సర్కస్‌లోనూ చూసే సర్కస్ సీనులూ, సర్కస్ ప్రాక్టీస్ చేయటమూ మొదలైన కొన్ని దృశ్యాల్ని తీసిపారేసి నట్టయితే బాగుండేది. చిత్రం వొక హైక్లాస్ స్టంట్, స్టంట్ పిక్చరైనా వినోదానికి ఎక్కువగా పనికొస్తుంది. విజ్ఞానం శూన్యంగా వున్నా వినోదమే ప్రధానంగా తీసుకోబడ్డది.

సంపుటి 1
15 ఏప్రియల్, 1948
సంచిక 17